

అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 1999

ప్రత్యేక సంచిక

అతిమానస యోగానికి సింహద్వారము



అతిమానస యోగము యొక్క ప్రథమ మంత్రము సమర్పణ; దాని చరమ మంత్రముకూడా సమర్పణయే. తనను తాను భగవంతుని కర్పించుకోవాలని, దివ్యచైతన్యంలోకి ఆరోహించాలని, సంపూర్ణంగా పరివర్తన చెందాలనే అభిలాషతో ఈ యోగానికి అంకురార్పణ జరుగుతుంది; భగవదర్పణ పూర్తికావడంతో పరిసమాప్తమవుతుంది. ఎందుకంటే ఆత్మార్పణ సంపూర్ణమైనప్పుడే ఈ యోగం పరాకాష్టకు జేరుకోవటం, మనిషిని అతిమానసదైవం తనలోకి పూర్తిగా పరిగ్రహించుకోవటం, మనిషి పతాక స్థాయికి చేరుకోవటం, రూపాంతరీకరణము జరుగుతాయి.

*

తననుతాను సంపూర్ణంగా దైవానికి, పరాశక్తికి సమర్పించుకోవటమన్నది చైతన్యము యొక్క అన్ని స్తరములలోను, కదలికలలోను జరుగవలెను.

శ్రీఅరవిందులు

మన సమస్త చైతన్యాన్ని పరిపూర్ణంగా దైవపరం చేసి, ఆయనపై అపారమైన ప్రేమను పెంచుకొని, సకల సంపర్క సంబంధాలను ఆయనతోనే పెనవైచి, 'మహాప్రభో! నన్ను నీవుగా రూపాంతరీకరించుకొమ్ము' అని ప్రార్థించడమే యిక మనం అనుసరించవలసిన మార్గము. ఓవిధంగా ఆలోచిస్తే, మనలో క్షేత్రజ్ఞునిగా నివసిస్తున్న దైవమే సాధన సాగించే సాధకుడు, యోగాధిపతి అవుతాడు. ఆ యోగాధి పతియే నీ నిమ్న వ్యక్తిత్వాన్ని, దివ్య రూపాంతీకరణా నికి కేంద్రంగాను, స్వయంసిద్ధికి సాధనంగాను వినియోగిం చుకుంటాడు....

ఆచరణలో దీని స్వరూపమీవిధంగా ఉంటుంది. అహంకారం యొక్క సువిశాల సామ్రాజ్యాన్ని – దాని పరివేషాలు, సమస్తమైన సరంజామాతో సహా – అహంకారానికి ఆవల ఒడ్డున ఉన్న Beyond-egoకి క్రమక్రమంగా సమర్పించు కోవాలి. ఈ Beyond-ego యొక్క కార్యశీలత్వము ఇంత అంత అని చెప్పనలవికాదు. దాని సంవిధానము అగణితము. దాని పక్రియలు అనివార్యములు.... ఇందుకు అకుంఠిత మైన విశ్వాసము, ధైర్యసాహసాలు, ఎనలేని ఓరిమి అత్యా వశ్యకాలు.

శ్రీఅరవిందులు





సాధన తొలిదశలో కొంచెం కృషి అవసరమే. ఇక్కడ తొలి అంటే నా ఉద్దేశం స్వల్పకాలమనికాదు. సమర్పణ చేయ వలసిందే. కాని అది ఒక్క రోజులో సంభవించేది కాదు గదా! మనస్సుకు దాని భావాలు దానికుంటాయి. అది వాటి నంటి పెట్టుకొనే ఉంటుంది. మానవుని ప్రాణికశక్తి సమ ర్పణని నిరోధిస్తుంది. ఎందుకంటే తొలిదశలో అది సమ ర్పణ అని పిలిచేది పూర్తిగా విశ్వసించ వీలులేని అధికార సమ్మిళితమైన ఆత్మార్పణ. భౌతిక చైతన్యం ఓ పాషాణం లాంటిది. అది సమర్పణ అని పిలిచేది ఏ విధంగానూ జడ త్వంకంటే వేరైనదేమీ కాదు. *సమర్పణ ఎలా చేయవలెనో ఒక్క చైతాత్మకు మాత్రమే తెలుసు.* చైత్యాత్మ[1] సాధారణంగా ప్రారంభదశలో ఎక్కువగా ముసుగుమాటున దాగి ఉంటుంది.


*

వ్యకిగత ప్రయత్నం క్రమక్రమంగా దైవశక్తి ఉద్యమంగా రూపాంతరం చెందాలి. నీలో దైవశక్తి యొక్క స్పర్శ ద్యోతకమయినట్లైతే, ఆశక్తిని మరలమరల మరిమరింత ప్రగాఢంగా దృఢంగా, నీ ప్రయత్నాలను ప్రత్యక్షంగా నిర్వర్తించమని, తానుగా వాటిని చేపట్టి నీకు సంబంధించి నవికాని ఇతర పదార్థములుగా, అంశములుగా, విషయములుగా రూపాంతరీకరణ గావించమని అర్థించు, ప్రార్థించు; శ్రీమాతకు సంబంధించినవిగానే రూపొందించమని స్తుతించు. తత్ఫలి తంగా ఒక మార్పు జనిస్తుంది; వ్యక్తిగత అహంకార పరిధిలో ఉద్యమిస్తున్న కొన్ని శక్తులను శ్రీమాతయే స్వాధీనపరచు కోవటం జరుగుతుంది.

శ్రీఅరవిందులు

---

[1] Psychic



అపారమైన ఆత్మార్పణమే అతని ఏకైక బలిమి.

శ్రీఅరవిందులు



సమర్పణ (శరణాగతి) అంటే ఏమిటో నువ్వు సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనుషులందరు పోతపోసిన విగ్రహా లుగా ఒకేలాగున ఉండరుకదా. ఒక్కొక్కరిది ఒక్కొక్క మనస్తత్వము, ఒక్కొక్క బుద్ధి, ఒక్కొక్క స్వభావము, ఒక్కొక్క ప్రకృతి. దీనిలో మార్పుచెందవలసినది ఈ 'ఒక్కొక్క' తనమే. అందుకనే నువ్వు ఈ 'నేను' ని సర్వ గుణములతో సహా దైవానికి సమర్పించుకోవాలి. అట్లు చేయనిచో ఈ నీ ప్రకృతి ఎలా మారుతుంది?.... అర్థం చేసుకోవటానికీ, ప్రతిస్పందించటానికీ, ఉద్వేగం పొంద టానికి, రమారమిగా పురోగమించటానికీ, అన్నిటికీమించి ప్రత్యేక దృక్పథంతో జీవితాన్ని వీక్షించటానికీ మరియు దానినుండి కొన్ని ఫలితాలనాశించటానికీ, నీదైన శైలిలో రూపొందించుకొన్న నీ పద్ధతులు కొన్ని నీకుంటయి. మంచిది, అది సహజమే. కాని నీవు తప్పనిసరిగా సమ ర్పణ గావించవలసినది వీటినే. వేరుమాటలలో చెప్పా లంటే, నీవు మనఃపూర్వకంగా, దివ్యతేజస్సును పొంది నిన్ను నీవు రూపాంతరీకరించుకోవాలనంటే, నీవు తప్ప నిసరిగా నీ సొంతమని భావించి సాగిస్తున్న నీ జీవన విధాన సాకల్యాన్ని నిశ్శేషంగా సమర్పించుకోవాలి. ఎట్టి *అరమరికలు లేకుండా బహిరంగపరచి, భగవంతుడు స్వీకరించటానికి సాధ్యమైనంత యోగ్యంగా సమర్పించు కోవాలి.* తద్వారా, దివ్యచైతన్యం తాను నిన్నేరీతిగా రూపొందించాలని భావిస్తున్నదో, ఆ రీతిగానే ఈ కదలికల నన్నింటినీ, నీ స్వస్వరూప సహజమైన నిత్యసత్యతత్వా నికి సాధ్యమైనంత చేరువగా ఉండేలా మలచటానికి, ప్రత్యక్ష చర్యకుపక్రమిస్తుంది.

శ్రీమాత

సమర్పణ

నేను నీకొక ఉపకరణమైన నా దైవమా!
నాలో అంతర్యామివైన ఓ నిగూఢాత్మా! ఓ దివ్య
ప్రకృతీ!
నీ నిశ్చల నిశ్శబ్ద దివ్యతేజోవారాశిలో,
నానశ్వర మానవ రూపసాకల్యం సంగమించనిమ్ము.
నా మనసును నీ మనోద్వారాల త్రవ్వకానికై నీ సొంతం
చేశాను,
నా సంకల్పాన్ని నీ సంకల్పంగా తీర్చిదిద్దటానికి
నీకర్పించాను;
మార్మికమైన మాటలకందని మనసంగమంలో
నాదంటూ లవలేశమైనా దేనినీ మిగులనీయకు.
నీప్రేమ నినదించే విశ్వధ్వని సంకేతాలతో నా హృదయం
మారోౖగాలి,
వసుంధర ప్రయోజనాలకై నా శరీరం నీ యంత్రంగా
నిలవాలి;
నా రక్త ప్రసరణ వలయంలో నీ ఆనంద పారవశ్యపు
స్రవంతులు పొంగి పొరలాలి.
నా ఆలోచనలు, తరిగే నీ తేజాన్ని పసిగట్టి ఉసిగొలిపే
వేటకుక్కల కంటి వెలుగులు కావాలి.
నీ ప్రతి ఆత్మలోనూ, రూపంలోను అద్వైతంగా
కదలాడే, అనంతాత్మగా మాత్రమే నన్ను మిగుల్చు.

శ్రీఅరవిందులు





దైవమును విశ్వసించుటయే అంతరంగిక సమర్పణ యొక్క మూలస్తంభము. "నాకు దైవమే కావాలి, అన్యమేమీ వద్దు. నేనాయనకు సంపూర్ణంగా నివేదించుకోవాలని నిశ్చయించుకొన్నాను — నా ఆత్మ దానికోసమే పరితపిస్తుంది కాబట్టి నేనాయనను కలుసుకోవటం తథ్యం. సాక్షాత్కరించుకోవటం ఖాయం. నేను యింతకు మించి దేనిని కోరను. నాలో రహస్యంగాగాని, బహిరంగంగాగాని, తెర మరుగునగాని, తెరముందరగాని నన్నాయన వద్దకు చేర్చే కార్యక్రమాన్ని మాత్రమే నాయందు నిర్వహించమని ఆయనను కోరుతాను. ఫలానా టైములోగాని, ఫలానా మార్గంలోగాని సాధించమని పట్టు బట్టను. ఆయన ఇచ్చవచ్చిన టైములోనే, ఇచ్చవచ్చిన రీతిలోనే చేయనిమ్ము. నేనాయనను నమ్ముతాను. ఆయన యిచ్ఛకుబద్ధుడనై వుంటాను, ఆయన వెలుగు కోసం, రాకకోసం, ఆయన సంతోషం కోసం నిశ్చలంగా ఆకాంక్షిస్తూ ఉంటాను. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంత ఆలస్యమైనా లెక్కసేయక, ప్రయత్నాన్ని ఏమాత్రం సడలించక, విరమించక ఆయన మీదనే ఆధారపడుతూ ఉంటాను. నా మనస్సు నిశ్శబ్దమై ఆయననే విశ్వసించు గాక; ఆయనే అందులో తన జ్యోతిని వెలిగించుగాక; నా ప్రాణికము (vital) నిశ్చలమై ఆయనను మాత్రమే ఆశ్రయించుగాక; ఆయన దానికి ప్రశాంతత, సంతసములను అనుగ్రహించుగాక. సర్వమూ ఆయన కోసమే, నేనూ ఆయన కోసరమే. ఏది ఏమైనా సరే నేనీ ఆకాంక్షను, ఆత్మార్పణాన్ని పోషిస్తూనే ఉంటాను. సిద్ధి తప్పకుండా ప్రాప్తిస్తుందనే భరోసాతోనే నడుస్తూ ఉంటాను".

నీవీ దృక్పథాన్ని పోషిస్తూ, దానినే నీలో దృఢపరుచుకోవాలి.

అసలుసిసలైన శరణాగతినీ, అచేతనమైన ఉదాసీనతనూ, ఒకదానికొకదానిని తబ్బిబ్బుగా భావిస్తున్నారు. ఒకొక్కప్పుడు సమానార్థకాలుగా పొరబడుచున్నారు. ఈ గందరగోళ పరిస్థితి మాటిమాటికి పునరావృతమవుతున్నది. అచేతనమైన ఉదాసీనస్థితినుండి నిత్యమైన, సత్యమైన, శక్తివంతమైన ఫలవంతమైనదేదీ లభ్యంకాదు. భౌతికప్రకృతి యొక్క అచేతనమైన ఉదాసీనస్థితియే, అసలుసిసలైన శరణాగతిని, ప్రతి మసకబారిన లేదా అదైవికమైన వివిధ ప్రాబల్యాల దయాదాక్షిణ్యాలముందు, కైవారం చేసేలా భ్రమింపజేస్తున్నది. దైవశక్తి ఉద్యమించి పురోగమించటానికి ఓ ఆహ్లాదకరమైన, శక్తివంతమైన, సహాయకారియైన, నివేదన అత్యంత ఆవశ్యకమైయున్నది. విధేయతాపూర్వకమైన వినయపరిపూర్ణమైన వివేకవికసితమైన ధీరోదాత్తవాణి కావాలి. సత్యాన్వేషణ గావిస్తూ సత్యాన్ని అధ్యయనం చేస్తున్న ఓ ఓజస్సంపన్నుడైన విధ్యార్థివిధేయత నినదించాలి. విశ్వాసపాత్రుడైన దైవసేవకుని యొక్క విధేయతాగళం విప్పారాలి; అజ్ఞాన, అసత్యాలను ఎదిరించి పోరాడగలిగిన చేవగలిగిన తేజోవారాశియైన ప్రవృద్ధ అంతర్యోధుని విధేయతా విజృంభిత సప్తస్వరకేళి పరిఢవిల్లాలి.

శ్రీఅరవిందులు

శ్రీఅరవిందసొసైటీ, పాండిచేరి - 605002,
వారిచే ప్రచురించబడుచున్న తెలుగు మాసపత్రిక.

సంవత్సరచందా రు 60/-. విడిపత్రిక రు 10/-.


సంపాదకులు: ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి, బి. వెంకట్రామయ్య, వి. మన్‌మోహన్ రెడ్డి.

ప్రచురణకర్త, ముద్రణ: శ్రీఅరవింద సొసైటీ, పాండిచేరి - 605002 వారి తరఫున శ్రీ ప్రదీప్ నారంగుచే శ్రీఅరవిందాశ్రమ ప్రెస్సు, పాండిచేరిలో ముద్రించబడినది.

అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి, మార్చి 1999



జీవనమర్మము

జీవనమర్మము
(శ్రీమాతారవిందుల ప్రవచనములు)

విభాగము I: జీవితము – ఆనందజనితము

విభాగము II: ఈ అశుభ దుఃఖాలెందుకు?

విభాగము III: జీవనకళ

జీవితం

సచ్చిదానందపుటనుంగు పుత్రికా
జీవితమా నీ పారవశ్యమపారమనంతమద్భుతము,
నీ జీవన విలాసయాత్ర పరిధి, ఈ అనంత
విశ్వవినువీధులలో అనంతమగుగాక.
మహోన్నతమైన యశస్సునూ, భరింపరాని ఏవగింపునూ
సమంగా నీ విహంగాలపై భరిస్తావు,
ఎనలేని సుఖంలోనూ దుఃఖంలోనూ ఏకమనస్కవై చరిస్తావు,
మాధవుడికీ, మరణానికీ వాహనమై నిలుస్తావు.
పుష్కలమైన నిలువలతో, వికృత దేహంతో
ముసుగులేని ముఖంతో నీవు నన్ను
నీ క్రూరమైన కౌగిళ్ళలో బంధించు
జీవితమా, ధైర్యం కోల్పోవకు; అంతేకాదు దిక్కుమార్చి కదలకు.

నీ పరమానందాన్నంతా నేను పసిగడతాను,
నీ నిరంకుశత్వాన్ని నిండుగా ధరిస్తాను.
సింహగర్జనబోలు కఠిన స్వరాన్నీ,
వసంత వీచికా సమతియ్యదనాన్నీ సంతరించుకొంటాను.

ఓ అసురునిలా (Titan) ఆరగిస్తాను.
ఓ దైవంలా అనుభవిస్తాను
మనిషిలా సంపాదించుకొని సంతృప్తిపడతాను.
శిశువులా కేరింతలతో పరవశిస్తాను.

ఆశగా నీ నుంచధికంగా నేనేమి కోరను,
నా విధివిధానమూ అదికావాలిది కావాలని పేచీ పెట్టను;
ఓడినా గెలిచినా ఒరిగినా నిలిచినా

ప్రభువునైనా పరుల ఆధీనంలో చిక్కినా నన్ను నిలువనీ.

చింపిరి గుడ్డలలో సైతం నేను చిన్మయాత్మను;
పతనంలోనూ నేను పరమాత్మను;
అణచివేయబడినప్పుడు విజయకేతనా లెగరేస్తాను,
నేను వధింపబడినప్పుడూ అజేయంగా చిరంజీవినై నిలుస్తాను.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అన్నవరపు ఆదిశేషయ్య

అస్తిత్వము

ప్రపంచవాస*మనగా కేవలం ప్రకృతియొక్క యంత్రాంగం కాదు. ఒక్క క్షణమో, యుగయుగాల పర్యంతమో ఆత్మ చిక్కుకుపోయిన ధర్మశాసనమూకాదు. అది నిరంతరం కొనసాగే దైవావిర్భావము. కర్మాచరణము కేవలం దాని బాహ్య ప్రయోజనార్థం — తక్షణమో తర్వాతనో కలిగే బాహ్య ప్రయోజనార్థం మాత్రమేకాదు; ఆత్మాన్వేషణ, ఆత్మసాఫల్యత, సిద్ధి దాని పరమ ప్రయోజనములు.

*

ఆస్థిత్వమన్నది ఓ ఆకస్మిక పరిణామంకాని, ఎవరి ప్రమేయం లేకుండా జరిగిన లక్ష్యరహిత సృజన కాని కాదు; బాధ్యతారహితంగా సంభవించిన విషయ సముచ్ఛయమూ కాదు. అది దైవాజ్ఞను శిరసావహించి సాగుతున్నది. కనిపించని పరమాత్మ నిత్య నివాసమది; వినిపించని విశ్వాత్మ సంకల్ప సాక్షాత్కారమది.

---

* Existence (అస్తిత్వము)

వ్యక్తిత్వం, అంతరాత్మ, పరమార్థం అనేవి లేకుండా, ఏదో ఓ రీతిన రూపొందింపబడి, అమర్చబడిన గణుతికెక్కని క్షుద్ర చలనంతో నడిచే గుడ్డి యంత్రంకాదు అస్తిత్వం. అది ఓ క్రమమైన పద్ధతిలో అభివ్యక్తీకరింపబడిన వస్తుసముదాయముల నిత్యసత్యతత్వ విశదీకరణం. సృష్టి అవతరణ క్రమంలో దానికనుబంధితమైన నిజ స్వరూప పరిణామక్రమం.

అస్తిత్వమనగా ఒక భ్రమగాని, నిర్హేతుకమైన మాయాజాలంగాని, ఉండేందుకు హక్కులేనిదిగాని, ఉండజాలనిదిగాని, లేకపోయినా ఉన్నట్లనిపించే వస్తువుగాని కాదు. అది ఈ అద్భుతమైన విశ్వంలో తనను తానుగా ఆవిష్కరించుకుంటున్న ఓ బ్రహ్మాండమైన సత్యం.

*

నీవు నేనెవరని ప్రశ్నిస్తే — తత్త్వమసి — అది నీవు — నీవు పరమాత్మవు. అదికానిదేదీ లేదు. అదికాని ప్రతీదీ దాని అవశేషమో లేక కుటిల రూపమో మాత్రమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అన్నవరపు ఆదిశేషయ్య

ఆనందబ్రహ్మ

ఈ ప్రపంచం ఆనందంలో నడుస్తుంది. ఆనందం ద్వారానే నడుస్తుంది. ఆనందమే మన పుట్టిల్లని, ఆనందం ద్వారానే మనం మన జీవన యాత్ర గడిపి తిరిగి ఆనందానికే చేరుకొంటామని వేదాలు ఘోషిస్తున్నాయి. ఈ ఆనందస్వర్గమే మన జీవితాన్ని ఆవరించియుండి, తన అనంతమైన శక్తిసామర్థ్యములతో మనని పోషించక పోయినట్లయితే, ఎవ్వరికీ ఊపిరి తీసుకొనుటకుగాని, వదులుకొనుటకుగాని శక్తి ఉండదు. వేదద్రష్టల దృష్టియైన ప్రాచీన వేదాంత దర్శనాలప్రకారం ఈప్రపంచపు అసలుస్వరూపము ఆనందము. ఇదియే హిందూమతము యొక్క స్వరూపము — బుద్ధుని దుఃఖవాదమువలన, మాయావాదుల

మిథ్యావాదమువలన, క్షీణించక ముందర, దాని అసలుప్రతిభ, పటుత్వము. అయితే ఈ ఆనందఘనమునుండి మనిషి పతనమై పోయే అవకాశము కూడా ఉన్నది. ఎందుకంటే అపరాప్రకృతి యొక్క నిమ్న స్వరూపము దానిని గ్రహించలేక పోవచ్చును. అది దానిని అర్థం చేసుకోలేదు. వశము చేసుకోలేదు.

విశ్వాతీతమైన ఒకానొక ఆనందము సమస్తమైన విశ్వమునందు, ఆ విశ్వంలోని ప్రతి వస్తువునందు అంతర్యామియై నిగూఢంగా భాసిస్తూ ఉంటుంది. మనస్సునకు, వాక్కునకు, ఊహాతీతము, వర్ణనాతీతము అయిన ఈ ఆనందమే అనిర్వచనీయమైన బ్రహ్మతత్వము. అదృశ్యము, నిగూఢము అయిన ఈ పదార్థమే లేకపోయినట్లయితే, ఇక్కడెవ్వరూ ఒక్క క్షణమైనా ఊపిరి తీసుకోలేరని, బ్రతకలేరని ఉపనిషత్తులు వక్కాణిస్తున్నాయి. అంతేకాదు. ఈ అధ్యాత్మికానందం మన హృదయాలలోకూడా నిహితమైయున్నది. అయితే ఉపరిగతమనస్సు యొక్క కోలాహలమునకు ఇది గోచరించదు. ఆ ఆనందము యొక్క, పల్చబడిన, వికార ప్రతిరూపములను మాత్రమే మానసిక, ప్రాణిక, భౌతిక కోశములు గ్రహించగలవు. కాని మనస్సు ఇంతకంటే ఉన్నతమైన ఆనందస్థాయిని పొందగలదు. అందుకు, మొదట దానిని దాని స్థూల వ్యాపారములనుండి తప్పించాలి; బాహ్యాస్పర్శలకు స్థూలరీతిలో స్పందించనీయక, దాని గ్రహణశక్తిని తగినంతగా సూక్ష్మీకరించి పరిశుద్ధము గావించినప్పుడు, ఆ ఆనందము కూడా మన మనస్సులో నిర్మలంగా ప్రతిబింబించి, మనకిష్టమైన ఆకృతిని (మన ప్రకృతిలోని ప్రధాన లక్షణమును) ధరిస్తుంది; లేక ప్రకృతిలోను, మానవునిలోను, మనపరిసరములలోను, వ్యాపించివున్న సౌందర్యరాశిగాకూడా ద్యోతకము గావచ్చును; లేక విశ్వాతీతమైన సౌందర్యముగా — మనకిక్కడ సుందరమైన వస్తువులన్ని దాని యొక్క ప్రతిరూపములే — భాసించవచ్చును. అది కళాకారుల హృదయములలో భాసించినప్పుడు, వారు దానికి పులకితులుకాగా, వారిలోని కవిత్వము, చిత్రకళ భాసిస్తయి. భక్తుల హృదయములలో అది దివ్యప్రేమగా భాసించవచ్చును; లేక విశ్వగతము, విశ్వము వెనక, విశ్వాతీతము అయిన దివ్యప్రేమగా అనుభూతము కావచ్చును; సహాయశీలియైన అనంత వాత్సల్యముగా సాక్షా

త్కరించవచ్చును; ఆవేశగత హృదయములలో మొదట ఆవిధముగా ప్రత్యక్షము గావచ్చును. అనేకమైన యితర — ఒక మహాశక్తి, ఒక ఆనందమూర్తి, ఒక సౌందర్య దేవత, ప్రేమ, శాంతి — రూపములలో గూడ మన మనస్సునకు దర్శనము గావచ్చును; కాని దాని పూర్ణ రూపము మన మనస్సులో అది ధరించే రూపములకతీతమే.

ఎందుకంటే, సమస్తమైన సంతోషము, ఆనందము, దివ్యప్రేమ, దివ్యానందం ఆఆనంద బ్రహ్మమునుంచి పెల్లుబికిన దివ్యైశ్వర్యములే — ఆత్మానందము ద్వారా కలిగే మేధానందము, ఊహాప్రవృత్తులు, రసానుభూతి, నైతికాకాంక్ష, నైతిక-సంతృప్తి, కార్యాచరణము, జీవితము, శరీరజనితానంద సర్వస్వములన్నియు కూడ ఆకోవకు జెందినవే. సర్వ విధములా (సర్వభావేన) దైవము మనలను స్పృశించి మనలోని ఆత్మను మేలుకొలిపి విముక్తి చేయగలదు. అయితే, సాక్షాత్తు ఆఆనంద బ్రహ్మమునే దర్శించవలెనన్న యెడల నీ మనస్సుయొక్క గ్రహణశీల తను చాలా మెఱుగు పరచవలసి వుంటుంది... దానిని సూక్ష్మీకరణము (సున్నితము), ఆధ్యాత్మీకరణము, విశ్వవ్యాప్తము చేయవలసివుంటుంది. మాలిన్యములను ప్రక్షాళనముగావించి దానిపరిధిని పెంచవలసివుం టుంది. మనలో ఆపరాత్పర, విశ్వమయ ఆనందానుభూతులు జాగరిల్లిన ప్పుడే, మనలో ప్రవర్ధమానమవుతున్న ఆధ్యాత్మిక, పరాత్పర, ప్రహర్ష ముల ద్వారా ఈ ప్రపంచగతము, ఈ ప్రపంచపు వైరుధ్యముల వెను కను, వాటికి అతీతముగాను ఉన్న విశ్వానందముతో మనము తాదా త్మ్యము చెందినప్పుడే మనము దానిపొలిమేరలకు వెళ్ళగలుగుతాము. అందులోకి ప్రవేశించగలుగుతాము.

ఆత్మ దానిని ఆరాధించి, ప్రేమించి, దాని కోసరము తహ తహలాడినప్పుడే దాని దివ్యమూర్తిత్వము మనకు అనుభూతమవు తుంది. ఆ భగవంతుడు మనకు దర్శనమౌతాడు. ప్రియునిగా ప్రత్యక్షమై, ఆనందపారవశ్యానుభూతిని కలుగజేస్తాడు. మన సమస్తఅస్తిత్వమును దానిప్రతిరూపముగా మలిచి మెరుగుదిద్దినప్పుడు మనమా దివ్యప్రకృతి యొక్క మానవావతారముగా విరాజిల్లెదము. అది సర్వవిధములుగ మన ఆత్మకు ఆత్మయై, మనలో ప్రజ్వరిల్లినప్పుడు మనము కృతార్థులమయ్యె దము. పూర్ణత్వమును వహించెదము.

బ్రహ్మ మనకు ఎల్లప్పుడు త్రివిధముగా — మనలోను, మన స్తరమునకు పైభాగములోను మనలను పరివేష్టించియున్న విశ్వముల లోను — అభివ్యక్తమవుతాడు.

ఈ ఆనందబ్రహ్మ ఆవిర్భావము యొక్క త్రివిధ — పైన, లోన, చుట్టూ — రూపముల చైతన్యమును మనము పొందినప్పుడు మనకు దాని పూర్ణస్వరూపము ద్యోతకమైనట్లే. మనమప్పుడు దాని ఆనందము, ప్రశాంతము, హర్షము, ప్రేమ ముఖములను సర్వభూతము లందు దర్శించి సమాలింగనము కావించెదము; అప్పుడు సర్వభువన ములు దాని శరీరముగా భాసించును. దాని అవ్యక్తిత్వ స్వరూపము, విశాలత్వము, అంతర్యామిత్వములను మాత్రమే మనము దర్శించినచో, మన భక్త్యారాధనలు తగినంత ఆత్మీయముగా లేకపోయినచో, ప్రియుని యొక్క కరములు మననాలింగనము చేయనిచో మనకు ఆ ఆనంద విషయకమైన పరమోత్కృష్ట ప్రమాణం తెలియనట్లే.

దాని అవ్యక్తిత్వ రూపము కూడా ఆ బ్రహ్మము యొక్క మధుర వైభవమే! — ఆ అవ్యక్తిత్వతలోనుంచికూడా తనదివ్య వ్యక్తిత్వపు మధురదృక్కులను మనవైపు ప్రసరించగలడు. ఎందుకంటే ఆనందమనగా మనప్రభువు యొక్క దర్శనమే — దాని ప్రవాహములు ఆయన లీలానందమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి

ఆత్మానందము

బ్రహ్మ మన స్థూలరూపాన్ని నిరంతరం వ్యతిరేకించే అవ్యక్తిత్వ నైరూప్యమే అయినట్లయితే ఈ నాటకాన్ని ఇంతటితో కట్టేస్తే సరి. పీడ వదిలి పోతుంది. కాని ప్రేమ, ఆనందము, స్వస్వరూప జ్ఞానము ఉన్నాయి గదా మరి.

ఈ విశ్వము మనోవిజ్ఞాన కల్పితములయిన కొన్ని సంఖ్యలను, సూత్రములను, గుణించగా వచ్చిన శూన్యత గాదు. కొన్ని శక్తుల (ఒకానొక విన్యాసమునకు) క్షేత్రమయిన ఒక భౌతిక ప్రక్రియకాదు. అది ప్రియుని ఆనందము, ఒక బాలుని క్రీడ, తన యొక్క అనంత సృజన శక్త్యానందముతో మత్తెక్కిన ఒక కవిపుంగవుని స్వయంకృత బహుళత్వము!

ఆ పరమేశ్వరుణ్ణి విశ్వములో లెక్కలను గుణించే ఒక గణిత శాస్త్రజ్ఞునిగానో, లేక భౌతిక శక్తుల ధర్మములను ప్రయోగముల ద్వారా పరిష్కరించే ఒక తాత్వికునిగానో పరిగణించు కోవచ్చుననుకోండి. కాని మనమతనికి ఒక ప్రియుడు, ఏకానేకముల సరాగములను ఆలపించే ఒక సంగీత విద్వాంసుడు, ఒక చిన్న పిల్లవాడు, ఒక కవీశ్వరుడు అన్న సంగతి మరచిపోకూడదు. ఇక్కడ మరియొక విషయం గమనార్హము — భావము మాత్రమే సరిపోదు. ఆనందోల్లాసములు పూర్తిగా పట్టుబడాలి. ఎందుకంటే భావములు, శక్తులు, అస్థిత్వములు, సిద్ధాంతములు ఇవన్నియు — భగవంతుని ఆనంద నిశ్వాసములతో పూరించే వరకు ఒట్టి రిక్తములే.

ఇవన్నీ ఒట్టి ప్రతిరూపములు నిజమే — కాని సమస్తమూ ఒక ప్రతిరూపమే కదా. తత్వములు భగద్విషయముల యొక్క భావరూపములు మాత్రమే కాగా, భౌతిక ప్రతిరూపములు వాని సజీవాకృతులు.

తత్వము శక్తినావహించినప్పుడు లోకములు పుట్టగా, అస్థిత్వము యొక్క ఉల్లాసము తత్వమును పుట్టించినది. అనంతుడు తన యందు బహుళమైన ఆనందమును భావించినప్పుడు లోకములు, విశ్వములు పుట్టినవి.

అస్థిత్వము యొక్క చేతనా, ఆనందములు తొలి మాతాపిత రులు, పరార్థము యొక్క ఆఖరి రూపములు. అచేతన అనగా చేతన యొక్క మధ్య దశలోని మూర్ఛారూపము లేక సుషుప్తి. బాధ, ఆత్మ హాతము: అస్తిత్వానందము, మరియొక చోటనో, లేక మరియొక రూప ములోనో తనను తాను కనుగొనుటకై విడిపోవుట.

అస్తిత్వము యొక్క ఆనందము కేవలం కాలీనము మాత్రమే కాదు. అది ఆద్యంత రహితము — ఆ మాయల మారి ఒక రూపము నుంచి నిర్గమించి, మరొక రూపములోకి ప్రవేశిస్తాడు.

అసలు భగవంతుడంటే ఏమిటి? ఒక శాశ్వతమయిన బాలుడు ఒక శాశ్వతమయిన తోటలో శాశ్వతంగా ఆడుతున్న ఆట.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: బ్రహ్మచారి సంయమేశ్వర్

"నేనిప్పుడు చేయలేను" అనగా "నేను తరువాత చేసితీరుతాను" యొక్క సంజ్ఞయే. 'అసంభవము' అనగా సమస్తమైన సంభావ్యముల యొక్క ప్రారంభ దశయే. ఈ లౌకిక ప్రపంచము ఒక **Paradox,** *ఒక అంసంభావ్యము గనుకనే ఆ సనాతనుడు దానిని తన నుంచే సృష్టించాడు.*

'అసంభావ్యము' అనగా ఇంతవరకూ సిద్ధి పొందని ఘనతమమయిన సంభావ్యతల రాశి! ఇంతవరకూ రాని ప్రయాణపు ఉన్నత దశను అది కప్పిపుచ్చుతుంది

శ్రీఅరవిందులు

మానవుడు దేవుడే

భగవంతుడు ప్రకృతి కోసం క్రిందికి దిగి రావటం మానడు — మానవుడు దైవం కోసం ఆకాంక్షించుటా మానడు. ఇది సాంతనం తముల శాశ్వత సంబంధము. అవి ఒక దాని నుండి మరొకటి దూర మగు చున్నట్లు కనబడుట, తిరిగి మరింత గాఢమైన పరస్పరాలిం గనార్థమే.

మానవునిలో ప్రపంచము (ప్రకృతి) తన భోక్తవైపు శీఘ్ర ముగా పయనించుటకై తన నిజ చైతాన్యాన్ని పొందుతుంది. భోక్తను (పురుషుని), ప్రపంచము (ప్రకృతి) తనకి తెలియకుండానే స్వాధీనపర చుకొంటుంది, జీవితము, ఇంద్రియములు నిరోధించినప్పటికి. ప్రపం చము (ప్రకృతి) భగవంతుని తెలుసుకొనలేదు. ఎందుకని? తానెవరో తనకే తెలియదు కాబట్టి. తెలుసుకున్నప్పుడు అమిశ్రితానందాన్ని ఆస్వాదిస్తుంది.

ఏకత్వములో కూడ ఎరుకను కలిగియుండుటయే అసలు రహస్యము. దేవ-మానవులకు, విశ్వ-విశ్వాతీతములకు పరస్పరాభిజ్ఞతి కలిగినప్పుడు వాళ్లిద్దరు ఏకమవుతారు. వాటి భిన్నత్వమే అజ్ఞానానికి హేతువు — అజ్ఞానమే దుఃఖమునకు హేతువు అయినట్లుగా.

మానవుడు మొదట తనకు తెలియకుండానే భగవంతుని అన్వేషిస్తాడు — పరమాత్ముని అన్వేషిస్తున్న సంగతి కూడ అతనికి తెలియదు! ఎందుకనగా అతడు మొదట భౌతిక ప్రకృతి యొక్క మసక వెలుగులో మొదలై, జ్ఞానోదయమైనప్పుడు కూడ జ్ఞాపకం రాకుండా గుడ్డిగానే వుంటాడు. భగవంతుడు కూడ అతని అన్వేషణకు అస్తవ్య స్తంగానే ప్రత్యుత్తరమిస్తాడు. చీకట్లో పసిపిల్లవాని చేతులు తల్లికొరకై తారాడినట్లు, మానవుని గుడ్డితనాన్ని భగవంతుడుకూడా చూసి ఆనందిస్తాడు.

భగవంతుడు ప్రకృతి — బాల బాలికలు క్రీడించనట్లు, ప్రేమించుకున్నట్లు ప్రవర్తిస్తారు. ఆడుకుంటారు. ఒకరినొకరు వెతు క్కుని పట్టుకుండేందుకై దాగుడుమూతలు ఆడుకుంటారు.

పెనగులాడి, పట్టుబట్టి, తాడించి, అకస్మాత్తుగా పట్టుపడేందుకై ప్రకృతికి కనపడకుండా దాక్కున్న భగవంతుడే మానవుడు. మానవమాత్రునిలో తన ఉనికిని తెలియకుండా మరుగుపరచుకున్న విశ్వమానవుడు, మానవాతీత మానవుడే భగవంతుడు.

రోమములతో కూడిన చర్మమును ధరించిన మనిషియే జంతువు. మెలికలు తిరిగిపోతూ, నేల మీద ప్రాకుచున్న మానవుడే మానవస్థాయికి పరిణమించుచున్న కీటకము. పదార్థము యొక్క ముడిరూపములు కూడ అశరీరి అయిన మానవుడే. సమస్తమయిన వస్తువులు మానవుడే — పురుషుడైన మానవుడే, పురుషుని ప్రతిరూపమే.

మనిషంటే ఎవరు? తన అంశములతోనే రచింపబడి, మనస్సు దేహములలో నివాసమున్న ఆత్మ, ఎవ్వరిచేత సృష్టింపబడని (స్వయంభువు) ఆత్మ — అవినాశి అయిన ఆత్మ.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: బ్రహ్మచారి సంయమేశ్వర్

ఆదిమధ్యాంతాలు

మానవ మాధవుల సంయోగమనగా దైవము మానవుని స్థూలరూపాన్ని చొచ్చుకొనిపోయి అతని అంతరంగంలోకి ప్రవేశించుట; మానవుడు ఆ దివ్యత్వములో విలీనమగుట.

అయితే యీవిలీనమువలన మానవుడు లయమైపోడు. లయమే అంతిమ లక్ష్యమైనచో ఈ లీల అసలు మొదలయ్యేదే కాదు. ఈ అన్వేషణ, ఆవేదన, బాధ, ఆనందపారవశ్యములన్నియు లయమై పోవుట కోసం కాదు. కానేరదు.

అసలు రహస్యం ఆనందం. ఎప్పుడైతే నువ్వా ఆనందానుభూతిని పొందెదవో అప్పుడే నువ్వు దైవాన్ని గురించి తెలుసుకొనగలవు.

అసలు ఈ సృష్టి ఎలా మొదలైంది? ఇదంతయు మూల సత్త్వము ప్రపంచవ్యాప్తంగా ఆడే ఒక పెద్ద దాగుడుమూతలాట.

మొదట తాను అసంఖ్యాక రూపములలో దాక్కుంటాడు. మళ్ళీ వెతికి పట్టుకొని పకపకా నవ్వుకుంటాడు. ఇదే అతనిలీల. వినోదము.

మధ్యదశ మాటేమిటి. చీలిపోయిన అణువులు తిరిగి ఐక్యమునొందుటకై బహుముఖంగా తహతహలాడుట, అజ్ఞానము జ్ఞానసాగరమువైపుకు ప్రవహించుట, తరువాత బాధతో మొదలై, వర్ణనాతీతమైన ఆనందోల్లాసములకై పరితపించుట. ఎందుకనగా ఇవి అన్నియు అంధకారము యొక్క ప్రతిరూపములు దారి మళ్ళిన ప్రకంపనములు.

మరి సృష్టియొక్క అంతమో? తేనెతనకు తానుగాను, తనలోని చుక్కలన్నిట్టిని కలిసి రుచిచూచినట్లు, ఒక్కొక్క చుక్క మొత్తం తేనెపట్టంతా తానే అనుకొని రుచిచూసిన యెడల ఎటులుండునో ఈ సృష్టియొక్క అంతిమ రూపముకూడా అటులనే యుండును!

ప్రేమదే పతాకం. సంతోషమే సంగీతం. శక్తియే సాహిత్యం. జ్ఞానమే వాద్యగాడు. ఆ సర్వేశ్వరుడే నిర్వాహకుడు, ప్రేక్షకుడు. మొదట తంతులుమీటి సృతిని సవరించే అపస్వరాలే మనకి వినబడుతాయి. ఆ అపస్వరాలు రానురాను శ్రవణప్రేయమైన వీనులవిందుగా పరిణమిస్తాయి. దివ్యపారవశ్యము యొక్క గంభీరగతులను మనం తప్పకుండా మన స్వంతం జేసుకుంటాము!

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: ఎన్. అప్పాస్వామి

మన లక్ష్యము పరిపూర్ణత్వము

బుద్ధుడు, శంకరుడు ఈ ప్రపంచాన్ని ఒట్టి మిథ్యగాను, దుఃఖ భాజకంగాను పరిగణించారు. అందుకని ఇక్కణ్ణుంచి పలాయనం చిత్త గించటమే మేలైన మార్గమని నిశ్చయించారు. కాని ఈ ప్రపంచం బ్రహ్మస్వరూపం, సాక్షాద్భగవత్స్వరూపం. ఈ ప్రపంచము సత్యము, ఆనందము. ఎంత అద్భుతమైనప్పటికీ మనస్సు యొక్క అహంకారపు దృష్టికిమట్టుకు అది మిథ్యగానే గోచరిస్తుంది! ఈ దుఃఖానికి కారణం ప్రపంచాగ్గతమైన దైవంతో మనకి సత్సంబంధాలు లేకపోవటమే. ఇంతకు మించిన అపరాధమేమీ లేదు. దుఃఖానికి మరియొక హేతువూ లేదు.

ఈ ప్రపంచాన్ని భగవంతుడు తన మాయ ద్వారా సృష్టించాడు. కాని వేదాలలో మాయ అనగా భ్రమ కాదు. దానికర్థం వివేకం, జ్ఞానం, సమర్థత, విస్తృత చేతనాపర్యాప్తి — "ప్రజ్ఞా ప్రసృతా పురాణీ". ఈ ప్రపంచాన్ని సృష్టించింది ఒక సర్వశక్తిమంతుడు — ఎవరో ఒక స్వాప్నికుడు చేసిన ఘోరనేరముకాదది. దానిని ఒక సర్వజ్ఞుడు స్వీయానందం కోసం అభివ్యక్తపరిచాడు — లేక తనలోనే దాచి పెట్టాడు; అంతేకాని, అది సర్వస్వతంత్రుడైన బ్రహ్మ తన అజ్ఞానం ద్వారా తనపై తానే విధించుకున్న బంధనమేమీకాదు.

ఈ ప్రపంచం ఒకవేళ బ్రహ్మ తనపై తాను విధించుకున్న నరకయాతనే అయినట్లయితే అసలు మనమీ బాధనెందుకు భరించాలి? దానిని తప్పించుకోవటమే మన లక్ష్యం. ప్రాపంచిక జీవితంలో దుఃఖమే అనివార్యమైనట్లయితే ఈ పీడని మనమెంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిది. కాని ఈ ప్రపంచంలో పూర్ణసత్యం సాధ్యమే. ఎందు కంటే భగవంతుడు సర్వాన్ని సత్యనేత్రంతోనే వీక్షిస్తాడు. ప్రపంచంలో, సంపూర్ణానందం సాధ్యమే, ఎందుకంటే భగవంతుడు అమిశ్రిత స్వేచ్ఛా భావంతోనే సర్వవస్తువులను ఆనందంగా అనుభవిస్తాడు. మన అహం కారపూరిత అస్తిత్వాన్ని, ఆయన స్వరూపంతో సంపూర్ణంగా ఏకంచేసి, దైవదృష్టిని, దైవస్వేచ్ఛను గ్రహించుటకు అంగీకరించినచో, మనంకూడా వేదాలు అమృతం, శాశ్వతత్వం అన్న సత్యాన్ని, పరమానందాన్ని సుఖంగా అనుభవించవచ్చు.

ఈ ప్రపంచం భగవంతుని స్వీయమూర్తిత్వంలోని చాలనము. మనం భగవంతుని చాలనవిన్యాసానికి ఆధారమై సమీకృతం చేయు దైవచైతన్యపు కేంద్రాలము, ముడులము. ఈ ప్రపంచం ఆపరాత్పరుని స్వీయచైతన్యపు పరమానందంతోకూడిన ఖేల; అనంతుడు, సర్వ స్వతంత్రుడూ సంపూర్ణుడూ అయిన ఈశ్వరుడే; మనం ఆ చైతన్యపు పరమానందం యొక్క స్వీయ బహుళాకృతులమై ఆయన క్రీడాసహ చరులుగా ఈ లోకంలోకి పంపబడ్డాము. ఈ ప్రపంచం ఒకానొక వ్యూహము, ఒక లయ, ఒక సంకేతసరళియై భగవంతుని స్వీయచైత న్యంలో ఆయనను ఆయనకే వ్యక్తం చేయుపదార్థమేగాని జడము కానే కాదు. అయితే భగవంతుని చైతన్యంలో, స్వీయ ప్రకటనలో మాత్రమే అస్తిత్వాన్ని పొంది వుంటుంది. మనం భగవంతునిలా, అంతరంగ సత్తలో ప్రకటితమగువారలం. అయితే బాహ్యాసత్తలో ఆ వ్యూహపు నిబంధనలం. ఆ లయస్వరాలం, ఆ సరళియెక్క సంకేతాలం. మనం ఈశ్వరేచ్ఛను పాలించెదము. ఆయన క్రీడలో పాల్గొనెదము, ఆయన వ్యూహాన్ని క్రియాత్మకం చేసెదము, ఆయన సామరస్యాన్ని నెరవేర్చె దము, ఆయన సంకల్పాన్ని మన ద్వారా నేరవేర్చెదము. ఇదియే మన ఆనందం, మన స్వీయ సఫలత. ఇందులకే మనం విశ్వాతీతులమయి నప్పటికి, విశ్వంలో ప్రవేశించటం జరిగింది.

పూర్ణత్వాన్ని సాధించాలి, సామరస్యాన్ని నెలకొల్పాలి. సంకుచితత్వము, సీమితత్వము, దుఃఖము, అవివేకము, పదార్థము అను నవి ఈ విన్యాసము యొక్క ప్రథమ రూపాలు మాత్రమే — మనం పూర్ణత్వాన్ని సాధించేంత వరకు అవి అస్పష్టంగా వుంటయి; అవి శ్రుతి యొక్క మొదటి అపస్వరాలు. మనం అసంపూర్ణతనుండి సంపూ ర్ణతను నిర్మించాలి. అనంతత్వాన్ని కనుగొనలేని పరిమితి నుండి, మృత్యువునుండి, అమృతత్వాన్ని కనుగొనుటకు, దుఃఖంనుండి దైవ జ్ఞానాన్ని పొందుటకు, పదార్థంనుండి దైవాన్ని వ్యక్తం చేయుటకు శ్రమించాలి. మనకోసమూ, మానవాళికోసమూ ఈ అంతిమ ఫలితాన్ని సాధించుటయే మన యోగానికి గమ్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: ఎన్. అప్పాస్వామి

ప్రపంచ ప్రహేళిక

భగవదభివ్యక్తికి దుఖఃమనివార్యమా?

ఈ ప్రపంచం అంత ఆదర్శవంతమైనదిగాని, సంతృప్తికర మైనది గాని కాదన్నమాటను ఎవ్వరు ఖండించలేరు. లోటుపాటు, దుఃఖము, దుష్టత్వముల గాఢమైన ముద్ర దానిపై యున్నది. మనిషిలో ఆధ్యాత్మిక స్ఫూర్తి కలిగేందుకు ఇదియే మొదటి హేతువు. కొంతమంది ఈ సకల చరాచర సృష్టి యొక్కవేదనను చూసి, సంతాపము నొంది ప్రేరితమై "ఏమైనా సరే, ఈ దుఃఖాన్ని నివారించవలసినదే" అని నిశ్చ యించుకొని, కంకణం కట్టుకుంటారు. కొద్దిమంది మహానుభావులు మట్టుకు అటువంటి ప్రేరణ ఏమియు లేకుండానే దివ్యానుభూతులను పొందుతారు. ఇది ఈ భూమిమీద అవతరించిన సమస్తమైన సృష్టికి తప్పదా? ఈ భౌతిక ప్రపంచమున్నంత వరకు యీ బాధలు తప్పవా? అన్న ప్రశ్నలు మిగిలిపోతయి. అనగా జన్మ ఎత్తాలని, అభివ్యక్తము కావాలని, సృష్టి చేయాలనే కామనయే పాపానికి మూల కారణం — ఇంతటితో యీ జన్మని విరమించుకోవటమో లేక అభివ్యక్తిని ఉపసం హరించుకోవటమో విముక్తికి ఏకైక మార్గం. ఈ దృష్టి కలవారికి, సమీపవాదులకి — అధిక సంఖ్యాకులు వీరేకదా — ప్రసిద్ధమైన మార్గము ఆధ్యాత్మిక విమోచనము పొందుటయే. అది సరియైన మార్గము కాకపోవచ్చుకూడా. అయితే మన అజ్ఞాననేత్రానికో లేక మిడిమిడి జ్ఞానానికో మాత్రం అలా స్ఫురించవచ్చు. ఈ అసంపూర్ణత, దుష్టత్వము, బాధలకు హేతువు పరిస్థితుల ప్రాబల్యము గాని, మార్గము లోని క్లిష్టతగాని, కావచ్చునేగాని అభివ్యక్తము యొక్క నిబంధనగాని, మానవజన్మ యొక్క అనివార్యమైన లక్షణం గాని కాకపోవచ్చు.

ఇహలోకయాత్రను విడనాడుట పరిష్కారమేనా?

దేనియందు మనం నివసిస్తున్నామో, ఆ బహువిధ అభివ్యక్త

ప్రపంచానికీ, దేని ఇరుకు ఎల్లల నడుమ మనం తడుముకుంటూ, పెనుగులాడుతున్నామో, ఆ చేతనకుపైన — ఈ రెండింటి అస్థిరత పైన — ఒక శాశ్వతత్వం ఉన్నది; దాని లక్షణాలు అనంతత, స్వయం సత్త, స్వేచ్ఛ, నిరపేక్ష ప్రకాశము, నిరపేక్ష ఆనందము — అని సమస్త ఆధ్యాత్మిక అనుభవమూ నొక్కి చెపుతోంది. కాగా ఈ రెండిటి మధ్య ఓ పెద్ద అఖాతమేదైనా ఉన్నదా? లేక అవి రెండూ శాశ్వత ప్రతిపక్షా లేనా? కాలమునందు ఘటిల్లే ఈ సాహసకృత్యాన్ని వల్లకాదని, ఈ అఖాతాన్ని అమాంతంగా దూకి మాత్రమే మనం నిత్యమును చేరుకో గలమా? ఇదియే ఒక అనుభవమార్గం యొక్క అంతమైనట్లు కనిపించు తుంది; బౌద్ధమతం ఈ మార్గాన్నే దాని కఠోర పర్యవసానం వరకు అనుసరించింది. కాగా ఈ మార్గాన్ని ఇంతకంటె తక్కువ కఠోరముగా అనుసరించిన అద్వైతవాదం యొక్క ఒక ప్రకారానికి సంబంధించిన ఆధ్యాత్మికానుభవం భగవంతునితో ప్రపంచానికి కొంత సంబంధముం దని అంగీకరించుతుంది, కాని చిట్టచివరకు ఆ రెండింటిని, సత్యము, అనృతము — అని నిర్ణయించి, ప్రతిపక్షాలుగానే నిలుపుతుంది. కాని పై రెండింటి అనుభవంతో బాటు ఈ అసందిగ్ధ అనుభవం కూడ ఉంది: భగవంతుడు ఎలా ప్రతివస్తువుపైన, వెనుక ఉన్నాడో, అలాగే ఇచ్చట ప్రతివస్తువునందు ఉన్నాడు; సర్వము అతనియందు, అతడుగానే ఉన్నది — ప్రపంచరూపంనుండి ప్రపంచ సత్యానికి జరిగినపుడు మనకిది విదితమవుతుంది. ఇంకా, బ్రహ్మవిదుడు ఈ ప్రపంచమున చరించుతూ, కర్మచేస్తూ ఉన్నప్పటికీ, దాని అఘాతాలన్నింటిని భరిం చుతూ ఉన్నప్పటికీ, బ్రహ్మం యొక్క ఒకానొక నిరపేక్ష శాంతి, ప్రకాశం ఆనందాలందు నివసించగలడు — అనేది ఒక కీలక, ప్రకాశప్రద వాస్తవం. ఇలా ఇచ్చట ఆ రెండింటికి కేవల విస్పష్ట విరోధంకంటే ఇతరమైనదేదో ఉంది — ఇది ఒక గుహ్యం, ఒక సమస్యయేకాన, అంత నిరాశను కల్పించని ఒక పరిష్కా రమేదో ఉండి తీరాలి — అనిపించుతుంది. ఈ ఆధ్యాత్మిక సంభవత తనకావలనున్న ఒక వాస్త వాన్ని నిర్దేశించుతూ, మన భ్రష్టమనుగడను ఆవరించిన అంధకారం లోనికి ఒక ఆశాకిరణాన్ని గొనివస్తోంది.

భూలోక జీవితపు ప్రహేళికా రహస్యం

ఇక్కడ వెంటనే ఈ ప్రశ్న తలెత్తుతుంది: ఆ ప్రపంచం సర్వదా ఒకే ఘటనాపరంపర యొక్క మార్పులేని అనుక్రమమేనా? లేక, దాని యందు ఒక పరిణామాత్మక ప్రేరణ, ఒక పరిణామాత్మక వాస్తవం, ఒక ఆరోహణశ్రయణి (నిచ్చెన) ఉన్నదా? ఈ ఆరోహణ ఒక అద్య ప్రతీయమాన (Apparent, పైకి మాత్రమే అలా కన్పించు) నిశ్చేతన నుండి ఆరంభించి ఒక అధికాధిక — వికసితచేతనదిశగా సాగుతు న్నదా? అది ప్రతి వికాసదశనుండి ఇంకాఆరోహించుతూ, ఇంత వరకు మన సామాన్య గోచరంలో లేని అత్యున్నత శిఖరాల పైకి ఆవిర్భవిం చుతోందా? ఈ ఆరోహణే నిజమయితే, దాని భావమేమిటి? దాని మూలసూత్రమేమిటి? దాని సహేతుక ఫలితమేమిటి? ప్రతి సంఘటన అట్టి ఆరోహణ ఒక వాస్తవమనే సూచిస్తోంది — కేవలం భౌతికం మాత్రమే కాని, ఆధ్యాత్మిక పరిణామాన్ని సూచిస్తోంది.

ఇక్కడకూడ ఈ ఆరోహణను సమర్థించే ఒక ఆధ్యాత్మిక అనుభవ ప్రకారం గలదు: ఈ ప్రకారమందు, దేనినుంచి సమస్తం ఆరం భించుతోందో, ఆ నిశ్చేతనంపైకి మాత్రమే నిశ్చేతనమని మనం కను గొంటాం; ఏలన ఈ నిశ్చేతనయందు అనంతసంభవతలతో గూడిన ఒక అంతర్లీనచేతన ఉంది. ఈ చేతన పరిమితం గాదు, కింతు విశ్వ మయమూ, అనంతము; ఇది ఒక విలీన, స్వయంబందీభూత భగవ ద్భావం; ద్రవ్యంలో బందీగానున్న తన రహస్య గంభీరతలందు సర్వ శక్యతలు ఉన్నాయి. ఈ ప్రతీయమాన నిశ్చేతననుండి వరుసగా ప్రతి శక్యత వెలువడుతోంది: ముందు అంతఃస్థిత ఆత్మను కప్పి ఉండే సంఘటిత ద్రవ్యం; తర్వాత వృక్షమునందు ఆవిర్భవించి, పశువునందు ఒక వర్ధమాన మనస్సుతో కూడి ఉండే ప్రాణతత్త్వం, పిమ్మట మాన వునియందు పరిణతిచెంది, సంఘటితమైన అసలు మనస్సు. మంచిది, కాని ఈ పరిణామం, ఈ ఆధ్యాత్మిక పురోగమనం ఇక్కడనే, మానవు డనబడే మానసిక జీవునియందే ఆగిపోతుందా? లేక ఈ మానసిక పరిణామరహస్యం కేవలం పునర్జన్మల ఒక పరంపరయేనా? ఈ పరం పరద్వారా జీవుడు తన స్వీయ నిరర్థకతను గ్రహించి, వైరాగ్యం

నిరాకరించాలి. నైతిక దృష్టితో మానవులు దీనిపై చేసే తిరుగుబాటుకు, తీవ్రగర్హణానికి, భావికఅవేశానికి ముందు మనం సమాధానం చెప్పాలి. ప్రపంచానికి అతీతంగా, తన ఇచ్ఛవచ్చినట్లు వ్యవహరించే ఒక వ్యక్తిగత భగవంతుడున్నాడు, అతడు స్వయంగా జీవుల పతనంలో ఏమాత్రం చిక్కుకోడు; తన ఆదేశంచేత తన చపలతనుబట్టి చేయబడిన అల్పజీవకాల (Creature) పైన, దుఃఖాలను విధించినదీతడే — అని కొన్ని మతాలుచెప్పే మాట సరికాదు. కాగా మనకు తెలిసినదేమంటే, భగవంతుడు ఒక అనంతసత్తు (Being) అతని అనంత అభివ్యక్తిలో భాగంగానే ఈ జీవజాలం వచ్చింది — ఇక్కడ, మన వెనుక, అభివ్యక్తిని వ్యాపించి, తన ఏకతతో దానిని ధరించి ఉన్నది స్వయంగా భగవంతుడే; మనలోనున్న భగవంతుడే పతనభారాన్ని, దాని అహిత ఫలితాన్ని స్వయంగా ధరించి ఉన్నాడు. అతడు ప్రపంచానికిపైన తన పరిపూర్ణప్రకాశ, ఆనంద, శాంతులలో ఎలా ఉన్నాడో, అలాగే అతని ప్రకాశానందశాంతులు ఇక్కడ సర్వానికి రహస్య ఆధారంగా ఉన్నాయి.

అంతేకాక, మనలోపలనే ఒక ఆత్మ ఉంది; అది ఉత్తల వ్యక్తిత్వాలపరంపరకంటే శ్రేష్ఠతరమైన ఒక కేంద్రస్థిత ఉపస్థితి (presence, సన్నిధి); అది పరమాత్మవలెనే ఈ వ్యక్తిత్వాలు అనుభవించేవిధికి వశంకాదు. ఏది తనసారమునందు, సత్తునందు భగవంతునితో ఏకమో, మనలోని ఈ అంతరాత్మను కనుగొని అదే మనమని తెలుసుకొంటే, అది మన విమోచనకవాటమవుతుంది; అపుడిక మనం ఈ ప్రపంచ అపసామరస్యాల నడుమసైతం స్వేచ్ఛా సామరస్య ఆనందములతో మనగలం. ఇది, ఇంతమాత్రం, యుగాలుగా ఆధ్యాత్మిక అనుభవం ఇస్తున్న సాక్ష్యం.

ప్రత్యక్ష వైరుధ్యాలతో ప్రారంభం

కాని ఇప్పటికీ తెలియనిదేమన, అపసామరస్యానికి ప్రయోజనమేమిటి, మూలమేమిటి? విభజన, అహంకారాలు, బాధామయ పరిణామంతోగూడిన ఈ ప్రపంచం ఎందుకు వచ్చాయి? అశుభ, శోకాలు దివ్య శుభ, సుఖ, శాంతులలోనికి ఎందుకు ప్రవేశించాలి? ఈ ప్రశ్నకు సమాధానం తన స్వీయస్తరమునందున్న మానవబుద్ధికి చెప్పడం

కష్టం?; ఏలన ఏచేతనకు ఈఅశుభమూలం చెందుతుందో, అలాగే ఏ చేతనకు తన అతిబౌద్ధిక జ్ఞానమున ఈ విషయం సహజంగానే తెలిసి ఉంటుందని చెప్పవచ్చో, ఆ చేతన ఒక వైశ్వచేతన, అది వ్యక్తిత్వం పొందిన మానవమేధకాదు? అది విశాలతరంగా చూస్తుంది, దాని అంతర్దర్శనం వేరు, జ్ఞానవిధానం వేరు, దానికి మానవతర్కం, భావనల (Feelings) కంటె ఇతర అవయవాలున్నాయి.

అయినా మానవమనస్సునకిలా సమాధానం చెప్పవచ్చు: స్వయంగా అనంతమునందు ఈ వ్యాకులతలు లేకపోవచ్చు; అయినా, ఒకసారి అభివ్యక్తి ఆరంభించినపుడు, అనంత సంభవతకూడ ఆరంభించింది; ఇక వైశ్వ అభివ్యక్తి తనపనిగా రూపొందించవలసిన అనంత సంభవతలలో, తన సమస్త ఫలితాలతో గూడిన నిషేదం ఒకటి — స్పష్టంగానే శక్తి, కాంతి, శాంతి, ఆనందాల నిషేధం, అయితే ఇది ప్రతీయమాన (Apparent) వ్యావహారిక నిషేధం, మాత్రమే. సరే, కాని అయితే ఇది సంభవమైనప్పటికీ, దీనినెందుకు అంగీకరించవలసి వచ్చింది?— అని మళ్ళీ అడిగితే, మానవబుద్ధి ఇవ్వగల, వైశ్వసత్యానికి దగ్గరగా ఉండే జవాబే మన, ఏకతయందలి భగవంతుడు అనేకమునందలి భగవంతుడుగా మారినపుడు, ఈ అశుభసూచక సంభవం (Possible) ఒక దశలో ఒక ఆవశ్యకం (Inevitable) అయి కూర్చుంది. ఏలన ఒకసారి ఈసంభవం తన ముఖంచూపినపుడు, పరిణామాత్మక అభివ్యక్తిలోనికి దిగే అంతరాత్మకు అది ఒక అనివార్య ఆకర్షణ అవుతుంది. ఇక ఈ ఆకర్షణ ఆ సంభవానికి అవశ్యం భావితను (Inevitability) సృజించుతుంది — పృథివీస్తరమునందు మానవ పరిభాషలో తదాకర్షణను ఇలా వివరించ వచ్చు: అది అజ్ఞాతంయొక్క పిలుపు; ప్రమాద కష్టసాహసాలిచ్చే ప్రహర్షం; అసంభవాన్ని చేపట్టాలనే సంకల్పం; అగణ్యాన్ని సాధించాలనే ధీరత; తన స్వీయ ఆత్మ, ప్రాణాలనే ఉపాదానం (Material) చేసుకుని, నూతన అస్పష్టమును సృజించాలనే ఇచ్ఛ; ప్రతిపక్షాలు, వాటి కఠినసామరస్యం సాధించాలనేదృష్టి కల్పించే సమ్మోహనం — మరొక అతిభౌతిక, అతిమానసచేతనలోనికి, అంటే మనస్సుకంటె ఉచ్చతర, విశాలతర చేతనలోనికి అనువదింపబడిన ఈవస్తువులే పతనానికి దారితీసినప్రలోభం. ఏలన అవ

తరణకు ఉన్ముఖమైన ప్రకాశమయ ఆద్యపురుషునికి (అంతరాత్మకు) అజ్ఞాత మైన ఒకే విషయం: అగాధముయొక్క లోతులు, అజ్ఞాన, నిశ్చేత నలందు భగవంతునికి ఎదురయ్యే సంభవతలు. ఒకవైపున ఈ తెలియమి కారణం కాగా, రెండవవైపున పతనానికి కారణం ఏకతయం దున్న భగవంతుని, కరుణామయము, సమ్మతిపూర్వకము, సహాయకము నగు ఒక విశాలఅనుమతి కారణం; ఇట్టి సంభవత రాకతప్పదు, వచ్చి నపుడు అది కార్యాన్వితంకాకతప్పదు — అనే ఒక పరమజ్ఞానం కారణం; దానిరాక ఒకానొక అర్థమున ఒక అగణ్య అనంత విజ్ఞానము నందు ఒక భాగమే; రాత్రిలోనికి నిమజ్జనం అనివార్యమైతే, ఒక నూతన అపూర్వ పగటిలోనికి ఆవిర్భావంకూడ ఒక నిశ్చితత్వమే; అలా అయి తేనే పరమసత్యం యొక్క ఒకానొక అభివ్యక్తి సాధించబడగలదు — ఈ పరమ సత్యం యొక్క అభివ్యక్త ప్రతిపక్షాలను పరిణామం యొక్క ప్రస్థాన — బిందువుగాను, ఒక రూపాంతరసాధక ఆవిర్భావానికి విధిం చబడిన నిబంధనగాను చేపట్టి అభివృద్ధిపరచడంచేతనే సాధించబడ గలదు — అనే ఒక పరమజ్ఞానం కారణం. పతనానికి భగవంతుడిచ్చిన అనుమతియందు అతని స్వీయ మహాయజ్ఞ (ఆహుతి) సంకల్పంకూడ ఇమిడి ఉంది.: మహాయజ్ఞమంటే, అజ్ఞానమూ, దాని ఫలితాలభారం వహించేందుకు భగవంతుడే నిశ్చేతనలోనికి దిగిపోతాడు; అంతేకాక, ఆహుతి, విజయాల రెండుసంకేతాల నడుమ చరించుతూ, విముక్తి, పరి పూర్ణతలను సాధించుతూ అవతారంగానూ, విభూతులుగాను వచ్చి, పరిణామానికి చేయూతనిస్తాడు.

ఇది అవర్ణనీయ పరమసత్యాన్ని అతిగా రూపకాలుపయోగించి, భాషలోనికి దించడంగా కన్పించుతోందా? కాని రూపకప్రయోగం లేకుండా బుద్ధికి చాలా పైనున్న దానిని బుద్ధికెలా చూపగలం? ఒకడు పరిమితబుద్ధికల్పించే ప్రతిరోధం దాటాలి; వస్తువులను తాదాత్మ్యం ద్వారా దర్శించే వైశ్వానుభవంలోను, జ్ఞానంలోను భాగస్వామి కావాలి; అపుడు మాత్రమే పార్థివవాస్తవానికి అనురూపమైన, మనం ప్రయోగించే ప్రతిరూపాల (Images) వెనుకనున్న పరమసత్యతలు తమ దివ్యరూప ములందు కన్పించుతాయి, వస్తువులసారమునందు అంతర్గతంగానున్న సరళ, సహజరూపాన అనుభవానికి వస్తాయి. ఆ పరమచేతనలోనికి

ప్రవేశించడంచేత మాత్రమే, దాని ఆత్మ — సృష్టియొక్క అవశ్యం భావిత్వాన్ని, దానిప్రయోజనాన్ని ఒకడు గ్రహించగలడు.

సృష్టికి అభావానికి వెనక ఏమున్నది?

ఇది నిక్కముగా ఒక స్తరంలో చేతనకు కన్పించే సత్యం మాత్రమే — 'ఒక స్తరంలో' అంటే, నిత్యానికి (బ్రహ్మకు.) కాలము లోనికి దానిఅవతరణకు నడుమనున్నరేఖ: ఇచ్చట ఏకానికి, అనేకానికి మధ్యనుండే సంబంధం స్వయంగా నిర్ధారితమవుతుంది, ఈ మండలమునందు ఏది అభివ్యక్తంకానున్నదో, అది ఇంకా అంతర్గతంగానే ఉంటుంది, క్రియలోనికి వచ్చి ఉండదు. అయితే, ఎక్కడ ఇక అసలుసమస్య ఉండనే ఉండదో, అంతపైకి పోగలదు విముక్తచేతన; అచ్చట ఈ చేతన సమస్యను ఒక పరమతాదాత్మ్యత్యమునందు చూస్తుంది, ఈ చూపునకు సమస్తము, వస్తువుల ఏ స్వయం — ప్రవృత్త, స్వయం — సిద్ధ సత్యముగలదో, ఆ సత్యమునందు కన్పించుతుంది. అలాగే సమస్తము నిరపేక్ష చేతనా, జ్ఞానాలకు, నిరపేక్షా (Absolute) ఆనందానికి స్వయం — సమర్థితమై గోచరిస్తుంది — ఈ చేతన, జ్ఞానం, ఆనందం సర్వసృష్టి వెనుక ఉంటాయి, సర్వ అసృష్టి (సృష్టిపూర్వస్థితి) వెనుక వుంటాయి; చివరకు అచ్చట ఏ పరమసత్యత సుఖదుఃఖాల రెండింటిని ఉద్ధరించి, సమన్వయపరుస్తుందో, ఆ అనిర్వచనీయ సత్యత కంతితోనే సుఖదుఃఖాలు రెండూ చూడబడతాయి. కాని ఆ జ్ఞానాన్ని మానవ మనస్సుకు ప్రకటించడం సాధ్యం కాదు; దాని ప్రకాశాత్మక భాషా మర్మాన్ని విప్పి చెప్పలేము; స్వయంగా దాని ప్రకాశం, ప్రపంచ ప్రహేళిక యొక్క ఒత్తిడికి, చీకటికి అలవడినచేతన చూడలేనంత తీక్షణముగా ఉంటుంది; కావున ఈ ప్రహేళికలో చిక్కుకొనిపోయిన చేతన ఆ ప్రకాశసూచనను అనుసరించలేదు. దాని రహస్యాన్ని పట్టుకోలేదు. ఎలా చూచినా, అంధకారసంఘర్షణలమండలం దాటి చేతనయందు మనం పైకి వెళ్ళినపుడే, దాని పూర్ణతాత్పర్యంలోకి ప్రవేశించగలం, దాని జటిలసమస్యముండి ఆత్మ బైటపడుతుంది. విముక్తిని ప్రసాదించే ఉన్నతి అందుకోవడమే యథార్థనిర్గమన మార్గం, అసందిగ్ధ జ్ఞానానికి ఏకమాత్ర సాధనం.

విమోచనం తరువాత ఏమి?

కాని ఈ విమోచన, అతిక్రమణల ఫలితంగా ఒకడు ప్రపంచంనుండి అదృశ్యం కానవసరం లేదు, పూర్తిగా, అవశ్యంగా కరిగిపోనవసరం లేదు; అవి అత్యున్నతజ్ఞానంతోను, అతితీవ్రశక్తితోను గూడిన ఒక మహాక్రియలోనికి మార్గంకావచ్చు మరియు ఆక్రియ ప్రపంచాన్ని మార్చివేసి, పరిణామాత్మక ప్రేరణకు పరిపూర్తినీయవచ్చు. ఇది ఎలాంటి ఆరోహణ అంటే, దానినుంచి ఇక పతనమే ఉండదు, కింతు రెక్కలు కట్టుకుని, తమకుదాము నిలుపుకొంటూ దిగే ప్రకాశ, శక్తి, ఆనందాల ఒక అవతరణ మాత్రమే వుంటుంది.

అశక్తత, అజ్ఞానముల నుండి బైటపడటం ఎలా?

ఏది సత్తాశక్తియందు అంతర్వర్తిగా ఉంటుందో, అదే సంభూతి (becoming) గా అభివ్యక్తమవుతుంది; అయితే అభివ్యక్తి రూపం — దాని అవయవాలు. దాని ఊర్జాల సంతులనం (balance). సమతూకం, దాని తత్వాల (Principles) రచన — సృజనశీల శక్తియందు పనిచేసే చేతనపైనా, అభివ్యక్తినిమిత్తం సత్త తననుండి విడుదలచేసే చేతనాశక్తి పైనా ఆధారపడి వుంటుంది. సత్త తనస్వభావం చేతనే తనచేతనా శక్తులను గ్రేడు (Grade) చేయగలదు, మార్చగలదు కూడ; ఇక గ్రేడును బట్టి, గ్రేడులోపల మార్పును బట్టి తన ప్రపంచాన్ని, లేక తనఆత్మ ప్రకటన యొక్క స్తరమును, వ్యాప్తిని నిర్ధారించగలదు. కావున అభి వ్యక్తప్రపంచం తనను అభివ్యక్తం చేసే శక్తికి పరిమితమై వుంటుంది, దాని ననుసరించే, దాని జ్ఞానం, జీవనం ఉంటాయి. ఇక అది అధికతర జ్ఞానం, ప్రబలతరజీవనం పొంది, తన స్వరూపం మార్చుకోవాలంటే, తనపైన ఉన్న ఒకఅధికతరచేతనాశక్తికి అది తెరచుకోవాలి, లేక దానిదిశగా ఆరోహించాలి, లేక దానిని తనలోనికి దించుకోవాలి: ఇదొక్కటే మార్గం. మనప్రపంచమున చేతనాపరిణామమునందు జరుగుతున్నది సరిగా ఇదే. ఈ ఆవ శ్యక ఉన్మీలనాదులు కల్పించే ఒత్తిడికి లోబడి నిర్జీవద్రవ్యం ఒక ప్రాణశక్తిని, ఒక మనఃశక్తిని ప్రసవించింది; ఈ శక్తులు ద్రవ్యమయ ప్రపంచంలోనికి నూతన సృష్టిరూపాలను

గొనివస్తున్నాయి. అంతే కాదు, నిర్జీవ ద్రవ్యం ఒక అతిమానస శక్తిని ప్రసవించడానికి, దానిని తనలోనికి దించడానికి ఇంకా ప్రయాసపడుతూనే ఉంది.

ఇంకేమిటంటే, అది (పరిణామం) చేతనయొక్క రెండు ధ్రువముల నడుమ చరించే సృజనాత్మక శక్తియొక్క ఒక క్రియావిధానం. ఒక వైపున లోపల, పైన ఒక రహస్యచేతనవుంది; ప్రకాశ, శాంతి, ఆనందాల శక్యత (Potentialities) లన్నీ దీనిలో వున్నాయి — అక్కడ బాహ్యంగా అభివ్యక్తంగాను, ఇక్కడ అభివ్యక్తిని అపేక్షించుతూను వున్నాయి. ఇక రెండవవైపున మరొక బాహ్యాచేతన ఉంది. అది ఉపరితలాన, అడుగున ఉండే చేతన; ఇది, అచేతన, జడత, అంధ ప్రయాసం, దుఃఖసంభవతలనుండి బయలుదేరి, తనలోనికి ఉన్నతోన్నత శక్తులను స్వీకరించుతూ పెరుగుతుంది; ఇలా దిగిన శక్తులు ఆ చేతనకు తన అభివ్యక్తిని సదా విశాలతరరూపాల్లో సృజించుకొనడానికి తోడ్పడతాయి; ఇలాంటి ప్రతినూతనసృష్టి లోపలి శక్యతను కొంత వరకు పైకి తీసుకొస్తుంది; ఇలా పైన వేచివున్న పరిపూర్ణత (Perfection) క్రిందికి రావడం ఎక్కువెక్కువ సంభవమవుతుంది. దేనిని మనం మనమని పిలుస్తున్నామో, ఆ బాహ్యా వ్యక్తిత్వం ఎంత కాలం చేతనయొక్క నిమ్నశక్తులయందు కేంద్రితమై ఉంటుందో, అంత కాలం దాని స్వీయసత్తను గురించిన ప్రహేళిక, దాని ప్రయోజనం, దానిఆవశ్యకత పరిష్కరించజాలని ఒకసమస్యగానే మిగిలిపోతుంది; సత్యంలో ఏ కొంతైనా ఈబహిర్ముఖమానసిక మానవునికి అసలు అందించబడితే, దానినతడు అపూర్ణంగానే గ్రహించుతాడు, బహుశా దానికి అపార్థం చెపుతాడు, చెడ్డగా ఉపయోగించుతాడు, చెడ్డగా దానిని అనుజీవించుతాడు. అపుడు అతని నడకకు కావలసిన ఊతగఱ్ఱ ఎట్టి వినిశ్చిత, అసందిగ్ధ జ్ఞానప్రకాశంచేతకంటే ఎక్కువగా విశ్వాసాగ్ని చేతనే చేయబడుతుంది. ఏది మానసికస్తరానికి పైన ఉన్నదో, కావున ఏది ఇపుడు అతనికి అతిచేతనమో, అట్టి ఒక ఉచ్ఛతర చేతనదిశగా ఆరోహించుటచేత మాత్రమే, అతడు తన అసామర్థ్యం నుండి, అజ్ఞానం నుండి బైటబడగలడు. మానసికరేఖనుదాటి, ఒక నవ్యఅతిచేతనసత్తా ప్రకాశంలో అడుగుబెట్టినపుడు మాత్రమే, అతనికి సంపూర్ణ విముక్తి,

జ్ఞానం లభించుతాయి. ఈఅతిశయమే (Transcendence, అతిక్రమణం) ప్రాచీన గుహ్యాయోగుల ఆధ్యాత్మిక సాధకుల ఆకాంక్షకు లక్ష్యంగా ఉండేది.

నవ్యసృష్టి భూలోకంలోకి ఎలా వస్తుంది?

కాని ఈ అతిశయనం స్వయంగా ఇచ్చటిసృష్టిలో దేనినీ మార్చదు, ప్రపంచంనుంచి ఒక విముక్తిజీవుని పలాయనం ప్రపంచమున ఎట్టి భేదమూ గొనిరాదు. కాని మానసికరేఖను ఇలా అతిశయించడాన్ని ఒక ఆరోహణ ప్రయోజనానికే కాక, అవరోహణ ప్రయోజనానికిగూడ ఉపయోగించగలిగితే, అపుడది ఆరేఖా స్వరూపాన్నే మార్చివేస్తుంది: ఇపుడా రేఖ పైకి పోవడానికి ఒక మూతగా, అడ్డుగా ఉండగా, అపుడ దేరేఖ దానికిపైన ఉన్న సత్తునకు గల ఉచ్చతర చేతనాశక్తుల అవరోహణకు మార్గమవుతుంది. దానిఫలితం పృథివిపై ఒక నూతన సృష్టి, చరమశక్తులు దిగివచ్చి, ఇచ్చటి పరిస్థితులను పూర్తిగా మార్చివేస్తాయి. ఎలాగంటే, ద్రవ్యగత నిశ్చేతనంనుండి మనస్సు వెలువ డినపుడు, దాని సగం వెలుగులోనికి మాత్రమే ఉదయించిన ప్రపంచ స్థానమున ఆధ్యాత్మిక, అతిమానస పూర్ణప్రకాశ ప్రవాహంలోని కుదురించబడిన ఒకనూతనసృష్టి రూపొందుతుంది. ఇలా సిద్ధించిన ఆత్మయొక్క అట్టి పూర్ణ ప్రకాశమునందు మాత్రమే దేహధారి జీవుడు, అంధకారంలోనికి, దాని నిబంధనలలోనికి తాను ఎందుకు తాత్కాలి కంగా దిగవలసి వచ్చిందో, దాని అర్థాన్ని, ఆ అర్థంలో ఇమిడి ఉన్న రహస్యాన్నంతటిని తెలుసుకో గలుగుతాడు; అంతేకాదు, ఒక ప్రకాశ మయ ద్రవ్యాంతరణసాధన (Transmutation) క్రియచేత వాటిని ఒక విశిష్ట అభివ్యక్తిలో కరిగించి వేయగలుగుతాడు — ఆవృత మరియు కపట వేషధారి భగవంతుని, లేక పైకిమాత్రమే వికృత భగవంతుని అభివ్యక్తిలోగాక, ఇచ్చట వివృత భగవంతుని అభివ్యక్తిలో కరిగించి వేయగలుగుతాడు.

మూలం: శ్రీఅరవిందులు

తెలుగు మూలం: చెలసాని నాగేశ్వరరావు (యోగం పై లేఖలు-I)

చైతన్య పరిణామము

దైవము పదార్థమునందు అంతర్గతమై, తిరిగి బహిర్గతమగుటకు అయ్యే ప్రయాసలోని ఒక మజిలీ, ఒకానొక సందర్భమే ఈజీవితము — ఇహలోక జీవితముయొక్క రహస్యము.

అయితే ఈ రహస్యమేమిటో నీకు జీవితంలోగాని, శరీరం ద్వారా గాని దొరకదు. దాని ఆచూకి అండపిండాదులలో కనబడదు. ఎందుకంటే ఇవన్నీ ఆ మూలపదార్థమునకు కేవలం భౌతిక ఆధారములు మాత్రమే. లేశమైనా మెదడు గాని, ఇంద్రియములుగాని లేని ఈవిశాలవిశ్వములో ఒక కదలిక మొదలై, చైతన్యమును పుంజుకొని, తిరిగి వృద్ధిచెందుటయే ఈ సృష్టియొక్క అసలు రహస్యం. మొదట అచేతనంగా కనబడిన వస్తువులోనుంచి చేతన బహిర్గతమై (కాని అది ఇంత కాలము ముసుగులో దాగి ఉండనేఉంది. ఎందుకంటే పదార్థముయొక్క అచేతన, చేతనయొక్క యవనికయేగదా), తనను తాను కనుగొనుటకై అది పడే పెనగులాట; తన స్వధర్మములైన సమగ్రత, సంపూర్ణత, ఆనందము, వెలుగు, శక్తి సామర్థ్యములు, సామరస్యములను పొందుట — ఇదీ ఈ మహాద్భుతగాథ. (MIRACLE) మనమే దాని పాత్రధారులము, ఉపకరణములము, తిలకిస్తున్న ప్రేక్షకులము.

ఒక చైతన్యము, ఒక ఆత్మ, ఒక శక్తి, ఒక ఆనందము అనాది నుంచి తననుంచి తాను నిరోధింపబడి అనగా తన్ను తాను తెలిసికొనలేని స్థితిలో అంధకారము (అజ్ఞానము)లో బంధింపబడినట్లు కనబడుచున్నది. ఇది భౌతిక పదార్థ స్వభావమైన కాళరాత్రి, అంధకారము, అజ్ఞానము అయివున్నవి. అయితే అది ఇప్పుడూ, అప్పుడూ, ఎల్లప్పుడూ స్వతంత్రము, పరిపూర్ణము, దోషరహితము, శాశ్వతము, మరియు అనంతము, సర్వము తానేయై మనచే భగవంతునిగా పిలువబడు బ్రహ్మము, ఆత్మగా ప్రకాశిస్తోంది. ఇచ్చట, తానే సృష్టించుకొన్న వైరుధ్యము (ప్రకృతి)లో తన్ను తాను మూసివేసుకొన్నది. సర్వజ్ఞుడు తన్నుతాను అచేతనలో (అజ్ఞానము) ముంచివేసుకొన్నాడు. పూర్ణ చైతన్యము అచేతనలోను, పూర్ణజ్ఞానము శాశ్వత అజ్ఞానములోను తమకు తాము నిమజ్జించుకున్నాయి. ఆ సర్వశక్తివంతుడు భిన్న రూపములుగా విడి

పోవుచు జడమైన బృహత్తర జగత్తు (బ్రహ్మాండము) గా తన్నుతాను స్వయంగా సృష్టించుకొన్నాడు. ఇచ్చట ఆ అనంతము మితముకాని భిన్నత్వంతో తన్నుతాను ప్రకటించుకొన్నది, పూర్ణానందము గాఢ వేదనారాహిత్యాన్ని (జడత్వాని) ధరించింది. దానినుంచి అది బాధ, ఆకలి, కోరిక, దుఃఖములతో పోరాడుతుంది. ఇతరత్రా ఎచ్చటనో దివ్యత్వము ఉన్నది. ఇచ్చట ఈ భౌతిక జీవితములో ఈ అంధకార భౌతిక ప్రపంచములో అది (ఆ దివ్యత్వము) పూర్తిగా లేనట్లే కనబడు తుంది. అయితే అది దివ్యత్వముగా అగుచున్నట్లున్నది. ఈ విధంగా దివ్యత్వము తన వ్యతిరేకమైన జడత్వమునుంచి క్రమముగా దివ్యత్వ ముగ సంభూతమగుటయే భౌగోళిక పరిణామముయొక్క అర్థము, ఉద్దేశ్యము.

పరిణామము (Evolution) యొక్క సారాంశము శరీరాన్ని అధి కాధికముగ సువ్యవస్థ పరచుటగాని, జీవితాన్ని అధికాధికముగ సమర్థ వంతము చేయుటగాని కాదు — ఇవి దానియొక్క యంత్రాంగము. అనగా బాహ్యా రూపములు మాత్రమే. పరిణామము పదార్థములో నిద్రా ణంగావున్న చేతన మేల్కొనుటకు, స్వతంత్రముగానుండుటకు, ఆ చేత నను కనుగొనుటకు, పొందుటకు, దాని సర్వ అవకాశములను, తదవ కాశముల విశిష్ట, విశాల, అంతిమ, అత్యున్నత స్థాయిల వరకు జేయు సమర్థమై యున్నది. పరిణామమనగా ఆత్మ తన స్వయం ప్రదర్శకత్వ రహస్యాన్ని రూపములోను, శక్తిలోను, ఉద్భవింప చేయుట; నిదానముగా సంభూతమవుతున్న దివ్యత్వము, ప్రవర్ధమానమవుతున్న ఆత్మ.

ఈ పరిణామంలో మానసిక మానవుడు దాని లక్ష్యం, ముగింపు, పరిపూర్ణమగు చివరి అత్యున్నత ప్రాముఖ్యత కాదు. ఈ ప్రకృతి యొక్క సర్వ ప్రసవ వేదనకు మకుటప్రాయమగుటకు అతడు చాలా స్వల్పమైనవాడు, అపరిపూర్ణుడైన వాడు. మానవుడు పరాకాష్టజీవి కాడు. అతడు మధ్యస్థజీవి మాత్రమే, అవస్థాంతరజీవి, ఒక సాధనంగా వుండు మధ్యస్థప్రాణి.

పరిణామపు నైజం, మానవుని మధ్యస్థస్థితి మొదట మనకు బాగుగా తెలియవు. ఎందుకనగా బాహ్యానేత్రానికి అది పరిణామ మన్నట్లు కనిపిస్తుంది. భౌతిక పరిణామం మాత్రం మానవుని తన

నిస్వార్థమైన అతి చక్కని ఫలితంగా వదలిపెట్టి, చాలాకాలం క్రిందటే ముగింపబడింది. ఇకపై ఎట్టి క్రొత్త జీవులనుగాని, ఉన్నత సృష్టులను గాని ఎదురుచూడవలసిన పనిలేదు. అయితే మనం ఈ మొత్తం పరిణామ విధానాన్ని గమనించక, ఆకృతులను, బాహ్యాస్థితులను మాత్రమే చూచుచున్నంత వరకు అది మనకలా కన్పిస్తుంది. చేయవలసిన పనికి పదార్థం, శరీరం, ప్రాణం అత్యావసరములైన ప్రథమాంశాలు. క్రొత్త సజీవరూపాలు ఇకపై ఏమాత్రం స్వేచ్ఛగా కన్పించక పోవచ్చు, అయితే దీనికి కారణం ముఖ్యంగా పరిణామపు తీవ్ర ప్రయత్నము క్రొత్త రూపాలను సృష్టించడానికి కాదు. అది చైతన్యము యొక్క నవ్య శక్తులను సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. దివ్యశక్తియైన ప్రకృతి నిలువుగా వున్న శరీరాన్ని రూపొందించి, దానికి ఆలోచించు, కల్పనచేయు, తనను తదితరములనుగూర్చి విచారించు, తనపై తదితరములపై సచేతనంగా పనిచేయుశక్తిని ప్రసాదించుటచే అది తన నిగూఢ లక్ష్యానికి కావలసిన దాన్ని పొందినది. మిగిలినదాన్ని అప్రధాన తలానికి నెట్టివేసి, తన ప్రధాన అత్యున్నతశక్తులనన్నింటిని ఆనిగూఢ లక్ష్యంవైపునకు మరల్చింది. ఏలననగా అంతవరకు జరిగిన ప్రయత్నమంతా నిదానంగా సుదీర్ఘంగా జరిగింది. ఆ ప్రయత్నమంతటిలో మానవావిర్భావము, కీలగమగు పరివర్తనాంశమైన చైతన్యపు వికాసము. దాని పరమార్థమై, యదార్థ కార్యమై లోపల రహస్యంగా వుంచబడింది.

మెలమెల్లగా జరిగిన ఈ ప్రకృతి కృషి అసంఖ్యాక యుగాలను, అనంత అంతరాలను అధిగమించినది. వాటిలో అది మాత్రమే ఆమె ఏకైక కార్యంగా వుండినది. మనం మన హేతువాదపు బాహ్యానేత్రంతో చూచినప్పుడు, ఒక ఆకస్మిక సంభవంగా వచ్చినదని భావించినప్పుడు, స్వల్పకాలం ఒక అణువుగా, ఈ నిరవధిక ఆద్యంతాల మధ్య బహుశా ఒక చిన్న విశ్వపు బహు చిన్న భాగంలో ఏదో మూలగా ఆ యదార్థ కార్యం మనకు గోచరిస్తుంది. అలా అయినచో కాలాంతరాలు అనంత శాశ్వతత్వానికి అనవసరాలని మనం బదులు చెప్పవచ్చు. కాని ఆ దైవానికి అది అట్టి వృథా ప్రయాస కాదు. మరణంతో కూడిన మన మూడునాళ్ళ అస్తికత్వమువలె అది వృథా ప్రయాస కాదు. ఒక క్షణికకాలంమాత్రం వికసించుటకై లక్షలాది సంవ

త్సరాలు శ్రమించుట కాదు. అయితే ఆ విద్ధూరంకూడా ఒక ప్రదర్శన మాత్రమే. పరిణామగాథ మొత్తం ఈ ఒక్క ధరిత్రి చరిత్ర మాత్రమే కాదు. వేరొకచోట ఇప్పుడుకూడా వేరు భూతలాలున్నాయి. ఇక్కడ కూడా చాలా భూతల రాకపోకలు కలిగాయి, ఇకపై రాబోవునవి చాలా వున్నాయి.

జ్వలించు సూర్యులను, క్రమబద్ధమైన ఈ భౌతిక విశ్వాన్ని సృష్టించుటకై ప్రకృతి అసంఖ్యాక, లక్షలాది సంవత్సరాలు శ్రమించినది. అంతులేని లక్షల సంవత్సరాల క్రమంలో ఈ భూమి నివాసయోగ్యమగు గ్రహంగా మారుటకై ఆమె ముందుకు వచ్చింది. ఆ అగణనీయ కాలం మొత్తంలో ఆమె పదార్థ పరిణామానికి మాత్రమే నిమగ్నమై వుండినది. ప్రాణము, మనస్సు ఒక అస్తిత్వంలేని స్థితిలో రహస్యంగా వుంచ బడ్డాయి. అయితే ప్రాణం ఆవిర్భవించు సమయం ఆసన్నమైంది. లోహంలో ఒక ప్రకంపన, పెరుగుదల, ఆకాంక్ష, మొక్కలో ఉద్భవించు టకై తపన, ఒక స్వాభావిక పశుశక్తి, ఇంద్రియజ్ఞానం, జంతువులో సంతోషం, బాధ, ఆకలి, ఉద్రేకం, భయం, శ్రమల కలపోత ఒక ప్రథమ వ్యవస్థిత చైతన్యం ఇవన్నీ దీర్ఘకాల చింతనచే రూపొందించబడిన అద్భుత సృష్టి ఆరంభం అప్పటినుండి ఆమె పదార్థపు స్వప్రయోజనా నికై ప్రత్యేకంగా నిమగ్నం కాలేదు. కాని ఎక్కువగా ప్రాణప్రకటనకు పనికివచ్చు, స్పందించు, సజీవ పదార్థానికై కృషిచేసింది. ప్రాణపరి ణామం ఇప్పడామె తీవ్రకృషి అయినది. దానితోపాటు నెమ్మదిగా ప్రాణంలో మనస్సు అభివ్యక్తమైనది. ఒక తీవ్రభావం, ముతక ఆలోచన, ముందు చూపు, జంతువులో ప్రాణిక మనస్సు. కాని మానవునిలో సంపూర్ణ వ్యవస్థ, ఉపకరణాలు, పురోగమనం కలిగిన, అయినా అసం పూర్ణం, మానసిక సత్త — మనువు — ఆలోచించు, రూపొందించు, ఆకాంక్షించు, సచేతన పరిణామం. అప్పటినుండి ప్రాణం యొక్క మార్పుకన్నా మానసికాభివృద్ధి ఆమె కాంతిమయ ముఖ్యకర్తవ్యమైనది. ఆమె అద్భుత సవాలు అయినది. ఇకపై శారీరక పరిణామం లేనట్లు, ప్రాణ పరిణామం కూడా లేదు, ఒకవేళ వున్నా అది సజీవశరీరంలో మనస్సు ఉన్నతమగుటకు, విశాలమగుటకు మాత్రమే. ఒక అదృశ్య

అంతరంగా పరిణామం ఇప్పుడు ప్రకృతియొక్క గొప్ప వాంఛగా కర్త వ్యంగానున్నది.

చైతన్యం సాధించగలిగినది సర్వం మనస్సే అయినచో మనస్సు నిగూఢ దైవత్వమైనచో, దానికన్నా ఉన్నతమైన, విశాలమైన, ఎక్కువైన అవధులు లేనిచో మానవుడు తన మనస్సును సంతృప్తి పరచి తన సత్తను సంపూర్ణంగావించుకొనవచ్చును. అప్పుడు అతనికి అతీతంగా ఇక్కడ ఏదిగాని వుండదు, వుండవలసిన అవసరం లేదు. చైతన్యాన్ని దాని శిఖరాలకు గొనిపోయి, హద్దులులేని విశాలతకు దానిని వ్యాపింపజేసి, దానితోపాటు లోతుతెలియని అగాధాలలోనికి లంఘించుచు, తననుతాను సంపూర్ణం గావించుకొని ప్రకృతి కార్యాన్ని పూర్తిచేయవచ్చును. పరిణామం భూజీవన మకుటమగు మానవ-దైవంలో ముగియును.

కాని, మనస్సు సర్వం కాదు. ఏలననగా మనస్సున కతీతంగా గొప్ప చైతన్యమున్నది. అతి మానసం, దైవం వున్నారు. జంతువులో ప్రాణిక సత్తలో మానవుడు — మనువు — ఆలోచనాపరుడు అభివ్య క్తమగువరకు ప్రకృతి శ్రమించిన విధంగా, అతనినుండి ఒక ఆధ్యా త్మిక అతిమానసిక దైవత్వాన్ని, సత్యచైతన్యద్రష్టను, తాదాత్మ్యంచే గ్రహించువానిని, వ్యక్తిత్వ రూపధారిని, సర్వోత్కృష్ట విశ్వజనీన మాన వుని అభివ్యక్తం చేయుటకై శ్రమించుచున్నది.

మృత్తిక, ధాతువులనుండి మొక్కవరకు, మొక్కనుండి జంతువు వరకు, జంతువునుండి మానవుని వరకు ఆమె ఎంత ప్రయాణం పూర్తి చేసిందో అంతకన్నా బృహత్తర విస్తరణ లేక మహాద్భుతమగు లంఘ నమును ఇంకను ఆమె ముందు మిగిలివుంది. పదార్థంనుండి ప్రాణానికి లాగా, ప్రాణంనుండి మనస్సుకులాగా, ఇప్పుడు ఆమె మనస్సునుండి అతిమనస్సునకు మానవునినుండి అతిమానవునికి పురోగమించవలెను. ఆమె అనుసంధానించ వలసిన అగాధమిదియే. తన ప్రయాసనుండి, అసంతృప్తినుండి విశ్రాంతి పొందుటకు ముందుగా సర్వోత్కృష్ట చైతన్యకాంతిలో శ్లాఘనీయమైన, పరివర్తితమైన, సఫలీకృత పరమానం దంతో ఆమె నిర్వర్తించవలసిన పరమాద్భుతము ఇదియే.

ఒకప్పుడు నిమ్నమానవత ఆమెలో పరమోన్నతమై వుండెను. ఇప్పుడు దానిని తొలగించి మానవుడు కాలానికి ముందుగా నడచు చున్నాడు. అయినా భవిష్యత్కాలపు లక్ష్యం, పరమార్థం అగు అతిమానసిక అతి మానవుడు, సాధించవలసిన అదృశ్యమహిమ ఇంకను ఆమె ముందున్నది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఎన్. అప్పాస్వామి, బ్రహ్మచారి సంయమేశ్వర్

బంధము

ప్రపంచకమంతా స్వేచ్ఛకోసం కోడై కూస్తుంది. కాని ప్రతివాడు తనని బంధించే సంకెళ్ళనే ముద్దు పెట్టుకుంటాడు! ఇదే మానవ ప్రకృతిలోని చిత్రము — Paradox, మొదటి చిక్కు ప్రశ్న

మనిషికి తన జన్మ బంధాల మీద ఎక్కువ మక్కువ. అందుకని వాటికి జోడైన మృత్యు బంధాలలో కూడా చిక్కుకుంటాడు. స్వేచ్ఛకోసమని ఆ బంధనాలలోనే ఆకాంక్షిస్తాడు. ఆత్మోపలబ్ధికోసం అర్రులు జాపుతాడు.

మనిషి అపారమైన శక్తితో తులతూగుదామని ఆరాట పడతాడు — తత్కారణంగా అర్భకత్వానికి బలి అవుతాడు! ఎందుకంటే ఈజగత్తు నిరంతరం (ఒకదానితో ఒకటి ఢీ కొట్టుకుండే) జరిగే శక్తి సముద్రపు తరంగాల విన్యాసము. ఎవడైతే ఒక కెరటం మీదకి ఎక్కుతాడో అతడు వెయ్యి కెరటాల తాడింపుతో మూర్ఛాగతుడవుతాడు!

మనిషి సుఖసంతోషాల కోసం తహతహలాడతాడు — కాని బాధా దుఃఖములను అనుభవించి తీరుతాడు. ఎందుకంటే అమందానందము ఆవేశరహితమైన స్వేచ్ఛాత్మలకేతగును. సుఖసంతోషాలకోసం మానవుడు పొందే ఆవేదన దుఃఖభాజకము, వ్యర్థమైన ఆర్భాటము.

మనిషి విశ్రాంతి కోసం పరితపిస్తాడు. మళ్ళీ మనసు యొక్క కలవరములతోటి, హృదయము యొక్క ఆవేదనలతోటి గాఢానుభూతులకోసం ఎదురుచూస్తాడు. ఉల్లాసమనగా మానసిక ఉద్వేగమట,

విశ్రాంతనగా జడత్వమట, మార్పులేని పునరుక్తట — మరి అసలైన సంతోషమంటే ఏమిటో అతనికి తెలుస్తేకదా!

మనిషి తన భౌతిక శరీరము యొక్క పరిమిత శక్తిని వదల లేడు. కాని మళ్ళీ అనంతమైన మనస్సు, అమరమైన ఆత్మల స్వేచ్ఛ నాశిస్తాడు.

ఈ వైరుధ్యాలన్నిటిలోను అతనిలోని ఏదో ఒక భాగం ఒక వింత ఆకర్షణను వీక్షిస్తుంది. అవి అతని మానసిక సత్త యొక్క జీవన కళాత్మకతను కలిగిస్తాయి. అమృత మొక్కటే కాక విషంకూడా అతని రుచిని, విస్మయాన్ని ఆకర్షిస్తుంది.

వీటన్నింటిలో ఒక అర్థమున్నది. ఈ వ్యతిరేకతలకు ఒక విముక్తి వుంది. ప్రకృతికి తన సమ్మేళనాల ప్రతి ఉన్మాదానికి ఒక పద్ధతి వుంది. విడదీయరాని చిక్కుముడు లన్నింటికి ఒక పరిష్కారం వుంది.

మృత్యువన్నది జీవితానికి నిరంతరం ప్రకృతి వేశే ప్రశ్న జీవితం తనను తాను ఇంకా తెలుసుకోలేదని జ్ఞాపకం చేయడం. మృత్యుకౌగిలే లేకపోయినచో జీవి అసంపూర్ణ జీవితానికి అనంతంగా కట్టుబడి పోగలడు. మృత్యువు వెన్నంటుచున్నందు వలన అతడు ఒక సంపూర్ణ జీవితం గడపాలని మేల్కొని దాని సాధ్యసాధనాలకై అన్వేషిస్తాడు.

బలహీనత, మన దారుఢ్యం, శక్తులు, గొప్పతనం మీద అదే పరీక్షను ప్రశ్నను ప్రయోగిస్తుంది. శక్తి జీవితపు క్రీడ. దాని స్థాయిని చూపుతుంది. భావప్రకటన విలువను కనుగొంటుంది. బలహీనత జీవితగమనాన్ని వెంబడిస్తూ పొందిన శక్తి పరిమితిని నొక్కి చెప్పు నది, మరణపుక్రీడ.

బాధ, దుఃఖం అన్నవి ఆత్మ అనుభవించు సంతోషం, దాని అస్తిత్వపు యదార్థమగు ఆనందానికి దుర్భలమగు ఒక సూచన మాత్రమేనని ప్రకృతి ఆత్మకు చేస్తున్న జ్ఞాపకం మాత్రమే.

మన సత్తలోని ప్రతిబాధ, చిత్రహింసలోనూ ఆనంద పారవ శ్యపు జ్వాలామర్మం వుంది. దానితో పోల్చినచో మన బహుగొప్ప

సంతోషాలు అస్పష్ట మిణుగురులు మాత్రమే. మనలోని దుర్బల మనస్సు అసహ్యించుకొను, తిరస్కరించు జీవితపు కఠిన పరీక్షల, బాధల, మరియు భీకర అనుభవాలతోకూడిన ఆత్మకు ఆకర్షణగా నుండునది ఈ రహస్యమే.

మన నిజమగు ఆధారం స్థిరత్వమని, ఉద్రేకం ఆత్మకు ఒక వ్యాధియని తెలుపు ప్రకృతి సంకేతమే మన చురుకైన సత్తకు దాని పరికరాలకు కలుగు అసహనం మరియు శీఘ్ర అలసట. కేవలం స్థిరత్వం యొక్క నిస్సారత, విసుగు కార్యకలాపాల క్రీడ అస్థిరమైన పునాదిమీదే కొనసాగించడం ఆమె మనలనుండి కోరుచున్నదని తెలుపు సంకేతాలు అని గ్రహించాలి. భగవంతుడు సదా క్రీడిస్తూనే వుంటాడు కాని శ్రమచెందడు.

దైహిక సంబంధ పరిమితులు ఒక మూసలాంటివి. ఆత్మ, మనస్సు ఆ మూసలలోనికి తమ్ముతాము నింపుకోవాలి. వాటిని ఛేదించి, నిర్విరామ విశాల పరిధులతో, వాటి మధ్య అంగీకారంతో అంతమునకు మార్గం కనుగొను వరకు పునః స్వరూప నిర్మాణం చేయుచుండవలెను.

స్వేచ్ఛ అన్నది సత్త యొక్క అనంతమైన ఐక్యతలోనుండు శాసనం. సర్వ ప్రకృతియొక్క రహస్య అధికార దాస్యం అన్నది తననుతాను అర్పించుకొని, భిన్నత్వంలో ఇతర జీవుల క్రీడలో సహాకరించు, సత్తలోనుండు ప్రేమ సూత్రం.

స్వేచ్ఛ బంధాలతో వ్యవహరించినప్పుడు, దాస్యం ఒక బలాధిక్య శాసనమై — ప్రేమ శాసనంకాక — వస్తువుల నిజనైజం వికృతం చేయబడి అస్తిత్వంలో ఆత్మ సంబంధాలను అసత్యం పరిపాలిస్తుంది.

ప్రకృతి వికృతత్వంతో ప్రారంభమై, సరియైన మార్గాన్ని చేరు వరకు, తాను నడిపించగల సర్వ విభిన్న కలయికలతో క్రీడిస్తుంది. ఆపై ఈ విభిన్న కలయికల సారాన్ని ఒక నూతన అమూల్య ప్రేమ, స్వేచ్ఛల సామరస్యంగా సమీకరిస్తుంది.

స్వేచ్ఛ అవధులులేని ఐక్యతతో వస్తుంది. ఎందుకనగా అదియే మన యదార్థమగు సత్త. ఈ ఐక్యతయొక్క సారాన్ని మనం మనలోనే పొందవచ్చు. దాని క్రీడను ఇతరులతో ఏకత్వం ద్వారా సాధించవచ్చు.

ప్రకృతిలో ఆత్మ యొక్క సంపూర్ణమగు ఉద్దేశ్యం ఈ ద్వివిధాత్మక అనుభవమే.

అనంతమగు ఐక్యతను మనలో పొందినప్పుడు మనల్ని మనం ప్రపంచానికి సమర్పణ చేసుకొనుటయే సంపూర్ణమగు స్వేచ్ఛ; పరమాధిక సామ్రాజ్యం.

అనంతం అనగా మనం మృత్యువునుండి స్వేచ్ఛను పొందిన వారము. ఎందుకనగా అప్పుడు జీవితం మన అమరత్వ అస్తిత్వపు క్రీడ అవుతుంది. బలహీనతనుండి మనం విముక్తులమౌతాము. ఎందుకనగా తన తరంగాల అసంఖ్యాక తాకిడులతో ఆనందించు ఆ సంపూర్ణసాగరం మనమే అవుతాము.

దుఃఖము, బాధలనుండి మనం విముక్తులమౌతాము. ఏలననగా మనం మన సత్తను, దానిని స్పర్శించు సర్వంతో సామరస్యాన్ని పొందుటను నేర్చుకొనెదము. అన్ని వస్తువులలో అస్తిత్వపు ఆనందం యొక్క క్రియను, ప్రతి క్రియను చూచుటను నేర్చుకొంటాము. పరిమితులనుండి విముక్తిని పొందగలము. ఏలననగా మన దేహం అనంతమైన మనస్సుకు ఒక ఆటవస్తువై, శాశ్వతమగు ఆత్మ అభీష్టానికి విధేయత చూపుటను నేర్చుకొనును. మనం ఉద్రేకపూరిత మనోహృదయాల నుండి స్వేచ్ఛను పొందగలము. జడత్వానికి బందీలైయుండము.

శాశ్వతత్త్వం, ఐక్యత, స్వేచ్ఛ అనునవి మనలోనే వున్నాయి. వాటిని మనమే కనుగొనాలని వేచియున్నాయి. అయినా ప్రేమానందానికై మనలోని దైవం అనేకంగానే వుంటాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె హనుమంతు

నిన్ను నీవు తెలుసుకో నిగ్రహించుకో

"నిన్ను నువ్వు తెలుసుకో" అనగా నీలోని వేర్వేరు విభాగములను గురించి వాటి వాటి పాత్రలను గురించి నువ్వు తెలుసుకోవాలి. నీ వ్యక్తిత్వము వేర్వేరు విభాగముల యొక్క సంపుటి. వాటిని గురించి స్పష్టముగా తెలుసుకున్నట్లయితే నీలో జరిగే ప్రక్రియలు, ఆవేశములు, ప్రతిక్రియలు, పరస్పర విరుద్ధమైన కామనల ఉత్పత్తి స్థానము నీకు తెలుస్తుంది. "నేనెందుకని అలా చేసానో, ఎందుకని అలా ప్రవర్తించానో" అన్న ప్రశ్నలకు అసలైన కారణం తెలుస్తుంది. అయితే ఇది అంత తేలికైన పనికాదు. విడవని పట్టుదల. నిన్ను నీవే మోసపరచుకోకుండా వుండే నిజాయితీ, ఎంతైనా అవసరము. ఎందుకంటే మనిషి యొక్క స్వభావం, ముఖ్యంగా అతని మనస్సు చాలా చిత్రమైనదిలే. తన ఆలోచనలు, సంవేదనలు, మాటలు, చేతలు మాత్రమే న్యాయమైనవని తనకి తనే సమర్ధించుకుంటాడు. నీలో జరిగే ఈ క్రియలన్నిటిని అతి జాగ్రత్తగా చిత్తశుద్ధితో పరిశీలించి నీలోని 'ఉన్నత న్యాయస్థానం' (నీ మహోన్నతమైన ఆదర్శం) ముందర నిలబెట్టాలి. దాని తీర్పుకి కట్టుబడి ఉన్నప్పుడే నీకు నిన్ను గురించి చక్కని విచక్షణాశక్తి కలుగుతుంది.

"నిన్ను నీవు తెలుసుకొనుట. కట్టుబాటులో నుంచుకొనుట," దీని యర్థమేమి?

తన అంతర్య సత్యమును, తన వ్యక్తి యందలి వివిధ విభాగములను, వాని వాని వ్యాపారములను దెలిసికొనుటయని దీని యర్థము. ఎందుకు ఈ పని చేయుచున్నావో ఎందుకు ఆ పనిచేయుచున్నావో నీవు తెలుసుకొనవలెను. నీ ఆలోచనలను, భావములను నీ సర్వాచర్యలను, కదలికలను, ఎట్టిది నీ సామర్థ్యము అన్న విషయమును, అన్నిటిని నీవు తెలుసుకొనవలెను. నిన్ను నీవు తెలుసుకొనుట మాత్రమే చాలదు. ఈ జ్ఞానము నిన్ను నీవు పూర్తిగా స్వాధీనములోనికి తెచ్చుకొనుట కుపయోగపడవలెను. ఒకడు తనను గురించి తాను సంపూర్ణముగా దెలిసికోనుటయేగాక, తనను తాను స్వాధీనములో నుంచుకొనుటయు తెలియవలెను.

అయితే, ప్రతిక్షణములోను ఆకాంక్ష తప్పక యుండవలెను.

ఎక్కువ ముందుగా ప్రారంభించుట, ఎక్కువ ఆలస్యముగా కొనసాగించుట, అనునది దీనికి లేదు. పసితనములోనే నిన్ను నీవు పరిశీలించుకొనుటకు, క్రమముగా నిన్ను నీవు అధీనములో నుంచుకొనుటకు ప్రారంభించవచ్చును. ఈ కార్యమునకు ఎక్కువ వయస్సు, వృద్ధాప్యము ఆటంకములు గావు. ఇదియే జీవిత విజ్ఞాన శాస్త్రము.

ఒకడు పరిపక్వతను బొందుటకు తన్ను తానెఱుగవలయును. నేను నిజము పలుకుచున్నాను. ఉదాహరణకు, నీ జీవితములో అనేక మారులు ఈ క్రింది పరిస్థితి సంభవించియుండును. ఒకానొకడు నిన్ను ఉన్నట్టుండి, "నీ వెందుకాపని చేసితివి?" అని యడిగినచో వారు అయత్నకృతంగా నీవు, "నాకు తెలియదు" అని సమాధానము చెప్పుదువు. అట్లేయింకొకడు "నీవు ఏమి ఆలోచిస్తున్నావు?" అని యడుగగా, దానికిని, "నాకు తెలియదు" అనియే నీ జవాబు. ఇదీ వరుస. నేను ఒక ఏబదిమందిని ఆకస్మికముగ ఉన్నట్టుండి "నీ వెందుకాపని చేసితివి?" అని యడిగినచో వారు అంతరంగముగా మేల్కొని యుండకపోతే, "మాకు తెలియదు" అందురు. (ఆత్మజ్ఞాన శిక్షణ గలవారిని గురించి నేను మాట్లాడుట లేదు: వారు తమ మార్గమున చివరివరకు పయనించియుందురు. అట్టివారు సహజము గానే, చిత్తమును సమాహిత పరచుకొని సత్యమైన జవాబునే జెప్పగలుగుదురు. అదియైనను కొంత ఆలస్యముగా) నీవు నీ దినచర్య నంతను బాగుగ పరిశీలించుకొనినట్లయితే పరిస్థితి ఇట్టిదిగానే యున్నట్లు నీకు స్పష్టమగును. నీ వేదో చెప్పుదువు. నీవేమి చెప్పితివో నీకు తెలియదు. మాటలు నీ పెదవి దాటినంతనే, నాలిక కరచుకొని ఇదికాదు నేను చెప్పవలసినది అని కనుగొందువు.

ఉదాహరణకు నీ వొకని జూడబోయెదవు. నీవు ముందుగనే వానితో ఏ మాటలు మాట్లాడవలయునో సిద్ధపరచుకొనియేపోదువు. కాని ఆ చూడవలసిన వ్యక్తిసమక్షమున బోవుసరికి నీవేమియు జెప్పలేవు. ఒకవేళ చెప్పినను నీవనుకున్నదానికి భిన్నముగ నుండును. ఎంతవరకు అతని సన్నిధిగల వాతావరణ ప్రభావము నీపైబడి నీవు సిద్ధమొనర్చుకొన్న మాటలను పలుకనీయకుండా జేసినదో చెప్పగలవా? ఎంతమంది జవాబునివ్వగలరు? ఎదుటి మనిషి ఇట్టి పరిస్థి

తిలో నుండినందున, మేము మాట్లాడలేకపోయితిమని పరిశీలించి చెప్ప గలవారెందరున్నారు? కొన్ని సందర్భములలో ఎదుటివాడు చెడ్డ మనః స్థితిలో నుండుటవలన నీవు వాని నేమియు నడుగజాలకపోదువు. నేను అట్టి సందర్భములను గుఱించి మాట్లాడుట లేదు. ఒకరి ప్రభావమిం కొకరిపైన ఎట్లు పనిచేయుచున్నది. నీ స్వభావముపై వాని ప్రతిక్రియతే తీరుననున్నవి, అని స్పష్టముగ గుర్తింపగలుగుటగుఱించి ప్రస్తావించు చున్నాను. ఇది ఎవనికిని చేతనై యుండదు. ఉదాహరణకు, ఒకడు ఆకస్మికముగ విచారములోబడును, లేక సంతోషమును బొందును. ఎంతమంది. 'ఇది యిది' అని చెప్పగలరు? అది తెలిసికొనుట దుస్తరమే. సులభముగాదు. ఒకడు సదా మేల్కొనియుండవలెను. నిరంతరము పరి శీలనయందు శ్రద్ధగలిగయుండవలెను.

దినమునకు 12 గంటలు నిదురపోయి మిగిలిన సమయంలో నేను మేల్కొనియున్నాను అనువారు గలరు. దినమునకు ఇరువది గంటలు నిదురపోయి తక్కిన సమయములలో సగము మేల్కొని యుండువారును గలరు.

శ్రద్ధాపూర్వకమైన పరిశీలనాదృష్టి కలిగియుండవలయునన్న, స్పర్శ జ్ఞానేంద్రియములవంటివి నీ శరీరమంతటను ఉండి, నీ యదార్థ జ్ఞానకేంద్రముతో ఎడతెగని సంబంధము కలిగియుండవలెను. అపుడు నీవన్నింటిని నమోదుచేయుదువు: అన్నింటిని ప్రణాళికాబద్ధము చేయుదువు. నిన్నెవ్వరు నీకు తెలియనిరీతిగా కార్యములందుపయోగిం చుకొనజాలరు. నీవు మోసగించబడవు. నిన్ను ఎవరును తప్పుగా భావింపరు. నీవు చెప్పదలచుకొన్నదానిని తప్ప వేరేదియు నీవు చెప్పవు. అయితే, ఎంత మంది జనులు ఈ స్థితిలో నుందురు. ఎఱుకను గూర్చి మాట్లాడినపుడు నా యర్థమిదియే. నీవున్న స్థితిగతులయందు నీవు లాభమును పొందవలయునంటే, నీవు పూర్తిగా మేలుకొని యుండవలయును. ఎవరును నిన్ను నివ్వెరపోవునట్లు చేయగలిగియుండ రాదు. ఎందుకో తెలియకుండా దేనిని గుఱించియు మాట్లాడుస్థితి నీకు ఏర్పడరాదు. నీవు నిరంతరం మేల్కొని యుండవలయును.

నీవు వేరుపడిన వ్యక్తిత్వము గలిగినవాడవుగావు. జీవితము ఎడతెగని శక్తులమార్పిడి: ఎఱుక, చైతన్యము, వివిధ కార్యాచరణశీల

త్వము గలవి: ఒక సామూహికతత్త్వము గలవి. ప్రతిఒక్కరు ముందుకు వచ్చినట్లయితే అందరు ముందుకు పోదురు. అందరు వెనుకకు నెట్టి నట్లయితే ప్రతిఒక్కడు వెనుకకు వచ్చును. నీ అంతరంగిక ప్రపంచ ములో నీ జ్ఞానములోగూడ ఇదియే వర్తించును. నీపైన శక్తులు, పలు కుబడులు, పనిచేయుచు ప్రతీకారము సల్పుచు నిరంతరముగా నుండును. ఇది వాతావరణములోని వాయు పదార్థము వంటిది. నీవు మేల్కొని యుండకపోతే, ఈ విషయములు నీలోనికి ప్రవేశించును. అవి బాగుగా నీలోపలికి చొచ్చుకొనిపోయి, నీలోనుండియే పుట్టినట్లు భ్రాంతిని కలుగజేయుచు వెలికి వచ్చినపుడే నీవు వానిని గుర్తింతువు. ధైర్య హీనులు, క్రోధగ్రస్తులు, వ్యసనపరులునైన వారిని కలుసుకొని, ఎందుకో తెలియకుండా తాము ను ధైర్యహీనులు, క్రోధగ్రస్తులు వ్యసనపరులు నైన వారున్నారు. నీవు కొందరితో ఆటలాడినపుడు సరిగా ఆడవు, మరికొందరితో ఆడినపుడు బాగుగా ఆడుదువు. శాంతియుతులైనవారు, దుష్టులుకానివారు ఆకస్మికముగా క్రోధముగల వారి మధ్యనున్నప్పుడు తాము క్రోధముగలవారగుదురు. ఎవరు దానిని ప్రారంభించిరో ఎవరికిని తెలియదు. అది త్వరితముగా వ్యాపించి ఎఱుకను తుడిచిపెట్టివైచును. ఈ విధమైన ప్రకంపనములను విడుదల చేయగలిగినవారు కొందరు న్నారు. తెలియకనే ఇతరులు వానికి లోబడుచుం దురు. స్వల్పమైనది మొదలుకొని ఘనమైన దానివరకు ప్రతిదియు ఇట్లే జరుగుచుండును.

సమూహములోనుండి వ్యక్తిత్వమును నిలబెట్టుకొనవలయు నంటే, ఒకడు సంపూర్ణముగా తన ఆత్మను గుఱించి ఎఱుక గలిగి యుండవలెను. ఏ యాత్మను గుఱించి? సమస్త విషయముల కలగాపుల గముకంటే అతీతమైన ఆత్మ, అదియే నీ సత్యస్వరూపము. ఆ సత్య మును నీవెంత కాలము తెలిసికొనలేకయుందువో అంతకాలము నీవే మాత్రము దానిని గురించి ఆలోచింపకయే నీవు అన్ని విధముల విష యములచేత చలించబడుదువు. సామూహిక ఆలోచనలు సామూహిక సూచనలు ఎనలేని పలుకుబడి గలిగినవి. అవి నిరంతరము వ్యక్తిగత ఆలోచనలమీద ఆధిపత్యమువహించును. అసాధారణమైనదేదనగా, దానిని ఏ ఒకడును గమనింపడు. తానే ఆవిధముగా ఆలోచించుచుంటి నని విశ్వసించును. అయితే, యదార్థమునకు, సమూహమే అట్లు ఆలో

చించుచున్నది. సమూహామెప్పుడును వ్యక్తికంటే తక్కువైనదే. అదే గుణములు గలిగి అదే తరగతికి చెందిన వ్యక్తులను తెలిసి కొనినట్లయితే, వారు విడిగానున్నప్పుడు అదే తెగకుచెందిన సమూహాములోని, వ్యక్తులతో పోల్చిచూచినట్లయితే రెండు డిగ్రీలు హెచ్చు గొప్పదనము కలవారైయుందురు. సమూహామునందు ఒక విధమైన అజ్ఞాన మిశ్రమము ఉండును. అందువలన, వ్యకి తనకు తెలియకుండానే ఆ అజ్ఞానము లోనికి జారిపోవును. దీనినుండి తప్పించుకొన వలయునంటే, ఒకే ఒక మార్గమున్నది, — తన్ను తాను ఎఱిగియుండుట, అధికాధికముగా జ్ఞానమును సంపాదించుట. అధికాధికముగా శ్రద్ధ కలిగియుండుట.

దినప్రారంభములో ఈ చిన్న సాధనను అమలులోబెట్టుము. "నేను ఏమి చెప్పినను ఆలోచించిగాని చెప్పను" అని గట్టిగా నిశ్చయించుకొనుము. నీవు మాట్లాడినదంతయు ఆలోచించియే మాట్లాడుచున్నట్లు నమ్ముచుందువుగదా! అది నిజము గాదు. నీవనేకమారులు, నీవు చెప్పదలంచుకొనిన మాట. నీ నోటినుండి వెలువడుట నీవు చూతువు. ఆ మాట నీ నోటినుండి వెలువడకుండ జేయుటకు ఎంతో ప్రబల ప్రయత్నము చేయవలసియుండును.

నేను అనేకుల నెఱుగుదును. వారు అబద్ధము చెప్పమను నియమమును పాటింతురు. అయితే, ఆకస్మికముగా, సమూహాములోనున్నప్పుడు సత్యమును చెప్పుటకుబదులు, అయత్నకృతముగా, అబద్ధమును చెప్పుదురు. వారి కట్లు చెప్పవలెనన్న ఉద్దేశము లేదు. కాని చెప్పుటకు ఒక నిమిషము ముందుగా దానిని గురించి ఆలోచించరు. అయితే, అది ఆ విధముగా ఏల సంభవించినది? ఏలననగా, వారి అబద్ధీకుల గుంపులో నున్నారు. అక్కడ అబద్ధపు వాతావరణమున్నది. వారికి సులభముగా ఆ రోగము వ్యాపించినది.

క్రమముగా, నిదానముగా, పరిశ్రమతో మొదట బహుజాగ్రత్తతో, బుద్ధిపూర్వకముగా ఒకడు ఎఱుకను సంపాదించును. తన్ను తాను తెలిసికొనుటకు ప్రయత్నించును. పిమ్మట తనపైన తాను ఆధిపత్యము సాధించుటకు కృషిసల్పును.

తెలుగు మూలం. పాలా వెంకటసుబ్బయ్య
(శ్రీమాత శతజయంతి ప్రచురణ 7)

చతుర్విధ క్రమశిక్షణ

(మన జీవిత ఏకైక లక్ష్యం సత్యాన్వేషణ, సత్యాన్ని సాక్షాత్కరించు కోవడమే. ఏలన సత్యానికి నాలుగు ముఖ్య రూపములు కలవు. అవి దివ్యప్రేమ (Love), దివ్యజ్ఞానము (Knowledge), దివ్యశక్తి (Power), దివ్యసౌందర్యము (Beauty), మనము ఈ లక్ష్యాన్ని మన సత్త (Being) లోని శారీరక (Physical), ప్రాణిక (Vital), మానసిక (Mental), చైత్యాత్మిక (Psychic), విభాగాల క్రమశిక్షణ ద్వారా సాధించాలి. దీనినే చతుర్విధ క్రమశిక్షణ అంటారు. పై విభాగాల పరిశుద్ధీకరణ, సమైక్యత, పరిపూర్ణత్వ సాధనలో వీటిని, మెల్ల మెల్లగా అన్ని తత్వములూ సరిసమానంగా రాణించే అఖండరాశిగా మనలోని చైత్య పురుష కేంద్రం (Psychic being) చుట్టూ వ్యవస్థ చేసేందుకు అవకాశ మేర్పరచాలి.)

అనువాదకుడు

నిన్ను నీవు పరిశుద్ధము, సమైక్యము గావించుకొనుటకై శ్రమించుచున్నప్పుడు నీ బాహ్యోపకరణమును నిర్లక్ష్యము చేయరాదు — దానినికూడ బాగుచేసుకుంటూ మెరుగుపరచుకుంటూ పోవలసినదే!

1 చైత్యాత్మిక క్రమశిక్షణ

ఇది చతుర్విధ క్రమశిక్షణద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఈ చతుర్విధ క్రమశిక్షణకు చెందిన అంశాలను సంక్షిప్తముగా వివరిస్తున్నాను. ఈ నాలుగు క్రమశిక్షణ పద్ధతులు పరస్పరభిన్నములు కావు. వీటిని ఏకకాలముననే అనుష్ఠించవచ్చును. ఇదియే ఉత్తమమైన పద్ధతి. "చైత్యాత్మిక" క్రమశిక్షణను మొట్టమొదటగా ప్రారంభించవచ్చును. మన సత్తలోని కేంద్ర స్థానాన్ని "చైత్యకేంద్రం"గా వ్యవహరిస్తాము. ఇది సత్త యొక్క సత్యరూపము. సత్తలోని విభాగాలలోకెల్లా శ్రేష్టమయినది. సత్యాన్వేషణనే ఆధారంగా ఆధ్యాత్మికతను ముందుకు తీసుకెళ్తుంది. ఈ చైత్యపురుషుడు (Psychic being అంతరాత్మ) మనలోనే ఉన్నాడనే ఎఱుక కల్గియుండాలి. అంతేకాదు, మన యోగం ఆ చైత్యపురుషునిపై

కేంద్రీకరించి అది మన జీవితాన్ని నడిపించేటట్లుగా చేసుకోవాలి. ఆ చైత్యపురుషునితో మనము అనుసంధానము చేసుకొని అతనితో మమైక్యం చెందాలి.

ఇట్లు ఈ చైత్యపురుషుని దర్శించి, దీనితో తాదాత్మ్యమున మెలగ నేర్చుకొనుటకు పెక్కు విధానములు వివిధ దేశకాలములలో నిర్దేశించబడియున్నవి. కొన్ని మానసికానికి సంబంధమైనవి. కొన్ని మతపరమైనవి. మరికొన్ని కేవలం యాంత్రికమయినవి. వాస్తవానికి, ప్రతివారూ ఎవరికి వారే, ఏ మార్గము ఎవరికి నచ్చుతుందో ఆ మార్గాన్ని ఎన్నుకొని, దృఢమైన మొక్కవోని ఆకాంక్షతో దృఢమైన దీక్షతో దానిని సాధించవచ్చును. బాహ్యంగా అధ్యయనము, అంతర్ముఖంగా ఏకాగ్రత, ధ్యానము, దైవశక్తి మూలక జ్ఞానోదయం, స్వానుభవం మున్నగు వాటి సహాయంతో గమ్యం చేరుకోవాలి. దీనిని సాధించుటకు ఇచ్ఛాశక్తి (Will) ఆవశ్యకము. ఈ చైత్యపురుషుని కనుగొనుటయే మన ప్రాథమిక ప్రవృత్తిగా స్వీకరించాలి. ఈ ఆణిముత్యాన్ని మనం ఎంత వ్యయప్రయాసలకోర్చియైనా సాధించితీరాలి. నీవేపని చేసినా, నీవృత్తి ఏదైనా చైత్యపురుష సత్యాన్ని తెలుసుకోవాలి. నీవు యేకార్యములో నున్నప్పటికి, ఎలాంటి ఆలోచనలున్నప్పటికీ చైత్యపురుషునితో ఏకమై ఆ అనుభూతిని సదా పొందేటట్లుగా చేసుకోవాలి.

2 మానసిక క్రమశిక్షణ

ఈ చైత్యపురుషాన్వేషణ పూర్ణసాఫల్య సిద్ధినిగాంచుటకు, మానసిక వికాసాన్ని మరిచిపోకూడదు. దానిని ఉపేక్ష చేయుటకు ఎంతమాత్రము మంచిది కాదు. ఎందువలనంటే మనస్సనే ఉపకరణం ఎంతగొప్పప్రతిబంధకమో అంతగొప్ప సహాయకముగూడా కాగలదు. స్వాభావికంగా మానవునిమనస్సు ఎల్లప్పుడూ హ్రస్వదృష్టితోనూ, సంకుచితంగాను, నికృష్ట భావనలతోను ఉంటుంది. కావున దానిని విశాలదృక్పథంతోనూ, సరళీకృతం చేయుటకుగాను, విస్తారం చేయుటకుగాను నిరంతర కృషి ఎంతేని అవసరము. అందుకే ప్రతివిషయాన్ని అనేకకోణాలనుండి పరిశీలించుటకూడా అవసరమే. ఆలోచనలకు గొప్ప ఉన్నతిని, మృదుత్వమును చేకూర్చగల ఒకానొక అభ్యాసము

ఈ సందర్భములో ప్రస్తావిస్తున్నాను. మొదట, విస్పష్టంగా ఒక వ్యవస్థీకరించిన సిద్ధాంతాన్ని రూపొందించండి. ఆ తర్వాత, తద్వ్యతిరేకమైన సిద్ధాంతాన్ని కూడా అంతే నేర్పుతో ఏర్పాటు చేసుకోండి. అటుపిదప, దూరదృష్టితోబాగా విషయవిచారణ చేసి, విశ్లేషించి ఈరెండు వ్యతిరేక సిద్ధాంతాలు ఒకే సమన్వయ సిద్ధాంతముగా (comprehensive) రూపొందేవరకు ప్రయత్నించాలి.

పైవిధంగా, అనేకవిధాలైన అభ్యాసపద్ధతులను అవలంబించ వచ్చును. దీనివలన జరిగేలాభమేమంటే, కొన్ని పద్ధతులు వ్యక్తి శీల సంపదను పెంపొందిస్తయి. మరికొన్ని పద్ధతులు మనోబలాన్ని పెంపొందిస్తయి. మనోభావసమన్వయ సాధనకు సైతము ఉపయోగపడతయి. ఉదాహరణకు ఏవ్యక్తుల గురించిగాని, ఏ విషయముల గురించిగాని, మంచిచెడ్డలను నిర్ణయించు అధికారము నీవు మనస్సునకీయరాదు. ఏలనంటే, మనస్సు జ్ఞానోపకరణము కాదు. మనస్సుకు జ్ఞానాన్ని తెలుసుకోగలిగే శక్తిలేదు. మన భావాలకన్నా, మనస్సుకంటే కూడా జ్ఞానం స్వచ్ఛమైన పైఅంతస్తులో ఉంది. మనస్సు తనకు అతీతమైన స్థానమునుండి జ్ఞానమును గ్రహించి, అభివ్యక్తమొనర్పగలందులకై, దానిని నిశ్చలము, నిరతము, సావధానము గావించవలసియున్నది. దేనికైననూ రూపమిచ్చి, వ్యవస్థీకరించి, ఆచరణయందుంచుటలో అది ఒక పనిముట్టు. అందుకే కార్యనిర్వహణ వల్లనే దానికి పూర్తివిలువ, ఉపయోగం కలుగుతుంది.

3 ప్రాణిక క్రమశిక్షణ

చైత్యపురుష వికాసానికి చాలా ఉపయోగ పడడంలో ఇంకో పద్ధతి ఉంది. ఒక కార్యము సాధించుటలోగాని ఒక నిర్ణయాన్ని గైకొనుటలో గాని యేదైనా అభిప్రాయ భేదమొచ్చినపుడు, తన మాటే వేదవాక్కనే మొండివైఖరి ఎవరికి ఉండకూడదు. ఎదుటివాని స్థానంలో తానున్నట్లు భావించుకొని, వానితో తగవులాటకు, దెబ్బలాటకు దిగుటకు మారుగా ఉభయపక్షాల అభిప్రాయాలను కనుగొనుట అభిలషనీయము. సద్భావముతో ప్రవర్తించు వారికి అట్టి పరిష్కారము సదా సులభ గ్రాహ్యమేయగును.

ఈ సందర్భములో ప్రాణికక్రమశిక్షణ గురించి ప్రస్తావించుట ఆవశ్యకము. మనలోని ప్రాణిక సత్త (Vital being) వివిధ ప్రేరణలకు, కోరికలకు, ఉత్సాహానికి, దౌర్జన్యానికి, అమితశక్తికి, నిరాశతో కృంగి పోవడం, తీవ్రంగా ఉద్రేకపడటము, తిరుగుబాటు చేయడం మున్నగు మనోవికారాలకు మూలస్థానము. దేనినైననూ సరే, ఇది ఆచరణపూర్వ కంగా నిర్మాణమొనర్చి సాధింపగలదు. అట్లే దేనినైననూ భగ్నమొనర్చి వినాశమొందిపనూగలదు. కావుననే మానవునిలోని విభాగములన్నిటి లోనూ దీనిని తగుక్రమశిక్షణలో పెట్టుట మిక్కిలి కష్టమైనపని. ఎంతో ఓర్పు, నిర్దిష్టమైనకృషి, అకుంఠితదీక్షతో కూడిన బహుకాలపు పరిపూర్ణ అంతఃశుద్ధి దీనికి ఆవశ్యకములు. అంతఃశుద్ధిలేనినాడు, సాధకుడు తాను వేయు తొలిఅడుగు మొదలుకొని తననుతాను వంచించుకొన్నవాడే యగును. ఆ కారణముననే పురోగతికై అతడు చేయు ప్రయత్నమంత యూకూడా వ్యర్థమై పోవును.

ప్రాణకోశసహకారము లేనిదే ఏ ఉపలబ్ధియు సాధ్యము కానే రదు. ఏరూపాంతరీకరణమును ఆచరణీయము కానోపదు. కష్టమంతయు ఈసహకారమును నిరంతరముగా సంపాదించుకొనుటయందే కలదు. ప్రాణకోశమునకు మంచి కార్యదక్షతయున్నది, కాని అది తరచుగా తనసంతృప్తినే కాంక్షించుచుండును. పూర్తిగాగాని, ఎంతోకొంతగాని, తనకు సంతృప్తి ఒనగూడక పోయినచో అది చికాకుపడి తిరుగుబాటు చేయును. తత్ఫలితంగా దానిశక్తి చాలావరకు వ్యర్థమైపోయి, ఏహ్యా భావము, నిరుత్సాహము, తిరుగుబాటుప్రవృత్తి, నిస్పృహ, అసంతృప్తి మిగులుట సంభవించును. ఇట్టి సమయములోనే మనస్సును చిక్కబట్టు కొని, కార్యాచరణమునకు దిగకుండుట నేర్చుకొనవలెను. ఏలనంటే, అట్టిసమయములలోనే, అత్యంతఅవివేకపు పనులు చేయుచుండుటయు, క్రమబద్ధమైన కృషితో నెలలతరబడి సాధింపబడిన ప్రయోజనము నిమిషములలో ధ్వంసమై పోవుటయు జరుగుచుండును.

తనయందలి చైత్యపురుషునితో సంబంధము నెలకొల్పుకొని, సాధించవలసిన లక్ష్యమును ఏమరకయుండు చైతన్యమును, ఆకాంక్షను తగినంతగా తమలో ప్రజ్వలింప చేసుకొనుచూ యుండువారిని

ఆసమయములు ఏమంత బాధింపజాలవు. అచిరకాలముననే అవి తొలగి పోవుచుండును.

ఇట్టి చైత్య సహాయముతో వారు, తిరుగుబాటు చేసిన పిల్ల వానితో వ్యవహరించు రీతిగా, ఎంతో ఓపికతో పట్టుదలతో ప్రాణకోశ మునకు సత్యమును చూపి నచ్చజెప్పుచూ, ముసుగు పడియుండిన సద్భావమును దానియందు మేల్కొలుపుటలో కృతకృత్యులు కాగలుగు దురు. ఓరిమితో చేయునట్టి ప్రయత్నముల ఫలితముగనే ప్రతిచిక్కు అవలీలగా విడిపోయి, గమ్యమువైపుగా పురోగతికి మరొకఅడుగు ముందు వేసినట్లుకూడానగును.

ప్రాణికక్రమశిక్షణకు సంబంధించిన ప్రయత్నసందర్భమున పురోగతి కడువిలంబముగనే సాగుచుండవచ్చుగాక. పతనములు కడు తరచుగనే సంభవించుచుండవచ్చుగాక. కాని, ధీరత్వముతో కూడిన సంకల్ప బలమున్నచో సత్యచైతన్య ప్రభాపటలము ముందర కష్టముల న్నియు పటాపంచలైపోయి ఒకనాటికి విజయసిద్ధి కలుగుట నిశ్చయము.

4 శారీరక క్రమశిక్షణ

ఇక, కడపటికి శారీరక క్రమశిక్షణ, సునిర్మలమైన హేతువాద దృష్టితో మన శరీరమును బలిష్ఠము, మృదులము గావించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ భౌతిక ప్రపంచమునందు మనద్వారా అభివ్యక్తము కాగోరుచున్న సత్యధర్మశక్తి విశేషమునకది తగిన ఉపక రణముగా రూపొందవలసియున్నది.

వాస్తవంగా, శరీరమునకుగల కర్తవ్యము అధిశాసించుటగాదు, విధేయతతో మెలగుట. స్వభావములో అది అణుకువతోనూ, విశ్వాస ముతోనూ మెలగు సేవకునివంటిది. అయితే దురదృష్టవశాత్తూ, తన యజమానులగు మనఃప్రాణకోశముల విషయమున వివేకముతో మెలగ గల సామర్థ్యము దానికి తరచుగా మృగ్యము. గ్రుడ్డిగా అది వాటికి విధేయమగుచు, తనశ్రేయస్సుకే భంగపాటు తెచ్చుకొనుచుండును. మనస్సు తనసంకుచిత సిద్ధాంతములతోడను, యదేచ్ఛాకల్పితములగు కఠిన నియమములతోడను, అటులనే ప్రాణకోశము, తన ఉద్వేగములు, విశృంఖలనిరర్థక ప్రవృత్తులతోడను శరీరమునకుగల స్వాభావిక

స్థాయిని చెడగొట్టి దానిని శక్తివిహీనము, రోగగ్రస్తము చేస్తూ ఉంటాయి. ఈ దాస్యంనుండి దానికి విముక్తి కలిగించడము అవసరము. ఇది చైత్యపురుషకేంద్రంతో ఎడతెగని ఏకత్వం ద్వారా తప్ప సాధ్యపడ నేరదు.

శరీరమొక అద్భుతమైన ఉపకరణము. పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకొంటూ మౌనం వహించగలసామర్థ్యం దానికి ఎంతగానో కలదు. మనం సామాన్యంగా ఊహించేదానికంటే ఇంకె న్నెన్ని పనులనో నిర్వహించగల యోగ్యతావిశేషం దానికున్నది. అజ్ఞానంతో నిరంకుశంగా దానిపై పెత్తనం చలాయించే మనః ప్రాణ కోశములకు మారుగా, కేంద్రస్థానీయమగు చైత్యపురుషునిచేత అది పరిపాలించబడడం జరిగితే, ఆశ్చర్యం కలిగించగల కార్యముల నెన్నింటినో అది నిర్వహించగలదు.

ఏలనంటే, అప్పుడది కర్మాచరణమునందు విశ్రాంతిగొనుట యెట్లో నేర్చినదై తాను ప్రయోజనకరముగా తెలిసి వ్యయపరచిన శక్తివిశేషములను విశ్వశక్తులసంపర్కముద్వారా మరల పూరించుకొనగలిగియుండునుగాన, అచంచలత, స్థిరత, బలము నిండారిన స్థాయివిశేషముతో అయ్యది ప్రతిక్షణమూ, తాను నిర్వహించ వలసిన కార్యనిర్వాహణశక్తి పూనిక వహించగల స్థితిలో నుండును. స్థాయి వీడని యిట్టి స్వస్థజీవనమున, శరీరము ఒకానొక వినూత్న సామరస్యమును వెలార్చుకొని, ఊర్ధ్వభూమికల సామరస్యమును తనలో ప్రతిబింబింపజేసికొనుచు, సమ విభక్తాంగములలో ఆదర్శప్రాయమైన రూపసౌందర్యమును సంతరించుకొనును.

నానాటికి అభివృద్ధి గాంచుచుండెడి సామరస్యమిది. ఏలయన, జీవసత్త యథార్థమెప్పుడునూ అచలముగా స్తంభించుకొనియుండునది గాదు. అయ్యది నిరంతరముగా వికాసము చెందుచు, అంతకంతకు పూర్ణతరఫలసిద్ధిని సంతరించుకొనుచుండును. అభివృద్ధిపూర్వకమైన ఈ సామరస్యమును శరీరము అనువర్తింప నేర్చుకొలది నిరంతర రూపాంతరీకరణము ద్వారమున నయ్యది విచ్ఛిత్తిని వినాశమును పొందవలసిన ఆవశ్యకతనుండి విముక్తిగాంచుట సాధ్యమగును. మృత్యుధర్మమనివార్యము కావలసిన ఆగత్యము తొలగును.

సత్యచతుష్టయము

ఈ సంసిద్ధి లక్ష్యమును మనము చేరుకోగలిగినప్పుడు దివ్య ప్రేమ, దివ్యజ్ఞానము, దివ్యశక్తి, దివ్యసౌందర్యము అనెడి నాల్గు ముఖ్య రూపములు మనము అన్వేషించు సత్యమునకు గలవని తెలియనేర్తుము. ఈ సత్యచతుష్టయము మనజీవసత్తయందంతటనూ స్వచ్ఛందముగా అభివ్యక్తమగును. చైత్యపురుషస్థానము యథార్థమైన విశుద్ధప్రేమకు వాహకము కాగా, మనస్సు అమోఘజ్ఞాన ప్రసారమునకు వాహకమ గును. ప్రాణకోశము అజేయశక్తిని అభివ్యక్తము చేయునదికాగా, శరీరము పరిపూర్ణసౌందర్య సామరస్యములను అభివ్యక్తమొనర్చునదై విరాజిల్లును.

మూలం: శ్రీమాత

అనువాదకులు: కొంగర భాస్కరరావు, పి.యస్. శంకరరెడ్డి

మామూలు జీవితము — నీ నిజ స్వరూపము

మామూలు జీవితము ఒక కోరికలవలయము. ప్రలోభములకు నిలయం. నువ్వు వీటితో సతమతమవుతున్నంతవరకు నువ్వే మాత్రం అభివృద్ధి జెందలేవు. ఈ సుడిగుండంలోనుండి తప్పించుకుండే మార్గ మును అన్వేషించాలి. మామూలుగా మనుషులందరు ఎప్పుడూ దేన్ని గురించి ఆలోచిస్తూంటారు? తినేందుకు ఏం దొరుకుతుంది? ఎప్పుడు దొరుకుతుంది? తగినంత దొరుకుతుందా దొరకదా అనే ఆలోచిస్తూం టారు. ఈ తిండిమీద వ్యామోహాన్ని జయించి, ఉదాసీనతను అలవాటు చేసుకుంటే చాలా బాగుంటుంది. ఆహారము దొరికితే తింటావు. దొర క్కపోతే దాన్ని గురించి చింతించవు. అంటే నువ్వు నిరంతరం తిండిని గురించే ఆలోచిస్తూ వుండకూడదు. ఇంకో మాట — "నాకు తిండి వద్దు" అని కూడా అనుకోకూడదు. సన్యాసులల్లే అసలు ఆహారమే

తినకుండా ఎలా ఉండాలో అని భీష్మించుకోవటంకూడా పనికిరాదు. తిండిని గురించే కలవరిస్తూ ఉవ్విళ్ళూరుతూ వుండటం ఎంత హేయమో, అది కూడా అంత హేయమే. దాన్ని గురించి అసలు పట్టించనే పట్టించుకోకూడదు. అంటే ఆహారమును గురించిన ఊహని నీ తలలోనుంచి పూర్తిగా బహిష్కరించాలి. దానికి లేశమైనా చోటు ఇవ్వకూడదు!

దీనికి పరిష్కారము ఒక్కటే. నీ అంతరంగంలో ఉన్న చైత్య పురుషస్పర్శను పొందినట్లయితే అది చాలాతేలిక. ఈ చైత్యపురుషుడే నీ అంతరంగంలోని నిజమైనఅంతరాత్మ. అప్పుడు ఈ అత్యాశాపూర్వకమైన కోర్కెలు చాలా అల్పంగా గోచరిస్తాయి. మనకు కావలసింది దివ్యత్వాన్ని సాధించడమేనని తెలుస్తుంది. చైత్యపురుషునిలో జీవించాలంటే అత్యాశాపూరితమైన కోరికలను విడనాడాలి. నీవు అత్యాశ, అనవసరంగా వ్యధచెందడం, ఎలాగైనా కోరికలను తీర్చుకోవాలనే తహతహని విడనాడాలి. ఏది జరిగినా అది మన మంచికేనని తెలుసుకోవాలి. అందుకని, జరిగిందంతా మన మంచికేననుకోవడం అన్నిసందర్భాలలోను అటులనే అన్వయించుకోవడం మోసమే అవుతుంది. నీవు సామాన్య చేతనలోనున్నంతవరకూ, సర్వమూ మన మంచికేఅనుకోవడం పొరపాటు. సచేతనలో లేనప్పుడు, నీవు తప్పుదార్లు తొక్కే అవకాశమే ఎక్కువ. చైత్యపురుషునితో సంబంధమేర్పరచుకొని, దైవానికి సర్వసమర్పణ చేసుకొన్నపిదపే జరిగేదంతా మన మంచికి జరుగుతుంది. ప్రత్యంశమూ, అది ఎంత ముసుగులోనున్నప్పటికీ, దైవసంస్పర్శతో సవ్యంగా సజావుగానే జరిగిపోతుంది.

నిక్కమైన ఆత్మసమర్పణకు వెంటనే పురస్కారం లభిస్తుంది. దీనివల్ల అనితరసాధ్యమైన దృఢమైనవిశ్వాసము, ఓ అనిర్వచనీయమైన ఆనందము "భయం నాస్తి" అనే నమ్మకమూ కలుగుతాయి; ఇది చైత్య పురుషునిలో స్థిరంగా పాదుకొనేంతవరకూ, అనేకములగు అలజడులు, మధ్యమధ్యలో దివ్యకాంతులతోపాటు దివ్యచీకటులుకూడా కల్గుతుంటాయి. అయితే చైత్యపురుషుడు మాత్రం అవిచ్ఛిన్నంగా పురోగామియై ఋజుమార్గాన అభ్యున్నతి వైపుకు పయనిస్తూంటాడు. అప్పుడు యితరములగు కదలికలన్ని విచ్ఛిన్నములై ఆగిపోతయి. "నేనే ఈ చైత్యపురు

షణ్ని" అనే భావం నీకు కలిగేంతవరకు నీవు ఒక వ్యక్తివి కూడా కావు — ఎందుకంటే అదియే నీ నిజస్వరూపము. నీకు దానిస్ఫూర్తి కలిగేంతవరకు నీవు ఒక మనిషివి కావు — బహిరంగప్రదేశము — public place. ఎందుకంటే నీలో వివిధశక్తులు పరస్పరఘర్షణ చెందుతూ ఉంటాయి. ఆయుద్ధానికి నీశరీరం ఒక ఆటపట్టు! ఆధ్యాత్మికంగా నీవు పురోగమించాలంటే నీలోని చైత్యపురుషుణ్ని కలుసుకోవాలి. ఎందు కంటే ఆయన ఎప్పుడూ దైవముతో తాదాత్మ్యం చెందుతూనే ఉంటాడు. అప్పుడే రూపాంతరీకరణం సాధ్యమవుతుంది. నీలోని ఇతరావయవ ములు — మనోప్రాణికదైహికములు ఎద్దుమొద్దుస్వరూపాలు, అజ్ఞాన భూయిష్టాలు. ఉదా: మనస్సు తనకుతానే చాలా తెలివైనదనుకుం టుంది. తనకు కలిగే ఆలోచనలన్నీ చాలా అద్భుతమైనవని భ్రమపడు తుంది. దేవునికిరుప్రక్కల సమానంగా వాదించగలదు. అసలైన సత్య మేమిటో దానికి తెలియదు. ఇక నీ ప్రాణికము సంగతి. ఎవరైనా కాస్త మహిమలు చూపిస్తేచాలు వాళ్ళనందలం ఎక్కించేస్తుంది. ఒక్క చైత్య పురుషునికే నిజమైన విచక్షణాశక్తి గలదు. దేవుడెవరో దయ్యమెవరో నిర్ద్వంద్వంగా తెలుసుకోగలడు. ఒక్క క్షణమైనా నీకు దాని గాలి సోకిందో, దైవమంటే నీకింక ఎవరూ చెప్పనక్కర్లేదు.

అయితే నీఆత్మను గురించి తెలుసుకోటం, ఈ మహిమాత్మక మైన చైతన్యానుభూతిని పొందుటెట్లు? నువ్వు దానిని కోరు, ఆకాం క్షించు. "ఇదేనాకుకావాలి అన్యమేమివద్దు" అని తపించు. ఇక్కడ మీలో చాలామంది దానిచే ప్రభావితమై యున్నారు. కాని అది చాలదు. అంతమాత్రాన సరిపోదు. మీరు దాంతో తాదాత్మ్యం చెందాలి. పూర్ణత సాధించాలనే ప్రేరణ దానివలననే కలుగుతుంది. అన్నీ సర్వాంగంగా తీర్చిదిద్ది పరిపుష్టంచేయాలనే అభిలాషకి మూలమదియే. కాని యీసం గతి ఎవ్వరికీ తెలియదు. అందుకని మీరు దాంతో ఉద్దేశపూర్వకంగా సహకరించడంలేదు. ఎందుకంటే మీరు దానివెలుగును గుర్తించడం లేదు. చైత్యపురుషుడంటే మీలోని భావోద్రేకం కాదు. భావోద్రేకాలు ఉచ్ఛప్రాణికానికి (Higher vital) చెందినవి. స్వచ్ఛమైనచైత్యపురుషునికి చెందినవిగావు. చైత్యపురుషుడు సదా దివ్వెవలె నీలో వెలుగుతూ దివ్య త్వంవైపుకు ఎగబ్రాకుతూంటాడు. ఈపురోగమనంలో అడ్డుపడే వ్యతి

రేక శక్తులను నాశనం చేసే శక్తిని సంపాదిస్తాడు. దీన్ని నీవు గుర్తించ గల్గినపుడు దివ్యసత్యానుభూతిని పొందగలవు — ఆ స్థితిలో యావత్ప్ర పంచమంతా అజ్ఞానంతో తల్లక్రిందులుగా నడుస్తున్నట్లు అనుభూతిని ("తల క్రింద, కాళ్ళు గాలిలోకి") పొందకుండా వుండలేవు!

నీవు నీవ్యక్త్యాత్మను చైత్యపురుషనితో ఏకం చేసేది నేర్చు కోవాలి. ప్రస్తుతం నీవ్యక్తిత్వము ఒకమిశ్రమం. అది క్రమానుగతపరి ణామంలో వచ్చిన మార్పులను కలుపుకొని ఒకానొక యెడతెగని కొన సాగింపుతత్వాన్ని అలవరచుకొంటుంది. ఈమిశ్రమతత్వంలోనే మాన సికప్రకంపనలచే సమత లేక ఏకత గోచరిస్తుంది. ఇది ప్రవహించే నదీ ప్రవాహంలా ఎప్పటికప్పుడు నిత్యనూతనంగానున్ననూ, దానికి సంబంధించిన ప్రత్యేక స్థిరత్వముంటుంది. సాధారణంగా నీఆత్మ నీవ్యక్తిత్వం యొక్క ఛాయమాత్రమే. దీనిస్వభావంలో వైవిధ్యముంది, మానసికంలో ఒక రకంగాను, ప్రాణికంలో వేరుగాను, భౌతికంలో మరోవిధంగాను వుంటుంది. కాని ఒకసారి చైత్యపురుషనితో సంబం ధాన్ని ఏర్పరచుకొంటే, దానికి తన ఆత్మనిజస్వరూపం ఎరుకవు తుంది. ఆ ఏకత్వంలో, దివ్యత్వంవైపు శాశ్వతంగా పురోగమించుటలో ఏదీకూడా ఇక నిన్ను ఆపలేదు. అలజడినిగూడ కలిగించలేదు. నీకు అల్పవస్తువులపై వ్యామోహంగాని, ఆహారంపై పేరాశగాని ఉండదు.

మూలం:శ్రీమాత

అనువాదం: యెల్. వేణుగోపాల్

విమలమైన విశ్వాసము చింతలేని దరహాసం

మనకు ముఖ్యంగా కావలసింది, పసిపాపలకుండే నిష్కపటమైన మనస్సు, విశ్వాసం. చిన్నారి పాపలు వాళ్ళకేదైనా కావలసివస్తే అది తప్పక వస్తుందని నమ్ముతారు. దానికోసం వాళ్ళడగక్కర్లేదు కూడా. అది రాగలదనే వారి దృఢవిశ్వాసం. మనకి కూడా అటువంటి గట్టి నమ్మకమే ఉంటే ఇంకేం కావాలి?

ఆకాంక్ష తప్పకుండా ఉండితీరాల్సిందే. అయితే కొంతమంది అంతర్మథనంతో, నమ్మక అపనమ్మకాల మధ్య, విశ్వాస అవిశ్వాసాల మధ్య జయము తథ్యమనే ఆశావాదానికి ఎప్పుడు మహా విపత్తు సంభవిస్తుందో అనే నిరాశావాదానికి మధ్య ఊగిసలాడుతూంటారు. ఇవన్నీ నీలో ఉన్నచో నీవు ఆకాంక్షిచవచ్చుగాని నీకాంక్ష సిద్ధించదు. "నేను ఆకాంక్షిచానుగదా, నాకేమి లభించలేదే" అని నువ్వనుకుంటావు. అలా ఎందుకు జరుగుతుందంటే, నీవు సదా నీ అపనమ్మకంతో, నీలోని ఆకాంక్షను నిర్మూలిస్తావు గనుక అయితే నీకు నిజంగా నమ్మకంగా ఉంటే... పెద్దలచే వికృతం చేయబడకుండా, పిల్లలను స్వేచ్ఛగా వదలివేస్తే, వారికి ప్రతీదీ సవ్యంగా జరుగుతుందనే విశ్వాసముంటుంది. ఉదాహరణకు — పిల్లలకేదైనా చిన్న ఆపద సంభవిస్తే అది ఉపద్రవంగా మారుతుందని వారెప్పుడు అనుకోరు. అప్రయత్నంగా, దానంతటదే తొందరగా సర్దుకుంటుందిలే అని వారు నమ్ముతారు. ఈ నమ్మకమే, ఈ అమాయకమైన విశ్వాసమే వాళ్ళని వెంటనే నయం చేస్తుంది. ప్రబలంగా సహాయపడుతుంది.

అయితే నీవు ఎప్పుడైనా, శ్రీమాత శక్తిపాతం కోసం ఆకాంక్షించి, దైవసహాయం కోరినచో అది వస్తుందని అచంచల నిశ్చయంతో అడిగినచో, అసాధ్యమైనది, రాదుఅని అనుకొన్నది కూడా తప్పక వస్తుంది. ఈ విధమైన నమ్మకం, ఈ విశ్వాసం ఉండటం నిజంగా అంతరంగికమైన ఉన్మీలనమే (Inner opening). కొంతమంది నిరంతరం ఇదే స్థితిలో కొనసాగుతుంటారు. ఎప్పుడైనా ఏదైనా గ్రహించవలసియుంటే, దానిలబ్ధి పొందడానికి వారెల్లప్పుడు సన్నద్ధులై ఉంటారు. మరికొంతమందున్నారే, ఏదైనా పొందవలసి ఉంటే, లేక ఒక శక్తి దిగి

వస్తే, దానిని అందుకోనడానికి వారక్కడ ససేమిరా ఉండరు! ఆ క్షణంలో వారు అంతరంగికంగా పూర్తిగా మూసుకొని ఉంటారు. కాని పసిపాపలవంటి నమ్మకమున్నవారు, శక్తి ఎప్పుడు దిగి వస్తే అప్పుడు దాని కోసం తయారుగానే ఉంటారు.

ఇది చాలా చిత్రం కాదూ! బాహ్యంగా ఎట్టి విభేదమూలేదు. వారిరువురిలో కచ్చితంగా, ఒకే రకమైన సద్భావన, ఒకే రకమైన ఆకాంక్ష, మంచి చేయాలనేతపన ఉంటాయి. అయితే వారిరువురిలో చిరునవ్వులొలికే విశ్వాసం కలిగినవారు మట్టుకు దేనినీ ప్రశ్నించరు. అది తమకు లభిస్తుందా లేదా అని ఆలోచించరు. భగవంతుడు తమకు జవాబిస్తాడా లేడాయని మథనపడరు. అసలు వారికి ఆ ప్రశ్నే ఉదయించదు. అది అప్రయత్నంగా, స్వాభావికంగా అయితీరుతుందన్న మాట. "నాకేమి కావలెనో అది యివ్వబడుతుంది. నేను ప్రార్థిస్తే నాకు జవాబు దొరుకుతుంది. నేను కష్టంలో ఉండి సహాయం కోరితే, సహాయం లభిస్తుంది. దైవసహాయం రావడమే కాకుండా, అదే అన్నిటిని నిర్వహిస్తుంది. అప్రయత్నంగా, నిష్కపటంగా, ప్రశ్నింపబడని నమ్మకమే ఉన్నట్లయితే, అది అన్నిటికన్నా మిన్నగా పనిచేస్తుంది. దానిఫలితం అద్భుతం. కాని కొంతమంది మనసులోని వైరుధ్యాలతోను, అనుమానాలతోను దానిని నిర్మూలిస్తారు. ఉదా॰ కష్టాలు వచ్చినప్పుడు, ఇటువంటి ఆలోచనలతో "బాబోయ్! ఏందారి నేను దాన్ని భరించలేను. ఇదేపరిస్థితి ఇంకా విషమించి, ఈలాగే ఇంకా, ఇంకా దిగజారుతూ పోతే, పోతే, పోతే?" వారికి, దైవశక్తికి మధ్య ఓ గోడను నిర్మించుకొంటారు. చైత్యపురుషునికి ఈవిశ్వాసం అద్భుతంగా, ఛాయారహితంగా, తర్కరహితంగా, వివాదరహితంగా ఉంటుంది. అప్పుడు జవాబు పొందనిప్రార్థనగాని ఫలించని ఆకాంక్షగాని ఉండదు.

మూలం: శ్రీమాత

అనువాదం: పుల్లారెడ్డి

అనుక్షణం మనం ముందుగా ఊహించలేనిది, ఎదురుచూడలేనిది, మన ఎఱుకలో లేనిదంతా మన ఎదుట సాక్షాత్కారమౌతూండగా, మనకి సంభవించేది మట్టుకు మన విశ్వాసప్రగాఢతమీద, పవిత్ర ప్రమాణంమీద ఆధారపడి వుంటుంది.

రూపాంతరీకరణము — మూడు అంతరంగిక ప్రక్రియలు

జీవితము యొక్క అసలు లక్ష్యము ఇది; అభివృద్ధి. అయితే వృద్ధిచెందవలసినది సిరిసంపదలు కాదు — నీలోని దైవము: నీ మనస్సు జీవితము, శరీరములద్వారా స్వాధీన పరచుకొనుట — దేనిని? సృష్టిజాలమునందు నిక్షిప్తమైయున్న దైవమును దైవమే స్వాధీనపరచు కొనుట — అంతేకాని వస్తువులను (అహంకార దృష్టితో) కాదు. సుఖ పడుట — అనగా సృష్టిలోని దివ్యానందమును అనుభవించుట. సమ రము, విజయము, సామ్రాజ్యము — సృష్టియొక్క బహిరాంతరంగము లను వశపరచుకొని, అజ్ఞానాంధకారములపై జ్ఞాన, ప్రేమ, దైవేచ్ఛల ఆధిపత్యమును సాధించి విజయ పతాకమును ఎగురవేయుట.

యోగము యొక్క లక్ష్యము జీవితమును హేతువాద బద్ధము చేయుట కాదు — అతిమానసీకరణము గావించుట. బాహ్యాగతులను, ఉపరిగత మనోవైకల్యములను మెరుగుపరచుట దాని ప్రధానోద్దేశము కాదు. తదంతర్గతమైన దైవప్రాతిపదికపై జీవితమును పునర్నిర్మించుట. ఎందుకనగా ఈ విధమైన పునర్నిర్మాణము జరిగినప్పుడే ఇప్పుడున్న మాయదారి మారువేషము బదులు, మనపై గుప్తముగావున్న దివ్యశక్తి యొక్క పరిపాలనము, దైవము యొక్క నిజాభివ్యక్తిగా రూపాంతరీకర ణము సాధ్యమవుతాయి. జీవితాన్ని నేటి విషమ పరిస్థితినుంచి రక్షించా ల్నంటే, మనస్సు, తర్క వాదనలతో పైపై రంగులు మార్చటం వలన గాక చైతన్యము యొక్క మౌళికమయిన ఆధ్యాత్మిక మార్పువలననే.

దుఃఖమయమై అయోమయ పరిస్థితులలో సతమతమౌతున్న వర్తమాన జీవనం మనస్సు తన తార్కిక బుద్ధితో జేయు పైపై మార్పుల సహాయంతో కల్పించు చేతన సమస్తమూ మౌళిక పరివర్తనం జెందిన పుడే వినూత్న జీవనంగా సృష్టింపబడుతుంది. క్లిష్ట స్థితిలో యున్న అజ్ఞాన జీవనం ప్రకాశవంతంగా సామరస్యంగా పరివర్తన జెందడమే పూర్ణయోగం ప్రతిపాదించు మార్పు. అంతర్భూత కేంద్ర నిలయమై విప్ల వాత్మక పరివర్తనం సాధించుటకు మూడు అత్యావశ్యక నియమాలు పాటించవలసియుంటుంది. ఏ ఒక్క నియమమూ వేర్వేరుగా కాక మూడు

నియమాలనూ ఏకీకృతంగా ఆచరించినపుడే మూడింతల సమర్థవంతంగా జగదోద్దీపనం ఫలిస్తుంది. సంపూర్ణ పరావలంబనం సిద్ధిస్తుంది. ప్రస్తుతం బాహ్యా జీవనానికి ప్రధానంగా కోరికే స్ఫూర్తిని ప్రసాదిస్తోంది. ఆ కోరికలు మనలో తమ కేంద్ర నిలయంగా ఒక కామమయపురుషని నిర్మించి జీవనసంగ్రహాలన్నింటిని ఆ పురుషనికి నివేదిస్తూ మన యందు తమ (కోరికల) క్లేశమయ వర్ణాలను సగం చీకటి సగం వెలుగులతోను అజ్ఞానంతోను నింపుతున్నాయి. దేవతుల్యమైన జీవనం సాకారమవడానికి కోరికను సమూలంగా నిర్మూలించి, ఆ స్థానంలో సుస్థిరమైన సంకల్ప శక్తిని ప్రతిష్టించాలి. దుర్భర కామమయ పురుషని పూర్తిగా విలీనంకావించి మనలో తెరల వెనుక దాగియున్న సత్యా-సంతోషాలతో నిండిన ప్రాణమయ పురుషని ప్రతిష్టించాలి.

ప్రస్తుతం నడుస్తున్న జీవన ప్రవాహం ప్రాణమయ ప్రవృత్తుల ఒత్తిడివలననూ, మరింత వెలుగులో సంచరించలేక అజ్ఞానంతో నిండిన జీవకామనలకు బానిసగానూ, అసమర్ధమంతమైన ఉపదేశకుడుగా సంచరిస్తున్న మనస్సు చేతనూ సాగుతున్నది.

దివ్యజీవనం సాధ్యపడుటకు మనోమయ ప్రాణమయ ప్రేరిత ఆకస్మిక ప్రవృత్తులు అంతర్ హృదయ స్థిత చైత్యపురుషని అధీనంలో ఉపకరణాలుగా మాత్రమే సంచరించాలి — లేదా సమూలంగా సమసిపోవాలి.

ఆ చైత్య పురుషడు మనోప్రాణ ప్రేరణల స్థానంలో యోగపథదర్శకునిగా దివ్య ఉపదేశకునిగా కార్యనిర్వహణ కావించాలి. చివరగా — జీవితం తనకు తానై విడిగా వర్తించు అహంకార సంతృప్తికోసమే పయనిస్తోంది, అహంకారతత్వం పూర్తిగా లయమై ఆ స్థానంలో యదార్థమైన ఆధ్యాత్మిక పురుషని, అంటే, ఒక కేంద్ర సద్వ్యవస్థాపకుని ప్రతిష్టించాలి. సమస్త జీవనం దివ్య సంకల్పసిద్ధి కోసమే సమర్పింపబడి, జీవనశక్తియందు నిబిడీకృతమైన భగవచ్ఛక్తి యునికికి జాగృతమై విధేయమైన ఉపకరణీయంగా పరివర్తనం జెందాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: టి. మాధవరావు.

నియమాలనూ ఏకీకృతంగా ఆచరించినపుడే మూడింతల సమర్థవంతంగా జగదోద్దీపనం ఫలిస్తుంది. సంపూర్ణ పరావలంబనం సిద్ధిస్తుంది. ప్రస్తుతం బాహ్య జీవనానికి ప్రధానంగా కోరికే స్ఫూర్తిని ప్రసాదిస్తోంది. ఆ కోరికలు మనలో తమ కేంద్ర నిలయంగా ఒక కామమయపురుషని నిర్మించి జీవనసంగ్రహాలన్నింటిని ఆ పురుషనికి నివేదిస్తూ మనయందు తమ (కోరికల) క్లేశమయ వర్ణాలను సగం చీకటి సగం వెలుగులతోను అజ్ఞానంతోను నింపుతున్నాయి. దేవతుల్యమైన జీవనం సాకారమవడానికి కోరికను సమూలంగా నిర్మూలించి, ఆ స్థానంలో సుస్థిరమైన సంకల్ప శక్తిని ప్రతిష్టించాలి. దుర్భర కామమయ పురుషని పూర్తిగా విలీనంకావించి మనలో తెరల వెనుక దాగియున్న సత్య-సంతోషాలతో నిండిన ప్రాణమయ పురుషని ప్రతిష్టించాలి.

ప్రస్తుతం నడుస్తున్న జీవన ప్రవాహం ప్రాణమయ ప్రవృత్తుల ఒత్తిడివలననూ, మరింత వెలుగులో సంచరించలేక అజ్ఞానంతో నిండిన జీవకామనలకు బానిసగానూ, అసమర్ధమంతమైన ఉపదేశకుడుగా సంచరిస్తున్న మనస్సు చేతనూ సాగుతున్నది.

దివ్యజీవనం సాధ్యపడుటకు మనోమయ ప్రాణమయ ప్రేరిత ఆకస్మిక ప్రవృత్తులు అంతర్ హృదయ స్థిత చైత్యపురుషని అధీనంలో ఉపకరణాలుగా మాత్రమే సంచరించాలి — లేదా సమూలంగా సమసిపోవాలి.

ఆ చైత్య పురుషడు మనోప్రాణ ప్రేరణల స్థానంలో యోగపథ దర్శకునిగా దివ్య ఉపదేశకునిగా కార్యనిర్వహణ కావించాలి. చివరగా — జీవితం తనకు తానై విడిగా వర్తించు అహంకార సంతృప్తికోసమే పయనిస్తోంది, అహంకారతత్వం పూర్తిగా లయమై ఆ స్థానంలో యదార్థమైన ఆధ్యాత్మిక పురుషని, అంటే, ఒక కేంద్ర సద్యవస్థాపకుని ప్రతిష్టించాలి. సమస్త జీవనం దివ్య సంకల్పసిద్ధి కోసమే సమర్పింపబడి, జీవనశక్తియందు నిబిడీకృతమైన భగవచ్ఛక్తి యునికికి జాగృతమై విధేయమైన ఉపకరణీయంగా పరివర్తనం జెందాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: టి. మాధవరావు.

జనసామాన్యములో యోగోద్దీపనము

శాశ్వతము, రహస్యము అయిన అస్తిత్వము పరిణామ ప్రక్రియ ద్వారా లేక క్రమానుగత స్వీయాభి వ్యక్తికై ధరించిన రూపమే ప్రకృతి. అది క్రమారోహణ పరంపరద్వారా మూడు సోపానములలో మూడు రూపములను తాలుస్తుంది. మన జీవితము పరస్పరాధారములైన ఈ మూడు స్థాయిలలోను నడుస్తుంది — శరీరము, మనస్సు, ఆచ్ఛాదితమైన ఆత్మ. ఈ ఆత్మ అంతర్లయనమునందు (Involution) శరీర, మానసికములకు హేతువు; పరిణామమునందు వాటి పర్యవసానము.

ఎందుకంటే ప్రకృతి యొక్క పూర్ణపరివర్తనమునకు సమర్థవంతమైన ఏకైకజీవియు, పార్థివప్రకృతికి మకుటము అయిన మానవుని ది త్రిజన్మము. అతనికి ఒక సజీవమైన పంజరము ఇవ్వబడినది. అందులో శరీరము ఒక పాత్ర. జీవితము దివ్యాభివ్యక్తికి సాధనము. మనస్సు అతని కార్యకలాపములకు కేంద్రము. ఈ మనస్సు తనని, తను నివసిస్తున్న శరీరాన్ని, తను ఉపయోగించుకుంటున్న జీవన సరళిని దివ్యంగా రూపొందించుకుంటుంది. తను క్రమక్రమంగా సిద్ధులను పొందుతూ, జాగృతమై తన నిజ స్వరూపమైన దైవాంశయే అని తెలుసుకుంటుంది.


ఇది మానవులలో దైవశక్తి యొక్క ప్రణాళిక అయినందున, మన అస్తిత్వపు మార్గం సర్వం, లక్ష్యం సత్తలోని ఈ మూడు మూలకాల సమ్మేళనం ద్వారా పనిచేయాలి. ప్రకృతిలో వాటి ప్రత్యేక రూపాంతరీకరణ ఫలితంగా మానవునికి మూడు విధాలైన జీవితాలలో దేనినైనా ఎన్నుకొను అవకాశ ద్వారం తెరువబడింది. సాధారణ భౌతిక అస్తిత్వం, మానసిక కార్యాచరణ, అభివృద్ధి, మార్పులేని ఆధ్యాత్మిక పరమానందం. అయితే అతడు తన పురోగమనంలో ఈ మూడింటిని సమ్మిళితం చేయవచ్చు, వాటి విభేదాలను ఒక సామరస్యపు లయగా శ్రుతి చేయవచ్చు. దాని ద్వారా తనలో సంపూర్ణమైన దైవత్వాన్ని, పరిపూర్ణ మానవుణ్ణి సృష్టించవచ్చు.

ఆత్మ విశ్వ సృష్టికి మకుటము. పదార్థము దాని ప్రాతిపదిక ఈ రెండింటికి మధ్యవర్తి మనస్సు. ఆత్మ శాశ్వతము. మనస్సు, పదా

ర్థము దాని వృత్తులు. తెర వెనక అదృశ్యముగా నుండి బహిరావిష్కృతము గావలసినది ఆత్మ. మనస్సు, శరీరము ఇందుకు సాధనములు. ఆత్మ యోగాధ్యక్షుని ప్రతిబింబము. మనస్సు, శరీరము ఆ ప్రతిబింబమును ప్రత్యక్షపరచుటకై ఆయన సమకూర్చిన సాధనములు. సమస్తమైన ప్రకృతి ఆ నిక్షిప్త సత్యమును క్రమక్రమముగా బాహ్యమున వ్యక్తీకరించుటకు, అంతకంతకు ఆ దివ్యరూపమును బాహ్య ప్రపంచములో ప్రత్యక్షీకరించుటకు చేయు ప్రయత్నము. మానవాళిలో యోగాన్ని సర్వవ్యాప్తం చేయుట ప్రకృతి తాను చేసిన ఆలస్యాలకు, ప్రచ్ఛన్నతలకు పైగా సాధించవలసిన ఆఖరు విజయంగా వుండాలి. ఇప్పుడు కూడా విజ్ఞానంలో పురోగమించు మనస్సుతో ఆమె మానసిక జీవితపు పూర్ణాభివృద్ధికై సర్వమానవాళిని సమర్ధవంతం చేయుటకై ఆకాంక్షించుచున్నది. కావున యోగంతో ఆమె తప్పని సరిగా ఉన్నత పరిణామానికై, రెండవ జన్మకై, ఆధ్యాత్మిక అస్తిత్వానికై సర్వమానవాళిని సంసిద్ధం చేయుటకై యత్నించవలెను. మానసిక జీవితం పదార్థాన్ని ఉపయోగించి సంపూర్ణం చేయునట్లు, దైవ స్వీయ ప్రకటన యొక్క సాధనాలుగా పదార్థం మరియు మానసిక అస్తిత్వాలను, ఆధ్యాత్మిక జీవితాన్ని ఉపయోగించి పరిపూర్ణం చేయగలదు. అది సాధింపబడిన యుగాలు పౌరాణిక సత్య లేక కృతయుగాలు, సంకేతంలో సత్యం అభివ్యక్తమైన యుగాలు. ఆ మహా కార్యాన్ని నిర్వర్తించి మానవుల లోని ప్రకృతి జ్యోతిర్మయమై, సంతృప్తినంది పరమానందంతో తన కృషి సఫలమై విశ్రమించగలదు.

ఆమె అర్థాన్ని గ్రహించవలసినది మానవుడు. ఇకపై అతడు జగన్మాతను అపార్థం చేసుకొనక, నిందించక, దురుపయోగం చేయక ఆమె అతి బలోపేత సాధనాలతో ఆమె మహోన్నత ఆదర్శానికై సదా ఆకాంక్షించవలెను.

మూలం:శ్రీఅరవిందులు
అనువాదం: ఎన్. అప్పాస్వామి



The Two who are one are the secret of all power,
The Two who are one are the might and right in things.

Savitri — Sri Aurobindo

1999

bonne année

blessings

సమాచార పత్రం

క్రొత్తసంవత్సరానికి 1999 ఆశ్రమంలో ప్రాతః కాలము ధ్యానంతో స్వాగతం పలికారు. ఆశ్రమంలో పంచిపెట్టిన బొన్ఆనీ కార్డును ప్రక్క పేజీలో చూడండి.

1998 నవంబరు, డిశంబరులలో సొసైటీ బీచ్ ఆఫీసులో మూడు కార్య క్రమాలు నిర్వహించారు: (1) నవంబరు 21-23 తేదీలలో దైవానికి దారి అనే విషయంపై సొసైటీ స్త్రీల విభాగంవారు ఒకగోష్ఠి నిర్వహించారు. అందులో పాల్గొన్న చాలా మంది దైవము యొక్క పిలుపు ప్రత్యేకత పొందారు. ఈ మూడురోజుల కార్యక్రమాలు దైవచింతనాలు వాళ్లల్లో విస్పష్టమయినట్లు గ్రహించారు. (2) 17-20 తేదీలలో పిల్లలకార్నర్ నిర్వాహాతుల శిబిరాన్ని నిర్వహించారు. (3) 22.12.98 నుండి 2.1.99 వరకు సొసైటీ యువవిభాగమువారు జాతీయ సమైక్యతకై ఆలిండియా యూత్కేంప్ను నిర్వహించారు.

శ్రీ ప్రదీప్ నారంగ్, జనరల్ సెక్రటరీ, సొసైటీ లండన్ కేంద్రములో 17 నవంబరు 1998న సామూహిక ఇన్వొకేషన్లో పాల్గొన్నారు. 15 నవం బరు 98 న అరోమీరా కేంద్రంలో జరిగిన గెట్టుగెదర్లో కూడా పాల్గొన్నారు.

ప్రకటనలు

సొసైటివారు జనవరి 1999 నుంచి తెలుగులోను, ఫిభ్రవరి 1999 నుంచి తమిళంలోను ఆలిండియా మేగజైన్ను ప్రచురించనున్నారు. గుజరాతీ, మరాఠీ, బెంగాలీ, కన్నడంలో ఇంతకు ముందే ప్రచురించబడుతున్నవి.

డా. మంగేష్ నడ్కర్ణి 23.2.99 నుంచి 5.3.99 వరకు సావిత్రి అధ్యయన తరగతులను ఆంగ్లములో సొసైటీ బీచ్ఆఫీసులో నిర్వహించెదరు.

సొసైటీ బీచ్ ఆఫీస్ హాలులో ఎడ్యుకేషన్ క్యాంపు, ఉపాధ్యాయుల శిక్షణా శిబిరము మే 1999 లో నిర్వహిస్తారు. వివరాలకొరకు ఈ చిరు

నామాకు వ్రాయండి. The co-ordinator, Education camp, Sri Aurobindo Society, Pondicherry - 605002.

ఆలిండియా మేగజైన్ జనవరి, ఫిబ్రవరి సంచికలు బుక్‌లెట్ (ఇంగ్లీష్) రూపంలో SABDA, Sri Aurobindo Ashram, Pondicherry - 605002 (తపాలా చార్జీలు అదనము) లో దొరకుతాయి.


శ్రీఅరవిందో సొసైటీ నాల్గవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు 1999 మార్చి 13, 14 తేదీలలో హైదరాబాదు సొసైటీలో జరుగనున్నవని తెలియజేయుచూ, సర్వులను పాల్గొన ఆహ్వానించుచున్నాము.



Offering of the first issue of Telugu AKHILA, Akhila Bharata Patrica on 1.11.98 to Sri Aurobindo and The Mother.

అఖిల

అఖిల భారత పత్రిక, ఏప్రిల్ 1999



ప్రాణికము

(ప్రాణశక్తి, ప్రాణము)

నిన్ను నీవు తెలుసుకో — I

నిన్ను నీవు తెలుసుకో – I

ఉపోద్ఘాతము

మనిషికి తను ఎవరో తెలియదు. తన నిజ స్వరూపమేమిటో తెలియదు. తన అహంకారపు పై పొర మాత్రమే తెలుసు. అయితే ఈ మబ్బుతెరను ఛేదించి దాని క్రిందకు చొచ్చుకొనిపోయి, తన నిజ రూపం కోసం అన్వేషించవలసిన ఘడియ రాక తప్పదు. అటుల చేయ నియడల ప్రకృతి పాఠశాలలో తన శిక్షణ ఓ,న,మాలతోటే సరి అన మాట. ప్రకృతి యొక్క లోతుపాతులు, విస్తృత పాఠములు అతనికి మృగ్యములు. మానవుడు బాహ్యజీవితంలో ఎంత నాగరికతను సంత రించుకున్నను, అతని స్థాయి, అడవిజంతువుల కంటె కాస్త మెరుగు అంతే. తన దృష్టిని మానసిక క్షేత్రంలోనికి ప్రసరింపజేసి, తదంగము లైన అహము, మనస్సు, దాని ఉపకరణాలు, శరీరాది విభాగములను స్పష్టముగా గుర్తెరుగుట తన ప్రథమ కర్తవ్యము. ఈ జ్ఞానము పెరిగిన కొద్దీ, తన జిజ్ఞాస కూడా ఎక్కువై, జీవితమంటే అహంకారపు స్వోత్కర్ష, జ్వాలాతోరణాలావిష్కరణలేనా లేక వేరే పరమార్థము ఏదైనా ఉన్నదా అనే ప్రశ్న ఉదయించి తీరుతుంది.

శ్రీఅరవిందులు

"ప్రాణికము — ప్రాణశక్తి" అనే విష యముపై శ్రీఅరవిందుల రచనలలోని కొన్ని ప్రవచనములను ఈ సంచికలో ప్రచురించుచున్నాము.

ప్రాణికము – ప్రాణశక్తి
(శ్రీఅరవిందుల ప్రవచనములు)

విభాగము I: ప్రాణికము

విభాగము II: ప్రాణిక రూపాంతీకరణము

ప్రాణము — ప్రాణికము — ప్రాణశక్తి

ఆంగ్లభాషలో "life" అనే పదాన్ని చాలా భిన్నార్థాలలో వాడు తారు. అయితే ఉపనిషత్తులలోను, యోగపరిభాషలోను దాని అర్థము వేరు — అది కేవలము ప్రాణశక్తి లేక దాని క్రియలను మాత్రమే సూచిస్తుంది. ప్రాణమంటే మామూలుగా ఊపిరితిత్తులలోనికి తీసు కొని, బయటకు వదలి వేయబడు శ్వాస అని అర్థము. అనగా కేవలం భౌతిక, వ్యావహారిక దృష్ట్యా ప్రాణము లేక ప్రాణవాయువు అనమాట. అయితే దీనికి ఉపనిషత్తులలో సూచించబడిన వేదాంతపర అర్థము యిదికాదు. శరీరములో సర్వత్రా వ్యాపించి ఐదు రకములుగా ప్రవ హిస్తూ, అయిదు ప్రత్యేక పేర్లు కలిగివున్న ప్రాణశక్తి వేరు. శరీరములో ప్రాణము ఉండుటకు శ్వాసక్రియ ఎంత అవసరమో, ఈ ప్రతి ఒక్కటి కూడా అంతఅవసరమే. శరీరములో ప్రాణశక్తి ప్రవాహామునకు సంబం ధించిన ఈ ఐదు ప్రముఖ క్రియలలో శ్వాసక్రియ ఒకటి మాత్రమే. ఇది భౌతిక శరీరమంతటా శక్తిని ప్రసరింపజేసి, దాన్ని నడుపుటకు సాధార ణంగా అత్యావసరమై యున్నది. అయితే ఈ శ్వాసక్రియను కూడా ప్రాణమునకు ఏ మాత్రం ప్రమాదం లేకుండా నిలిపి వేయవచ్చు.

ఈ "ప్రాణము" అని పిలువబడే ప్రాణశక్తి అసలు భౌతిక దినుసు కానేకాదు. మనకు తెలిసిన అగ్ని, విద్యుత్తుల్లాంటి భౌతిక శక్తి కూడాకాదు. దాని తత్వము వేరు. భౌతిక పదార్థాని కాధారభూతమై, అందులో నిమగ్నమైయున్న ఒకానొక విశేషము. భౌతికమూర్త రూప ములన్నిటికి అది ఆధారము. అన్ని వస్తువులలోను అది పూరకమై వుంటుంది. అది లేనిదే ఏ భూతము పుట్టదు. అస్తిత్వములో కొనసాగ లేదు. విద్యుచ్ఛక్తిలాంటి భౌతిక శక్తులన్ని దాని క్రియారూపములే. 'శుద్ధశక్తి'కి చేరువైన భౌతిక శక్తులలో మట్టుకు అది కూడా "శుద్ధ రూపము"లోనే వుంటుంది. అదిలేనిదే ఏవిధమైన శక్తి నిలవదు. నడ వదు. తన 'స్థితి'ని, 'గతి'ని కూడా ప్రాణశక్తి నుండియే పొందుతుంది. భౌతిక శక్తులన్ని దాని వాహకాలే. భౌతిక సన్నివేశాలన్ని కూడా "శుద్ధశక్తి" స్వరూపమైన "ప్రాణము" యొక్క రూపాలే. దానికి క్షేత్ర

ములే. తత్కారణంగా అది భౌతిక విశ్లేషణకు అందదు. కొలత బద్దకు దొరకదు. ఆ శక్తివలనకలిగే బాహ్యా సంఘటనల ఫలితాలు మాత్రమే దొరుకుతాయి.

అయితే మరి మనం దానిని ఎట్లా తెలుసుకోగలం? మనః శరీరములను యోగప్రక్రియలద్వారా పరిశుద్ధముగావించి జ్ఞానేంద్రియాలను సూక్ష్మతరము గావించినప్పుడు మాత్రమే అది సాధ్యము.

•

"ప్రాణికము"* అనగా ప్రాణశక్తి. ఎక్కడైతే జీవము కలకల్లాడుతూంటుందో — చెట్లు, జంతువులు, మానవులు — అక్కడ ప్రాణశక్తి ఉండి తీరుతుంది. ప్రాణికము లేనిదే జడపదార్థానికి ప్రాణం అబ్బదు. ప్రాణుల కుండే విశేష చైతన్యం ఉండదు. ప్రాణికము చాలా అవసరమైనశక్తి. అది ఒక పరికరము. అది లోపించిన యడల శరీరధారులు ఏమియు చేయజాలరు. సాధనకు కూడా ఈ ప్రాణికము తప్పని సరియే.

అయితే ఒక హెచ్చరిక. ఈ ప్రాణికము అహంకారానికి, ఆవేశానికి, కోరికలకు ఆలవాలమై అపరిష్కృతంగా ఉంటే చాలా హానికరము. పరిష్కృత ప్రాణికము ఎంత సహాయకారియో అపరిష్కృతము అంత నాశనకారి. మామూలు జీవితంలో కూడా ప్రాణికము, మనస్సు యొక్క అధికారానికి లోబడి ఉండకపోతే ఫలితము గందరగోళమే, సర్వనాశనమే. మనస్సు యొక్క అధికారానికి గాని, దైవశక్తి యొక్క అధికారానికిగాని లొంగని ప్రాణికశక్తి గుప్పెట్లోవున్న మనిషిని vital man (రాక్షసుడులాంటివాడు) అందురు. ప్రాణికము మన అదుపులో ఉంటే మంచి పరికరము. మనం దాని చేతుల్లో పడితే దుష్టపరిపాలన.

ప్రాణికాన్ని హతమార్చకూడదు. నాశనం చేయరాదు. చైత్య, ఆధ్యాత్మికశక్తుల నియంత్రణ ద్వారా, దానిని పరిశుద్ధము, రూపాంతీకరణము చెయ్యాలి.

*

---

* ప్రాణికము = vital/vitality

భౌతికరంగంలో ఏ పని చెయ్యాలన్నా అది ప్రాణికము ద్వారా జరగవలసిందే — దాని శక్తి సామర్థ్యములు లేనిదే ఏ పనీ జరగదు. ఒకవేళ దాని సహాయం లేక ఒట్టి మనస్సే కార్యంలోకి దిగితే చాలా శ్రమించవలసి వస్తుంది. దాని ఫలితాలుకూడా అంతంత మాత్రంగానే ఉంటయి.

*

నిజమైన ప్రాణికమనేది కూడా ఒకటున్నది. దాని చర్యలు, భావములు, కోరికలు, ఆశలు మొదలగు ప్రక్రియలు — ఆవేదనలు, ప్రేరణలు — బాహ్యావేశ హృత్కేంద్రములో కేంద్రీకృతములు. ఇదికాక చైత్యభావములు, ఆవేశములు, అంతఃస్ఫురణలు, ఆత్మ ప్రేరణలు ఉత్ప న్నమయ్యే అంతః హృదయము కూడా ఒకటున్నది. మానవుని వ్యక్తి త్వము ప్రాణికము లేనిదే సంపూర్ణము కాజాలదు. కాని దాని భావ ములు, ప్రక్రియలు, చైత్యాత్మ స్పర్శ (psychic touch) వలన పరిశుద్ధము గావింపబడి ఆధ్యాత్మిక జ్యోతిశ్శక్తులచే పాలింపబడినప్పుడే, అది నిజమైన సాధనము కాగలదు.

*

చాలామంది మనుష్యులలో వారి ఆత్మ బాహ్య ప్రకృతిచే కప్పబడి తెరమరగున దాగి ఉంటుంది. వాళ్లు వారి ప్రాణికాన్నే ఆత్మగా భావిస్తారు. ఎందుకంటే ప్రాణికమే వారిని చైతన్యవంతులను చేస్తుంది కాబట్టి.

*

తైత్తిరీయోపనిషత్తులో చెప్పిన ప్రాణమయ పురుషుడు ఈ ప్రాణికమే. ప్రాణజీవులను చైతన్యవంతులనుజేసి నడిపించే శక్తి ఇదియే. అపరాప్రకృతిలో దీని రూపము కామాత్మ. పెక్కుమంది మానవులను నడిపించేది ఇదియే. వాళ్లు యీ కామాత్మనే చూసి అసలైన ఆత్మ అను కుంటారు. ఒక విధంగా ఆలోచించినట్లయితే మనలోని 'పురుషులు' లేక జీవులు — చైత్య, మానసిక, ప్రాణిక, భౌతిక జీవులు — ఆత్మయొక్క ప్రతిబింబాలే. అయితే మనం మన అంతరంగిక జీవిని కలుసుకొని మన అంతరంగిక స్వరూపమును తెలిసికొన్నప్పుడే యీ విషయం మనకు తేటతెల్లమవుతుంది. ఉపరితలంలో మానసిక, ప్రాణిక,

భౌతిక ప్రకృతులు అజ్ఞాన క్షేత్రంలో వర్తించటం వలన, ప్రకృతి ధర్మాన్ననుసరించి 'పురుషుడు' వికృతమౌతాడు. అతను మన అసలైన మానసికజీవి గాని, ప్రాణికజీవి గాని, భౌతికజీవి గాని కూడా గాదు. ఎందుకంటే ఈ రూపములన్ని ముసుగు వెనకాల నిశ్శబ్దంగానే ఉంటయి. మన జ్ఞాన నేత్రం తెరచుకుండేంత వరకూ ఈ మానసిక, ప్రాణిక, భౌతిక అహంకారాలనే మన నిజరూపములని భ్రమపడతాము.

*

ప్రాణమయపురుషునిలో నాలుగు విభాగములున్నయి. మొదటిది మానసిక-ప్రాణికము. ఇది భావావేశములకు, కోరికలకు, తీవ్ర యిచ్ఛలకు, సంవేదనలకు ప్రాణమయ పురుషుని సమస్తమైన యితర ప్రక్రియలను వాక్కుద్వారా, భావముల ద్వారా వ్యక్తపరుస్తుంది. రెండవది భావావేశ ప్రాణికము. ఇది ప్రేమ, సంతోషము, దుఃఖము, ద్వేషము మొదలగు భావములకు స్థానము. మూడవది "కేంద్ర-ప్రాణికము". ఇది బలమైన ప్రాణికాకాంక్షలకు మరియు ప్రతిక్రియలకు ఉదా: గొప్ప ఆశ, గర్వము, భయము, కీర్తికాముకత, రాగద్వేషములు, కోరికలు మరియు ఉద్రేకాల పలురూపములకు స్థానము. అనేక ప్రాణికశక్తులకు క్షేత్రము. నాల్గవది "నిమ్న ప్రాణికము". దీనికి మన నిత్య జీవితములోని వందలాది చిన్న కోరికలన్నీ ఆలవాలములు — ఆహారేచ్ఛ, కామేచ్ఛ, యిష్టాలు, అయిష్టాలు, స్వాతిశయం, పోరాటములు ఒకటేమిటి అసంఖ్యాకములైన అనేక విషయములు.

వాటి స్థానములు:

1 మానసిక-ప్రాణికము — కంఠము నుండి హృదయము వరకు.
2 భావావేశ-ప్రాణికము — హృదయము (ఇది ద్వంద్వ కేంద్రము: ముందర భాగము భావావేశ ప్రాణికము. వెనుకభాగము చైత్య పురుషుడు)
3 కేంద్రప్రాణికము — హృదయము నుండి నాభి వరకు
4 నిమ్నప్రాణికము — నాభి క్రింది భాగము

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బ్రహ్మచారి సంయమేశ్వర్

ఉన్నతప్రాణికము — నిమ్నప్రాణికము

మనిషి తనను తానెరుగడు. తనలోని వివిధ భాగములు తనకు తెలియవు. వీటిలో ప్రాణికము చాలా కీలకమైనది. నిత్యజీవితానికి, ప్రేరణలకు మూలము. దీనిని గురించి శ్రీఅరవిందులు సూక్ష్మాతిసూక్ష్మంగా చేసిన విశ్లేషణ, వివరములు ఇందు పొందు పరచుచున్నాము.

—సంపాదకుడు

ప్రాణిక ప్రకృతిలో రెండు విభాగములు కలవు — ఉన్నత ప్రాణికము, (higher vital) నిమ్నప్రాణికము (lower vital). ఉన్నత ప్రాణికమనగా ప్రాణిక మనస్సు (vital mind) భావావేశములు (emotions) మనిషిలో గతిశీలమైన ప్రాణశక్తి.

మానవునిలోని ప్రేరణలు, కోరికలు, అధికారేచ్ఛ, అన్నిటిని తన స్వంతం చేసుకోవాలనే ఆశ, క్రియాభిలాష, భావోద్రేకములు, భావావేశములు, ప్రేరణాదుల కనుగుణంగా జీవితాన్ని మలిచి రూపొందించుకొనే ఇంద్రియము ప్రాణికమనస్సు — జీవనసరళిని, చిత్తవృత్తులను తదనుగుణంగా రూపొందిస్తుంది. తార్కిక మనస్సుకి దీనికి చాలా భేదమున్నది. తార్కిక మనస్సేమో మనస్సు యొక్క ఆలోచనలు, వివేచన, అంతర్దృష్టులతో జీవన సరళిని రూపొందిస్తుంది. కాని ప్రాణిక మనస్సు తార్కిక బుద్ధిచేగాక ప్రాణికోద్వేగము, ప్రాణిక శక్తులచే ప్రేరేపింపబడుతుంది. ప్రాణిక మనస్సు మామూలు మనస్సు మీద తన అధికారాన్ని చలాయించి దానిని కూడా తన ప్రేరణలకు అనుగుణంగానే నడిపిస్తుంది.

ఉన్నతప్రాణికము: ఉన్నత ప్రాణికము, దాని విభాగములు ఛాతిలో ఉంటయి. హృత్కేంద్రము దాని ఆయువుపట్టు. అక్కణ్ణుంచి నాభి వరకు దాని రాజ్యము. భావావేశములను గురించి నేనేమి చెప్పనవసరం లేదు. ఎందుకంటే అవి అందరికి సుపరిచితములే, నాభి క్రింది భాగమంతా తీవ్రమైన ఉద్రేకాలకు, సమస్తమైన ప్రేరణలకు ఆలవాలము. మానవ జీవతం నూటికి తొంభై పాళ్లు ఇటువంటి ప్రేరణల

తోనే కూడి ఉంటుంది. దీనినే మనం lower vital — నిమ్నప్రాణిక ప్రకృతి అని అంటాము.

•

నిమ్నప్రాణికము: ఉన్నత ప్రాణికము వేరు నిమ్నప్రాణికము వేరు. ఇంద్రియ లోలుడైన సామాన్య మానవుని దైనిక జీవితములోని చిన్న చిన్న ఆశలు, కోరికలు, ఉద్రేకాలు నిమ్నప్రాణికము యొక్క రంగము కాగా, అసలు ప్రాణిక భౌతికమేమో nervous being కి సంబంధించి నది — భౌతిక స్పర్శలకు సంబంధించిన ప్రక్రియ.

•

ప్రాణిక భౌతికము vital physical: ప్రాణికభౌతికం భౌతిక మనస్సు కంటె భిన్నమైనది. భౌతిక ప్రకృతియొక్క నాడీకీయ స్పందనలకు మాధ్యమం. అది అల్పతర సంవేదనలకు, కామనలకు క్షేత్రం. అటు లనే బాహ్యా భౌతిక జీవితం యొక్క వివిధ ప్రకృతి క్రియలకు కూడా క్షేత్రం. మన బాహ్యా జీవితంలోని అల్పత్వమంతా ప్రాణిక భౌతికానికి చెందినది. యోగము ద్వారా బాహ్యాజీవితమును రూపాంతరీకరించు టకు దీని క్షుద్రమైన అలవాట్లు, మొండితనము ముఖ్యమైన అవరోధ ములు. మనిషికి కలిగే మానసికమైన, శారీరకమైన వ్యాధులు చాలా వరకు ఈ ప్రాణిక భౌతికము యొక్క నిర్వాకములే!

•

"నిమ్న" అనగా ఏమి?

ఇక్కడ 'నిమ్న' అనగా నీచమని అర్థంకాదు. ఇది స్తరముల (లోకములు) క్రమమును సూచిస్తుంది. భూలోక జీవులలో ఈ దినుసు చాలా అస్పష్టంగా, వికార రూపము దాల్చి ఉంటుంది. కామక్రోధ లోభమోహామద మాత్సర్యాదులన్ని దాని అతిథులే. అయితే దీనికి మరియొక పాత్రకూడా యున్నది. మనిషి అంతర్జీవితానికి, బాహ్యాజీవి తానికి నడుమ మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది...

మనం చేసిన యీ విభజనలన్ని మనిషి తనను తాను తెలుసుకొనుటకు, జీవితమును క్రమబద్ధము చేసుకొనుటకు, అభ్య సించుటకు ఉపయోగపడుతుందన్నమాట నిజమే. అయితే యీ విభా గాలన్ని వేర్వేరు గదులలో పరస్పర సంబంధము లేకుండా బంధింప

బడి ఉండవు. ఒకదానిలోకి ఒకటి చొచ్చుకొనిపోయి కొంచెం కలగా పులగమవుతయి. మనమీ సంగతి గుర్తుంచుకుంటే వీటి యొక్క నిజ రూపం మనకి తెలిసినట్లే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి

ప్రాణికమనస్సు (Vital Mind)

ప్రకృతిలోని ఒకానొక విభాగమునకు నేను ప్రాణిక మనస్సు అని పేరు పెట్టాను. దాని ధర్మము మామూలు మనస్సు (బుద్ధి) కంటె, చిత్తవృత్తులకంటె భిన్నమైనది. చూచుట, పరిశీలించుట, ఆలోచించుట, తార్కికవాదనలు సలుపుట, మంచిచెడ్డలను నిర్ణయించుట మొ॥ మనస్సు యొక్క — మామూలుగా మనకు తెలిసిన ఆలోచనాశీలమైన మనస్సు యొక్క — వృత్తులు. ఈ ప్రాణిక మనస్సు యొక్క పని వేరు. అది కలలుకంటుంది. ఊహా సౌధములు నిర్మిస్తుంది. భవిష్యత్ప్రణాళికలను (formations) సూక్ష్మరూపములో నిర్మిస్తుంది. అవకాశము కలసి వచ్చినప్పుడు, పరిస్థితులు అనుకూలించినపుడు సాధారణ మనస్సు ఈ సూక్ష్మరూపాలను వాస్తవం చేస్తుంది — తనే (ప్రాణికమనస్సు) అట్టి పరిస్థితులను అనుకూలింపజేస్తుందికూడా. భౌతిక ప్రపంచంలో ఊహాగానాలు చేసేవారు కొందరయితే నడుంబిగించి కార్యరంగంలోకి దుమికి కార్యములను సమర్థవంతంగా నిర్వహించే అతిరథమహారథులు మరి కొందరు. అట్టి వారిలో యీ ప్రాణికమనస్సు శిరోధార్యంగా ఉంటుంది. వారి ప్రకృతిలో ప్రధాన లక్షణమై భాసిస్తుంది. అయితే అతిరథమహారథులు కానివారిలోకూడా — పరిస్థితుల ప్రాబల్యము లేకపోయినప్పటికి — కేవలం అల్పాల్ప కార్యములు మాత్రమే చేయగల మానవ కోటిలో కూడా యీ ప్రాణికమనస్సు లేకపోదు. వారికి తగిన స్థాయిలోనే, చిన్న ఎత్తులోనే పనిచేస్తుంది. ఒక్కొక్కప్పుడు తన అసమర్థత తెలిసికూడా గొప్పలకు పోయి పెద్దపెద్ద పథకాలు వేస్తుంది. గాలిలో

మేడలు నిర్మిస్తుంది. పెద్దపెద్ద కథలు అల్లుతుంది. సాహసకృత్యాలను ఊహించుకొని తననే హీరోగా నిలబెట్టుకుంటుంది.

ప్రస్తుతం నీలో జరుగుతున్న వ్యవహారం యీ ప్రాణిక మనస్సు యొక్క ప్రతాపమే. దాని ఊహాగానమే. ఈ విధమైన ప్రక్రియ జరుగుతున్నది నీ ఒక్కడిలోనేకాదు. చాలామందికికూడా యిటువంటి అనుభవాలే కలుగుతున్నాయి — వారివారి అభిరుచులు, ఊహాలు, ధోరణులకనుగుణంగా. నువ్వు యీ విషయాన్ని జాగ్రత్తగా కనిపెట్టి నియమించుకోవాలి. అట్లు చేయకపోనిచో అది నీ మనస్సును ఆవహించి నిన్ను యిష్టమొచ్చినట్లుగా ఆడిస్తుంది. సాధనా క్రమంలో సిద్ధులు అనుభూతమవుతున్నప్పుడు (experiences) నువ్వు ఆ ప్రాణికమనస్సు గుప్పెట్లో చిక్కుకోకూడదు. ఒకవేళ అటుల జరిగినచో అది నిన్ను యదేచ్ఛగా ఆడిస్తుంది. తనకిష్టమొచ్చిన తప్పుడు అనుభూతులను కల్పిస్తుంది. ఇవే వాస్తవాలని నమ్మించి, మిథ్యానుభూతులను చిత్రించి "ఇదే నిజం", నీవు చేయవలసింది యిదే అని శాసిస్తుంది. కొంతమంది సాధకులను యీ మాయదారి శక్తులు ఆవహించి "తామే గొప్ప గురువులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యనిర్వాహకులు" అని వారిని భ్రమింపజేసి తప్పదారులు పట్టిస్తాయి. చివరకు మిగిలేది నిరాశ, సర్వనాశనము. నీలో ఇప్పుడు విజృంభిస్తున్నది ఈ శక్తియే. నీవు దీని నిజస్వరూపాన్ని తెలుసుకొని త్రోసిపారవెయ్యాలి. ప్రాణికస్తరము (vital plane) లోనుంచి వెలుపలికి లాగి బహిష్కరించవలసిన ఇటువంటి వృత్తులు చాలా ఉన్నాయి. ఎట్టి ప్రమాదాలు సంభవించకుండా ఉన్న తాధ్యాత్మికానుభూతులు కలుగుటకు, కొనసాగుటకు ఇది చాలా ముఖ్యం.

•

ప్రాణికమనస్సు పనిచేసే తీరుతెన్నులు యీ విధంగా ఉంటయి. ఎల్లప్పుడూ, "ఏం చెయ్యాలి, ఎట్లా చెయ్యాలి, ఏ విధమైన సౌకర్యాలేర్పరచాలి" అని అదే పనిగా ఊహించటం, ఆలోచించటం, పథకాలు వేయటం దాని పని. మానవ జీవితంలో దాని ఉపయోగం లేకపోలేదు. అయితే అది అదుపు లేకుండా యిష్టమొచ్చినట్లు మితిమీరి ప్రవర్తించి నట్లయితే అసలు కార్యం దెబ్బతింటుంది.

అసలైన ప్రాణిక మనస్సు: ఇది ప్రాణికావేశము, వాంఛలు, ప్రేరణాదులకు, అసలు మనస్సుకు నడుమ ఒక రకమైన మధ్యవర్తి. దీని కార్యములీ విధంగా భాసిస్తాయి. తన యిచ్ఛలను, భావములను, ఆవేశములను, ఆవేదనలను, ఆశయములను, పనులు చేయవలెననే అభిలాష, లోభత్వముల నన్నింటిని మనస్సులో మానసిక చిత్రాలుగా ప్రతిబింబింప చేస్తుంది. కొంతమంది పెద్దమనుషులు వాళ్లే గొప్ప వాళ్లై నట్లు ఊహించుకొంటారే — యిదంతా యీ ప్రాణిక మనస్సు యొక్క ప్రతాపమే. అంతేకాదు. మనస్సు యొక్క ఇంతకంటె తుచ్ఛమైన స్థాయి మరియొకటి కూడా ఉన్నది. అది మనస్సు యొక్క అనుమతి లేకుండా విచ్చలవిడిగా, తాడూతెంపూ లేకుండా పనిజేస్తుంది. ప్రాణిక పరమైన ఉద్రేకములు, ప్రేరణలు, కోరికలు ఆవిష్కృతములై పైకి లేచి, బుద్ధిలోకి ప్రవేశించి దానిని మభ్య పరుస్తయి. కల్మషముగావిస్తయి.

జీవమనస్సు: వాంఛలకు స్థావరము అయిన ప్రాణిక మనస్తత్వము (vital mentality) యింకొకటి ఉన్నది. ఇది, జరిగిన కార్యములతో తృప్తిపడదు. ఇంకా యింకా ఏమేమో ఘనమైన కార్యాలు జరగాలను కుంటుంది. దానికెప్పుడు కొత్త వింతలు కావాలి. తీవ్రతరమైన అను భూతులు కావాలి. ఉన్మాద స్థాయినందుకోవాలి. వెర్రి సంతృప్తి, వెర్రి భోగములు, వెర్రి ఆత్మాధిపత్యము, వెర్రి అధికార డాంభికములు వీటి కోసం కలవరిస్తుంది. దాని దురాశకు అంతులేదు.

తనే ఒక గొప్ప మహారాజునని ఊహించుకుంటుంది. దాని భోగపరాయణత్వానికి అంతులేదు. ఆవేశములు, ఉద్రేకములు — ఒకటేమిటి — అనేకమైన చిత్రవిచిత్రానుభూతులన్ని దానికి కావాలి. ఇదేకనక లేకపోయినట్లయితే, ఒట్టి భౌతిక మనస్సు ఒక జంతువు మాదిరిగా మాత్రమే బ్రతకగలదు; తన జీవితమంతా భౌతిక జీవితపు ప్రాథమిక స్థాయితో సరి; ప్రపంచంలో (భౌతిక ప్రకృతిలో) యింత వరకు జరిగిన సృష్టియే ఆఖరు దశ; అంతకుమించి సాధించేందుకు యింకేమియు లేదని ఒక లక్ష్మణరేఖను గీసుకొని అందులోనే మ్రగ్గుతూ ఉంటుంది. కాని నిజానికి అటుల జరుగదు. ఎందుకంటే యీ ప్రాణిక మనస్సు, గంతులు వేస్తున్న యీ ప్రాణేచ్ఛ (life will) ఉన్నదే — అది తలెత్తి "నా సంగతేమిటి?. నన్ను యిట్లా బందులదొడ్లో కట్టిపెట్టి పారే

సేవేమిటి? నాకు యింతకంటె గొప్ప జీవితం యింకేమి లేదా" అని ఒకటే గొడవ చేస్తూ ఉంటుంది. ప్రాణంతీసేస్తుంది. దానికి ఎప్పుడూ కోరికలు కోరుతూండటమే పని. అవిశ్రాంతి, అసంతృప్తి, "జీవిత మంటే యిదేనా యింతేనా" అని మొరబెడుతూ ఉంటుంది. దాని కెప్పుడూ జీవితం యొక్క ప్రస్తుత స్థాయికంటె అధికతరమైన తృప్తి, విశేషానుభూతులు కావాలి. మానవ జీవితపు పరిధి విస్తరించుటకు కారణం అదే. "ఈ దిగంతాలను దాటిపోవాల్సిందే. క్రొత్త లోకాలను జం ుచాల్సిందే. మేరుపర్వతాన్ని అధిరోహించాల్సిందే" ఇదీ దాని వరస.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

ఉపరితల ప్రాణికము — దాని ప్రయోజనము

ఐతరేయమైన జగతిలో ప్రాణికసత్త తన ఉనికిని నిలదొక్కుకుని స్థిరపడగలదనే ప్రాథమిక పరిణామ సిద్ధాంతంలోని రెండవ సూత్రం ప్రముఖమైనదిగా అత్యధిక ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇక్కడ బహిరంగ వ్యక్తిత్వం లేక ప్రాణికాహంకారం అజ్ఞానమయమైన ప్రాణికసత్తమీద తన ఆధిపత్యం చాటుకుంటుంది. ఈఆధిపత్యమే ప్రాణికసత్తలో ప్రారంభమయే అపశృతులకూ, సామరస్యరాహిత్యానికీ ప్రధాన కారణమవుతుంది. ఇదే బహిరంత రంగాల్లో ఉత్పన్నమయ్యే కల్లోలాలకూ, దానిమూలంగా ఏర్పడే అధర్మ వర్తనానికీ, పాపాచరణానికీ మూలకారణమవుతుంది. మనలో సహజంగావున్న ప్రాణికాహంకారం దమింపబడి, సంస్కరింపబడనంత కాలం తన ప్రోక్తన లక్షణాన్ని విడనాడకుండా సత్యధర్మాలపట్లా, వాటి ఆచరణపట్లా విముఖత చూపిస్తుంది. తను స్థిరపడటం, ప్రాణాన్ని పెంచుకుని బలం పుంజుకొనటం, తన అవసరాలను సమకూర్చుకొనటం, ప్రేరణలకు తలొగ్గటం, పంచేంద్రియ పరితృప్తి పొందటం మాత్రమే తన కర్తవ్యమను

కుంటుంది. ప్రాణికాహంకారానికి తనవసరాలు, కోరికలు మాత్రమే అతిముఖ్యమైనవిగా కన్పిస్తాయి. వాటిని సాధించుకునే ప్రయత్నంలో మంచినిగానీ, సత్యధర్మాల్నిగానీ పట్టించుకోదు. అందుకే మనస్సుకు కలిగిన భావాలనుగానీ, ఆత్మయొక్క అవగాహననుగానీ లెక్కచేయక మనస్సును తన అధీనంలో వుంచుకొని, నియంత్రిస్తూ తన ఇచ్ఛను, ఆజ్ఞల్ని అది అనుసరించేటట్టు చేస్తుంది. ఏది సత్యం, ఏది ధర్మం అన్న విషయం మీద కూడా తనే తీర్పు చెప్తుంది. తన అహం యొక్క ఆదేశాలననుసరించి ప్రాణిక వాంఛల్ని, ఉద్రేకాల్నీ, వాంఛల్ని తీర్చు కుంటుంది. తన అహంకారాన్ని వ్యక్తీకరించడానికి అవకాశం వుంది కాబట్టి తనలా చేస్తున్నానని సమర్థించుకుంటుంది. తన మనస్సు యొక్క అంగీకారం లభించేటట్లయితే మిగతా వేటినీ లెక్క చేయ కుండా దాన్నే ప్రమాణంగా తీసుకుని ప్రాణికాహంకారం యొక్క తృప్తినీ, అభివృద్ధినీ, బలాన్నీ, స్వాతిశయాన్ని మాత్రమే పట్టించుకుం టుంది. సత్య ధర్మాలను గురించి ఈషణ్మాత్రం కూడా పట్టించుకోదు. మనస్సనేది ఒకటుంటుందని, దానికి కొన్ని భావాలుంటాయనీ, ఆత్మ నేదొకటుంటుందని, దానికి మంచి అవగాహన వుంటుందనీ ఏమాత్రం అనుకోదు. మనస్సుమీద ఆధిపత్యం వహించడానికి ప్రయత్నిస్తూ, తన ఇచ్ఛలన్నీ దాని ద్వారా నెరవేరేట్టు చేసుకుంటుంది. తన ప్రాణికా హంకారం యొక్క ప్రేరణలను, వాంఛల్నీ మాత్రమే సత్యసమ్మతాలనీ, ధర్మబద్ధమనీ నిర్ణయిస్తుంది. తన నిర్ణయాలను అహంకారంతో సమర్థిం చుకుని తీర్పులిస్తుంది. మనస్సు ఒప్పుకుంటే మిగతా ప్రమాణాలన్ని టినీ గాలికొదలి ప్రాణికాహంకారం యొక్క తృప్తి, పెరుగుదలా, బలమూ, విస్తరణలను మాత్రమే ప్రమాణాలుగా ప్రాణికసత్త స్వీకరి స్తుంది. ఏప్రాణైనా తన వ్యక్తిగత అవసరాలు, నివాసమూ, విస్తృతి, వ్యాప్తి పరిసరాల మీద ప్రాణుల మీద ఆధిపత్యాన్నీ కోరుకుం టుంది. వైయక్తిక ప్రాణికి కావలసింది ప్రాణాన్ని పెంపొందుకునే అవ కాశమున్న నివాసమూ, సూర్యకాంతీ, తన ప్రతిపత్తీ, స్వజాతి పరి రక్షణ, అభివృద్ధీ, — ఇవన్నీ కూడా తన కోసం, తన సహచరుల కోసం, తన అహంకారంకోసం, సామూహిక అహంకారంకోసం, తన ఆదర్శాలకోసం, అభిరుచులకోసం, భావాలకోసం, దానికవసరమవు

తాయి. తత్సోత్కర్షను, ఆధిక్యతను నిరూపించుకునేందుకు "నేను" "నాది" అనే భావాలను తన చుట్టూవున్న పరిసరాల మీద ప్రవర్తింప జేస్తుంది. ఒక వేళ అలా చేసే బలం తనకు లేకపోతే, తన మీద జరిగే దాడుల నుంచి కాపాడుకునే వ్యూహాలను పన్ని, తన ప్రత్యేక స్వరూపాన్ని, ఉనికినీ నిలబెట్టుకుంటుంది. వీటన్నిటినీ గూడా తనకు ధర్మమని తోచిన మార్గాల ద్వారా, అసత్యం ద్వారా, వినాశ హేతువైన ఆక్రమణ ద్వారా, మిగతా ప్రాణిక భూమికల విధ్వంసనం ద్వారా సాధిస్తుంది. తానెన్నుకున్న మార్గం వెనుక వున్న నైతిక దృక్పథం ఏదైనా, దాని ప్రవర్తనను ప్రేరేపించే సూత్రం మటుకు ఇదే. మానవుని ప్రాణికసత్త తన స్వలాభ విషయంలోనూ, అభిప్రాయాల విషయం లోనూ, మతవిషయంలోనూ మాత్రమే కాక తన ఆధిక్యతనూ ఊద్ధతినీ నిలుపుకునే దృక్పథంతో సంఘర్షణ, హింస, దౌర్జన్యమూ, అణచివేత, అసహనము, ఆక్రమణ, మొదలైన వాటినన్నిటినీ ఉపయో గిస్తుంది. మేధా సంపత్తి, ఆత్మల మీదకూడా ఇదే (ప్రాణిక సత్త) ప్రాణికాహంకారాన్ని బలవంతంగా ప్రయోగిస్తుంది. తన ఆధిక్యతను నిరూపించుకునేందుకు ప్రాణం, విస్తరణకు అడ్డుగా నిలచిన వాటినీ, తన అహం మీద దెబ్బతీసిన వాటినీ ద్వేషించి నిరసిస్తుంది. క్రౌర్యాన్ని, నమ్మక ద్రోహాన్నీ దుర్మార్గాన్నీ ప్రాణం తన సాధనంగా లేక ప్రతిక్రియగా వాడుకుంటుంది. ధర్మాధర్మాల ప్రసక్తి లేకుండా తన కోరికల్ని, ప్రేరణలను తీర్చుకుంటుంది. తను పొందిన తృప్తికోసం వినాశనావకాశాన్ని వాస్తవిక బాధల్నీ ఎదుర్కొనడానికి కూడా సిద్ధ పడుతుంది. ఎందుకంటే దీనిద్వారా ఆత్మరక్షణను మాత్రమే కాక ప్రాణికాధిక్యత, ప్రాణిక పరితృప్తి, ప్రాణికశక్తి, ప్రాణిక సత్త భూమికల నిర్మాణాన్ని కూడా ప్రకృతి నిర్వహిస్తుంది.

జన్మతః ప్రాణిక వ్యక్తిత్వ స్వభావ లక్షణం యిది మాత్రమేననుకోనక్కర్లేదు. ప్రాథమికంగా సత్య ధర్మాల్ని గురించి అంతగా పట్టించుకోక పోయినా, వాటి పట్ల అభిలాష కలిగి వుంటుంది. అంతకంటే సహజంగా ఆనందం పట్లా దానికి అభిలాష వుంది. మంచి చెడుల పట్ల అభిరుచి, సత్యాసత్యాల పట్ల అభిరతీ, ప్రాణం పట్ల ఆపేక్ష, మరణం పట్ల ఆకర్షణ సుఖదుఃఖాల పట్ల అభిలాష తను

పడే బాధల పట్లా, ఇతరుల బాధల పట్లా, తన ఆనందం పట్లా, తన సుఖ సంతోషాల పట్లా, ఇతరుల సుఖ, సంతోషాల పట్లా ఆనందించట మనేది ప్రాణిక సత్తలో ఎక్కడో దాగి వుంది. తన్నుతాను స్థిరీకరించు కునే ప్రాణికశక్తి పాపపుణ్యాల రెంటినీ సమర్థిస్తుంది. దానికి సహాయం చేయాలని, సహవసించాలనీ, ఔదార్యాన్నీ, ఆపేక్షనూ, విశ్వాసాన్నీ పంచాలనీ, ఆత్మార్పణ చేయాలనీ ప్రేరణలున్నాయి. దాన శీలాన్ని చూపించినట్లే, అహంకారాన్ని కూడా ప్రదర్శిస్తుంది. ఆత్మత్యాగం చేసి నట్లే ఇతర్లను నాశనం చేస్తుంది. ఈ చర్యలన్నిటిలోనూ తన ప్రాణ రక్షణ పట్ల ఆసక్తి అద్భుతమైన క్రియాశక్తీ, సాఫల్యమూ ద్యోతకమవు తాయి. ప్రాణిక సత్త స్వభావంలో దాని అస్తిత్వవిధానంలో మంచిచెడులని మనం పిల్చేవి అంశాలు మాత్రమేననీ, ప్రధాన కార ణాలు కావనీ అధోమానస ప్రాణంలో స్పష్టమవుతుంది. మానవునిలో మానసిక, నైతిక, చైత్యాత్మల (psychic) వివేచనదృష్టి అభివృద్ధి చెంది వుంటుంది. కనుక తన స్వభావాన్ని మార్చుకోలేకపోయినా తన్ను తాను నిగ్రహించుకోగలదు, దాచి పెట్టుకోగలదు. ప్రాణికసత్త దాని ప్రాణశక్తీ తాము స్థిరపడి, సమర్థించుకునే ప్రయత్నంలో, ప్రభావితం చేసే ప్రకృతి యొక్క ప్రధాన సాధనమైన ఆత్మ శక్తియొక్క బహిరంగ క్రియలు లేని కారణంగా, దాని సహాయ సహకారాలు పొంది శరీరం గానీ మనస్సు గానీ పూర్తిగా వికసించి వాటి ధ్యేయాన్ని సాధించు కొనటం సాధ్యం కాదు. బహిరంగ వ్యక్తిత్వపు స్థానాన్ని అంతరంగం లేక నిజమైన ప్రాణిక సత్త తీసుకోగలిగితే ప్రాణికాహంకారపు ఉధృతి పూర్తిగా జయింపబడుతుంది. అపుడు ప్రాణశక్తి ఆత్మకువశమై నిజ మైన ఆధ్యాత్మికసత్తకుపకరించే శక్తివంతమైన ప్రక్రియలకు ఉపకరణ మవుతుంది.

చైతన్యంలోనూ బుద్ధిలోను దౌష్ట్యము, అనృతము ఈ విధంగా ప్రారంభమవుతాయి. అచేతనం నుండి ప్రభవించే సీమిత చైతన్యమే ఈ లోటుబాటుకు మూలకారణమవుతుంది. పరిమితత్వంలో ఏర్పడిన వ్యక్తిగత సాహచర్యం, అసత్యానికి హేతువు కాగా, ప్రాణికాహంకారం చేత పోషింపబడే అసత్య చైతన్యం అనృతానికి కారణమవుతుంది. ఈ సాపేక్ష అస్థిత్వం, విశ్వశక్తి తనను తాను పరిణామంగా వ్యక్తం చేసు

కునే ప్రేరణ కారణంగా సంభవిస్తుంది. అందువలన తన్నుతాను వ్యక్తం చేసుకునే ప్రత్యక్ష ప్రకృతి ఘటన (phenomenon) గా దీని ప్రాముఖ్యాన్ని పరిశీలించాలి. మనం గమనించినట్టు ఉన్మీలనమయ్యే ప్రాణికాహంకారం తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోడానికి విశ్వప్రకృతి ఏర్పాటు చేసిన ఒకానొక యంత్రాంగం. అవచేతనంలోని నిరాకారమైన ద్రవ్యపదార్థం నుంచి తాను విడి పడటానికి నిశ్చేతనం ఏర్పరచిన మార్గంలో చైతన్యసత్త అవతరించటానికి ఇది తోడ్పడుతుంది. "అహం కారం తన ప్రాణాన్ని తాను నిలదొక్కుకొంటుంది" అనే ధర్మం ఇక్కడ గమనించదగిన ప్రధానమైన ఫలితాంశం. వైయక్తికాహంకారం దేనినైనా ఫలితాన్ని బట్టి నిర్ణయించి అంగీకరిస్తుంది. ఉపరితలానుభూతిగా మార్పుచెందిన నిజమైన అంతరంగం యొక్క మరొక స్వరూపం, ఉపరితల చైతన్యం. అజ్ఞానం చేత నిజమైన అంతరంగం నుండి, నిజమైన అంతరంగ దివ్యత్వంనుండీ, ఉపరితల చైతన్యం వేరు చేయబడింది. అయినప్పటికి పరిణామ ప్రక్రియల్లో సాగే భిన్నాంశాల మధ్య ఘటిల్లే ఏకత్వంలోకి వైయక్తికాహంకారం నెట్టబడుతుంది. పరిమితమైన దీని స్వభావంలో అనంతత్వం అందుకోవాలనే ప్రేరణ దాగివుంది. దీనిని అజ్ఞానపు చైతన్యపు పరిభాషలోకి అనువదించి చెప్పాలంటే విస్తరించాలనే తన సంకల్పాన్ని, అనంతమైన పరిమితత్వాన్ని పొందాలనీ, ప్రతి అంశంలోనూ ప్రవేశించి దాన్ని ఆక్రమించాలనీ, తనకు తృప్తికలిగేట్టయితే దాని చేత ఆక్రమించబడాలనీ, ఇతరులలో పెరగాలనీ, ఇతరుల సత్తను తన ఆధీనంలోకి తీసుకోవాలనీ, తన్నుతాను సమర్థించుకుని ధ్రువీకరించుకొనుటకు ప్రేరణను పొంది సహాయం స్వీకరించాలనీ, తన జీవితానందాన్ని, మానసిక, ప్రాణిక భౌతిక సత్తను వృద్ధి చేసుకోవాలనీ వైయుక్తికాహంకారం భావిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

నిజ ప్రాణిక సత్త

నిజమైన ప్రాణిక, నిజమైన మానసిక, నిజమైన భౌతిక సత్తె అంటే అధోప్రకృతి యొక్క దోషము నుండీ, అజ్ఞానం నుండీ, బుద్ధి నుండీ విముక్తమై సూటిగా ఊర్ధ్వం నుండి జ్ఞానాన్ని, మార్గదర్శక త్వాన్ని అందుకునే పురుషుడని అర్థం.

మనకు రెండు మానసాలున్నాయి. వ్యక్తమైన మన పరిణామ హంకారం యొక్క ఉపరితల మానసానికి చెంది, పదార్థం నుండి ఉన్మీలమయ్యే స్థితిలో మనకు మనంగా సృష్టించుకున్న బాహ్య వ్యక్తి త్వానికి సంబంధించినదొకటీ,

యదార్థ మానసిక జీవితం యొక్క ఖచ్చితమైన అవధుల వలన నిరోధింపబడక విపులమై, శక్తివంతమై, ఉజ్వలమై, నిజమైన వ్యక్తిత్వమని మనం భ్రమపడే, బాహ్య స్వరూపమైన మానసిక వ్యక్తి త్వాన్ని వెనుక నుండి నడిపించే మానసిక సత్తకు చెందిన అంతరంగ మానసం మరొకటీ,

అలాగే మనకు రెండు ప్రాణాలున్నాయి. గత పరిణామం దృష్ట్యా భౌతిక శరీరంతో తెంచలేని సంబంధం పెట్టుకుని, పునరపి జననం, పునరపి మరణంగా పుడుతూ, గిడుతూ సాగే భౌతిక ప్రాణమొకటీ —

మన నిజమైన ప్రాణిక జీవనానికి హేతువై మనం మన నిజమైన అస్తిత్వమని భ్రమపడే జీవన స్వరూపం (form of living) వెనుక నుండి నడిపించే, జనన మరణాల పంజరంలో (చక్రంలో) చిక్కుకొనని మన ప్రాణిక సత్తకు సంబంధించిన అంతస్థలీయ (subliminal) ప్రాణశక్తి మరొకటి.

మన అస్థిత్వం (సత్త)లో కూడా ఇలాంటి ద్వైధీ భావమే వున్నది. మన భౌతిక శరీరానికే కాక ప్రాణిక, మానసిక కోశాలకు కూడా భౌతిక ద్రవ్యాన్ని సమకూర్చే సూక్ష్మమైన భౌతిక భూమిక మన శరీర ప్రక్రియల వెనుక వుంది. దీనినే మనలో వుండే జీవాత్మ యొక్క సంపూర్ణ శరీరంగా భ్రమపడుతూంటాము.

అలాగే మనలో రెండు చైత్య భూమికలున్నాయి. ఉపరితలం మీద వర్తిస్తూ మన ప్రాణిక వాంఛల మీదా, ఉద్వేగాల మీదా, రస జ్ఞత మీద, అధికారాన్నీ, సుఖాన్నీ కోరుకునే మానసిక తృష్ణమీద పనిచేసే కామాత్మ ఒకటీ.

మనం పొరపాటుగా ఆ పేరుతోనే పిలిచే భూమిక వెనుక వున్న వెలుగు యొక్క నిజశక్తికీ, ప్రేమకూ, ఆనందానికీ, వ్యక్తి యొక్క అంతస్సారమైన సంస్కారానికీ, సంబంధించి చైత్య సత్త యొక్క భౌతిక స్వరూప భూమిక వెనుక వర్తిస్తూ మనచేత చైత్యసత్త అని పిలువబడే మన నిజమైన జీవాత్మ మరొకటీ

*

మానవుని మొత్తం ప్రాణిక ప్రకృతి వెనుక, బహిరంగ ప్రాణిక స్వభావానికి పూర్తిగా భిన్నమై గుప్తమైన స్థిర ప్రాణిక సత్త వున్నది. ఉపరితల ప్రాణం సంకుచితమైన అజ్ఞాన పూరితమైన, పరిమితమైన అనిర్దిష్ట కామనలతో, అభిరతితో, ప్రగాఢ వాంఛలతో, తిరుగుబాటుతో సుఖదుఃఖాలతో, మోద ఖేదాలతో మహోల్లాస తీవ్ర విషాదాలతో వర్తిస్తుంది. దీనికి భిన్నంగా అసలైన ప్రాణసత్త విశాలంగా, విస్తృతంగా, విపులంగా, ప్రశాంతంగా, బలవత్తరంగా, అపరిమితంగా, స్థిరంగా, అచంచలంగా వుండి, అనంతశక్తినీ, అనంత జ్ఞానాన్నీ, అనంతానందాన్నీ అందుకోగలిగిన సామర్థ్యం కలిగి వుంటుంది. అంతేగాక తన నిరంహంకార స్థితి కారణంగా తాను దివ్యాత్ముని విభూతిననీ, ఆయన ఉపకరణాన్ననీ తెలుసుకుంటుంది. పవిత్ర పరిపూర్ణ దివ్యయోద్ధగా, ఆయన సంకల్పించిన విభూతి ఆవిష్కారానికి ఉపకరణమైన (దైవీ) శక్తిగా ఉపయోగపడుతుంది.

ఆలాగే మనలో ఒక నిజమైన మానసికసత్త ఒక నిజమైన భౌతికసత్త వున్నాయి. ఇవి వ్యక్తమైనపుడు మాత్రమే వీటిలోని ద్వైధీభావాన్నీ నీవు గ్రహించ గలుగుతావు. వెనుకనుండి నడిపించేది ప్రశాంతమైనదీ, శక్తివంతమైనదీ అయివుండి, ఉపరితలం మీద వర్తించేది వేదనామయంగానూ, అనిర్దుష్టంగానూ వుంటుంది. వెనుక వున్న అసలైన సత్త స్థిరంగా వుంటుంది. దాంట్లో నీవు జీవిస్తూ వుంటే వేదనా, అనిర్దిష్టతా బహిరంగానికి మాత్రమే పరిమితమవుతాయి. ఈ సంద

ర్భంలో బహిరంగాంశాలలో ఎక్కువ శక్తివంతంగా వ్యవహరించి, వాటిని పవిత్రంగా, పరిపూర్ణంగా మార్చవచ్చు.

అసలైన ప్రాణిక సత్త అంతశ్చేతన (Inner consciousness) లో వర్తిస్తూ, ఉపరితల వ్యక్తిత్వంలో ప్రకృతి యొక్క ప్రస్తుత విలాసానికి బాహ్యోపకరణంగా పనిచేస్తుంది. ఈ మార్పు సంభవించినపుడు నిజమైన ప్రాణసత్త తన సత్యంతో శ్రుతి కలువని బహిః ప్రపంచంలోని సత్యాన్ని తిరస్కరించి, తన యొక్క అధో ప్రకృతి యొక్క సూచనలను పాటించక, తన అంతః సంకల్పాలను వ్యక్తంచేసే నిజమైన ఉపకరణమవుతుంది. ఈ రెంటికీ మధ్య వున్న స్పష్టమైన విభజన రేఖ అనుభవంలో కనిపించకుండా అదృశ్యమవుతుంది.

*

నిజమైన మానసిక, ప్రాణిక లేక మానసిక భౌతిక సత్త ఆ కక్ష్యకు సంబంధించిన ఉన్నత లక్షణాలు కలిగి వుంటుంది — అనగా ఆ పురుషుడు. — అంతరాత్మలాగే దీనిని కూడా ఒక విధంగా దివ్యాత్మ యొక్క ఆవిష్కారమనొచ్చు. ఉన్నత చైతన్యంతో సంబంధం కలిగివున్నా, అది పూర్తిగా ఉన్నత చైతన్యం కాకపోయినా, దానిలో కొంత భాగాన్ని ప్రతిబింబిస్తుంది. దీనికి విశ్వసత్యం (cosmic truth) తో శ్రుతి కలుస్తుంది.

నిజమైన ప్రాణిక చైతన్యానికి ప్రాణం సంపూర్ణంగా సమర్పణ చేసుకుని తన్నుతాను దివ్యాత్మ యొక్క ఉపకరణంగా మార్చుకుంటుంది. ఏ కోరికా లేకుండా, ఏ కామ్యం కోసమూ పట్టుపట్టకుండా దివ్యమాత శక్తికి ప్రశాంతంగా, నిరహంకారంగా, నిరపేక్ష విశ్వాసంతో, విధేయతతో స్పందిస్తుంది. వ్యక్తిగతమైన ఉత్కర్షగానీ, పరమావధిగాని లేక తన కొరకేమీ కోరుకోక, పవిత్ర పరిపూర్ణ ఉపకరణంగా వినియోగపడాలని, తనలో మాత్రమే గాక సత్యం సర్వే సర్వత్రా ప్రవర్తిల్లాలనీ, దివ్యాత్మకు విజయం సిద్ధించి, దివ్యకర్మ నిర్వహింపబడాలనీ (ప్రాణిక సత్త) కాంక్షిస్తుంది...

ఎక్కడైతే కోరికకూ, వాంఛకూ, క్రుంగదీసే ప్రతీకారానికీ అవకాశముండదో, ఎక్కడ పవిత్రత, సంతృప్తి, సంతుష్టి కృతజ్ఞతా వుంటాయో అది ప్రాణశక్తి చాలనమేనని తెలుసుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

కపటాత్మ, నిజాత్మ* — జీవితం యొక్క యథార్థ లక్ష్యము

ప్రాణశక్తి: మనది పూర్ణయోగము. ప్రాపంచిక జీవితమును నిరాకరించునదికాదు. కేవలం అంతరంగికానుభూతులతో తృప్తిపడి సరిపెట్టుకొనుట దాని అభిమతము కాదు. అంతరంగిక జీవితమునకు మరియొక ప్రయోజనము కూడా కలదు — అది బాహ్యాజీవితమును పరివర్తింపజేయుట. బాహ్యాజీవితమును నడిపించే యంత్రము ప్రాణశక్తి. ఈ ప్రాణశక్తినికూడా యోగశక్తి పరిధిలోకి తీసుకొని రావలయును. సాధన ద్వారా యోగశక్తి మనలో రగుల్కొని ప్రవృద్ధ మానమవుతుంది. ఆ యోగశక్తి దైవంతో సంపర్కము కలిగి వుంటుంది. నీవు యోగశక్తికి ఒదిగి దాని వెలుగులో నడిచినచో, నిన్ను దైవము చేయిపట్టుకొని నడిపించినట్లే. నీ మార్గదర్శకుడు దైవమే! నీ బాహ్యాజీవితమును గూడా యోగ పరిధిలోనికి తెచ్చినపుడు ప్రాణశక్తికూడా యోగశక్తి ఆధ్వర్యములోకి వస్తుంది. దాని స్థాయి పెరిగిన కొద్ది బాహ్యాజీవితముకూడా మెరుగవుతూ వుంటుంది.

కపటాత్మ: మానవులలోని జీవేచ్ఛ (will-in-life), అజ్ఞాన భూమికలో తన ప్రయోజనాల కోసం కామాత్మ అనే ఒక దానిని సృష్టించుకొంటుంది (అసలు జీవియైన నిజాత్మ: దైవము యొక్క విస్ఫులింగము బదులుగా). ఆ మనిషి యొక్క జీవన ప్రవృత్తులన్నీ కామాత్మచే ప్రేరేపింపబడి దోషభూయిష్టమై వుంటయి. దాని ముసుగులు పలురకములు. గొప్ప గొప్ప నైతిక కార్యములు, మతాభినివేశములు, పరహితత్వము, దానధర్మములు, ఆత్మత్యాగము, నిస్వార్థత్వము అనే సమస్తమైన వ్యవహారములు యీ కామాత్మ అలముకొని వున్న గడ్డిబొమ్మలే. దాని విన్యాసములే.

ఈ కామాత్మ అహంకార భూయిష్టమైనది. దాని చర్యల ద్వారా దాని వేర్పాటు భావమును (ఖండచేతన) సమర్థించుకుంటూ

---

*నిజాత్మ = psychic

కపటాత్మ = అహంకారము = false desire-soul

ఉంటుంది. పైకి ఎంత మహారాజులా కన్పడ్డప్పటికి, దాని అసలు ఉద్దేశం తన శరీరాన్ని పెంచుకోవటమే. "మనకాయుష్యం మనకారోగ్యం" అన్నట్లు దాని స్వత్వమును (possession), భోగమును, విజయమును సామ్రాజ్యమును విస్తరింప జేసుకుంటుంది. జీవితాన్ని అశాంతి, సంఘర్షణ, వికారము అనే శాపములనుండి విముక్తి చేయవలె నన్నచో నీ జీవితాన్ని నీ నిజాత్మయైన చైత్యపురుషునికి అప్పచెప్పాలి. వాంఛాహంకారములకు ఆటపట్టైన కపటాత్మను విలీనము చేయాలి. అయితే జీవితాన్ని మట్టుకు వైరాగ్యంతో అణగదొక్కకూడదు. అది వికసించి కృతార్థత నొందవలసినదే.

నిజమైన ప్రాణపురుషుడు: ఎందుకంటే పైకి వాంఛగా కనపడే దాని చాటున, దాని లోపల నిజమైన ప్రాణపురుషుడు (true vital being) దాగి ఉన్నాడు. అహంకారాన్ని విలీన పరచినపుడు దాంతోపాటు యీ ప్రాణపురుషునికి కూడా మరణశాసనం విధించగూడదు. దానిని బహిర్గతంచేసి, నిటారుగా నిలబెట్టి పెద్ద పీట వెయ్యాలి. బాహ్యజీవితములో దైవ ప్రకృతి యొక్క ఉపకరణముగా భాసింప చేయాలి. మనలోని జీవశక్తి తన దివ్య లక్షణమును ఎట్లా సాధిస్తుంది? యథార్థ ప్రాణపురుషుడు (true vital being) యథార్థ అంతరాత్మ ఆధ్వర్యంలో కార్యశీలి అయినప్పుడు. వస్తుతః ఈ ఆశయములెప్పటి వలెనే యున్ననూ, దానియంతర్లక్ష్యమూ, బాహ్యాలక్ష్యమూ మాత్రము రూపాంతరము చెందుతాయి. సాధారణ ప్రాణశక్తివలె దివ్యప్రాణశక్తికూడా అభివృద్ధి కొరకూ ప్రతిష్ఠకొరకూ ప్రవర్తిల్లునను మాట నిజము. కాని, ఆ ప్రతిష్ఠ బాహ్యాస్థమైన క్షుద్ర వ్యక్తిది కాదు. అంతర్గతుడైయున్న పరమపురుషునిది. ఆయభివృద్ధి యథార్థమైన పరమపురుషతత్త్వము లోనికభివృద్ధి.

అహంకారమును వశంవద మొనర్చుకొని విచ్ఛిన్నము చేసిన గాని యీ పరమపురుషావిష్కారము జరుగదు.

జీవితము యొక్క అసలు లక్ష్యము ఇదియే:

అభివృద్ధి: అభివృద్ధి చెందవలసినది నీ సిరిసంపదలు కాదు — దైవము — ప్రకృతిగతమైన నీ దేహ మనోప్రాణములద్వారా.

వశము: దురంహంకారముతో భూతజాలమును (వస్తువులను) వశమొన ర్చుకొనుట గాదు. తదంర్గతమైన దైవమును దైవ స్ఫూర్తి తోనే దర్శించుట.

భోగము: విశ్వములో దివ్యానంద భోగమును పొందుట.

సమరము, విజయము, రాజ్యము: తిమిరాంధకార శక్తులతో పోరాడి, ఓడించి, విజయకేతనమును ఆవిష్కరించి రెపరెప లాడించుట.

ఆధ్యాత్మిక సామ్రాజ్యము: బాహ్యాభ్యంతర ప్రకృతులను వశపరచు కొని, వాటిపై నిరంకుశాధిపత్యమును గరపుట.

విజయము: జ్ఞాన ప్రేమ దైవేచ్ఛల ద్వారా అజ్ఞాన క్షేత్రములపై విజయ మును సాధించుట.

యథార్థ ప్రాణమయ పురుషని స్వభావము:

ఇట్లు కామము నిర్మూలమై చేతనయందీ విశాల సర్వసమ త్వము నెలకొని నప్పుడే, మనలోని యథార్థ ప్రాణమయ పురుషడు ముసుగు బయటికి వచ్చి, శాంతి సంధాయకమైన — శక్తిపూరితమైన — సన్నిధిని మనకు గల్పించును.

అదియే ప్రాణమయ పురుషని నిజరూపము: పరమ పురు షని దివ్యేచ్ఛకది విధేయమై, తేజోమయమై సత్య సంపన్నమై, అహం కార రహితమై. కావుననే అత్యంత మహోన్నతమైన కార్య సాధకమై యొప్పారుచుండును. బాధా సంకులమూ, భేద లక్షణోపేతమూ, ప్రయాస బహుళమూనైన యీ బాహ్యప్రాణశక్తి కాదా యదార్థ ప్రాణశక్తి. అయ్యది శాంత్యానందమయమూ తేజోబలసమన్వితమూనైన దివ్యశక్తి. విశ్వమ నంతనూ తన రెక్కలలో నిముడ్చుకొని విశాల దివ్య విహాయసపథ మున విశృంఖల విహారము చేయు దివ్య విహంగము.

చైత్యపురుషుడు:

కాని ప్రాణశక్తి యిట్లు మహాబలసమన్వితమూ సమత్వ భావ సంపన్నమూ అయినంత మాత్రమున చాలదు. ఏలయన, తన్మూల మున దివ్యజీవనమునకొక సాధనమమరినట్లయినదే కాని, దాని నియ మనమూ పరిపాలనమూ ప్రారంభమైనట్లు కాలేదు. ఇచటనే మన అంతరాత్మకు — చైత్యపురుషనికి (psychic being) పని తగులు చున్నది. అత్యంతపరమమైన నియమన పరిపాలనము నీ చైత్యపురు

మడే చేయుననుటకు వీలులేదు. అది యాతని పనికాదు. అజ్ఞానములో నుండి దివ్యజ్ఞానములోనికి పరివర్తనము చెందు సంధి దశలో, బాహ్యాభ్యంతర జీవన కర్మలను క్రమక్రమముగా ప్రేరేపించుచూ దారిచూపుట మాత్రమే అతని పని. పరాశక్తి ప్రేరితములగు దివ్య ప్రాణవృత్తులతో శోభించెడి ఆయాధ్యాత్మిక సంసిద్ధికి ఏ పద్ధతి త్రొక్కవలెనో, ఏ మార్గమునను సరింపవలెనో, ఏ నడక నడవ వలెనో అనుక్షణమూ ఆ చైత్య పురుమడే నిర్దేశించుచుండును.

దివ్యప్రకృతి:

దివ్యప్రకృతి అనగా అది ఒక పాషాణము, అహంకార మానవ జీవితపు తళుకులు బెళుకులు లేని నిర్వర్ణము, నిర్వీర్యము అయిన ఎండుమోడు అనే భావన బహుశా సన్యాసి సాంప్రదాయం వలన పాతుకొని పోయి వున్నది. అయితే దివ్య ప్రాణికము (divine vital) అనేది లేదా యేమిటి. దాని ఎత్తే వేరు — దాని స్థాయే వేరు. దాని ముందర ప్రస్తుతము వున్న ఈ అసమర్థము, బాధామయము, క్షణ భంగురము అయిన ఈ అసంపూర్ణ మానవుని జీవితమంతా తీసికట్టే. అవి ఎందుకూ పనికి రావు. ఆ దివ్య ప్రాణికము అభివ్యక్త పరచు కొనుటకు. తగిన సాధనములు దొరికినప్పుడు ఇంతకంటె వెయ్యిరెట్లు అధికమైన ప్రేమ, సౌందర్యానందములు; వెయ్యి రెట్లు తీవ్రమైన పులక రింపులు, జలదరింపులు; వర్ణనాతీతమైన, మానవ ప్రాణిక జీవితము యొక్క ఊహకు కూడా అందనంత బ్రహ్మాండమైన స్థాయిలో ఒకటే సుఖసంతోషానుభూతులు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి
కొంత భాగం కమలాకర వెంకట్రావుగారి
యోగసమన్వయములోనిది

గమ్యము

...ప్రాణము స్నాయుశక్తి, మనశ్శరీరక్రియా వాహకము. రథము నకు గుఱ్ఱమును పూంచినట్లు మనశ్శరీరముల కిది వాహనము. మన స్సుచే ప్రచోదితమై — తనగమ్యమున కగుమార్గాలలో ప్రయాణిం చును. కాబట్టి ఈప్రక్రియనే ఈఉపనిషత్తు యునక్తి-యోజింపబడి — ముందునకు చలించుచున్నదని — ఇంకను ముందునకు చలింపచేయ బడుచున్నదనియు వర్ణించుచున్నది. ఇది వేదమందలి అశ్వప్రతీకను స్ఫురింపచేయుచున్నది. అశ్వమనగా ప్రాణశక్తి నిదానము (ప్రతీక). ఈ ప్రాణమే జగత్ లేక స్వాప్నికచేతనాధీనమై — వస్తురూపాలలో భౌతికపరిస్థితులకు బద్ధమై చలించును. మఱి మనస్సేమిటి? అదొక ప్రకృతి. మనలోనిచలనము. అది మనభౌతిక — వాస్తవికస్థితికి బ్రహ్మయొక్కజ్ఞానమునకు ప్రతిబింబమైనఅజ్ఞానమునకును — ప్రతి నిధి. ఇది జ్ఞాతృచైతన్యము. సత్తునకు ప్రతినిధి. ఆస్థితి — ఉనికి పాంచభౌతికమైన, ప్రతిశీర్షక (mask) మున వ్యక్తమగుచున్నది. అది ప్రత్యేకస్థితి. విభాజ్య సూత్రము. కాబట్టి ప్రాణశక్తి భౌతికసత్తలోని చలనస్వరూపమైన పరమేశ్వరశక్తి. అతడు తన ఉనికిని తానే నియ మించుకొనుచు భోగించును. అది విశ్వజనీనమైనశక్తి. ప్రపంచమందలి ప్రతిభౌతిక పరమాణువునందును నిండారి ప్రతి చలనక్రియలో ఉత్సా హవంతమై, నిత్యభ్రమణమున సంతతమై — పరిణామశీలమై — ప్రపంచసత్త కాధారమగుచున్నది.

కాని మనస్సెట్లు పరమచైతన్యమునకు క్రిందిదో — మన స్సునకు పైన అనంత దివ్యచైతన్యమున్నది. కాబట్టి — సంకల్ప మున్నది కాబట్టి — జ్ఞాన మున్నది. కాబట్టి అది మనస్సుయొక్క అజ్ఞానక్రియలను నియమించుచుండును. బ్రహ్మ, స్వస్థితిని ఆచైతన్య ముచే చూచుకొనునుగాని మనస్సుచే కాదు. అట్లే ప్రాణశక్తి తోడను. మనలో ప్రాణశక్తి చిహ్నములివి. కోర్కె, ఆకలి, భోగము ఇదే భుక్త

వస్తువినాశన హేతువు. ఆ ప్రాణశక్తి, చలన (క్రియ) రూపములలో* వ్యక్తమగును. వస్తువును పొందుట — వ్యాపించుట కొరకు తపన — వాంఛితవస్తువును తనలోనికి గ్రహించుట ఇత్యాదులన్నియు తత్స్వరూపములే. ఈవాంఛానిశ్వాసమున భౌతికభోగమున నిజమైన జీవితము లేదు. దివ్యశక్తియు నిందు వెలుగబోదు. ఆ పరమజ్ఞానభిన్న విషయమే మనస్సాధ్యము. కనుకనిది పరిచ్ఛిన్నము. సాంతము, విభాజితము. మనఃక్రియ లన్నియు ద్వంద్వ-అజ్ఞానబద్ధము లగునట్లు — పరమ చైతన్య ప్రతిబింబములగునట్లు ఈప్రాణశక్తి చలనమును అట్లే దివ్యశక్తి ప్రతిబింబము. ఆపరమశక్తి భోక్తముకంటె ఉత్కృష్టము. మహా జ్ఞానము. కాబట్టి వాంఛలకు, ఆకలిదప్పులకు, మార్పులకు, సవిఘ్న కర్మకు —అతీతము. ఇచ్చటి కోరిక స్వరూప మెట్లుండునో? — స్వయంస్థితమైనప్రేమ. ఇక్కడి ఆకలిదప్పులేమి? వాంఛారహిత సంతృప్తి. ఇక్కడి భోగ మేమిటి? స్వయంస్థితానందము. ఇచటిక్రియ ఏమి? సర్వశక్తిమంతము. అది మన జీవితమునకు జీవితము — ప్రాణమునకు ప్రాణము. దీనిచే ఈభౌతిక-క్షుద్రకర్మ ధ్యేయోన్ముఖముగా చేయబడుచున్నది. అది దీని కధిష్ఠానము. బ్రహ్మము ఈప్రాణముచే నిశ్వసించదు. ఈప్రాణశక్తిచే జీవించదు. అది జననమరణద్వంద్వాతీతము కనుక.

ఆ ప్రాణమునకు ప్రాణమైనదాని స్వరూపమేమి? అది చిచ్ఛక్తి లేక తపస్సు — పరమశక్తి. అనంతశక్తి స్వరూపిణి. పరమచైతన్య ప్రకాశములోని మహా క్రియాశక్తి. ఆచైతన్యము తనకు తెలిసినట్టిది కాబట్టి ఆనందఘనము. ఆ ఆత్మజ్ఞత — తనను తా నెరుగుట — తనపై తనకు యాజమాన్య ముండుట. అదియు కాలాతీతము. ఈ యాజమాన్యము క్రియోన్ముఖమగునపుడు సర్వవ్యాపకము, సర్వజ్ఞము నగు అనంతచైతన్యముగా స్వయంవ్యక్త మగుచున్నది. అది ఆరెండు కంబాల నడుమనే యుండునుగాన. ఒకటి శాశ్వత నైశ్చల్యము కేవల

---

* ఇవన్నియు ప్రాణప్రతీకయైన అశ్వశబ్దమున వేదఋషి ఉద్దేశించినాడు. అశ్వశబ్దధాతువులు, 1. ఆశ = ఆశించు; 2. అశన = ఆకలి; ఆశ్ = తినుట 3. భోగించుట, 4. ఆశు = వేగము 5. అచ్ = కదలు, పొందు, వ్యాపించు — మొ॥.

దాత్మ్యము. మరొకటి శాశ్వతశక్తి. తా నన్నిటితో తాదాత్మ్యము వెందునట్టిది. ఈశక్తిని స్థాణువు శాశ్వతముగా మోయుచున్నది. అది నిజమైనస్థితి — మహాప్రాణము. దానినుండి మన ప్రాణము జీవితము బహిర్గతమై సాగుచున్నది. అదే శాశ్వతత్వము — అమృతత్వము. మన మనుకొనుజీవితము. 'ఆకలి అనగా మృత్యువు' కాబట్టి ధీరలక్ష్య మేమనగా ఈఅసత్య భౌతిక ద్వంద్వమగుజీవిత — మృత్యుస్థితి కావ లనున్న స్వకీయమైన ప్రకాశాత్మక అమృతత్వమును అధిగమించుట.

కాని ఈప్రాణశక్తి దానికర్మలెంత క్షుద్రములైనను — అది వ్యక్తి సహజ స్ఫురణ, సంకల్ప, స్వరూపము. అది దేనికి ప్రాతినిధ్యము వహించునో ఆప్రకాశము సర్వోత్తీర్ణము కారణము. దానిచే నిది ముందునకు — లక్ష్యోన్ముఖముగా పథాలవెంట కొనిపోబడుచున్నది. ఆధ్యేయము స్వస్థితియందు గర్భితమై యున్నదే — అనగా అపరిపూర్ణ చలనగర్భితము. ఇది మృత్యువు. కాని జీవిత మనుకొనుచున్నాము. పరమజ్యోతి కది ఒకఛాయామూర్తి. కాని అదే పదార్థగతదీర్ఘనిద్ర నుండి — మనము మార్చుకొనుటద్వారా జరుగును.

మర్త్యజీవితమును త్రోసిపుచ్చి ఇతరానుకూల భూమికలకు పోయి అమృతత్వాన్ని సాధించాలనుకోవటం పొరపాటు. 'ఇహైవ' ఇక్కడే, ఈ మృన్మయ జీవితంలోనే అమృతత్వాన్ని సాధించాలి. ఈ అపర బ్రహ్మమునందే, ఈ శరీరధారి ద్వారానే ఆ పరబ్రహ్మము విజ్ఞా తము కావాలి, ప్రాప్తించాలి.

మూలం: శ్రీఅరవిందులు

తెలుగు మూలం: డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు

కేనోపనిషత్తు (భాష్యారవిందము)

విశ్వంలో 'విరాట్‌పురుష' డనీ అంటాం. సంభూతిమూలతత్వాన్నీ, దాని శక్తుల్నీ మనం 'ప్రకృతి' అంటాం. కానీ, సత్త, తద్గత చిచ్ఛక్తి, ఆనందం 'సత్' యొక్క ఉపాదాన భూతాలైన మూడు తత్వాలు. కను కనే ఈమూడు మూలతత్వాలతో, ఒకవిధమైన సంబంధం పెట్టుకొౌన టంకోసం, ప్రకృతి ప్రేరేపించబడుతుంది. వీటికి ఒకవిధమైన రూపం ఇవ్వటంకోసం అనుమతించబడుతుంది. వాటి (సంబంధ, రూపాల) ద్వారానే వస్తుతః, ఏలోక స్వరూపమైనా నిర్ధారితమవుతుంది. ఎందుచే తనంటే, సత్, స్వయంగానే, తన సంభూతికి ఉపాదాన మవుతుంది, సదా, అవుతూ ఉంటుంది. దీనితో శక్తికి సంబంధం ఉండేటట్లుగా దీన్ని ఒక పదార్థంగా రూపొందించాల్సి ఉంటుంది. శక్తి అంటే నిశ్చ యంగా ఒక బలం. ఆబలం పదార్థనిర్మాణం చేస్తుంది. ఆపదార్థం ద్వారా, ఎన్ని లక్ష్యాలకోసమైనా పని చేస్తుంది. సాధారణంగా మనం 'ప్రకృతి' అని వ్యవహరించేదే, శక్తి. లోకసృష్టి చేయటంలో గల లక్ష్యం, ఉద్దేశం సమస్త సత్తలో, సమస్త శక్తిలో, వాటి సమస్త కార్యకలాపంలో అంత ర్నిహితమై ఉన్న చేతన ద్వారానే సాధించబడాలి. తనను తాను పొందటం, జగత్తులో తన ఉనికి (అస్తిత్వం) యొక్క ఆనందం అనుభ వించటం ఆ లక్ష్యం కావాలి. ఏ ప్రపంచసత్త అయినా, సమస్త సంబం ధాల్నీ, లక్ష్యాల్నీ ఈ ఉద్దేశంతో తనను తాను పరివర్తితం చేసుకోవా లిసి ఉంటుంది. జగత్-సత్త, తన అస్తిత్వ దశల్నీ, శక్తినీ, ఆనందాన్నీ వికసితం చేసుకొంటున్న సత్త. ఇది ఇక్కడ అంతర్లయన (involved) స్థితిలో ఉంటే, వీటిని వికసింప జేయాల్సి ఉంటుంది. అవి ఆవృతాలై ఉంటే వాటిని వ్యక్తం చేయాల్సి ఉంటుంది.

భౌతికతత్త్వమైన, ప్రధాన నిర్ధారకమైన పురుష-ప్రకృతుల సంబంధాల భూమిక ఒకటి ఉంది. అనగా స్థూల భౌతిక సత్తకు సంబంధించిన ఒక లోకం ఉంది. అట్లాగే, సరిగా దానికి పైన మరొక లోకం ఉంది. దాన్లో భౌతికతత్త్వం సర్వోపరి కాదు, ప్రాణశక్తి, ప్రధాన నిర్ధారకరూపంలో దాని (భౌతికతత్త్వ) స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ లోకంలో పదార్థాల రూపాలు జీవనస్థితుల్ని నిర్ధారించలేవు. జీవితమే వాటి రూపనిర్ధారణం చేస్తుంది. కనుకనే, ఇక్కడ రూపాలు భౌతికప్ర పంచ రూపాలకంటె అత్యంత స్వతంత్రాలు, తరళాలు (fluids) వ్యాప

కరూపంలో, మన భావనల దృష్టితో అద్భుతమైన పరివర్తన స్వభావం గలవి. ఈ ప్రాణశక్తి నిశ్చేతనమైన జడశక్తి కాదు. తన అతి నిమ్న క్రియల్ని వదిలి, ఇతర క్రియల్లో ఇది మూలపదార్థగతమైన అవచేతన శక్తి. ఆ సచేతన శక్తి, రూపసృష్టికి తోడ్పడుతుంది. కానీ, ఇంతకంటే ఎంతో ఎక్కువ మూలరూపంలో ఉపభోగం, అధికారలాభం, స్వీయ సక్రియ ఆవేశం యొక్క పూర్తికోసమే, సహాయాన్ని అందిస్తుంది. కను కనే, ఇచ్ఛ, ఆవేశంయొక్క సంతోషమే, కేవల ప్రాణిక సత్తకు సంబం ధించిన ఈ లోకానికి, ఆత్మ, తత్ ప్రకృతి సంబంధాల ఈ భూమి కకూ మొదటి నియమము. ఈ లోకంలో ప్రాణశక్తి, మన స్థూల జీవితంకంటె, ఎంతో ఎక్కువ స్వాతంత్ర్యంతో సామర్థ్యంతో తన క్రీడ సాగిస్తుంది. దీన్ని కామనాలోక మనవచ్చు. ఎందుకంటే, కామనే దాని ప్రధాన లక్షణం. స్థూలశరీరం బద్ధమై ఉన్నట్లు కనిపించినట్లుగా, మార్పు చెందని ఒకే నియమానికి బద్ధమై లేదు. విశేషించి, ఇది తన స్థితిలో అనేకవిధాలైన మార్పులు తీసుకొనివస్తుంది, అనేక ఉపభూమి కలకు స్థానమిస్తుంది. ఆ ఉపభూమికలు, ఒకవైపు భౌతిక సత్తను స్పృశించే, భూమికలతో, ఆ సత్తతో కలిసిపోయాయా అన్నట్లు ఆరంభ మైతే, మరోవైపు, ప్రాణశక్తి శిఖరంపైన శుద్ధ మానసికమైన, చైత్య సంబంధులైన స్తరాల్ని స్పృశించే, వాటిలో కలిసిమెలిసిపోయే భూమి కల వరకు చేరుతాయి. ఎందుకంటే, ప్రకృతిలో సత్తాగతమైన అనంత క్రమ పరంపరలో, మధ్యమధ్యాదూకి దాటవలసిన ఏవో కొన్ని వెడ ల్పైన అగడ్తలూ లేవు, ఎగుడు దిగుడైన అంతరాళమూ లేదు. ఒక భూమిక, మరో భూమికలో కలిసిపోయి ఉంటుంది. సమస్త క్రమపరం పరలో ఒక సాతత్యం ఉంది. ప్రకృతిగతమైన విభిన్న అనుభవాల్ని పొందే శక్తి, ఈ సాతత్యంలోనుంచి క్రమాల్ని (orderings), నిశ్చిత భూమికల్నీ, విస్పష్ట స్తరాల్నీ సృజిస్తుంది. వాటిద్వారా ఆత్మ, ప్రపంచ జీవితానికి సంబంధించిన స్వీయ శక్యతల్ని (potentialities) అనేక రూపాల్లో తెలుసుకొని, వాటిని సంపాదిస్తుంది. ఎందుకంటే, ఏదోవిధ మైన ఉపభోగమే కామనయొక్క సంపూర్ణ లక్ష్యమై ఉంటుంది. కామ నామయ లోకానికిసైతం ఇదే ప్రవృత్తి ఉండాలి. కానీ, ఎక్కడైనా ఆత్మ, స్వతంత్రమై ఉండదు, — కామనకు లోబడినపుడు ఇది, స్వతం

ప్రంగా ఉండనేలేదు, — ఇక్కడ, దీని సమస్త అనుభవానికి సంబంధించిన భావాత్మక, అభావాత్మక రూపాలు ఉండాలి. ఈ కారణంచేతనే, ఈ జగత్తు, సీమిత, స్థూల మనస్సుకు అచింత్యంగా (inconceivable) అనిపించే విశాల, లేక తీవ్ర, లేక సతత ఉపభోగాల (enjoyments) సంభావ్యతను మాత్రమే తనలో ధరించదు. ప్రత్యేకించి, అంతే గొప్ప కష్టాల సంభావ్యతను గూడా తనలో ధరించి ఉంటుంది. కనుక, నిష్పన్నతమమైన స్వర్గాలు, నరకాలు మొత్తం ఈ ప్రాణలోకంలోనే ఉన్నాయి. ఈ స్వర్గాల, నరకాల కపోలకల్పిత కథద్వారా, కల్పన ద్వారా, మానవ మనస్సు అతి ప్రాచీన యుగాలనుంచి తనను ప్రలోభితం (lured), సంత్రస్తం (terrified) చేసుకొన్నది. నిస్సందేహంగా, మానవ కల్పనలన్నీ, ఒకానొక సత్యవస్తువుతో, వాస్తవిక సంభావ్యతతో సంబంధం కలిగిఉన్నాయి. కానీ, అవి స్వయం, సర్వథా అపరిశుద్ధ నిర్ణయాలు, లేక అత్యంత భౌతిక రూపకాల్లో ప్రకటించబడ్డాయి. కనుకనే, అతిభౌతిక సద్వస్తువుల సత్యాన్ని ప్రకటించటంలో ఉపయోగరహితాలైనాయి.

ప్రకృతి, అసంబద్ధ దృగ్విషయాల సమూహం కాదు. ప్రత్యేకించి అది, జటిలమైన ఏకత్వంతో కూడిఉంది. కనుకనే, స్థూల భౌతిక జగత్తుకూ, ఈ ప్రాణిక కామనామయ జగత్తుకూ మధ్య పూడ్చటానికి వీలులేని అగడ్త ఉండే వీలు లేదు. దీనికి విరుద్ధంగా ఇలా చెప్పవచ్చు. ఒక అర్థంలో ఈ రెండూ, ఒకటి మరొకదాన్లో ఉన్నాయి. కనీసం కొంతపరిధి వరకు పరస్పరాశ్రితాలు. నిజానికి, భౌతిక ప్రపంచం వస్తుతః, ఒక విధమైన ప్రాణలోక ప్రక్షేపం. అది (ప్రాణలోకం) దీన్ని, తన స్థితులకంటె భిన్నమైన దశల్లో, తన ఒకటి రెండు కోరికలకు మూర్తరూపం ఇవ్వటానికీ, వాటిని పూర్తిచేసుకోవటానికీ బయటికి ప్రక్షేపణం చేసింది, తననుంచి వేరుచేసుకొంది. ఆ దశలు భిన్నమవుతూగూడా, తనవే అయిన దాని అత్యంత స్థూల లాలసల యొక్క యుక్తిసంగతమైన పరిణామాలు. ఈ భూమి మీద ఉన్న జీవితం స్థూలవిశ్వంయొక్క మూలంమీద, నిశ్చేతన సత్తమీద ఈ ప్రాణలోకపు ఒత్తిడియొక్క పరిణామమే. వ్యక్తమైన మన ప్రాణిక సత్తగూడా, విశాలతరమైన, అతిగంభీరమైన ప్రాణిక సత్తయొక్క ఉపరి

తలంమీద జరిగే పరిణామం మాత్రమే. ఈ విశాలతరమైన ప్రాణిక సత్తయొక్క స్వీయ, విశేష స్థానం ప్రాణిక భూమికలో ఉంది. దీని ద్వారానే, ప్రాణలోకంతో మన సంబంధం జోడింపబడి ఉంది. ప్రాణ లోకం, మనమీద నిరంతరం సక్రియమై ఉంటుంది. భౌతిక ప్రపంచం లోని ప్రతి వస్తువు వెనకా ప్రాణలోకానికి సంబంధించిన విశిష్ట శక్తులు ఉన్నాయి. ఆ శక్తులు ఎంతదాకా ఉన్నాయంటే, అత్యంత స్థూలాలు, మూలపదార్థరూపాలైన వస్తువుల వెనకగూడా, మూల పదార్థగతాలైన ప్రాణశక్తులు, వాటిని ధరించే జీవులు ఉన్నాయి. ఆ శక్తులు, లేక జీవు లద్వారా అవి (ప్రాణలోకశక్తులు) ధరించబడుతున్నాయి. ప్రాణలోక ప్రభావాలు భౌతిక జగత్తుమీద నిరంతరం పడుతుంటాయి. ఇక్కడ తమ శక్తుల్ని, పరిణామాల్ని ఉత్పన్నం చేస్తున్నాయి. అవి తిరిగి ప్రాణలోకంలోకి పోయి, ఆ లోకంలో మార్పులు తీసుకొనివస్తాయి. మన ప్రాణభాగమూ, కామానామయమైన భాగమూ నిరంతరం ఈ ప్రాణలోక సంపర్కంలోకి వస్తున్నాయి, దీనివల్ల ప్రభావితమవుతు న్నాయి. దీనిలోగూడా, శుభకామన యొక్క కళ్యాణప్రదమైన, అశుభ కామనయొక్క అశుభప్రదమైన శక్తులు ఉన్నాయి. మనకు వీటి జ్ఞానం లేనప్పుడు, మనకు వీటితో ఏమీ సంబంధం లేనపుడు గూడా, మన మీద ఇవి పని చేస్తుంటాయి. ఈ శక్తులు కేవల ప్రవృత్తులు, నిశ్చేతన శక్తులు మాత్రం కావు. భౌతిక తత్త్వసీమల్ని వదిలి, అన్యత్ర ఇవి అవ చేతనాలుగూడా గాక, చేతనశక్తులు, సత్తలు, సజీవమైన ప్రభావాలు. మనం మన సత్తయొక్క ఉచ్చతర సత్తకు జాగృతమైనట్లుగానే, ఇవి మిత్రులనిగానీ, లేక శత్రువులనిగానీ తెలుసుకొంటాం; లేక, వాటిని మనం మన అధీనం చేసుకొనే శక్తులని తెలుసుకొంటాం. వాటిని జయించగలుగుతామనీ, అధిగమించి, వాటిని వదిలి వేస్తామని తెలుసు కొంటాం. యూరప్‌లోని గుహ్యావిద్య, ప్రత్యేకించి మధ్యయుగంలో, చాలా ఎక్కువగా ప్రాణలోక శక్తులతో, సంభావితమైన మనుష్య సంబంధ అన్వేషణలోనే నిమగ్నమైఉంది. ప్రాచ్యమైన ఇంద్రజాలం, ఆధ్యాత్మ విద్యల కొన్ని రూపాలు గూడా చాలా పెద్ద పరిమాణంలో ఈ అన్వేషణలోనే నిమగ్నమై ఉండేవి. గతకాలంలో అంధవిశ్వాసం చాలా ఎక్కువగా ఉండేది. అనగా, అజ్ఞానపూర్ణమైన, వికృతమైన

విశ్వాసాలు చాలా ఎక్కువగా వ్యాపించి ఉండేవి. వాళ్ల మిథ్యాపూర్ణ మైన వ్యాఖ్యలు, అతీతంగా ఉన్న లోకనియమాల అస్పష్ట వివేచనలూ కూడుకలో ఉండేవి. అయినప్పటికీ, గతకాలపు 'అంధవిశ్వాసాల' వెనక కొన్ని సత్యాలు ఉన్నాయి. భావి విజ్ఞాన శాస్త్రం, కేవల భౌతిక జగత్తులో నిమగ్నమయ్యే తన ప్రవృత్తినుంచి ముక్తమై, ఈ సత్యాల్ని తిరిగి అన్వేషించవచ్చు. ఎందుకంటే, స్థూల భౌతిక జగత్తులో మనోమయ ప్రాణుల ఉనికి ఎంత యథార్థమో, అతిభౌతిక లోకంగూడా, అంతే వాస్తవికం.

అయితే, మనవెనక ఉన్నదానిపట్ల, నిరంతరం మనమీద ఒత్తిడి చేస్తున్నదానిపట్ల, సాధారణంగా మనం ఎందువల్ల సచేతనులమై ఉండటంలేదు? మన పొరుగున ఉండేవాని అంతర జీవితంపట్ల మనం సచేతనులం కానట్లే, దానిపట్ల సచేతనులంగా ఉండటంలేదు. పొరుగున ఉన్న అతడు, మన అంతర జీవితంలాగానే, అస్తిత్వం కలిగి ఉంటాడు, మనమీద నిరంతరం ఒక గుహ్యాప్రభావాన్ని కలిగిస్తుంటాడు, అయినప్పటికీ వానిపట్ల సచేతనులంగా ఉండలేం, — మన ఆలోచనలు, భావాలూ ఎక్కువగా మనలోకి బయటనుంచే వస్తాయి. అనగా, అవి మనతోటి మానవులనుంచీ, వ్యక్తులయొక్క, మానవజాతి యొక్క సామూహిక మనస్సు — రెండింటినుంచీ వస్తాయి. మన సత్తయొక్క మహత్తర భాగాన్ని ఎందువల్ల తెలుసుకోలేక పోతున్నామో, ఆ కారణంచేతనే మన వెనక ఉన్న ప్రాణలోకాన్నీ తెలుసుకోలేకపోతున్నాం. మన సత్తాగతమైన మహత్తర భాగం మన జాగృత మనస్సుకు అవచేతనం, లేక ప్రచ్ఛన్నం. అది మన ఉత్తలీయ సత్తను నిరంతరం ప్రభావితం చేస్తూ ఉంటుంది. గుహ్య పద్ధతితో దాన్ని నిర్ధారణం కూడా చేస్తూ ఉంటుంది. సాధారణంగా, మనం మన భౌతిక మైన ఇంద్రియాల్ని ఉపయోగించటమే, ప్రాణలోకాన్ని తెలుసుకొనలేక పోవటానికి కారణం. మనం, తరచుగా శరీరంలో, స్థూల ప్రాణంలో, స్థూలమనస్సులో నివసిస్తాం. కానీ, ప్రాణలోకం, తిన్నగా ఈ ఇంద్రియాల ద్వారానే, మన సంపర్కంలోకి రాదు. ఈ సంపర్కం, లేక సంబంధం, మన సత్తయొక్క అన్యకోశాలద్వారా ఏర్పడుతుంది, — ఉపనిషత్తుల్లో ఇవి కోశాలనే చెప్పబడ్డాయి, — తరువాత వచ్చిన నిర్వ

చనాల్లో వీటికి పెట్టిన పేర్లను అనుసరించి చెప్పితే, ఇది అన్య శరీరాల ద్వారా ఏర్పడుతుంది. ఆ కోశాలు, లేక శరీరాలు-మనోమయకోశం, లేక సూక్ష్మ శరీరం. దాన్లో నిజమైన మన మనోమయ పురుషుడు నివసిస్తాడు. ప్రాణమయ కోశం, లేక ప్రాణికశరీరం స్థూల, లేక అన్నమయ కోశంతో ఎక్కువ సన్నిహితంగా సంబద్ధమై ఉంది. అది, దీనితో కలిసి, మన జటిల సత్తకు సంబంధించిన స్థూల శరీరనిర్మాణం చేస్తుంది. ఈ కోశాల్లో గుప్తంగా మనలో నిరంతరం పని చేసే శక్తులూ, ఇంద్రియాలూ, సామర్థ్యాలూ ఉన్నాయి. మన స్థూలేంద్రియాలతో, స్థూలప్రాణ, మనస్సుల చక్రాల (plexuses) తో సంబద్ధమై ఉన్నాయి. వీటిపైన అఘాతాలు చేస్తాయి (impinge) ఆత్మవికాసంద్వారా మనం వీటిని తెలుసుకొంటాం, వీటిలో మనం జీవితధారణం చేస్తాం, వీటి ద్వారా, మనం ప్రాణలోకంతోనూ, అన్యలోకాలతోనూ సచేతన సంబంధాలు స్థాపించుకోగలుగుతాం. స్వయంగా భౌతిక ప్రపంచ సత్యాల, తథ్యాల, సంఘటనల అధిక సూక్ష్మానుభవం, అధిక అంతరంగజ్ఞానం పొందటం కోసం వీటినిగూడా ఉపయోగిస్తాం. మన సత్త యొక్క స్థూల బౌతికస్తరమే, ప్రస్తుతం మనకు సర్వస్వం. కానీ, పైన పేర్కొన్న ఆత్మ వికాసంద్వారా, మనం దీనికంటె భిన్నమైన ఇతర స్తరాలమీదగూడా, కొంచెం ఎక్కువ, తక్కువగా పూర్ణరూపంతో నివసించగలుగుతాం.

ప్రాణలోక విషయంలో చెప్పబడింది అవసరమైన మార్పులతో, విశ్వసత్తకు సంబంధించిన, ఇంకా ఎక్కువ ఉన్నతమైన భూమికలకు గూడా సరిపోతుంది ....ఉన్నతతమ లోకాలు అతిమానసాలు. (supramental) అవి అతిమానసానికి జెందినవి.... సచ్చిదానందతత్వ త్రయానికి జెందినవి.

మూలం: అరవిందులు

తెలుగు మూలం: జనస్వామి సుబ్రహ్మణ్యా శాస్త్రి
యోగసమన్వయం

ప్రాణికముయొక్క రూపాంతీకరణం — ఆవశ్యకత I

మానవ స్వభావాన్ని కుక్కతోకతో పోల్చినట్లయితే, పదార్థాన్ని కఠినమైన గండశిలతో పోల్చవలసిందే. కాని ఈ రెండుకూడా పరిణామ క్రమములో సంభవించిన ప్రయాణ సత్రములే. కాబట్టి అవియును పరిణామ శీలములే. ఈ పరిణామము ప్రకృతి వశమున గాక యోగమార్గమున జరిగినప్పుడు అది 'రూపాంతీకరణము' అవుతుంది. ఈ ప్రక్రియయే ఈ శీర్షికకు విషయం. సంపాదకుడు

జడపదార్థము మీదా భౌతిక ప్రకృతి మీదా దైవశక్తి చేసే పనికంతకూ తప్పనిసరి అయిన సాధనం ప్రాణికం (the vital) లోని ప్రాణశక్తి (life-force). అందువల్ల ఈ ప్రాణికాన్ని రూపాంతీకరించి దైవశక్తికొక శుద్ధమయిన, పటిష్టమయిన సాధనంగా చేసినప్పుడే దివ్య జీవనమనేది సాధ్యమవుతుంది. అప్పడయితేనే భౌతిక ప్రకృతిని రూపాంతీకరించ గలగడం లేదా బాహ్యా జగత్తులో, దైవము తన శక్తి నంతనూ యదేచ్ఛగా ప్రయోగించి పనిచేయడం సాధ్యమవుతుంది. ఏమంటే, ఇప్పటి మన సాధనోపాయాలతో అటువంటి పనిసాధ్యం కాదు. ప్రాణమయ పురుషుడూ (vital being), మనిషిలోని ప్రాణశక్తీ దైవమునుంచి వేరుపడ్డాయి. ఆ విధంగా వేరుపడి అవి, వాటిని వశీకరింపకోగల, మంచిదయినా, క్షుద్రమయినా, దివ్యమయిన లేదా ఆసురికమయిన ఏ శక్తికయినా ఒక ఉపకరణమేనని ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. సాధారణంగా, ప్రాణశక్తి మానవ మనస్సు తాలూకు, మానవ జీవితపు సామన్య నిగూఢ ప్రవృత్తులను లేదా అర్థచైతన్యవృత్తులను, దాని మామూలు భావాలను, ఆసక్తులను, గాఢాభిలాషలను, కోరికలను ఉపచరిస్తుంది. కాని, ప్రాణశక్తికి, సాధారణ పరిమితులనధిగమించడం సాధ్యమే; ఆ విధంగా అధిగమించినప్పుడు అది, దాని శక్తులకొక ప్రేరణను, గాఢతను, ఉత్తేజాన్ని లేదా ఉన్నతిని పొందగలుగుతుంది. ఆ

శక్తులవల్ల అది, దైవశక్తులకు కాని ఆసురశక్తులకు కాని ఒక ఉపకరణం కాగలుగుతుంది; దాదాపు అయి తీరుతుంది. లేదా, ప్రకృతిలో వినిశ్చితమయిన కేంద్ర నియంత్రణ లేనట్లయితే దాని చర్య, ఈ (పరస్పర) వైరుద్ధ్యాల సంకుల సమ్మిశ్రణమవుతుంది; లేదా నిరర్థకమయిన ఊగులాటలో ఒకప్పుడు ఒకదాన్నీ మరొకప్పుడు మరొకదాన్నీ ఉపచరిస్తుంది. అటువంటప్పుడు, మీలో గొప్ప ప్రాణశక్తి పనిచేస్తూ ఉన్నా చాలదు; దానికి ఉన్నత చైతన్యంతో సంపర్కం కలిగించాలి; దాన్ని నిజమయిన నియంత్రణలో ఉంచాలి; దైవపాలనలో ఉంచాలి. అందుకే, ఒక్కొక్కప్పుడు ప్రాణశక్తి చర్యకు తిరస్కారంకాని దూషణకాని ఎదురవుతూ ఉంటుంది. ఎందువల్లంటే దానికి చాలినంత జ్ఞానంకాని నియంత్రణకాని ఉండక, అజ్ఞానయుతమూ ఆసురికమూ అయిన ప్రవృత్తికి బద్ధమయి ఉంటుంది. కనుకనే ఊర్ధ్వమునుంచి స్ఫూర్తీ, శక్తీ రావడానికి ఉన్మీలనమై ఉండాలి. ప్రాణశక్తి దాని మట్టుకు అది ఎక్కడికీ చేర్చలేదు. అది లక్ష్యరహితమయిన రీతిలో సాగుతుంది; తరచుగా, బాధాకరమయిన, వినాశకరమయిన వలయాల్లో సాగుతూ నిటారు చరియకు సైతం తీసుకువెళ్తుంది. కారణం, దానికి సరైన మార్గదర్శకత్వం లేకపోవడం. ఉత్కృష్టమూ ఉజ్వలమూ అయిన ప్రయోజనం కోసం, దాన్ని ఉన్నత చైతన్యపు క్రియాశీలమైన శక్తితోను, దాని ద్వారా పని చేసే దైవశక్తితోను అనుసంధానం చెయ్యాలి*.

•

మనిషి మామూలు జీవితాన్ని గడిపినంత కాలం, అతనిలోని భిన్న విభాగాలన్నీ వాటి యిచ్చవచ్చిన రీతిని అభివ్యక్తపరచుకొని తృప్తినొందవచ్చు. వాటి పాపాన్ని అవి పోతాయి. కాని యోగమనేది ఒకటి ఉన్నది. దాని లక్ష్యము మామూలు మానవ క్రియాకలాపాల బదులు ఉన్నత సత్యము యొక్క ధర్మమును స్థాపించుట. దాని సమర్థతను కొనివచ్చుట. దైవశక్తికి సమర్పించుకొనుటయే దాని ప్రధాన

---

* రూపాంతీకరణం అంటే ఉన్నత చైతన్యాన్ని లేదా ప్రకృతిని మనస్సులోకీ ప్రాణికంలోకీ దేహంలోకీ తీసుకురావడం, అది కిందవాటి స్థానాన్ని ఆక్రమించడం

ప్రక్రియ. అయినప్పటికి "మేము స్వేచ్ఛాజీవులం" అని యదేచ్ఛగా ప్రవర్తించి కొన్ని అంధకారశక్తులకు లోబడిపోయి, ద్వంద్వజీవితము గడుపుట మా జన్మహక్కు అనుట మూర్ఖత్వమూ, అంధకారమూ మాత్రమే అవుతయి.

ఒక వైపున అతిమానస సాక్షాత్కారం (supramental realisation) ఉంది. కమ్ముకుంటూ అవతరించే అతిమానస దైవశక్తి ఇది; భూమిమీద ఇంతవరకు సాక్షాత్కరించని అత్యంత మహనీయ సత్యం తాలూకూ ప్రకాశమూ శక్తీ. అందుచేత, ఈ చిన్ని మానవ మనస్సూ దాని తర్కమూ వేటిని శాశ్వత సత్యాలుగా పరిగణిస్తాయో వాటికి అతీతంగా ఉండేది ఇది; దేని స్వభావాన్నీ మార్గాన్నీ ఇక్కడి వికాస ప్రక్రియనూ అది (మానవ మనస్సు) తన అసమర్థక సాధనాల ద్వారా గ్రహించడం కాని, దర్శించడం కాని చెయ్యజాలదో, శైశవ సహజమయిన (అపరిణతమయిన) తన ప్రమాణాలతో నిశ్చయించజాలదో అది. ప్రతికూలత ఎంతగా ఎదురయినప్పటికీ ఇది, శారీరక (physical) చేతనలోనూ భౌతిక (material) జీవనంలోనూ వ్యక్తం కావడానికి దిగి వస్తోంది. మరొక వైపున, నిమ్న ప్రాణప్రకృతి ఉంది; మిథ్యాహంకారం, అజ్ఞానం, అస్పష్టత మాంద్యం లేదా అసమర్థ విజృంభణ తన పెంపుకోసం నిలవడం, అవతరణకు వ్యతిరేకంగా నిలవడం, వాస్తవమయిన మరే వాస్తవాన్నీ, అతిమానస లేదా అతిమానుష చేతనకూ సృజనకుగల వాస్తవ సంభావ్యతను దేన్నీ నమ్మడానికి అంగీకరించక పోవడం, లేదా అంతకంటే అసంగతంగా — దానికి అస్తిత్వమంటూ ఉంటే — తన అల్పిష్ట ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని గట్టిగా కోరడం, దాన్ని పరాస్తం చేస్తున్నట్లు కనిపించే ప్రతిదాన్నీ అత్యాశగా పొరకబుచ్చుకోడం, దైవం ఉనికిని ఒప్పుకోకపోవడం, — అదే లేక పోయినట్లయితే పని అసాధ్యమని దానికి తెలుసు కనక, — తన సొంత ఆలోచనలనూ నిర్ణయాలనూ కోరికలనూ సహజాతాలనూ బిగ్గరగా నొక్కి వక్కాణించడం, వీటిని ప్రత్యాఖ్యానించడం జరిగినట్లయితే సంశయాన్నీ నిరాకరణనూ నిందాసహితమయిన విమర్శననూ, తిరుగుబాటునూ అవ్యవస్థనూ ప్రదర్శించి ప్రతీకారానికి పూనుకోడం దీని

లక్షణాలు. ఉన్న ఈ రెండింటిలో, ప్రతి ఒక్కరూ దేన్నో ఒకదాన్ని ఎన్నుకోవలసి ఉంటుంది.

దైవసత్యావతరణకు వ్యతిరిక్తమయి ఉన్న ఈ ప్రతికూలత — అసమర్థమయిన అడ్డంకి, అవరోధం — శాశ్వతంగా ఉండేది కాదు. చివరికి ప్రతి ఒక్కరూ ఏదో ఒక వైపుకు — సత్యపక్షానికి కాని విపక్షానికి కాని — దిగి రాక తప్పదు. ఈ అపరజ్ఞానం అంటిపెట్టుకోని ఉన్నంత కాలం అతిమానసము వచ్చి స్థిరబడలేదు. ద్వంద్వ ప్రకృతితో తృప్తిపడుతూ ఉండటానికి అతిమానసానికి పొసగదు.

ప్రాణికముయొక్క రూపాంతీకరణం — దాని ఆవశ్యకత II

మన పరిణామం (evolution) జీవిని, అచేతనద్రవ్యం (inconscient matter) లోంచి అపరిపూర్ణ జ్ఞానంతో కూడిన మనఃప్రాణ దేహాలను గురించిన అజ్ఞానంలోకి తీసుకువచ్చింది; దివ్యజ్యోతి సీమ లలోకి మనను నడిపించడానికి, లేవనెత్తడానికి, మనలోకి— దేహ ప్రాణాల్లోకీ మానసహృదయాల్లోకీ కూడా — ఆ జ్యోతిని తీసుకు రావడానికి, దాంతో మనలను పూరించడానికి ప్రయత్నిస్తోంది. పూర్ణ రూపాంతరీకరణ మనగా దైవముతో తాదాత్మ్యము చెందుట, జీవి తాన్ని దివ్యచైతన్యంతో తాదాత్మ్యను చెందించుట.

ఇప్పటి మన శక్తుల్లో కెల్లా గొప్పది మనస్సు. ఆలోచించే మనస్సు ద్వారాను, జీవాత్మ (soul) ద్వారాను, హృదయంద్వారాను, వాటి వెనక వున్న — పరిణామంలో వికాసం చెందుతున్న — చైత్య పురుషుని (psychic being) ద్వారాను మనం వృద్ధి చెంది పరమాత్మ (spirit) ను చేరుకోవాలి. సంభవింపజేయడానికి, (దైవ) శక్తి మొదట ప్రయత్నించేది, మనస్సును స్థిరైన కేంద్రభావంమీద, విశ్వాసంమీద లేదా మనోవైఖరిమీద, స్థిరైన ఆకాంక్షమీద, హృదయ సమతౌల్యం మీద నిలపడానికీ వీటిని — మనసులోనూ, హృదయంలోనూ వీటి

భిన్నమైనవి లేదా విరుద్ధమైనవి తక్కినవి ఏవి ఉన్నప్పటికీ — తగి నంత బలంగాను, నిశ్చలంగా చేయడానికి...

...కొంతకాలం తర్వాత సాధన క్రిందకు దిగిరావటం, ఆ శక్తి మన ప్రాణికస్తరములో పనిచేయటం అవసరమౌతుంది.

ఆశక్తి మానసికసత్త (mental being) లోను, ప్రకృతిలోను సంపూర్ణమయిన మార్పును తీసుకురాదు; ఈచర్య (step) తీసుకునే వరకు పూర్ణరూపాంతరీకరణం జరగడం ఇంకా తక్కువ: అదే కనక జరిగితే, సాధనలో తక్కినదంతా, అంతకన్న సురక్షితంగా, సునాయా సంగా జరుగుతుంది. కాని ప్రాణికం (vital) మనస్సుమీదా హృదయం మీదా ఎప్పుడూ ఒత్తిడి కలిగిస్తూనే ఉంది; సాధనను చెడగొడుతూ అపాయం కలిగిస్తూనే ఉంది. దాని మానాన దాన్ని మరీ ఎక్కువ కాలం వదిలి పెట్టగూడదు. ప్రాణికం తాలూకు అహంత (ego) ను, కోరికలను, దాని అలజడులను, ఉత్థాపనలను (upheavals) సంబాళిం చాలి; వాటిని వెంటనే వెళ్ళగొట్టలేకపోయినా, కనీసం వాటిని అదు పులో ఉంచుకొని శీఘ్రపరివర్తన, మార్పు, ఉద్దీపనం (illumination) కలిగించలేనప్పుడు, క్రమక్రమంగానే జరిపించవచ్చు. ఈపని, ప్రాణ తలం మాత్రమే, ఆస్థాయికి దిగివచ్చి చెయ్యగలుగుతుంది. ప్రాణహంతే (vital ego) తన లోపాలను తాను తెలుసుకోవాలి; వాటిని తొలగిం చుకోడానికి సంకల్పించాలి. అది తన మిథ్యాగర్వాలను (vanities), ఆకాంక్షలను, ఇంద్రియాసక్తులను (lusts) వెంపర్లాటలను (longings), తన విద్వేషాలను, తిరుగుబాట్లను, తనలో ఉన్న తక్కిన మలిన ద్రవ్యాన్ని, అశుభ్రవర్తనలను (unclean movements) వదిలించుకోడా నికి నిశ్చయించాలి. అత్యంత దుర్భరమయిన కష్టాలూ తిరుగుబాట్లూ అపాయాలూ కలిగే సమయమిది. ప్రాణికహంత తన కోరికలకు వ్యతి రేకత ఏర్పడటాన్ని గర్హిస్తుంది; నిరాశను నిరసిస్తుంది; దాని గర్వం కాని, మిథ్యాగర్వంకాని దెబ్బతిన్నట్లయితే అది నిప్పులు కక్కుతుంది. దానికి పరిశుద్ధీకరణ ప్రక్రియ నచ్చదు; ఆప్రక్రియకు వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని ప్రకటించవచ్చు కూడా. సహకరించడానికి నిరాకరించ వచ్చు; తన కోరికలనూ మొగ్గులనూ సమర్థించుకోవచ్చు; అనేక రీతుల సత్యాగ్రహానికి (passive resistance) పూనుకోవచ్చు. జీవనా

నికీ సాధనకూ రెంటికీ కావలసిన ప్రాణికాధారాన్ని (vital support) ఉపసంహరించవచ్చు; మనిషిని ఆధ్యాత్మిక సాధనామార్గం నుంచి తప్పించవచ్చు. దీన్నంతనూ ఎదుర్కోవాలి; అధిగమించాలి. ఏలన మన దేవాలయాన్ని పరిశుభ్రపరచినప్పుడే మనస్వామి అందులోకి ప్రవేశించి మన ఆరాధననందుకోగలుగుతాడు.

•

అంతేకాకుండా, సార్వలౌకిక ప్రకృతి (universal nature) ప్రతిష్టంభన కూడా ఉంది. మానవుడు అజ్ఞానంలోంచి బయటపడి (జ్ఞాన) ప్రకాశంలోకి పోవడం ఆప్రకృతికి నచ్చదు. ఈఅనిష్టత ప్రబల మయి పాతప్రవృత్తులూ అవి మనఃప్రాణదేహాలమీదికి ప్రసరింపజేసిన తరంగాలూ కొనసాగాలన్న ఒత్తిడిగా రూపుదాల్చవచ్చు. పాతభావాలు, ఉద్రేకాలు, కోరికలు, అనుభూతులు, ప్రతిస్పందనలు — వాటిని వెళ్ళ గొట్టిన తరవాతా నిరాకరించిన తరవాతా కూడా — కొనసాగాలనీ, దైవానికి అర్పించిన ప్రకృతి యావత్తూ వాటిని త్రోసిపుచ్చేంత వరకు, అవి బయటనుంచి వచ్చిన సేనలాగ దండెత్తి రావాలనీ దాని (ప్రకృతి) అభిమతము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: పోరంకి దక్షిణామూర్తి.

ప్రధాన లోపం

సాధన కత్తిమీద సాములాంటిది. ముఖ్యంగా మానవ స్వభావాన్ని మార్చి మానవ ప్రకృతిని రూపాంతరీకరించి, నూతన మానవావతరణకు బాటవేసే ఈ యోగంలో చాలా కష్టాలను, దుర్భరమైన శత్రులను, దుస్సంఘటనలను ఎదుర్కొ నవలసి వస్తుంది. వీటన్నిటికి ప్రధానమైన కారణము నిమ్న ప్రాణికము. దానిని నియమించుట, దానికి కళ్ళెము వేసి బిగించుట మొదలగు ప్రక్రియలు ఇందులోని ముఖ్యాంశములు.

సంపాదకుడు

నిమ్నప్రాణికపు విజృంభణ: సాధనలో అడుగడుగునా అడ్డు తగులుతున్న లోపం ఏదైతే ఉందో అదిప్పుడు వేరుపడి అత్యంత ప్రాముఖ్యత పొంది నిమ్నప్రాణికం (lower vital) లో కేంద్రీకృతమై తిష్ఠవేసుకొని కూర్చుంది. ఇక్కడ ప్రస్తావిస్తున్నది తుచ్ఛమైనది, మొండి దురభిమానం గలది అయిన ప్రాణమయ దైహికప్రకృతిలోని ఒకానొక విభాగాన్ని గురించి. బాహ్యవ్యక్తి చర్యలన్ని దాని ప్రేరణతే. అతని ఆలోచనలను, సంవేదనలను, లక్షణాలను చర్యలను పరిపాలించేది కూడా అదే. మనిషిలోని ఇతర భాగాలైన ఊర్ధ్వ మనస్సు, చైత్యాత్మ, మహోన్నత ప్రాణిక ప్రకృతులను గురించి నేను చెప్పటం లేదు. ఎందుకంటే, నిమ్న ప్రాణికము ప్రకోపించినపుడు, మిగిలినవన్నీ, దానిచే — తాత్కాలికంగానైనా, పూర్తిగా కప్పబడక పోయినప్పటికీ — వెనుకకు నెట్టివేయబడతాయి. సత్యారాధన, సత్యాన్వేషణ, అంతః శత్రువులను జయించాలనే ఇచ్ఛా వంటి మంచి సుగుణాలు — ఊర్ధ్వసత్తాలోను, దాని ఇతర భాగాల లోను ఉన్నప్పటికీ — అవన్నీ, సమైక్యంగా, సత్ఫలితాలిచ్చేవిగా, చెడిపోకుండా ఉండేవిగా — దిగువ ప్రాణిక సత్తా, బాహ్యా వ్యక్తిత్వము కాంతిని స్వీకరించనంత వరకు, ఆ దిశలో మార్పునకు అంగీకరించనంతవరకూ — మనుగడ సాగించలేవు.

ఈ యోగానికి అగ్ని పరీక్ష: సాధనాక్రమంలో మానవ ప్రకృతిలోని ఈ హేయమైన భాగాలను కూడా ముందుకు తీసుకొని రాక తప్పదు.

వాటికి పరివర్తన కావాలో అక్కర్లేదో అవే నిర్ణయించుకుంటయి. నాకార్య సఫలతకిది చాలా కీలకమైన ఘట్టము. ఈ యోగానికి గండం అనమాట. ఇది మారకపోతే దైహిక చైతన్యం, భౌతిక జీవితం కూడా మారలేవు. ఇదే జరగక పోయినట్లయితే ఇంతకు పూర్వం చేసిన సాధన వలన కలిగిన ఆత్మజ్ఞానము, అనుభూతి, ఆనందప్రజ్ఞలన్నీ దండగ. ఈ చిన్న బాహ్యా వ్యక్తిత్వం తన అస్పష్ట, పరిమిత, స్వల్ప, నికృష్ట, స్వార్ధపూరిత, కపట, మూఢ మానవ చైతన్యమే కొనసాగాలని హఠం చేస్తే అది యోగమార్గాన్ని, సాధనను ఖండితంగా తిరస్కరించి నట్లే. అదివరలో విఫలమైందనుకున్న దానికి ఇంకొక కొత్త ప్రతిని చేయాలనడం నా అభిమతం కాదు. బాహ్యాప్రకృతి నియమాలలో వాస్త వికమైన మౌలిక మార్పులేమి లేకుండా పాక్షికంగా క్షణిక మాత్రపు ఆధ్యాత్మిక వికాసం వల్ల ఏమీ ప్రయోజనం లేదు. ఏ సాధకుడైనా ఈ మార్పుకు ఇష్టపడక పోయినా, తన బాహ్యా వ్యక్తిత్వపు అలవాట్లుగానీ నిమ్నప్రాణికముగానీ మారవలసిన ఆవశ్యకత ఏమీ లేదని అను కున్నా, బయటకు ఎంత గొప్పలు చెప్పుకున్నప్పటికి అతను నన్నూ, నా యోగాన్నీ అంగీకరించలేదన్న మాటే.

ఈ మార్పు సులభతరం కాదనీ దానికి తగినంత దృఢ సంకల్పం ఒక్కసారిగా కలిగేది కాదని ఒకవేళ కలిగినా నిలిపి ఉంచు కోవడం కష్టసాధ్యమనీ, నిలుపుకున్నా పాత అలవాట్ల బారినుంచి తప్పించుకోవడానికి అతను నిస్సహాయుడైనట్లు అనుకుంటాడని నాకు బాగా తెలుసు. ఇది తెలిసియే శ్రీమాత, నేనూ ఎంతో ఓర్పుతో వేచి యుండి సాధకునిలోని నిజాత్మ బహిర్గతమై, బలం పుంజుకుండేందుకు, బాహ్యాప్రకృతిలో చక్కగా పని చేయడానికి తగిన వ్యవధి ఇస్తున్నాము.

నిమ్నప్రాణికం వలన కలిగే చిక్కు: నిమ్నప్రాణికము తన పాత వ్యక్తి త్వానికి ఇప్పటికీ కట్టుబడి ఈ వెలుగుకి విముఖత చూపించడం ఒక పెద్ద చిక్కే. అది ఇంతవరకూ ఏ మహా సత్యానికిగాని, శ్రీమాతకుగానీ, నాకుగానీ సర్వసమర్పణ చేసుకోలేదు; సమర్పించుకోవాలనే సంకల్పం అసలే లేదు; సమర్పణమంటే ఏమిటో కూడా దానికి తెలియదు. నిమ్నప్రాణికం ఈ వైఖరితోనే పూర్వపు వ్యక్తిత్వాన్ని, అధః ప్రకృతి

వేషాలని సమర్థిస్తూ ఉంటుంది. అవి సన్నగిలినప్పుడల్లా వాటికి మళ్లీ ఊతనిచ్చి నిలబెట్టి తన హక్కుని వినియోగపరుస్తుంది. తన మొరటు అహంకారాన్ని, కోరికలను, సరదాలను, ఉద్రేకాలను, బలపరిచి కావా లనుకున్నప్పుడు అనుసరించటమే తన స్వేచ్ఛగా భావిస్తుంది. తన స్వభావాన్ని తను అనుసరిస్తూ ఉండాలని ఆంతరంగింకంగానూ, అనేక మాటలద్వారాను వాదిస్తుంది — తన అజ్ఞాన మానవ ప్రకృ తిని, తను తానుగానే ఉండే హక్కును — మారనటువంటి తన పురా తన స్వభావం ఏదైతే ఉన్నదో, అంటే ఆ భాగంలో ఉండే అసత్యా, అజ్ఞాన, అసంబద్ధ స్వభావాన్నే అంటిపెట్టుకోవాలని చూస్తుంది. ఆ విధంగా వాదించకపోయినప్పటికీ చేతలలోను, మాటలలోను, ప్రవర్తన లోను ఈ అపరిశుద్ధ, హీనధోరణి వ్యక్తం చేసే హక్కు తనకున్నట్లు ప్రవర్తిస్తుంది. తన పాత పద్ధతులను ఆలోచనలలో, మాటలలో, స్పంద నలలో సమర్థించుకుంటూ, మెరుగులు దిద్దుతూ, రంగులు పులుముతూ వాటిని ఎప్పటికీ కొనసాగించాలనుకుంటుంది. ఇదంతా బాహాటంగా ఒక ప్రతిజ్ఞగా, తిరుగుబాటుగా ప్రకటించుకుంటూ తనకెదురు చెప్పినా, వ్యతిరేకంగా చేసినా అదంతా తప్పు, అన్యాయం, అక్రమం అని నిందిస్తూ, ఒక్కొక్కసారి ఆత్మవంచన అనే ముసుగుని, బూటక వేషా లనీ వేసుకుంటూ ఒకటిచెప్పి మరొకటి చేస్తూ కాలక్షేపం చేస్తుంది. మరిఒకప్పుడు తనకుతానే నమ్మపలుకుకుంటూ ఇదంతా యోగ మార్గంలో భాగమేనని, ఇది మాత్రమే సరైన పద్ధతి, సరైన మార్గము, అదే తనకూ ఇతరులకూకూడా మంచిదని, ఇతరులను కూడా నమ్మిం చటానికి ప్రయత్నిస్తుంది.

సాధకుడు ఏదోవిధంగా నిమ్నప్రాణిక జీవి చేసే సూచనలను రహస్యంగానో, బాహ్యంగానో, అతని మాటలను చేతలను ఆజ్ఞాపించే దాని వైఖరిని, దాని ధోరణిని నిరోధించకుండా ఉంటే అది అతని చర్యలనుకూడా ప్రభావితం చేస్తుంది. సాధకుడు నిక్కచ్చిగా ఉండి, శ్రీమాతతో నిష్కపటంగా ఉంటే అప్పుడు అవరోధాలేవో వాటికి మూలకారణం ఎక్కడుందో గమనించి దానిని సరిదిద్దే ప్రయత్నం చేయగలడు....

స్వభావంలో ఈ అవరోధమనేది కొన్ని ప్రత్యేక రూపాలతో ఉండటం వల్ల గందరగోళం ఏర్పడి పరివర్తనా కార్యం కష్టమవుతుంది. ఈ ప్రత్యేక రూపాలన్నీ కొద్దిగానో గొప్పగానో అందర్లోనూ ఉండేవే కాబట్టి వీటిని పరిశీలించి స్పష్టంగా కనపడేటట్లు చేయవచ్చు.

1 ఈ అల్ప ప్రాణికజీవికుండే డంబాచారము, దర్పము, అతిశయించిన రాజసిక ప్రకోపము ఎవరిలో దృఢమై ఉంటాయో వారిలో ప్రాణికశక్తి వికృతరూపాన్ని పొంది మనిషిమీద పెత్తనం చెలాయిస్తుంది. దీనితోబాటు ఆత్మాభిమానం పెచ్చుపెరిగి తనకొక ప్రశస్తి గావాలనుకొంటూ ఏదో విధంగా తన స్థానాన్ని, పలుకుబడిని నిలబెట్టుకుంటూ ఇతరులను ప్రభావితంచేస్తూ, సహాయం చేస్తున్నట్లు, నియమించుతున్నట్లు నటిస్తూ తాను మహాసాధకుడై విజ్ఞానవంతుడైనట్లు, నిగూఢ శక్తులు కలిగినట్లు ప్రవర్తిస్తాడు. నిజానికి ఉత్తమ ప్రాణికజీవి సహితం తన శక్తిసామర్థ్యాలు దివ్యశక్తినుంచి వచ్చాయి కనుక వాటిని ఆ దివ్యశక్తికే అర్పిస్తూ తను మాత్రం శ్రీమాత ఉపకరణంగా ఆమె ఆదేశానుసారం వాటిని వాడవలసి ఉంటుంది. అటువంటి ఈ శక్తులు నిమ్నప్రాణికంలోకి, బాహ్యా వ్యక్తిత్వంలోకి, సరఫరా అయిన హీన, క్షుద్ర రూపాలైనప్పుడు అవి సత్యదూరాలై, అసంబద్ధంగా, వికారంగా తయారవటమే కాకుండా దుర్మార్గంగా స్వల్ప పరిధిలో హానికరమౌతాయి. అది జరిగినపుడు వారి సాధనంతా దుష్టశక్తుల పాలుచేయటానికి, చేసే పనులన్నిటినీ వాటి ప్రభావంలో ఉంచటానికి అంతకంటే మంచిమార్గం వేరే ఉండదు. అందరి స్వభావాల్లో ఈ డాబు, దర్పం, రాజసిక ఉద్రేకము మొదలైన ప్రాణిక దోషాలు కొద్ది కొద్దిగా ఉండేవే. అవి ఇంకొక వేషంలో ఉన్నాకూడా నిజంగా ఆధ్యాత్మికమైన మార్పు కావాలనుకునే వారికి పెద్ద లోపాలే అవుతాయి.

2 అవిధేయత, క్రమశిక్షణా రాహిత్యం: మనిషిలోని అధోభాగానికి ఒక పద్ధతికానీ క్రమశిక్షణగానీ ఉండవు. తన పంతమే నెగ్గాలని, తన ఇష్టానికి వ్యతిరేకమైన ఏ నియమాలు, కట్టుబాట్లు అనుసరించగూడదనే విశృంఖలత్వం దానిది. ఉన్నత ప్రాణికం వ్యక్తిని సంస్కారపరచి జ్ఞానాన్ని కలిగించాలని చేసే ప్రయత్నాలకు మొదటినుంచి ఇది అడ్డుతగులుతూనే ఉంటుంది. ఇటువంటి అవిధేయత, విశృంఖలత్వం

అనే అలవాటు ఎంత దృఢంగా ఉంటుందంటే అది ఆలోచించాల్సిన అవసరం కూడా లేకుండా ఏ సూచన వచ్చినా ఆ క్షణమే, నిరాటం కంగా సహజ సిద్ధంగా ప్రతిఘటిస్తుంది. అందువల్ల శ్రీమాతకు విధేయ తను ప్రకటిస్తూ వాగ్దానాలు చేస్తూ ఉండికూడా కార్యాచరణకి వచ్చే సరికి అందుకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తారు.

3 బూటకపు మాటలు, అసత్య భాషణలు: నిమ్నప్రకృతికిదొక హానికరమైన దురభ్యాసము. సూటిగా, సరళంగా ఉండలేని వారు శ్రీమాత సహాయాన్ని అందుకోలేరు. వారంతట వారే దాన్ని తిప్పి పంపేస్తారు. వారు మారనంతకాలం అతిమానస జ్యోతి, దివ్యసత్యం దిగివచ్చినాకూడా నిమ్నప్రాణికములోకి, దైహిక ప్రకృతిలోకి వస్తా యని ఆశించకూడదు. వారు తయారు చేసుకున్న బురదగుంటలో అతు క్కొని అక్కడే ఉంటారు. ఈ విధమైన అలవాటున్న వారు తమ చైత న్యాన్ని మబ్బు క్రమ్మినట్లు మసగబారించుకోవటంవల్ల తాము మాట లాడే దానిలోగాని చేసే పనిలోగాని ఉండే అసత్య ధోరణిని గమనిం చలేరు. అయితే చేసే పనులను మాటలను సరిపెట్టుకోటానికి ఈ చిన్న కారణం సరిపోదు.

4 తమను తాము సమర్థించుకొనుట: ఇది చాలా హానికరమైన అలవాటు. సాధకునిలో ఈ అలవాటు స్థిరపడినప్పుడు ఆ భాగంలో సరైన చైతన్యం, సక్రమమైన చర్య కలిగేటట్లు చేయడం అసాధ్యం. అడుగడుగునా తనను తాను సమర్థించుకోవటమే అతని పని. తన ఊహని, తన స్థితిగతులను, తను చేయవలసిన పనిని చూసుకోటానికే అతని మనస్సు ఆత్రపడుతుంది. అందుకోసం ఎటువంటి వాదనకైనా సిద్ధపడతాడు. ఒక్కొక్కసారి మరీ తెలివితక్కువగా, మోటుగా మొండిగా వాదిస్తూ అంతకుముందు ఖండించిన విషయానికి పరస్పర విరుద్ధంగా మాట్లాడటానికి కూడా వెనుతీయకుండా ఏదో రకంగా మిథ్యావాదంతోనూ, కుంటిసాకుతోనూ సమర్థించుకుంటారు. అది సాధారణంగా జరిగే దుర్వినియోగమే, అయితే ఆలోచించే మనస్సు దుర్వినియోగం చేయటం జరుగుతుంది. అది మితిమీరి వ్యక్తిలో ఉన్నంతకాలం సత్యాన్ని దర్శించలేరు. సత్యమార్గంలో జీవించలేరు.

మానవ ప్రకృతి వల్ల కలిగే కష్టాలేమైనప్పటికీ, వాటిని ఎదుర్కోటంలో ఎంత సమయం గడిచినా, అది ఎంత బాధాకరమైనా అవి సత్యానికి ఎదురు నిలిచి ఎక్కువ కాలం మనలేవు. ఈ అర్ధ భాగాలలో సరైన వైఖరి, అసలు సిసలైన ఉత్సాహం, ప్రయత్నం కావాలి. అయితే ఆత్మగౌరవమనుకుంటూ తన స్వీయ సంకల్పం వల్లనూ, తామసిక మాంద్యత వల్లనూ దివ్యజ్యోతిని చూడక కళ్ళు మూసుకొని, హృదయాన్ని రాయిచేసుకొని ఉండేటట్లైతే మాత్రం ఎవరూ సహాయం చేయలేరు. దైవసంబంధమైన మార్పు కలగాలంటే వ్యక్తి దానికి సంపూర్ణంగా అంగీకరించాలి. ఆ పూర్తి అంగీకారంతో సమగ్రమైన సమర్పణ జరుగుతుంది. నిమ్నప్రాణికమైన అంగీకృతి కేవలం మనస్సుతో అనుకోటంవల్లగానీ, తాత్కాలిక ఆవేశంతోకానీ జరుగకూడదు. అది సర్వదా కట్టుబడి ఉండే వైఖరిగా పట్టుదలతో విడువకుండా కొనసాగించే చర్యకావాలి.

•

ప్రతిచిన్న విషయానికి దైవం కోసం ఆకాంక్షించటం, మార్గాన్వేషణలో దివ్యజ్యోతి యొక్క వెలుగును కోరడం, దైవం కోసం సర్వసమర్పణ కావిస్తున్న ఒక అనుభూతి పొందడం, నడిపించే బాధ్యత ఆ దైవందే అనుకోవడం ద్వారా నిమ్నప్రాణికం దివ్యచైతన్యాన్ని పొందినట్లు వెల్లడి అవుతుంది. ఇది ఇక ప్రతి చిన్న ఆవేశాన్ని, ప్రేరణను, అనుభూతిని, చర్యను నియంత్రణ చేయగలదు. వీటిలో పరివర్తన కలిగినప్పుడు రూపాంతీకరణం కోసం ఈశ్వరార్పణ చేయగలదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది వేంకటరామ శాస్త్రి,

అమరవాది ప్రభావతి

వాంఛలను అణచి వేయుటయా అనుభవించుటయా?

వాంఛలను తీర్చటం వలన ప్రాణిక సత్తాకు తాత్కాలిక ఉప శమనము కలుగవచ్చునేమో గాని వాంఛమట్టుకు చావదు. అది మళ్లీ మళ్లీ మనని పీక్కొని తింటూనే ఉంటుంది. ఊరికే పైకి మట్టుకు అణగ ద్రొక్కేసాములే అని గొప్పగా చెప్పుకుంటూ లోలోపల పోషిస్తూపోతే ప్రయోజనముండదు. అట్లాగని వాంఛలను బాహ్యాములో బుజ్జగించు కుంటూ పోతే సమస్య అసలే పరిష్కారముకాదు. దృఢసంకల్పం వలన వాంఛలను నిర్మూలించటం సాధ్యమే. అయితే నిగ్రహం కేవలం బలవం తపు అణచివేత గాక బాహ్యాభ్యంతరాల నిరాకరణమై యుండవలెను.

*

ప్రాణికేచ్ఛను తీర్చుకుంటూ పోతే అది పెరిగి పెద్దదై బ్రహ్మ రాక్షసి అవుతుందేకాని ఏమాత్రం తృప్తి చెందదు. రాగద్వేషాలను చేత ననుండి పూర్తిగా బహిష్కరించటం కంటె వేరే మార్గం లేదు.

*

వాంఛను అణగద్రొక్కటమే కాకుండా దానియెడల రాగాను బంధాన్ని కూడా సడలించాలి. ఆణచివేతకి (నిగ్రహము) ఆత్మ- ఆధి పత్యానికి (సంయమము) భేదమున్నది. అది ఏమనగా, "నేను కోరికలు కోరకుండా వుండలేను., అయినప్పటికి నేను నా కోరికలను తృప్తి పర చకుండా వుండగలను" అని అంటుంది "నిగ్రహం". "సంయమము" మాత్రము "నేను కోరికను మరియు దాని యొక్క అనుభవాన్ని కూడా నిరాకరించచగలను" అని అంటుంది.

*

నిగ్రహము అంటే కోరిక వేగాన్ని తాత్కాలికంగా నిలిపి వేయుట traffic stop కు మల్లే. అయితే మళ్లీ తలెత్తేందుకు అది పొంచి వుంటుంది. దాన్ని, తిరస్కరించి, బహిష్కరించి దాంతో పూర్తిగా తెగ తెంపులు చేసుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదకులు: కె. ఎస్. భాస్కర్రావు

ప్రాణిక స్పందనాలపై విజయము — I

నీవు శాంతిని పొందినట్లయితే, ప్రాణకోశాన్ని పరిశుద్ధం చేయడం సులభ సాధ్యమవుతుంది. నీవు నీ ప్రాణకోశాన్నే శుభ్రపరచు కొంటూ ఇంకేమీ చేయకుండా ఉంటే, నీ సాధన కుంటుబడుతుంది. ఎందుచేతనంటే ప్రాణకోశం వందమాట్లు పంకిలమవుతే వందసార్లు శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. కాని శాంతి అట్లాగాదు. అది చాలా పునీతమైనది. అందుకని శాంతిని పొందటమే సరియైన విధానం. అప్పుడే నీవు నీ లక్ష్యాన్ని సాధించుకోగలుగుతావు. అటులగాక ప్రాణ కోశంలోని మాలిన్యం కోసం మాత్రమే వెదకటం, దానిని వదిలించు కోవటమనేది చాలా చచ్చు పద్ధతి.

*

మొదట శాంతిని హృదయ కేంద్రంలోకి, నాభిస్థానం వరకూ నువ్వు తీసుకొని రావాలి. అప్పుడది అంతరంగాన్ని స్థిరపరుస్తుంది — అది పూర్తిగా కాకపోవచ్చు. ఈ యోగంలో ఆకాంక్ష, దృఢమైన, నిశ్చల మైన సంకల్పం తప్ప వేరే పద్ధతి ఏమీ లేదు. నీవు నీ ప్రాణకోశంలోని ఏ విభాగాలలో శాంతిని కోరుకొంటున్నావో ఆ విభాగాలలో మొండి గావున్న ఉద్వేగ ప్రాణికం (emotional vital) ఉన్నత ప్రాణికాలను (higher vital) నిరాకరించవలసి వుంటుంది. అదే సరియైన పద్ధతి — ఉన్నత చేతనకు చెందిన శాంతిని నిలుపుకోవటం; అప్పుడు ప్రాణ కోశంలో ఏ అలజడి కలిగినా అది కేవలం ఉపరితలం పైన మాత్రమే వుంటుంది. అప్పుడు ప్రాతిపదిక కదిలిపోకుండా, మహాశక్తి అవత రించి నిజమైన ప్రాణసత్తను .(vital) విముక్తపరచే వరకు స్థిరంగా నిలిచి ఉంటుంది.

*

అందరి మానవులలోను వుండే రుగ్మత — అశాంతి, వాంఛ, ఆతురత, నిరాశా నిస్పృహాలకు లోను కావటం, అస్థిరత. వాటినుండి దూరంగా నిలిచి ఉండు. నీపైన అధికారం చెలాయించటానికి నిన్ను కదలించటానికి దానికి ఏ మాత్రం అవకాశం యివ్వకు. ప్రాణ కోశంలో ఉపయోగించుకోవలసిన భాగం ఒకటున్నది. — దివ్యోన్నత

విషయాలకు తీవ్ర భావోద్వేగంతో స్పందిస్తూ, మహనీయ ప్రేమాభక్తి పారవశ్యతలతో, దానిని దృఢతరం చేసుకో; నీలోని చైత్యపురుష సత్తపైన, పైనుండి అవతరించే శాంతి విశాల భావాలపైన దానిని ఆధారపడనీ.

ఆంగ్లమూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యస్. భాస్కరరావు

ప్రాణిక స్పందనాలపై విజయము II

నిజమైన ఆధ్యాత్మిక చేతనకు మూలాధారం సమత కలిగి ఉండడమే. ప్రాణిక వేధింపులకు లోనై మనో వాక్కర్మలలో ఉద్రిక్తుడైన సాధకుడు సాధనా మార్గ భ్రష్టుడై సమత్వాన్ని కోల్పోతాడు. సమత, సహనం ఒకటి కాదు. అయినప్పటికీ స్థిరమైన సమత మానవుని సహనశీలతను, ఓర్పును తీవ్రంగా, అపరిమితంగా కూడ, విస్తరింప జేస్తుందనేది నిస్సంశయం.

సమత అంటే ప్రశాంతం, నెమ్మదిగా ఉండటం — సుస్థిరమైన మనస్సు, సుస్థిరమైన ప్రాణికము, ఏవిధమైన సంఘటనల వల్లగాని, ఎవ్వరైనా ఏదైనా అనినగాని, చేసినాగాని వాటిని పట్టించుకోకుండా ఉండటం. ఇతరుల మాటల, చేతల పట్ల నీ వ్యక్తిత్వ వికృతాల నుండి విడిపోయి, నీవు వాటిని తిన్నగా చూడగలిగి ఉండాలి. వాటి వెనుక ఉన్నది ఏమిటో, అవి ఎందుకు జరుగుతుంటాయో, వాటి వల్ల నీవు నేర్చుకోవలసిందేమిటో, నీలో దేని వైపు అవి గురిపెట్టబడినవో, అదేమిటో, వాటివల్ల నీకు కలిగే అంతః లాభమేమిటో, వాటి ద్వారా సాధనలో ఏ అభివృద్ధిని నీవు పొందగలవో — వీటన్నిటిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. అంటే దానర్థం నీపైన నీవే విజయం సాధించుకోవటం. నీలోని ప్రాణకోశ చర్యలైన క్రోధం, అభిమానం, దౌర్బల్యం, గర్వం, అంతేకాక కోరిక వగైరా — వీటిని జయించటం. వీటి వల్ల భావోద్వేగానికి అలజడికి లోనుకాకూడదు. నీలోని

శాంతికి భంగం వాటిల్లరాదు; వీటి విజృంభణ, ప్రోద్బలం చేత నీవు మాట్లాడరాదు, పనిచేయకూడదు. ఎల్లప్పుడూ నీలోని ఆత్మ ప్రశాంతతతో, నెమ్మదితో మాట్లాడాలి, పనిచేయాలి. అయితే ఇటువంటి సమతను పరిపూర్ణంగా సాధించడం మాటలు కాదు — ఎల్లప్పుడూ అధికాధికంగా ప్రయత్నిస్తూండాలి. లోని ఆత్మ స్థితికి, బాహ్యా చర్యలకు దానినే ఆధారం చేసుకోవాలి.

పరిపూర్ణ సమత స్థిరపడటానికి చాలా కాలం పట్టవచ్చు. అది మూడు విషయాలపైన ఆధారపడి ఉంది — ఆత్మ సమర్పణ ద్వారా ఆత్మ భగవంతుడికి నివేదన కావటం, పైనుండి ఆధ్యాత్మిక శాంతి, నిశ్చలత అవతరించటం, సమతకు విరుద్ధమైన సమస్త అహం భావపూరితమైన, రాజసికమైన, తదితరమైన భావాలన్నిటిని నిదానంగా నిరంతరంగా తిరస్కరించటం.

*

అందుకు మొదటి మెట్టు మనలోని భావోద్వేగాలను, ప్రాణిక సత్తను జయించటమే. మన స్వభావానికి చెందిన ఈ విభాగాలలోని సమత — పవిత్రీకరణం, స్వేచ్ఛగా ఉండటం ద్వారా ప్రాప్తిస్తుంది. సమతయే ఆధ్యాత్మికతకు చిహ్నమని మనం చెప్పవచ్చు. ప్రాణ కోశానికి చెందిన వాంఛాప్రేరణ ఆధిక్యం నుండి, కామోద్రేకాలు తుఫానులా చెలరేగి ఆత్మను ముట్టడించి ఆక్రమించటం నుండి విముక్తి చెందాలంటే ప్రశాంతమైన సమహృదయాన్ని, విశ్వాత్మ విశాల సమదృక్పథ పాలితమైన జీవన నియమాన్ని కలిగి ఉండటమే. జీవన నియమం, ప్రాణతత్వం దానికి చెందిన దాస్య శృంఖలం అయిన ప్రాణమునకు చెందిన అపవిత్రతయే కోరిక. స్వేచ్ఛ పొందిన ప్రాణికము అంటే ఎటువంటి వాంఛా లేక బాహ్యా విషయాలను ఎదుర్కొంటూ వాటికి సమత్వంతో ప్రతి స్పందిస్తూండే ప్రసన్నమై సంతుష్టి వహించిన జీవ చేతనయే; విముక్తమై, ఉన్నతంగా ఉద్ధరింపబడినదై, యిష్టాయిష్టాలకు అతీతమై, బాధానందాల వాంఛాప్రేరణలకు విముఖమై, మనోహర ప్రియ విషయాసక్తిచే ఉద్రిక్తం కాక, అప్రియ అసహ్యాకర విషయ బాధితం కాక, తాను ఎన్నుకొని వాంఛించే విషయేంద్రియ స్పర్శలను రాగబంధంతో పట్టుకు వ్రేలాడక, తనకు ప్రతికూల విషయాలను దౌర్జన్యంతో

త్రిప్పికొట్టక, అనుభూతి విలువలకు ప్రాధాన్యం యిచ్చే మహత్తర విధానానికి ఉన్మీలనమై ఉంటుంది. బెదరింపుతోగాని అభినందనలతో గాని జగత్తు నుండి ప్రాప్తించే దానిని అంతటిని తేజోమయ ప్రశాంతా నంద పారవశ్య స్పర్శ కలిగిన లేదా పరివర్తన చెందిన హృదయం, హేతువులకు లేదా ఉన్నత ధర్మాల వైపుకు మళ్లిస్తుంది. ఆ విధంగా ప్రశాంతమై, ఆత్మపాలితమై, మనలో అగాధమై, అతిసూక్ష్మమైన ఆత్మపై తన సొంత ప్రభుతనాపాదించడానికిగాను ఇకపై ఎంత మాత్రమూ ప్రయత్నింపక ఉంటూ, ఈ జీవచేతనయే ఆధ్యాత్మీకరణానికి లోనై, ప్రాపంచిక విషయాలతో దివ్యతరంగా వ్యవహరించే ఆత్మకు స్పష్టమైన ఉదాత్తమైన ఉపకరణంగా పని చేస్తుంది. ఇక్కడ ప్రాణస్పందనను దానికి చెందిన, సహజమైన ప్రయోజనాలను, చర్యలను నిరసించే సన్యాసిగా హతమార్చడమనే ప్రశ్న ఉదయించదు, కాని దానిని రూపాంతరీకరణం చేయటం జరుగుతుంది. ప్రాణికము యొక్క ధర్మము ఆనందమే, అది యథార్థమైన ఆనంద పారవశ్యమే. అంతర్ముఖమైన ఆధ్యాత్మికానంద పారవశ్యమే. ఆ ఆనందం, మన ప్రాణకోశానికి, భావోద్వేగానికి, మానసికానికి చెందిన పాక్షికమైన బాధితమైన సుఖం వంటిది కాదు. భౌతిక మనస్సు అత్యధికంగా ఆక్రమించడంతో అవి ప్రస్తుతం భ్రష్టమై ఉన్నవి. ఆ దివ్య ఆనందం విశ్వజనీనమూ ప్రగాఢమూ అయి ఉంటుంది, ప్రశాంత సచ్చిదానంద పారవశ్యంలో కేంద్రీకృతమైన రాశీభూత ఆధ్యాత్మికానంద పారవశ్యమే....

అదేవిధంగా మమతానురాగాల ఝంఝామారుత విజృంభణం నుండి విముక్తమైన హృదయమే స్వేచ్ఛాహృదయం. దుఃఖం, క్రోధం, ద్వేషం, భయం, పక్షపాతంతో కూడుకున్న ప్రేమ, సుఖంలోని అలజడి, దుఃఖం కలిగించే బాధ ఇవన్నీ పైనబడి ముట్టడించినప్పుడు వాటి స్పర్శ, సమత వహించిన హదయాన్నుండి జారిపోయి, ఆ స్వేచ్ఛా హృదయం విశాలమై, ప్రశాంతమై, తేజోమయమై దివ్యమై ఉంటుంది. ఇవన్నీ మన నిజ ధర్మములు కావు. కాని ప్రస్తుతం అవి మన బాహ్యా మానసిక, ప్రాణిక చర్యలు — పరిసరాలతో వాటి వ్యవహారాల ఫలితంగా యేర్పడినవే. అహంభావ ప్రలోభాలకి, ప్రేరణలకు లోనై మనం పరాయి భావంతో ఒక ప్రత్యేక వ్యక్తిగా వ్యవహరిస్తూంటాం.

మన అభూతిని, ప్రత్యేక హక్కును ఈ విశ్వానికి చెందిన విలువలకు పరీక్షగా, ప్రమాణంగా చేస్తాం. ఈ అహంభావమే ఇటువంటి మతిభ్రమలకు కారణం. మనలోని ఆ భగవంతుని (Divine) తో విశ్వాత్మ భావంతో తాదాత్మ్యం చెంది జీవిస్తున్నప్పుడు, ఈ అసంపూర్ణతలు లోపాలు తొలగిపోయి అంతరాధ్యాత్మిక ప్రశాంత సమశక్తియుత ఆనందపారవశ్యంలో అంతరించిపోతాయి. ఆ ఆనందం మనలో ఎల్లప్పుడూ ఉంది. మనలోని చైత్యపురుష సత్త ఆ భగవదానందపారవశ్యానికి దాగి ఉన్న ఉపకరణమే. దాని ద్వారా బాహ్య స్పర్శలు మనలను తాకకముందే ఆనందం వాటిని రూపాంతరీకరించి వేస్తుంది. హృదయంలో సమత పొంది ఉన్నందున ఉపరితలంపైని కోరికల పుట్టయైన ప్రాణకోశ సంకటాన్నుండి మనం తప్పించుకోగలం. ప్రగాఢమై ఉండే ఈ చైత్యసత్తాద్వారాలను తెరచి వేయగలం. చైత్యపురుష స్పందనలను వెలువరించి ఆ స్పందనలకు చెందిన యథార్థమైన దివ్యమైన విలువలను మన భావోద్వేగాలను అర్థించే దానినంతటిపైనా ఆపాదించగలం. స్వేచ్ఛాయుతమై, సుఖప్రదమై, సమభావ సమన్వితమై, సర్వాన్ని ఆలింగనం చేసుకొనే ఆధ్యాత్మికానుభూత హృదయం ఈ పూర్ణత్వము యొక్క పర్యవసానమే.

ఆంగ్లమూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యస్. భాస్కరరావు

ప్రాణశక్తి యొక్క రూపాంతీకరణం I

ప్రాణికి ఆధారం ప్రాణశక్తి (vital). ఆ ప్రాణశక్తి నుండి అహంకారాన్ని పోగొట్టడానికి నిశ్చలత ఒక్కటే సరిపోదు. దానితో పాటు మరొక మార్గం ఏదో ఒకటి ఉండి తీరాలి.

•

అదే చైత్య మార్గం. నిగూఢంగా దాగి ఉన్న చైత్యపురుషునికి మానసిక శక్తి తోడయినపుడు, మానసిక శక్తి చైత్యపురుష ప్రభావముతో మరింత సుసంపన్నమైనపుడు భగవదర్పణం, ప్రేమ, దైవభక్తి, ఆత్మార్పణం, శరణాగతి అనే భావాలు ఏర్పడతాయి. ఈ భావాలు బౌద్ధిక, ప్రాణిక, భౌతిక చైతన్యాలపై ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ భావాలన్నీ భగవత్పరమైనవిగా రూపొందడానికి చైత్యపురుషుడు తోడ్పడుతాడు. లేదా నిర్బంధిస్తాడు.

•

ప్రాణమయ పురుషుని సమర్పణ

సర్వ సాధారణ స్వభావముతో ఉన్న ప్రాణశక్తికి లోబడకుండా ఉండాలంటే ఒకే ఒక మార్గం ఉంది. అపేక్ష, అర్హత, కోరికలు అహంకారంతో కూడుకున్నవి. ఇవన్ని ప్రాణశక్తికి సంబంధించినవి. ఇటువంటి అహంకారయుత కోరికలనన్నింటిని త్యజించాలి. అసంతృప్తికరమైన ఆలోచనలకు, కోరికలకు బదులుగా పవిత్రమైన ఆలోచనలను, ఆకాంక్షలను కలిగి ఉండాలి. కోరికలను తీర్చడమో లేక వైరాగ్య భావంతో ఏకాంతవాసమో పరిష్కారము కాదు. ప్రాణమయ పురుషుని (vital being), పరమాత్మకు అర్పించి ఏ కోరికలూ లేని ఏకాగ్ర చిత్తంతో పరమ సత్యాన్ని తెలుసుకోవాలి. ఏలన జ్యోతి ప్రకాశానందములే పరమ సత్యము యొక్క లక్షణములు. కోరికలు, అపేక్ష ఉన్న చోట ఆనందం ఉండదు.

•

నిరంతర చైత్యోన్మీలనం, భావ ప్రభావాల దృఢ పరిత్యాగం, ప్రతికూల అభిప్రాయాల నుండి ఎడబాటు, నిశ్చలత, వికాసం, శాంతి,

శ్రీమాత శక్తిలోని పవిత్రత మొదలైన గుణాలు సాధారణ బలహీనత లకు లోబడకుండా చేస్తాయి.

•

చైత్యపురుషాభివృద్ధి

వ్యక్తి క్రమ వికాసం పొందే సమయంలో సాధన వైపు దృష్టిని కేంద్రీకరించాలి. ప్రతికూల స్థితుల పరిత్యాగం వైపు దృష్టిని కేంద్రీకరించకుండా సాధనకు అనుకూలంగా ప్రయత్నం కొనసాగాలి. కోరికలను త్యజించే పద్ధతిని అనుసరిస్తూ ఉండుటకంటే సాధనకు అనుకూలమైన మార్గంలో అనుసరించడం మేలు. మానవునిలో చైత్యా పురుష ప్రభావాన్ని పెంపొందింప జేయడం, పైనుండి ఉన్నత చైత న్యాన్ని పొందడం అనేవి ముఖ్యమైనవి. చైత్యజ్యోతి వృద్ధి చెంది స్వయం వ్యక్తమగు సందర్భంలో మంచి, చెడులను వివేచించే శక్తి ఏర్ప డుతుంది. చెడువర్తనమును కనిపెట్టి దాని స్థానంలో సద్వర్తనమును నిలుపుతుంది. ప్రక్షాళనం చేసే తీవ్ర తపస్సుకంటే ఈ పద్ధతి సుకరమై నది. ఉన్నత చైతన్యం అవరోహణ క్రమంలో అన్ని స్థాయిలలోను అనగా మానసిక, ప్రాణిక, భౌతిక స్థాయిలలో శాంతిని, పవిత్రతను కలిగిస్తుంది. అసంపూర్ణమైన బాహ్య చైతన్యం నుండి అంతర్జీవి వేరుగా తొలగిపోతుంది. ఈ విధంగా విడిపోయిన అంతర్జీవికి ఏర్పడే ప్రశాంత తలో ఒక విధమైన శక్తి ఉద్భవిస్తుంది. శాంతికి, పవిత్రతకు ఆటంకా లుగా నిలిచే వ్యతిరేక శక్తులను ఇది అవరోధిస్తుంది. అప్పుడు అహం కారం అనేది మెల్లగానో లేక త్వరగానో, కాని తప్పనిసరిగా మాత్రం మాయమవుతుంది. రజస్సు, తమస్సు, దైవోపశక్తులుగా మారుతాయి.

•

మానవుడు సామాన్యమైన చైతన్యాన్ని కలిగి ఉండుట కంటే ఉన్నత చైతన్య వికాసాన్ని పొందటం శ్రేష్టం. పరిణామానికి ఇదే సరియైన మార్గముగా గుర్తింపబడుతుంది. సామాన్య చైతన్యాన్ని కలిగి చెడు మార్గాలను నిరసిస్తూ ఉండడం వలన సంపూర్ణ ఫలితం ఉండదు. ఈ క్రింద పేర్కొనబడిన అంశాలు గమనింప దగినవి. లేనిచో ఈ భావము దోషయుక్తంగా భావింపబడుతుంది.

మూడు అంశాలు

1. వ్యక్తిత్వ మూర్తిమత్వాలు మానవునికి ఉన్నత చైతన్య వికాసానికి తోడ్పడుతాయి. ఆ విధంగా వికాసానికి తోడ్పడని గుణాలు ఏదో ఒక నెపంతో బలహీనతలకు గురి అవుతాయి.

2. సాధారణ ప్రాణిక శక్తిని తొలగించలేము. కాని దాని గమనాలను తొలగించవచ్చు. అందులోనూ పునరుక్తి కాని సాధారణ ప్రాణ శక్తి గమనాలను తొలగించవచ్చు. ఉన్నత ప్రాణికముగా పరిణమించడానికి సాధారణ ప్రాణశక్తి అవసరం. గుణములతో బాటు దోషములున్నట్లయితేనే గుణముల వైశిష్ట్యం తెలిసినట్లుగానే సాధారణ ప్రాణికము ఉంటేనే ఉన్నత ప్రాణిక వికాసానికి భూమికగా నిలుస్తుంది. కాబట్టి ఉన్నత చైతన్యం వలన సాధారణ ప్రాణికము ఉన్నత ప్రాణికముగా పరిణామం పొందాలే కాని దానంతటదే తొలగి పోయేది కాదు.

3. ఒకవేళ సాధారణ ప్రాణికాన్ని మార్చలేక పోయినట్లయితే చైత్యసీమలో లేదా ఉన్నత చైతన్యం అనే స్థితిలోనే సంతృప్తి పొందడం అపాయకరం. అంతరంగిక ఆనందం, అనుభవాల వలన సంతృప్తి చెందడం, బాహ్య క్రియాత్మక గమనాలను యథాతథంగా కొనసాగిస్తూ వాటికెటువంటి ప్రాధాన్యం ఇవ్వకుండా వాటి వెనుక ఏవో ఒక చైత్య లేక ఆధ్యాత్మిక చైతన్యం దాగి ఉందని సమర్థిస్తూ ఉండడం అనేది దోషపూరితం.

•

చైత్యపురుషుని విముక్తి, పరమాత్మ సాక్షాత్కారం లేని వ్యక్తిలో అహంకారం తొలగిపోవడం దుర్లభం. ఈ రెండూ అత్యావసరమే. ఆత్మ చైతన్యం లేని వ్యక్తిలో అహంకారం ఏ విధంగా తొలగిపోతుంది?

•

ఒకసారి సార్వత్రిక భావం ఏర్పడిన తరువాత మానవ స్వభావంలో ప్రాణికశక్తి సంబంధమైన అహంకారానికి తావు లేదు. అప్పుడు అహంకారపు తెరలు ఛేదింపబడతాయి. ప్రాణశక్తి ప్రేరణలు ఇంకా ఎదిరిస్తూనే ఉన్నప్పటికి ఇప్పుడవి సాధకుని ఏమియు చేయ జాలవు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. జి. అరుణా కుమారి

ప్రాణశక్తియొక్క రూపాంతీకరణం II

సాధనా క్రమములో సాధకుడు సాధారణ చైతన్యము నుండి ఉన్నత చైతన్యము వరకు పయనించి, మొదట దానిచే ప్రభావితమై, పిదప అందులోనే వసించుచు మానవ ప్రకృతిని పరివర్తింపజేసి రూపాంతరీకరించుటయే దివ్యజీవనమునకు రాజ మార్గము. మధ్యమధ్యలో కిందికి దిగివచ్చుటయు, నిమ్న ప్రకృతి యొక్క సరంజామానంతను అంచెలు అంచెలుగా పైకి తరలించి సువర్ణమయము గావించుటయు చివరవరకూ జరుగుతూనే ఉంటుంది. ఈ కార్యక్రమములో ప్రాణికము (vital) చైతాత్మ (psychic), ఊర్ధ్వచేతన, పరమ సత్యము (supreme truth) ముఖ్య పాత్ర వహిస్తాయి. ఈ చిత్ర విచిత్ర గతులను గురించి ఈ శీర్షికలో చదవండి.

రెండు గమనములు: నీ మనసును తికమక పరుస్తున్న ఈ రెండు గమనములు పరస్పర విరుద్ధములుగా కనపడుచున్నప్పటికీ ఒకే చైతన్యము యొక్క ఆద్యంతములు. ఇప్పుడు ఎడమైన యీ రెండు వెల్లువలు తిరిగి ఏకమైనప్పుడే ప్రాణశక్తి తన విధులను చక్కగా నిర్వహించగలిగి సఫలీకృతమౌతుంది. అనగా మన లక్ష్యము — రూపాంతీకరణము నేరవేరుతుంది.

ఈ రెండు కొనలలోనూ ఒకటి ప్రాణ శక్త్యాంతర్గతమైన ప్రాణమయ పురుషుడు (vital being) కాగా ఊర్ధ్వ చేతనార్గంతమైన క్రీయాశీలత రెండవది. తద్వారా దివ్య సత్యము ప్రాణికమును, దాని ప్రాణశక్తిని వశపరచుకొని ఇక్కడ జరిగే మహత్కార్యమునకు ప్రయోగిస్తుంది. రెండు గమనముల ఆవశ్యకత: ఈ బంధమేర్పడుటకు ఈ రెండు గతులు అవసరమే. ఒకటి ఊర్ధ్వగతమైనది: ప్రాణికము (vital) పైకెగసి, ఊర్ధ్వ చేతనతో చేతులు కలిపి వెలుగులో నిమజ్జనమై ఊర్ధ్వ శక్తియుక్తమౌతుంది. మరియొకటి అధోముఖ గమనము. ప్రాణికము నిశ్శబ్దమై, నిశ్చలమై పరిశుద్ధమై, సాధారణ చేష్టారహితమై, పైనుంచి దిగి వచ్చే క్రియాశీల శక్తికోసం నిరీక్షిస్తూ ఉంటుంది. తచ్ఛక్తి ప్రాణికమునకు

తన నిజరూపావిష్కారము గావించి తన నిజ జ్ఞానమును, నిజశక్తిని కలుగ జేస్తుంది. అందుకనే సాధకుడు ఒక్కొక్కప్పుడు మిక్కిలి సౌఖ్య దాయకమైన మహాచైతన్యస్థాయికి ఆరోహించి, జ్యోతిస్సీమల్లోకి ప్రవేశించి, దివ్యానుభూతులను పొందుతాడు. మరికొన్ని సమయములలో అతను "మళ్లీ ప్రాణికములోకి ప్రవేశించి అందులో సాధన చేసి దివ్య చేతనను తీసుకొని రావాలి" అని అనుకొంటాడు. ఈ రెండు కదలికలు పరస్పర విరుద్ధములు కావు. పరస్పర పరిపోషకములు. ఒకదాని కొకటి అవసరము. ఊర్ధ్వగమనము వలన దివ్యశక్తి దిగి వస్తుంది. దివ్యశక్తి దిగివచ్చుట వలన ఊర్ధ్వగమనము యొక్క ఆకాంక్ష సఫలమై తీరుతుంది.

చైత్యాత్మతో అనుసంధానము:

నువ్వు నీ ప్రాణికాన్ని దాని దిగువ సానువుల నుండి పైకి తీసుకొనిపోయి చైత్యముతో (psychic) అనుసంధించినప్పుడు నీ ప్రాణ మయ సత్త్వము (vital being) ఒకటే ఆకాంక్షతోను, ఒకటే భక్తి భావము తోను పొంగి పొరలుతూ ఉంటుంది. ఎందుకంటే ఇవి చైత్యభూమిక యొక్క సహజ ధర్మములు. మరియు అది నిన్ను తన అపారమైన శక్తితో సుసంపన్నము చేస్తుంది. ఆ శక్తి క్రియాశీలము. మానవ ప్రకృతిని సూక్ష్మ స్థాయిలో మాత్రమే కాకుండా భౌతిక స్థాయి వరకు కూడా పరి వర్తింప చేయగలదు. దివ్యచైతన్యమును పృథ్వీ తత్త్వములోనికి సహి తము తీసుకొనిరాగల స్తోమత గలిగి యున్నది.

చైత్యాత్మను స్పర్శించుటయే గాక ఊర్ధ్వ మానసిక (higher mind) పరిష్వంగియై దాంతో రమించినప్పుడు ఇంకా ఉన్నతోన్నత జ్యోతిస్సీమలతోను జ్ఞాన విశేషములతోను సంపర్కము కలుగుతుంది.... ప్రాణికమునకు ఊర్ధ్వమానసముతో సంపర్కము ఎప్పుడైతే కలుగు తుందో అప్పుడది వివిధ రూపములలో మహత్తరమైన తేజో జ్ఞానసంప దలతో — క్రియాశీలమౌతుంది. A higher intuition and inspiration, చక్కని విచక్షణాశక్తి, దివ్యసత్యమూ, దైవేచ్ఛల పరిజ్ఞానము దాని సంబారములు. ఈ విధముగా ప్రాణికము చైత్యశక్తికి, ఊర్ధ్వమనస్సుకు విధేయమైనప్పుడు యౌగిక చైతన్యము బాహ్యారంగమునకుకూడా ప్రసా రమై జీవితమును ప్రభావితము చేయగలుగుతుంది.

దైవశక్తి క్రిందికి దిగి వచ్చుట: మన లక్ష్యము దివ్యజీవనము. పృథ్వీపై దివ్యజీవనమును ప్రతిష్ఠించుట. అందులకుపైన చెప్పబడిన సిద్ధులు చాలవు. ఊర్ధ్వమానస చైతన్యము తోడి సంపర్కము అవసరమేగాని సరిపోదు. ఇంకా మహోన్నతమైన భూమికలనుండి దివ్యశక్తి దిగి రావాలి. నేడు దృశ్యపరిధిలోకూడా లేని శిఖరాగ్రములనుండి ఒక మహత్తరమైన శక్తి కిందికి దిగి రావాలి. అట్లుకానిచో ఈ ఉన్నత చైతన్యము అతిమానస జ్యోతిశ్శక్తులుగా పరిణమించుట; ప్రాణికము, దాని జీవశక్తి, దివ్యశక్తి చైతన్యము యొక్క pure, wide, calm, intense మహాశక్తివంతమైన సాధనముగా పరివర్తనము జెందుట; భౌతికము కూడా దివ్యజ్యోతి యొక్క ప్రతిరూపముగాను, దివ్యచర్యకు సాధనము గాను, దివ్యసౌందర్యానందనములకు వాహికముగాను భాసించుట సాధ్యముగాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీ నరసింహ శాస్త్రి

ప్రాణికము — సాధన

“సాధన కామ క్రోధాదులను త్రవ్వి బైటికి తీస్తుంది” అనే మాట సరికాదు. ఎందుకంటే సామాన్య మానవునిలో కూడా అతనికి తెలియకుండానే చాలా ప్రవృత్తులు దాగి వుంటయి. అతని ప్రాణిక సత్తా వాటిని దాచి పెట్టి తృప్తి పరుస్తూ వుంటుంది. ఈ తతంగమంతా మనస్సుకు తెలియకుండానే జరుగుతూ వుంటుంది. పరహితత్వము, లోకోపకారత్వము, మానవసేవ మొదలైన సాకుల క్రింద జరిగే కార్య క్రమాలన్నీ ఎక్కువగా అహంకారంతో కూడుకొన్నవే అయివుంటయి. యోగం ద్వారా యీ ముసుగు వెనుకనున్న అసలు రహస్యోద్దేశ్యాన్ని బయిటకులాగి, బహిర్గతముచేసి వదిలించుకోవాలి. రెండవది సాధారణ మానవ జీవితంలోకూడా కొన్ని విషయాలను అంతరంగంలో అణగ ద్రొక్కబడి వుండటం జరుగుతూ వుంటుంది. అవి అణగ ద్రొక్కబడి వుంటాయేకాని విసర్జించబడవు. ఎప్పుడో ఒకప్పుడు పైకి విజృంభించ వచ్చు, నాడీమండలాన్ని కలవర పెట్టే వివిధ రూపాల్లో కానీ లేక మనోప్రాణ భౌతికాలలో వ్యాధులుగా పరిణమించవచ్చు. ఇటీవలి కాలంలో ఐరోపా మనస్తత్వ శాస్త్రవేత్తల పరిశోధనల్లో యీ విషయం కనుగొనబడింది. దీనికి వాళ్లు అత్యధిక ప్రాధాన్యత యివ్వడమేగాక, దీనిని అతిశయోక్తిగా చేసి మనస్తత్వ-విశ్లేషణ (Psycho-analysis) అని పిలువబడు ఒక నూతన శాస్త్రంగా రూపుదిద్దారు. ఇక్కడకూడా సాధ కుడు అణగద్రొక్కబడివున్న ప్రాణిక స్పందనలను తెలుసుకొని, వాటిని తొలగించవచ్చు. కేవలం తొలగించుట కొరకే వాటిని బయిటకు తీయాలి గాని క్రియారూపమిచ్చుటకు గాదు. యోగసాధనలో మానసి కమైన లేదా నైతికమైన నిగ్రహం స్థానే ఆధ్యాత్మిక నియంత్రణం జరగాలి. ఎందుకంటే మనోనిగ్రహము పాక్షికమైన కారణంగా — అది నిగ్రహించగలదే కాని విముక్తపరచజాలదు. ఆ పనిని చైత్య (Psychic) ఆధ్యాత్మికాలు మాత్రమే చేయగలవు. మామూలు జీవనానికి ఆధ్యా త్మిక జీవనానికి భేదము యిదే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదకులు: కె. ఎస్. భాస్కర రావు

బ్రహ్మచారి సంయమేశ్వర్.

క్రియలలో ప్రాణికము యొక్క ఆహూతి

ప్రాణసత్తాకు చెందిన సాధారణ ఉద్దేశాలు, ప్రయోజనాలు, అవసరాలు, కోరికలు, హోదా, అధికారము, పేరు ప్రతిష్ఠలకోసం ప్రాకులాడటం, శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవాలనే తత్పరత — వీటి కోసమే కదా మానవులు వారి జీవితాలను సాగిస్తూ వుంటారు. వారి అర్హతను, అదృష్టాన్ని బట్టి కొంతమంది సఫలీకృతు లౌతారు. కొంతమంది వైఫల్యం జెందుతారు. ఇది వారి ప్రారబ్ధకర్మాను సారం జరుగుతుంది. యోగసాధనను చేపట్టి భగవంతునికి జీవితాన్ని నివేదన చేసుకోదలచినప్పుడు ప్రాణసత్తాకు చెందిన యీ సాధారణ ఉద్దేశాలకు ప్రయోజనాలకు స్వస్తి చెప్పాలి. వాటి స్థానే చైత్యాత్మక మైన (psychic) ఆధ్యాత్మికమైన ప్రయోజనమే, ఉద్దేశమే భాసించాలి. అయితే ప్రాణశక్తి లోపించుట వలన సాధకుడు బలహీనమై పోడు. అదివరకెంత శక్తితో పనిచేసేవాడో ఇప్పుడు కూడా అంత శక్తితోనూ పనిచేస్తాడు — తనకోసంకాక దైవంకోసం. మామూలు ప్రాణిక ప్రయోజనాలు, ప్రాణిక శక్తిలోపించినప్పుడు సాధకునికి పనిచేయడం లోని ఉత్సాహం, తత్పరత లేకపోవచ్చు. అయితే హృదయపూర్వకంగా త్రికరణశుద్ధిగా పనిచేసే సాధకునికిమట్టుకు ఇది తాత్కాలికమే కావచ్చు. తన చేతనలోని లోపాన్ని సాధకుడు గమనించి తొలగిం చాలి. అప్పుడు ఆ *దివ్య మహాశక్తి* తానుగా సాధకునిలో పనిజేస్తుంది. తన లక్ష్యసాధనకు అతని సామర్థ్యాన్ని ప్రాణశక్తి వినియోగించుకొం టుంది. నీ విషయంలో నీ చైత్యపురుషుడు, మనస్సులోని ఒక విభాగం నిన్ను యోగం వైపుకు మళ్లించాయి. ముందునుంచే అవి యోగోన్ము ఖంగా ఉన్నవి. కాని నీ ప్రాణిక ప్రకృతి (vital nature) గాని కనీసం అందలి అధిక భాగం చైత్య ప్రక్రియను అనుసరించుటలేదు. అఖండ మైన ప్రాణిక నివేదనమింకను జరగలేదు.

ప్రాణికము సక్రియగా తనను తాను నివేదించుకొన్నటుల మనకి కొన్ని చిహ్నాల ద్వారా తెలుస్తుంది. "నీ సమస్తమైన జీవితము, కర్మలు శ్రీమాతవే" అనే అనుభూతి; సమర్పించుకొనుటలోను, నివే దించుకొనుటలోను ప్రాణ ప్రకృతిలో పొంగిపొరలే ఆనందము యొక్క

ప్రత్యేకానుభూతి (ఒట్టి భావమో ఆకాంక్షయో కాదు); తత్ఫలితంగా లభించు ప్రశాంతత, సంతృప్తి, ప్రసన్నత; అహంకారం మాయమగుట; కార్యాచరణమునందు తన కౌశలాన్ని దివ్య కార్యం కోసం వినియోగి స్తున్నాననే మహదానందానుభూతి.

తను ఏ పనిచేపట్టినప్పటికి దానిని దివ్యశక్తియే నడిపిస్తోంది, నిర్వహిస్తోంది అనే అనుభూతి ప్రతి క్షణము కలుగుతూనే ఉంటుంది.

అప్పుడు కష్టాలు సంభవించినప్పటికి అవి నీ మనస్సును చలింపజాలవు. నిక్కమైన నివేదనవలన, దివ్యశక్తి తన కష్టాలన్నిం టిని తొలగించివేస్తుందనే దృఢమైన విశ్వాసం ఏర్పడుతుంది. అప్పుడు దివ్యశక్తిని ఆశ్రయించడం, శరణు పొందటం జరుగుతాయి. పూర్ణమైన శ్రద్ధా విశ్వాసాలు, ఆత్మనివేదన ఉన్నప్పుడు మహాశక్తిని పొందే గ్రహణ సామర్థ్యం కూడా అధికమౌతుంది. ఎప్పుడు పని చేయవలెనో, ఎటుల చేయవలెనో అది దానంతటదే ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. పరిస్థి తులు వాటంతటవే అనుకూలిస్తయి. ఫలితాన్నిబట్టికూడా ఈ విషయం తేటతెల్లమవుతుంది. ఈ స్థాయిని చేరుకొనుటకు నిరాంతరాకాంక్ష, దివ్యవాణి నాలకించుట, ఆత్మనివేదన, తనలోను, తన మార్గంలోను ఏర్పడే విఘ్నాలను నిరాకరించే శక్తి ముఖ్యములు. మొదట్లో కష్టాలనేవి ఉంటూనే ఉంటయి. సుస్థిరమైన శ్రద్ధావిశ్వాసాలు, ఇచ్ఛ, సహనాలతో, కష్టాలను ఎదుర్కొన్నట్లయితే అవి తప్పక అంతరించి పోగలవు.

కర్మాచరణము చైత్యదృష్టితో కాకుండా ప్రాణిక దృష్టితో చేసినట్లయితే నువ్వు కర్మలలో బాహ్యాస్థమయిపోయి అంతఃస్పర్శను కోల్పోయెదవు. అటులగాక చైత్యదృష్టి లోపించకుండా వున్నట్లయితే నిన్నాశక్తియే నడిపిస్తూ పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. సాధన ముందుకు సాగిపోతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

పరమసిద్ధి యొక్క ప్రయోజనము

ఈ పరమసిద్ధిలో కఠినమైన సన్యాస వైరాగ్యానికిగాని, "నన్ను ముట్టుకోకు" అనే ఆధ్యాత్మిక అనాసక్తికిగాని, ప్రయాసతో కూడిన కఠినోగ్ర తపశ్చర్యలకుగాని, హృదయాన్ని, మనస్సును అణగ ద్రొక్కివేసే నిష్క్రియత్వానికిగాని తావులేదు. ఇది హృదయము యొక్క భావావేశాన్ని హతమార్చుటకాదు. రూపాంతరీకరించుట. మన బాహ్యా ప్రకృతిలో వికృతంగాను విపరీతంగాను ద్యోతకమయ్యే లక్షణములు మన అసలు రూపాలుకావు. అయితే వాటికి అర్థము, ప్రయోజనము లేకపోలేదు. మనం దివ్య పురుషుని మూలతత్వాన్ని జేరుకున్నప్పుడు గాని మనకి ఆవికారాలు, వైపరీత్యాలు ఎందుకున్నయ్యో తెలియదు. ప్రేమయొక్క స్థాయి, ప్రమాణము పెరుగుతాయేగాని నిర్మూలముగావు. ప్రేమ విస్తృతమై సమస్తమైన సృష్టిని ఆవహిస్తుంది. ప్రగాఢమైన దివ్య పారవశ్యమునొందుతుంది. సమస్త రాగావేశముల స్థానములో భగవత్ప్రేమ, సర్వమానవప్రేమ, సర్వవస్తు, ప్రాణి, శక్తుల దివ్యతాదాత్మ్యత, ఒక విశాల విశ్వప్రేమ, వివిధ అనుబంధాల అనుభవ సామర్థ్యములు సిద్ధిస్తయి. క్లుప్తంగా చెప్పాల్నంటే అల్పమైన, వికృతమైన ప్రేమ అనంతమైన, దివ్యప్రేమగా పరివర్తనమవుతుంది. బాధ సమాప్తమవుతుంది. దాని స్థానములో ఒక విశ్వప్రేమ, ఒక సర్వసమానాత్మక ప్రేమా కరుణలు స్థాపింపబడతాయి. అది బాధతో కూడిన దయకాదు, అయితే పోషించు, అభివృద్ధిపరచు, ముక్తిని కలిగించు ఒక శక్తి అది. సర్వబంధ విముక్తమైన స్వతంత్ర (ముక్త) ఆత్మకు ఆగ్రహావేశములు, ద్వేషములు అసంభవములు. అయితే ప్రచండ దివ్యరుద్ర శక్తి ద్వేషక్రోధములు లేకుండా సంగరము గావించి, విధ్వంసము చేయగలదు. ఎందుకనగా సర్వకాల సర్వావస్థలయందు ఆశక్తిచే ధ్వంసము చేయబడే సమస్త భూతములు తన అంశములే, తన యొక్క వ్యక్తరూపములేనను ఎఱుక అది కలిగి వుండుటచే ఈ క్రోధ ద్వేషభరితమైన వ్యక్తుల యెడల కూడా అచంచల కరుణ అవగాహనలు కలిగి వుంటుంది. మనభావావేశ ప్రకృతి అంతయు ఈమహోత్తరమైన రూపాంతరము చెందుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బ్రహ్మచారి సంయమేశ్వర్

శ్రీఅరవిందుల రచనలను చదివే విధానం

శ్రీఅరవిందుల రచనలను* చదివేవారికి నేనిచ్చే సలహా యిది. మనస్సును సాధ్యమైనంత ప్రశాంతపరచుకొని, ఒక్కొక్కసారి కొంచెం కొంచెం మాత్రమే చదవండి. దానిని వెంటనే అర్థం చేసుకోవాలని ఆరాటపడి తలలు బ్రద్దలు చేసుకోవద్దు. మనస్సును అలజడులకు, ఆలోచనలకు దూరంగా ఉంచండి. తరువాత అటుల నిశ్శబ్దపరచిన మనస్సులోనికి ఆ రచనలలో నిక్షిప్తమైన మహత్తును తిన్నగా, నిరాటంకముగా ప్రవేశించనివ్వాలి; త్వరబడి చోటు చేసుకోనివ్వాలి. అలా నిశ్శబ్ధంగా ప్రశాంతంగావున్న మనస్సులోనికి ప్రవేశించిన ఆ శక్తి నిలదొక్కుకొని తన దీప్తిని తాను వికసింపజేసి బుద్ధిని ఉజ్వలాయమానం చేయటానికి తన పని తాను చేసుకొనిపోతుంది. అంతేకాదు. అవసరమైతే, చదివిన అంశాలను అర్థం చేసుకొనటానికి అవసరమైన కొత్త జీవకణాలనుకూడా మెదడులో సృష్టిస్తుంది. అందుకని కొన్నినెలల తరువాత అదివరకు చదివిన అంశాలను మళ్ళీ చదివినట్లైతే, అందులో వెలువరించిన భావాలు మునుపటికంటే బాగా ప్రస్ఫుటమవుతాయి. ఆ భావాలతో సాన్నిహిత్యం, మచ్చిక విస్తృతమవుతుంది. కొన్ని సందర్భాలలో, ఎంతో ఆశ్చర్యంగా అవి ఇంతకు పూర్వమే పరిచయమున్న విషయాలుగాకూడా ద్యోతకమవుతవి!

ప్రతిరోజూ ఓ నిర్ణీత సమయంలో, క్రమం తప్పకుండా, కొంచెంకొంచెం చదువుట మంచిది. ఎందుకంటే నిత్యానుష్ఠానం వలన మెదడు యొక్క గ్రహణశీలత పెరుగుతుంది.


మూలం: శ్రీమాత

అనువాదం: అన్నవరపు ఆదిశేషయ్య

---

*శ్రీఅరవిందుల అభిభాషణలు ఉత్తిత్తి మాటల మూటలు కావు. అవి అక్షయతూణీరాలు. నమ్ముకుంటే చాలు ఆ అమ్ములు పరి శ్రమ లేకుండా ప్రశాంతమందిరానికి చేరుస్తాయి. విడువక వాటిని వెన్నంటి నడవటమే మన విధి.

అనువాదకుడు



ఆత్మ
అంతరాత్మ

అఖిల

అఖిల భారత పత్రిక

మే 1999

నిన్ను నీవు తెలుసుకో – II

నిన్ను నీవు తెలుసుకో — II

ఉపోద్ఘాతము

"నేను" అని పిలువబడే ఈ అల్పిష్టి మనో ప్రాణిక దైహిక ముల సంపుటి ఒక ఉపరిగత సంచలనము మాత్రమేగాని మన నిజ స్వరూపము కాదు — తన అజ్ఞాన ఖేలనము కొరకై బుద్బుద ప్రాయ మైన ఒకే ఒక జీవిత పర్యంతము ప్రయుక్తమైన ఒక వ్యక్తిత్వపు బాహ్యా శకలము మాత్రమే. దాని ఉపకరణములు — సత్యము యొక్క విచ్ఛిన్న ఖండములకై అన్వేషించుచున్న అజ్ఞానమైన మనస్సు, సంతోషము యొక్క చితుకులకై పరుగులాడుచున్న జ్ఞాన రహితమైన ప్రాణికము, సుఖ దుఃఖముల ఘటనాఘటనలకు లోబడి మసక చేతన మాత్రమే కలిగిఉన్న భౌతిక శరీరము — అంతంత మాత్రములే. మనస్సు విసిగి వేసారి తనయొక్కయు, విషయములయొక్కయు సత్యమే కావాలి అను కుండేంతవరకు, "ఛీ! ఇదేంబ్రతుకు, వాస్తవమైన ఆనందము ఎక్కడా లేదా ఏమిటి", అని ప్రాణికము నిర్ఘాంతపోయే వరకు, భౌతిక శరీరము "ఈ పీడ ఎప్పుడు విరగడై పోతుంది" అని సుఖ దుఃఖాలనుండి విము క్తిని కోరేంతవరకు ఈ నాటకం ఇట్లాగే కొనసాగుతుంది. మనో ప్రాణిక భౌతికాలు "ఈ నాటకమిక చాలులే" అని ఎప్పుడైతే అనుకుంటయ్యో అప్పుడు ఈ అజ్ఞానపు వ్యక్తి తన నిజస్వరూపమును, దాంతోపాటు సత్యసంపదలను పొందుతాడు. లేక నిర్వాణమును పొంది తనను తాను విలీనము చేసుకుంటాడు.

వాస్తవిక 'ఆత్మ' పై పొరలలో ఎక్కడా కనపడదు. లోలోపలి అఖాతాలలోను, ఊర్ధ్వములోను మాత్రమే ఉంటుంది. లోని అంతర్మ నస్సునకు, అంతఃప్రాణమునకు, అంతర్భౌతికమునకు ఆధారంగా 'అంతరాత్మ' ఉంటుంది. అది విశ్వవ్యాపకశీలము. మనమభిలషించే ఆధ్యాత్మికసంపదలు — ఆత్మయొక్కయు, సర్వభూతముల యొక్కయు నిజస్వరూపదర్శనము, విశ్వగత ఆనందముయొక్క రసాస్వాదన, ఈ

ఇరుకు చెరసాలనుండి స్థూల శరీరము యొక్క విముక్తము — దాని ద్వారానే కలుగుతయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. కూర్మారావు

ఈ సంకలనములో "the Self", "the Soul" అనే పదములకు శ్రీఅరవిందులు ఇచ్చిన నిర్వచనములు యివ్వబడినవి.

శ్రీఅరవిందుని రచనలను ఎలా చదవాలి?

శ్రీమాత: ఎప్పుడూ నా సలహా ఏమిటంటే.... ప్రతిసారి కొంచెం కొంచెమే చదవాలి. మనసును నిర్మలంగా ఉంచుకుని ప్రశాంతంగా ఉంటూ, అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయకుండా ఉండాలి. మెదడును నిశ్శబ్దంగా ఉంచడానికి తగినంత ప్రయత్నం చేయాలి. అపుడు మీరు చదువుతున్న విషయంలోని శక్తి మీ అంతరంగంలోకి చేరుకుంటుంది. ఆ ప్రశాంత నిశ్శబ్దంలో మీలో చేరిన ఆ శక్తి జ్ఞాన జ్యోతిని ప్రసరింపచేస్తూ, అవసరమైతే అర్థం చేసుకోగలిగిన కొత్త జీవ కణాలను సృష్టిస్తుంది. ఆ విధంగా రోజూ చదువుతున్నపుడు అదే విషయం కొన్ని నెలల అనంతరం.... సులభగ్రాహ్యంగా, ఆ ఆలోచనా ధార స్పష్టంగా, తెలిసినట్టుగా అనిపిస్తుంది. అంతేకాకుండా, ఆ ఆలోచ నాధార స్పష్టంగా గ్రాహ్యం అవుతుందికూడా.

రోజూ కొంచెం కొంచెం చదవడమే మంచిది. అదికూడా సాధ్యమయినంత వరకూ ఒకే సమయంలో చదవాలి. అది బుద్ధియొక్క గ్రహణశక్తిని పెంచుతుంది.

శ్రీమాత

ఆత్మ — అంతరాత్మ

(శ్రీఅరవిందుల ప్రవచనములు)

పరబ్రహ్మము — నిరపేక్షము*

మనకంటే గొప్పది, మనము నివసించే విశ్వముకంటే ఘన మైనది, మనము దేవుడు అని పిలిచే విశ్వాతీత సత్యము ఏదైతే యున్నదో దానిని మనము నిరపేక్షము అంటాము. అది లేనిదే మనము చూచునట్టియు ఇంద్రియములకు జ్ఞాతమగునట్టియు వస్తువులేవియు ఉండజాలవు. ఒక్క క్షణమైన మనజాలవు. బారతీయ తత్వ చింతన దానిని 'బ్రహ్మ' అనియు, ఐరోపాతత్వ చింతన 'నిశ్శేషము' 'నిరపేక్షము' అనియు పిలిచెదరు. ఎందుకనగా దానిది స్వతంత్ర ప్రతిపత్తి — నానా త్వముతో ఎట్టి బంధము లేనిది.

*

మనము దేనినైతే సత్త్వము (సత్త), అసత్త్వము (అసత్త) అని పిలిచెదమో దానికి పైన క్రింద ఉండి అంతస్థలీయము, సారభూతము, అనిర్వచనీయము అయిన వస్తువే 'నిరపేక్షము'

*

'నిరపేక్షమే పరమ సత్యము'.

*

పరబ్రహ్మమే నిరపేక్షము, నిశ్శేషము, కేవలము. అది నిరపేక్షము కనుకనే దానిని మాటలలో వర్ణించలేము. నీవు అనంతమును (Infinite) ఒక మోస్తరుగా తెలుసుకొనగలవేమో గాని నిరపేక్షమును మట్టుకు తెలుసుకొనజాలవు.

ప్రపంచములో ఉనికి గల సమస్త వస్తువులు ఉనికి లేని సమస్తమైన చిదాత్మలో సృష్టించబడిన నిరపేక్షము యొక్క ప్రతీకలే. ఆ ప్రతీకల ద్వారా, అవి సూచించినంత మేరకు నిరపేక్షమంటే యేమిటో తెలుసుకొనవచ్చు. కాని, సృష్టిలోని సమస్త ప్రతీకలను గురించిన జ్ఞానంకూడా నిరపేక్షమును గురించిన యథార్థ జ్ఞానమును అందించలేదు.

*

---

* నిశ్శేషము, కేవలము = Absolute

అనిర్వచనీయమైన దానిని ఎవరైనా నిర్వచించి ఒక చట్రంలో బిగించగలరా? అదే మనం చేసే పొరపాటు. చివరికి మనం సాధించిన దేమిటంటే, ఆ నిరపేక్షాన్ని, ఒక ప్రక్కన నిషేధాత్మకంగా నిర్వచిస్తూ, మరో ప్రక్కన సకల సాకార రూపములకు కారణ భూతమైన పరమ సాకారమని కూడా భావించుటయే.

నిజమే, ప్రాచీన మహర్షులు బ్రహ్మమును గూర్చి నిషేధాత్మ కముగా చెప్పిన మాట నిక్కముగా నిజమే — 'నేతినేతి,' అనగా బ్రహ్మ మిది కాదు, అది కాదు — అని వారు చెప్పియున్నారు — అయితే బ్రహ్మమును గూర్చి వారు శ్రద్ధ తీసికొని, సద్భావాత్మకముగా కూడ చెప్పియున్నారు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనగా బ్రహ్మ మిది, బ్రహ్మ మది, బ్రహ్మము సర్వము — అని కూడ చెప్పియున్నారు. ఏలన సద్భావాత్మక లేక అభావాత్మక నిర్వచనములచేత బ్రహ్మమును పరిమితము చేయుట యన బ్రహ్మ సత్యమునుండి పడిపోవుటయే యని వారు దర్శించిరి. బ్రహ్మ ద్రవ్యము, బ్రహ్మ ప్రాణము, బ్రహ్మ మనస్సు, బ్రహ్మ అతిమనస్సు, బ్రహ్మ వైశ్వ ఆనందము, బ్రహ్మ సచ్చిదానం దము — అని వారు చెప్పిరి; అయినను ఈ తత్త్వములలో దేనిచేతను, సచ్చిదానందమును గుఱించిన మన బృహత్తమ భావనచేత సైతము, బ్రహ్మ నిరుక్తము (defined) కాజాలదు. మన మెట్లు ప్రపంచమును జూతుమో, అట్టి ప్రపంచమునందు, మనము మన మానసిక చేతన నెంత ఎత్తునకు గొనిపోయినను దానికి ప్రతి సద్భావమునకు ఒక అభావ ముండునని మనము కనుగొందుము. కాని అభావము (negative నిషేధాత్మకము) ఒక శూన్యము కాదు — నిక్కముగా మనకు శూన్యముగా గన్పించునదేదియైనను, బలముతో నది దట్టించ బడి యుండును. సత్తుయొక్క శక్తితో పూర్ణమై యుండును. వాస్తవ లేక శక్య (potential, బీజావస్థక) అంశములతో నిండియుండును. మఱియు ఒక అభావముయొక్క అస్తిత్వము దానికి సంబంధించిన సద్భావమును అస్తిత్వరహితము గాని, మిథ్యాభూతము గాని చేయదు. సద్భావము వస్తువుల సత్యముయొక్క మఱియు తన (సద్భావముయొక్క) స్వీయ సత్యముయొక్క ఒక అసంపూర్ణ ప్రతిపాదన మాత్రమే యని అభావము దెలుపును. ఏలన సద్భావము మఱియు అభావము సరసన వర్తించు

టయే గాక, ఒకదానితో నొకటి సంబంధము గలిగియు, ఒకదానిచేత నొకటియు వర్తించును. అవి ఒకదాని నొకటి పూర్ణము జేసికొనును. మఱియు దేనిని ఒక పరిమిత మనసు చేరుకొన జాలదో, ఆ సాకల్య దృష్టికి ఒకదాని నొకటి వివరించుకొనును. ఈ ప్రతిపక్షములలో నేయొక్కటియు తన చేతనే యని యథార్థముగా తెలియబడజాలదు. ఒక దానిలో దాని ప్రతీయమాన (apparent పైకట్లు గన్పించు) ప్రతిపక్షము యొక్క సూచనలను గుర్తింపగలిగినపుడే, ఆ ఒకదానిని దాని గభీరతర సత్యమునందు తెలిసికొన నారంభింతుము. వ్యావర్తక తర్కము కల్పించు విరోధములద్వారా కాక, అట్టి గభీరత సముదార అంతః స్ఫూర్తిచేతనే మన బుద్ధి నిరపేక్షమును సమీపించదగును.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. కూర్మారావు; చెలసాని నాగేశ్వరరావు

(దివ్యజీవనం నుండి)

సావిత్రి

'నిగూఢ జ్ఞానము' అనే అధ్యాయములోని ఒక భాగము

బ్రహ్మంబు పూర్ణంబు పరమేకంబు.
తనదైన మౌనమున శయనించియున్న
కబళించు కాలంబు నుండి కాపాడు
కదలని మెదలని నిద్రాణమైన
గాఢ సుప్తిని మునిగి చలనంబులేని
అవ్యక్తమును అనంతమైనట్టి
నిశ్శబ్ద శక్తి నిర్నిద్రుండు లేపె.

బ్రహ్మంబు పూర్ణంబు పరమేకంబు
తన మౌనముతో ఆకసమందు చేరినది.
తన రూపమున ప్రజాతతుల కల్పించినది
తన శక్తినుండి సృష్టించినది కోటిశక్తులను

ఏకాంతమును వీడి బృహద్ధామంబు విడనాడి
హృద్దేశమున విడిదిసేయంగ వచ్చినది
ఆకాశము తానాయెను కాలముగా మారిపోయె

బ్రహ్మంబు పూర్ణంబు సంగరహితంబు
మన లోపలి గూఢాత్మగ మసలసాగినాడు విభుడు
మన వేషంబుల దాల్చెను నటియించెను అకగుణముల
మృణ్మయ* దేహము తనదిగ హిరణ్మయుడు వసించునిచట
మనము కూడ దైవస్థితి కెదుగుట యాతని ముచ్చట
దివ్యమైన తన రూపము మనలోపల చిత్రించెను
దివ్యస్రష్ట మన భూమిక కొంగ్రొత్తగ సవరించెను
మర్త్యులలో ముద్రించెను దైవత్వపు వ్యూహంబుల
పరిమిత మానసముల మలచె అనంతత్త్వ వాహికలుగ
రూపాంతర స్థితిని పొంది ధర తీర్చును దైవఋణము
పరస్పరమైనట్టి ఋణమె పరాత్పరుని తోడి మన బంధము
అమృతత్వ పుత్రులమై సమత్వమున చరించవలెను
అతని మానవాంశ మనము దివ్యత్వము నందవలెను
మన జీవితమెల్లప్పుడు అయోమయము అనన్వయము
ఘనుడగు పరమాత్మ యొకడె అన్నింటికి సమన్వయము

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

* మాంసం

సత్త్వము — సంభూతము*

నిరపేక్షమే సర్వభూతములకు మూలము, ఆలంబనము అని మన కచ్చితమైన అభిప్రాయము...

*

నిరపేక్ష బ్రహ్మము తననుదాను సత్తు, సంభూతి అనే రెండు రూపములలో అభివ్యక్త పరచుకొంటుంది. సత్త్వము మూల సత్యము. సంభూతము దాని కార్య రూపము, క్రియాశీలమైన శక్తి, పర్యవసానము. నిరంజనమూ, నిరాకారమూ అయిన మూలధాతువు యొక్క సృజన శక్తి. నిత్యమై కూడా క్షణ క్షణ పరిణామము చెందుతూన్న విశేషము.

*

దైవము యొక్క మూలతత్త్వము సత్తు (being). అది శాశ్వతమైనది. దాని పరిణామ రూపము (చేతన, నైసర్గికము, శక్తులు, ఆలంబనముల మాధ్యము వలన) సంభూతము. దైవము యొక్క, కాలాతీతమైన, శాశ్వత స్వరూపము సత్త్వము. కాలగతిలో అది తాల్చిన రూపములు — విశ్వము, తదంగములైన దృశ్యమాన వస్తువులు, దాని సంభూతములు.

*

సత్త్వము సంభూతము కంటె వేరుగాదు. దానిలోనే వున్నది గనుక, దాని ఘటక పదార్థము గనుక, దాని ప్రతి సూక్ష్మాతి సూక్ష్మ పరమాణువునందును, నిస్సీమ విస్తృత ప్రసారములందును అంతర్నిహితము గనుక మాత్రమే అది ప్రామాణికము.

*

Pure Being is the affirmation by the Unknowable of Itself as the free base of all cosmic existence.

*

అస్తిత్వము అనిర్వచనీయమైన సత్త్వము యొక్క ప్రతిబింబము.

---

* సత్త్వము = సత్త = being. సంభూతము = సంభూతి = becoming

సత్త్వము నిత్యమూకాదు, అనిత్యమూకాదు. అనంతమూకాదు, సాంత మూకాదు. ఏకమూ కాదు, బహుళమూకాదు. మానవ భాషకు లొంగు నదీ కాదు, మానస భావము గ్రహించునదీ కాదు. అస్థిత్వము అనే పదము దానిని (సత్త్వమును) మరీ నిర్బంధము చేస్తుంది. శాశ్వతమూ, అనంతమూ అనే పదములు కూడా దానిని నిర్వచించుటకు అశక్త ములు. సత్త్వమనగా ఏదో ఒక అజ్ఞానమైన వస్తువును ఎత్తి చూపించే 'క' అనే ఒక ప్రతీక గాదు. దాని ప్రమాణమే వేరు. అది జ్ఞానాజ్ఞాన కొలమానములకతీతము. బ్రహ్మయే అన్ని విభవములకు మూలము. కాని తను మట్టుకు అట్టి విభవములకు అతీతము.

*

మన జీవితము యొక్క పరమ లక్ష్యము

సంభూతి తననుదాను సత్తుగా నెఱింగినపుడే, తనను సమగ్ర ముగా నెఱుంగగలదు. సంభూతియందలి అంతరాత్మ (జీవుడు) పర మని, నిరపేక్షుని ఎపుడెఱుంగునో, అనంత, నిత్యులయొక్క స్వభావ మునెపుడు పొందునో, అపుడు మాత్రమే అది ఆత్మ జ్ఞానమును, అమ రత్వమును చేరుకొనగలదు.అట్లు చేరుకొనుటయే మన జీవనముయొక్క పరమ లక్ష్యము. ఏలన అదియే మన సత్తుయొక్క సత్యము, మఱియు నందుచేతనే మన సంభూతియొక్క అంతర్నిహిత లక్ష్యము. ఆవశ్యక ఫలితము. మన సత్తుయొక్క ఈ సత్యము మన అంతరాత్మయందు ఒక అభివ్యక్తి ఆవశ్యకత యగును. ద్రవ్యమునందు ఒక రహస్య ఊర్జ మగును. ప్రాణమునందు ఒక ప్రేరణ, ప్రవృత్తి. అటులే ఒక కామన, ఒక ప్రయత్నము అగును. చివరకు మనస్సునందు ఒక సంకల్పము, లక్ష్యము, ప్రయాసము, ప్రయోజనము అగును. ఏది తనయందు లోపల ఆదినుండియు గుప్తముగా నున్నదో, దానిని అభివ్యక్తము సేయుటే పరిణామాత్మక ప్రకృతియొక్క సంపూర్ణ రహస్య ప్రవృత్తి యగును.

ఇక సంభూతియందలి అంతరాత్మకు తనను సత్తుగా నెఱుం గుటకును, సంభూతిస్వామి యగుటకును అవకాశము గలదు. అయితే అదే సమయమున తాను సాంతమున స్వయంప్రకటితమైన అనంత బ్రహ్మమని కూడ అది తన నెఱుంగగలదు. అటులే కాలనిత్యత యొక్క ఆధారభూత స్థితియందును, వికాసశీల గతియందును తనను,

తన పనులను చూచుకొనుచుండు కాలరహిత నిత్యము తానని తన నంతరాత్మ చూచుకొనగలదు. ఈ దర్శనమే సంభూతియొక్క పరాకాష్ఠ. ఇది తన సక్రియ సత్యతయందు సత్తయొక్క పరిపూర్ణత.

అప్పుడే ఈ విశ్వము యొక్క ఆధ్యాత్మిక ప్రయోజనము పూర్తిగా విదితమౌతుంది. ఆత్మ అవతరణము న్యాయమేనని తెలియ వస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. కూర్మారావు; చెలసాని నాగేశ్వరరావు

(దివ్యజీవనము నుండి)

ఆత్మ — పరమాత్మ

బ్రహ్మం శూన్యములోను, కాలములోను తన్నుతాను విస్తృత పరచుకొని సర్వత్రా వ్యాపించి ఉంటుంది. మనం ఏకత్వం పొందేది ఆ మూల పదార్థమైన, అపరిచ్ఛిన్నమైన పూర్ణత్వంతోనే — దానినే అంతరాత్మగాను విశ్వాత్మగాను తెలుసుకొనగలం. దానినే ఆత్మ అంటాము. అదే సత్పదార్థం.

*

బ్రహ్మము యొక్క ఆత్మాశ్రయ (subjective) రూపమే ఆత్మ. విశ్వమంతా, నిండివున్న అక్షర రూపము.

*

ఏకమాత్రమైన విశ్వాత్మ దైవంలోని భాగం కాదు — అది ఆయన యొక్క ఒక భంగిమ మాత్రమే.

*

....of this utter Absolute... our true Self is the essential form in our consciousness (స్వరూపము)

*

The Self is being, not a being. By Self is meant the conscious essential existence, one in all.

*

సమస్తమైన కార్యకలాపాలు ఆత్మలోనే సంభవిస్తాయి. ప్రకృతి యొక్క సమస్త ఖేలనములకు ఆలవాలము ఆత్మ. అదే దైవం. ఆ ఆత్మయే విశ్వాన్ని తనలో ధరిస్తుంది.

*

పరమాత్మకు దైవమునకు భేదం లేదు.

*

ఆత్మ పరిశుద్ధమై, అమలమై జీవితం యొక్క మలినాల వలన, కోరికల వలన అజ్ఞానాదుల వలన చెక్కు చెదరకుండా ఉంటుంది. వ్యక్తిలోని సత్యస్వరూపమైన సత్త్వము (సత్త) గా తెలుసుకోబడుతుంది. మరింత విస్తృతమైన అర్థంలో అందరిలోను వున్న ఏకమాత్ర సత్తగాను, విశ్వాత్మగానూ కూడా అనుభూత మౌతుంది. వ్యక్తికిపైన, విశ్వానికిపైన ఉన్న పరమాత్మ, పరమేశ్వరుడు అదియే.

*

పరమోచ్ఛమైన ఆధ్యాత్మిక ఆత్మ మన వ్యక్తిత్వం వెనుకగాని స్థూల శరీరం వెనుకగాని ఉండదు. వీటికి పైన, వీటిని అధిగమించి ఉంటుంది. ఆంతరంగిక కేంద్రములలో (చక్రములలో) అన్నిటికంటె అగాధమైనది హృత్కేంద్రము, ఛాతిలో ఉంటుంది. పరమోన్నతమైనది శిరస్సులో వుంటుంది. అయితే అంతరాత్మ వైపు సూటిగా ఉన్మీలమైన కేంద్రం మట్టుకు శిరస్సుకుపైన భౌతిక శరీరానికి బైటగల సూక్ష్మ శరీరంలో ఉంటుంది.

*

మనలోపల అంతా నిశ్శబ్దమైనప్పుడుగాని, కనీసం ఉపరితలంలో ఏం జరుగుతున్నా అంతరంగంలో మాత్రం వీటికి చలించకుండా ఉన్నప్పుడే మనకీ సంగతి మొదట అనుభూతమవుతుంది. అప్పుడు ఈ (ఆత్మ) నిశ్శబ్దములోని ఒకానొక అవస్థ — అచంచలమైన అక్షర పురుషుడు — సర్వవ్యాప్తమూ, సర్వగతమూ అయిన విశ్వాత్మగా అనుభూతమౌతుంది. అది గతిశీలముగాదు. 'మాయ' యొక్క క్రియాశీల శక్తి గాదు....

మొట్టమొదటగా 'ఆత్మ' సిద్ధి కలిగినప్పుడు, అది గంభీరమైన నిశ్శబ్దము, నిష్క్రియత్వముగా అనుభూతమౌతుంది. కాని దీని పూర్ణ

సత్యము అంతటితో సరికాదు. 'శక్తి'గాను, జగద్వ్యవహారముగాను, జగజ్జీవితము (అస్థిత్వము) గానుకూడ దర్శనమౌతుంది. కాని 'ఆత్మ' బ్రహ్మయొక్క మౌలిక స్వరూపమ్ము నిర్వ్యక్తిత్వము దాని ప్రధాన లక్షణము. అందువలన ఆత్మయొక్క శక్తి ఏ విధంగా ఉంటుందంటే స్థితము, ఆధారము అయివుంటూ, క్రియలలో ఈషన్మాత్రము నిమగ్నముకాక, సమస్తమైన వ్యవహారములను సాక్షి రూపములో వీక్షిస్తూ వాటికి మూలము, ఆధారము, భోక్తగా కూడా ప్రవర్తిస్తుంది. మనకి 'ఆత్మ' యొక్క అనుభూతము కలిగినప్పుడు, అది నిత్యము, అజము, అశరీరము, క్రియలలో వికల్పితముగా విదితమౌతుంది. మరియు వ్యక్తి లోపల, వ్యక్తిని పరివేష్టించి, వ్యక్తిపైన భాసిస్తూ, తను ధరించిన రూపమును పైనుంచి అధ్యక్ష రూపములో వీక్షిస్తుంది. అది సర్వభూతముల లోను ఉన్న ఏకైక రూపము. ఏకము. అనంతము, దివ్యము, రూపరహితము. ఈ 'ఆత్మ' వైయక్తికంగాను, మేధావిగాను, కర్మిష్టిగాను, భోక్తగాను మొదలయిన విశేష రూపములలోకూడా అనుభూతమౌతుంది. దీని లక్షణము ఇంతటితో సరిగాదు. అది ఒకే క్షణములో వైయక్తికము, వైశ్వము. వైయక్తికమునుండి వైశ్వములోకి పోగలదు. ఇంకా దాటిపోతే ఇక మిగిలేది కేవల విశ్వాతీతమే. బ్రహ్మం యొక్క ఈ అంశమే గాఢమైనదిగా అనుభూతమయ్యేక విశ్వంలోని వ్యక్తిగాను, విశ్వంగాను, విశ్వాతీతంగాను ఒకేసారి గోచరం కావడమే పరబహ్మలోని ఈ ఆత్మ యొక్క అంశం. వ్యక్తియొక్క ముక్తిపదానికి సులభమైన, సూటి అయిన మార్గం ఆత్మ సాక్షాత్కారమే. అదే విశ్వవ్యాప్తిని అనుభవంలోకి తెచ్చే సహజమైన భావాతీత స్థితి. ఆ విధంగానే — అదే ఆత్మ క్రియాశీలమై అన్నింటికి ఆధారమై, అన్నిటా ఉంటూ, పరివేష్టిస్తూ ప్రకృతిలోని అన్ని సంభవాలలోనూ స్వేచ్ఛాయుతమైన తన ప్రత్యేక ఉనికిని పొంది ఉంటుంది. స్వేచ్ఛా, నిశ్శబ్దమూ, నిష్క్రియమూ ఆత్మ యొక్క స్వరూప స్వభావాలు. సృష్టిలో పురుషుడు ప్రకృతికి లొంగి వుంటాడు. కాని ఈ ఆత్మ అటులగాదు — ఏ పనులలోను అణచబడటం లేదు. పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందడమంటే ఆత్మ యొక్క అనంత స్వేచ్ఛను గుర్తించటమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

ఆత్మ యొక్క పూర్ణ స్వరూపము

సాంప్రదాయక జ్ఞాన మార్గము: నిజంగా మనది, మన స్వంతము, మనకంటె పరమాధికము, మన మూలతత్త్వము అనదగినది ఏమిటి? ఇంకేమిటి — మహనీయమైన ఆ పరమమే. మన బాహ్య ప్రకృతి అంతయు ఆయన అభివ్యక్తియే. యథార్థాత్మ కోసం మనం ఆధ్యాత్మిక జ్ఞాన మార్గ గాములయినప్పుడు సాంప్రదాయమార్గంలో తటస్థించే ఎండమావులనన్నింటినీ విసర్జించుకొంటూ పోవలసినదే.

దేహమేమన ఆత్మ కాదు: ఆత్మయనగా దేహము కాదనియు, మన అస్తిత్వానికి ప్రాతిపదిక కాదనియు, అది కేవలం భగవంతుని ఇంద్రియాత్మకమైన రూపం మాత్రమే అనియు మనం తెలుసుకోవాలి. జడ పదార్థమే జగన్నిర్మాణము యొక్క ఏకైక పునాది అనియు, ఈ భౌతిక మస్తిష్కము, నాడులు, జీవకణాలు, అణువులే మన ఏకైక సత్యమనియు అను క్షుద్రమైన భౌతిక వాదము భ్రాంతిమయమైనది.పాక్షిక దృష్టినే పూర్ణ సత్యమనియు, వస్తువుల ఛాయా ప్రతిఛాయలే సత్పదార్థములనియు, దాని అపోహ. శూన్యమునే పూర్ణాంకంగా భావిస్తుంది. భౌతికవాది అభివ్యక్త్యోపకరణములను చూసి అభివ్యక్త శక్తి అనుకుంటాడు. కాని అది నిజంకాదు. పైన ఉన్న పరమాత్మకు క్రిందఉండే ఈ చరాచర జగత్తు (జడ పదార్థము, మస్తిష్కము, నాడులు, దేహము) కు మధ్య ఒక రాయబారిపగిది, ఈ ప్రపంచాన్ని నడిపించే యంత్రము — జీవశక్తి (vital force) ఒకటున్నది. సమస్తమైన ఈ భౌతిక ప్రక్రియలు, వ్యవహారములు మూలములో ఆ అనంతములోని కొన్ని సత్యములు — లోకవ్యవహారములో ఆత్మ ప్రపంచించిన భౌతిక రూపములు మాత్రమే. అవి ఒక రకమైన భాష, లిపి, చిత్ర సంకేతము, వర్ణమాలయే గాని అంతకుమించి, తమకు తాముగా ఆ వస్తువుల నిగూఢ సత్యాలను తెలుపలేవు.

జీవము ఆత్మ కాదు: జీవము మన ఆత్మకాదు. మన మెదడును, నాడులను, దేహాన్ని నడిపించే జీవశక్తి కూడా మన ఆత్మ కాదు. అది ఒక శక్తి అన్నమాట నిజమేగాని ఆ అనంతుని పూర్ణశక్తి మాత్రం కాదు. "ప్రాణశక్తి ఈ చరాచర జగత్తునంతటిని పదార్థ ప్రాతిపదిక మీదనే

నిర్మించింది" అనే అస్పష్టమైన "ప్రాణిక వాదము" — నిజం కాదు. అది ఒట్టి భ్రమ. పాక్షిక దృష్టినే పూర్ణంగా గ్రహించడం, దగ్గర తీరం లోని కెరటాన్నే మహా సముద్రంగాను, జలముగాను అపోహపడడము వంటిది. ప్రాణికవాది (vitalist) ఏమంటాడు? బాహ్యమైన ఏదో ఒక గొప్ప వస్తువును పట్టుకొని ఇదిగో యిదే జగత్తుకు, జగన్నిర్మాణము నకు కారణము అంటాడు. కాని 'జీవశక్తి' తనకుమించిన చేతన యొక్క క్రియారూపము. ఆచేతన మనకు ద్యోతకమవుతుంది. మనలో పని చేస్తుంది. కాని ప్రస్తుతం మనకు మకుటమైన యీ మనస్సుకంటె ఉన్నతమైన మరో "మనస్సు" ను అందుకుండేంతవరకు మనకు దాని అభిజ్ఞతి కలగదు. మనస్సు జీవము యొక్క సృష్టియేయని మనకు తోస్తుంది కాని అది నిజం కాదు. అది జీవమునకు, దాని వెనుకనున్న శక్తికి చరమేంద్రియమేగాని, చరమదశ మాత్రంకాదు. మనస్సు జీవము యొక్క అభివ్యక్తి కాదు — జీవము ఏ భానుని యొక్క వెలుగో ఆ భానుని యొక్క అభివ్యక్తి.

బుద్ధి మన ఆత్మకాదు: కాని ఆ బుద్ధి కూడా — మన ఆలోచనా సరళి, మనం ఆలోచించి అర్థం చేసుకొనే విభాగము — మన ఆత్మ కాదు, పరమతత్వం కాదు. దానికి ఆది గాని అంతము గాని కాదు. ఇది పరమాత్మ విక్షేపించిన ఒక మసగ వెలుగు మాత్రమే. "మూర్తరూపా లను, వస్తువులను, మనస్సే సృష్టిస్తుంది" అనే భావన కేవలం భౌద్ధిక మైనది మాత్రమే. ఈ భావనయే ఆదర్శవాదికి ఆధారము. కాని అది కూడా ఒక భ్రమ మాత్రమే. ఒక పార్శ్యమును మాత్రమే చూసి పూర్ణ రూపం అని భ్రమ పడటం వంటిది. బుద్ధిచే వికార రూపమును పొందిన అజ్ఞాన రూపమును చూసి ప్రచండ భానునిగా పరిగణించడం వంటిది. ఆదర్శవాది కూడ అసలైన మూలతత్వమును స్పృశించలేడు. ప్రకృతి యొక్క సాధారణ రూపమే అతని దిగంతము. భౌద్ధిక జ్ఞానము వలన సీమితము కానిది, దాని అవధులకు అతీతమైనది అయిన "ప్రజ్ఞ" మరియొకటి కలదు. ఆ "ప్రజ్ఞ" యొక్క బహిః పరిచ్ఛాయయే మన మనస్సు.

సమాధియే పరమావధి కాదు: సాంప్రదాయ మార్గానుసారం పైన చెప్పిన వాటినన్నిటిని 'నేతి నేతి' అని నిషేదించుకొంటూ పోతే మనం

శుద్ధ చైతన్యాన్ని (అస్థిత్వాన్ని) అందుకోగలము. అది మనోజీవిత దైహికముల వలన వికృతము చెందని ఆత్మ జ్ఞానము. ఆత్మానందము. మన మూల స్వరూపము (అస్థిత్వము). అసలు ప్రకృతి. ఆ ఆత్మ దర్శ నమును పొందగానే "అమ్మయ్య", అసలు సత్యము తెలిసి పోయిందిలే అని పరుగులు పెట్టినట్లైతే ఒక విషయాన్ని మర్చిపోయినట్లే. మన ఆలోచనాగతమైన బుద్ధికి ఆ పరమాధికమైన ఆత్మకు, "బుద్ధేః పరత స్తుసః" మధ్యన "ఇంకేముందిలే" అని సమాధిలో కళ్ళుమూసుకొని కూర్చునట్లయితే మనం చాలా miss అయిపోతాము. ఈ రెండింటికి మధ్య ఏమేమి లోకాలున్నాయో చూసేందుకు ప్రయత్నించకుండా, మిరుమిట్లుగొలిపే ఆత్మ సామ్రాజ్యాలను ఏమాత్రం లెక్క చేయకుండా, దాటిపోతాము. గమ్యాన్ని చేరుకొంటాము. అనంత తత్వంలో సుమ ప్తిని పొందుతాము. అంతే. ఒకవేళ మెలకువగా ఉన్నప్పటికీ మన స్సును విలీనము చేసుకోని పురుషోత్తముని పరమోన్నత స్థాయిని పొందుతామేమోగాని పరమ పురుషోత్తముడైన పరాత్పరుని మట్టుకు దర్శింశలేము. మనస్సు అంత దూరము పోలేదు. దాని సమగ్ర ఆత్మ స్వరూపమును "మానసీకరణము", అనగా మనస్సుచే dilute, పలచ చేయబడిన స్థాయిలో మాత్రమే, సచ్చితానందము యొక్క మానసిక ప్రతిబింబమును మాత్రమే తెలుసుకొనగలము.

పూర్ణ జ్ఞానము: పరమ సత్యము, సమగ్ర ఆత్మ జ్ఞానము కళ్ళు మూసు కొని కేవల తత్వము (absolute) లోకి గంతువేయడం వలన దొర కదు. అది అంత తేలికగా పట్టుపడదు. అత్యంత సహనముతో మనస్సు యొక్క పరిధిని దాటి సత్య చైతన్యములోకి ప్రవేశించినపుడే అనంత త్వము జ్ఞాతమవుతుంది. తదనుభూతులను, సంపదలను పొందగలుగు తాము. మన అన్వేషనకు గమ్యమైన ఆత్మను కనుగొనగలుగుతాము. మరియు స్తబ్ధము, శూన్యము, సూక్ష్మము అయిన ఆత్మను మాత్రమేగాక, వైయక్తికము, విశ్వాతీతతము అయిన క్రియాశీలమైన మహత్తరమైన ఆత్మను దర్శించగలుగుతాము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: S.Y సోమయాజులు, Y.S.V.S మూర్తి

ఏకము — అనేకము
(ఆత్మ — సృష్టి)

నిర్వ్యక్తిక బ్రహ్మ, ఏకత్వ బహూత్వాలకు అతీతమైంది. అయినప్పటికి, అది 'ఏకం', సమస్త జగత్తులలోని 'అనేకం' గూడా అయిఉంది. సమస్త గుణకృత సీమలకు అతీతం. నిర్గుణ శూన్యం చేత సీమితం కాదు. విశేషించి, అనంత గుణగణసంపన్నం కూడ. అది వ్యక్తిగత జీవుడు, సర్వజీవులు, వారికంటె అధికుడు గూడ. అది నిరాకార బ్రహ్మమే కాక, విశ్వం గూడ.

*

బ్రహ్మ యొక్క ఉన్నత సోపానము పరాప్రకృతి — వ్యస్త సమస్తములను ఏక కాలమున వహిస్తుంది. కాని సృష్టి గతమైన భగవంతుని నిత్య బహుళత్వము చరాచర జగత్తు వెనుకకు వచ్చినప్పుడు అది జీవముగా — 'పరాప్రకృర్జీవభూతా' — భాసిస్తుంది. సంభూతమౌతుంది.

*

బ్రహ్మమెట్లు తన నిష్క్రియతను, సక్రియతను అతిశయించునో, అటులే ఏకతను, బహుతను సైతము అతిశయించును. అతడు తన స్వరూపమునందు ఏకము. కాని ఆ ఏకత తన బహుత్వశక్తిని వర్జించి, తన నట్లు పరిమితము గావించు ఏకత గాదు. అది శరీర, మనస్సుల వియుక్త ఏకతవంటిది గాదు. అతడు గణితశాస్త్రము నందలి పూర్ణాంక మగు ఏకము గాదు. ఏలన ఆ ఏకము శతమును తనలోపల ధరించ నసమర్థము, అందుచేత శతము కంటె తక్కువ. కాని అతడు శతమును తనలోపల ధరించును. ఆ శత వస్తువులందును ఏకము. స్వతః ఏకమగు నతడు అనేకమునందును ఏకము. అటులే అనేకము అతనియందు ఏకము. వేఱు మాటలలో బ్రహ్మము తన స్వరూపముయొక్క ఏకత యందు అంతరాత్మల రూపమున తన బహుత నెఱింగియుండును. మఱియు తన బహురూప అంతరాత్మలయొక్క చేతనయందు సర్వ అంతరాత్మల ఏకత నెఱింగియుండును. ప్రతి అంతరాత్మలోపలను అతడు, అనగా అంతఃస్థ బ్రహ్మము, హృదయస్థిత ఈశ్వరుడు తన

ఏకత నెఱింగియుండును. ఇక అతనిచేత ప్రదీపితమైన జీవాత్మ ఏకముతో (బ్రహ్మముతో) తన ఏకత నెఱింగియుండి, అనేకముతో గూడ తన ఏకత నెఱింగియుండును. పోతే మన ఉత్తలీయ చేతన శరీరముతోను, విభక్త ప్రాణముతోను, విభాజక మనస్సుతోను, తాదాత్మ్యము చెంది, అజ్ఞముగా నుండును. అదికూడ ప్రదీపితముకాగలదు. మఱియు జ్ఞానవంతము చేయబడగలదు. కనుక బహుత్వము అజ్ఞానముయొక్క ఆవశ్యక కారణము కాదు.

*

పరమ సత్తు ఏకము, కాని ఈ ఏకత అనంతము, అనగా తన లోపల ఒక అనంత బహుతను లేక బహువిధతను ధరించి యుండును. ఏకమే సర్వము గూడ. అది (ఏక సత్తు) సారాత్మక సత్త మాత్రమే కాదు. సర్వసత్త గూడ. ఏకము యొక్క అనంత బహుతయు, అనేకము యొక్క సనాతన ఏకతయు రెండు సత్యములు. లేక ఒకే సత్యము యొక్క రెండు పార్శ్వములు. మఱియు ఈ పార్శ్వముల పైననే అభివ్యక్తి ఆధారపడియున్నది. అభివ్యక్తియొక్క ఈ ఆధారభూత సత్యము కారణముగా మూలసత్తు మన దృష్టికి మూడు స్థితులలో గన్పించును. 1. విశ్వాతీత సత్త, 2. వైశ్వ పురుషుడు, 3. అనేకము నందలి వైయక్తిక ఆత్మ. కాని బహుత చేతనయొక్క ఒక వ్యావహారిక విభజనకు, ఒక కార్యసాధక అజ్ఞానమునకు అవకాశ మిచ్చును. కాగా ఈ అజ్ఞానము నందు అనేకము, అనగా వ్యక్తులు, సనాతన స్వయంభూ ఏకతయొక్క సంవిత్తుని కల్గియుండరు. మఱియు దేనినందును, దేనిచేత తాము జీవింతురో చరింతురో, తమ సత్తుల కల్గియుందురో, ఆ వైశ్వ ఆత్మయొక్క ఏకతను విస్మరించి యుందురు. కాని, రహస్య ఏకతయొక్క ప్రభావము చేత సంభూతియందలి అంతరాత్మ తనస్వీయ అదృష్ట ఏకతచేతను, పరిణామాత్మక ప్రకృతియొక్క రహస్య పీడనచేతను ప్రేరితమై, ఈ అజ్ఞానావస్థనుండి బయటబడును. మఱియు చివరకు ఏకమాత్ర దివ్య సత్తుయొక్క జ్ఞానమును తిరిగి బొందును, అటులే ఆ సత్తులో తన ఏకతాజ్ఞానమును తిరిగి బొందును. ఇంకను అదే సమయమున సర్వ వైయక్తిక సత్తులతోను, సమస్త విశ్వముతోను తన ఆధ్యాత్మిక ఏకతను తిరిగి ప్రాపించును. విశ్వములో నేను ఉన్నాను — అని మాత్రమే

కాక, నాలో విశ్వమున్నది. మఱియు వైశ్వ పురుషుడు నా అధికతర ఆత్మయే — యని గూడ అది ఎఱుంగవలెను. వ్యక్తి తనను విశ్వ మయము గావించుకొనవలెను. మఱియు నదే గతియందు తన విశ్వా తీత బ్రహ్మభావమును గూడ తెలియవలెను.

*

ప్రతిది మన చూపుపై నాధారపడియుండును. ప్రతివ్యక్తియు తన సంస్కార దృష్ట్యా చూచుచున్నాడు. ఆత్మ, సృష్టి; ఏకము — అనే కము, రెండును సత్యమే — రెండునొకటే. ఆత్మ ఏకము. సృష్టి అనే కము. అనగా నీ అనేకము ఏకైకాత్మయే. అతడు గతి ప్రవాహమున — తనను తాను భిన్నునిగా స్థాపించుకొనుచున్నాడు. ఆ 'గతి' అతని చేతనకు సంబంధించినది. మనమాఏకైక తత్త్వమును చూడవలెను. ఇంత మాత్రమున అనేకత్వమును చూచుట విసర్జించనక్కరలేదు. ఎందుకని? వానికిని స్థితి యున్నది కాబట్టి. మరియు తనను తాను చూచుకొనునట్టి బ్రహ్మదృష్టిలోన నిమిడియున్నది. ఇది జ్ఞాన దృష్టికే అందును. అజ్ఞాన దృష్టికి కాదు. మన యథార్థ సత్త — అపరిచ్ఛిన్న, అవిభక్త పరిణామ రహితాత్మతత్త్వముగా గుర్తించవలెను. ఈ సర్వ సృష్టియు స్వాత్మాంతర్గతమైనట్టి గతి పరిణామమే. ఈ ఆత్మ సర్వ దేహాంతరము తప్ప ఏకశరీర గతమాత్రము కాదు.

ప్రపంచములో మనకున్న సంబంధ విషయమున మన స్వరూపమేమో జాగ్రత్తగా చూచుకో దగినది. అది — మనము చూచునదెల్ల ఆత్మ వికారమే. ఇదే జాగ్రదృష్టి. సర్వగతియు, సర్వశక్తులు, రూపములు, ఫలాఫలములు — ఒకటేమిటి సర్వము మన ఏకైక సత్య మైన ఆత్మయొక్క నానాత్వ స్థితియేయని దర్శించవలెను. ఈ నానాత్వ మొక క్రీడా విశేషము. అది విశ్వస్థితి గతుడైన ఈశ్వరుని క్రీడ. అది విశ్వాంతర్గతుడైన సచ్చిదానందము.

కాబట్టి మనము అహంభావ పరిధినుండి రక్తి, ప్రత్యేక వ్యక్తిత్వ భావననుండి విముక్తముగావలెను.

*

ఏకానేక సమన్వయము: నిరపేక్షము, ఆత్మ, భగవంతుడు, పురుషుడు, సత్తు: ఇందు ప్రతిదియు ఏకమని మనము చూతుము; అతీత మేకము,

వైశ్వ మేకము; కాని భూతములనేక మనియు, ప్రతి భూతానికి ఒక ఆత్మ, ఒక సదృశ, అయినను భిన్న ప్రకృతిగల దనియు మనము చూతుము. మఱియు వస్తువుల ఆత్మతత్త్వము, సారతత్త్వము ఏకము గాన, ఈ కన్పించు అనేకము లన్నియు ఆ పరమ ఏకమే గావలెను — అని మన మంగీకరించక తప్పదు, ఇక నట్లంగీకరించి నపుడు, ఆ ఏకము అనేకముగానున్నది, లేక అనేకమైనది — అని తేలును. కాని పరిమితము లేక సాపేక్షము నిరపేక్షమే అనియు, మానవుడు, పశువు, లేక పక్షి భగవంతుడే అనుట ఎట్లు పొసగును? ఈ విరోధమును లేవ దీయుటలో మనస్సు రెండు తప్పులను చేయుచున్నది. అది, గణితశాస్త్ర వ్యవహారమున ఏ సొంత ఏకకము (unit) గలదో, దాని పరిభాషలో ఆలోచించుచున్నది ఈ ఏకకము తన పరిమితత్వమున కేవలము (sole). ఈ ఏకకము రెంటి కంటెను తక్కువగు ఏకము. విభజనము మఱియు ఖండనముచేతగాని, సంకలనము మఱియు గుణకారముచేత గాని మాత్రమే రెండు కాగలదు. కాని మన ప్రస్తుత విషయము (బ్రహ్మము) ఒక అనంత ఏకత్వము. ఇది సార విషయక అనంత ఏకత్వము కాగా ఈ ఏకత్వము వందను, వేయిని, లక్షను, కోటిని తన యందు ధరించగలదు. నక్షత్రములకు సంబంధించిన, లేక అంతకు సైతము మించిన ఎంత పెద్ద సంఖ్యలను ఒకచో జేర్చి, గుణించి నప్పటికి, అవి ఆ ఏకతను అతిశయించజాలవు. ఏలన ఉపనిషత్తుల భాషలో, అది కదలదు. అయినను దానిని నీవు వెంటాడి పట్టుకొౌన దలంతు వేని, అది సదా నీకు ముందు ఎంతో దూరములోనుండును. అది అనంత బహుత్వమును తననుంచి వెలువరించజాలనిచో, తాను అనంత ఏకత్వమే కాగూడదనియు మనము చెప్పవచ్చును. కాని అట్లు చెప్పి నపుడు ఆ ఏకము బహువు అని గాని, అనేకముయొక్క ఒక మొత్తముగా దానిని పరిమితము చేయవచ్చును, లేక వర్ణించవచ్చును అని గాని దాని అర్థము గాదు. పైపెచ్చు, బహుత్వముచేత గలుగు సర్వ పరిమితత్త్వము లేక అభివర్ణనమును అది అతిక్రమించును. మఱియు నదే సమయమున సొంత భావనాత్మక ఏకత్వముచేత గలుగు సర్వ పరిమితత్వమును సైతము అతిక్రమించును గావుననే, సరిగా నందు చేతనే అది అనంత అనేకముగా నుండగలదు.

మూలం: శ్రీఅరవిందులు

తెలుగు మూలం: చెలసాని నాగేశ్వరరావు, జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రి, తుమ్మపూడి కోటేశ్వరరావుగార్ల రచనలు.

జీవాత్మ — వైయక్తికాత్మ, కేంద్రసత్త్వము

జీవ అనే పదమును సంస్కృత మూలమైన భాషలలో రెండర్థములలో వాడుతారు. ఒకటి 'ప్రాణముగల జీవులు'*. ఒక జన్మనుండి మరొక జన్మకు, ప్రాణికి ఆధారమైనిలిచి ఉండే వ్యక్త్యాత్మ రెండవ అర్థము. 'జీవాత్మ' అనగా ఈ రెండవ అర్థమే — ప్రాణమున్న జీవి యొక్క ఆత్మ, పరమాత్మ లేక సనాతనాత్మ. భగవద్గీతలో కూడా దీనినే భగవంతుని సనాతనాంశము అని వ్యవహరించిరి. ఈ జీవాత్మను ఇంకా విస్తృతంగా చెప్పాలంటే — వైయక్తికాత్మగా లేక సృజన జీవుని దైవాంశంగా ఆవిర్భవించిన అనేకాత్మకమైన దైవము.

*

'జీవాత్మ' మనగా 'వైయక్తికాత్మ' అన మాట. మూలములో ఇది మిగతా అందరి ఆత్మలతో ఏకమే. అయితే భగవంతుని అనేకత్వములో ఇది వ్యక్తీకరింపబడిన ఆత్మ. విశ్వ సృష్టిలో ఒకానొక కేంద్రము. సర్వమును తనలోను, తనను సర్వములోను లేక ఉభయానుభూతులను ఒకేసారి తన చైతన్య స్థాయినిబట్టి, దృష్టి కోణమును బట్టి పొందుతుంది.

*

జీవుడు, జీవాత్మ అనే పదములను ఈ రచనలలో నేను ఒకే అర్థములో వాడాను.

*

అనేకమనగా సాక్షాత్తు పరాప్రకృతియందు పరమ పురుషుని యొక్క నిత్య ఆత్మలు. కాని ఇక్కడ ఈ ప్రపంచానికి సంబంధించినంతవరకు ఈ నిత్య ఆత్మలకు జీవాత్మలని పేరు — ఈ జీవాత్మలు క్షర పురుషుని జీవనమైన వికారశీల సంభూతి (becoming) యందు సర్వభూతాల (natural existences) పరిణామానికి ఆధారం. ఈ విధంగా జీవుడు 'లేక జీవాత్మ' మరియు సర్వ ప్రాణులు (సర్వభూతాలు) ఒకటే కాదు. జీవాత్మలు సృష్టితో సంబంధం కలిగి ఉన్నప్పటికి, నిజానికి

---

*బెంగాలులో ఒక చిన్న జంతువును ఎవ్వరైనా చంపుతుంటే "దానిని చంపకూడదు అది కృష్ణుని జీవము" అని అంటారు.

దానికి పైన ఉంటాయి. కాగా సర్వభూతాలు ప్రకృతినుండి ఏర్పడిన ప్రాణులు, వస్తువులు. మానవుడు, పక్షి, పశువు, సరీసృపం (పాకే ప్రాణి) ప్రాకృతిక ప్రాణులు. కాని వాటిలోని వైయక్తిక ఆత్మ ఒక్క క్షణం సైతం, లక్షణాలను బట్టి, మానవుడు, పక్షి, పశువు లేక సరీసృపం కాదు. (తన చైత్య పురుష రూపాన) ఈ జీవాత్మ తన పరిణామమందు ఈ సరీసృపాది రూపాలు ధరిస్తూ పైకివెళ్ళినా, ప్రకృతి క్రీడకు సమ్మతించిన ఆధ్యాత్మిక చైత్యపురుమడుగానే ఉండిపోతుంది.

*

ఆత్మయొక్క ఉనికి వైశ్వానముగా గాని లేక విశ్వాతీతముగా గాని (ఆత్మ పరమాత్మలు) ఉంటుంది. వ్యక్తీకరణమై కేంద్ర సత్త్వముగా రూపొందినపుడు అది జీవాత్ముడు. ఈ జీవాత్ముడు సమస్త విశ్వముతోను తన ఏకత్వమును పొందుతూ దైవాంశము యొక్క ఒక కేంద్రముగా కూడా భావించుకుంటాడు.

*

దీనికి ప్రతిగా సారతత్త్వమందే నివసించే జీవాత్మ భగవంతునితో తాదాత్మ్యమందు తనను దాను విలీనం చేసుకోగలదు. కాని జీవాత్మ సైతం అభివ్యక్తి క్రియపై అధ్యక్షత వహించిన క్షణమే తనను బహువిధ భగవంతుని యొక్క ఒక కేంద్రంగా తెలుసుకుంటుంది. పరమేశ్వరునిగా కాదు. భగవంతునికి, జీవునికి ఉన్న ఈ విభేదాన్ని గుర్తించడం ముఖ్యం. ఏలన, అలా గుర్తించకపోతే, అత్యల్ప ప్రాణిక అహంకారం మిగిలి ఉన్నప్పటికి, ఎవ్వరైనా తనను భగవదవతారంగా భావించ నారంభించవచ్చు. లేక రామకృష్ణుని పట్ల హృదయుని వలె వివేచనము కోల్పోవచ్చు.

*

మానవ జీవితానికి అధ్యక్షత వహిస్తూ మనస్సుకు తెలియని కేంద్ర సత్త్వమొకటి ఊర్ధ్వములో ఉంటుంది. చైత్యసత్త్వము (psychic being) ప్రకృతిలో దాని ప్రతిబింబము. దానినే జీవాత్మ అని కూడా అంటారు.

*

ఒకదాని తర్వాత ఒకటిగా ఏ జన్మలు కలుగుతాయో, ఆ భిన్న భిన్న జన్మలపై అధ్యక్షత వహించేవాడే (సత్తుయే) కేంద్రీయ పురుషుడు. కాని ఇతడు స్వయంగా అజుడు. ఏలన ఇతడు కాలగత సత్త్వములోనికి దిగడు. దానికి పైన ఉంటాడు. ఇతడు అధ్యక్షత వహిస్తూ, మానసిక, ప్రాణిక, దైహిక సత్త్వములను కలిపి ఉంచు తాడు. అలాగే వ్యక్తిత్వం యొక్క భాగాలన్నింటిని గూడా. అంతేకాక, ఇతడు మానసిక పురుషుడు మరియు మానసిక చింతన, సంకల్పము ద్వారాకాని, ఆంతరాత్మిక పురుషుని ద్వారాకాని — ఎవరు ఎక్కువ అగ్రభాగాన ఉంటాడో, లేక ప్రకృతియందు ఎవరు ఎక్కువ బల శాలియో, అతని ద్వారా — జీవనాన్ని నియమించుతాడు. ఇతడు తన నియంత్రణను ప్రయోగించకపోతే చేతన తీవ్ర అవ్యవస్థలో ఉండి పోతుంది, వ్యక్తిత్వం యొక్క ప్రతిభాగం తనకోసమే పనిచేసుకుం టుంది. అపుడిక చింతన, భావన లేక క్రియయందు ఎట్టి అన్వయం ఉండదు.

*

కేంద్రీయ పురుషుడు

మనలోపల ఉన్న ఏ భగవదంశం మన తక్కిన సత్త్వము కంతటికి ఆధారంగా ఉంటుందో, ఏది జనన మరణాలను అతి జీవిం చుతుందో, మన యోగమందు సామాన్యంగా "కేంద్రీయ పురుషుడు" అనే పదం దానికి వర్తిస్తుంది. ఇక ఈ కేంద్రీయ పురుషునికి రెండు రూపాలు — విశ్వానికి పైన అది మన యథార్థ సత్తు అయిన జీవాత్మ. ఉచ్ఛతర జ్ఞానం ప్రాప్తించినపుడు, దీని ఎరుక మనకు కలుగుతుంది. ఇక క్రింద, మనలో అది మనఃప్రాణ శరీరాలకు వెనుక ఉండే అంత రాత్మ. జీవాత్మ జీవనమందు తన అభివ్యక్తికి పైన ఉండి, దానికి అధ్యక్షత వహిస్తుంది. కాని అంతరాత్మ జీవనమందు తన అభివ్యక్తికి వెనుక, దానికి ఆధారంగా ఉంటుంది.

*

ఆ తత్త్వం మానవుని ఆత్మ. దీన్ని పాశ్చాత్య ఆలోచనా ధోరణిలో శక్త్యణువు (monad) అనీ, భారతీయ దర్శన శాస్త్రంలో జీవుడు, లేక జీవాత్మ అనీ అంటారు. అనగా, జీవాత్మక సత్త్వమును,

లేక ప్రాణిని 'ఆత్మ' అంటారు. ఈ జీవుడు, ప్రకృతి తన క్రియల ద్వారా తన తాత్కాలిక ప్రయోజనాలకోసం నిర్మించిన మానసిక అహంభావం కాదు. ఇతడు మానసిక, ప్రాణిక, శారీరక సత్త్వమువలె, దాని అలవాట్లతో, నియమాలతో, దాని ప్రక్రియలతో బద్ధమై ఉన్న సత్త్వము కాదు. జీవుడనేవాడు ఆధ్యాత్మసత్త్వము, లేక ఆత్మ. అతడు ప్రకృతికంటె మిన్న. ఇతడు ప్రకృతికార్యాల్ని అనుమతిస్తాడు. ఆమె (ప్రకృతి) స్థితుల్ని తనలో ప్రతిఫలింపజేస్తాడు. మనః, ప్రాణ, శరీర రూపమైన త్రివిధ మాధ్యమాన్ని ధరిస్తాడు. ఈ త్రివిధ మాధ్యమం ద్వారా ఆ ప్రకృతి, ఆ స్థితుల్ని ఆంతరాత్మిక చేతన మీద ప్రక్షేపణం చేస్తుంది. కానీ జీవుడు స్వయం, వైశ్వ (విరాట్), పరాత్పర ఆత్మ యొక్క సజీవ ప్రతిబింబం, లేక ఆంతరాత్మిక రూపం, లేక ఆత్మ సృష్టి. తన సత్త్వములోని కొన్ని గుణాల్ని విశ్వంలో, ఆత్మలో ప్రతిబింబింపజేసిన 'ఏకమేవ' ఆత్మ జీవునిలో బహు రూపాల్ని ధరించి ఉంది.

*

ఈ మహత్తర సత్యముతో వస్తుతః ఏకమై విలసిల్లునట్టియు, మానసికాహంకారము కంటె వేరైనదియునగు నొక విశేషము వ్యక్తి యందు సైతము కలదు. అయ్యది ఆ ద్వయుడగు పరమపురుషుని స్వచ్ఛప్రతిబింబము లేక అంశము నై విరాజిల్లు జీవాత్మ. విశ్వాతీత విశ్వగత ప్రకృతి యొక్క వ్యష్టిక్రీడ నొకదానిని బలపరచు నిమిత్తమై తన శక్తిని, జ్ఞానమును సంకోచింప జేసికొనినట్లుగా గానుపించు పర మాత్మయే ఈ జీవాత్మ. అనంతమైన ఏక వస్తువుగా వర్ణింపబడుదాని నిగూఢతను, సత్యస్వరూపమును పరిశీలించి చూతుమేని, అయ్యది అనంతమైన అనేక వస్తువుకూడా. మనమా వస్తువుయొక్క ప్రతిబింబ స్వరూపులము మాత్రమే కాదు. అదియు మనము ఒక్కటే!

మన అహంకారమువలెగాక, మన ఆధ్యాత్మిక వ్యక్తిత్వము సర్వగత, సర్వాతీత లక్షణోపేతముగూడ నై యున్నది. కాని, ప్రకృత మున మనలోనున్న ఆత్మ ప్రకృతియందు వ్యష్టికల్పనము సందర్భ మున అహంభావనయే తానుగా భ్రమనుపొందుట కవకాశ మిచ్చుచు న్నది. ఈ యజ్ఞానము నది వదలించుకొని, తాను సర్వగతము, సర్వాతీతము నైన పరమాత్మ యొక్క ప్రతిబింబము, అంశము, లేక

సత్త్వము యొక్క విశేషమనియు, జగద్వ్యాపారములో తాను కేవలము ఆపరాచైతన్యమునకు చెందిన ఒకానొక కేంద్రమనియు అయ్యాది తనను తాను గుర్తించుకోవలసి యున్నది.

*

జీవాత్ముని కర్తవ్యము: మానవుని మహోన్నత గమ్యము వైయక్తిక జీవితము యొక్క ఉపలబ్ధి మాత్రమేకాదు. తన జీవిత కార్య కలాపములనుండి వేరుపడిన నిశ్చలతయు గాదు. తన మూలస్వరూప మునుండి బయలుదేరి క్షరాక్షర ప్రకారములను తనలో ధరించిన ఉత్తమ పురుషుని, ఆ పరమాత్ముని ఉపలబ్ధి. మానవాత్మ (జీవాత్మ) అసలు కర్తవ్యము వేరు. సృష్టిలో వైయక్తిక, వైశ్వాన్విక రెండు స్థాయిలలోను ధారణమైన ఆత్మను తను దర్శించుకోవాలి. విశ్వములో ఈ పరమ లక్ష్యమును సాధించు ప్రక్రియకై అవిద్య సృష్టించిన అహము ఒక అవసరమైన యంత్రాంగము.

*

పరమాత్మ పురుషునిగాను లేక ప్రకృతిగాను, చైతన్యజీవి గాను, లేక ఆతని శక్తిగాను, ఆత్మలోను పరమాత్మలోను ఉన్న జీవము గాను, పరమ పురుషునితోను ఏకము. అదే విధముగా ప్రకృతిలో ఆత్మ పరమాత్మల స్థాయిలో దివ్యశక్తియొక్క రూపము "పరాప్రకృతిర్జీవ భూతా". ఈ ద్వంద్వత్వమును సాక్షాత్కరించుకొనుటనే మనము integral self-perfection అంటాము. అప్పుడే పరమాత్మా ప్రకృతుల ఖేలకు జీవుడు క్షేత్రమవుతాడు.

*

జీవుడనగా పురుషోత్తమునిలోని ఒక అంశము యొక్క ఆత్మా భివ్యక్తి. ప్రకృతిలో అతను పరమాత్మగాను, దాని శక్తి యొక్క కేంద్ర మూర్తిగాను భాసిస్తాడు. మరియు విశ్వములో ఆత్మయొక్క సమర్థతను వైయక్తిక జీవితములోనికి తీసుకొని వస్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

తెలుగు మూలం: చెలసాని నాగేశ్వరరావు, కమలాకర వేంకటరావు, జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రి గార్ల రచనలు.

చైత్యము అనగా ఏమి?

ఆంగ్ల భాషలో soul = ఆత్మ అనే పదాన్ని చాలా భిన్నార్థాల్లలో వాడుతారు. భౌతిక జ్ఞానానికి అతీతమైన చేతనా విశేషములన్నింటికీ — ప్రాణికమునకు దాని కోరికలకు ప్రేరణలకు సహితము — ఉపయోగిస్తారు. స్థూల శరీర వ్యవహారములను గాక ప్రత్యేకమైన ఆధ్యాత్మికార్థమును సూచించుటకై చైత్యము* (psychic) అనే పదమును వాడవలసి వచ్చింది.

*

'చైత్యము' అనే పదము మానసము, ప్రాణికములనుండి భిన్నమైన 'ఆత్మ' కే వర్తిస్తుంది. ఆ అర్థములో 'ఆత్మికమైన' — అనగా సూటిగా చైత్యాత్మనుండి ప్రభవించే చేష్టలు, అనుభూతులు — వీటినన్నిటిని "చైత్యాత్మికములు" అనవచ్చు. అప్పుడు మానసిక, ప్రాణిక ప్రధానమైన అనుభూతులను మానసిక (బాహిరముగాగాని లేక రహస్యముగా గాని) వ్యవహారములనవలసి వస్తుంది.

*

Psychic అంటే సాధారణంగా చేతనానంతర్గత వర్తనములు. మానసిక రంగమునకు చెందిన ఐంద్రిక విషయములు. కాని నేనీ పదాన్ని గ్రీకుభాషలోని psyche — ఆత్మ సంబంధితమైనది అనే ప్రత్యేకార్థంలో ఉపయోగించాను. కాని మామూలుగా జనసామాన్యము "ఆత్మ" కు "మానసిక ప్రాణిక చేతన" కు గల భేదాన్ని గుర్తించరు. వాళ్ళకు రెండూ ఒకటే.

*

సాధారణంగా మనస్సుకు ఆత్మకుగల భేదాన్ని గుర్తించక, వ్యవహారంలో వాటిని కలగాపులగం చేస్తారు. "ఆత్మ" "చైత్యము" అనే పదాలతో యథార్థాత్మను కాని "చైత్య సత్త్వమును" (చైత్య పురుషుడు) గాని కాక, కోరికలుకోరే ప్రాణమయ జీవిని — అనృతాత్మ లేక కామాత్మను — సూచిస్తారు. చైత్య సత్త్వము (psychic being) మనస్సు, ప్రాణికములకంటే వేరైనది. అది వాటి వెనకాల, అవి కలుసుకుండే హృదయసీమలో ఉంటుంది. దాని కేంద్ర స్థానమది. హృద

యంలో కాకుండా దాని వెనకాల ఉంటుంది. ఎందుకంటే మనుషులు "హృదయము" అనే పదాన్ని "ఆవేశానికి స్థానము" అనే అర్థంలో వాడతారు. కాని మానవావేశములు మానసిక, ప్రాణికాలకు మాత్రమే సంబంధించినవి. సాధారణంగా చైత్య సంబంధితములు కావు. మనస్సు, ప్రాణశక్తుల కంటె భిన్నమైనది, వెనక దాగిఉండే ఈ నిగూఢ శక్తియే మన యథార్థాత్మ — మనలోని చైత్య సత్యము.

అయితే చైత్య స్పర్శ మనస్సు, ప్రాణికము, శరీరములను సంస్కరించి, ఆలోచనలను దృష్టిని, ఆవేశములను పునీతము చేయ గలదు. అప్పుడు ఇంద్రియగతావేశము పరిణమించి చైత్య భావమగును. ఇక మన ఇంద్రియ జ్ఞానమును, చేష్టలను సర్వ వ్యవహారములను పరి శుద్ధము గావించి దివ్య చర్యలుగా రూపొందించుటకు సన్నద్ధము చేయును.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

---

* "చైత్య" అనే పదమును మామూలుగా అసలు "చైత్యము" నకుగాక కామాత్మకు వాడుట పరిపాటి. మరియు సాధారణ మానసిక క్షేత్రానికి (psychological) చెందిన అసాధారణ విపరీత సంఘటనలకు సహి తము యీ మాటనే వాడుతారు. అయితే ఈ చివర పేర్కొనిన (అసాధా రణ, విపరీతములు) విషయములు మనకు అంతర్లీనమైన అంతర్మ నస్సు, అంతఃప్రాణికము సూక్ష్మ శరీరములకు సంబంధించినవి. ఆత్మతో సూటిగా సంబంధమున్నవి కావు. గాలిలో నుంచి వస్తువులను సృష్టిం చుట, వస్తువులను "హుష్ కాకి" అని మాయం చేయటం వంటి సంఘ టనలు (నిజంగా జరిగాయనుకోండి) కూడా ఏ మాత్రం ఆత్మ సంబం ధితములు కావు. అవి నిజంగా జరిగినయి కదా అని చైత్య పదార్థము ఒకటున్నదని చెప్పేందుకు వీల్లేదు. ఇవన్నీ స్థూల ప్రకృతిపై నిగూఢ మైన సూక్ష్మ భౌతిక శక్తులు పనిచేయుట వలన జరిగిన గమ్మత్తులు, స్థూల వస్తువులను మొదట సూక్ష్మముగా మార్చి తిరిగి స్థూలవస్తువు లుగా మార్చడం వలన జరిగిన గారడీలు.

చైత్యము యొక్క రెండు భూమికలు

చైత్యానికి రెండు ముఖములున్నాయి*. వెనకాలనుంచి ఉండే చైత్య అస్థిత్వము లేక ఆత్మ ఒకటి. పరిణామ క్రమంలో అది తాల్చిన వైయక్తిక స్వరూపము రెండవది.

*

చైత్యాత్మ (చైత్యము) కు రెండు ముఖములు గలవు. ఆత్మ యొక్క సమస్తమైన ప్రజ్ఞా సామర్థ్యములుగల ఆత్మతత్వము ఒకటి. జన్మ పరంపరలో ఒక జన్మ నుండి మరొక జన్మకు పురోగమిస్తూ బలమును పుంజుకుంటున్న (వైయక్తిక) చైత్య వ్యక్తిత్వము రెండవది — ప్రకృత జన్మను నిర్వహించుటకై ముందుకు త్రోయబడిన వ్యక్తాత్మ.

*

యోగపరిభాషలో "చైత్యము" అనగా ప్రకృతిగతమైన ఆత్మ వస్తువు. మనోప్రాణ దేహముల వెనుక నిలిచి ఉండే పరిశుద్ధమైన psyche దివ్యధాతువు. దానిని గురించి మనకెక్కువ తెలియదు. ఛాయా జ్ఞానము మాత్రమే తెలుసు. అది తన బాహ్యోపకరణముల ద్వారా ప్రజ్ఞను ఆర్జించి ఒక జన్మ నుండి మరియొక జన్మకు పురోగమించే శాశ్వతమైన దైవాంశము. ఈ అనుభూతి — దివ్యానుభూతి — పెరిగి పెద్దదైన కొద్దీ ఒక చైత్య వ్యక్తిత్వమును రూపొందించుకొంటుంది.

*

ఆత్మ ఎప్పటికీ పరిశుద్ధంగా పవిత్రంగానే ఉంటుంది. దాని ప్రజ్ఞ, దాని మహత్త్వము ఆంతరంగికంగానే భాసిస్తాయి. చైత్య పురుషుడు అభివృద్ధి చెంది పరిణతి చెందినపుడు బహిర్గతమౌతయి.

*

---

*చైత్యము యొక్క ఈ రెండు ముఖములను, ఆత్మ (చైత్య పదార్థము), ఆత్మ స్వరూపము (చైత్య సత్త్వము) లను తరువాతి రెండు శీర్షికలలో వివరంగా చదవండి.

సంపాదకుడు

అంతరాత్మ — చైత్యతత్త్వము, ఆత్మ

అంతరాత్మ భగవదంశమైన ఒకానొక వస్తువు. అది పరిణామంలోని ఒక దివ్యతత్త్వంగా పరిణామంలోనికి దిగి, అజ్ఞానంనుంచి జ్ఞానప్రకాశంలోనికి వ్యక్తిపరిణామాన్ని ధరించి ఉంటుంది. పరిణామ గతియందు అది ఒక చైత్యవ్యక్తిని లేక అంతరాత్మిక వ్యక్తిత్వాన్ని పెంపొందించుతుంది. ఇలా ఈ వ్యక్తిత్వం పరిణామశీల మనః ప్రాణ దేహాలను తన ఉపకరణాలుగా ఉపయోగించుకుని, పెరుగుతూ ఉంటుంది.

*

జీవాత్మ, అగ్నికణం. చైత్యపురుషుడు అనే ముగ్గురు ఒకే సత్యం యొక్క మూడు విభిన్న రూపాలు. వీటిని కలగాపులగం చేయ గూడదు. చేస్తే, అది అంతర అనుభవ స్పష్టతను సంకరపరుస్తుంది.

జీవాత్మ ...అభివ్యక్త లేక ఉపకరణాత్మక సత్త్వమునకు పైన స్వయంభువుగా ఉంటుంది. అది జనన మరణాలకు అతీతం. సదా ఏకరూపం, అదే వైయక్తిక ఆత్మ. అది వ్యక్తియొక్క సనాతన సత్య సత్తు.

కాగా అంతరాత్మ భగవదగ్నియొక్క ఒక విస్ఫులింగం. ఈ విస్ఫులింగం అభివ్యక్త సత్త్వమునకు పైన ఉండదు. అభివ్యక్తిలోనికి దిగి, భౌతిక జగత్తున దాని పరిణామానికి ఆధారంగా ఉంటుంది. అది ఆదిలో భగవచ్చేతనయొక్క అవిచ్ఛిన్నమైన శక్తి. ఈ శక్తిలో ఇంకా రూపం ధరించని సర్వ సంభవతలు ఇమిడి ఉంటయి. కాగా ఈ సంభవతలకు రూపమివ్వడం పరిణామ ప్రక్రియ చేయవలసిన పని. ఈ విస్ఫులింగం అతినిమ్న జీవులనుండి అత్యున్నత జీవుల వరకు సమస్త సజీవ మూర్తులందు ఉంటుంది.

*

అంతరాత్మ — చైత్యపురుషుడు: అంతరాత్మచేత తన పరిణామము నందు రూపొందించబడినవాడే చైత్యపురుషుడు. ఈ చైత్య పురుషుడు మనః ప్రాణ దేహాలకు ఆధారముగా నుండి, వాటి అనుభవాలచేత పెరు గుతూ, జన్మనుంచి జన్మకు ప్రకృతి పరిణామాన్ని మోసుకునిపోతాడు.

ముందు అతడు మనఃప్రాణ దేహములచేత ఆవృతమై ఉన్నప్పటికి పెరుగుతూ పెరుగుతూ ముందుకు వచ్చి, ఆ మనః ప్రాణ దేహాలనే శాసించే సామర్థ్యం సంతరించుకుంటాడు. సామాన్య మానవునియందు అతడు తన భావప్రకటన కోసం వాటిమీద ఆధారపడి ఉంటాడే కాని, వాటిని చేపట్టి యథేచ్ఛగా ఉపయోగించుకోలేడు. అపుడు అతని జీవనం పశుజీవనంగా, మానవజీవనంగా మాత్రమే ఉంటుందే కాని, దివ్యజీవనంగా ఉండదు. చైత్యపురుషుడు సాధనచేత ప్రభావశాలియై, తన ఉపకరణాలను స్వేచ్ఛగా ఉపయోగించుకోగలిగినపుడు, భగవదున్ముఖ ఆవేగం సంపూర్ణమవుతుంది, మనః ప్రాణ దేహముల పరివర్తనం — వాటి విమోచనం మాత్రమే కాదు — సంభవమవుతుంది.

అంతరాత్మ ఒక భగవదంశం. ఈ అంశం పరిణామశీలి వ్యక్తి యొక్క అంతరతమ ఆధారం, ఈ ఆధారరూపమున అది మనః ప్రాణ దేహాలను ధరించి ఉంటుంది. ఈ మూడూ ప్రకృతినుండి వచ్చిన దాని ఉపకరణాలు. వీటి ద్వారా అది ద్రవ్యమందలి నిశ్చేతనమునుండి, తన యథార్థ సత్తు అయిన దివ్య ప్రకాశ, అమృతత్వాల దిశగా పెరుగ ప్రయత్నిస్తుంది. తన ఉపకరణాల పరిమితత్వాలు దాని మీద నిమ్న ప్రకృతియొక్క గతులను విధిస్తాయి. అందుచేత అంతరాత్మ ప్రకృతితో రాజీ పడక తప్పదు. ఈ రాజీ అంతరాత్మ ఊర్ధ్వగతికి అడ్డుతగులుతున్నప్పటికి, ప్రకృతితో తన ఈ ఆదాన ప్రదానం నుండే దానికి తన పురోగతి సాధనం లభిస్తుంది. కాని చైత్యపురుషుడు — అంశరూప అంతరాత్మ తన పరిణామమునందు ధరించిన రూపం లేక వ్యక్తిత్వం. ఈ వ్యక్తిత్వం పరిణామం ద్వారా వికసిస్తూ అజ్ఞానానికావల ఉచ్ఛతర పరిణామానికి సర్వం సిద్ధమయ్యేవరకు ఒక జన్మనుండి మరోజన్మకు పయనిస్తూ ఉంటుంది.

*

ఆంగ్లంలో 'soul = ఆత్మ' అనే పదము వలె 'అంతరాత్మ' అనే పదమునుకూడ చాలా అస్పష్టంగా వాడుతారు. ఆ విధంగా అయితే అది సమస్తమైన అంతస్సత్త్వమును, అంతర్మానసమును, అంతఃప్రాణికమును, అంతర్భౌతికము సహితమును, ఆఖరికి అతంరాంతరాలలోని చైత్యాత్మ = psychic ను కూడ సూచిస్తుంది.

సారతత్త్వమున అంతరాత్మకు, చైత్యపురుషునికి భేదమున్నది. దాని వెనుక, దీనివెనుక అన్నింటి వెనుక అంతరాత్మ ఉంది, అది భగవదగ్ని యొక్క కణం — అది లేనిదే, దేనికీ ఉనికి లేదు. కాని అది ఒక ప్రాణిక, భౌతిక వస్తువు వెనుక, దానికి ఆధారముగా నున్నపుడు సైతం, స్పష్టంగా వికాసం చెందిన ఒక చైత్యపురుషుడు దాని వెనుక ఉండకపోవడం సంభవమే.

*

వృక్షంలో లేక పశువులో ఉండే చైత్యం నిష్క్రియం కాదు — కేవలం దాని అభివ్యక్తి సాధనాలు మానవుని సాధనాల కంటె తక్కువ వికసితం. మొక్కలో చైత్యమెంతో ఉంది, పశువులో చైత్య మెంతో ఉంది. మొక్కకు తన రూపమందు ప్రాణిక — భౌతిక (vital-physical) తత్త్వాలు మాత్రమే వికసించి ఉంటాయి. మొక్క రూపం వెనుకనున్న చేతనకు వికసిత లేక సంఘటిత మానసికత లేదు. అందుచేత అది తనను ప్రకటించుకోలేదు. కాగా పశువు ఒక అడుగు ముందు ఉంటుంది. దానికి ప్రాణిక మనస్సు ఉంటుంది. కావున దానికి కొంత స్వప్రకటన సాధ్యం. కాని దాని చేతన పరిమితం. దాని మనోవ్యాపారం పరిమితం. దాని అనుభవాలు పరిమితం. దానిలోని అంతరాత్మ సైతం తనకు ప్రతినిధిగా మానవునికి సంభవమైన దాని కంటె తక్కువ వికసిత చేతనను, అనుభవాన్నే ముందుకు పంపు తుంది. అయినప్పటికి పశువులు తమకు గల అంతరాత్మతో మానవుని లోని చైత్యపురుషునికి వెంటనే అనుస్పందించగలవు.
మానవుని ప్రేతం (ghost) నిశ్చయంగా అతని అంతరాత్మ కాదు.

*

అంతరాత్మ, చైత్యపురుషుడు: ఇవి వ్యవహారమందు దాదాపు ఒకటే. భేదమేమంటే, చైత్య పురుషుని పెంపొందించుకొనని వస్తువు లందు సైతం అంతరాత్మ అని పిలువదగిన భగవదగ్ని కణం ఒకటి ఉంటుంది. సంస్కృతంలో పురుషుడుగా పెంపొందిన అంతరాత్మ పేరు "హృదయంలోని పురుషుడు లేక చైత్య పురుషుడు"

చైతన్యం (spirit) అంటే ఆత్మ బ్రహ్మం. తన సారరూపాన భగవంతుడు.

ఏకమాత్ర భగవంతుడెపుడు తన లోపల సదా ఉన్న బహు తను అభివ్యక్తం గావించుతాడో, అపుడు ఈ సారభూత ఆత్మ ఆ అభి వ్యక్త విశ్వానికి కేంద్ర సత్తు (being) అవుతుంది. అయి, పైనుండే ఇక్కడి తన వ్యక్తిత్వాల మీద, పార్థివ జీవితాల మీద అధ్యక్షత వహించుతుంది. కాని అలా అధ్యక్షత వహించినా, అది పార్థివ అభి వ్యక్తికి ముందే ఉన్న భగవంతుని ఒక అంశం — "పరా ప్రకృతిర్ జీవభూతా" (గీత: 7-5)

ఈ నిమ్నతర అభివ్యక్తియందు, అనగా అపరా ప్రకృతియందు సృష్టికి ముందే పైన ఉన్న భగవంతుని సనాతనాంశం అంతరాత్మ రూపం ధరిస్తుంది. ఈ అంతరాత్మ భగవదగ్ని యొక్క విస్ఫులింగ రూపాన వైయక్తిక పరిణామానికి, మానసిక, ప్రాణిక, దైహిక పురుషుని వికాసానికి, ఆధారంగా ఉంటుంది. ఒక మహాగ్నిలోనికి పెరుగుతూ, చేతనాభివృద్ధితో పరిణమిస్తూ ఉండే ఈ విస్ఫులింగమే చైత్యపురు షుడు. దీనిని బట్టి చైత్యపురుషుడు పరిణామశీలుడు, పరిణామానికి ముందే ఉన్న జీవాత్మకాడు.

*

చైత్యమంటే ఇచ్చట వైయక్తిక సత్తయందు అంతర్లీనమైన భగవదగ్ని కణం — ఈ చైత్యకణమే పెరుగుతూ, పరిణమించుతూ చైత్యపురుషుని రూపం ధరిస్తుంది — కావున స్పష్టంగానే చైత్యకణం మున్ముందే భగవంతుని శక్తులను కలిగి ఉండజాలదు. కాని దాని ఉనికిచేత మాత్రమే వ్యక్తి భగవంతునికి ఉన్మీలితుడు గావడం, దివ్య చేతన దిశగా పెరగడం సంభవమవుతోంది. పనిచేసినప్పుడు, అది సదా జ్యోతి మరియు సత్యంయొక్క అర్థమందే పనిచేస్తుంది. భగవంతుని దిశగా ప్రేరణతోనే పనిచేస్తుంది.

*

అంతరాత్మ, ప్రాణం రెండు విభిన్న విషయాలు. భగవదగ్ని కణమైన అంతరాత్మ వైయక్తిక ప్రకృతిక్రియకు ఆధారం కాగా, మనః ప్రాణ దేహాలు ఆ ప్రకృతి అభివ్యక్తికి ఉపకరణాలు. ఎక్కువెక్కువ మానవుల్లో అంతరాత్మ బాహ్యప్రకృతి క్రియచేత గుప్తమూ, ఆచ్ఛాది తమూ అయి ఉంటుంది, అందుచేతా, ప్రాణికం శరీరాన్ని సజీవం

గావించి కదలించడం చేతా వారు ప్రాణికమే అంతరాత్మ అని భ్రమి స్తారు. కాని ఈ ప్రాణిక సత్తు మంచి, చెడు కోరికలచేత, కార్యనిర్వా హక శక్తులచేత చేయబడిన వస్తువు. ఇది కామాత్మయే గాని, నిజమైన అంతరాత్మ కాదు.

ప్రాణతృష్ణలయూ భావావేశములయూ ఈ కలయక మానవు నిలో నొక విపరీతమైన కామాత్మను సృష్టి చేయును. సంస్కార శూన్య మైన, — ప్రమాదకరమైన — యీ హృదయ లక్షణమునే, బుద్ధి విశ్వ సింపక, అదుపులో బెట్టవలెననుకొనుచున్నది. అది యుక్తమే కాని, దాని యదుపు ఎంత మాత్రమూ స్థిరమైనదికాదు.

అది యట్లుండ, మానవుని నిజమైన ఆత్మ యీ కామపూరిత హృదయములో లేదు. దీని వెనుక, కానరాక దాగియున్న అసలు హృదయములో — తేజోమయ గుహాభ్యంతరములో నున్నది. పరాత్ప రుని దివ్యతేజః ప్రసార రూపమై, మన యాత్మ అచట నెలకొనియు న్నది. చాలామందికి అది యచట నున్నట్లు తెలియనే తెలియదు. ఏలయన, ఆత్మ లందరికినీ కలవు. కాని, దాని నెరిగిన వారునూ, దాని సాక్షాత్కరణానుభవము కలిగినవారును అరుదు. ఆ దివ్యజ్యోతి స్ఫులిం గమే మన ప్రకృతియందలి అజ్ఞానపదార్థజాతమున కంతకునూ ఆధార ముగానున్నది. దాని నాశ్రయించుకొనియే మనలో నిజమైన మానవుడు, హృత్పురుష డేర్పడుచున్నాడు. ఈ హృత్పురుష డంతకంతకు వృద్ధి బొంది, హృదయమాతని దివ్యప్రేరణలతో స్పందించుచున్నకొలది, మానవుడు తనయాత్మను క్రమముగా నెరుంగుచూ, పశుస్వభావమును వీడి, అంతర్యామియగు పరాత్పరుని వెలుగు నందుకొనుచూ, గంభీర మైన జీవనచేతనల జాడలను గ్రహించుచూ, దివ్య ప్రేరణతో వర్తింప నారంభించును.

*

ఒక వస్తువు యొక్క మూలతత్వము ఎప్పటికి మారదు. అది ఎన్ని భిన్నరూపములు దాల్చినప్పటికి, పరివేషములు వేసినప్పటికి దాని బాహ్యా స్వరూపమే మారుతుంది గాని తత్వము మారదు. బంగారము ఎన్ని చిత్ర విచిత్ర రూపములు దాల్చినప్పటికి దాని తత్వము మారనట్లు తత్త్వము నిర్వచనమునకు లొంగునది కాదు. తత్త్వమనగా తత్త్వము. అంతే.

మూలం: శ్రీఅరవిందులు

తెలుగు మూలం: చెలసాని నాగేశ్వరరావుగారి 'యోగంపై లేఖలు'

చైత్య పురుషము*

మనయందలి చైత్యపురుషము దైవమునుండి నేరుగా వచ్చినది. అది దైవంతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటుంది. దైవశక్తులన్ని దానియందు గర్భితములు. అది మనఃప్రాణ దేహములకు ఉపాధి. ఈ దివ్యాంశము సకల ప్రాణికోటిలోను ఉన్నప్పటికి సామాన్య చేతన వెనుక దాగి వుంటుంది. తొలుత అది వికసించి వుండదు. ఒక వేళ వికసించి వున్నప్పటికి ముందు భాగంలో ఉండదు. దేహమందలి అసమగ్ర ఉపకరణాలు తమ పరిధులలో అనుమతించునంతదనుక అది తనను తాను ప్రకటించుకొంటూ ఉంటుంది. దివ్యానుభూతులతో తన చేతనాస్థాయిని పెంచుకుంటుంది. మనలో ఉన్నత స్థితులు సమకూరుతున్న ప్రతి పర్యాయం, బలం పుంజుకుంటూ వుంటుంది. చివరగా మన అంతరంగంలోను, ఊర్ధ్వములోను ఈ జరిగే ప్రక్రియల సమీకరణం ద్వారా ఒక చైత్య వ్యక్తిగా పర్యవసిస్తుంది. దీన్నే మనం చైత్యపురుషము (psychic being) అని పిలుస్తాము.

*

పరిణతి చెందెడు చైత్యపురుషమునకు, జీవితాత్మకు మధ్య గల భేదాన్ని స్పష్టంగా గ్రహించడం అవసరం. జీవాత్మ అజము. జనన మరణాల కతీతము. అది జన్మకు, దేహమనోజీవితాలకు, ప్రకృతికి అతీతము, స్వతంత్రము. వీనిని ధరించి వీనికి ఆధారంగావుంటున్నా, వీటికి ఏమాత్రం కట్టుబడి వుండదు. వీటి గోడలలో బంధింపబడదు. వీటిచే చెరుపబడదు. కాని చైత్యపురుషము (అంతరాత్మ) అటులగాదు. అది పృథ్వీతలమునకు దిగివచ్చి జననమరణముల ద్వారా ఒక దశ నుండి మరో దశకు, పృథ్వీ భూమికనుండి ఇతర భూమికలకు సాగి

---

* psychic being. శ్రీఅరవిందుల పదజాలమునకు సమానాంతర పదముల వాడుకను గురించి ఇంతవరకు నిశ్చితాభిప్రాయము లేదు. సహృదయులు దీనిని గమనించవలెను. ఈ విషయముపై ప్రత్యేక జ్ఞానమున్న నిపుణులెవ్వరైనావుంటే మాకు తెలియచేయ ప్రార్థన.

— సంపాదకుడు

పోతూ, మళ్ళిమళ్ళి భూమిమీదకు దిగివస్తుంది. దానికి మరణం లేదు. అది అమరము. ఒక జన్మనుండి మరో జన్మకు పరిణామం ద్వారా వృద్ధి చెందుతూ పురోగమిస్తూ వుంటుంది. ఈ పరివర్తన దానిని మానవ స్థాయి వరకు తీసికొని పోతుంది. మానవ స్థాయిలో సైతం అది తనకు తాను పరివర్తన చెందుతూ, వికాసం చెందుతూ పోతుంది. దీన్నే మనం చైత్యపురుషం అంటాం. అది తన సాధనాలుగా శారీరక, ప్రాణ, మానసములతోకూడిన మానవ చేతనయొక్క పరిణామానికి ఆధారంగా వుంటూ వాటిని అభివృద్ధి పరుస్తూ వుంటుంది. వాటి వలన ఆచ్ఛాదితమై అసమగ్రంగానే ప్రపంచ అనుభవాలను పొందుతూ వుంటుంది. కానీ స్వీయాభివ్యక్తిగా కూడా అది వృద్ధి పొందుతూనే వుంటుంది. అది తెర వెనుకనుండి తన స్వీయ దైవత్వంలో కొంత స్థితిని ప్రదర్శిస్తూ పరిణామ కార్యాన్ని నిర్వహిస్తూ వుంటుంది. తన అసమగ్ర ఉపకరణాలకు చేతనైనంత వరకు దివ్యప్రకటనము గావిస్తూంటుంది. అయితే ఎల్లకాలము ఇటులగాదు. తన ఉపకరణాలపై ఆధిపత్యము వహించి వాటిని దైవ సంసిద్ధివైపు మళ్ళించడానికై తెర వెనుకనుండి ముందుకు వచ్చే సమయం వచ్చితీరుతుంది. ఇలా చైత్య పురుషం ముందుకు రావడమే ఆధ్యాత్మిక జీవితానికి ప్రారంభ ముహూర్తమన మాట. ఈ తరుణంలో అది మనోమయ జీవియైన మానవ దశకు మించిన దివ్యచేతన యొక్క ఉన్నత పరిణామాన్ని చేరుకోడానికి సిద్ధమవుతుంది. అంటే అది మనోభూమిక నుండి ఆధ్యాత్మిక భూమికకకు ఎదుగుతుంది. ఆ తర్వాత అనేక దశల ద్వారా ఆ ఆధ్యాత్మిక స్థాయినుండి అతిమానస స్థితిని చేరుకుంటుంది.

*

జీవాత్మ లేక దివ్యాగ్ని విస్ఫులింగం చైత్యవ్యక్తిత్వాన్ని రూపొందించుటకు ప్రారంభిస్తుంది. ఆ చైత్య వ్యక్తిత్వాన్నే చైత్య పురుషం అంటారు.

*

చైత్యపురుషం (psychic being) ఈ పరిణామ క్రమం ద్వారా వికాసం చెందుతూ, అజ్ఞానానికావల ఉన్నత పరిణామానికి సర్వం సిద్ధమయ్యే వరకు ఒక జన్మనుండి మరో జన్మకు పయనించే ఆత్మ

స్వరూపం లేదా ఆత్మ వ్యక్తిత్వం అనవచ్చు.

*

సంస్కృతంలో ఈ చైత్యపురుషము హృదయంలోనున్న పురుషమని లేదా చైత్యపురుషమని పిలువబడుతుంది. (చైత్యపురుషం పరిణామంలో వృద్ధి చెందే అంతరాత్మ)

*

కేంద్రసత్తా యొక్క ప్రతినిధియైన జీవాత్మ, ప్రకృతిలో వ్యక్తి యొక్క సమగ్ర మనుగడకు ఆధారం యిస్తున్న దివ్య విస్ఫులింగం అయితే, 'చైత్యపురుషం' పరిణామంలో వృద్ధినొందుతూ, ఆ జీవాత్మ యొక్క ఎరుకతో గూడిన రూపంగావున్నది. ఇది ఈ నిరంతర పరిణామ క్రమంలో జడంనుండి ప్రాణాన్ని, ప్రాణంనుండి మనస్సును వికసింప చేస్తుంది. చివరకు మనస్సు అధిమనస్సుగాను, అధిమనస్సు అతిమానస సత్యంగాను రూపొందుతాయి. 'జీవాత్మ' యీ అన్ని దశల్లోను ప్రకృతికి ఆధారభూతంగా వుంటుందే కాని వీటికి చెందదు.

*

చైత్యము, భూమిపై వ్యక్తి పరిణామానికి ఆధారభూతంగా వుంటున్న జీవాత్మ లేక దివ్యాగ్ని విస్ఫులింగం. చైత్యపురుషం జీవాత్మ యొక్క చేతన. దైవంతో ఐక్యమవడానికి అంతా సిద్ధమయ్యేదాక ఈ చైత్యపురుషం మనఃప్రాణ దేహాలను తన ఉపకరణాలగా చేసికొని ఒక జన్మనుండి మరో జన్మకు పయనిస్తూ ప్రవృద్ధమానమౌతూ వుంటుంది.

*

చైత్యపురుషమనగా ప్రధానంగా పరిణామ ప్రక్రియలో పాల్గొంటున్న వ్యక్త్యాత్మ — వైయక్తిక ప్రకృతి యొక్క ఆవిర్భావము ద్వారా పరిణామము చెందుతున్న వ్యక్త్యాత్మ. ఇది దివ్యాగ్ని విస్ఫులింగం. ఇది మనఃప్రాణదేహాల వెనుక చైత్య పురుషంగా ఎదుగుతూ వుంటుంది. అజ్ఞాన ప్రకృతిని జ్ఞానప్రకృతిగా రూపాంతరీకరణం చెందించేదాకా అది అలా ప్రవృద్ధమౌతూనే వుంటుంది.

*

చైత్యపురుషము జన్మ, పునర్జన్మల పరంపరలో పరిణతి చెందుతూ వుండే అంతరాత్మ. ఈ అంతరాత్మ దైవాంశమే కాని,

దాంతో పాటు హృషీకేశుడు కూడా (మనలో దాగివున్న దైవం) మనని అంటిపెట్టుకొని వుంటాడు.

*

అంతరాత్మలో దైవము యొక్క సర్వావకాశము గర్భితమై వుండుట వలన దానిని అక్షరమనుచుంటిమి. కాని అది ఆ దివ్యశక్తులను వికసింప చేయాలి. ఆ వికసింప చేసే పరిణామ ప్రక్రియలో అది అభివృద్ధిపొందే చైత్య వ్యక్తిగా రూపొందుతుంది. వైయక్తిక ప్రకృతిగా పరిణామ క్రమంలో పాల్గొంటుంది. అది మనఃప్రాణదేహాల వెనుక చైత్య పురుషముగా వుంటూ, అజ్ఞాన ప్రకృతిని జ్ఞాన ప్రకృతిగా పరివర్తన చెందించే వరకూ యెదుగుతూండే దివ్య విస్ఫులింగం. ఇక్కడ మనమొక ముఖ్య విషయాన్ని గమనించాలి. పరిణతి చెందే యీ చైత్య పురుషము, ప్రధానమైన జీవాత్మ కాదు. ఈ చైత్యపురుషము సృష్ట్యాతీతమైన అనంత శక్తిసామర్థ్యములను సృష్టిలోనికి కొనివచ్చి వ్యష్టి రూపమునిస్తుంది.

*

చైత్యపురుషము, హృదయ కుహరంలో నెలకొనివున్న జీవాత్మ ఒకటిగాదు. అవి భిన్నములు. చైత్యపురుషమేమో వ్యక్తిగత ఆత్మసత్తా. అది దైవంనుండి బయల్వెడలి, దైవం వైపు పరిఢవిల్లినా, దైవం మాత్రం కాదు.

*

పరిణామగతిలో ప్రవేశించి దానికి ఆధారంగా వర్తించే జీవాత్మ లేక పురుషము (psychic essence) తనలో సకల దివ్యశక్తులను కలిగి వుంటుంది. కాని తన ప్రతినిధిగా ముందుంచిన వ్యక్తిలోని చైత్య పురుషము ప్రకృతి కల్మషాలను ధరించి, తన చైత్య దివ్యసారాన్ని తిరిగి పూర్తిగాపొంది జీవాత్మతో ఐక్యమయ్యేదాకా పరిణతి చెందుతూ ఉంటుంది. యోగానుభవాలు పూర్తిగా అవగాహన అయ్యేందుకు పూర్వం ఈ పురుషము యొక్క అన్ని భూమికలలోని ద్వంద్వాన్ని గ్రహించి అంగీకరించక తప్పదు. చిత్తము, చైత్యము ఒకటి కాదు. కానే కాదు. చిత్తము మరియొక దినుసు. మన బాహ్యాచేతనా వ్యవహారాలన్ని చిత్తములో నిర్వహించబడతయి. దానిని గురించి తెలుసుకొనేందుకు

మనం మన బాహ్యచేతనను విడిచి లోపలకు ప్రవేశించనవసరము లేదు.

*

ఆత్మవాణి అని మనం పిలుచుకునేది అంతరాత్మ ప్రేరణ కాదు. ఎందుకంటే అది కేవలం మానసికమైనదియు, మరియు తరచుగా సాంప్రదాయబద్ధమై దోషయుతమైన ప్రత్యామ్నాయము మాత్రమే.

*

మనస్సుపైనున్న సహజ జ్ఞాన స్ఫురిత ఆత్మ (intuitive self) లేదా సహజ జ్ఞాన చేతన, (intuitive consciousness) చైత్యపురుషం కాదు. చైత్యము, పురుషము (being) నకు వెనకాల వుంటుంది. దైవానికి అనన్య భక్తి, సత్యంవైపు, దైవంవైపు పురోగమించడానికి తోడ్పడే నిష్కాపట్యము, సత్యహృదయత, వీటికి వ్యతిరేకమైన వానినుండి వెనక్కు మళ్ళే సహజ స్వభావము — ఇవీ స్పష్టంగా గోచరించే దాని గుణాలు.

*

శిరస్సుపైనున్న భూమికల కన్న చైత్యము యొక్క లక్షణములు భిన్నమైనవి. దానికి గొప్పదనం, శక్తి, విస్తృత వ్యాప్తి తక్కువ, ఒకింత మాధుర్యం సౌందర్య సౌకుమార్యం ఎక్కువ. రసానందం, సాన్నిహిత్యము, సూక్ష్మగ్రాహ్యత దాని సంపదలు. "మాధుర్యము వెలుగు" చైత్యపురుషము యొక్క మూల ప్రకృతి. ఆధ్యాత్మిక స్తరము వీటిని వహించినప్పుడు, వాటికది విస్తృత భావాభివ్యక్తిని, ధగధగలాడే మెరుపు కాంతులను, మకరంద మాధుర్యమును, ధైర్యసాహసముల బలాధిక్యతల అత్యంత విశాలావరణల స్ఫూర్తిని ప్రసాదిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

చైత్య పురుషుని బహిరాగమనము

మానవుడు ఆధ్యాత్మిక మార్గంమీద అడుగు పెట్టేందుకు కారణం చైత్యపురుషుడే. నిలబడి అతనికి సహాయం చేసేది కూడా ఆయనే. అందుకని మనం ముందుకు తీసుకొని వచ్చి నిలబెట్టవలసింది కూడా ఆ చైత్య పురుషుణ్ణే.

*

చైత్యపురుషుడు ముందుకు రావడమనగా తెరమరుగు నుండి తెరముందరకు రావడమనమాట. మనకు దాని ప్రభావం వెంటనే నిత్యజీవితంలో తెలిసిపోతుంది. అది మన మనస్సుని, ప్రాణికాన్ని, శరీరాన్ని వాటి వ్యవహారాల సహితంగా పరివర్తింపజేసి వాటిపై ఆధిపత్యం వహిస్తుంది. ఆత్మానుభూతి కలుగుతుంది. తనలోని నిజమైన వ్యక్తి చైత్యపురుషుడే అని తెలుస్తుంది. ఇకపై మనస్సు, ఇతరేంద్రియములు కూడా అహంకార నిర్దేశితములు గాక, అంతరంగిక వ్యక్తికి పరికరములుగా భాసిస్తాయి.

*

లోపల ఉన్న మనోమయపురుషుడు నీలో జరుగుతున్న సమస్తమైన వ్యవహారాన్ని గమనించి, విచారించి మంచిచెడ్డలను నిర్ణయిస్తాడు. కాని చైత్యపురుషుడు అటులకాదు. అతనికి మానసేంద్రియముతో పనిలేదు. అయత్నకృతంగాను, సూటిగాను, వెలుగులోను అనుభూతిని పొందగలడు. అతడు పునీతుడు. అంతరంగిక దైవస్ఫూర్తి గలవాడు. మంచిచెడులను సూటిగా తెలుసుకోగల సమర్థుడు. అందువలన అతను ముందుకు వచ్చిన యడల మీ ప్రకృతిలోని ఏచేష్టలు మంచివో, ఏవిచెడ్డవో ఎప్పటికప్పుడు నిన్ను హెచ్చరిస్తూ ఉంటాడు.

*

ఎవరైనా దైవంతో వ్యక్తిగత సంబంధం ఎంతవరకూ పెంచుకోగలరో అనేదాన్నిబట్టే చైత్యపురుషుని సిద్ధింపచేసుకోవడం, జాగృతంచేసి ముందుకు తెచ్చుకోవడం ఆధారపడి ఉంటయి. భక్తి, ప్రేమ, విశ్వాసం, ఆత్మసమర్పణలనే వ్యక్తిగత సంబంధాలననుసరించి విడిపోతున్న మొండి మానసిక, ప్రాణిక, దైహిక అహంతల పంతాలను

ఎంతవరకూ నిరాకరించగలరో అంతవరకూ చైత్యపురుషని సిద్ధింప చేసుకోగలుగుతారు.

*

భక్తి తత్పరత, క్రమక్రమానుగత ఆంతరంగిక నివేదనము చైత్యపురుషావిష్కరణమునకు రాజమార్గములు.

*

నిరంతరమైన ఆకాంక్ష, దైవంమీద మాత్రమే భారము మోపాలనే సంకల్పము చైత్యపురుషణ్ణి ముందుకు రప్పించుటకు దివ్యమైన మార్గములు.

*

నీబాహ్యాప్రకృతి పునీతమౌతున్న కొద్దీ అంతరంగిక పురుషుడు బహిర్గతమౌతాడు. నిర్లిప్తమై ఉన్నత చైతన్యమును ఊర్ధ్వమునుండి గ్రహించుటకు ద్వారమౌతాడు.

*

నేడుగాని నాడుగాని నీవు చేసిన తప్పులను వదిలించుకోవాలనియు, చైత్య, ఆధ్యాత్మిక చైతన్యంలో జీవించాలనియు నీవు నిశ్చయించుకున్నట్లయితే ఆ తప్పులు నీ చైత్య పురుషని బహిరాగమనమునకు ఏమాత్రము అడ్డు రాలేవు.

*

చైత్యపురుషని దృష్టి/అభినివేశము సత్యమూ, ఉన్నత చైతన్యము, దైవములవైపు ప్రసారమౌతూ ఉంటుంది. ఏవిధమైన అసుర శక్తులుగాని అతనిని స్పృశించ లేవు. వాటి ప్రేరణలు అతనిని కల్లోల పరచ లేవు.

*

చైత్యపురుషుడు ఎల్లప్పుడూ తనను ఒక శిశువుగా, భగవంతుని పుత్రుడుగా, భక్తునిగా భావించుకుంటాడు. అతడు భగవంతుని లోని భాగము, సారభూత తత్వము అయినప్పటికీ సారూప్యము యొక్క భిన్న ఛాయలుగా అభివ్యక్తమౌతాడు.

*

సాధనలో చైత్యపురుషుని పాత్ర: (1) ప్రేమ, భక్తి: ప్రేమ అంటే అహంపూరితంగా, ప్రాణికమైనదిగా, ఏదో కోరుతూ ఉండేది కాకుండా నిబంధనారహితంగాను, నిరపేక్షితంగానూ, స్వతఃసిద్ధంగానూ ఉండాలి. (2) అంతరంగంలో శ్రీమాత సన్నిధి, సంస్పర్శ. (3) అంత రంగంలో నుండి వచ్చే గతితప్పని మార్గదర్శకత్వము (4) చైత్యప్రభావా నికి, మార్గదర్శకత్వానికి లోబడి వుండటంవల్ల దైహిక, మానసిక, ప్రాణిక చైతన్యానికి కలిగే పరిశుద్ధత, ప్రశాంతత (5) పైనుంచి వచ్చే ఆధ్యాత్మిక చైతన్యాన్ని గ్రహించుకోవటానికి అనువుగా ప్రకృతి అధః చైతన్యాన్ని తీర్చిదిద్దుట ఎందుకనగా చైత్యం తెచ్చేదంతా విలువైనదే: సమ్యగాలోచన, సమ్యగ్ దృష్టి, సమ్యగ్భావన, సమ్యగ్వైఖరి.

*

యదార్థ జీవితము యొక్క ద్వంద్వముఖములనుగాని ఏక ముఖమునుగాని నీవు సాక్షాత్కరించుకోవచ్చు — జీవాత్మ లేదా పర మాత్మ మొదటిది. ఆత్మ లేదా అంతరాత్మ-చైత్యపురుషుడు రెండవది. మొదటిది సర్వాంతర్యామిగానూ, రెండవది మనః ప్రాణ దేహాలకు ఆధారభూతమైన వ్యక్తిగాను అనుభవమవుతయి. పరమాత్మ సిద్ధిపొందిన వారు అన్నిటినుండి విడిపోయి తమకుతామే ప్రత్యేకమైనట్టి అను భూతి పొందుతారు. ఈ సిద్ధి కొబ్బరి కురిడి సామ్యంగా ఉంటుంది. చైత్యజీవుని దర్శనం పొందిన వారి అనుభూతి ఈ విధంగా ఉండదు. అది భగవంతునితో ఏకత్వంపొంది దానిపైనే ఆధారపడి కేవలం ఆ భగవంతునికే అంకితమైపోయినట్లుగా భావిస్తుంది. తన స్వభావాన్నే మార్చేసే శక్తి కలుగుతుంది. నిజమైన ప్రాణికాన్ని, నిజమైన మానసి కాన్ని, నిజమైన దైహిక జీవిని తనలో దర్శించుకోగలుగుతాడు. ఈ యోగంలో ఈ రెండు సిద్ధులూ అవసరమే.

ప్రకృతి 'నేను' అనే ఒక చిన్న అహంకారపు వ్యవస్థను ఏర్పరచింది. మానసిక, ప్రాణిక, దైహికములు దాని విభాగములు .— బాహ్య చైతన్యానికి, చర్యలకు ప్రత్యేక వ్యక్తీకరణమునకు కేంద్రములు. నిజజీవి అభివ్యక్తముతో అహంకారం యొక్క పని పూర్తి అవుతుంది. అది అదృశ్యము అవుతుంది. యదార్థజీవి ఉపస్థితమవుతుంది.

*

చైత్యజీవుడు ఛాతి మధ్యలో హృదయ కుహరానికి మధ్య (దైహికహృదయంకాదు. ఎందుకంటే అన్ని కేంద్రాలు శరీర నడిమి భాగంలో ఉంటాయి) భాగంలో లోతుగా వెనుక ఉంటాడు. ప్రాణిక కక్ష్యలో నుంచి చైత్యభాగంలోకి వెడుతున్నప్పుడు గాఢంగా లోలోతులకు వెడుతున్న భావన చైత్యకేంద్రం చేరే వరకు అనుభవానికి వస్తుంది. హృదయ కేంద్రపు ఉపరితల భాగం ఉద్వేగాత్మక జీవుని స్వస్థానం. అక్కడనుంచి లోతుగా వెడితే చైత్యం కనబడుతుంది.

*

అంతర్గత జీవుడంటే చైత్యజీవి అనిగానీ అంతరాంతరాల్లోని జీవుడని కానీ నా వుద్దేశం కాదు. ఆంతరమానసము, ఆంతరప్రాణికము, ఆంతరదైహికములను గురించే నేను మాట్లాడుతున్నాను. ఎక్కడో మరుగునదాగిఉన్న స్థానాన్ని చేరుకోవాలంటే ముందుగా వీటన్నిటినీ దాటుకుంటూ వెళ్ళాలి. బాహ్యాచైతన్యాన్ని వదలి లోపలికి వెళ్లగలిగిన వారిలో కొందరు మొదటగా ఆంతరప్రాణికంలోకి ప్రవేశిస్తారు. మరికొందరు ఆంతరిక మానసికంలోకిగాని ఈ ఆంతరికదైహికంలోకిగానీ ప్రవేశిస్తారు. ఉద్వేగాత్మక ప్రాణికంలోంచి వెళ్ళటం అన్నిట్లోకి సూటి మార్గం. ఎందువల్లనంటే హృదయ కేంద్రంలో ఉద్వేగాత్మక స్థానానికి వెనుకగా ఉండేదే చైత్యస్థానం. మన లక్ష్య సిద్ధికోసం ఈ అంతర కోశాలలో తెలివి కలిగి ఉండాలి. అలా అని తెలివిగా లేకపోతే చైత్యజీవుని కార్యనిర్వహణకు తగినట్టి సాధన సంపత్తి కొరవడుతుంది. అప్పుడిక బాహ్యామనస్సు, బాహ్యాప్రాణికం, శరీరాలను మాత్రమే వాడుకోవాలసి వస్తుంది. ఇవి మరీ చిన్నవిగా (ఇరుకుగా) సంకుచితంగా మసగగా ఉంటాయి.

*

చైత్యాత్మయొక్క స్థానం పైన ఎక్కడోకాదు అది — హృదయానికి వెనకాల. దాని లక్షణం జ్ఞానం కాదు — ఆత్మ సంబంధమైన ఆధ్యాత్మికానుభూతి — దానికి సత్యమంటే సరైన అవగాహన ఉంటుంది. అది స్వతః సిద్ధంగా అనుభూతమయ్యే ఆత్మానుభవం వంటిది. అది మనలో అన్నిటికంటే లోతున ఉంటుంది. మిగిలిన మానసిక, ప్రాణిక, దైహికాలకు ఆధారభూతము. అయితే అది వాటి

వెనుక మరుగున వుండి వాటిపై ఏదో కొంత ప్రభావం చూపించటం తప్ప ప్రత్యక్షంగా పని చేయలేదు. అత్యున్నతమైన అభివృద్ధి పొందిన ప్పుడుగానీ, యోగసాధన ద్వారాగానీ ఈ మానసిక, ప్రాణిక, దైహికము లపైన సరైన ఆధిపత్యం వహించి పని చేయడం సాధ్యమవుతుంది. కొన్ని జరగబోయే విషయాలను నీకు తెలియచెప్పేది, నీ చర్యల ఫలి తాల గురించి నిన్ను ముందుగా హెచ్చరించేది నీవనుకుంటున్న చైత్య జీవుడుకాదు. అది నీ అంతరంగికమైన ఒక భాగం మాత్రమే. ఒక్కొక్క ప్పుడు ఆంతరమానసికం కావచ్చు. లేదా ఆంతరప్రాణికం కావచ్చు. ఒక్కొక్కసారి ఆంతరిక లేదా సూక్ష్మ భౌతిక పురుషుడు కావచ్చు. ఆంతరిక జీవికి అంతర్మనస్సు, ఆంతర ప్రాణికం, ఆంతరిక లేదా సూక్ష్మ దైహికం — బాహ్యంగా ఉన్న మనస్సుకు, ప్రాణిక దైహికా లకు తెలియని విషయాలు ఎన్నో తెలుస్తాయి. ఎందుకంటే ఆంతరజీవికి ప్రకృతి నిగూఢ శక్తులతో ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. వీటన్నిటి కన్నా లోపలగా ఉండేది చైత్యజీవి. సత్యాన్ని గ్రహించడమనేది చైత న్యపు లోలోపలి స్థాయి యొక్క సహజ ధర్మం. సత్యం, శివం, సుందరం దానికి సులభ గ్రాహ్యములు.

కేంద్రజీవి — పుట్టుక లేనిది, పరిణామం లేనిదీ అయిన జీవాత్మ — వ్యక్తి పుట్టుక పరిణామాలపై పర్యవేక్షిస్తుంది — చైత న్యపు ప్రతికోశంలోను తన ప్రతినిధిని ఉంచుతుంది. మానసిక కోశంలో అది సత్యమైన మనోమయ పురుషుడు, ప్రాణమయ కోశంలో అది నిజమైన ప్రాణమయ పురుషుడు, దైహిక కోశంలో యథార్థమైన అన్నమయ పురుషుడు. మానవుడు అజ్ఞానంలో ఉన్నప్పుడు మానసిక, ప్రాణిక, దైహిక కేంద్రాలను ఆశ్రయించి ఉంటాడు. అంటే ఏ కోశంలో ప్రధానంగా జీవిస్తూ ఉంటాడో అది అతని కేంద్రజీవి అన్నమాట. కాని నిజమైన ప్రతినిధి మనోప్రాణదైహికాల వెనుక మరుగుపడి ఉంటుంది — అది మన అంతరాళంలోని చైత్యజీవుడే.

ఆంతరంగిక జ్ఞానం కలగటం మొదలుపెట్టగానే మనం మన లోని చైత్యజీవిని గమనించ గల్గుతాము. అది ముందుకు వచ్చి సాధన నడిపించటం తెలుస్తుంది. అప్పుడిక సృష్టికి ఆవలనున్న అవిభక్త ఆత్మ

— జీవాత్మను మనలో దర్శించ గలుగుతాము. దాని ప్రతినిధియే చైత్యాత్మ.

*

చైత్యాత్మ ముందుకు వస్తే తెలిసే చిహ్నాములు బృహత్ప్రేమ, భక్తి, శరణాగతి, సర్వసమర్పణ, ఆధ్యాత్మపరంగా ఏది మంచిదో, ఏది కానిదో స్పష్టంగా ఎప్పుడూ చూడగలిగే అంతర్దృష్టి, మంచిదికాని దాన్ని యథాతథంగా నివారించడం — తనలోనిదంతా శ్రీమాతకు సర్వసమర్పణచేసి నివేదించే ప్రవృత్తి కలిగి ఉండటం.

*

అది చైత్యాత్మానుభవంలో ఒక భాగం — ఇంకొకటి సంపూర్ణమైన ఆత్మ సమర్పణ, నిష్కామము. ఏవైతే అసత్యమో, అహం భావమో, అయుక్తమో, ఏవైతే దివ్య సత్యం, దివ్యసంకల్పం, దివ్య స్వచ్ఛత దివ్యకాంతులకు వ్యతిరేకమో అవన్నీ చైత్యజీవుని ధాటికి స్వభావంలోనుంచి సమసిపోతాయి. అంతేకాకుండా చైత్యగుణాలైన కృతజ్ఞత, విధేయత, నిస్వార్థత, శ్రీమాతను గురించి వచ్చేది లేక ఆమె దరికి చేర్చేది అయిన సరైన జ్ఞానం, సరైన ప్రబోధనలకు బద్ధుడవటం మొదలైనవన్నీ వృద్ధి పొందుతాయి. ఈ విధంగా ఈ వైపు అభివృద్ధి సాగుతూంటే ఇంకో ప్రక్క దివ్యసాన్నిధ్యం, ప్రేమ, ఆనందం, సౌందర్యం ప్రవర్థమానమై స్థిరంగా నిలిచిపోతాయి.

*

యోగములో మనస్సు ప్రధాన పాత్ర వహించి అంతరాత్మను వెనక్కి నెట్టినా, లేక భక్తి తదితర ప్రవృత్తులు చైత్యాత్మకంగాకాక ప్రాణిక మార్గం అవలంబించినా అసమర్థత ఏర్పడుతుంది. చైత్యజీవి పూర్తి వికాసం పొందాలంటే స్వచ్ఛత, నిష్కాపట్యము, అహంభావ రహితమూ, కల్మషరహితమూ, బేషజరహితము, నిరపేక్షము అయిన ఆత్మ సమర్పణ చేయగల సామర్థ్యం ఉండాలి.

*

నీ పరిస్థితి చెప్పే పాఠము యోగము చేయకూడదని కాదు. కాని జీవి రెండు విభాగాల మధ్యనున్న ఎడమును నిదానంగా క్రమంగా తగ్గించాలి. ఈ విభజన సర్వసామాన్యం, మానవ

స్వభావంలో సార్వత్రికం కూడా. ఉన్నత భాగాలలో సంకల్పం వేరుగా ఉన్నప్పటికీ ప్రతివారూ అధఃప్రేరణలను అనుసరించడం సంభవిస్తుంది. ఈ దౌష్ట్యాన్నే అర్జునుడు తెలుసుకొన్నవాడై శ్రీకృష్ణుని ఇలా ప్రశ్నించాడు. "మనిషి చెడ్డపనులు చేయవద్దనుకొని కూడా ఎందుకు చేస్తాడు? ఎవరో బలవంతపెట్టి చేయిస్తున్నట్లుగా?" హోరేస్ మహాశయుడు కూడా చెప్పాడు "ఒక జీవితానికి మాత్రమే శరీరం ఆత్మకు నివాస స్థానం అనే నమ్మకం". నిరంతర ప్రయత్నం, ఆకాంక్షలతో ఎవరైనా ఒక మలుపును చేరుకోవచ్చు. అప్పుడు చైత్యజీవి ఉనికి స్థిరపడుతుంది. ఒక చిన్న మానసిక వైరుధ్య పరివర్తనగా పైకి కనిపించినా అది ప్రకృతి సమతౌల్య స్థితినే మార్చేస్తుంది.

*

నీ సాధన ఇంకా మానసికంగానే ఉండటంవల్ల చాలా కష్టంగా, మెల్లిగా సాగుతుంది. చైత్యజీవి వికాసంపొందినప్పుడు అది సంతృప్తికరంగా శీఘ్రతరంగా పురోగమించ గలుగుతుంది.

*

లోలోపలి అగాధాలలోని ఆత్మను జాగృతముజేసి, మానసిక, ప్రాణిక, దైహికాలనుండి చైత్యచేతనలో పునర్జన్మ ఎత్తినప్పుడే ఈ యోగం సాధ్యమౌతుంది. అటుల చేయని యెడల (కేవలం మనస్సుతోనో, ప్రాణిక దైహికములతోనో) ఇది సాధ్యము కాదు. అనగా బౌద్ధిక జ్ఞానము, మానసిక భావములు, ప్రాణిక కోరికలను అంటిపెట్టికొనుట వలన చైత్యములో పునర్జన్మ నెత్తుటను, శ్రీమాత నవజాత శిశువుగా ఆవిర్భవించుటను నిరాకరించినట్లయితే సాధన విఫలమవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది వెంకటరామ శాస్త్రి, అమరవాది ప్రభావతి

జీవాత్మ ఆవిర్భావము, తదుపరి పరిణామము

మానవుని నిజ స్వరూపము (అతని ఆత్మ) పై పొరలలో కాన రాదు. అది అంతస్థలీయము. కాని అంతస్థలీయమనగా ఎక్కడో మనస్సు కందని సొరంగములలో గాదు, ఎందుకంటే అది మనోజీవిత దైహిక ముల వెనక హృదయాలయములో దేదీప్యమానంగా వెలిగిపోతూం టుంది. దట్టమైన తెరలచే ఆచ్ఛాదితమైన ఈ చైత్యమూర్తి (దివ్యజ్యోతి) మనలో నిరంతరం వెలుగుతూనే ఉంటుంది. బాహ్య ప్రకృతిని అయో మయపరచే ఎంతటి తిమిరాంధకారమైనా దానినార్పలేదు. దైవ జన్యమైన ఆ జ్ఞానజ్యోతి తమస్సులో కూడా ప్రకాశిస్తూనే ఉంటుంది. మన బాహ్య ప్రవృత్తిని కప్పివేసే ఆంతరిక ఆధ్యాత్మిక ఆత్మ యొక్క గాఢ అచేతన ఏదైనాగాని ఆ జ్వాలను ఆర్పివేయ లేదు. అది భగవంతుని నుండి జనించిన జ్వాల. మహా అవిద్యలో ప్రకాశోజ్వలంగా నివాసమే ర్పరచుకొన్న ఆ జ్వాల అవిద్యను మహాజ్ఞానం దిశగా తరలించే వరకు దానిలో వృద్ధి చెందుతూంటుంది. అది ప్రచ్ఛన్న మహాసాక్షి. మహా నియంత్రణాత్మకం. లోన దాగివున్న మహామార్గదర్శి. సోక్రటీస్ పరిగ ణించే దామన్ (daemon of Socrates). మార్మికుని అంతర్జ్యోతి లేదా అంతర్వాణి. మనలో జన్మనుంచి జన్మకు మృత్యుస్పర్శ లేక, వినాశ వికృతాలకు లోనుగాక అనశ్వర జ్వాలగా కొనసాగుతూండేది అదే. అది అజము. ఎందుకంటే వ్యక్తి అస్తిత్వంపై అధ్యక్షత వహిస్తున్నా అది దాని విశ్వాత్మక, విశ్వాతీత లక్షణాల ఎరుకలో నిత్యం ఉంటున్నా మహా ప్రకృతి స్వరూపాలలో అది తన ప్రతినిధిగా చైత్య పురుషుని వ్యక్తిగత ఆత్మగా ఉంచింది. ఆ చైత్యపురుషుడు మనఃప్రాణ దేహాలను సమర్థిస్తూ మనలోని మనఃప్రాణకోశాలు, సూక్ష్మ దేహసత్తల వెనుక నిలచి నిరీ క్షిస్తూ అవి అభివృద్ధిచెంది అనుభవం గడించటం వల్ల సత్ప్రయోజనం పొందుతూంటుంది. అతనిలోని ఈ యితర పురుష శక్తులు, అతని సత్తలోని ఈ సత్తలు, వాటి నిజ తత్త్వంలో ఆచ్ఛాదితాలుగా ఉన్నా మన బాహ్య వ్యక్తిత్వం కలిగి ఉన్నట్టి, మనవి అనుకున్నట్లు కనబడే స్థితిని, అసత్తల సంయుక్త బాహ్య కార్యాచరణను, అవి తాత్కాలికం మూర్తిమత్వాలుగా బహిర్గతం చేస్తాయి. అంతరాంతరాల్లో వున్న ఈ

దివ్యాంశకూడా మనలో చైత్యపురుష రూపధారణ చేసి ఒక చైత్యా పురుష మూర్తిమత్వాన్ని ముందుంచుతుంది. ఆ మూర్తిమత్వం ఒక జీవి తంనుంచి మరోజీవితానికి మారుతూ అభివృద్ధి చెందుతూ వికసిస్తుంది. ఎందుకంటే అది జన్మకు మృత్యువుకు మరల, మృత్యువుకు జన్మకు మధ్య పయనించే బాటసారి. మన స్వభావానికి చెందిన విభాగాలన్ని టినీ బహువిధాలుగా పరివర్తనకులోను చేసేది అదే. చైత్యపురుష సత్త మొదట్లో మనఃప్రాణ దేహాల ద్వారా, ప్రచ్ఛన్నంగా, సాక్షికంగా, పరో క్షంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఈ ప్రాకృతిక విభాగాలనే ఆత్మాభివ్య క్తికి తన ఉపకరణాలుగా అభివృద్ధి పరచవలసి ఉంటుంది — వాటి పరిణామంలో చాలాకాలం అట్లా కొనసాగవలసి ఉంటుంది. అజ్ఞానం లోవున్న మనిషిని దివ్య చేతనోజ్జ్వల దిశగా తోడ్కొని పోవుటకు నియోగింపబడుట చేత అది అజ్ఞాన భూమికలోని అనుభవ సారాన్ని గ్రహించి మనిషి స్వభావంలో ఆత్మాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పరచటానికి వినియోగిస్తుంది. ఇక మిగిలినదానిని మనిషిలోని ఉపకరణాలను భగ వంతుని తేజోమయ సాధనాలుగా సిద్ధమయ్యేంతవరకు వాటిని విని యోగించవలసి ఉన్నందున, ఈ చైత్యపురుష సత్త ఆ ఉపకరణాలను వాటి భావి అభ్యున్నతికి తగిన రీతిగా మలుస్తుంది. ఈ గుహ్యా చైత్యా పురుష సత్తే మనలోని మూల అంతరాత్మ (original conscience). అది నైతికవాది కల్పించుకున్న సాంప్రదాయక 'అంతరాత్మ' (conscience) కంటె ఇంకా లోలోపల ఉంటుంది. ఎందుకంటే మన లోని ఈ చైత్యపురుష సత్తే సత్య శివ సుందరాలకు, ప్రేమ, సామంజ స్యతకు దారిచూపే పరంజ్యోతి. అది మనలో దివ్యరూపాంతరీకరణకు ఉండే అవకాశమంతటికీ ప్రాతినిధ్యం వహిస్తూ ఇవన్నీ మన ప్రకృతి యొక్క ప్రధాన పరమావశ్యకతగా అయ్యేందుకు విడువకుండా పని చేస్తుంది. మనలోని ఈ చైత్యపురుషుడే సిద్ధుడుగా, ఋషిగా, ద్రష్టగా వికాసం పొందుతాడు. అది తన పరిపూర్ణ శక్తిని అందుకున్నప్పుడు మన సత్తను ఆత్మ జ్ఞానానికి, భాగవత జ్ఞానానికి, పరమోత్కృష్ట సత్యా నికి, పరమోత్తమ శుభానికి, మహత్తమ సౌందర్యానికి, ప్రేమకు, ఆనం దానికి, పరమోన్నతులకు, విశాలతకు మరల్చి ఆధ్యాత్మిక సానుభూతి, విశ్వాత్మకత, ఏకత్వాల స్పర్శను మనకందజేస్తుంది. అందులకు

భిన్నంగా చైత్యపురుష సత్త బలహీనంగా అభివృద్ధి చెందని స్థితిలో ఉంటే — మనలోని సున్నిత భాగాలు, వాటి చలనాలు స్వభావప రంగా, సామర్థ్యపరంగా హీనస్థితిలో ఉంటాయి. అప్పుడు మనస్సు బలంగా ప్రతిభావంతంగా ఉండవచ్చు. ప్రాణిక భావావేశాల నిలయ మైన హృదయం దృఢంగా, అధికారికంగా ఉండవచ్చు. జీవశక్తి ప్రము ఖంగా విజయవంతంగా ఉండవచ్చు, శారీరకంగా సంపన్నంగా సౌభా గ్యంగా బాహ్య వ్యవహారంలో ఆధిపత్యంతో విజయవంతంగా ఉండ వచ్చు. అయినా చైత్యపురుష సత్త దుర్బలస్థితిలో ఉన్నప్పుడు ఇవన్నీ ఉన్నా, బాహ్యంగా ఉండే, వాంఛాత్మక మిథ్యాచైత్యసత్త ఆధిపత్యం వహించటం వల్ల అది చైత్యపురుష సూచనలు, అభీప్సలు, భావాలు, ఆదర్శాలు, ఆకాంక్షలు అన్నింటిని తప్పుగా అన్వయించుకొని అవే నిజ మైన అంతరాత్మకు ఆధ్యాత్మిక అనుభూతికి చెందినవిగా పొరపాటు పడతాము. గుహ్య చైత్యపురుషుడు ముందుకు రాగల్గి, పాక్షికంగా కాకుండా, మనోప్రాణదేహాల బాహ్య స్వభావాల తెరవెనుక నుండి కాక కామనకేంద్రాన్ని (desire soul - నిజానికి ఇది ప్రాణ కోశానికి చెంది నది) అధిగమించినట్లయితే, అప్పుడు ఆ భాగాలన్నింటినీ సత్యశివసుం దరమైన అంతరాత్మ స్వరూపాలుగా తీర్చిదిద్దవచ్చు. తుదకు మన స్వభా వాన్నంతటినీ జీవితపు నిజ లక్ష్యం దిశగా, మహోన్నత విజయం దిశగా, ఆధ్యాత్మిక అస్తిత్వంలోకి ఆరోహణ దిశగా మళ్లేటట్లు చేయవచ్చు.

అయితే ఈ చైత్యపురుష సత్తను మనలోని ఈ నిజ అంతరా త్మను ముందుకు తీసుకువచ్చి దాన్ని మార్గదర్శక ధర్మంగా జేసిన ప్పుడు మన స్వాభావిక సత్త సంపూర్ణ పరివర్తనా ఫలాన్ని పొందగల మని, పరమాత్మ రాజ్యంలోకి ద్వారాలు తెరుచుకుని మనల్ని ఆహ్వాని స్తాయని కూడా అనిపించవచ్చు. అంతేకాక దివ్యస్థానాన్ని లేదా దివ్య పరిపూర్ణ తను సాధించటానికి మనకు సహకారిగా పరమసత్యచేతన గాని అతిమానస తత్త్వంగాని కలుగజేసుకునే ఆవశ్యకత లేదనికూడా తర్కించవచ్చు. మన ఉనికి సంపూర్ణ పరివర్తన చెందటానికి చైత్య పురుష రూపాంతరీకరణానికి అవసరమైన ఒక నిబంధన అయినప్పటికీ బృహత్ ఆధ్యాత్మిక పరివర్తనకు అంతమాత్రమే చాలదు. ప్రథమంగా మహాప్రకృతిలో ఇది వ్యక్తిగత అంతరాత్మ అయినందుచేత మన సత్తకు

అంతర్హితంగా ఉన్న దివ్యతర శ్రేణుల ప్రభావానికిలోను కాగల్గి వాటి వెలుగును, శక్తిని, అనుభూతిని స్వీకరించి మననం చేసుకోగలుగుతుంది నిజమే. కాని మరొక ముఖ్యమైన పరమోత్తమ స్థానమున్నది — మన అంతరాత్మ యొక్క సువిశాల విశ్వాత్మకతను, అధిగమనత్వాన్ని సొంతం చేసుకోనటానికి పైనుండి ఆధ్యాత్మిక పరివర్తన ఒకటి అత్యంతావశ్యకం అన్నది గ్రహించాలి.

మూలం: శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: వి. సుబ్బరామ శర్మ

శ్రీఅరవిందుల వివరణ

వైయక్తిక ప్రకృతిలోకి (మానవునిలోకి) జీవాత్మ తన అంశమును పంపిస్తుంది. ఆ అంశయే ప్రకృతికి ఆధారభూతమై వర్తించే పురుషుడు — కేంద్రీయంగా చైత్యములోను, ఉపకరణీయంగా మనోప్రాణిక దైహికములలోను భాసిస్తాడు. దీనిని గురించి స్పష్టమైన అభిప్రాయం కలిగించడానికి మాత్రమేగాక అనుభూతి దృష్ట్యా, పూర్ణయోగసాధన ద్వారా సిద్ధించే ఆత్మజ్ఞానం దృష్ట్యా, ఏది లోపిస్తే యోగసాధన కుంటుపడుతుందో, ఆవిస్పష్టమైన విషయాన్ని వివరించటం నా బాధ్యత. అనుభూతి చెందితేచాలు, ఎవరికివారు మనసులో అభిప్రాయాన్ని ఏర్పరచుకోవలసిన అవసరం లేదు. దీనిని అంతర్దృష్టితో అవగాహన చేసుకుంటే, యోగసాధన గమ్యం వైపు పురోగమించడానికి వీలవుతుంది. తాపట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్న మౌఢ్యానికి స్వస్తిచెప్పి, పొరపాట్లను పరిహరించుకుంటే స్పష్టమైన అనుభూతి లభించి యోగసాధకుడి ప్రయత్నం సులభతరమవుతుంది. మనస్సు తన మొండితనాన్ని పరిహరించుకొని నవనీతం కావాలి. ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకుని స్వీకరించే అవగాహనాశక్తిని నిత్యనూతనంగా వికసింప జేసుకోవాలి. లేకపోతే శుష్క మేధాజనిత శాస్త్ర పాండిత్యపు చట్రాల్లో చిక్కుకునే ప్రమాదంవుంది. అలా కాకుండా ఎవరికివారు లోతైన సత్యగ్రహణానికి ప్రయత్నించాలి. ఆధ్యాత్మిక అనుభూతిద్వారా తప్ప మరేవిధంగాను సత్యాన్ని గ్రహించటం సాధ్యం కాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

కేంద్రములనుండి వార్తలు: పన్నాజీ గోవా లో గవర్నమెంటు సాంస్కృతిక శాఖవారు 24 నవంబరు 1998న శ్రీఅరవిందుల 125వ జన్మదిన మహోత్సవపు ముగింపు ఉత్సవములను జరుపుకొన్నారు. ఈ సందర్భమున ఒక సావనీరు ప్రచురించారు. ఒక ఛాయాచిత్ర ప్రదర్శనమును ఏర్పాటు చేసారు. డిసెంబరులో Children's corner నిర్వహించారు. తూర్పు కలకత్తా కేంద్రము వారు ఫిబ్రవరి 7న, 18వ వార్షికోత్సవమును జరుపుకొన్నారు. కాలికట్ (Kerala) లో ఒక కేంద్రమును స్థాపించారు. ఖరగ్‌పూర్ (West Bengal) కూద్రా (బీహారు), కర్నాటకలోని సత్తూరు, మలమద్ధి; హార్యానాలోని ఫరీదాబాదులలో కొత్త కేంద్రములను స్థాపించారు.

శ్రీఅరవిందో సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నాల్గవ వార్షిక మహోత్సవములు హైదరాబాదులోని శ్రీఅరవింద భవనములో దివ్య తేజో విరాజితమైన పవిత్ర వాతావరణంలో 13 - 14 మార్చి 99 తేదీ లలో శ్రీ బి. వెంకట్రామయ్యగారి ఆధ్వర్యమున జరిగినవి. అందులోని ముఖ్యాంశములు: శ్రీ తెన్నేటి పూర్ణచంద్రరావుగారి ప్రారంభోపన్యాసము 'శ్రీఅరవిందులు మన భవిష్యత్తు'. శ్రీ విజయ పోద్దారుగారి 'నిత్యజీవితంలో దైవాన్ని గురించిన భావన, ఆవశ్యకత, సమర్పణ'. శ్రీ బి. వెంకట్రామయ్యగారి 'The year in retrospect'. ప్రొ॥ M.V. నడకర్ణిగారి 'శ్రీఅరవిందోద్యమంలో ఆంధ్రులపాత్ర. తదితర విషయములు'. డా॥ వి. మన్‌మోహన్ రెడ్డి 'దేవసంఘము'. డా॥ సచ్చిదానంత మొహంతి 'Indian culture'. శ్రీ వి. సుబ్బారావు (సెక్రటరీ) 'Money and spiritual life'. డా॥ జి. గోపాల్‌రెడ్డి 'Sri Aurobindo in life through action'. డా॥ దీపికా ముఖర్జీ, డా॥ చలమయి, డా॥ నీరజ, భారతీదేవి, 'స్త్రీల కార్యక్రమములు'. శ్రీ పి. సి. స్వరూప్ 'యూత్‌వింగ్ కార్యకలాపాలు'. శ్రీ కె.వి.రావు 'సాధనా సమస్యలు'. శ్రీ కొంగర భాస్కరరావు 'ప్రతి సాధకుడు చేసుకోవలసిన ఆత్మవిమర్శ'. స్థానిక రామకృష్ణ మఠం అధ్యక్షులు శ్రీ పరమానంద స్వామిగారు, శ్రీ పి. ఎన్. మూర్తి, శ్రీ శివరామకృష్ణ, శ్రీ మురళీ మనోహర్‌గార్లు కూడా ఉపన్యసించిరి.

Tirupati

శ్రీఅరవిందుల ఆశ్రమము

శ్రీమాతారవిందుల ప్రవచనములు

అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 1999



ఈ ఆశ్రమ లక్ష్యము సాధారణంగా ఇటువంటి సంస్థల ఆశయము లకు భిన్నము. ప్రాపంచిక జీవితాన్ని నిరసించి వైరాగ్యము నవలం బించుట మన మతము కాదు. పరిణామ క్రియ ద్వారా మానవుని కన్న భిన్నమైన జీవిని ఆవిర్భవింప చేయు ప్రక్రియకు ఇది ఒక కేంద్రము, క్షేత్రము. ఆజీవి ఉన్నత ఆధ్యాత్మిక చేతనను ధరించి దివ్యజీవిగా పరిణామము చెందుతాడు.

శ్రీఅరవిందులు.

శ్రీఅరవిందాశ్రమము

(శ్రీమాతారవిందుల ప్రవచనములు)

విభాగము I

విభాగము II

విభాగము III

అనుబంధము

సంక్షిప్తంగా

శ్రీఅరవింద వాణి:

మనమింకను సాధించవలసిన దేమున్నది?

ప్రేమ: ఎందుకనగా మనమింత దనుక ద్వేషమును స్వార్థమును మాత్రమే సాధించితిమి.

జ్ఞానము: మనమింతదనుక అజ్ఞానమును, మనస్సును, అవకతవకలను మాత్రమే సాధించితిమి.

ఆనందము: ఏలన మనమింత దనుక ఇంద్రియ భోగము, బాధ, నిరాశలను మాత్రమే సాధించితిమి.

బలము: మనమింత దనుక అర్భకత్వము, ప్రయాస, గెలుపులో ఓటమిలను మాత్రమే సాధించితిమి.

జీవితము: ఏలన మనమింత దనుక జననము, వృద్ధి మరణములను మాత్రమే సాధించితిమి.

ఐక్యత: ఏలన మనమింత దనుక సమరము కూటమిలను మాత్రమే సాధించితిమి.

ఒక్క ముక్కలో చెప్పాలంటే పరమేశ్వర తత్త్వము — మనలను దైవము యొక్క ప్రతిబింబములుగా పునరుద్ధరించుకొనుట.

*

తార్కిక బుద్ధిని అంతస్స్ఫురణముగా పరివర్తింప జేయుము. నీ యావత్స్వరూపము జ్యోతిర్మయమగు గాక! ఇదియే నీ గమ్యము.
మానవ ప్రయత్నమును ఆత్మ క్రీడగా పరిణమింప జేయుము. నీ సర్వ రూపమును చిద్రూపముగా పరిణమింప జేయుము. ఇదియే నీ గమ్యము.
మానుష్యానందమును సమమైన శాశ్వతానందముగా పరిణమింప జేయుము. ఇదియే నీ గమ్యము.
విచ్ఛిన్న వ్యక్తిని విశ్వమానవునిగా రూపాంతరీకరించుము. నీ యావత్స్వరూపము దేవతా స్వరూపమగు గాక! ఇదియే నీ గమ్యము.
పశువును పశువుల కాపరిగా రూపాంతరీకరించుము. నీవు శ్రీకృష్ణుడవు గాక! ఇదియే నీ గమ్యము.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి

అవతరణ – చరిత్ర

మాతృవాణి:

(1912 లో ఫ్రాన్సులో వ్రాసిన వ్యాసంనుంచి)

లక్ష్యం: విశ్వస్థాయిలో సామరస్యమును సాధించి దానికి కార్యరూపము నిచ్చుట.

• దీనిని సాధించుటకు మానవజాతి సమైక్యతను పొందవలెను. ఆంతరంగిక దైవ సాక్షాత్కారము ద్వారా దీనిని సాధించవలెను

• వ్యక్తిపరంగా: తనలోని దైవమును అనుభూతిపరంగా తెలుసుకొని అద్దానితో సాయుజ్యమును పొందుట.

• మానవునిలో, నేటి వరకు తెరమరుగున పడిఉన్న వివిధ వెలికి రప్పించి వ్యక్తీకరించి తద్వారా ఇంతవరకు ఈ భూలోకానికి అతీతంగా ఉన్న విశ్వశక్తి ధారలతో సంబంధము నేర్పరుచుట.

• సామూహికంగా ఒక పవిత్ర స్థలములో ఒక నూతనజాతి — దైవసంతానం — ఆవిర్భావమునకై ఒక ఆదర్శ సంస్థను ఏర్పరుచుట. ఈ పృథ్వి యొక్క రూపాంతరీకరణము, సామరస్యము రెండు క్రియల ద్వారా సాధ్యమౌతుంది. పరస్పర విరుద్ధములుగా తోచినప్పటికి ఈ రెండు మిళితమై పరస్పర ప్రభావితములై ఒకదానినొకటి పూరించుకుంటయి.

• వ్యక్తిత్వ పరివర్తనము (రూపాంతరీకరణము): అంతరంగికాభివృద్ధి ద్వారా దైవముతో సాయుజ్యము చెందుట.

• సామాజిక పరివర్తనము (రూపాంతరీకరణము): వ్యక్తి వికసించి ప్రవర్ధమానమగుటకు అనువైన వాతావరణము నేర్పరచుట.

పరిసర వాతావరణము వ్యక్తిని ప్రభావితము చేసినట్లే, పరిసరములుకూడా వ్యక్తులను బట్టే రూపొందుతాయి. కాబట్టి ఈ రెండువిధములైన క్రియలు అవసరమే.

ఈ సంఘము యొక్క సభ్యులకు మూడు కర్తవ్యములుంటాయి. ఉన్నతాదర్శమును తనలో సిద్ధించుకొనుట.

(1) అనూహ్యము మహోన్నతమునైన భగవంతుని ఆవిర్భావమునకు ఒక చక్కటి ప్రతినిధి.

(2) ఈ ఆదర్శమును ఇతరులకు బోధించుట. అంతకంటె ముఖ్యంగా తన ఉదాహరణము ద్వారా నిరూపించి తద్వారా అందులకు సంసిద్ధులుగా ఉన్న వారిని గుర్తించి వారిని గూడా అదే విధంగా బోధకులుగా నియమించుట.

(3) ఒక ఆదర్శ సమాజమును స్థాపించుట, లేక ఇంతకుముందే ఉన్న వాటిని పునః వ్యవస్థీకరించుట.

*

నా జీవితంలో మొదట్లో నా పరిచయస్తులు చాలామంది తమ అంతర్గత ఆకాంక్ష గురించి చెబుతూ ఏదో గాఢమైన దానికోసం, సత్యమైన దానికోసం వారిలో తపన గలుగుతోందని, కాని బ్రతుకుతెరువు కోసం బందీలై పాటుపడుతూ బానిసలు కావటం వలన తమ శక్తి, సమయం అంతా దానికే వెచ్చించి దిగజారిపోతూ అంతర్గతంగా గాని, బాహ్యంగా గాని ఏమి చేయలేక పోతున్నామని వాపోయే వారు. ఇలా ఎంతోమంది ఎన్నోసార్లు చెప్పారు.

అప్పటికి నేను చాలా చిన్నదాన్ని. వారికోసం ఏదైనా చేయ గలిగితే బాగుంటుందని నాలో నేను అనుకునేదాన్ని. ప్రయత్నంచేసి ఒక చిన్న సంస్థనేర్పరచాలి. చాలా చిన్నదే అయినా, మనుషులందరూ నిత్యావసరాల కోసం కష్టపడకుండా జీవించగలిగేటట్లు చేస్తే భౌతికావసరాలు తీరిపోతాయి. అప్పుడు వారి శక్తినంతా దైవం కోసం, ఆత్మసిద్ధి కోసం వెలయించగలరు.

నా మధ్య వయస్సులో — అదే మామూలుగా మానవ జీవితంలో వచ్చే మధ్య వయస్సులో — నాకు ఆ అవకాశం చిక్కింది. అటువంటి జీవితానికి అనువైన సంస్థను ఏర్పరచగలిగాను.

*

...నేను శ్రీఅరవిందులను మొట్టమొదట కలుసుకొన్నపుడు ఈ ప్రశ్న ఎదురైంది.... వ్యక్తి మొదట, యోగము చేసి, గమ్యమును జేరి యితరుల సంగతి తరువాత చూడాలా, లేక ముందరే ఔత్సాహికుల నందరిని ఆహ్వానించి సామూహికంగా ముందరికి వెళ్ళడమా?

ఆ నిశ్చయము మనస్సుతో ఆలోచించి చేసినది కాదు. తానంతటదే సంభవించింది. మా పరిస్థితులు అట్లా తయారైనాయి. వేరు దారి లేదు. వేరే మాటలలో చెప్పాలంటే, సహజంగా, అప్రయత్నంగా, ఒక సమూహము ఏర్పడింది. ఒకసారి మొదలు పెడితే చివరి వరకూ వెళ్ళి తీరవలసిందే. మొదట్లో ఐదుమందో, పదిమందో ఉండేవారు. చాలా కాలం ఐదు లేక ఆరుగురు ఉండేవారు. ఆ తరువాత 10, 12, 20, 30, 35. 35 మంది చాలాకాలం అట్లాగే ఉండిపోయారు. తరువాత అకస్మాత్తుగా ఒక్క ఊపులో సంఖ్య పెరిగి పోయింది.

*

మొదట్లో శ్రీఅరవిందులు 1910 నుంచి 1920 వరకు పాండిచ్చేరిలో 4, 5 గురు శిష్యులతో ఉండేవారు. అంతే.

1914 లో శ్రీమాత ఫ్రాన్సునుంచి (పాల్ రిచర్డు గారితో) వచ్చి శ్రీఅరవిందులను కలసి "ఆర్య" అనే పత్రికను మొదలుపెట్టి సంపాదకులుగా వ్యవహరించారు. దానిని 1920 వరకు నడిపేరు.

ఏప్రిల్ 1920 లో శ్రీమాత జపానునుంచి రాగానే సాధకుల సంఖ్య పెరిగింది. 1926 లో ఆశ్రమం ఏర్పడింది.

అనువాదం: డి. సత్యవాణి

లక్ష్యము – స్వరూపము

మాతృవాణి:

మానవులు పరమచైతన్యంతో (సచ్చితానందం) తాదాత్మ్యమును పొందుటయే సాధారణ సాధనా మార్గాల లక్ష్యము. అట్టివారు తరించి సంతృప్తి పొందుతారు. ఇక ఈ ప్రపంచం యొక్క దుర్గతితో వారికి పని లేదు. కాని శ్రీఅరవిందుల మతం అటుల కాదు. వారి చరమ సిద్ధి శ్రీఅరవిందులకు మొదటిమెట్టు. అక్కడనుంచి వారి యోగం మొదలవుతుంది. ఒకసారి దైవాన్ని సాక్షాత్కారింప జేసుకొన్నాక ఆ సిద్ధిని, వెలుగును, జ్ఞానాన్ని క్రిందికి తీసుకొని వచ్చి ఈ బాహ్య ప్రపంచ పరిస్థితులను పరివర్తింప జేయాలి. భూలోక జీవితమును పూర్తిగా రూపాంతరీకరింప జేయాలి. తదనుగుణంగా పూర్ణయోగసాధకులు ఈ ప్రపంచాన్ని వదలివేసి ఒక మూల తపోజ్ఞాన నిమగ్నులై కూర్చోరు. ప్రతి ఒక్కరు రోజులో మూడవవంతు బాహ్యక్షేత్రంలో పని చేయాలి. ఈ ఆశ్రమంలో పలురకముల పనులకు ఆస్కారమున్నది. ఎవరికి తోచిన పనివారు చేయవచ్చును. ఆ పనులను నిస్వార్థంగా సేవాంకితులై సమర్పణాతత్పరులై చేయాలి. *మన లక్ష్యము సంపూర్ణ రూపాంతరీకరణము అని మరచిపోరాదు.*

ఈ ప్రయోజనానికి ఈ కార్యాచరణమునకు అవకాశము కల్పించుటకే ఈ ఆశ్రమం స్థాపింపబడినది. ఆశ్రమవాసులకు వారి ముఖ్యావసరములు తీర్చడమే కాకుండా వారు వాటికోసం తాపత్రయ పడనవసరం లేకుండా తగిన ఏర్పట్లు చేయబడ్డాయి.

ఇక్కడ ఎక్కువ నిబంధనలు లేవు. కనీసమైన కట్టుబాట్లే ఉన్నాయి. నిజమే. ప్రతివారికి వారి స్వభావాన్ని బట్టి అభివృద్ధి చెందుటకు కావలసినంత స్వేచ్ఛ ఉంటుంది. 1. రాజకీయాలు 2. ధూమపానము 3. మద్యపానము 4. సంభోగము. ఇవి మాత్రమే నిషేధములు.

సాధకుల ఆరోగ్యం కోసం అత్యంత జాగ్రత తీసుకోబడుతుంది. పెద్దలు, చిన్నలు, యువకులు, వృద్ధులు వీరందరి మానసిక శారీరక పోషణకు అభివృద్ధికి తగినంత శ్రద్ధ తీసుకోబడుతుంది.

నేటి వరకు మానవులు సాధించిన విజయములు ఎంత ఘన మైనవైనప్పటికి మన లక్ష్యసాధనకు అవి నిష్ప్రయోజనములు. మానవ మాత్రులు తయారుచేసే గొప్ప గొప్ప ప్రణాళికలను ప్రయోగించేందుకు విశాల ప్రపంచం ఉండనే ఉంది.

మా ఉద్దేశం వేరు. మా లక్ష్యం వెంటనే సిద్ధించక పోవచ్చు. మరేమీ భయం లేదు. భవిష్యత్తును సిద్ధం చేసే ప్రయత్నం మనది. బాహ్యదృష్టికి మేము బాహ్య ప్రపంచపు ప్రమాణాల దరిదాపులలో లేకపోవచ్చును. మన ఆశయం వేరు. మానవ కొలమానానికి అతీత మైనది. మన ప్రయత్నము భవిష్య జీవనమునకు చెందినది.

ఈ ఆశ్రమము నూతన ప్రపంచ నిర్మాణమునకై ప్రతిష్టించ బడినది. ఇది ఒక nursery అన్న మాట.

ఈ ఆశ్రమానికి ప్రేరణ పైనుంచి తిన్నగా దిగి వచ్చినది. దీనిని నడిపించే శక్తి పైనుండి దిగివచ్చినదే. పైనుంచి వచ్చిన సృజన శక్తియే ఇక్కడ క్రియాన్వితమై నూతన ప్రపంచ అవతరణ కోసం పని జేస్తుంది.

It is only by its shortcomings, its deficiencies and its failures that the Ashram belongs to the present world.

నేటి ప్రపంచకం యొక్క ఘనవిజయములేమియు ఈ ఆశ్రమ మును కష్టాలనుంచి తప్పించలేవు.

సాధకులందరు పూర్తిగా పరివర్తనముజెంది పైనుంచి దిగి వస్తున్న జ్యోతి శ్శక్తులను గ్రహించగలిగినప్పుడే, తమ అంతరంగం లోకి స్వీకరించుటకు ఒక పాత్రగా తయారైనప్పుడే, మన సమస్యలు తీరిపోవును.

ఈ కార్యము క్లిష్టమైనది అనుటలో ఏమి అనుమానము లేదు. *అయితే దానిని నిర్వర్తించేందుకు మాకు పైనుంచి ఆజ్ఞ వచ్చినది.* అందుకనే మేము ఈ భూమి మీద ఉన్నాము.

తిరుగులేని విశ్వాసంతో దైవం మీదనే భారం ఉంచి ఆయన అనుగ్రహంతో మన మీ కార్యాన్ని చివరి వరకు కొనసాగించెదము.

ఈ లక్ష్య సిద్ధికి ఎవ్వరైతే వారి జీవితాన్ని అంకితం చేయు దురో అట్టి వారికోసం మా ద్వారాలు తెరిచే ఉంటాయి.

జీవితం మీద మనుషుల మీద విసుగు, యోగం వైపుకు మళ్ళేందుకు కారణం కాగూడదు.

కష్టాలనుంచి తప్పించుకుని పారిపోయిన వాళ్ళకు యిది స్థానం కాదు.

భగవంతుని యొక్క ప్రేమ, మాధుర్యములు, రక్షణల కోసం కూడా యిక్కడకు రానవసరం లేదు. ఎందుకంటే మనిషి ఎక్కడున్నా సరే యివన్నీ లభ్యములే.

దైవానికి పూర్తిగా సేవాతత్పరతతో దైవకార్యమునకై పూర్తిగా అంకితమైనవారు, ఎటువంటి ప్రతిఫలం కోరకుండా తమను తాము సమర్పించుకొని సేవాంకితులై ఉన్నవాళ్లు భగవంతుని సేవ మినహా యింకేమి కోరనివారు యిక్కడ కొచ్చేందుకు అర్హులు. అట్టి వారికి ద్వారములు ఎప్పుడూ తెరిచే ఉంటాయి.

*

మాకు మతంతో పని లేదు. దాని స్థానంలో అంతకంటే ముఖ్యమయిన యధార్థమైన ఆధ్యాత్మిక జీవితం — దైవానికి సమీపంగా, లోతైన ఉన్నతమైన ఆధ్యాత్మికమైన జీవితం ఉన్నది. ఎందుకనగా దైవము దేనిలో లేడు? అన్నిట్లోను ఉన్నాడు. కాని ఆ సంగతి మనకు తెలీదంతే. ఆ జ్ఞానం పొందేందుకే మనం కృషి చేయాలి.

*

మాకు ఏ మతంతోను భేదాభిప్రాయం లేదు.

మాకు ఏ విధమైన ప్రభుత్వ విధానం తోటి విరోధం లేదు. సమాజ వర్గములతో విరోధము లేదు.


మాకు ఏ దేశంతో గాని వర్గంతో గాని విరోధం లేదు.

విచ్ఛిన్నత, అచేతన, అజ్ఞానము, తమస్సు, జడత్వము, అసత్యము ఇవియే మా విరోధులు.

సంఘీభావము, జ్ఞానము, చేతన, సత్యము వీటిని ప్రతిష్ఠించేందుకే మా కృషి.

జ్యోతిశ్శాంతిమయము సత్యప్రేమమయమైన నూతన సృష్టిని వ్యతిరేకించే శక్తులే మా విరోధులు.

అనువాదము: డి. సత్యవాణి



....చరిత్రలో శ్రీఅరవిందుల స్థానము ఒక ప్రవక్తగాగాని, ద్రష్టగాగాని కాదు. ఆ పరమాత్మ నుండి తిన్నగా అరుదెంచిన నిశ్చయ కార్యము. ఆ కార్యమునే నేను నెరవేరుస్తాను.

శ్రీమాత

ఆశ్రమంలో సామూహిక జీవనం

లౌకిక జీవితానికి మూలాధారాలు:

శ్రీఅరవింద వాణి:

ఇక్కడ భౌతిక జీవితానికి రెండే రెండు మూల సూత్రాలున్నాయి. మొదటిది ఆత్మ ప్రదానము, సమర్పణ. తను దైవానికే చెందుతాడు. తనకున్నదంతా దైవానికే చెందుతుంది. సమర్పించుకుంటున్నది కూడా తన స్వంతమేమియు కాదు. అది ఇంతకు ముందరే దైవానికి చెందినది. ఈ ఆశ్రమంలో ఇచ్చి పుచ్చుకోటాలకు, బేరసారాలకు, గొంతెమ్మ కోరికలకు ఏ విధమైన ఆస్కారము లేదు. శ్రీమాతయే సర్వాధికారిణి. సాధకుల దక్షతను బట్టి తన దగ్గిర ఉన్న వస్తువులను బట్టి ఆమె ఉచితమైన ఏర్పాట్లను చేస్తుంది. నిర్వహిస్తుంది. సాధకుల తెలివి తేటలతో గాని, ప్రాణికమైన వాంఛలతోగాని, హక్కులతోగాని ఆమెకు పని లేదు. ప్రజాస్వామ్యపు నిబంధనల ప్రకారం నడచుకోవలసిన అవసరం అంతకంటే లేదు. సాధకుని నిజమైన అవసరం ఏమిటో అతని ఆధ్యాత్మిక పురోగమనమునకు ఏది అత్యవసరమో దాని ప్రకారం ఆమె ఏర్పాట్లు చేస్తుంది. ఆమె చేయు కార్యముల మంచి చెడ్డలను గురించి ఎవ్వరూ విచారించరాదు. తమ ఇచ్ఛలను, ప్రమాణములను ఆమెపై విధించలేరు. ఆమెయే నిబంధనలను చేస్తుంది. అవసరమైతే వాటిని ఉల్లంఘిస్తుంది కూడా. అయితే ఫలానా విధంగా చేయాలని ఆమెనెవరూ శాసించలేరు. తమ వ్యక్తిగత వాంఛలను కోర్కెలను ఆమెపై విధించలేరు. ఎవరికైనా తమకి నిజంగా ఏదైనా ఒకటి అవసరమయితే లేక తన కార్యరంగంలో ఒక సలహాను గాని ఇవ్వాలనిపించినట్లయితే అటుల చేయవచ్చును. ఆమె దానికి ఒప్పుకోక పోయినప్పటికీ తృప్తిచెంది ఆ విషయాన్ని అంతటితో ముగించాలి. దివ్య సత్యమును తనలో ధరించి దానికి కేంద్రమై భాసించే దేవతపట్ల మనము చూపించవలసిన ఆధ్యాత్మిక మర్యాద ఇదియే. ఇదే నిజమైతే ఇక ఏ సమస్యా లేదు. ఇది నిజం కాదన్నవాళ్ళు ఇక్కడనుండనవసరం లేదు.

ప్రతి ఒక్కరు యథేచ్ఛగా వారివారికి తోచినట్లు నడుచుకోవచ్చు. ఇక యీ ఆశ్రమమూ యోగమూ ఎందుకు?

ఒక వేళ ఆశ్రమంలో జేరేందుకు తయారుగా లేక ఇక్కడ నియమావళిని పాటించలేని వాళ్ళు కూడా కొంతమంది యీ ఆశ్రమంలో ఉండవచ్చు. వాళ్ళు వేరుగా ఉండి తమ ఖర్చులను తామే భరించుకుంటారు. భౌతిక జీవితం దృష్ట్యా వారికేవిధమైన నిబంధనలూ లేవు. శ్రీమాతకు వారి విషయంలో లౌకిక బాధ్యత లేదు.

*

ఇక్కడ లభ్యమయ్యే దానిలో పదవ వంతుకూడా వీళ్ళు (సాధకులు) మరే ఇతర ఆశ్రమంలోనూ పొందలేరు. అన్నిరకాల అసౌకర్యాలని, కఠినమూ విషమమూ అయిన నిబంధనల్ని భరించాలి. ఓర్చుకోలేక ఫిర్యాదు చేస్తే యోగాభ్యాసానికి అనర్హులు అనిపించుకుంటారు. ఇక్కడ అందుకు భిన్నముగా ఉన్నదీ అంటే, కోరికల్ని తీర్చుకొనేందుకు అని కాదు. కోరికలను తీర్చగల సాధనాల్ని పరికరాల్ని దూరం చేసుకుని కాక, వాటి సమక్షంలోనే ఆకాంక్షను అదుపు చేయగల స్థితిని సాధించాలి అని! యోగసాధనలో మొట్టమొదట నియమం ఏమంటే: తనకు లభించినది స్వల్పమైనదైనా, అనల్పమైనదైనా సాధకుడు తృప్తి చెందాలి. ఏవస్తువులైనా అందుబాటులో ఉన్నప్పుడు వాటిని ఒక అనుబంధంతో కాంక్షతో కాకుండా ఉపయోగించుకోగలగాలి. అవి దొరకనప్పుడు ఆ కొరతను పట్టించుకోనంత నిర్వికారంగా ఉండగలగాలి.

ఆర్థికమైన ఏర్పాట్లు:

శ్రీఅరవిందుల పలుకులు:

ధనపరమైన ఏర్పాట్లు గురించి నిరంతరం పెరిగే సభ్యుల సంఖ్యతో ఈ ఆశ్రమాన్ని పరిపోషించడం, వనరుల్ని, వ్యయాన్ని సరితూచడం, ఒక్కోసారి లోటు పద్దుల్ని, వాటి ఫలితాన్ని ఎదుర్కోవడం మదర్‌కు, నాకు బహు జటిలమైన కార్యమవుతుంది. ముఖ్యంగా ఖర్చులు అనూహ్యంగా, అపరిమితంగా పెరిగి పోయిన ఈ యుద్ధ సమయాన, ఇటువంటి సంస్థాగత నిర్వహణకు అలవాటు పడిన వారికి

లేదా ఇదే రకం బాధ్యతల్ని తలకెత్తుకున్నవారికి మాత్రమే మా పరిస్థితి అవగతమవుతుంది. ఎటువంటి స్థిర ఆదాయమూ లేకుండా ఇంతటి బృహత్తర కార్యక్రమమేదైనా నడపడమనేది ఒకానొక దైవిక శక్తి సారథ్యం లేకుండా సాధ్యపడే విషయమే కాదు. దానధర్మ కార్యక్రమాలు మా కృషిలో భాగం కాదు. మా మతం కాదు. మేము చేపట్టిన కార్యక్రమం కోసమే మేము ఖర్చు పెట్టగలం. ఇక్కడ అవసరమయ్యే సొమ్ముతో పోలుస్తే మాకు వచ్చేది ఏ మూలకూ చాలదు. మామూలు మార్గాల్లో డబ్బు సంపాదించి పెట్టే కార్యకలాపాలు మేం చేపట్టలేము.

మదర్ పలుకులు:

ఎవరికీ డబ్బును ఆశిస్తూ వ్రాయడం నాకు అలవాటు లేదు. దైవికమైన ప్రయోజనానికి తమ సొమ్మును ఇవ్వగలగడమనేది తమకు దొరికిన ఒక గొప్ప అవకాశం, దైవకృప అని పదుగురూ అనుకోకపోతే పోనివ్వండి! మనం తలపెట్టిన పనికి సొమ్ము కావాలి. సొమ్ము వచ్చితీరుతుంది. ఆ సొమ్మును యిచ్చే భాగ్యం ఎవరికి దొరుకుతుందనేది చూడాలి.

*

మేము ఈ మనుషుల నుంచి ధర్మం అడగటంలేదు. తమ తమ ఆత్మలకు సన్నిహితమయ్యేందుకు ఇది వారికి ఇవ్వబడిన ఒక అవకాశం.

వ్యవస్థ — నియమము:

శ్రీఅరవింద వాణి:

ప్రతి వాళ్ళు తమకు తాముగా విధించుకున్నది తప్ప ఎటువంటి క్రమశిక్షణ లేకుండా ఉండాలనా నీ ఉద్దేశము. ప్రతి ఒక్కరు వాళ్ల కోసమే ఉంటూ బాహ్య జీవితంతోటి సంబంధం లేకుండా, సామూహిక జీవితంగాని, సామూహిక కార్యక్రమముగాని మరి యే విధమైన ప్రణాళిక గాని లేనట్లయితే అటులనే చేయవచ్చును. కాని మన పరిస్థితి వేరు. మన ప్రణాళికలో జీవితానికి, కర్మలకు, భౌతిక ప్రపం

చానికి మౌలికమైన పాత్ర ఉన్నది. నేను చేస్తున్న ఉద్యమంలో ఆధ్యాత్మికోపలబ్ధి ప్రథమ లక్ష్యము. కాని బాహ్య జీవితంలోను మానవుల లోను ప్రపంచకంలోను అది ప్రతిబింబించకపోతే అది అసంపూర్ణము. అంతరంగికంగా ఆధ్యాత్మిక చైతన్యము కావలసినదేగాని అంతటితో సరికాదు. బాహ్య ప్రపంచకంలో గూడా ఆధ్యాత్మిక సరళి కావలసినదే.... అటువంటి ఉద్యమానికి ఈ ఆశ్రమం నాంది. దాని పూర్వరంగమునకు క్షేత్రం. శ్రీమాత దీనినంతటినీ ఈ ఆశ్రమాన్నంతటినీ సమర్థవంతంగా నిర్వహించాలి. అందులకు అవసరమైన నిబంధనలు, క్రమశిక్షణ అనివార్యములు. సాధకుల అహంకారమునూ మానసిక అభిమానములను రాజసిక ప్రకృతిని అధిగమించేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరం. ఈ ప్రతిబంధకాలనన్నింటినీ దాటి పోయినట్లైతే బాహ్య నిబంధనల అవసరం తీరిపోతుంది. వాటి అవసరం అంత ఉండదు. అప్రయత్నంగానే అందరి మధ్యన ఐక్యత, పరస్పర అంగీకారం, సామరస్యము, అప్రయత్నంగానే సరియైన నడక, వాటంతట అవే జరిగిపోతాయి. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో నిబంధనల్ని, క్రమశిక్షణను తోసి రాజని సాధకులు వారి వారి యిష్టానుసారం విజృంభించి నట్లయితే వైఫల్యం, విషాదమే పర్యవసానాలు అవుతాయి.

*

ఈ ఆశ్రమంలో కనిపించే ఈ క్రమశిక్షణ, పద్ధతి మదర్ స్థాపించి, రూపుదిద్దినది. ఏ సామూహిక కృషికి అయినా ఆ పద్ధతి, శిక్షణ అవసరం. బయటనుంచి ఆశ్రమానికి వచ్చేవారందరికీ ఇది విస్మయానంద హేతువయింది. అసలు ఈ కారణం చేతనే ఆశ్రమం ఇలా నిలబడ గలిగింది. లేకపోతే ఎందరివో ప్రతికూల ప్రచారాల్ని తట్టుకోలేక ఎంతో కాలం క్రిందటే మాయమై ఉండేది.

సాధకులు సిద్ధి పొందనంత వరకూ తమను తాము నియంత్రించు కొనవలసినదే. ఏ విషయంలోనైనా అతి వృష్టిగా ప్రవర్తించుట గాని, నిర్లక్ష్యము, లోభత్వము పనికి రావు. యథేచ్ఛా ప్రవర్తనము నిషేధము. ఎవరిష్టము వచ్చినట్లు వాళ్లు ప్రవర్తించేందుకు వీల్లేదు. ఒకవేళ ఎవ్వరైనా అటుల ప్రవర్తించి నప్పటికి శ్రీమాత వారిని ఏమనరు. అడుగడుగునా ఏమి చేయవలెనో ఎటుల చేయవలెనో శ్రీమాత చెప్పరు.

ఆమె ప్రేరణ ఆంతరంగికంగానే ఉంటుంది. ఆమె లోపలనించే నిర్దేశిస్తుంది. *సాధకులు ఆంతరంగిక చైతన్యంలో పెరిగి శ్రీమాత స్ఫూర్తిని పొందటం నేర్చుకోవాలి. ఆమె శక్తిని సహాయమును అంతరంగికంగా పొందాలి*... సాధకులు తప్పులు చేసినట్లయితే తద్వారా పాఠాలు నేర్చుకోవాలి. ఇటువంటి ఘటనలు అంతరంగికాభివృద్ధికి గొప్ప అవకాశములు. నోటి తోటి చెప్పకుండా తన చైతన్యాన్ని పెంచుకోవటం ద్వారా సాధకుడు శ్రీమాత నిర్దేశమును అంతరంగికంగానే పొందటం నేర్చుకోవాలి.

*

తన లక్ష్య సాధన నిమిత్తం ఆశ్రమ నిర్వహణనంతటినీ వ్యవస్థీకృతం చేసేందుకుగాను వివిధ విభాగాధిపతుల్ని స్వయంగా శ్రీమాతయే ఎంపిక చేశారు. పని తాలుకు పోకడలన్నీ, చిన్నా పెద్దా వివరాలన్నీ ఆమె ఏర్పరచి, ఆ యా శాఖల అధినేతలు తమ విధానాలను అనుసరించే శిక్షణ ఇచ్చిన తరువాతగానీ ఆమె వెనక్కి తప్పుకుని, మొత్తం వ్యవహారాన్ని తన ధోరణిలో సాగించే అనుమతి నివ్వలేదు. ఇప్పుడు కూడా నిరంతరం ఒక కన్ను వేసే వుంచుతారు. అయితే సాధకులు, కార్యకర్తలు తాము ఇక్కడ ఉన్నది తమ అహాన్ని ప్రకటించుకునేందుకు, భౌతికమైన, శారీరకమైన వ్యామోహాలకు లొంగిపోయేందుకు కాదని, *కోరికలను పాతమార్చి దాని స్థానే దివ్యసత్యాన్ని దైవేచ్ఛను స్ఫురింపచేసే మహోన్నతమైన కఠోర యోగసాధన కోసమని గుర్తించనంత కాలం ఏదీ పరిపూర్ణం కాజాలదు.*

*

ఆశ్రమంలో స్వతంత్ర కార్యకలాపాలుండవు. అంతా నియమం ప్రకారం, పరస్పర సంబంధింతంగా ఉంటుంది. వివిధ శాఖల అధిపతులుగానీ, కార్యకర్తలుగానీ, ఎవరూ స్వతంత్రంగా వ్యవహరించరు. ఒకరి మాటను ఔదల దాల్చడం, పరస్పరంగా సహకరించడం అనేది నేర్చుకోవడం ఏ సమిష్టి కృషికైనా అవసరం. అది లేకపోతే అంతా గందరగోళమే.

శ్రీమాతృవాణి:

ఆశ్రమంలో బాహ్యమైన క్రమశిక్షణ, కంటికి కనిపించే పరీక్ష ఉండవు. అయితే అంతరంగికమైన పరీక్ష మట్టుకు నిరంతరం ఉంటుంది. చాలా కఠినంగా ఉంటుంది. ఇక్కడ ఉండగలిగేందుకు గాను అన్ని విధాల అహాన్ని అధిగమించే ఆశయ సాధనలో, అన్ని వ్యామోహాల్నీ జయించే యత్నంలో చాలా చిత్తశుద్ధితో కృషి చెయ్యాలి.

పూర్తి సమర్పణ అనేది బయటికి కఠినంగా తోచదుగానీ ఇక్కడే ఉండిపోవాలని కోరుకునే వారికి అది అనివార్యం. అలా తనను తాను సమర్పించుకునే వారి నిజాయితీని పరిక్షించేందుకు ఎన్నో ఘటనలు సంభవిస్తాయి. అయితే దైవానుగ్రహం, సహాయం కోసం తహతహలాడే వాళ్ళకు అవి నిరంతరం వుంటాయి. వాటిని పూర్తి నమ్మకంతో, విశ్వాసంతో స్వీకరించి నట్లయితే, వాటి శక్తి అమేయం. ఆశ్రమంలో నిర్లక్ష్యంగా పనిచేయటం ద్రోహం.

*

ఆశ్రమవాసుల మధ్య మైత్రి:

శ్రీఅరవింద వాణి:

ఆశ్రమవాసులు ఒకరి నొకరు పూసుకొని తిరగటాన్ని శ్రీమాత ఎక్కువ ప్రోత్సహించలేదు. (అయితే సౌహార్దము, గౌరవము, మర్యాద వుండవలసినవే) ఏలన మన ముఖ్యోద్దేశమది కాదు. నవచేతనలో ఏకమవుట ముఖ్యము. అందుకని ప్రతి ఒక్కరు సాధన చేసి నూతన చైతన్యమును పొంది తద్వారా ఏకత్వము సాధించాలి.

యోగము యొక్క మౌలిక సూత్రమొక్కటే — నీ సమస్త వ్యక్తిత్వమును దైవానికి — మరి యే యితర శక్తులకుకాక — దైవానికే దత్తము చేయుట. దివ్యమాత శక్తితో సాయుజ్యము పొంది, తద్వారా అతిమానస దైవము యొక్క లోకాతీత దివ్యజ్యోతి శక్తులను, విశాలత్వమును (wideness), శుద్ధత్వమును (purity), సత్యచేతనను, ఆనందమును నీ లోనికి దింపుకొనుట. అందుకని ఈ యోగములో యితరు

లతో ప్రగాఢమైన ప్రాణిక సంబంధములు నిషేధములు. అటుల జేసిన యెడల నీ యాత్మ నిమ్నచైతన్యమునకు కట్టుబడి దాని నిమ్న ప్రకృతి వ్యాపారముల అధీనములో వుండుట వలన దైవముతో సంపూర్ణ సాయుజ్యమును పొందలేదు. విజ్ఞాన చేతనా భూమికను (supramental Truth-consciousness) అధిరోహించ లేదు. అతిమానస ఈశ్వర శక్తిని నీలోకి దింపుకొనజాలదు.

మాతృవాణి:

ఆశ్రమం ఎంతటి లౌకికమైన, చైతన్యభరితమైన సాంద్ర ప్రశాంతతతో పరిఢవిల్లుతూంటుందంటే, బయట నుంచి వచ్చే సందర్శ కులు మరో ప్రపంచంలో ఉన్నట్లు అనుభూతి చెందుతూంటారు. నిజంగానే ఈ ప్రాంగణం మరొక ప్రపంచానికి చెందినది. బాహ్య జీవితము అంతరంగికానుభూతి ననుసరిస్తుంది. వ్యక్తిగత ప్రయోజనం కోసంకాక, స్వార్థరహితంగా పనులు చేసే లోకం. ఒక ఆదర్శాన్ని వాస్తవం చేసుకునేందుకు కృషి సలిపే ప్రపంచం. ఇక్కడ మేము గడిపే జీవితం సర్వసంఘ వైరాగ్యానికి ఎంత దూరమో, బలహీన పరిచే సౌఖ్యానికీ అంతేదూరం. ఆర్భాట రాహిత్యం ఇక్కడ నియమం. అయితే ఆ నిరాడంబరత ఎంతో వైవిధ్య భరితం. వైవిధ్యమైన వృత్తులు, వేర్వేరు కార్యక్రమాలు, విభిన్న అభిరుచులు, పరస్పరం పోలిక లేని ధోరణులు, విభిన్న స్వభావాలు. ఇక్కడ ప్రతి ఒక్కరికీ తన జీవితాన్ని తనకు నచ్చినట్లు మలచుకునే స్వేచ్ఛ ఉన్నది. ఇందరి ఉనికిని క్రమబద్ధీ కరించేందుకు, మన యోగపరమైన లక్ష్య సాధనకు అవరోధం కలి గించే చర్యల్ని నిరోధించేందుకు క్రమశిక్షణ కనిష్ట స్థాయిలో మాత్రమే వుంటుంది.

అనువాదం: ఘంటసాల నిర్మల

ఆశ్రమంలో పనుల వైశిష్ట్యము

శ్రీఅరవిందుల ప్రవచనములు:

ఇది ఇతర ఆశ్రమముల వంటిది కాదు — ఈ ఆశ్రమవాసులు సన్యాసులు కారు. మా యోగలక్ష్యం మోక్షం కానే కాదు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారము ఒక కార్యమునకు శిక్షణ — ఆ కార్యమునకు యోగచైతన్యము, యోగశక్తి ప్రాతిపదికలు. మరియే ప్రాతిపదికలు అందుకు పనికిరావు. దీనికి ఇక్కడి సభ్యులందరూ ఈ ఆధ్యాత్మిక సన్నాహంలో భాగంగా ఆశ్రమంలో ఏదో ఒక పని విధిగా చేయాలి.

*

నీవు రాసినదాన్ని బట్టి పనంటే నీకొక దురభిప్రాయం ఉన్నట్లుంది. ఈ ఆశ్రమంలో పని మానవసేవగా గానీ, అథవా ఆశ్రమవాసుల సేవార్థమై చేయునది కాదు. ఇంకా చెప్పాలంటే ఇది సరదాగా సామాజిక జీవనం గడుపుతూ సాధకుల మధ్య అనుబంధ సంబంధాలు యథేచ్ఛగా కొనసాగించుకొనేందుకు సాధనం గాదు. అందరితో గానీ కొంతమందితోగానీ ప్రియ భాషణములు, అనుబంధనములు, ప్రాణికానుభూతుల వినిమయమునకు ఒక సదవకాశమూ కాదు. *పని అంటే దైవానికి చేసే సేవగానూ, అంతర్గతంగా దైవానికి ఉన్ముఖులు కావటానికి భూమికగాను ఉండాలి.* దైవానికి మాత్రమే స్వాధీనుడవటానికి, అహాన్ని నిరాకరించడం, సాధారణ భావావేశాలను నిరాకరించడం, చైత్యోన్నతి కోసం శిక్షణ పొందటం, నిస్వార్థం, వినయం పెంపొందటం, పరిమిత వ్యక్తిత్వానివే అయిన మనస్సు, ప్రాణికం చేసే స్వంత ప్రతిపాదనలను వదిలించుకోవడం ఇత్యాదుల ప్రయోజనం కోసం పనిచేయాలి. ఆత్మ నిర్దేశము ఇక్కడ ఆదర్శం కాదు. సమూహ జీవాహంకార ఘటన ఒక లక్ష్యమూ కాదు. ఆ చిన్న అహంకారం భగవంతునితో పూర్తిగా ఐక్యం కావటం, పవిత్రీకరణం, శరణాగతి, వ్యక్తిగత భావనలు, అనుభూతులు ఆధారం చేసుకొని సాగే అజ్ఞానాత్మకమైన స్వంత ఆత్మకు లోబడి నడుచుకోటానికి బదులుగా భగవంతుని

అధ్యక్షతలో నుండటం కర్మయోగ లక్ష్యం. అంటే మానవేచ్ఛను దైవేచ్ఛకు స్వాధీనం చెయ్యాలి.

భగవంతుడు దూరం, మానవులైతే దగ్గర కదా అని సూటిగా దైవారాధన, దైవప్రేమకు బదులుగా మానవసేవ, మానవప్రేమల ద్వారా భగవంతుని చేరాలని చూస్తే అది తప్పుదారే — అది మానసిక, ప్రాణిక, నైతిక మార్గమే గానీ ఆధ్యాత్మిక జీవనం మాత్రం కాదు.

*

ఇక్కడ పని చేయడం పూర్ణయోగపు కర్మ యోగాంగమును ఆచరణలో పెట్టేందుకు అవకాశము. అంటే యోగానుగుణంగా పని చేయడం, సేవతో అంకితమవడం, స్వార్థ రాహిత్యం, వినయం, సూక్ష్మ కుశలత, క్రమశిక్షణ, స్వార్థాన్ని వెనక్కు నెట్టి దైవాన్ని ముందు బెట్టుట, దైవానికి ప్రాధాన్యతనియ్యడం, సామరస్యం, ఓర్పు, సహనం మొదలైనవన్నీ నేర్చుకోవడానికి పని ఒక చక్కని అవకాశం.

*

ఇక్కడ పని అంటే అజ్ఞానాహంకారాలు అహంకార పరితృప్తి కోసం, రాజసిక ప్రవృత్తి వల్ల చేసే చర్య కాదు. అజ్ఞానాంధకారానికి ప్రతీకలైన అహంకారాన్ని, రాజసాన్ని, కామాన్ని జయించే సంకల్పం లేనిది కర్మయోగమే కాదు.

జనహిత కార్యకలాపాలు, మానవసేవ మొదలైన నైతిక, ఆదర్శాత్మక కార్యాల గురించి నేను చెప్పటం లేదు. ఇవన్నీ పనిలో నిగూఢ సత్యానికి బదులుగా మనుష్యులు కల్పించుకునేవి మాత్రమే.

దైవం కోసం, దైవంతో ఏకత్వం కోసం చేసేదే పని. ఇతరమైన దానికి దేనికి కాకుండా కేవలం దైవం కోసమే. ప్రారంభంలో ఇది ఏమంత తేలిక కాదు. అయినప్పటికీ సరైన భావ వైఖరితో, యుక్త సంకల్పంతో ప్రారంభిస్తే మిగిలినవన్నీ వాటంతటవే వస్తాయి.

*

పనే ఒక యోగం:

పని ఆవశ్యకత ఆంతరంగికంగా చైత్య, ఆధ్యాత్మికాభివృద్ధి చెందటమే కాని, ఆ పని జరగటం అనేది ముఖ్యం కాదు. అయితే పనే

శ్రీమాతకి అర్పితంగా చేస్తే అది సాధనలో భాగంగా, ఆంతరికాభి వృద్ధికి మార్గంగా అవుతుంది. నీలో చైత్యకం (psychic) వృద్ధి పొందు తూంటే నీకిది బాగా తెలుస్తుంది.

*

పని యోగంలోని భాగం. అది ప్రాణికంలోకి, దాని చర్యల లోకి దైవత్వాన్ని, తేజస్సును, శక్తిని నింపుకోడానికొక చక్కని అవకాశం. శరణాగతి పొందటానికి అవకాశాన్ని, ఆ క్షేత్రాన్నీ కూడా విస్తృత పరుస్తుంది.

చేసే పని శ్రీమాతది, దాని ఫలితాలు శ్రీమాతవే అని జ్ఞాపకం చేసుకున్నంత మాత్రాన సరిపోదు. నీ వెనుకనున్న శ్రీమాత శక్తులను గమనిస్తూ ఆమె ఉత్ప్రేరణకూ, అధ్యక్షతకూ ఉన్మీలుడవటం నేర్చు కోవాలి. ఎప్పుడూ ప్రయత్న పూర్వకంగా మనస్సుతో గుర్తుంచుకోవా లంటే చాలా కష్టం. అలాకాకుండా సదా శ్రీమాతశక్తి నీలోనూ, నీకా ధారంగానూ ఉన్నట్లు గమనించే చైతన్యాన్ని పొందటమే యుక్తమైనది.

*

దీని కోసమని ఒక సాధారణ వైఖరి నవలంబించటమే కాకుండా, ఆ వైఖరి సదా నిలిచి ఉండేటట్లుగా చేయాలంటే చేసే ప్రతి ఒక్క పనినీ శ్రీమాతకి అర్పించాలి. పనిచేసేటప్పుడు ధ్యానం పనికి రాదు. దాని వల్ల పనిమీద ధ్యాస తగ్గిపోతుంది. అయితే నీవు ఏ దైవానికి అర్పణగా ఆ పని చేస్తున్నావో చేసినంతసేపూ వారిని స్మరిస్తూనే ఉండాలి. ఇది మెదటి సూత్రం మాత్రమే. పైన మనస్సు పనిచేస్తూంటే లోపల మాత్రం దైవసన్నిధిలో ఓలలాడుతున్నట్లుగా నిరంతరం ఒక చల్లని ప్రశాంత భావాన్ని నీవనుభవిస్తూ ఉన్నా లేక శ్రీమాత శక్తే పనిని చేస్తున్నట్లు నీవొక ఉపకరణం మాత్రమే ననే భావన ప్రారంభమైనా ఇక స్మరణకు బదులుగా దైవంతో నిరంతర సంయోగం జరుగుతున్న సిద్ధి మొదలవుతుంది. అదే పనిలో సాదృ శ్యతాముక్తి.

*

ఇది చేయాలంటే ఒకే ఒక మార్గముంది. 1. నీ మనస్సు మొద లైన వాటిని ఉపయోగించుకుంటున్న చైతన్యాత్మక శక్తిని నీవు తెలు

సుకోవాలి. 2. అభ్యాసం ద్వారా ఆ శక్తిని గమ్యంవైపు తరలించడం నేర్చుకోవాలి. ఈ రెండింటిలో ఏ ఒక్క దాన్నీ వెంటనే నీవు సులభంగా చేయగలుగుతావని నేననను కానీ — ఇంతకు ముందెన్నడూ చేయని విధంగా, ఇంకా నిగూఢతర ఆంతర చైతన్యంలో మనగలగటం మొదట నేర్చుకోవాలి.

శ్రీమాత వాణి:

ఇక్కడ ఒక వ్యవస్థకు అంకురం ఏర్పడినట్లు, దాని సమన్వయీకరణకి కేంద్రంగా ప్రత్యక్ష దైవ చిహ్నం ఉన్నట్లు నీవు గమనించగలవు. సకల జగత్ప్రభువైన ఆ సర్వేశ్వరుని చిహ్నమే అది. ఇక్కడ జరుగుతున్న ప్రతి పని సర్వోపగతుడైన ఆ పరాత్పరునికి అంకితంగానే జరుగుతుంది. ఈ పనులన్నీ వ్యక్తిగత లాభనష్టాల ప్రమేయం లేకుండా ప్రేమ పూర్వక సమర్పణగా జరుగుతాయి. ఎందువల్లనంటే ఇక్కడ ప్రచలితమైయున్న శక్తి, ప్రేమాన్విత శక్తి మాత్రమే. నేను ఒక చిహ్నంగా వారి ప్రయత్నాలను కూడగట్టి నడిపించటానికి, దారి చూపించడానికి అక్కడున్నాను అంతే.

*

నీవు ఇక్కడ ఆశ్రమంలో నివసిస్తూండటం వల్ల నీవు పని చేస్తున్నది నీ కోసంగానీ, నీ పై అధికారి కోసంగానీ కాదు, దైవం కోసమేనని మరచి పోతున్నట్లున్నావు. నీ జీవితం పూర్తిగా దైవ కార్యానికే సమర్పితం కావాలి. అప్పుడది సాధారణ మానవత్వ కోరికలచే శాసించబడదు.

*

దైవం కోసం పనిచేయడమంటే శరీరంతో ప్రార్థన చేయడమే.

అనువాదము: అమరవాది వెంకట్రామ శాస్త్రి, అమరవాది ప్రభావతి

శ్రీమాతతో ధ్యానము

శ్రీమాత ప్రవచనములు:

మనం అదివరలో ఉదయమైనా సాయంత్రమైనా ఆశ్రమంలో చేసే ధ్యానంలో నా పని ప్రతి ఒక్కరి చైతన్యాన్ని ఒక్కటిగా చేసి దైవం వైపుగా ఎంతపైకి వీలైతే అంతపైకి లేవనెత్తడం. కొంతమంది ఈ చలనాన్ని గమనించి అనుసరించ గలిగే వారు. ఇది ఒక ఆకాంక్షతో దైవం వైపుకి ఆరోహించాలని చేసే సాధారణ ధ్యానం. ఇక్కడ ఈ క్రీడా మైదానంలో ఇక్కడున్న వారినందర్నీ ఏకోన్ముఖులుగా చేసి, వికసితులను చేసి దివ్యశక్తి వారిలో ప్రవేశించేటట్లు చేయడం నా పని. ఇవి రెండు పరస్పర విరుద్ధాలు కావటం వలన ఒక ధ్యానం స్థానంలోకి రెండవది రాదు. ఇక్కడ జరిగేది అపూర్వమైనది — ఆశ్రమంలో జరిగే ఆ ధ్యానంలో అందరి చైతన్యాన్ని ఏకం చేసి ఆకాంక్షతో దాన్ని భగవంతుని వైపుకి లేవనెత్తేదాన్ని. అందుమూలంగా ప్రతి ఒక్కరూ కొంచెం ప్రగతిని సాధించేవారు. ఇక్కడ ఆ విధంగా గాకుండా మిమ్మల్ని ఉన్న పాళంగానే స్వీకరిస్తాను. ప్రతివారు ఈ విధంగా "మేమందరం దైనిక కార్యక్రమాలతో మీకు సమర్పించుకుంటున్నాము. రోజంతా మా శరీరం పనిలో మునిగిపోతుంది కాబట్టి దానిని యథాతథంగానూ, ఉన్నదున్నట్లు మా కదలికలన్నిటినీ నీకే అర్పణ చేస్తున్నాము" అనుకుంటూ వస్తారు. అప్పుడిదంతా కలిపి క్రోడీకరించి దానికి సమాధానంగా (ఎవరికి తోచిన పద్ధతిలో వారు చేయవచ్చు) ప్రతి ఒక్కరి చైతన్యాన్ని వికసింప చేసి, వారి గ్రహణశీలతను విస్తృత పరచి, అదంతా కూడగట్టి అందులోకి శక్తిపాతం జరిగేటట్లు చేస్తాను. కాబట్టి ఆ సమయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధాళువులై, నిశ్శబ్దంగా ఉంటే ఏదో కొంత గ్రహించగలరు. ప్రతిసారీ గమనించటం జరగదుగానీ మీరు మాత్రం ఏదో కొంత అందుకుంటారు.

అనువాదము: అమరవాది వెంకట్రామ శాస్త్రి, అమరవాది ప్రభావతి

క్రీడలు

శ్రీఅరవిందుల ప్రవచనములు:

ఆశ్రమంలో క్రీడలు అవసరం ఏమిటని ఎవరైనా అడుగవచ్చు. ధ్యానం చేస్తూ ఆంతరంగికానుభూతులను పొందుతూ పరబ్రహ్మలో ఐక్యం కావడానికి జీవితాన్నుంచి తప్పించుకొని వచ్చే వారికి ఆటలెందుకు అని ఎవరైనా అనవచ్చు. అయితే అది సాధారణంగా అందరికీ తెలిసిన ఆశ్రమాల పద్ధతి. ఇది అటువంటి సనాతనమైన ఆశ్రమం కాదు. ఇక్కడి యోగంలో జీవితం ఇమిడి ఉంది కాబట్టి మొదటి నుంచీ చివరిదాకా జీవితానికి సంబంధించిన అన్ని విషయాలు, ఉపయోగించే అన్ని అంశాలుకూడా ఇందులో చేర్చబడతాయి. అయితే దైవకార్యాలకు విరుద్ధం కానటువంటివే ఇక్కడ ఉంటాయి. బౌద్ధమత ప్రభావంతో లౌకిక వ్యాపారాలన్నీటినీ వదిలి పెట్టి బ్రహ్మోపాసన చేయాలనుకున్నపుడే సనాతన ఆశ్రమాలు ఏర్పడి క్రమంగా మఠాలుగా మారిపోయాయి. ప్రాచీన ఆశ్రమాలు అలా ఉండేవి కాదు. అక్కడ పెరిగిన యువకులు, బాలకులు జీవితానికి సంబంధించిన ఎన్నో రంగాలలో శిక్షణ పొందే వారు.

*

దేహ పరిపూర్ణతే వ్యాయామానికి అంతిమ లక్ష్యం. మనకి అందుబాటులోనున్న అవకాశాల మేరకు ఎంత పరిపూర్ణత సాధించగలమో అంతవరకు సాధించాలి. అన్ని విద్యావ్యాసాంగాల నిజమైన లక్ష్యం పరిపూర్ణతే. ఆధ్యాత్మిక, చైత్యక (psychic), ప్రాణిక (vital) విద్యా సంస్కారాలతో పాటు దైహిక వ్యాయామానికి గూడా పరిపూర్ణతే లక్ష్యం. వ్యక్తి సంపూర్ణమైన పరిపూర్ణత కోసం మనం ప్రయత్నిస్తున్నట్లైతే దైహిక భాగాన్ని వదిలి పెట్టము కదా! వ్యక్తి ఆధారం స్థూలపదార్థమైన శరీరం, మనకి పనికి వచ్చే సాధనం అది. "శరీరం ఖలు ధర్మ సాధనం" అని సంస్కృత సామెత — ధర్మ నిర్వహణలో పనికి వచ్చే సాధనం శరీరం. ధర్మమంటే మనకి మనం విధించుకొని అనుసరించాలుకునే ఆదర్శపు కార్యాచరణ సూత్ర విధానము. సమగ్ర

మైన పరిపూర్ణత మనం ముందుంచుకొన్న ఆదర్శం. మనం భువిపై ఏర్పాటు చేయాలనుకొన్నది దివ్యజీవనం. అంటే ఆధ్యాత్మిక జీవనం భూమి మీద సఫలీకృతం కావాలి. ఇక్కడే, ఈ భౌతిక జగత్తులోని పరిస్థితుల్లో ఈ భూమి మీదే ప్రాణికోటి తన ఆధ్యాత్మిక పరివర్తనా కార్యాన్ని సాధించుకోవాలి. శరీరం కూడా పరివర్తన చెందితే గాని అది సాధ్యం కాదు. దాని చర్య, కార్యాచరణ కూడా ఒక అద్భుత శక్తి సంపత్తితో అవకాశం మేరకు అత్యంతమైన పరిపూర్ణత పొందేటట్లు తయారు కావాలి.

శరీరంలోని దైహిక చైతన్యం సాధ్యమైనంత పరిపూర్ణంగా ఉండటం, దాని మనస్సు, జీవితం, గుణగణాల పరిపూర్ణత కంటె శరీరానికి సంబంధించిన శక్తి సామర్థ్యాలను జాగృతం చేసి అభివృద్ధి చేయటం ఏ మాత్రం తీసిపోదని నేను లోగడ ఇచ్చిన ఒక సందేశంలో చెప్పాను. ఆశ్రమంలో ప్రత్యేక శ్రద్ధతో శిక్షణనివ్వడం మొదలుపెట్టి చేస్తున్న శరీరవ్యాయామం వల్ల కలిగే పరిపూర్ణత స్వతహాగా శరీరానికుండే శక్తి సామర్థ్యాలకేమాత్రం తీసిపోదు. భౌతిక చైతన్యం అభివృద్ధి పొందటం మన ధ్యేయంలో ముఖ్య భాగంగా ఉండాలి. అదొక్కటీ వదిలేస్తే దేహమంతా సరైన పెరుగుదలతో అభివృద్ధి చెందటం చాలా అవసరం. ఆరోగ్యం, బలం, పొందిక ప్రథమావసరాలు. అయినా శరీరావయవ నిర్మాణమే పరిపుష్టిగా ఉండాలి. పదార్థమయ జగత్తులో దివ్యజీవనమంటే జీవితపు రెండు కొనలు — అంటే ఆధ్యాత్మికాగ్రము, పదార్థ మూలము రెండూ తప్పని సరిగా సంయోగం చెందాలి. ఆటలు, శారీరక వ్యాయామము ఇత్యాది కార్యక్రమాలు ఆశ్రమ జీవితంలో చేర్చడం ద్వారా ఈ విధానాలు, చేరవలసిన మొదటి గమ్యాలు కూడా ఈవి క్రింది కొనగా పేర్కొన్నదానికి చెందవలసినవే కావటం గమనార్హము. ఈ హద్దులలో పొందదగిన మానవ పరిపూర్ణత సాపేక్షికమే. అంతకంటే ఘనతరమైన దాన్ని చేరాలంటే ఉన్నత శక్తులు, చైత్య శక్తులు, ఆత్మ శక్తులు జోక్యం చేసుకుంటేనే సాధ్యమవుతుంది. అయినప్పటికీ మానవ అవధులలో సాధించ తగ్గది కూడా చాలా గణనీయమైనదే. ఒక్కొక్కప్పుడు అపారము కూడా.

దైహిక సంస్కృతి అంటే శరీర కణాల్లోకి చైతన్యాన్ని ఇమిడింప చేసే ప్రక్రియ. అది అందరికీ తెలిసినా తెలియకపోయినా నిజమదే. మనం కండరాల మీద దృష్టినిలిపి సంకల్పానుసారంగా వాటిని కదిలించినప్పుడూ, ప్రయత్నపూర్వకంగా అవయవాలను సునాయసంగా వంగేటట్లు, చురుకుదనం వచ్చేటట్లు ఎప్పుడు చేస్తామో, దానికి శక్తి, నిరోధకత, స్వతహాగా లేని మృదుత్వం తెప్పిస్తామో అప్పుడు దేహ కణాల్లోకి అంతకు పూర్వం అక్కడ లేనటువంటి ఒక చైతన్యాన్ని ప్రవేశపెడతాము. ఆ విధంగా దాన్ని ప్రవర్ధమానంగా ఉండే అఖండమైన, గ్రహణశీలతగల ఉపకరణంగా తయారు చేస్తాము. అది తన చర్యలతోనూ, చర్యలలోను కూడా ప్రగతి సాధిస్తుంది. శరీర వ్యాయామం వల్ల ప్రధానంగా కలిగే ఉపకారం అదే. అయితే దేహానికి చైతన్యాన్ని కలిగించే మార్గం ఇదొక్కటే కాదు, కానీ సమగ్రంగా పనిచేసేది అదే.

*

మనం ఇక్కడ ఉన్నది ఒక ప్రత్యేకమైన కార్య సాధన కోసమే ననే విషయం నీకు గుర్తు చేయటం మంచిదనుకుంటున్నాను. ఈ పని ఇంతకుముందు మరెక్కడా జరుగలేదు.

సార్వత్రికమైన ఒక మహనీయ చైతన్యంతో సంస్పర్శను మనం వాంఛిస్తున్నాము. దానిని మనలోకి అవరోహింప చేసుకొని వ్యక్తం చేయాలనుకుంటున్నాము. కానీ దానికి చాలా దృఢమైన ప్రాతిపదిక కావాలి. మనకున్న ప్రాతిపదిక మన దేహమే కాబట్టి మనం దానిని దృఢంగా, ఆరోగ్యంగా, తాలిమి కలదిగా, కౌశల్యమైనదిగా, బలము, చురుకు కలిగినదిగా దేనికైనా సిద్ధపడేదిగా నిర్మాణం చేసుకోవాలి. అలా తయారుకావాలంటే దేహ పరిశ్రమకి మించిన మార్గం లేదు. క్రీడలు, కసరత్తులు, సాముగరిడీలు, ఆటలు మొదలైనవన్నీ కూడా మంచి దేహ నిర్మాణానికీ, దారుఢ్యాన్ని పెంపు చేయటానికీ బాగా పనికి వస్తాయి.

అనువాదం: శ్రీ అమరవాది వెంకట్రామ శాస్త్రి; అమరవాది

వస్తువుల జాగ్రత్త – సద్వినియోగము

శ్రీఅరవిందుల ప్రవచనములు:

'గోల్కొండ' అనే ఆశ్రమ అతిథి గృహం గురించి, దానికి సంబంధించిన నియమావళి గురించి చెప్పాలంటే — ఆ నియమావళి కారణం లేకుండా విధించింది కాదు. శ్రీమాత తన ఊహాలను శ్రీయుతులు రేమండ్, శామర్, ఇంకా కొంతమంది ద్వారా రూపకల్పన చేయించారు. ప్రధమ పక్షంగా శ్రీమాత ఆధ్యాత్మికతలో దివ్యజీవన విధానంలో సౌందర్యం ఒక భాగమని విశ్వసిస్తారు. రెండవది, భౌతిక పదార్థాలన్నిటిలోనూ సజీవ పదార్థంలో వలె దివ్యచైతన్యం అంతర్లీనమై ఉంటుందని ఆమె అంటారు. ఇక మూడవది భౌతిక వస్తువులకు కూడా వాటి ప్రత్యేక వ్యక్తిత్వం ఉంటుంది కాబట్టి వాటిని సరైన పద్ధతిలో సమాదరణగా చూచుకోవాలనీ, దుర్వినియోగం చేయకూడదనీ, మొరటుగా వాడకూడదని, దెబ్బతగలకుండా జాగ్రత్తగా వాడాలని అలా కాని పక్షంలో అవి శీఘ్రంగా పాడైపోయి, కళ తప్పి, విలువను కోల్పోతాయని చెప్పారు. ఆమె వాటిలోని చైతన్యాన్ని తెలుసుకుంటూ వాటిని దయార్ద్ర హృదయంతో చూచుకుంటారు కాబట్టి మిగాతా వారి దగ్గర తొందరగా పాడైపోయి, వృధా అయిపోయే వస్తువులు కూడా ఆమె దగ్గర చిరకాలం మన్నుతాయి. ఈ ఆలంబనతోనే ఆమె గోల్కొండ నిర్మించాలనుకున్నారు. మొదట్లో అదొక సుందర వాస్తునిర్మాణంగా ఉండాలనుకున్నారు. అది నెరవేరింది — వాస్తు శిల్పులు, వాస్తు శాస్త్రజ్ఞులు కూడా ఒక అపురూప నిర్మాణం సాధించారని మెచ్చుకొని సంతోషించారు. ఇదొక విశిష్టమైన కట్టడమని, ఇటువంటి నిర్మాణం అమెరికా, ఐరోపా దేశాల్లోనే చూడలేదని ఒకరు చెప్పారు. మరొక ఫ్రెంచి వాస్తు శాస్త్రజ్ఞుడు విఖ్యాతిగాంచిన తన గురువు కూడా ఈ ఉద్దేశంతోనే ఉన్నారని అయితే వారది చేయలేకపోయారని ఇక్కడ దానిని చాలా సమర్ధవంతంగా నిర్వహించారని చెప్పి ఎంతో ఘనంగా కీర్తించాడు. అంతేకాకుండా శ్రీమాత ఇందులోని వస్తువులన్నీ కూడ అంటే గదులు, వాటిలో అమరికలు, సామాన్లు వేటికవి కళాత్మకంగా ఉండి అంతా

కలిపి తీర్చిదిద్దినట్లుండాలని అనుకున్నారు. అది కూడా మిక్కిలి శ్రద్ధతో పూర్తయింది. ప్రతి వస్తువు దేనికది వీలుగా సర్దబడినది. ఏ వస్తువు ఎక్కడుండాలో స్థల నిర్ణయం కావటం వల్ల సంకరము కాదు. ఒక దాని కొకటి వాడటం జరగదు. అయితే ఇదంతా అమలులో ఉంచి ఆచరణలో కొనసాగించాలి. ఎందుకంటే అక్కడుండే వారు పూర్తిగా గందరగోళం సృష్టించి, అన్నీ దుర్వినియోగం చేసి, చిందరవందర చేసి అనతికాలంలోనే నాశనం చేయుటం చాలా తేలిక. అందువల్ల ఇన్ని నియమాలు పెట్టవలసి వచ్చింది తప్ప ఇంకెందుకూ గాదు. శ్రీమాత ఆశించినట్లు అక్కడ సరైన వారికి వసతిచ్చినా, సాధారణ మొరటు మనుష్యులు కాక కొంచెం నాగరికంగా పెరిగిన వారికిచ్చినా అది పదిలంగా ఉంటుంది. దాని కోసం పడిన శ్రమ, వెచ్చించిన ధనం వృధా కావు.

శ్రీమాత ప్రవచనములు:

తను వాడే వస్తువులపై శ్రద్ధ తీసుకోకపోవటం అజ్ఞానానికీ, నిశ్చేతనత్వానికి గుర్తు.

నీవు వాటిపై తగినంత శ్రద్ధ తీసుకోనట్లైతే భౌతికమైన వస్తువులను వేటినీ వాడే హక్కు నీకు లేదు.

అవి నీకు సంబంధించినవి కదా అని కాదు శ్రద్ధ తీసుకోవలసింది, అవి కొంత దివ్యచైతన్యానికి మూర్తరూపము కాబట్టి

*

(ఒక సాధకునితో)

అది నీ దుష్టబుద్ధి కాదనీ కేవలం అశ్రద్ధేనని నీ సంజాయిషీ నేనొప్పుకుంటాను. అయితే నా దృష్టిలో అశ్రద్ధ చెడ్డ సంకల్పానికి నికృష్ట రూపమని చెప్పక తప్పదు. అంటే దైవప్రేరణన్నా దైవ చైతన్యమన్నా నీకు ఏమాత్రం శ్రద్ధ లేదన్న మాట. అంటే నిరంతర జాగరూకతతో ఉండవలసిన చోట అశ్రద్ధ చూపటమే.

*

హస్త కౌశలం, నిశితమైన శ్రద్ధా, నిరంతరావధానము ఉంటే జడ పదార్థాన్ని కూడా దైవశాసనాన్ని శిరసావహించేటట్లు చేయవచ్చును.

అనువాదము: అమరవాది వెంకట్రామ శాస్త్రి; అమరవాది ప్రభావతి

ఆశ్రమంలో పనిచేస్తున్న చైతన్యశక్తి

శ్రీఅరవిందుల ప్రవచనములు: ఆశ్రమ కార్యక్రమాలు ఏవిధంగా నడుస్తున్నయ్యో, ఆశ్రమంచేసే తీరుతెన్నులను గురించి నీకు వివరంగా చెబుతావిను. మేము ఒక సంస్థని ఏర్పరచాలని గాని ఆశ్రమాన్ని ప్రారంభించాలని గాని ఎప్పుడు అనుకోలేదు — ముందర నిశ్చయించుకోలేదు. ఇది చైతన్యము — చిత్ తపస్సు యొక్క కార్యము. పుట్టి పెరిగి వృద్ధి పొందుతూన్న ఒక సజీవమైన ఆకృతి. చైతన్యము జడపదార్థం లోకి దిగి వచ్చి దానిని ప్రేరేపించినప్పుడు ఆ శక్తి (చైతన్యము) తదభివ్యక్తి నావిష్కరించుకొనుటకై యోగ్యమైన ఉపకరణాల కోసం వెతుక్కొంటుంది. తదుపకరణాలు యోగశక్తికి ఎంత ఎక్కువ గ్రహణశీలతను కలిగి వుంటే, ఎంత నవనీతము వలె — అనగా రాయి వలె కఠినంగా గాక మృదువుగా వుంటే ఆ చైతన్యాభివ్యక్తిగూడా అంత ఘనంగా ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు....

ఆ చేతనాశక్తి ఆవిష్కారము ఏవిధంగా జరుగుతున్నదో మేము చాలా జాగ్రత్తగా కనిబెడుతూంటాము — తప్పుదారి పట్టినపుడు, కుంటు పడినపుడు, మసకచీకట్లు కమ్మినప్పుడు మేము కలుగ జేసుకొని సరిచేస్తాము. అయితే చాలా మందిలో ఈప్రక్రియ కలగాపులగం గానే ఉంటుంది. అప్పుడు కూడా నేను కలుగజేసుకొని ఆ లోటు పాట్లను సవరించి వారిలోని మంచిచెడులను వేరుచేస్తాను.

ఎవరి పని వారు జేసుకొనేందుకు అందరికి కావలసినంత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఉన్నాయి. ఎందుకంటే ఆ చైతన్యశక్తి క్రియా రూపం దాల్చినపుడు అది పరిపరి దిశలలో వికసించగలదు, ఆ అభివ్యక్తిని మనము కృత్రిమంగా నొక్కిపెట్టి వాళ్ళ అభిమతములను, అభివ్యక్తిత రూపములను నిషేధించగూడదు. అది సహజంగా జరగాలి. అంతే. అటుల చేసినగాని పూర్ణాభివ్యక్తికి, శక్తిసామర్థ్యముల విస్తృతమునకు అవకాశం కలుగదు. అంటే ఎవరిని కాదనము, ఏ పనిని నిషేధించము. ఎవరినైనా చేర్చుకొనేటప్పుడు వాళ్ళను ముందర కొన్నాళ్ళు పరిశీలించిన తరువాత నిర్ణయం తీసుకుంటాము.

శ్రీమాత వివరణ: అంటే చేతన యొక్క విన్యాసము, ప్రవాహము ఎప్పుడు నిరంతరం జరుగుతూనే ఉంటుంది. దాని విజృంభణమునకు ఆద్యంతములుండవు. ఆటుపోట్లుండవు. అది నిరంతరం క్రియాశీలమై సెలయేటి గలగల వలె ప్రచలితమై వుంటుంది. దానికి పూర్వాపరములు లేవు. శక్తిపాతము నిరంతరం జరుగుతూనే వుండాలి — నిర్విరామంగా, నిరాటంకంగా. దానిపని దానివిధానము మనము ఆలోచించి నిర్ణయము తీసుకొను నట్టిదికాదు. దానిది మానసిక దృష్టికాదు. అది చర్మచక్షువు లతో చూడదు. చైతన్యనేత్రముతో సూటిగాచూసి ఏం చెయ్యాలో నిర్ణ యించుకుంటుంది. దీనిని మనం చాలా జాగ్రతగా అర్థం చేసుకోవాలి. నిత్యనూతనంగా తన దృష్యానుగుణంగా పనిచేసుకొంటూ పోతుంది. అటుల జరిగినప్పుడు మన మానవ నేత్రములకు "విపరీతము" "ఆశ్చ ర్యము" "అద్భుతము" అనిపించే విన్యాసములను మనము ప్రత్యక్షంగా చూచెదము. అవి మానవుని ప్రాపంచికానుభవములకు పూర్తిగా భిన్న ములు కావచ్చు. ఇక్కడ నెలకొనివున్న పరిస్థితి అది. అటులనే కొన సాగుతుంది. నేనున్నంత కాలం కొనసాగుతూనే ఉంటుంది.

అధిమానస సృష్టి*

మాతృవాణి: నేను ఇదంతా చూచినప్పుడు 1926 లో జరిగిన సంఘ టన ఒకటి నాకు గుర్తు వస్తోంది. శ్రీఅరవిందులు అతిమానసాన్ని త్వరగా ఆవిష్కరింప చేయుటకై ఏకాంతవాసాన్ని అవలంబించినారు. ఆశ్రమాన్ని నిర్వహించే బాధ్యతనంతా నాకు అప్పగించారు. సాధకు లందరిని పిలిచి ఇకనుంచి వారికి సహాయకారిగాను మార్గదర్శిగాను నేనే ఉంటానని ప్రకటించారు. నేను ఆయనతో సంప్రదిస్తూ వుంటా ననియు ఆయన నా ద్వారానే పని చేయుదుననియు ప్రకటించారు. అప్పుడు అనుకోకుండా చాలా ఆశ్చర్యకరమైన సంఘటనలు జరిగి నాయి. అవి అత్యద్భుతములు, వర్ణనాతీతములు. సూక్ష్మాతిసూక్ష్మ, చిత్ర విచిత్రములతో కూడిన కళ్ళు మిరుమిట్లు గొలిపే బ్రహ్మాండమైన నవ నూతన సృష్టి భూమిమీదికి దిగి వచ్చింది. అప్పుడిక ఒకటే దివ్యాను భూతులు, దేవతలతోడి మైత్రి, సన్నిహిత సంబంధములు మొ॥ రకరకాల ఆవిష్కరణములు సంభవించినవి.

ఇక అప్పుడు జరిగిన దివ్యావేశములు, దివ్యానుభూతుల సంగతి వేరే చెప్పాలా! ఆ నూతనసృష్టి మిరుమిట్లు గొలుపుతూ, అదే పనిగా ఆవిష్కరమవుతూనే వుంది. నేను రోజూ శ్రీఅరవిందులను కలసు కొని విశేషాలను గురించి ఆయనతో సంప్రదిస్తూ వుండే దానిని. ఒక రోజున ఈ నూతనసృష్టి ఆవిష్కరణమును గురించి ఆయనకు చెప్పాను. కొంచెం ఉత్సాహంగానే ఆయనకు వివరించాను. అప్పుడు ఆయన నా వంక చూసి.... "చూడు ఇది అధిమానస (overmind) సృష్టి. ఇది చాలా అద్భుతమైన సృష్టి అన్నమాట నిజమే. తత్ఫలితంగా నువ్వు చాలా అద్భుతములు చేసి ప్రపంచమంతా కీర్తి ప్రతిష్టలు సంపాదించ గలుగుతావు. ఈ భూమి మీద జరిగే సమస్తమైన సన్నివేశములను తల్లకిందులు చేయగలుగుతావు".... అని చెప్పి చిరునవ్వు నవ్వుతూ ఇట్లా అన్నారు. "దీన్ని అందరూ హర్షించి నిన్ను బ్రహ్మరథం పడ తారు. కాని ఇది అధిమానసానికి చెందినది. మనకు కావలసినది ఇది కాదు. అందుకని ఈ సృష్టి ఎంత అత్యద్భుతమైనప్పటికి మనకు తృణ ప్రాయము. ఇది మనకు వద్దు. అందులకు అతిమానస సృష్టిని అతి మానసాన్ని ఆవిష్కరింప చేయలి.

నా అంతర్ దృష్టితో చూసి వెంటనే అవగాహన చేసుకొ న్నాను. కొన్ని గంటల తర్వాత ఆ సృష్టి అంతా ఎగిరిపోయింది. ఆ క్షణం నుంచి మళ్ళీ నూతన ప్రాతిపదిక మీద కార్యము నారంభించాము.

---

* అతిమానసానికి (విజ్ఞానము supermind) మానవ మానసానికి మధ్యన చాలా సోపానాలు ఉన్నాయి — చేతనాస్తరములున్నాయి. మనం వీటిని పరిపరి విధము లుగా అర్థము చేసుకోవచ్చును. ప్రతి చేతనా స్తరానికి దాని లక్షణములుంటయి. అంటే దాని మనస్సు, దాని వృత్తులు. అవి అంతకంతకు ప్రదీప్తములు, ప్రతిభావంతము, విశాల వ్యాప్తములుగా ఉంటాయి. ఈ స్తరములన్నింటిలోను ఉన్నతమైనది అధి మనస్సు. అది మెరుపు కాంతులతో వెలిగిపోతూ వుంటుంది. కొన్ని శక్తులకు ఆవాసము. కాని దాని పై స్తరముతో పోలిస్తే అది అవిభక్తమైన పూర్ణ జ్ఞానమునుండి ఆత్మ వెను తిరిగి అవిద్యలోనికి దిగివచ్చే సరిహద్దు. అధిమానసము దేవతలకు నివాస భూమి.

అనువాదము: డి. సత్యవాణి

రూపాంతరీకరణమనగా ఏమి?

శ్రీఅరవిందుల ప్రవచనములు: రూపాంతరీకరణమంటే నువ్వు సరిగ్గా అర్థం చేసుకోవాలి. అది స్వామిగిరి గాని నైతిక నియమము గాని గాదు. తాంత్రిక యోగసిద్ధులు గాని చిన్మయ దేహ ప్రాప్తి మొదలైనవేవి కావు. రూపాంతరీకరణము అనే పదానికి నా అర్థం వేరు. అది ఒక మహోన్నతము, మహోత్కృష్టము, పరమాధికమూ, పరిపూర్ణము అయిన ఒక విప్లవాత్మకమైన, సంపూర్ణమైన ఆధ్యాత్మికమైన పరిణామము. అనగా ప్రాణిక, భౌతిక పాశవిక ధాతువుల్లోంచి మనస్సు పుట్టి మాన వావతరణమైనప్పటి కంటే ఘనమైన చేతనా విప్లవము, పరివర్తనము. అంతకంటె ఏ మాత్రం తక్కువ స్థాయి కాని, కనీసం ఆ ప్రతిపాదిక మీద గాని జరగనప్పుడు, ఆ దిశలో తొలి మెట్టయినా ఎక్కనప్పుడు, మొదలు పెట్టనప్పుడు నాకు కావలసిన సిద్ధికి పనికి రాదు. జీవితం నుంచి యోగం నుంచి నేను కోరే ఫలితం అది కాదు. పర్యవసానం అది కాదు.

జ్ఞానోపలబ్ధి వేరు. అది కిందికి దిగిరావడం వేరు. ఆధ్యాత్మి కంగా సిద్ధి కలిగినంత మాత్రాన మనిషి రూపాంతరీకరించి పోడు. మానవ ప్రకృతంతా రూపాంతరీకరించదు. ఏదో ఊర్ధ్వమునుంచి ఒక చిన్న వెలుగు దిగటం వలన చేతన ఉన్నత స్థాయిని జేరుకోవచ్చు. మకుటంలో వికసించి ఒకింత పురుష సాక్షాత్కారమును పొందవచ్చు. కాని ప్రకృతి మట్టుకు ఏ మాత్రం మార్పు చెందక "యథా ప్రకార సిద్ధి రస్తు" గానే ఉంటుంది. అధో విభాగములు పూర్వ మెట్లుండునో అటు లనే ఉండును. అటువంటి వాళ్లను నేను చాలా మందిని చూచాను. జ్ఞానజ్యోతి దిగివచ్చి మనస్సులో మనస్సు యొక్క ఒక విభాగమును మాత్రమే వెలిగిస్తే సరిపోదు — అది ఇంకా కిందివరకు దిగి వచ్చి భౌతిక కోశములో సహితము భాసించినపుడే అసలు రూపాంతరీక రణం సాధ్యమవుతుంది. ఒక ప్రకాశం మనస్సులోకి చేరడమే కాదు. ఆ జ్యోతి భౌతిక సత్తా లోకి ప్రవేశించినపుడు తప్ప నిజమైన రూపాం తరం సంభవించదు.

మనసులో వెలిగిన జ్యోతి మనస్సును ఆధ్యాత్మీకరించగలదు. లేదా మనసునో, మనస్సు యొక్క ఒక విభాగాన్నో మార్చగలదు గాని అది ప్రాణిక స్వభావాన్ని మాత్రం మార్చ లేదు. అలాగే ప్రాణిక శక్తిలో ప్రవేశించిన జ్యోతి ప్రాణిక శక్తి ఉద్యమాల యొక్క చేష్టలను పరిశుద్ధము గావించి, వాటి విస్తృతిని పెంచగలదు. ప్రాణిక సత్తాలో నిశ్శబ్దాన్ని, స్థిరత్వాన్ని తీసుకు రాగలదు. కాని శరీరాన్ని, భౌతిక చేత నని మాత్రం అలాగే వదిలేస్తుంది. దానిని మరింత జడపరచి, సమ తౌల్యాన్ని నష్టపరుస్తుంది. కేవలం జ్యోతి యొక్క అవతరణం చాలదు. ఊర్ధ్వ చేతనము యావత్తూ తన శాంతి, శక్తి, జ్ఞానం, ప్రేమానందము లతో సహా దిగి రావాలి. మరియు ఈ అవరోహణ అంతస్సత్త్వము నకు బంధ విముక్తిని కలిగిస్తుందేమోగాని సంపూర్ణ సిద్ధిని కలిగిం చదు. అది అంతర సత్త్వములో గొప్ప మార్పుకు కారణం కావచ్చు కాని భౌతిక జీవితాన్ని అసంపూర్ణమైన పనిముట్టుగా, అశక్తంగా వదిలేస్తుంది. చివరిగా సాధన వలన సమకూరే రూపాంతరం పూర్తి సత్తా యొక్క అతిమానసీకరణం కానిదే పూర్తికాదు. చైత్యీకరణం (psychicisation) మాత్రమే సరిపోదు. అది మొదటి మెట్టు మాత్రమే. ఆధ్యాత్మీకరణమూ ఊర్ధ్వ చేతనావతరణమూ సరిపోవు — ఇది మధ్య మెట్టు. చరమస్థితి అతిమానస చేతన యొక్క శక్తి వల్లనే సాధ్యము. వ్యక్తిపరంగా దానికన్న తక్కువ స్థాయి చాలనిపించవచ్చు. కాని ఈ పృథ్వి యొక్క చేతన ఒక నిర్దిష్టమైన మార్గం వైపుగా ముందుకు సాగాలంటే అది అతిమానసాన్ని స్థాపించడంతో తప్ప జరగదు.

*

...వెంటనే ఈ పృథ్వి పై ఆధ్యాత్మిక జీవనాన్ని స్థాపించడమే నా లక్ష్యము. దానికి మొదట దైవమును సాక్షాత్కరించుకోవాలి. అపుడే జీవితం ఆధ్యాత్మికమౌతుంది. లేదా అపుడే నేనంటున్న దివ్య జీవనం సాధ్యమౌతుంది

...ఈ సాక్షాత్కారమే మొదటి అవసరం. ఈ ప్రాతిపదిక మీద మిగిలినదంతా జరుగుతుంది. అది జరగనిదే దేనికి ఆస్కారం లేదు.

అనువాదం: డి. సత్యవాణి

ఆశ్రమం ఒక ప్రయోగశాల

శ్రీఅరవిందవాణి:

ఆధ్యాత్మిక, అతిమానస యౌగిక 'ప్రయోగశాల' వంటి ఈ ఆశ్రమంలో మానవాళియొక్క, వివిధ వర్గములకు ప్రతినిధులుగా రక రకాల మనుమలు ఉండి తీరాలి. ఎందుకంటే ఈ రూపాంతరం కేవలం మంచి వాళ్ళకే పరిమితము కాదు. అందరికి వర్తిస్తుంది. ఒకే మనిషిలో మంచి చెడ్డలు రెండూ కలిసి ఉంటాయి. సాత్వికులూ నాగరికులూ అయిన వారు మాత్రమే ఈ యోగాన్ని కోరివస్తే వారిలో ప్రాణిక శక్తికి సంబంధించిన సమస్య ఎక్కువ ఉండదు. అందుచేత ఈ భూమ్మీద ప్రకృతిసిద్ధమైన ప్రాణిక శక్తి విషయాలను ఎదుర్కొని వాటినుంచి బయటపడడం సంభవించదు. అలాంటపుడు ఈ కృషి విజయవంతం కాదు. కొన్ని సందర్భాలలో అధిమానసానికి (overmental) సంబంధించిన ఒక పొర మానసిక, ప్రాణిక భౌతిక తత్వాలను ఆవరించి ఉండవచ్చు. వాటిని ప్రభావితం చేయవచ్చు. కాని అది అతిమానసానికి సంబంధించినది కాదు. ఆశ్రమంలో చేరినవారిలో అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన విభిన్న లక్షణాలు వారున్నారు కనుక ఇది తప్పనిసరి.

ఈ సామూహిక యోగసాధనలో ప్రతి ఒక్కరికి వర్తించక పోయినా, ఒక్కొక్క స్తరములో (లోకములో) పని చేస్తున్నపుడు ఒక్కొక్క. రకమైన సమస్య ఎదురౌతుంది. ఆశ్రమంలోని సమస్యలకు కారణం యిదే. మార్గములోని అడ్డంకులను తొలగించేంత వరకు ఈ సమస్యలు తప్పవు....

సాధకులలోని లోటుపాట్లు పైనించి దిగిన కాంతే తీసివేయ గలదు — సాత్వికమైన నియమాలు సాత్వికతతో ఉన్న వాళ్ళ స్వభావాన్నే మార్చగలవు.

శ్రీమాతృ వాణి:

ఈ ఆశ్రమంలో పదకొండు వందల కంటే ఎక్కువ మందే ఉన్నారు. ఈ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

ఇప్పుడు వారిలో చాలామంది సాధన చేయని వారున్నారు. వారి విషయంలో సమస్యలు తలెత్తవు. కాని సాధన చేసేవారందరికి ఎలా ఉంటుందంటే.... ప్రతి మానవుడు ఎంతటి పరిపూర్ణవంతుడైనా ఇంకా అసంపూర్ణంగాను, పాక్షికంగానూ ఉంటాడు. అతడు ఈ ప్రపంచంలోని ఒక తత్వానికి ప్రతినిధిగా ఉంటాడు. అది ఎంతో క్లిష్టమైన తత్వము, కావచ్చు కాని అది ఒక్క తత్వము మాత్రమే. అదే ఇండియాలో ధర్మం అని పిలవబడేది. సత్యం, న్యాయం అని పిలవబడేవి.

ఎంత ఉన్నత శ్రేణికి చెందిన వ్యక్తి అయినా ఎంత విశిష్ట కార్యాచరణ కోసం నిర్దేశించబడినా అతడు ఒక్క వ్యక్తియే. అంటే పూర్తి రూపాంతరీకరణ ఒకే వ్యక్తి ద్వారా ఒకే శరీరంలో సిద్ధించదు. ఇక్కడ చాలామంది ఉండేందుకు కారణమిదే.

ఒక వ్యక్తి తాను వంటరిగా, ఏకాంతంగా తన స్వీయ సంపూర్ణతను సాధించుకోవచ్చు. ఒక వ్యక్తి తన చేతనావస్థలలో అనంతాన్ని సంపూర్ణత్వాన్ని అనుభవించవచ్చు. అయితే అది కార్యాచరణ, కార్యసిద్ధి విషయం వచ్చేసరికి అది ఎప్పుడూ పరిమితంగానే ఉంటుంది.

నేను చెప్పింది మీకు సరిగా అర్థం అయిందో లేదో నాకు తెలీదు. కానీ వ్యక్తి జ్ఞానానికి అవధులు లేవు. అంతర్గతంగా ఎవ్వరైనా తాను సంపూర్ణము, అనంతత్వమూ అనుభవించవచ్చు. అయితే బాహ్యజీవితంలో అది పరిమితంగానే ఉంటుంది. అందరికి సంబంధించిన సామూహిక కార్యాచరణకు పూనుకొన్నపుడు కనీసం కొంతమంది మనుషులు ఉండితీరాలి.

చాలా పాత పద్ధతులలో పన్నెండుమంది చాలని చెప్పారు. అయితే నేటి క్లిష్టమైన జీవితంలో ఆ సంఖ్య సరిపోదు. అన్ని శ్రేణులకు సంబంధించిన వాళ్ళు ఉండాలి. అంటే దానిని గురించి మీకేం తెలీదు. మీరేం ఊహించలేరు. కాని ప్రతి ఒక్కరు ఒక కష్టతరమైన దానికి ప్రతినిధులుగా ఉండి వాటి మీద విజయం సాధించి, రూపాంతరం చెందించగలరు.... కష్టం అనడం కంటె కూడా ప్రతి ఒక్కరు ఒక అసాధ్యానికి ప్రతినిధి... దాన్ని పరిష్కరించాలి. ఈ మొత్తం అన్ని అసాధ్యాలు కార్యాచరణలోకి రూపాంతరం చెందుతాయి. ప్రతి వ్యక్తి ఒక

పరిష్కరించాల్సిన అసాధ్య సమస్య. ఆ అసాధ్య సమస్యలన్నింటిని పరిష్కరించినపుడే కార్యసిద్ధి జరుగుతుంది.

నేనిపుడు చాలా ఔదార్యంతో 'అసాధ్యం' అన్న చోట కష్టం అన్న పదం ఉపయోగిస్తాను. బహుశ ఇంక అవి అసాధ్యాలు కావు.


*

నీవు అందరినుండి దూరంగా ఒంటరిగా కూర్చున్నపుడు, నిశ్శబ్దంలో నిన్ను నీవు మరింత చపలంగా చూసుకున్నపుడు నువ్వు చాలా అద్భుతమైన అవగాహన కల్గినట్లు ఊహించుకుంటావు. అయితే నువ్వు ప్రతి నిమిషం జీవితంలో పరీక్షకు గురి అయినపుడు నీ అసంపూర్ణతల, నీ తెలియనితనాల ఎరుక నీకు కలిగినపుడు, నీ చెడు సంకల్పాల చిన్న చిన్న కదలికలు రోజుకి వందసార్లు అనుభవంలోకి వచ్చినపుడు త్వరలోనే నీ భ్రమ తొలగి.... నీ కృషిలో మరింత నిజాయితీ చోటు చేసుకుంటుంది.

ప్రపంచానికి దూరంగా, మనని మనమే చూసుకుంటూ, ఎక్కడో వంటరి అరణ్య ప్రదేశంలో సౌందర్యమూ, విశ్రాంతి ఉన్న చోట ఆశ్రమ స్థాపన చేయకుండా దానికి వ్యతిరేకంగా నిత్యజీవితపు కార్యక్రమాల మధ్య ఉంటూ వాటిని కూడా మనలాగే చైతన్యం చేస్తూ, ఇతర మానవుల తోటి మన సంబంధాలలో మన లోపలి స్పందనములను ఎరుక గల్గి ఉండటానికి ప్రయత్నిస్తున్నాం.

కష్టాలనించి పారిపోవడం వాటిని జయించడం కాదు. శత్రువు నించి పారిపోతే నీవు శత్రువుని ఓడించలేవు. పైగా అతడే నిన్ను ఓడించడానికి అన్ని అవకాశాలు ఉంటాయి. అందుకే మనం ఈ పాండిచ్చేరిలో ఉన్నాం, ఎక్కడో హిమాలయ శిఖరాలమీద లేము.

అనువాదం: డి. సత్యవాణి



సమాధి

మా ప్రభువు యొక్క ఆచ్ఛాదమా! ఇవియే మా అనంతకోటి కృతజ్ఞతాభివందనములు. మా కొరకు మీరెంతయో శ్రమించిరి. పాటుపడిరి. పోరాటమును సల్పిరి. బాధలను భరించిరి. ఆశాజ్యోతిని వెలిగించిరి. సంకటములను సహించిరి. మా కొరకై ఒక మహా కార్యమును సంకల్పించిరి. నిర్వహించిరి. బాటను ఏర్పరచిరి. కార్యమును సాధించిరి. నీ మ్రోల ప్రణమిల్లి మేము మీకెంత ఋణపడియున్నామన్న సంగతి ఒక్క నిముసమైనా విస్మరించకుండునట్లు అనుగ్రహింపుమని వేడుకొనుచుంటిమి.

9 డిసెంబరు 1950

శ్రీమాత

శ్రీఅరవిందుల యోగములో సాధన

శ్రీఅరవిందుల ప్రవచనములు:

మన ప్రయత్నములకు లక్ష్యమైన, కష్టసాధ్యమగు పరమార్థము రెండు శక్తుల సమావేశము వల్లనే లభ్యమగుచున్నది. ఇహము నుండి పిలిచే దృఢమైన, అమోఘమైన ఆకాంక్ష ఒకటి. పరము నుండి అనుగ్రహించే పరమ కృప రెండవది.

కాని సత్యజ్ఞానముల నియమములందు మాత్రమే, 'పరమకృప' ప్రవర్తిస్తుంది. అసత్యాజ్ఞానములు దానిపై విధించు నియమములందు అది ప్రవర్తించదు. ఎందువల్లనంటే, అసత్యమునకు అది లొంగినట్లయితే, స్వకార్య వ్యాఘాతము సంభవిస్తుంది.

సత్యజ్ఞానముల నియమములు ఇవి. వీటి వల్లనే 'పరాశక్తి' అవతరించేది. 'పరమ విజ్ఞానశక్తి' మాత్రమే పైనుంచి దిగిన్నీ, క్రింది నుంచి వికసించిన్నీ, స్థూల ప్రకృతిని జయప్రదముగా వశము చేసుకొని దాని దోషములను పరిహరిస్తున్నది....

నిష్కపటమైన, సంపూర్ణమైన, ఆత్మార్పణము ఉండవలెను. ఈశ్వర శక్తిని పొందడానికి ప్రత్యేకముగా తన్నుతాను వికసింప చేసుకోవలెను. పైనుండి అవతరించే సత్యమును సర్వదా సంపూర్ణముగా గ్రహించుచుండవలెను. ఐహిక ప్రకృతిపై ఇంకను ఆధిపత్యమువహించియుండు మనస్సు, ప్రాణము, దేహము — వీటికి సంబంధించిన శక్తుల యొక్కయు రూపముల యొక్కయు అసత్యమును సర్వదా సంపూర్ణముగా నిరాకరించవలెను.

ఆత్మార్పణము సంపూర్ణముగా నుండవలెను. అది పురుషుని ప్రతి భాగమును వశపరచుకోవలెను. చైత్యపురుషుడు (psychic) తలయూపినంత మాత్రమున చాలదు. పరాబుద్ధిమయ పురుషుడు (higher mental) సమ్మతించినంత మాత్రమున చాలదు.[1] ప్రాణమయ పురుషుడు

---

[1] మన యొక్క మనోమయ, ప్రాణమయ, అన్నమయకోశములకు లోపల సూక్ష్మముగా, చైతన్యరూపమున లోపలిమనస్సు లోపలిప్రాణము

(inner vital) లోబడినంత మాత్రమున చాలదు. అన్నమయ పురుషుడు (inner physical consciousness) తెలుసుకొన్నంత మాత్రమున చాలదు. పురుషుని ఏ భాగమందూ అతి బహిరంగ భాగమందు సైతము — మినహాయించుకొనే దేదిన్నీ ఉండకూడదు.[2]

పురుషుని యందలి కొంతభాగము అర్పితమై మరికొంత భాగము తన్ను తాను మినహాయించుకొని, దాని మార్గాన్నే అది అనుసరిస్తూ లేదా దాని నియమములనది విధిస్తూ ఉంటే — అట్లా జరిగే ప్రతిమాటూ, ఈశ్వర కృపను నీనుండి నీవే దూరముగా త్రోసివేసు కొంటున్నావు. నీ భక్తి, నీ అర్పణమూ — వీటి మరుగులో నీవు నీ ఆశలకు, అహంకార పూరితమగు కోరికలకూ, ప్రాణమయ కోశమునకు సంబంధించిన పట్టుదలకూ ఆశ్రయమిచ్చినట్లయితే, నిజమైన ఆకాంక్ష ఉండవలసినచోట వీటిని నీవు ఉంచినట్లయితే, లేదా దానితో వీటిని కలిపివేసి, ఈశ్వరశక్తిని, మోసగింప యత్నించినట్లయితే, నీలో మార్పుకలగడం కోసం 'ఈశ్వర కృపను' వేడుకోవడము వ్యర్థము.

సత్యమును పొందుటకు నీవు నీలో ఒక భాగమునుగాని, ఒక పార్శ్వమునుగాని వికసింపజేసి వేరొక భాగమును విరోధ శక్తులు ప్రవేశించడమునకు తెరిచి ఉంచితే — 'ఈశ్వరకృప' నీపై స్థిరముగా నుండునని ఆశించడము వ్యర్థము. సత్యరూపమును ప్రతిష్ఠించవలెనని ఇచ్ఛ ఉంటే, ఆలయమును నీవు పరిశుద్ధముగా నుంచుకోవలెను.

ప్రతి పర్యాయమూ, (ఈశ్వరకృపా) శక్తి తాను కలుగజేసుకొని, సత్యమును తీసుకొని వస్తూ ఉండగా, నీవు దానిపై విముఖత్వము చూపి, బహిష్కరింపబడ్డ అసత్యమును నీవు పునరాహ్వానము చేస్తూఉంటే — నీకు ఈశ్వరకృప కలుగలేదని నీవు దానిని నిందించరాదు — నీవు నిందించవలసినది నీ అసత్యేచ్ఛనూ, అసంపూర్ణార్పణమునూ.

లోపలిస్థూలము కలవు. యోగులు మాత్రము వానిని చూడగలరు. అవే ఇచ్చట ప్రాణమయ చైత్యపురుషుడు, అన్నమయ చైత్యపురుషుడు అని వివరించబడ్డవి.

[2] శంకల వెనుక భ్రమల వెనుక, మిషల వెనుక ఒదిగి ఉండే దేదిన్నీ ఉండకూడదు. తిరుగుబాటు చేసేదికాని, నిరాకరించేది, ఏదిన్నీ ఉండకూడదు.

నీవు సత్యము కొరకు ప్రార్థించినప్పుడు, నీలో ఏదో ఒకటి, అసత్యమైన దానిని, అజ్ఞానముతో కూడిన దానిని, దివ్యేతరమైన దానిని కోరుకొనుచున్నట్లయితేనూ, లేదా, అటువంటి దానిని పూర్తిగా నిరాకరించడానికి అనిష్టముగా ఉన్నట్లయితేనూ — విరోధశక్తులు నిన్ను వశము చేసుకొంటవి. అప్పుడు ఈశ్వరానుగ్రహము నీకు దూరమవుతుంది. మొట్టమొదట నీలో ఏది అసత్యముతోనూ అజ్ఞానముతోనూ కూడివున్నదో దానిని కనిపెట్టు. దానిని పట్టుదలతో నిరాకరించు. అప్పుడే నీవు నీలో మార్పు కలిగించడముకోసము ఈశ్వరశక్తిని ప్రార్థించితే యుక్తముగా ఉంటుంది.

సత్యాసత్యములు, జ్ఞానాజ్ఞానములు, ఆత్మార్పణ స్వార్థపరత్వములు — ఇవి ఈశ్వరార్పితమైన మందిరములో అన్నియూ కలిసి నివసిస్తాయని అనుకోకు. నీలో మార్పు పూర్తిగా ఉండవలెనంటే దానిని ప్రతిఘటించే అన్ని విషయములు నీవు పూర్తిగా నిరాకరించవలెను.

నీవు ఈశ్వరాజ్ఞను ఈడేర్చకపోయినప్పటికీ నీకోరిక ననుసరించి ఈశ్వరశక్తి సర్వమునూ చేస్తుందనీ, చేసితీరుతుందనే తప్పు అభిప్రాయము పెట్టుకోకు. నీ ఆత్మార్పణము యథార్థమైన దానినిగాను సంపూర్ణమైన దానినిగాను చేయి. అట్లా చేసినప్పుడే నీ మనోభీష్టములన్నీ సిద్ధిస్తవి.

నీ కొరకు ఈశ్వరశక్తే అర్పణము సైతము చేస్తుందనే పనికిమాలిన తప్పుడు ఆశకూడా పెట్టుకోకు. ఆమెకు నీవు ఆత్మార్పణం చేసుకోవలెనని ఈశ్వరాదేశము. కాని బలవంతములేదు. తిరుగులేని మార్పు నీవు పొందేవరకూ ఎప్పుడుపడితే అప్పుడు, దైవములేడని నిరాకరించడమునకూ, ఆత్మార్పణాన్ని రద్దు చేసుకోవడానికీ, నీకు స్వేచ్ఛ కలదు. కాని, దానివల్ల కలిగే ఆధ్యాత్మిక పర్యవసానము ననుభవించడానికి నీవు సంసిద్ధుడవై ఉండవలెను. నీ అర్పణము ఆత్మకృత్యమై, స్వేచ్ఛాపురస్సరమై ఉండవలెను. అది చైతన్యము గల పురుషుని అర్పణమై యుండవలెను గాని, జడమున్నూ, ఎటుతిప్పిన అటుతిరుగు కీలుబొమ్మయొక్క గాని, ఉపకరణముయొక్క గాని అర్పణము వంటి అర్పణమై యుండరాదు.

శుద్ధ జడత్వమును చూచి, యథార్థార్పణమని తరచుగా భ్రమ పడడం కద్దు. కాని జడత్వము నుంచి యథార్థము, శక్తిమంతము అయిన దెట్టిదిన్నీ లభించదు. శుద్ధ జడత్వమే స్థూలప్రకృతిని ప్రతి ఆసురిక తమోవృత్తిపాలూ చేస్తున్నది. సంతోషపూర్వకమున్నూ, దృఢమున్నూ, అనుకూలమున్నూ అయిన విధేయత ఈశ్వరకార్యమునకు అవసరము — సత్యమునకు శుశ్రూషచేయు జ్ఞానికుండే విధేయతవంటి విధేయత, అజ్ఞానాసత్యములపై కత్తిదూయు 'అంతర్యోధుని' కుండే విధేయత వంటి విధేయత, శ్రద్ధాళువగు భగవత్కింకరునికుండే విధేయతవంటి విధేయత.

ఇదియే సరియైన భావము. ఇటువంటి భావము కలవారే ఆశా భంగముల వల్లగాని, కష్టములవల్లగాని చలించని శ్రద్ధగలవారై కఠిన మైన అగ్నిపరీక్ష దాటి ఉత్కృష్టమైన విజయమున్నూ, మహత్తరమైన పరివర్తనమున్నూ పొందగలరు.

తెలుగు మూలం: స్వామి శుద్ధానంద భారతి, చింతాదీక్షితులు
గార్ల 'జగన్మాత'

"సత్యమును అన్వేషించుటకై భూలోకమును వీడిపో నక్కరలేదు. ఆత్మను దర్శించుటకై జీవితమును త్యజిం చనవసరము లేదు. భగవంతునితో సంబంధ బాంధ వ్యములను పొందుటకై ప్రపంచమును విసర్జించనవ సరమూ లేదు. మూఢాచారములను నమ్మకోనవస రమూ లేదు. ఆయన సర్వే సర్వత్రా ఉండి కూడా మనకు కనబడదు. ఎందుకంటే మన మాయనను కనుగొనుటకై ప్రయత్నము చేస్తే గదా!" మనకీ విష యము చెప్పేందుకే శ్రీఅరవిందులు అవతరించారు.

మూలం: శ్రీమాత

కొన్ని ప్రశ్నలు – సమాధానాలు

శ్రీమాత సమాధానాలు:

ప్రశ్న: మధుమయి! ఎవరో నన్నొక ప్రశ్న అడిగారు. "మానవాళికి సేవ చేయగలిగిన గొప్ప గొప్ప డాక్టర్లు, ప్లీడర్లు వాళ్ళ ముక్తి కోసం ఆశ్రమానికి వచ్చి వుంటే సమాజానికి నష్టం గలగదా? వాళ్లు తోడి మానవులను, ప్రపంచాన్ని సేవించినట్లయితే దైవాన్ని మరింత గొప్పగా సేవించినట్లేగదా!"

ఇక్కడి కెవ్వరూ వాళ్ళ వ్యక్తిగత ముక్తి కోసం రారు. ఎందు కంటే శ్రీఅరవిందులకు ఈ ముక్తి ముఖ్యం గాదు. మనకు ముక్తి అనే పదము నిరర్థకం. మనమిక్కడ ఎందుకున్నామనుకుంటున్నావు? పృథ్విని, మానవులను రూపాంతరీకరణమునకు సన్నద్ధపరచి తద్వారా నూతన సృష్టిని ఆహ్వానించుటకే. మన వ్యక్తిగత ప్రయత్నము ఎందుకు చేస్తున్నామనుకుంటున్నావు? ఆత్మాభివృద్ధి ఎందుకు? అవి కూడా ఆత్మ విమోచనం కోసం కాదు — మన కార్య సాఫల్యతకి యోగసిద్ధి కనివార్యం కాబట్టి.

ఆశ్రమంలో ఇన్నాళ్ళ నుంచి ఉంటూ కూడా నువ్వింత ఛాంద సంగా ఆలోచిస్తున్నావంటే నాకు చాలా ఆశ్చర్యమేస్తుంది. నేను మీకు శ్రీఅరవిందుల "quotation" ఒకటి పంపుతున్నాను. ఇది చదివితే నీకు బహుశా కాస్త కనువిప్పు కలుగవచ్చు.

"మానవాహంకారాన్ననుసరించి ఒక గొప్ప మానసిక, నైతిక, సాంఘిక వ్యవస్థను స్థాపించుటకు మానవుల మధ్య సౌజన్య సౌహార్ద ములు, గుణగణములు సాధించుటకు మాత్రమే మేము యిక్కడ ఉన్నామనే భావన అజ్ఞాన భూయిష్టమైనది. నా ఉద్దేశాలకు వెయ్యి మైళ్ళ దూరం! అలాంటిదేదైనా చేస్తానని నేనెన్నడూ వాగ్దానం చేయ లేదే. మానవ స్వభావం లోపభూయిష్టమైనది. మంచితనము, సౌశీ ల్యము, కూడ కేవలం నటన, కాపట్యమే. అవి స్వాత్మాభిమానములతో కూడిన డాంభికములే. జీవితానికి ఆధ్యాత్మిక సత్యమే ప్రాతిపదిక. ఆత్మ సమర్పణము, దైవసాయుజ్యము అహంకారాతీతత్వము దాని

ప్రాథమిక సూత్రాలు. ఈ పునాది కుదుటపడేంత వరకు సాధకుడు నిమ్న ప్రకృతి యొక్క దుష్ట శక్తులతో పెనగులాడే అజ్ఞాని, అర్భకుడు. ఆధ్యాత్మిక వికాసం కలగగానే తన అంతరాత్మకు చేరువౌతాడు. శ్రీమాత ప్రేమ సానిధ్యానుభూతులను పొందుతాడు"

ప్రశ్న: మధుమయీ! అది వరకు ఆశ్రమానికికొచ్చే వారిపట్ల, ఆశ్రమంలో చేరుటకొచ్చే వారి పట్ల మీరు చాలా strict గా ఉండేవారు. కాని యిపుడు అటుల కాదు. ఎందుకు?

ఆశ్రమం యోగసాధకులకే పరిమితమైనప్పుడు కాఠిన్యమవసరమే గదా! పిల్లలను చేర్చుకోవడం వల్ల అలాంటి కాఠిన్యాన్ని సడలించాల్సి వచ్చింది. అది అనుచితమైంది కూడ. మన జీవిత సరళి కూడా మారిపోయింది.

ఇప్పుడు ఆశ్రమం పృథ్వీ జీవితం యొక్క సంకేత రూపమైన ప్రతినిధిగా తయారైంది. అందువల్ల దివ్యజీవనం వైపు వికాసాన్ని ఆకాంక్షించే ప్రతి వానికి ఆశ్రమంలో స్థానం ఉంటుంది.

ప్రశ్న: శ్రీఅరవిందాశ్రమం అంటే ఏమిటని క్రొత్త వారెవ్వరైనా మిమ్మల్ని అడిగితే మేము సంక్షిప్తమైన, స్థైన సమాధానం ఏమని చెప్పాలి?

ఆశ్రమం రేపటి సృష్టియైన నవ్య ప్రపంచపు జన్మస్థలి. ఇంకా యితర ప్రశ్నలేవైనా అడిగితే "శ్రీమాతరవిందుల పుస్తకాలను పఠించండి. వారి బోధనలను అధ్యయనం చెయ్యండి" అని మాత్రమే సమాధానం చెప్పాలి.

"మరి కొంతకాలం ఆశ్రమానికి దూరంగా ఉండిపోతే నాతో యిప్పటి వలెనే సాన్నిహిత్యాన్ని నిలుపుకొని వుండగలనా"? అని నీవు ప్రశ్నిస్తున్నావా? అది నీవెంతకాలం ఎడంగా ఉన్నావో అన్న దాన్ని బట్టి ఉంటుంది.

ఎందుకంటే మెల్ల మెల్లగా నువ్వు నీ అంతరాత్మవే అన్న సత్యాన్ని మరుస్తావు. అంతేగాక నువ్వు "ఆలోచనాపరునిగాను" "చతురునిగాను" "హేతువాదిగాను" మనుగడ సాగించేందుకు అలవాటు పడిపోతావు. అలాగాక మరోలా వుండడాన్ని వూహించలేవు.

ఆశ్రమంలో పాటించు ముఖ్యదినములు

ఫిబ్రవరి 21, శ్రీమాత జన్మదినము (జననము 1878)

మార్చి 29, శ్రీమాత శ్రీఅరవిందులతో తొలిసారి సమావేశమైన రోజు (1914)

ఏప్రిల్ 4, శ్రీఅరవిందులు పాండిచ్చేరికి విచ్చేసిన దినము (1910)

ఏప్రిల్ 24, శ్రీమాత శాశ్వతంగా పాండిచ్చేరికి వచ్చేసిన రోజు (1920)

ఆగష్టు 15, శ్రీఅరవిందుల జన్మదినము (జననము 1872)

నవంబరు 24, సిద్ధి దినము — 1926 ఈ దినం జరిగిన ఆధ్యాత్మిక సంఘటన స్మృత్యర్థం. శ్రీకృష్ణ చైతన్యం (overmind) శ్రీఅరవిందుల శరీరములోనికి అవతరించిన శుభదినము

ఆశ్రమంలో పాటించే ఇతర ముఖ్యదినములు

ఫిబ్రవరి 29, అతిమానస చేతనాజ్యోతిశ్శక్తులు అవతరించిన రోజు (1956)

నవంబరు 17, శ్రీమాత దేహం చాలించిన రోజు, 1973. శ్రీమాత దేహం సమాధి పైఅంతస్థులో నవంబరు 20 తేదిన వుంచబడినది.

డిసెంబరు 5, శ్రీఅరవిందులు శరీరము వీడిన రోజు (1950) శ్రీఅరవిందుల శరీరము డిశంబరు 9 వ తేదిన సమాధి యందుంచబడినది.

మనిషి అనగా తన లీలా రూపములలో మరుగుపడి యుండి తన నిజ రూపమును అన్వేషిస్తూ దివ్యత్వ మును పొందగల సమర్ధుడు. ప్రకృతి ద్వారా ప్రవర్ధ మానమౌతూ దైవోన్ముఖంగా పయనించే ఆత్మ. అతను దైవము. చిరంతన సత్త్వము.

మూలం: శ్రీఅరవిందులు



శ్రీమాత Supramental (అతిమానసము, విజ్ఞానము) ను క్రిందికి తెచ్చిపెట్టుటకై అవతరిస్తుంది. తదవతరణము ద్వారానే ఆమె సంపూర్ణాభివ్యక్తము సాధ్యమవుతుంది.

శ్రీఅరవిందులు

శ్రీమాత

శ్రీఅరవిందుల ప్రవచనములు:

మదర్‌ని ప్రేమింపుము*

మదర్ ఎప్పుడూ నీ వంక చూస్తున్నట్లుగానే ప్రవర్తింపుము. ఏలన నిజానికి ఆమె నిరంతరం ప్రత్యక్షమే.

*

నువ్వు నీ మనస్సు చెప్పే మాటలను వినిపించుకున్నట్లయితే, శ్రీమాత నీ ఎదుట సాక్షాత్కారించినప్పటికి నువ్వు ఆమెను గుర్తించ లేవు. నువ్వు నీ మనస్సును గాక ఆత్మను వినిపించుకున్నప్పుడు, భ్రమాత్మకమైన నీ మనస్సునుగాక సత్యమును మాత్రమే శిరసావహించే నీ ఆత్మను పిలిచినప్పుడు, నీవు దివ్యమాతను నమ్ముకున్నప్పుడు, ఆమె నీలోని దివ్యతత్వములను, దివ్యాంశములను అజ్ఞానమునుండి వేరుజేసి దివ్య ప్రకృతికి వాహనములుగా తయారు జేస్తుంది. తీర్చిదిద్దుతుంది.

*

మనము శ్రీమాత (మదర్) అని ఆరాధించే వ్యక్తి సృష్టినంత టిని అధిష్టించియున్న ఈశ్వరుని చిచ్ఛక్తి. ఆమె బాహ్య రూపము ఏకమే అయినప్పటికి నిజానికి బహుముఖరూపిణి. ఆమె వ్యవహారములు మెండు. ఆమె ఎటు పోవునో ఏమి చేయునో ఎవరికెఱుక? ఎంతటి బుద్ధికుశలురైనా, మహా మేధావులైనా ఆమె అనంత కోటి వ్యాపారము లను అంతు బట్ట లేరు. పరమాత్ముని చిచ్ఛక్తే జగన్మాత. తను సృష్టిం చిన చరాచర జగత్తు కతీతము. ఆమె అఖండ స్వరూపము నెవరెరుగ గలరు? మానవులకు తెలియుటకై తనను తానే కుంచించుకొని దాల్చిన దేవతా రూపములను మాత్రమే మానవులెఱుగ గలరు. దేవతల నియ మిత తత్త్వములను పరిమిత కార్యావళుల ఛాయలను మాత్రమే తెలుసు కొన గలరు.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి


---

* ఆశ్రమంలోపలా, బయటా 'మదర్' అనే నామము ప్రసిద్ధమైనది.

చిహ్నాల అర్థము

శ్రీమాత వచనములు:

శ్రీఅరవిందుల చిహ్నము




అధోముఖంగా నున్న త్రిభుజం సత్ — చిత్ — ఆనందముల కును, ఊర్ధ్వముఖంగా నున్న త్రిభుజం ప్రాణం, తేజస్సు, ప్రేమల రూప మున జడము యొక్క ఆకాంక్షను తెలియజేయును.

ఈ రెండు త్రిభుజముల కలయికగానున్న సమచతురస్రం దైవం యొక్క సమగ్ర ఆవిర్భావమును, దాని మధ్యనున్న పద్మం, పరమాత్మ అవతారమును సూచించును.

సమచతరస్ర మందలి జలము, పరమాత్మ యొక్క బహుళ సృష్టిని వ్యక్తం చేయును.

శ్రీమాత చిహ్నము:



కేంద్ర వర్తులం దివ్యచేతనను తెలియజేయును. తర్వాతి వర్తులం నందలి నాలుగు దళములు

1. మహేశ్వరి 2. మహాకాళి 3. మహాలక్ష్మి 4. మహాసరస్వతి అను జగన్మాత యొక్క నాలుగు అంశలను సూచించును. బాహ్యావర్తులం లోని పండ్రెండు దళములు, సృష్టి కార్యం కొరకు ఆవిర్భవించిన జగజ్జనని యొక్క శక్తులను వ్యక్తం చేయును.

శ్రీమాత నాలుగు అంశల యొక్క శక్తులు:

1. జ్ఞానము (knowledge) 2. శక్తి (strength) 3. సౌందర్యము, సామరస్యము (beauty and harmony)4. పూర్ణత (perfection)

శ్రీమాత పండ్రెండు శక్తులు:

1. చిత్తశుద్ధి (sincerity) 2. నమ్రత (humility) 3. గ్రహణశీలత (receptivity) 4. ప్రగతి (progress) 5. నిర్భయత (courage) 6. ఆకాంక్ష (aspiration) 7. ఉదారత (generosity) 8. మంచితనము (goodness) 9. వివేకము (sagacity) 10. పట్టుదల (perseverence) 11. సమత (equality) 12. శాంతి (peace).

∴

యోగ సాధనను ఎటుల ఆరంభించవలెను

నీకు యోగమెందుకు కావాలి? శక్తిని సంపాదించు కొను టకా? ప్రశాంత నైశ్చల్యముల కోసమా? మానవ సేవార్థమా?

ఈ ప్రయోజనాలేమియు యోగమునకు నీ అర్హతను సమర్థించ లేవు.

ఈ ప్రశ్నకు నువ్వు సూటిగా జవాబివ్వాలి. నీకు యోగ మెందుకు కావాలి? నీ కోసమా దైవము కోసమా? దైవమే నీ జీవితపు పరమ లక్ష్యమా? దైవము వినా నువ్వు బ్రతకలేవా? దైవమే నీవు జీవించి ఉండుటకు ముఖ్య కారణమా? దైవము లేనిదే నీ జీవితం నిర ర్థకమా? *ఈ ప్రశ్నలన్నిటికి నీ జవాబు 'అవును' అయితే అప్పుడు మాత్రమే నీవు యోగానికి అర్హుడవు.*

*

దీనికి అత్యవసరమైన మొదటి నిబంధన — దైవం కోసం ఆకాంక్ష. (అభీప్స aspiration) తహ తహ.

ఆ తర్వాత నీవు చేయవలసిన పని ఇది. దీపం ఆరిపోకుండా జాగ్రత్త పడాలి. మెలకువగా, సజీవముగా, హుషారుగా ఉండాలి. అందుకు కావలసినది ఏకాగ్రత. దైవము మీదనే బుద్ధిని కేంద్రీకరించి, సమగ్రమైన అర్పిత భావముతో వుండాలి. *దైవ సంకల్పమునకు దైవ కార్యమునకు బద్ధుడవై వుండాలి.*

మూలం: శ్రీమాత

*

శ్రీఅరవిందుల యోగపు ఏకైక లక్ష్యము ప్రతి ఒక్కరు ఆత్మా భివృద్ధి ద్వారా సర్వమానవుల యందు వసించియున్న పరమాత్మ సాక్షాత్కారమును పొందుట. మనస్సును పరిణమింపజేసి దానికంటే గొప్పదైన ఊర్ధ్వ చేతనను అందుకొనుట. మానవ స్వభావమును రూపాంతరము గావించి దివ్య ప్రకృతిగా మార్చగల విజ్ఞాన/అతి మానస చేతనను (supramental consciousness) ఆవిష్కరించుట.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీ నరసింహాశాస్త్రి

అనుబంధం

శ్రీఅరవిందుల సంక్షిప్త జీవితం

"నీకు కాని మరెవ్వరికి కానీ, నా జీవితాన్ని గురించి ఏమీ తెలీదు. అది మానవులు దర్శించడానికి పై భాగాన లేదు"

శ్రీఅరవిందులు

శ్రీఅరవిందులు కలకత్తాలో 1872 ఆగష్టు 15 వ తేది జన్మిం చారు. 1879 లో అంటే ఆయన ఏడవ యేట తన అన్నగార్లిద్దరితో బాటు విద్యాభ్యాసానికై తమ తండ్రిచే ఇంగ్లండునకు కొనిపోబడినారు. అచట ఆయన పదునాలుగేండ్లున్నారు. తొలుత మాంచెష్టరులో ఆయన ఆంగ్ల కుటుంబంచే పెంచబడినారు. 1884 లో లండన్‌లోని సెయింట్ పాల్ స్కూల్లో చేరినారు. 1890 లో కేంబ్రిడ్జి యందలి కింగ్స్ కాలేజిలో "సీనియర్ క్లాసికల్ స్కాలర్‌షిప్" ద్వారా చేరి అచట రెండేండ్లు గడపి నారు. ఇంగ్లాండులోని విద్యాభ్యాసం ద్వారా శ్రీఅరవిందులు ఐరోపా యొక్క ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక సంస్కృతిని విస్తృతంగా గ్రహిం చారు. ఆయన గ్రీక్, లాటిన్ భాషలలో ప్రతిభావంతుడైన విద్యార్థిగ పేరెన్నిక గన్నారు. బాల్యం నుండే ఫ్రెంచి భాష నేర్చినారు. ఆ తర్వాత స్వంతంగా జర్మనీ, ఇటలీ భాషలను అవసరమైనంతగా అభ్యసించి నారు. గొథే, డాంటే తత్వవేత్తల రచనలను మూల బాషల్లో అధ్య యనం చెయ్యడానికై ఆ భాషలను నేర్చినారు. ఐ. సి. యస్ చదివి రెండు సంవత్సరాలు ప్రొబేషన్ అనంతరం గుర్రపు స్వారి పరీక్షను ఇచ్ఛికంగానే హాజరు గాక ఆ అర్హతను కోల్పోయారు. ఆ సమయంలో బరోడా మహారాజు లండన్‌లో వుండగా శ్రీఅరవిందులు ఆయన్ను కలసుకున్నారు. బరోడాలో ఉద్యోగం సంపాదించుకొని 1893 జనవరిలో భారత దేశానికి తిరిగి వచ్చారు.

1893 నుండి 1906 (పదమూడేండ్లు) వరకు శ్రీఅరవిందులు బరోడాలో పనిచేశారు. తొలుత ఆయన రెవిన్యూ శాఖలోను, సెక్రటేరి యట్ లోను పనిచేశారు. పిమ్మట లెక్చరర్‌గా పని చేశారు. తరువాత ఆంగ్ల భాష ఆచార్యునిగా పని చేశారు. చివరగా వైస్ ప్రిన్స్‌పాల్‌గ నియ

మించ బడ్డారు. బరోడాలో నున్న కాలాన్ని ఆత్మ వికాసానికి, సాహిత్యోపాసనకు, తమ భవిష్యత్కార్య ప్రాతిపదికకు వినియోగించుకొన్నారు. ఇంగ్లాండులో నుండగా ఆయన తమ తండ్రి గారి కఠిన ఆదేశాల మేరకు భారత దేశ సంస్కృతితో గాని, ప్రాచ్య సంస్కృతితో గాని ఎలాంటి సంబంధం లేకుండా పూర్తిగా పాశ్చాత్య విద్యనే అభ్యసించారు. బరోడాలో ఆ లోటును భర్తీ చేసికొన్నారు. అచట ఆయన సంస్కృతము, ఇతర భారతీయ ఆధునిక భాషలను నేర్చుకొన్నారు. ప్రాచీన నవీన భారతీయ నాగరికతా సంస్కృతుల తత్వాన్ని జీర్ణింప చేసికొన్నారు. ఆ దశలలోని చివరి సంవత్సరాల్లో ఆయన సెలవు మీద నుండి, రహస్య రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 1905 లో బెంగాల్ విభజన జరిగింది. దానికి వ్యతిరేకంగా బెంగాల్‌లో అలజడితో గూడిన ఉద్యమం చెలరేగింది. ఆ అవకాశాన్ని వినియోగించుకొని ఆయన బరోడా ప్రభుత్వ సేవకు స్వస్తి చెప్పి భారతీయ రాజకీయోద్యమంలో మునిగిపోయారు.

శ్రీఅరవిందులు 1906 లో బరోడా వదిలి కలకత్తా వచ్చివేసినారు. తమ స్వీయ చరిత్రలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇలా వ్రాసినారు. "నేను కాలేజీలో చదివే రోజుల్లోనే (1905-15) అరవింద ఘోష్ బెంగాల్లో సుప్రసిద్ధ రాజకీయ నాయకుడుగా పేరు పొంది వుండేవారు (ఆయన 1910 లో పాండిచ్చేరికి వెళ్ళిపోయినప్పటికీ) ఆయన అధిక వేతనంతో కూడి యుండిన వైస్ ప్రిన్సిపాల్ పదవిని, భారత రాజకీయాల్లో పాల్గొనుటకై చేజేతుల వదలుకొన్న మహాత్యాగధనుడు. ఆ రోజుల్లో చాలా మంది రాజకీయ నాయకులు మిత హక్కులతో కూడిన స్వతంత్ర ప్రభుత్వాన్నే అంగీకరింప మొగ్గు చూపుచుండే వారు. కాని శ్రీఅరవిందులు మాత్రం నాటి కాంగ్రెస్ వేదిక నుండి నిర్భయంగా భారత సంపూర్ణ స్వాతంత్ర్యమే తమ ధ్యేయంగా చాటి చెప్పేవారు".

శ్రీఅరవిందుల ఆకర్షనీయమైన వ్యక్తిత్వము, 'వందేమాతరం' పత్రికలో ఆయన రచనలు, బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో అలవడిన స్తబ్ధత, బానిసత్వ భావాల నుండి భారతీయులను మేల్కొల్పి, వారి నూతన ఉత్తేజాన్ని, ప్రగాఢ ప్రభావాన్ని కల్గించినాయి. ఆయనపై

రాజద్రోహ నేరారోపణ జేసిన బ్రిటిష్ ప్రభుత్వం మూడు మార్లు సాక్ష్యము లేనందున విఫలమైంది.

ఆలీపూర్ జైల్లో విచారణ లేకుండ ఆయన్ను 12 నెలలు ప్రభుత్వం బంధించింది. ఆ సమయాన (1908-09) ఆయన తీవ్ర యోగ సాధన చేసి ప్రగాఢ ఆధ్యాత్మిక అనుభూతులను పొందగలిగారు. ١٩٥٨ జనవరిలో విష్ణుభాస్కర్ లేలే అనే మరాఠీ యోగితో కలసి ఆయన ధ్యాన సాధన చేశారు. ఆ తరుణంలో ఆయన దేశకాలాతీత నిశ్చల నీరవ బ్రహ్మానుభూతిని అందుకున్నారు. ఈ అనుభూతి వల్ల కలిగిన జగన్మిథ్యా భావన, ఆలీపూర్ జైల్లో 1908 లేక 1909 లో సిద్ధించిన విశ్వ చేతనానుభూతి వల్లను, మరియు సకల ప్రాణికోటిలో దైవ సాక్షాత్కారం సిద్ధి అనుభవం వల్లను మాయమై పోయింది. కారాగారంలో సల్పిన ధ్యాన యోగ సాధనలలో ఆయన నిశ్చలత్వము, క్రియాశీలతలు రెండూ పరమాత్మ తత్వాలే నన్న సాక్షాత్కారాన్ని పొందారు. అంతేగాదు, అతిమానసమునకు దారిచూపుటకు ఉన్నత చేతనా భూమికల సాక్షాత్కారం కూడ ఆయనకు ఆ సమయంలో సిద్ధించింది.

దైవాదేశాన్ననుసరించి ఆయన 1910 లో ఫ్రెంచివారి పాలన లోనున్న పాండిచ్చేరికి వెళ్ళినారు. ఒకప్పుడు శ్రీఅరవిందులిలా అన్నారు: "నేను కలకత్తా విడిచి పాండిచ్చేరికి వచ్చేశాను. నా యోగానికి దేని వలనా భంగం కలగ రాదన్నది నా కోరిక. ఈ విషయంలో నాకు చాలా కచ్చితమైన ఆదేశం! పైనుంచి వచ్చింది. నేను రాజకీయాలతోడి సంబంధాన్ని పూర్తిగా త్రెంచి వేసికొన్నాను. అలా చేసే ముందు, నేను ప్రారంభించిన కార్యము (భారత స్వాతంత్ర్యం) ఇతరులచే విధిగా నెరవేర్చ బడగలదని, నా ప్రమేయం లేకుండానే చివరి విజయం తథ్యమని నా అంతరాత్మ ప్రబోధం ద్వారా నాకు తెలిసింది"

మానవుని రూపాంతరీకరణ కోసం పూర్ణయోగ లక్ష్యాలను ప్రకటించి స్థిరపరచాలనే తమ జీవిత పరమాశయం కొరకై ఆయన ఆధ్యాత్మిక భూమికల అగాధాల్లోకి దుమికినారు.

1914 లో శ్రీఅరవిందులు 'ఆర్య' అను ఆధ్యాత్మిక మాస పత్రికను ప్రచురించ నారంభించినారు. వారి ప్రధాన గ్రంథాలైన The Life Divine, The Synthesis of Yoga, Essays on the Gita,

Commmentaries of Upanishads మెదలైనవన్నీ వరుసగా 'ఆర్య' లో వెలువడ్డా.యి.

ఆయన యోగ సాధనలో తమకు సిద్ధించిన విజ్ఞానంలో చాలా భాగం యీ గ్రంథాల్లో నిక్షిప్తమైవుంది. మిగతా గ్రంథాలు భారతీయ ఆధ్యాత్మికత, భారతీయ నాగరికత, సంస్కృతుల ప్రాముఖ్యతలకు సంబంధించినవై యున్నవి. అవి "The Foundations of Indian Culture, The Secret of the Veda, The Human Cycle, The Future Poetry, The Ideal of Human Unity". నిరాటంకంగా ఆరున్నర సంవత్సరాలు కొనసాగిన 'ఆర్య' పత్రిక ప్రచురణ 1921 లో ఆగిపోయింది.

1920 ఏప్రిల్ 24 వ తేది శ్రీమాత పాండిచ్చేరిలో స్థిరంగా వుండిపోవడానికని, శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక ప్రణాళికలోను, సాధన లోను పాల్గొనుటకై వచ్చేసారు.

శ్రీమాత (మిర్రా అల్ఫాజా) జన్మతః ఫ్రెంచి దేశస్థురాలు. తొలుత 1914 మార్చి 29 న శ్రీఅరవిందులను ఆమె పాండిచ్చేరిలో కలసికొంది. కాని అంతకు ముందు తమ ఆధ్యాత్మిక అనుభవాలలో తమ మార్గదర్శిగా, ఆయన ఆమెకు పరోక్షంగా చాలా కాలంగా ఎరుకయే. ఆయన్ను ఆమె కృష్ణ అని అనుకుంటూ ఉండేది.

1926 నవంబరు 24 న ***"అధిమానస చేతనావతరణం" ద్వారా శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక కృషి శిఖరాగ్రాన్నందుకొంది.*** ఈ అవతరణం వారి యోగంలో ఒక మహోన్నత సోపానం అయినందున ఆ దినాన్ని శ్రీమాత "సిద్ధి దినం" గా ప్రకటించింది. ఆ రోజు శ్రీఅరవిందుల బ్రహ్మాండమైన ఆధ్యాత్మిక ప్రణాళికలో మరో దశ ఆరంభమైనది.

ఆయన తమ కార్యం పట్ల అనన్య శ్రద్ధ వహించే ఉద్దేశ్యంతో నాటినుండి ఏకాంతవాసం లోనికి వెళ్ళిపోయారు. అయినా ప్రపంచం లోను, భారత దేశంలోను జరుగుతున్న సంఘటనలను గమనిస్తూ, అవసరమైనప్పుడల్లా జోక్యం కల్పించుకుంటూనే వుండేవారు. తమ శిష్యుల సాధనా మార్గాన్ని సుగమం చేయడమనే శ్రీమాత కార్యంలో ఆయన పాలు పంచుకునే వారు. ఆయన వేలాది ఉత్తరాల ద్వారా శిష్యులు ఎదుర్కొనే కష్టాలు, బాధలు, సమస్యలకు పరిష్కార మార్గా

లను సూచిస్తూ తమ ఆధ్యాత్మిక అనుగ్రహాన్ని వర్షిస్తూ ఉండేవారు. కాని శ్రీఅరవిందుల కార్యమేమిటి? పృథ్వీ జీవితాన్ని రూపాంతరీక రణం చెందించి "పూర్ణయోగానికి మార్గాన్ని సుగమం చేయడానికని, తాము అతిమానసమని పేర్కొన్న మహోన్నత దివ్య చేతనను భువిపై అవతరింప చేయుట".

1938 నవంబరులో తమ గదిలో సంభవించిన ప్రమాదం వల్ల శ్రీఅరవిందుల తొడ ఎముక విరిగింది. 1939 లో రెండవ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. ఆ తరుణంలో ఆయన యోగం మరో నూతన స్థాయినందుకొంది. తమ గదిలో ఏకాంతవాసంలో వుంటూనే వారు దివ్య చేతనావతరణాన్ని అడ్డుకొంటున్న అసుర శక్తులతో తీవ్రంగా ఆధ్యాత్మిక సమరం సలుపుతుండేవారు. ఈ అవని అంధ కారం నుండి దైవం వైపు ఉద్ధరింపబడేందుకై, సత్యం ఇచట ప్రతిష్ఠింప బడేందుకై ఆయన అచేతనతో, అసత్యంతో, కాళరాత్రితో, భయంకర ప్రళయంతో నిండి నిబిడీకృతమైన పాతాళం యొక్క గాఢాంధకార అగాధాల్లోనికి ఐచ్ఛికంగా దుముక వలసి వచ్చింది. పృథ్వికి, మానవా ళికి, వెలుగును, సత్యాన్ని, శాంతిని అందించుటకై ఆయన ఈ మహో త్కార్యానికి పూనుకొన్నారు. శ్రీఅరవిందులు తమ ఆధ్యాత్మిక సమ రాన్ని రహస్యంగా జరపడమేగాక, ఈ ప్రపంచ సంఘటనల పట్ల కూడ తమ శక్తులను నిరంతరంగా వినియోగిస్తూ వుండేవారు. ఉదాహ రణకు ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలంలో హిట్లరు వెనుక, నాజిజం వెనుక అసుర శక్తులుండడం ఆయన చూచారు. ఆ శక్తులు గెలిచినట్ల యితే మానవ జాతి అంతా దుష్ట క్రూర ప్రభుత్వానికి బానిసలుగా పడివుండక తప్పదని, మానవ ఆధ్యాత్మిక పరిణామం కుంటుబడక తప్పదని ఆయన గుర్తించారు. అలాంటి క్లిష్ట సమయంలో ఆయన చురు కుగా చొరవ తీసుకున్నారు. ఆధ్యాత్మిక శక్తితో పనిచేశారు. తత్ఫలి తంగా హిట్లర్‌కు వ్యతిరేకంగానున్న మిత్రకూటమి (Allies) కి విజయం వరించింది.

1947 ఆగష్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అది యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదు. అది శ్రీఅరవిందుల

దివ్య కార్యం పట్ల "దైవశక్తి ఆమోద ముద్ర" గా ఎంచనగును. ఆ రోజు శ్రీఅరవిందుల జన్మదినం

శ్రీఅరవిందులు 1950 డిశంబర్ 5 వ తేది తమ దేహం చాలించారు. "సామూహిక దివ్య సాక్షాత్కార మహత్కార్యాన్ని వేగిర పరచేందుకే" శ్రీఅరవిందులు శరీర త్యాగం చేశారని శ్రీమాత ఒకప్పుడన్నారు. "శ్రీఅరవిందులు ప్రపంచ చరిత్రలో తెలియజేసేది ఒక బోధ కాదు. ఒక దివ్య దర్శనము కాదు. అది పరమాత్మ యొక్క నిశ్చయాత్మకమైన కార్యం" అని కూడ శ్రీమాత ప్రకటించారు. చివరగా శ్రీఅరవిందుల జీవితంలోను, వారి కార్యంలోను ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకొన్న 'సావిత్రి' మహా కావ్యాన్ని గూర్చి ఒక్క మాట. శ్రీఅరవిందులు రహస్య దివ్య భూమికల్లోను, ఆధ్యాత్మిక భూమికల్లోను పొందిన విస్తృత అనుభూతులే ఈ కావ్యంలో మాంత్రిక భాషలో 23, 837 పంక్తుల్లో రచింపబడ్డాయి. ఈ గ్రంథ రచన 1916 నుండి ఆయన జీవితాంతందాకా కొనసాగింది. మానవుని మనస్సు పరమాత్మ వైపు విస్తృత పరచుటలో యిది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన రసాత్మక మహా కావ్యం. అది "ఆరోహణకు సాధనం". భువి దివిగాను, మానవుడు అమరుడుగాను రూపాంతరీకరణం చెందే అవకాశం తప్పక ఆసన్నం కాగలదన్నదే వారి దివ్య సందేశం.

"గూఢంగా వున్న దైవాన్ని ఆవిష్కరించడానికే ప్రకృతి
జీవిస్తుంది,
దివ్య చేతన మానవ జీవిత నాటకాన్ని గ్రహించి
కొనసాగిస్తుంది,
ఈ పృథ్వీ జీవితం భాగవత జీవితంగా రూపొందుతుంది".

*

శ్రీఅరవిందుల సాధన ఉద్దేశం

నా సాధన నా కొరకుగా చేయబడలేదు. అది పృథ్వీ చేతనకు వెలుగు బాటను చూపుట కొరకే చేయబడింది. నా సాధన ద్వారా నేను సాధ్యమని చూపిన అంతర ప్రగతి, రూపాంతరీకరణము, నూతన

శక్తి ఆవిష్కరణము, మొదలైనవి సర్వులకూ ముఖ్యమైనవే. అనివార్యంగా జరగ వలసిన దివ్య చేతనావతరణానికి మార్గం సుగమం చేయడానికే నా సాధన ఉద్దేశింపబడినది.

*

అతిమానసమును నా కొరకే పొందాలనే అభిలాష నాకు లేదు. నాకుగా నేనేమి చేయలేదు. ఎందుకంటే మోక్షమును కాని లేదా అతిమానసమును కాని పొందవలసిన అవసరం నాకు లేదు. నేను అతిమానస అవతరణకు ప్రయత్నిస్తున్నానంటే, అది పృథ్వీ చేతన కొరకే. నేను అతిమానసమును పొందుట పృథ్వీచేతన యొక్క అతి మానసీకరణం కొరకై ద్వారములను తెరచుటకే సుమా!

*

"దివ్యదేహంలో దివ్య జీవితం అనేది మా దార్శనిక సత్యం!"

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. నరసింహయ్య

శ్రీఅరవిందులు పాత మతములతోగాని, పాత మార్గముల తోగాని పోటీగా మరొక మతమును స్థాపించుటకు లేక ప్రబోధము చేయుటకు ఈ భూమి మీదకరుదెంచలేదు — క్రొత్త జీవితమునునాటి, తప్పనిసరిగా ఆవిష్కరింపనున్న భవిష్యత్తుకు బంగారుబాటను నిర్మించుటయే వారి అవతారోద్దేశము.

శ్రీమాత

శ్రీమాత సంగ్రహ జీవితము

శ్రీమాత పారిస్‌లో 1878 ఫిబ్రవరి 21 వ తేదీ జన్మించారు. మిర్రాగా నామకరణం గావింపబడిన ఆమె Maurice Alfassa మరియు Mathilde Ismaloun గార్ల కుమార్తె. ఆ దంపతులు తమ కుమారుడు Matteoతో కలసి మిర్రా జననానికి ఒక సంవత్సరం ముందుగా ఈజిప్ట్ నుండి ఫ్రాన్స్‌కు వలసగా వెళ్ళారు. మిర్రా బాల్యంలో విద్యాభ్యాసం యింట్లోనే సాగింది. 1892 లో ఆమె చిత్రలేఖనము, పెయింటింగ్ అభ్యసించిరి. ఆ తరువాత ఆ కళను ప్రఖ్యాత Ecole des Beaux Arts విద్యాలయంలో నేర్చుకుంది. పెయింటింగ్‌తో పాటు ఆమె సంగీతంలో ప్రతిభను పొందింది. గొప్ప రచయిత్రిగా కూడ పేరు పొందింది.

బాల్యంలో కలిగిన తమ ఆధ్యాత్మిక అనుభవాల గూర్చి శ్రీమాత యిలా తెల్పారు. "11-13 సంవత్సరాల వయస్సు మధ్య వరుసగా ఎన్నో ఆధ్యాత్మిక అనుభూతులు నాకు కలిగినాయి. భగవంతుని అస్థిత్వము, ఆయనతో ఐక్యం కావడము, ఆయన్ను చేతనలోను జీవిత కార్యాల్లోను, సంపూర్ణంగా గ్రహించడము, పృథ్వీపై భాగవత జీవితమున ఆయన్ను ఆవిష్కరించడము ఇలాంటి సత్యాలన్నీ అవగాహనకు వచ్చాయి"

1905 లో శ్రీమాత అల్జీరియాలోని Tlemcen వెళ్లి అచట Max Theon , ఆయన భార్య Alma వద్ద రెండు సంవత్సరాలు గూఢ విద్యను (occultism) అధ్యయనం చేశారు. పారిస్ తిరిగి వచ్చాక ఆమె ఒక ఆధ్యాత్మిక సాధకుల సంఘాన్ని ప్రారంభించారు. 1911-13 మధ్య ఆమె పారిస్‌లో వివిధ ఆధ్యాత్మిక సంఘాలలో పెక్కు ఉపన్యాసాలొసంగిరి.

శ్రీమాత 1914 మార్చి 29 న పాండిచ్చేరి విచ్చేసి, ఆ దినమే శ్రీఅరవిందులను కలిసారు. వెంటనే, చిరకాలంగా తన ఆధ్యాత్మిక ప్రగతికి, తన అంతరంగము నుండి తనను నడుపుతున్న ఆధ్యాత్మిక గురువు వీరేనని గుర్తించారు. ప్రథమ ప్రపంచ సంగ్రామ కారణంగా 11 నెలల తర్వాత ఆమె ఫ్రాన్స్‌కు తిరిగి వెళ్ళ వలసి వచ్చింది. ఒక సంవత్సరం తర్వాత ఆమె ఫ్రాన్స్ వదలి జపాన్‌లో నాలుగు సంవత్సరాలు

గడిపారు. 1920 ఏప్రిల్ 24 న శ్రీమాత పాండిచ్చేరి విచ్చేసి శ్రీఅరవిందుల సహ పథచారిణిగ వుండిరి. ఆమె శేష జీవితమంతా భారత దేశం లోనే గడిపారు.

శ్రీమాత చివరి సారిగా శ్రీఅరవిందుల వద్దకు వచ్చినపుడు కొందరు శిష్యులు వారితో కలసి వుంటుండిరి. ఆమె రాకతో వారి సంఖ్య పెరగజొచ్చింది. వారందరి సమ్మేళనంతో అచ్చట ఆశ్రమం రూపొందింది. 1926 నవంబర్ నుండి శ్రీఅరవిందులు తమ ఆశ్రమ భౌతిక, ఆధ్యాత్మిక జీవిత నిర్వహణ బాధ్యతను శ్రీమాతకు పూర్తిగా అప్పగించినారు.

1950 లో శ్రీఅరవిందులు తమ కార్యసాధనను సూక్ష్మ భౌతిక భూమికలో కొనసాగించుటకై దేహం చాలించినారు. పృథ్విపై అతిమానస ఆవిష్కరణము అనే శ్రీఅరవిందుల మహోత్కార్య సిద్ధికై శ్రీమాత తీవ్ర కృషి సల్పినారు. 1956 ఫిబ్రవరి 29 వ తేదిన పృథ్వి యొక్క సూక్ష్మ భౌతిక భూమికలో ఆ యావిష్కారము సంభవించింది.

1951 ఏప్రిల్ 24 వ తేది భారతదేశమందలి మేధావులు, విద్యావేత్తలు సమావేశమైన శ్రీఅరవిందుల స్మారక సభలో శ్రీమాత, శ్రీఅరవిందుల అంతర్జాతీయ విశ్వ విద్యాలయ కేంద్రం స్థాపనాంశ మును ప్రకటించిరి. తర్వాత 1952 జనవరి 6 న దాని ప్రారంభోత్స వము జరుపబడింది. 1959 లో "శ్రీఅరవిందుల అంతర్జాతీయ విశ్వ విద్యాలయ కేంద్రం" — "శ్రీఅరవిందుల అంతర్జాతీయ విద్యా కేంద్రంగా" పేరు మార్చబడింది.

1960 లో శ్రీమాత తామే అధ్యక్షులుగా, శ్రీఅరవింద సొసైటీని స్థాపించిరి.

1964-65 లో శ్రీమాత ఆరోవిల్ ప్రారంభించిరి. అచట ప్రపంచమందలి ఆధ్యాత్మిక సాధకులందరు "సత్య" సేవలో కలసి మెలసి ప్రగతి జీవనం సాగించగలుగుదురు. ఆరోవిల్ "అరుణోదయ నగరం" గా ప్రసిద్ధి చెందింది. 1968 ఫిబ్రవరి 28 న ఈ ప్రత్యేక నగర శంఖుస్థాపన మహోత్సవం జరిగింది. శ్రీమాత ఆశ్రమ అధికారిణిగను, నిర్వహకురాలిగను, సాధకుల గురువుగను, ఆమె కార్యక్రమాలన్నీ ఆమె బాహ్య జీవితంలోని ఘట్టాలను మాత్రమే తెలుపుతాయి. ఆమె

అంతర భూమికల లోని విస్తృతమైన మనుగడ మరొకటుంది. ఆమె అంతరానుభూతులు, ఆమె మాటల్లోనే చెప్పాలంటే, నిరాఘాటంగా కొనసాగినాయి. ప్రతి సెకండు జరిగిన ఆ అనుభవాలను నమోదు చేయాలంటే ఒక గ్రంథాలయం కూడా చాలదు. కాని వాటిలో కొంత భాగం మాత్రం ఆమె సంభాషణల్లోను, శ్రీఅరవిందుల మహా కావ్యమైన "సావిత్రి" లోను నమోదు చేయబడినవి. 1958 లో భౌతిక స్థాయిలో అంటే ఆమె దేహంలోని కణాలలో రూపాంతరీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. వాటిలో సంభవించిన మార్పు, పవిత్రత, స్వేచ్ఛ, భౌతిక మనస్సు యొక్క సూచనల మేరకు మాత్రమే గాక, ఆమె పేర్కొన్న దేహ మానసము యొక్కయు, కణముల చేతనలోని మౌలిక పొరల యొక్కయు సూచనల నుండి సంభవించినవి.

1973 నవంబర్ 17 తేదిన తమ 95 వ యేట శ్రీమాత భౌతిక దేహం చాలించారు.

అనువాదం: బి. నరసింహయ్య

పరమాత్మ పదార్థములో నిమజ్జనమై, క్రమపరిణామము ద్వారా ఆ పదార్థము యొక్క జడత్వమును ఛేదించుకొని, తనను తాను ఆవిష్కరింప జేసికొనుటకై తంటాలు పడుతూ చేసే ప్రయాణములోని ఒక ఘట్టమే ఈ మానవ జన్మయొక్క అంతరార్థము.

మూలం: శ్రీఅరవిందులు

సమాచార పత్రము

బీహారులో కేంద్రముల, శాఖల వార్షికోత్సవము డాల్టన్‌గంజి 27, 28 మార్చిలో జరిగినవి. ప్రస్తుత విషయములు, భవిష్య కార్యక్రమములు గురించిన చర్చలను విజయ్. కె. పొద్దారుగారు నిర్వహించిరి. పశ్చిమ బెంగాలులో శ్రీఅరవిందుల ప్రభోధములపై ఒక శిబిరము గోపాల్ భట్టాచార్యగారు ప్రారంభోత్సవము చేయగా, కార్యకర్తలు వారి వారి కార్యక్రమములను గురించి ప్రసంగించిరి. శాంతి నికేతన్‌లో విశ్వభారతి యూనివర్సిటీ వారు నిర్వహించిన ఒక గోష్ఠిలో శ్రీ గోపాల్ భట్టా చార్యగారు ప్రసంగించిరి. రాణాఘాట్ (ప. బెంగాల్) లో శ్రీ గోపాల్ భట్టాచార్యగారు సావిత్రి మీద ఒక ఉపన్యాసము నిచ్చిరి. ధార్వాడ సత్తూర్ (కర్ణాటక) లో ప్రదీప్ నారంగు గారు ఒక కేంద్రమును ప్రారం భించి, శ్రీమాతారవిందులను గూర్చి ప్రసంగించిరి. దండేలి, హుబ్లీ, గడగ్ కేంద్రముల (కర్ణాటక) ను శ్రీ ప్రదీప్ నారంగుగారు దర్శించిరి. బీహారులోని రాంచి శాఖలో మార్చి 5 వ తేదీన అమరేంద్ర సింగు భండారి (అప్పటి గవర్నరు) ఒక కార్యక్రమమున పాల్గొనిరి. మోర్షి (మహారాష్ట్ర) కేంద్రములో 28 మార్చిన ఒక శిబిరములో 40 మంది సభ్యులు పాల్గొనిరి. బాలల కేంద్రములు సిర్సా (హరియానా) (పెద్దర్ రోడ్డు బొంబాయి) లో స్థాపించిరి.

ప్రకటనలు: శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశములు పాండిచ్చేరి బీచ్ ఆఫీసు ప్రాంగణములో జరుగును. మన కార్యక్రమములను గురిం చిన చర్చలు, ప్రసంగములు జరుపబడును. 17-25 ఆగష్టులలో డా॥ M. V. నాడ్‌కర్ణి గారు ఆంగ్లములో సావిత్రి అధ్యయన (Book 7; 5,6,7 సర్గలు) సత్ర నిర్వహించెదరు. దీనికందరు ఆహ్వానితులే.

నూతన ప్రచురణలు: How to sleep well Rs 10=00; Powers within Rs 30=00

వినతి: శ్రీఅరవిందో సొసైటీకి M.O పంపేటప్పుడు మీ పేరు, చిరు నామా, ఎందు నిమిత్తము పంపిస్తున్నారో స్పష్టముగా తెలియ చేయండి.

చేతన అనగా ఏమి?

(నిన్ను నీవు తెలుసుకో – III)



అఖిల

అఖిల భారత పత్రిక, జూలై 1999

ఉపోద్ఘాతము

సృష్టి రహస్యాన్ని అన్వేషించినట్లయితే మనం మూడు విషయాలను గురించి విచారించాల్సి వుంటుంది — అస్థిత్వము, చైతన్యము, చిత్పురుషుడు. అవి ఎక్కణ్ణుంచి వచ్చినయి? వాటి ప్రాతిపదికలేమిటి? తత్వమేమిటి? వాటి అసలు రహస్యమేమిటి? అనే సమస్యలెదురవుతాయి.

"అస్థిత్వమే మొదటి సమస్య...

"ఈ అస్థిత్వానికి చేతన ఎక్కణ్ణుంచి వచ్చింది... ఎట్లా పుట్టుకో వచ్చింది? అనేది రెండవ గడ్డు సమస్య.... ఎందుకంటే చేతనే లేకపోతే జీవుడికి తన ఉనికిని గురించి ఎట్లా తెలుస్తుంది? ఈ ప్రపంచంలో చరాచర వస్తువులు ఉండొచ్చును. కాని వాటికి గుర్తింపే లేనప్పుడు వాటి ప్రయోజనమేమిటి? అవి ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. చైతన్యం ప్రాణికి స్వీయ ఎరుకను, ప్రయోజనాన్ని కలగజేస్తుంది. కాని అసలు ఈ చైతన్యం అంటే ఏమిటో? అది ప్రాణి యొక్క స్వధర్మమా? లేక మధ్యలో సంక్రమించెనా? ఆకస్మిక సంఘటనా? అది ఎవరికి చెందినది? సమస్త ప్రపంచానికా? లేక కేవలం వ్యక్తి ధర్మమేనా? లేక అచేతనమైన ఈ విశ్వంలోకి ఎక్కడి నుంచైనా ఊడిపడిందా? దాని ప్రవేశం యొక్క అంతర్గతమేమిటో?

"చేతనా రహితమైన ఈ భౌతిక జగత్తులో చేతనా సహితమైన ఈ మానవుని పరమార్థం ఏమిటో అనే ప్రశ్న చివరి వరకు మిగిలిపోయే యున్నది.

"అసలు సమస్య చేతనదే. ఎందుకంటే మిగతా రెండింటిని అనుసంధించి వాటి సమస్యను లేవదీయునది చేతనయే.

చైతన్యం అంటే యేమిటి? దాని రూపు రేఖలు ఎలా ఉంటాయి? అనే ప్రశ్నలకు శ్రీఅరవిందుల సమాధానాలు ఈ సంచికలో పొందుపరచుచున్నాము".

స్వేచ్ఛానువాదం: బి. నరసింహయ్య

శ్రీఅరవిందుల ప్రవచనములు

విభాగము I: అవతారిక

విభాగము II: చైతన్యము యొక్క స్వరూపము

విభాగము III: చేతన యొక్క విభిన్న భూమికలు

విభాగము IV: ఉపసంహారము

చేతనే లేకపోతే

చేతన అనేది ఉండబట్టేకదా మనం మన ఉనికిని గురించి తెలుసుకో గలగుతున్నాం. దాని యథార్థతా విశిష్టతల గురించి విచారించ గల్గుతున్నాం. అసలు చేతన అనే వస్తువే లేనప్పుడు సత్యాసత్యాలను గ్రహించడానికి మన దగ్గర ఏ ఉపకరణమూ మిగిలి యుండదు. అట్టి స్థితిలో మనం సృష్టికి హేతువు 'ఇది' అన్నా ఒకటే 'అది' అన్నా ఒకటే. సత్యా సత్యాలను నిరూపించునదెవరు?

*

మొదట్లో సమస్యను లేవనెత్తునదీ చేతనే. పరిష్కరించునదీ చేతనే. చేతనే లేనిచో ఏ చిక్కూ ఉండదు. ఇక దానిని పరిష్కరించ వలసిన ప్రశ్నే లేదు. అస్థిత్వము, దానిలో ఇమిడియున్న శక్తి తమను తాము నిరంతరమూ వెలయించుకుంటూనే ఉంటయి. వివిధ రూపాలను పొందుతూ, చాలిస్తూ ఉంటయి. ఏం జరిగినా జరగక పోయినా ఎవరికీ లెక్క లేదు. దానిని పట్టించుకునే నాథుడే లేడు.

ఈ అస్థిత్వము ఒక కటిక సత్యంగా, అర్థరహితంగా మిగిలి పోతుంది. ఈ విశ్వమంతా ఒక చేతనా యంత్రంలాగ నిరంతరంగానో అంతరంగానో తిరుగుతూంటుంది. దానికొక హేతువూ లేదు, ప్రయోజనమూ లేదు. ఈ సత్యాన్ని వీక్షించగల్గే మరో విధమైన ప్రజ్ఞ ఉన్నప్పుడే అటువంటి ప్రశ్నలెదురౌతాయి. ఈ విన్యాసాన్ని మొదలు పెట్టి, నడిపించి, తద్వారా సుఖాన్నో దుఃఖాన్నో పొందుతూన్న ఒక వస్తువు ఉన్నప్పుడే కదా దాని మంచి చెడ్డల ప్రసక్తి వస్తుంది. లేక ఈ మథింపు ద్వారా ఒక చేతనత్వము ఆవిర్భావమై సత్త్వము, శక్తి తమను తాము తెలుసుకొని కొంతవరకైనా తృప్తి జెందుతాయి. ఒక వేళ ఆ చేతన తాత్కాలికమే అయినా అదే పదివేలు. అస్థిత్వాన్ని వెలిగించి అర్థవంతం జేస్తుంది. తనను తాను తెలుసుకుండేటట్లు జేస్తుంది. అంటే ఇది శూన్యంలో జేయు ఒక 'వ్యర్థ ప్రేలాపన'యో లేక 'శ్మశాన వాటిక'యో గాదు. ఏకానేకముల 'హుళక్కి' కాదు.

స్వేచ్ఛానువాదం: టి. మాధవరావు

భౌతికవాదులేమంటారో చూద్దామా?

ఆధునిక భౌతికవాదము విజ్ఞాన ప్రభావితము. దాని పరిధి ఆధునిక విజ్ఞాన దృష్టికే పరిమితం. చైతన్యము జడపదార్థ జనితమట, పరిసరముల పట్ల కలిగే స్పందనమేనట. కాని ఇది అసలు చైతన్యము కాదు — దాని అనంతకోటి విన్యాసములలోని ఒక చిన్న వ్యవహారము మాత్రమే. ఎందుకంటే సృష్టియందెల్లడలా వ్యాప్తమై, మనము చైతన్యము అని పిలిచే అసలైన వస్తువు మరియొకటున్నది. ఈ అసలు చైతన్యానికి, విజ్ఞాన శాస్త్రజ్ఞులు నిర్వచించే సంకుచిత వస్తువునకు, చాలా దూరమున్నది.

*

మనిషి తన పరిసరములను గురించిన జ్ఞానమును ఇంద్రియముల ద్వారా పొందుతాడు. కాని పంచేంద్రియములు ప్రకృతి యొక్క బాహ్యరూపమును మాత్రమే చూడగలవు. వాటి నిజరూపమును చూడలేవు. కాని మనిషి యోగసాధన ద్వారా చిత్తమును నిరోధించి, ఇంద్రియములను నియమించగలడు. అప్పుడు ఇంద్రియ స్పందనములుండవు. కాని నిరవయవ జ్ఞానము భాసిస్తుంది. అందుకని అప్పుడు చైతన్యము లేదనుకునేందుకు వీలులేదు. అట్లనుట ముఖ్య మౌలిక యోగానుభూతులకు పూర్తిగా వ్యతిరేకము. అప్పుడు చైతన్యము నిశ్శబ్దంగా, నిశ్చలంగా, సర్వే సర్వత్రా వ్యాప్తముగా అనుభూతమవుతుంది. అది నిశ్చలంగా, ఆత్మవేదిగా, బాహ్య స్పర్శలపైగాని, స్పందనలపైగాని ఆధారపడక తన స్వంత అస్తిత్వమును కలిగి యుంటుంది. ఇంకా చెప్పాలంటే "నేను" అనుకుండే ఆత్మాశ్రయ వ్యక్తి (subjective personality) కూడా 'శుద్ధ చైతన్య' జనితము, 'ఆత్మ' తత్వము, 'పురుష' సంబంధితమేగాని తాత్కాలికమైన ఒకే జన్మ సంబంధితముగాదు.

*

చేతన, పదార్థాంతర్గత శక్తి యొక్క పర్యవసానమేనని భౌతిక శాస్త్రజ్ఞుల సిద్ధాంతము. అది ఒక వస్తువును చూసినప్పుడు మరియొక వస్తువునందు కలిగే పరిస్పందనము. బాహ్యస్పర్శలకు జడ పదార్థ నిర్మిత రసాయన వస్తువులు సలిపే ప్రతిస్పందనము. ఈ స్పందనలను,

అచేతన పదార్థము తన కణములు, నరములద్వారా, ఎటులనో ఒక అనూహ్యమైన రీతిలో గుర్తించును. అనగా ఒక అచేతన వస్తువు మరి యొక అచేతన వస్తువును చూసి చేతనా పూర్వకంగా పరిస్పందిస్తుం దనే అభూత కల్పనకు మనం ఒప్పుకొన్నట్లయితే తద్వారా కవులు కవనము చేయుట, శాస్త్రజ్ఞులు నూతన విషయముల నావిష్కరించుట, వేదాంతులు నూతన సిద్ధాంతములను రచించుట మొదలైన వ్యవహా రములన్ని సంభవిస్తయుట! ఈ విధమైన యాంత్రిక వివేచనము, లేక మెదడు యొక్క కేవల యంత్రాంగము — ఒక గ్రంధి Hamlet ని వ్రాయగలదా? మెదడులోని ఒక ముద్ద ఒక క్రొత్త సిద్ధాంతాన్ని తయారు చేయగలదా? ఈ విధమైన ప్రతిపాదనల ద్వారా కార్యకారణ సంబంధము పొసగదు. అది న్యాయ విరుద్ధము. ఈ అగాధాన్ని ఎవరూ పూడ్చలేరు. ఏ విధమైన వాదనతోను దీన్ని దాట లేరు. ఈ సమస్య తర్కమునకు లొంగునది కాదు. చేతన, అచేతనల మధ్య ఒక సంబంధ మేర్పడవచ్చు. అవి పరస్పరముగా చొచ్చుకొని పోవచ్చు. పరస్పర ప్రభావితములు కావచ్చు. కాని ఈ రెండూ ప్రతిపక్షములే. ఎప్పటికీ ప్రతిపక్షములుగా ఉండవలసిందే. అవి అసంగతములు. మూలతః వ్యతి రేకములు. చేతన అనగా చూచునది, క్రియాశీలమైనది. అట్టి చేతన శాశ్వతమైన అచేతనములోనుంచి జనిస్తుందనుట అసంభవము. అది ఒక అభూత కల్పన (వంధ్య పుత్ర సామ్యం). అర్థంలేని విషయము. ఈ రెండిటి మధ్య మైత్రి ఎట్లా కుదురుతుంది? అచేతనలో చైతన్యము దాగియైనా ఉండాలి. అప్పుడు అచేతనము కేవలము ఒక వ్యావహారిక రూపమే గాని మౌలికము గాదు. లేదా అచేతన చేతన యొక్క ముసుగు అయివుండాలి. చేతన ముకుళితము కాగా మనకు అచేతనమువలె కనబడును. కాని నిజానికి అది చేతన యొక్క ఆచ్ఛాదమే. అందుండి బహిర్గతమైనప్పుడు దాని మూలరూపములో చేతనగా మనకి ప్రత్యక్ష మౌతుంది.

*

చేతన: చేతననగా ఏమి? అసలు చేతనే అనేది లేదనేవాళ్ళు వున్నారు. అది పదార్థ వ్యవహారమేనట. పదార్థగతమై జడవస్తువుల పరస్పర ప్రవ ర్తనమేనట. ఆలోచనలనగా మెదడనే పదార్థములోని పరిస్పందనములే

నట. పదార్థ జగత్తుకావల వాటికి ఉనికి లేదట. మెదడు లేకపోతే ఆలోచనలు లేవట. అవి మెదడనే పదార్థముతో ఏర్పడిన విషయములేనట. ఆ పదార్థమే లేకపోతే ఆలోచనలు ఉండజాలవుట. మనస్సు జడ పదార్థము యొక్క వృత్తి, దానికంటె భిన్నమైన శక్తి కాదు. శరీరముకంటె గొప్ప వస్తువు కాదు. దాని ఉనికి శరీరగతమే. శరీరము యొక్క విన్యాసమే. శరీరము ఎంతకాలముంటే అదికూడా అంత కాలమే ఉంటుంది. శరీరము రాలిపోయినప్పుడు అది కూడా రాలి పోతుంది. మనస్సు అనగా కొన్ని వాయువుల రసాయన పరిణామము వలన, కొన్ని గ్రంథుల ప్రభావము వలన, స్నాయువుల ప్రేరణ వలన ఏర్పడిన పదార్థము మాత్రమే. మనస్సు ఒక భౌతిక పదార్థము, దాని చేష్టల ఫలితము.

అసలు ఈ మనస్సు, చైతన్యము, చైతన్యము గల జీవి ఎందుకు అవతరించినట్టు? అదికూడ జడ పదార్థము యొక్క గారడీయేనట. బాహ్య పదార్థములపట్ల, వస్తువుల పట్ల, భూతముల పట్ల, చేష్టల పట్ల, శక్తుల పట్ల కలిగే ప్రతి క్రియలు, ప్రతి స్పందనములేనట. ఇంద్రియ జ్ఞానము, సంవేదనలు నరముల బాహ్య ప్రేరణలకు, బాహ్య వస్తువులకు, అంతః ప్రేరణలకు సలిపే జవాబేనట. కాని మనిషికి ఇవన్నీ మనస్సు ద్వారా అనుభూతము కావచ్చు. అయితేనేమి? యివన్నీ పదార్థము, దాని ప్రక్రియల సంబంధితములే.

అది అటులనే కానిండు. అయినప్పటికి ఈ తతంగమంతా మానసికమే అయినప్పటికీ, దాని ద్వారా ఆత్మ యొక్కయు వస్తువుల యొక్కయు జ్ఞానము కలుగుతున్నది గదా. తత్కారణముగా యీ పరిజ్ఞానమును, "తెలియుటను" ఒక అచేతనాత్మక ప్రక్రియగా చెప్పుట హాస్యాస్పదం. అచేతనే చేతనగా భాసిస్తుందనుట మరీ విడ్డూరము. జడ పదార్థమును పరిశోధించి సేకరించిన విషయములే నిజమనియు, ప్రపంచకంలో జరిగే మిగతా సమస్తమైన సంఘటనలను కూడా అదే న్యాయంతో సరిపెట్టుకోవాలని వారి కుతర్కము. వారు గీచిన గీతలలో వారే బందీలై యుంటారు. అంతకు మించిన జ్ఞానం ఉన్నదని వాళ్లు ఒప్పుకోరు. కనీసం "తెలిసికొనుట" అంటే ఏమిటో, దాని ప్రకారములు ఏ విధమైనవో, అవి మనిషికి ఏ విధంగా సాక్షాత్కరించునో,

మనలనెక్కడికి తీసుకు పోతున్నాయో తెలుసుకుండే హక్కు మనకుం డాలిగదా. అవి జడపదార్థ గతములు లేక శరీరగతము లైనప్పటికీ, అవి మనని జడ పదార్థమునుదాటి, శరీరమును దాటి తీసుకు పోతున్నాయా లేదా? విద్యుచ్ఛక్తి, అయిస్కాంతములు, ఆవిరి మొదలైనవన్నియు మూల శక్తి యొక్క వివిధ విన్యాసములని అందరికీ తెలుసు. కాని భౌతిక వాదుల ప్రకారం చైతన్యము మెదడు యొక్క ఒకానొక ప్రక్రియే అయిన ప్పటికీ, అచేతనమైన జడపదార్థము కొన్నిచోట్ల చేతనముగాను సంవే దనములగాను పరిణమించినదనే సత్యమును వారు దాచి పెట్టలేరు.

ఈ "తెలియుట" వలన సంవేదనాశీలమైన, చైతన్యముగల ఒక జీవి జన్మించాడుగదా. అతనికి ఒక తెలివి యున్నది. తనను గురించి, వస్తువులను గురించిన పరిజ్ఞానమున్నది. అతను వాటి తీరు తెన్నులను, ప్రవర్తనలను పరిశీలించి తెలిసికోగలడు. తన యొక్క స్వీయ చేతనను, ప్రపంచ శక్తులను, ప్రక్రియలను శోధించగలడు. ప్రణాళికలను తయారు చేసి చిత్ర విచిత్రములను తయారు చేయగలడు. ఆలోచించగలడు. తాత్వికముగా విచారించగలడు. కవిత్వమును రచిం చగలడు. కళాఖండములను రూపొందించగలడు. తన తెలివితో తన చుట్టూ ఉన్న ప్రపంచమును మార్చగలడు. జీవిత సౌకర్యములను పెంపొందించగలడు. తన దృష్టిని వస్తు ప్రపంచకమునకు అతీతముగా సారించి చూడగలడు. నేటి వరకు అందుబాటులో లేని చేతనా శిఖర ముల వైపు తన దృష్టిని సారించి, ఉన్నత చైతన్యమును గురించి అవలోకించగలడు. ఇంతటి సామర్థ్యముగల చైతన్యము ఒక శక్తి కాక పోవచ్చు. అయినప్పటికీ అటులనే కనబడుచున్నది. అందుకని దానిని కనీసం ఒక శక్తిగా పరిగణించి, పరిశీలించి అదెక్కడికి దారితీస్తుందో మనని ఎంతదూరం తీసుకుపోతుందో చూసేందుకైనా మనకు హక్కు ఉండాలి గదా.

మన శోధన పదార్థ జగత్తు కంటె గొప్పది, పదార్థగత శక్తుల కంటె ఘనమైనది అయిన మరో లోకానికి దారితీయగలదు. కేవలం దృగ్గోచరమైన ప్రపంచకమే కాకుండా, దాని యొక్క సత్యమునకు వీటన్నిటికీ మూలమైన ఒకానొక మూల తత్వమునకు మార్గము ఏర్పడగలదు.

*

ఈ ప్రపంచకంలో పదార్థము, దాని వృత్తుల మినహా మరే మియూ లేవు.

ఈ సిద్ధాంతానికి మూలం భౌతిక శాస్త్రం. దాని దృష్టికి ఈ చరాచర జగత్తంతా పదార్థము యొక్కయు దాని శక్తులయు విన్యాసము. ఈ సిద్ధాంతమునకు వ్యతిరేకముగా ఎన్ని ప్రశ్నలెదురైనప్పటికీ ఆధునికులు దానినే నమ్ముకొని కూర్చుంటారు. ఎందుకంటే ఇప్పటి సిద్ధాంతం ప్రకారం పదార్థమనేదే లేదట. అది శక్తి యొక్క ఖేలనమేనట. ఇంద్రియ గోచరమైన ఈ సమస్తమైన వస్తువులు, మనము జడము అని పిలిచే సర్వస్వమూ శక్తి యొక్క పరిభ్రమణములేనట.

స్వేచ్ఛానువాదం: కె. రామారావు, రాయప్రోలు లక్ష్మీనరసింహా శాస్త్రి

మానసిక విశ్లేషణా శాస్త్రజ్ఞుల ప్రయోజకత్వము

మానసిక విశ్లేషణ ఒక చీకటి శాస్త్రము. వాళ్ళది మిడిమిడి జ్ఞానము. నూనె దీపంతో సూర్యతేజస్సును కొలవటంలాంటిది. ఆధ్యాత్మికానుభూతులను వాళ్ళ కొలతబద్దతో కొలవబూనుట హాస్యాస్పదము. ఈ మిడిమిడి జ్ఞానం చాలా ప్రమాదం కూడాను — యథార్థ జ్ఞానాన్ని అది కప్పి పుచ్చుతుంది.

ఈ కొత్త మనోవిజ్ఞానశాస్త్రం పిల్లలు ఓ, న, మాలు నేర్చుకోటం లాంటిది. ఇది కూడా పూర్తి అక్షరమాల కాదు. అవచేతన యొక్క ఓ, న, మాలను, నిగూఢమైన అత్యహంకారమును, కలిపి అదే యథార్థ జీవనమునకు ద్వారమని ఊహించుకుండే అర్భకులు ఈ మానసిక శాస్త్ర నిపుణులు. నేల వైపు చూస్తూనే నింగివైపు దృష్టిని సారిస్తారు. అధో స్థితిలోని అస్పష్టాలతో, మాలిన్యాలతో, ఉత్తుంగ తేజో ప్రకాశాలను నిర్వచించి విపులీకరిస్తూంటారు. వీటన్నింటికి మూలాధారం ఊర్ధ్వ స్థితియే గాని నిమ్నస్థితి మాత్రం కాదు. "ఉపరి బుధ్న ఏషాం", అతిచేతనే (ప్రజ్ఞాచేతన - superconscient) ఈ ప్రవృత్తులకు నిజమైన ఆధారం కాని అవచేతన మాత్రం కాదు. మట్టి

బురదల నుంచి వికసించిన పద్మపుష్పం యొక్క రహస్యం ఆ బురదను పరిశోధిస్తే అవగతమవదు. ఊర్ధ్వాకాశమందు నిరంతరము భాసిస్తూ వికసిస్తూండే పద్మ పుష్పాల దివ్య ప్రతిరూపములందే ఆ రహస్యాన్ని గ్రహించగల్గుతాము. పైగా ఈ మనో వైజ్ఞానికుల స్వయం నిర్మిత క్షేత్రం అతి సంకుచితము, దీనము, అంధకారము. ముందుగా నువ్వు సంపూర్ణ త్వాన్ని తెలుసుకొన్న తరువాతనే అందులోని భాగములను గురించి తెలుసుకోగలుగుతావు. అదే విధంగా అత్యున్నతమైన దానిని గ్రహిస్తేనే అత్యధమమైన దాన్ని గురించి తెలుసుకుంటావు. పూర్ణ మనో విజ్ఞానం తన ఘడియ కోసం ఎదురుచూస్తూ అభయ వచనాన్ని మాత్రం ఇస్తోంది. అప్పుడు ఈ దయనీయమైన చీకటి పరిశోధనల కాలం తీరిపోయినట్లే.

స్వేచ్ఛానువాదం: టి. మాధవరావు.

విభాగము II: చైతన్యము యొక్క స్వరూపము

సచ్చిదానందం

పరం కేవల శుద్ధతత్త్వం. కేవల సత్పదార్థం. అతడు సత్యస్వరూపుడు. ఎందుకంటే అతడొక్కడే యథార్థంగా వున్నాడు కనుక. అతని ఉనికి కంటె అన్యం లేదు కనుక. ఆతని అభివ్యక్తీకరణ కంటె భిన్నంగా మరొకటి లేదు కనుక.

ఆ పరతత్త్వం శుద్ధ జ్ఞానం, కేవల చైతన్యం, చిత్పదార్థం. ఇక్కడ మనం కొంచెం జాగ్రత్త పడాలి. ఈ చిత్స్వరూపానికిన్నీ మన మానవీయ ఆలోచనా, జ్ఞానాలకు సంబంధం లేదు. అలాగే, విశ్వజనీన సర్వజ్ఞమైన మనస్సుని అలంకారాత్మకంగా చూడడం సరిగాదు. మనస్సు, ఆలోచనా, జ్ఞానమూ, సర్వజ్ఞత, పాక్షిక జ్ఞానం, అవిద్య ఇవన్నీ ఆ మహా చైతన్య సముద్రంలో లేచే కెరటాలు. కానీ, ఆ మహా చిత్పదార్థం మన ఆలోచనా తరంగాల నధిగమించిన ఒక మహా భావం.

బ్రహ్మ పదార్థం యాంత్రికంగా పరిభ్రమించే విశ్వశక్తి కాదనీ, మరి అచేతన కారణశక్తీ కాదని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. అతడు

చేతనావంతుడు. లేక చైతన్యమే అతడు. చిత్స్వరూపుడే కాడు. సత్స్వ రూపుడున్నూ. ఈ సత్-చిత్‌లు రెండూ ఒకటే. సత్తే చిత్తు. సత్తును చిత్పదార్థ భిన్నంగా భావించటానికి వీల్లేదు.

చివరగా — ఆ పరతత్వం కేవల ఆనందమయం. ఎలా సత్ చిత్తులు ఒకటో, అలాగే ఈ రెండూ ఆనంద భిన్నాలు కావు. సత్తు ఏ విధంగా చిత్తో, దానినుండి వేరు చేయడానికి వీల్లేదో అదేవిధంగా చిత్‌సత్తు ఆనందమే. దీనినుండి దాన్ని వేరుచేయడానికి వీల్లేదు. ఈ విషయాన్ని మనం భౌతిక దశలో పరిచ్ఛిన్నమైన చైతన్య దశలో, పరి చ్ఛిన్నమైన ఉనికిలో కూడా అనుభవించ వచ్చునుకుంటాను. అత్యంత విషణ్ణ చేతనలో కూడా ఒక ఆనందపుటునికి రేఖామాత్రంగానైనా, ఒక ఆవగింజలాగానైనా వుండితీరాలి.

*

దైవము సచ్చిదానందము. అతడనంత విశ్వముగా పరిణమిం చినాడు. ఆ అనంత స్థితికి సారము చిత్తు. దీని సారము ఆనందము — అనగా ఆత్మానందము. ఇది వైవిధ్యము నంగీకరించి విశ్వముగా పరి ణతి చెందినది. కాని ఈ మాటలు తాత్త్వికములు — సాంకేతిక శబ్ద ములు. ఇట్టి అమూర్తమైన భావములు ద్రవ్యార్థములను భౌతికార్థము లను ఈయజాలవు. అవి వ్యక్త్యతీత దశాస్ఫోరకములు. అట్టి స్థితి వైయ క్తిక క్రియాజాలమును పుట్టింపలేవు.

సచ్చిదానందము విశ్వముగా ఆవిర్భవించుటను విచారించితి మేని ఈ విషయము సుస్పష్టమగును. ఆ ఆవిర్భావ క్రియలో ఆనందము ప్రేమగా ననూదితమగును. చిత్తు భావనాత్మక జ్ఞానముగాను కార్యనిర్వ హాక క్రియాశక్తిగాను మారును. సత్తు (సత్తా మాత్ర స్థితి) వ్యక్తిగా — అనగా జీవుడుగా, ద్రవ్యముగా పరిణమించును. కాని ప్రణయము ప్రేమిం పబడు వస్తువు, ప్రేమికుడు లేనపుడు అసంపూర్ణము. అట్లే జ్ఞానము- జ్ఞాత, జ్ఞేయముల వినా అసంపూర్ణము. శక్తి-కార్మికుడు, కర్మల వినా అసంపూర్ణము. పదార్థము — గ్రహించువాడు, నిర్మించువాడు లేనపుడు అసంపూర్ణము.

దీనికి కారణమేమనగా ఆ మొదటి శబ్దాలు నిజమునకు నిర్గుణ — విశ్వోత్తీర్ణ భావములు కావు. బ్రహ్మ పదార్థగత ఆనందము

నకు భోక్తయున్నాడు. బ్రహ్మచిత్తునకు జ్ఞాతయున్నాడు. అతని సత్తునకు స్థితుడున్నాడు — కాని బ్రహ్మానందమును ననుభవించు చేతనకు వస్తువు తానే. అట్లే స్థితికి మూల పదార్థమును తానే. ఆ దివ్యపురుమనిలోని జ్ఞానము జ్ఞాత జ్ఞేయములు ఆనందము కలిసియే యున్నవి. భోక్త — భోగ్యములూ ఒకటే.

ఈ బ్రహ్మ స్వాత్మజ్ఞానము, స్వాత్మానందములకు రెండు ముఖాలున్నవి. ఒకటి చిచ్ఛక్తి. మరొకటి మాయా — లేక ప్రకృతి శక్తి. మొదటిది తనలో తాను విలీనమై యుండుట, రెండవది తనను తాను విస్తరింపజేసికొనుటకై వికీర్ణ వ్యాపృత మగుట. మొదటి స్థితి కేవల ప్రశాంతబ్రహ్మ స్వరూపము. వికీర్ణదశ క్రియాబ్రహ్మ స్వరూపము. స్వయంస్థితికమైన దాని విస్తృతి — బయటకు విస్తరించుటయే సృష్టి లేక విశ్వము, నిత్య భ్రమణము (భువనము, జగత్తు). బ్రహ్మమే విశ్వముగా పరిణమించుచున్నది. కాబట్టి విశ్వమును బ్రహ్మమే, ప్రేమకు విషయము ప్రేమికుని యాత్మయే. కర్మ — కార్మికుని ఆత్మ ప్రతిరూపమే, బింబమే. విశ్వము ఈశ్వరుని శరీరమే — ఆతని కర్మయే.

*

సచ్చిదానందాలు పైన ఏకం: సచ్చిదానందం త్రిముఖమైన ఏకం. పరబ్రహ్మమందు ఈ మూడూ మూడు కాదు, కింతు ఏకం — ఎలాగంటే, సత్తు చేతనయే. చేతన ఆనందమే. ఇలా అవి అవియోజ్యము. అవి యోజ్యం మాత్రమే కావు, కింతు భిన్నమే కానంతగా పరస్పర ఏకం. పోతే అభివ్యక్తియొక్క ఉచ్చతర భూమికల్లో అవి త్రివిధ ఏకమవుతాయి — ఇక్కడ కూడ అవి అవియోజ్యమే అయినప్పటికీ, ఒకటి ఎక్కువ ప్రముఖం చేయబడి, ఇతరాన్ని నడుపవచ్చు, లేక దానికి ఆధారంగా ఉండవచ్చు. కాగా క్రింది నిమ్నతర భూమికల్లో అవి (సచ్చిదానందాలు) బాహ్యదృష్టికి వియోజ్యం కాగలవు, అయినా తమ రహస్య సత్యతయందు అవి సదా ఏకమే. ఇలా ఇచ్చట తక్కిన రెండు లేకుండా ఒకటి పైకి కన్పించగలదు గాన, చేతన, ఆనందాలు లేని సత్తు, ఆనందం లేని చేతన మన ఎరుకలోకి వస్తాయి. నిజానికి, మన అనుభవంలో వాటి ఈ వేర్పాటు లేకపోతే, బాధ, అజ్ఞానం, అనృతం, మృత్యువు, అలాగే నిశ్చేతన అనబడే వస్తువు తమనుదామ అభివ్యక్తం

చేసుకోగలిగేవి కావు — ద్రవ్యం యొక్క వైశ్వ నిశ్చేతనం నుండి ఒక పరిమిత, దుఃఖమయ చేతన యొక్క ఈ పరిణామం జరిగి ఉండేది కాదు.

*

సచ్చిదానందము పురుషోత్తముని స్వరూపము — వ్యక్తీకృతి దాని అనంత సత్తా స్వభావము, చేతనత్వము, శక్త్యానందములు — ఇదంతయు పరాప్రకృతి (అవ్యక్తదశ). మనః ప్రాణ శరీరములు అపరా ప్రకృతి — (వ్యక్తదశ)

సచ్చిదానంద దశ పదార్థము — మహత్ స్థితిలో ఊర్ధ్వార్ధము (విశ్వస్థితిలో పై సగము). దాని స్వభావము అమృతము. పదార్థ (ద్రవ్య) గత మర్త్య దశ క్రింద సగము — అపరార్ధము. దీని స్వభావము మృత్యువు.

శరీరమందలి మనః ప్రాణములు మృత్యువునకధీనములు. ఎందుచేతననగా నవి సచ్చిదానందమును దర్శించలేక భ్రష్టములై పోవుచున్నవి కనుక. సచ్చిదానందమును తెలిసికొన్నంతనే అవి పరిణమించగలవు. అనగా మనస్సు సత్యము విజ్ఞానముగా, ప్రాణము చైతన్యముగా, శరీరము సత్పదార్థముగా అనగా కేవలసారముగా — మారిపోగలవు.

శరీరమున కిది సంపూర్ణముగా జరుగకున్నచో, ఆత్మ తన యథార్థ స్వరూపమును ఇతర లోకములందు సూర్య ప్రకాశవంతము లగు లోకములందు — ఆనందస్థితులందు — దర్శించి తిరిగి శరీరమున మర్త్య స్థితిలో ప్రవేశించి, పరిణామ క్రియను — (భ్రమణకార్యమును) — పూర్తిచేసికొనును. శరీరగతుడై ఈ సంపూర్ణమగు ఎఱుకను సాధించుటయే మానవ పరిణామ ధ్యేయము. ఆత్మ సచ్చిదానందమని యెఱుగుటయే మానవత్వమునకు — మానవ జన్మకు — పరమార్థము.

తెలుగు మూలం: చెలసాని నాగేశ్వరరావు, తుమ్మపూడి కోటేశ్వరరావు గార్ల రచనలు

చేతన అనగా ఏమి?

సృష్టిలోని మూల పదార్థము చేతన. పైకి తెలియక పోయినా, ఎంత 'కదలని మెదలని' వస్తువైనా, అందులో చేతన తప్పకుండా వుంటుంది. పైకి కనపడక పోయినా, బాహ్యా స్పర్శలకు స్పందించక పోయినా, ప్రేరణలకు చలించక పోయినాకూడా అది వుండనే వుంటుంది. ముకుళితమై నిష్క్రియమై వున్నా, సక్రియమైవున్నా, లేనట్లు కనపడినా, అచేతనంగావున్నా, రాయల్లే పడివున్నా చేతన వుండి తీరుతుంది.

*

ఈ సృష్టి యొక్క ఆది మూలము చేతన. దాని శక్తి వలన, కదలిక ద్వారా, ఈ విశ్వము, విశ్వములోని వస్తువులు సృష్టించబడి నవి. ఈ విశ్వము, అందులోని కోటానుకోట్ల జీవులు చేతన యొక్క విన్యాసములే. ఉదా: చేష్టలలో తనను తాను మరచి పోయినప్పుడు అది "అచేతన" అవుతుంది. రూపములో మరచి పోయినప్పుడు ఒక ఎలెక్ట్రాన్, అణువు, వస్తువులుగా భాసిస్తుంది. నిజానికి పరిణామ మార్గ మును ఏర్పరచి, తన రూపమును నిశ్చయించుకొనునది చేతనయే. పదా ర్థములో బందీగా వున్న చేతన పరిణామ ప్రక్రియ ద్వారా తన జడత్వ ములో నుంచి మెల్లి మెల్లిగా బైటపడినప్పుడు చెట్లుగా, జంతువులుగా, మానవులుగా రూపొందుతుంది. పరిణామము ఇంకా కొంత దూరం పోతే మానవమాత్రునికన్నా అతీతమైన భూమికను కూడా ధరించ గలదు.

*

మానసిక జాగ్రశ్చేతనను గుఱించి మనకే విధమైన భావము గలదో, దానినే సాధారణముగా మనము చేతన యందుము. కారణము, ఇట్టి చేతననే మానవ ప్రాణి తాను నిద్రితుడు, మూర్ఛితుడు, లేక తది తరముగా తన భౌతిక మఱియు బాహ్యా సంవేదనా ప్రకారముల నుండి వంచితుడు గానపుడు, తన శారీరక జీవనము యొక్క అధికాంశ భాగ మునందు కలిగియుండును. ఈ అర్థమున, భౌతిక విశ్వము యొక్క వ్యవస్థయందు చేతన అపవాదమే (exception) యగును గాని, నియ

మము గాదనుట స్పష్టమే. ఏలన, మనము సైతము దాని నెల్లపుడు కలిగియుండము. చేతనా స్వరూపమును గుఱించిన ఈ మోటు మఱియు పైపై భావము, దాని ఛాయ ఇంకను మన ఆలోచన మఱియు ఆలోచనా సాహచర్యములపై పడుచున్నను, ఇపుడు మన దార్శనిక చింతన నుండి నిశ్చితముగా నిర్గమించవలెను. ఏలన, మనము నిద్రించునపుడును, స్మృతితప్పినపుడు దెబ్బ తగిలినపుడు లేక మత్తుమందు సేవించినపుడు లేక మూర్ఛితులమై నపుడును — పైకి అచేతనముగా గన్పించు భౌతిక సత్త యొక్క సర్వావస్థలయందును సచేతనమగున దేదియో మన లోపల గలదని మనకిపుడు దెలియును.

అవశ్యముగా, అట్టి దృష్టియందు చేతనాశబ్దము తన అర్థమును మార్చుకొనును. అది యిపుడిక మనస్సునకు పర్యాయపదము కాదు, కింతు మనస్సు దేనియొక్క ఒక మధ్యమ రూపమో, సత్తయొక్క ఆ స్వ-చేతనశక్తి నది సూచించును. మనస్సునకు దిగువన, మనకు అవచేతనములగు ప్రాణిక మఱియు భౌతిక క్రియలలోని కది దిగిపోవును. మనస్సునకు పైన మన చేతన కందని అతిమనస్సులోనికది ఆరోహించును. కాని మూడు స్తరములందును తనను వేఱు వేఱుగా సంఘటిత పఱచుకొను వస్తు వొక్కటియే. మఱియొకసారి చెప్పవలెననిన ఇదియే చిత్తును గురించిన భారతీయ భావన. ఈ చిత్తే తన శక్తి రూపమున లోకములను సృజించును.

*

చేతన ఆత్మ జ్ఞానమును వస్తువుల పరిజ్ఞానమును కలిగించగలదు. అది స్థితిశీలము (static energy). దానికి dynamic and creative energy అనగా గతిశీలము, సృజన శీలము అయిన మరియొక శక్తి కూడా వున్నది. బాహ్య విషయములకు స్పందించరాదో లేక స్పందించ వలెనో, ఎటుల స్పందించ వలెనో తనే నిర్ణయించుకోగలదు. బాహ్యశక్తులకు ప్రత్యుత్తరమివ్వటమే కాకుండా తనుకూడా కొన్ని శక్తులను పుట్టించి వాటిని ప్రయోగించగలదు. చేతన చిత్తు మాత్రమేగాదు, చిచ్ఛక్తి గూడ.

*

మము గాదనుట స్పష్టమే. ఏలన, మనము సైతము దాని నెల్లపుడు కలిగియుండము. చేతనా స్వరూపమును గుఱించిన ఈ మోటు మఱియు పైపై భావము, దాని ఛాయ ఇంకను మన ఆలోచన మఱియు ఆలోచనా సాహచర్యములపై పడుచున్నను, ఇపుడు మన దార్శనిక చింతన నుండి నిశ్చితముగా నిర్గమించవలెను. ఏలన, మనము నిద్రించునపుడును, స్మృతితప్పినపుడు దెబ్బ తగిలినపుడు లేక మత్తుమందు సేవించినపుడు లేక మూర్ఛితులమై నపుడును — పైకి అచేతనముగా గన్పించు భౌతిక సత్త యొక్క సర్వావస్థలయందును సచేతనమగున దేదియో మన లోపల గలదని మనకిపుడు దెలియును.

అవశ్యముగా, అట్టి దృష్టియందు చేతనాశబ్దము తన అర్థమును మార్చుకొనును. అది యిపుడిక మనస్సునకు పర్యాయపదము కాదు, కింతు మనస్సు దేనియొక్క ఒక మధ్యమ రూపమో, సత్తయొక్క ఆ స్వ-చేతనశక్తి నది సూచించును. మనస్సునకు దిగువన, మనకు అవచేతనములగు ప్రాణిక మఱియు భౌతిక క్రియలలోని కది దిగిపోవును. మనస్సునకు పైన మన చేతన కందని అతిమనస్సులోనికది ఆరోహించును. కాని మూడు స్తరములందును తనను వేఱు వేఱుగా సంఘటిత పఱచుకొను వస్తు వొక్కటియే. మఱియొకసారి చెప్పవలెననిన ఇదియే చిత్తును గురించిన భారతీయ భావన. ఈ చిత్తే తన శక్తి రూపమున లోకములను సృజించును.

*

చేతన ఆత్మ జ్ఞానమును వస్తువుల పరిజ్ఞానమును కలిగించ గలదు. అది స్థితిశీలము (static energy). దానికి dynamic and creative energy అనగా గతిశీలము, సృజన శీలము అయిన మరియొక శక్తి కూడా వున్నది. బాహ్య విషయములకు స్పందించరాదో లేక స్పందించ వలెనో, ఎటుల స్పందించ వలెనో తనే నిర్ణయించుకోగలదు. బాహ్యశక్తులకు ప్రత్యుత్తరమివ్వటమే కాకుండా తనుకూడా కొన్ని శక్తులను పుట్టించి వాటిని ప్రయోగించగలదు. చేతన చిత్తు మాత్రమేగాదు, చిచ్ఛక్తి గూడ.

*

విశ్వగతమగు సమస్తము యొక్క మూలము, ధారకము, (continent, ధరించునది), మఱియు అంత్య సత్యత, అతీత మఱియు అనంతమగు సత్తు, చిత్తు, ఆనంద-రూప త్ర్యేక (triune) తత్త్వ మనియు, ఈ తత్త్వము దివ్యపురుమని యొక్క ప్రకృతి యనియు మనము నిర్ధరించి యున్నాము. ఇందు చేతనకు రెండు పార్శ్వములు — 1. ప్రకాశకము, 2. కార్యసాధకము. అనగా 1. ఆత్మ — సంవిత్తు యొక్క స్థితి మఱియు శక్తి, 2. ఆత్మబలముయొక్క స్థితి మరియు శక్తి: కాగా ఈ రెండు పార్శ్యముల ద్వారా సత్తు తన నిష్క్రియ అవస్థయందు గాని, సక్రియ గతియందు గాని తనను దాను బొందియుండును. ఏలన, ఈ సత్తు (సత్పురుమడు) తన సృజనాత్మక క్రియయందు తన లోపల అవ్యక్తముగా దాగియున్నదాని నంతను ఒక సర్వశక్త స్వ-చేతన చేత నెఱుంగును. మఱియు నొక సర్వజ్ఞ స్వ-ఊర్జము చేత తన శక్యతల యొక్క రూపమగు విశ్వమును బుట్టించి, పాలించును.

*

అయినను నిష్క్రియ, సక్రియ అవస్థలు రెండును అనంత చేత నకు సంభవమని మనకిపుడు స్పష్టముగా దెలియును. ఇవి దాని స్థితు లలో రెండు మాత్రము మఱియు రెండును వైశ్వ సంవిత్తునందు ఏక కాలమున వర్తింపగలవు. ఇందు ఒకటి రెండవ దానికి సాక్షిగాను, ఆధా రముగాను ఉండును, లేక సాక్షిగా రెండవ దానిని చూడకయే, అచింతి తముగానే దాని కాధారముగా నుండును. లేక ఒకదాని శాంతియు నిష్క్రియ స్థితియు రెండవ దాని యొక్క సక్రియతను ఆవేశించియుండ వచ్చును, లేక అడుగున అచలముగా నుండి, తన ఉత్తలమునందు తరంగముల సచలతను పైకి త్రోయు మహాసాగరమువలె దానిని బైకి త్రోయవచ్చును. మన సత్తయొక్క కొన్ని పరిస్థితులయందు అనేక భిన్న భిన్న చేతనావస్థల ఎఱుకను ఏకకాలమున గల్గియుండుట ఏల సంభవమో, దానికి కారణముగూడ నిదియే (అనంతమునకు అనేకా వస్థలు సంభవ మనునదియే). యోగమునందు అనుభూతమగు సత్త యొక్క ఒక అవస్థ గలదు. దానియందు మన మొక ద్వివిధ చేతన యగుదుము — 1. ఉత్తలీయము, 2. ఆంతరము. ఇందు ఉత్తలీయము, క్షుద్రము, సక్రియము, అజ్ఞము, ఆలోచనా, భావములచేతను, హర్షశోక

ముల చేతను సర్వవిధ ప్రతిక్రియల చేతను ఆందోళితము; ఇక ఆంత రము శాంతము, విశాలము, సమము. ఇది ఉత్తలీయ సత్తను ఒక అచల అసంగము లేక లాలనతో గమనించుచుండును. లేక దానిని శాంత పఱచుటకును, విశాల పఱచుటకును, రూపాంతరము గావించుటకును దాని సంక్షోభముపై పనిసేయుచుండును.

స్వేచ్ఛానువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి, చెలసాని నాగేశ్వరరావు (దివ్యజీవనం నుండి)

చైతన్యం ఒక చిత్ శక్తి

మనస్సు, పదార్థము ఒకే శక్తి యొక్క రెండు స్థాయిలు, చైతన్య శక్తి యొక్క విభిన్న వ్యూహాములు అని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

అయితే ఈ శక్తిని చైతన్యం అని మాత్రమే భావించడం ఎంత వరకు సమంజసం? ఒక విధమైన తెలివి, ప్రయోజనత్వము, స్వీయ జ్ఞానము అనునవి చేతన యొక్క లక్షణాలుగదా! అవి మన మనస్సుకు పరిచితమైన రూపాలను ధరించక పోవచ్చు. కాని చేతనలో అవి నిగూఢమై వున్నాయి. ఈ దృష్ట్యా చూస్తే ప్రతిదీ విశ్వ చేతనా సిద్ధాంత మును బలపరుస్తుందే కాని వ్యతిరేకించదు. ఉదాహారణకు సాధారణ జంతుమానసమునకు అసాధ్యమైనట్టియు, మనిషి కూడా సుదీర్ఘమైన విద్యా సంస్కృతుల ద్వారా మాత్రమే అలవరచుకో గల్గినట్టి జ్ఞానాన్ని, చక్కని కార్య నిర్వహణా కౌశలాన్ని మనం జంతువులో చూస్తున్నాం. ఈ చైతన్య శక్తి చాలా తెలివైనది. తన ఉద్దేశాన్ని, గమ్యాన్ని, సాధ నను చక్కగా గుర్తించ గల్గినది. ఈ మహాశక్తి జంతువుల ద్వారా, కీటకం ద్వారా తన కార్యాన్ని నేర్పుగా నిర్వహిస్తుండడం మనం గమనిస్తున్నాం. దీని కార్యనిర్వహణ సామర్థ్యం ఇంతవరకు భువిపై మానవుని ద్వారా ఆవిర్భవించిన అత్యున్నత మానసిక ప్రతిభకన్నా గొప్పదిగా ఉంటున్నది. జడప్రకృతి కార్యనిర్వహణమునందుకూడ "దాని కార్య విధానాల్లో దాగియున్న" నిగూఢ పరమోత్కృష్ట మేధస్సు వ్యాపించి వుండడం మనం కొనుగొంటున్నాం.

పరిణామం ఒక బృహత్తర సుధీర్ఘ ప్రణాళిక. ఈ కార్యక్రమం ఒక పరమోద్దేశంతో కూడుకొని వున్నది. వివేకవంతమైనది. పరివర్తనా ప్రక్రియలో పలు ఘట్టముల ఎన్నిక, బాహ్యా పరిస్తితులతో సర్దుబాటు జేసుకొనుట, ఉన్నత దివ్య శక్తులను నిమ్న భూమికలలో స్థిరపర చుట — ఇత్యాది కార్యములకు చేతన ఎంతో కాలమును, శక్తిని విని యోగించ వలసి వస్తున్నది. తన్మూలంగా ఆ దివ్య చేతనాశక్తి వ్యర్థ మవుతున్నదని ఒక వాదన. కాని యిలాంటి ప్రతికూల వాదనకు ఆధారం మానవ మేధస్సు యొక్క పరిమితులే అనవచ్చు. పరిమితమైన మానవ జీవిత గమ్యాలకు సరిపడే పరిమిత మానవ మేధస్సు విశ్వశక్తి కార్యాలపై తన హేతువాదాన్ని రుద్దాలని చూస్తుంది. మనం ప్రకృతి ఉద్దేశం యొక్క ఒక పార్శ్వాన్ని మాత్రమే చూస్తాం. మనం వృథా అవుతోందనే శక్తి అంతా కూడా ఆ పరిమిత పరిణామ కార్యం కొరకే వినియోగింప బడడం లేదు. విశ్వ విశాల దృష్టితో పరిశీలిస్తే గాని యథార్థం మనకు బోధపడదు. వ్యక్తిగత దృష్ట్యా చూస్తే మానవ కార్యాలలోనే శక్తి వృథా అవుతున్న సత్యం స్పష్టంగా గోచరిస్తుంది. మహత్తర విశ్వ పరిణామ దృష్ట్యా పరికించి చూస్తే, అన్ని పనులు, అన్ని ప్రయత్నాలు సక్రమంగానే, అవసరమైన పద్ధతుల్లోనే వుపయో గింపబడుతూ వున్నాయి.

ప్రకృతి బృహత్ కార్యసాఫల్యతా కార్యంలో మన దృష్టికి గోచరించే "వృథా" అనేది కూడా ఒక గుణ విశేషంగానే అవసర మయ్యే వినియోగింపబడుతూ ఉంటుంది. మనకు గోచరించని ప్రకృతి కార్యాల్లోకూడా, అన్నీ అవసరమయ్యే, ఆమెచేత సక్రమ పద్ధతిలోనే తన శక్తి ఉపయోగబడుతూ ఉంటుందని మనం విశ్వసింపవచ్చు.

జంతుజాలంలోను, వృక్షజాతిలోను, జడపదార్థాలలోను ఆ విశ్వచేతనాశక్తి యొక్క ప్రేరణ, చాలనము, మార్గ దర్శకత్వములను మనం నిర్లక్ష్యంగా త్రోసిపుచ్చటం అసాధ్యం. విజ్ఞానశాస్త్రజ్ఞులు మన స్సుకు జడపదార్థమే ఆది, అంతమూ అని భావించిన కాలం వరకు, తెలివికి తెలివే ఆధారం అన్న సత్యాన్ని అంగీకరించకుండటం అనేది నిష్కపటమైన సందేహంగా ఉండేది. కాని యిప్పుడు అజ్ఞానం నుండి, అచేతన నుండి, జ్ఞానము, చేతన ఉద్భవించినవనడం కాలం చెల్లిన

మాట అవుతుంది. ఎందుకంటే జ్ఞాన చైతన్యముల రూప గుణ విశేషా లేవీ మచ్చుకైనా లేని అజ్ఞాన అచేతనముల నుండి వెలువడడం అసంభవం కదా! మానవునిచేతన ప్రకృతిచేతనా రూపమే తప్ప మరేమీ కాదు. మనస్సుకు క్రింది భూమికలలో ఆ చైతన్యం లీనమై వుంది కనుకనే, అది మనస్సులో నిర్గమించింది. ఆ చేతన మనస్సుకతీతమైన ఉన్నత భూమికలలోనికి కూడా ఆరోహిస్తుంది. ఈ ప్రపంచాన్ని నిర్మించే శక్తి ఎరుకతో కూడిన దివ్య చైతన్య శక్తి. ఈ ఉనికిలో ఆవిర్భవించినది కూడా ఎరుకతో కూడిన చిత్పురుషయే (conscious being). ఆ చిత్పురుషము యొక్క శక్తుల బహిర్గతమే ఈ ప్రపంచ పరిణామ ధ్యేయమని హేతుబద్ధంగా భావించవచ్చు.

స్వేచ్ఛానువాదం: బి. నరసింహాయ్య

చైతన్యము విభిన్న వస్తువుల సంపుటి కాదు

(అనేక ముఖములు ధరించినప్పటికి మూల ద్రవ్యమొకటే)

పరమాత్మని చిచ్ఛక్తి పదార్థమునుండి సచ్చిదానందము వరకు అనేక స్తరములలో వ్యాపించి వుంటుంది. ఆ స్తరములలోని చైతన్యము వస్తుతః ఒకటే అయినప్పటికి, స్థాయిలో వ్యత్యాసముంటుంది. మనం సాధారణంగా మనస్సు, చైతన్యము ఒకటే అనుకుంటాము. కాని, అది తప్పు. ఎందుకంటే చిచ్ఛక్తి విశ్వమంతా వ్యాపించియుంది. అతి విశాలమై, హద్దులు, పరిధులు లేకుండా వుంటుంది. కాని, మానవుని మానసిక చైతన్యమునకు హద్దులున్నాయి. ఉదా: విశ్వము లోని అనంతమైన వర్ణముల (రంగుల) లో, మానవ నేత్రాలు కొన్నిటిని మాత్రమే చూడగలవు. అటులనే అనంతమైన శబ్దతరంగాలలో ఒక పరిమిత శ్రేణిలోని ప్రకంపనములను మాత్రమే మన చెవులు వినగలుగుతున్నవి. ఈ శ్రేణిలోని కనిష్ఠ అవధి కంటే తక్కువైనా, గరిష్ఠ అవధి కంటే ఎక్కువైనా అట్టి శబ్ద తరంగాలు మనకి వినబడవు. కేవలము యోగసాధన ద్వారా మన చైతన్యము పెరిగినపుడే మానసిక చైతన్య

పరిధిని దాటి, అధోచైతన్యము, అధిమానస (overmental) అతిమానస (supramental) చైతన్యములను చేరుకోగలము. అంతవరకు మనకు కనబడని చైతన్య స్తరములను 'అచైతన్యము' లుగా పొరబడు తుంటాము.

ఊర్ధ్వ చైతన్యము, అధో చైతన్యము కేవలము సాపేక్ష పద ములు మాత్రమే. మన సాధారణ మనస్సు యొక్క చైతన్యపు గరిష్ఠ పరిమితిని దాటితేనే గాని ఊర్ధ్వ చైతన్యము కనబడదు. అట్లే దాని కనిష్ఠ పరిమితి కంటే క్రిందికి వెళ్ళగలిగినప్పుడే అధో మానసిక చైతన్యమును చేరగలము. మనం 'టావో', 'శూన్యము' అని దేనినైతే అనుకుంటామో అట్టి అచైతన్యములో గూడా సమస్త వస్తు సముదా యమూ ఇమిడి నిగూఢంగా వుంటుంది. పైనుండి గాని, లోపల నుండి గాని, ఒత్తిడి కలిగి నప్పుడే సర్వమూ బహిర్గతమౌతుంది.

చైతన్య స్తరములు విశ్వ వ్యాప్తములు. కేవలం మన వ్యక్తిగత ఆలోచనా పరిధిలోవి కావు. కాకపోగా మన వైయక్తిక దృష్టి కోణాలు మనము ప్రస్తుతము ఏ చైతన్య స్తరమునకు చెంది యున్నామో ఆ స్తరముపై ఆధారపడి వుంటాయి. మన ప్రస్తుత చైతన్య స్థితి, సృష్టి పరిణామ గతిలో ఏ దశ వరకు ఎదిగి యున్నామో అంత వరకే ఉండగలదు.

పైన వివరించిన దానిని బట్టి తేలిందేమంటే, చైతన్యము మూలతః ఒకే వస్తువైనప్పటికీ, అందులో స్థాయీ భేధములు, స్థితి విశే షములు వేర్వేరు క్రియా రూపములు ఉంటాయి. కొన్ని దశలలో, పరి స్థితులలో, మనము దేనినైతే 'చైతన్యము' అనుకుంటామో అది అణచ బడిన స్థితిలో లేదా అస్తవ్యస్త స్థితిలో లేదా మరో విధంగా వ్యవస్థీక రించబడి వుండవచ్చును. అట్లే మరియొక స్థితిలో మన మానసిక చైత న్యపు టంచులను దాటి పైకి వెళ్ళినపుడు మనలో అణచబడి గుప్తంగా దాగివున్న మరికొన్ని క్రియాశక్తులు ప్రత్యక్షము కావచ్చు కూడ.

*

మన చైతన్యము చాలా విచిత్రమైనది. దాని పరిధి విస్తృతము, విశాలము, అనంతము. మనమొక పనిలో నిమగ్నమై వున్నప్పుడు, ఒక అవస్థయందు నిమగ్నమై వున్నప్పుడు మన చైతన్యము దాని మీదనే

కేంద్రీకృతమై వుంటుంది. మిగిలిన సంవిత్తు అంతా తెర వెనక్కి పోతుంది. అంతమాత్రాన, మన పూర్ణ చైతన్యము ఎక్కడో మాయమై పోదు. అక్కడే వుంటుంది. మనము ఎప్పుడు కావాలంటే అప్పుడు దానిని పిలవవచ్చు. క్రియాత్మకము చేయవచ్చు. అనంత చైతన్యము యొక్క త్రిమార్గత్వము మనకిప్పుడు తెలియవస్తుంది. 'మాయ' యొక్క కార్యకలాపాల రహస్యము కూడ అవగాహనమౌతుంది.

మరియొక విషయము. ఒక పక్క శుద్ధ చైతన్యము శుద్ధ అస్థిత్వము, శుద్ధ ఆనందము మరియొక పక్క నిరంతరం జరుగుతున్న జగద్వ్యవహారము, కలకలము, కోలాహలములకు మధ్య పొంతనము మనస్సునకు అర్థము కాని విషయము. కాని పైన చెప్పిన దానిని బట్టి ఇదంతయు సాధ్యమేనని ఒప్పుకోక తప్పదు.

స్వేచ్ఛానువాదం: సి. కె. రామనాథ చెట్టి

చైతన్యము యొక్క క్రియారూపములు

మనిషికి మనస్సు ఉన్నది కనుక తనకే అన్నీ తెలుసుననుకుంటాడు. కాని నిదానముగా ఆలోచించి చూచినట్లయితే అది యొక భ్రాంతియేయని తెలిసిపోతుంది. మనస్సు చిత్తు (లేక దివ్య చైతన్యము) యొక్క ఒకానొక కూటరూపము. దాని అధోవృత్తి, క్రియావిధానము. మనము పురోగమించి ఉన్నత చైతన్య స్థాయిని అందుకొన్నప్పుడు మనలోను, వస్తువులలోను, భాసిస్తున్న ఆత్మ మనకు ద్యోతకమౌతుంది. అప్పుడు వృక్షములు, లోహములు, అణువులు విద్యుచ్ఛక్త్యాది సమస్తమైన భౌతిక ప్రకృతి మూర్తులలో కూడ ఒక చైతన్యమున్నదని తేటతెల్లమవుతుంది. అది మనస్సుకంటె ఏమాత్రమూ అధమమైనది కాదు గదా, అంతకంటె గంభీరమైనది, వేగమైనది, చురుకైనది. అయితే అది పైకి ఉబుసుకొని రాలేదు. ఈ ప్రాణిక భౌతిక ప్రకృతిగత చైతన్యము, చిత్తుకంటె నిమ్నస్థాయికి చెందినది. తత్స్వరూపము, క్రియావిధానము, పరిధి, సీమితములు. అయితే ఒక్కటి మట్టుకు గమనార్హము.

చైతన్యము యొక్క ఈ అధో్ప్రకారములు (modes), నిమ్న లోకములం దెల్లడల వ్యాపించియున్న చేతనా ఒకటే.

మన అవచేతనా విభాగములలో కూడ (subconscious being) జడ ప్రకృతిగతమైన చేతనయే పనిచేయుచున్నది. అది మన భౌతికకాయము (physical being) నకు ఆధారము. అటులనే వృక్ష జాతులలో వేరొక చేతనాశ్రేణి, జంతుజాలములో మరొక చేతనాస్థాయి పనిచేయుచున్నవి. వీటి తీరుతెన్నులు మానవ మనస్సుకు అవగతము లగునవికావు. వాటి ఎత్తు వేరు, మన ఎత్తు వేరు. వాటి సరళి వేరు. తత్కారణముగా ఆ నిమ్న స్తరముల రూపురేఖలు మనకు అపరిచిత ములు. మనలో ఈ నిమ్న చేతనా విభాగములు ఏమి చేయుచున్నవో తెలుసుకొనజాలము. అది మనస్సుకంటె క్రింది చైతన్యము అగుట వలన మనకు అవగతము కాదు.

పాశవికత: మనిషిలో పశుత్వము ఉన్నదని మనకు తెలుసు, మానవ త్వమున్నదనీ తెలుసు. ఆలోచనలతో పని లేకుండానే జంతువులకు సహజముగానుండే పసి, స్ఫూర్తులు మనిషిలోకూడా ఉంటాయి. అవి కాక మానవుల విశిష్ట సంపదలైన మనస్సు, భౌతిక జీవితము కూడా ఉన్నాయి. మానవుడు ఊర్ధ్వస్తరములలోని జ్యోతిశ్శక్తులను గ్రహించి తన జీవితమును వెలిగించుకొనుటలో కూడ సమర్థుడు.

పశువుకంటె నిమ్నము: మనిషిలో ఉన్నది కేవలం పాశవిక జీవితమే కాదు. అంతకంటె కనాకష్టమైన మరో జీవి (subhuman being) కూడా ఉన్నాడు. అయితే దీనికంతకు మకుటము పాశవిక జీవి! దాని క్రింద పశువుకంటె హీనమైన అవపశువు (sub-animal), కేవల ప్రాణి కములు (merely animal) కూడా ఉన్నాయి. వీటి కార్యకలాపాలను గురించి ఉన్నత జీవియైన మానవునకు ఎట్లా తెలుస్తుంది? sub-animal క్రింద subvital ఉన్నది.

శారీరక చైతన్యము: మనము యోగము ద్వారా మరింత సూక్ష్మాతి సూక్ష్మ జ్ఞానమును సంతరించుకొన్నప్పుడు భౌతిక శరీరానికి కూడ

తనదైన ఒకానొక భౌతిక చైతన్యమున్నట్లు తెలియవస్తుంది. దాని అలవాట్లు, సహజ పసి, క్రియలు వేరు. మన స్థూలప్రకృతికంటె భిన్నము. అది మన సంకల్పమును ప్రతిఘటించి తన మాటనే నెగ్గించు కొంటుంది. ఇదండీ, పైకి ఎంతో చక్కగా కనబడుతున్న ఈ మనిషి యొక్క నగ్న స్వరూపము! ఈ విభిన్న స్తరముల పరస్పర ప్రభావ ములు, సంఘర్షణలే, ఈ కప్పలతక్కెడ మేళమే మానవ జీవితపు సంక్షోభమునకు హేతువు. ఏలన మానవుడు పరిణామ ప్రక్రియా జని తము. కేవలభౌతిక, అవప్రాణికస్థాయి మొదలుకొని మానసికస్థాయి వరకు గల పరిణామ చరిత్ర సర్వస్వము అతనిలో మూర్తీభవించి యున్నది.

ఈ పరిణామ ప్రక్రియ సృష్టిగతమైన కొన్ని శక్తుల ఆవిర్భా వమునకు ఒక సాధనము. మనలో మనకంటె క్రింది స్థాయికి చెందిన అధమ వ్యక్తిత్వము, అధమ స్తరములు (subnormal selves and sub-human planes) చోటు చేసుకొన్నట్లుగానే మానసిక పురుమనకు మించిన మహోన్నత మానవ (supernatural and superhuman) స్తరములు కూడ కలవు. సృష్టిగతమైన ఈ చిత్‌శక్తి ఆ స్తరములలో ఇతర భూమికలను దాల్చి, ఇతర రీతులలో వర్తించి, ఇతర సిద్ధాంత ముల ననుసరించి అనంత వైభవములతో తులతూగుతూ వుంటుంది. మన వేద ఋషులు మన మనస్సుకు పైన స్వయం ప్రకాశము, సంకల్పసిద్ధిశీలము అయిన సత్యలోకమును శోధించి కనుగొనిరి. అది మన మనస్సుకంటె మేలైన స్థాయికి చెందినది. మనిషి మానసిక జీవి కనుక తన మానసిక విజ్ఞానముతో, అనుభవముతో, తన జీవితమును ఏ విధముగా నియమించుకుంటాడో, అదే విధముగా ఈ సత్యలోక ప్రాప్తివలన తన మనస్సు, వివేచనా సామర్థ్యము, భావసంపద, ఆవేశ ముల, ఆవేదనలన్నిటిని మానవ ధర్మానుసారముగానే వాటివాటి మూలసత్యానుసారముగా నియమితమవుతాడు. ప్రభావితమవుతాడు. అపుడిక మనిషి తడుముకోనవసరము లేకనే స్వత స్సిద్ధ జ్ఞానమును కలిగి యుంటాడు. ఏలన సత్యమే అతని చేతులలో ఉన్నది. అపుడిక ఇచ్ఛకు, క్రియకు మధ్య ఘర్షణ ఉండదు. సహజ జ్ఞానానికి (instincts) ప్రేరణలకు నడుమ, కోరికల సిద్ధికి, మనస్సులోని భావాలకు నైజానికి

మధ్యన ఏ విధమైన అగాధముగాని, సంఘర్షణగాని వుండదు. ఎందు కంటే సత్యపరిపాలనలో అన్ని విశ్వాసములకు, భావములకు, నెరవే ర్పుటలోను మూలములోను క్రియలలోను పర్యవసానములోను పర స్పర పొంతనము సామరస్యములే భాసించును.

కాని, ఈ భూమికకు అతీతమైన, దీని ద్వారా లభించగల ఇతర భూమికలు గూడా ఉన్నాయి. ఈ భూమికలలో సాక్షాత్తుగా 'చిత్' మనముందు ప్రకాశితమవుతుంది. నానావిధమైన రూప సృష్టికి, అను భూతికీ ఉపయోగించబడే ఈ వివిధ చేతనకంతకూ మూల స్రోతస్సు, ఆద్య పూర్ణత్వం ఈ చిత్. ఆ భూమికలలో సంకల్పం, జ్ఞానం, సంవే దన, మన ఇతర ప్రవృత్తులు, శక్తులు, అన్ని విధాలైన అనుభవాలు కేవలం సమరసాలు, సహచరులు, ఏకీభూతాలు అవటమేగాక చేతన యొక్క ఒకే సత్తగా, శక్తిగా ఉంటాయి. ఈ చిత్తే తనను తాను సత్య స్తరము పైన అతిమానస రూపం ధరించేటట్లుగా పరివర్తితం చేసుకుం టుంది. మానసిక స్తరం పైన మానసిక బుద్ధి, సంకల్పం, భావావేశం సంవేదనల రూపాన్ని ధరిస్తుంది. దీనికంటె నిమ్న భూమికల పైన, ఉపరితలం మీద, తమపై సచేతనమైన అధికారం ఏమీలేని అంధ కారమయ శక్తికి సంబంధించిన ప్రాణిక, భౌతిక, అంధప్రేరణల, ఆవే శాల అలవాట్ల రూపాన్ని ధరిస్తుంది. సమస్తమూ చిత్. ఎందుకంటే సమస్తమూ సత్. సమస్తమూ మూలచేతన యొక్క నానావిధమైన చలనం. ఏలననగా సమస్తమూ మూలసత్తకు చెందిన నానావిధ చలనం.

మనం చిత్‌ను పొందినప్పుడు, చూచినప్పుడు, తెలుసు కొన్నప్పుడు స్వీయ సత్తాగతమైన ఆనందం దీని సారతత్త్వమని గూడా మనకు తెలుస్తుంది.

అనువాదకులు: సి. కె. రామనాథచెట్టి, రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి, జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రి (యోగసమన్వయం నుండి)

చైతన్యంయొక్క కేంద్రీకరణము

చైతన్యం ఆత్మగతంగా, కర్తగా (subjectively), దేహ, ప్రాణిక, మనో, చైత్య చేతనా రూపాలను ధరిస్తుందని తెలిసికోవడం ఎక్కువ కష్టమేం కాదు. ఎందుకంటే ఇవన్నీ మనిషిలో వున్నాయి. కాని బాహ్య చేతనలో కలగాపులగంగా వున్నాయి. వాటి యథార్థ రూపం మనిషి అంతరాంతరంలో దాగి వుంది. బాహ్య వ్యవహారంలో నిమగ్నమైవున్న చేతనను అంతర్ముఖ మొనర్చినచో మనం వాటిని గ్రహించ గల్గుతాము. మనలోని చేతన బాహ్య వ్యక్తిలో కేంద్రీకృతమైనప్పుడు వీట న్నింటిని ఒక గోడ వెనుక లేదా ఒక తెర వెనుక వుంచవలసి వస్తున్నది. అది వెనక్కు మరలి ఆ అడ్డుగోడను లేదా తెరను పడ గొట్టి అంతర్భూమికలలో కేంద్రీకృతం కావాలి. దీన్నే మనం అంత ర్ముఖం కావడం లేదా లోపల జీవించడం అంటాం. అప్పుడు మన బాహ్యసత్తా చిన్నదిగనో, కృత్రిమమైనదిగనో గోచరిస్తుంది. అంతట మనం మనలోని మహత్తరమైన సుసంపన్నమైన, అక్షయ దివ్యసామ్రా జ్యాన్ని గుర్తించగల్గుతాము. అదే విధంగా మనలోని చేతన మన నిమ్న భూమికలైన మనః ప్రాణ దేహములకు, ఆధ్యాత్మిక సామ్రాజ్యంగల ఉన్నత భూమికలకు మధ్య ఒక ఆచ్ఛాదనాన్ని ఏర్పరచింది.

ఆ ఆధ్యాత్మిక సామ్రాజ్యంలో ఆత్మ నిరంతరం స్వేచ్ఛగా అనంతంగా వెలయుచూ వుంటుంది. చేతన ఆ కప్పును ఛేదించి కాని లేదా తెరచి కాని ఆరోహించి స్వేచ్ఛాయుతమైన, విస్తృతమైన, ప్రకాశ వంతమైన ఆత్మగా రూపొందగలదు. లేదా ఉన్నత భూమికల ప్రభా వాన్ని, ఉన్నత చేతనా శక్తిని నిమ్నప్రకృతి లోనికి అవతరింప చేయనూ గలదు.

దానినే మనం చైతన్యం అంటాము. అది బహుళ శకలముల కూర్పు కాదు. అది ఆద్య వస్తువు. తన ఇచ్ఛ వచ్చిన విభాగములకు తన యిచ్ఛ వచ్చిన రూపములనిచ్చి ఆవిర్భవింప జేయగలదు. ఆధ్యా త్మిక భూమికలనుండి క్రమక్రమంగా క్రిందికి దిగివచ్చి పదార్థములో నిమగ్నము కాగలదు. లేక క్రిందినుండి పరిణామ ప్రక్రియ ద్వారా ఊర్ధ్వగతమై ఉన్నత భూమికలనందుకొనవచ్చు. ఆ చేతన నీలో

"అహం" రూపంలో పనిచేయదలిస్తే దాన్ని నీవు "నేను" అని వ్యక్తిగతంగా భావించి అదే సర్వం చేస్తూందనుకుంటావు. నీ అవధులను ఛేదించి విముక్తిచెంద ప్రారంభిస్తే, అప్పుడు "నేను" అన్న భావన అనంతంలో లీనమై పోయేదాకా నీవు దానిని విస్తృతి చెందింతువు. లేదా దాన్ని నీవు వదలివేసి ఆధ్యాత్మికంగా వికసింతువు.

*

చైతన్యం ఎక్కడ కూర్చుంటే, ఎక్కడ కేంద్రీకృతమైతే అక్కడ ఈ "నేను" తనము అతుక్కుంటుంది. "అహం" లో కేంద్రీకరించినప్పుడు నీవు "అహం" తో తాదాత్మ్యం చెందుతావు. మనస్సులో కేంద్రీకరించినప్పుడు మనస్సుతోనూ, దాని కార్యాలతోను తాదాత్మ్యం చెందుతుంది. చైతన్యం బాహ్యం వైపు లక్షిస్తే అది బాహ్య సత్తాలో జీవిస్తుందని చెప్పాలి. అప్పుడది తన అంతర్మానసము, అంతః ప్రాణ శక్తి, అంతరాంతరాలలోని చైత్య పురుషము (Psychic being) లను మరిచి పోతుంది. అది అంతర్ముఖమైతే, తనను తాను అంతః పురుషముగా గ్రహిస్తుంది. ఇంకా లోలోనికి వెళ్ళితే అది తనను చైత్య పురుషముగ గుర్తించుకొంటుంది. దేహం విడిచి ఉన్నత భూమికల వైపు ఆరోహిస్తే, తాను మనస్సు కాదని, ప్రాణం కాదని, దేహం కాదని, తాను కేవలం "ఆత్మ" యేనని తెలిసికొంటుంది. దీనికంతకి హేతువు ఆ చేతన యొక్క కేంద్రీకరణమే. కనుకనే సాధకుడు అంతర్ముఖుడగుటకు తన చేతనను హృదయంలోను, ఉన్నత భూమికల లోనికి ఆరోహించుటకు మనస్సులోను కేంద్రీకరించాలి. సర్వమును నిర్ణయించేది చేతన యొక్క ఇచ్ఛయే. వ్యక్తిని ప్రముఖంగా మనోమయునిగా, ప్రాణమయునిగా, దేహిగ, లేక చైత్యపురుషునిగ రూపొందిచుటకు గాని, లేదా అతన్ని ప్రకృతి బద్ధునిగ చేయుటకు గాని, లేదా పురుషునిగ ప్రకృతినుండి విముక్తిని చేయుటకుగాని, చైతన్యం యొక్క ఇచ్ఛయే నిర్ణయ కర్తగా కొనసాగును.

స్వేచ్ఛానువాదం: బి. నరసింహయ్య

పదార్థంలో చైతన్యము

చేతన మనిషిని ఆశ్రయించి వున్నప్పుడు మనస్సుగా తోస్తుంది. అటు లనే జడ పదార్థములో మనస్సుకు సమానాంతరమైన స్థితి ఏదైనా ఒకటి ఉన్నదా అనేదే ప్రశ్న. మానవులకు 'మనస్సు' వలన 'నేను' అనే భావన కలుగుతుంది. అదే విధంగా పదార్థానికి కూడ ఒక 'నేను' అనే భావం ఉంటుంది. కాని దాన్ని గురించి మన కేమియు తెలియదు. పదార్థగత చైతన్యము మనస్సు కంటే భిన్నమైనది. మానసిక జ్ఞానము దానిని అందుకోలేదు. దీని వలన తెలియునది ఏమనగా చైతన్యము మానవుల సొత్తు మాత్రమే కాదు — నింగినుండి నేల వరకు విస్తరించి అనేక భూమికలను దాల్చి వుంటుంది. ఈ శీర్షికలో వాటి రూపు రేఖలను గురించి తెలుసుకొనెదము.

చేతన యొక్క వైశాల్యము ఎంత పెరిగినా సరే అది భౌతిక వ్యవహారమే తప్ప మరేమీ కాదంటారు భౌతికవాదులు. దానికి భౌతిక అవయవాలతో అవినాభావ సంబంధమట. అవయవాలను చేతన ఉప యోగించదనియు, అవయవాలే చేతనకు మూలమనియు వారి వాదన. అయితే ఈ వాదము ఆధునిక విజ్ఞాన కడలి తాడింపుకు తట్టుకోలే కుండా యున్నది. దాని సంజాయిషీలు మరీ విపరీతంగాను, విడ్డూరం గానూ ఉంటున్నాయి. చేతన యొక్క పూర్ణ స్వరూపము అతి విశా లము. ఇంద్రియాలు, నాడులు, మెదడుల స్తోమత కంటె వెయ్యిరెట్లు అధికము. అంతేకాదు. ఈ అవయవములన్నీ మన సాధారణ ఆలోచన లకు, చైతన్యమునకు ఉపకరణములే కాని మూలములు కావు. చైత న్యము తన ఊర్ధ్వ గతులలో మెదడును తయారు చేసి దానిని వాడు కుంటుందే గాని మెదడు చైతన్యమును తయారు చేయనూ లేదు, దానిని వాడనూ లేదు. జీవమునకు అవయవములు అనివార్యములు కాదనియు, గుండె ఆగిపోయినప్పటికి ప్రాణానికి హాని లేదనియు మనము అప్పుడ ప్పుడు వింటూనే వుంటాము. అదే విధంగా ఆలోచనలకు మెదడు అత్యవసరం కాదు. ఉదా: యంత్రములు ఆవిరి శక్తిని, విద్యుచ్ఛక్తిని ఉత్పన్నం చేస్తాయి. ఆవిరిలోను, విద్యుత్తులోను ఉన్న శక్తికి ఆ

యంత్రములు సాధనములు మాత్రమే కాని మూలములు కావు. అటు లనే మన భౌతిక కాయము ఆలోచనలకు, చైతన్యమునకు ఉపకరణమే కాని మూలము కాదు. ప్రప్రథమమైనది శక్తి గాని, సాధనములు గావు. దీని దృష్ట్యా మరి కొన్ని విషయములను మనం పరిశీలించ వచ్చును. జడ పదార్థములో కూడ ఒక విధమైన మనస్సు (మానసిక చైతన్యము) ఉన్నప్పుడు వస్తువులలో కూడ ఒక విధమైన అవచేతనా మానసము (subliminal mind) విశ్వవ్యాప్తముగా ఎందుకు ఉండగూడదు? అటు లనే ఉండవచ్చును. కాని సరియైన అవయవములు లేని కారణంగా దాని ఉనికిని పైకి ప్రకటించుకోలేదు. దీనిని బట్టి ఉదయించే మరొక ప్రశ్న — పదార్థము చైతన్య రహితమా లేక ఆ చైతన్యము సుషుప్తి గతమా? పరిణామ ప్రక్రియ దృష్ట్యా ఈ సుషుప్తి ప్రారంభ దశది కాని మధ్యమ దశది గాదు. మనుషులలో కూడ నిద్ర అనగా చైతన్యము అంతర్గతమగుటయే గాని, చైతన్య రాహిత్యము కాదు గదా — సుషు ప్తిలో మన శరీరము బాహ్య ప్రేరణలకు స్పందించక అంతః కేంద్రీ యమై ఉంటుంది గదా! బాహ్య ప్రపంచములో ప్రకాశించుటకు అవస రమైన ఇంద్రియములు ఇంకను ఏర్పడని సృష్టి ఏదయినా ఉన్నట్లయితే, దాని స్వరూపమిట్లా వుండాలి గదా. సుషుప్తి గతమైన సృష్టిలో గూడ జాగృతమైవున్న ఒకానొక ఆత్మ, ఒక పురుషుడు భాసించడూ!

మనము ఇంకా కొంచెం దూరం పోతే ఈ విధంగా వాదించ వచ్చు. అవచైతన్య మనస్సు (subconscient) మన బాహ్య మనస్సు కంటె వేరైనది కాదు. జాగృత మానవునికి తెలియకుండా మనస్సు క్రింది భాగంలో పనిచేస్తుంది — ఇంకా ప్రగాఢంగా, విశాలంగా కూడా పని చేస్తుంది. ఇది కాకుండా అంతస్థలీయము (subliminal) అనే మరొక స్థాయి, ఈ విధమైన నిర్వచనములచే బంధింపబడనిది ఒకటి వుంటుంది. దాని సామర్థ్యము మన మనస్సు కంటె, జాగృత మాన సము కంటె చాలా భిన్నమైనది, వెయ్యి రెట్లు పెద్దది. మన మనస్సుకు క్రింద అవచేతనము ఉన్నదని ఏవిధంగా చెప్పుకుంటున్నామో, అదే విధంగా అతిచేతనము (superconscient) అనే మరియొక చైతన్య శ్రేణి కూడయున్నది. దాని పరిధి, సామర్థ్యము, చైతన్య వ్యవస్థ మనకు తెలి సిన మనసు కంటె విపరీతమైన ఘనములు. మరియు మనలోని అంత

స్థలీయము మన మనస్సు కంటె క్రింది భాగంలోనున్న అవచేతనము లోకి కూడా వ్యాపించి ఉండవచ్చును కదా! మనలోను, సృష్టిలోను, మనస్సు కంటె క్రిందను కొన్ని చేతనా స్థాయిలు — అవమానసిక ములు (submental), ప్రాణిక, భౌతిక చైతన్యములు వీని నామధేయ ములు — ఉండవచ్చును గదా! ఇదే నిజమైనట్లైతే వృక్షములలోను, లోహములలోను కూడ ఒక విధమైన శక్తి — దీనిని కూడా మనము చైతన్యము యొక్క ఒక శ్రేణి అని పిలుద్దాము — ఉండవచ్చును. ఇది మానవులలోను, జంతువులలోను ఉండే మనస్సుగాదు. మనస్సు యొక్క మరియొక అవతారము.

పైన చెప్పినదంతా నిజమేనా అనిపించవచ్చు. మనము నిష్పక్ష పాతంగా విచారించినట్లైతే ఇది తప్పకుండ నిజమేననిపిస్తుంది. అయి తీరాలి. మన లోపల సైతము అట్టి ఒక ప్రాణిక చేతన గలదు. అది శరీరములందును, స్వయంచలిత ప్రాణిక వృత్తులందును పనిసేయును. ఇట్లు పనిసేయుట చేత, మనము ప్రయోజనకర కార్యముల నెరవు దుము. మఱియు మనస్సునకు అపరిచితమగు ఆకర్షణ, వికర్షణలకు — రాగ, ద్వేషములకు — లోనగుదుము. కాగా, పశువులందు ఈ ప్రాణిక చేతన ఇంకను అధికతర ప్రాధాన్యముగల అంశమగును. వృక్షము లందు, వాని లోపలి అంతఃస్ఫూర్తినిబట్టి, అది మనకు స్పష్టమగును. వృక్షము యొక్క అన్వేషణములును పరావర్తనములును, దాని యొక్క సుఖదుఃఖములును, దానియొక్క నిద్రాజాగరములును, ఒక భారతీయ వైజ్ఞానికుడు కఠోర, శాస్త్రీయ పద్ధతుల ద్వారా వెలుగులోనికి తెచ్చిన దాని విలక్షణ జీవనమంతయును — ఇవి యన్నియు చేతన యొక్క క్రియలే. కాని మనము చూడగలిగినంత వరకు మనశ్చేతన యొక్క క్రియలు గావు. కనుక ఒక అవమానస, ఒక ప్రాణిక చేతన యున్నద నుట నిక్కువము. దీని ప్రాథమిక ప్రతిక్రియలు సరిగ్గా మానసిక చేతన యొక్క ప్రాథమిక ప్రతిక్రియల వంటివే అయినను, అతిచేతన సత్త తన స్వానుభవ సంఘటనమునందు ఎట్లు మానసిక సత్తకంటె భిన్నమో, ఇదియు నటులే తన స్వానుభవ సంఘటనమునందు మానసిక చేతన కంటె భిన్నముగా నుండును.

కాని ప్రాణము మఱియు చేతనల యొక్క పరిధి, మనకేది కేవలము భౌతికముగా గన్పించునో, ఆ ద్రవ్యములో లేదనియు, అక్కడకు చేరక పూర్వమే ఆగిపోవుచున్నదనియు అనుకొనుటకు మనకే కారణము గన్పించదు. ధాతువునందును, మృత్తిక యందును మఱియు ఇతర 'నిర్జీవ' రూపములందును ఒక విధమగు అస్పష్ట జీవన ప్రారంభము, మఱియు బహుశః ఒక విధమగు ప్రతిరుద్ధ (suppressed) చేతన గలవని, లేదా కనీసము తరువాత చేతన కాగల ప్రథమ పదార్థముండవచ్చునని నేటి పరిశోధన మఱియు విచారణల యొక్క ప్రగతి మనకు ప్రాయః సూచించును. కేవలము భేదమిదియే — నేను దేనిని ప్రాణిక చేతనయని చెప్పియున్నానో, దానిని వృక్షమునందు మనము గుర్తించి, భావించ గలుగుచుండగా, ద్రవ్యము యొక్క, అనగా నిశ్చేష్ట రూపము యొక్క చేతనను గ్రహించుట లేక ఊహించుట మనకు కష్టముగానున్నది. మరియు దేనిని గ్రహించుట లేక ఊహించుట మనకు కష్టముగా గన్పించునో, అది లేనే లేదని చెప్పుట మన హక్కు — అని తలంచుచున్నాము. అన్వేషించుచు పోగా పోగా వృక్షసత్త్వము యొక్క లోతుల వఱకు చేతన గలదని కనుగొనినపుడు, ప్రకృతి యందు దాని విస్తారమున కచ్చట అకస్మాత్తుగా ఒక అఖాతముండగలదని మన మేమాత్రము విశ్వసింపజాలము. ఒక వర్గము తప్ప, తక్కిన వస్తువర్గము లన్నియు నెపుడు ఒక ఏకతను బైటపడి అంగీకరించునో మఱియు నా ఒక వర్గమునందు సైతము అది నిరావృతము గాక, ఎక్కువ గుప్తముగా మాత్రమే యుండునో, అపుడా ఏకత సర్వత్రను గలదనుకొనుటకు బుద్ధి కధికారము గలదు. మఱియు నిట్లు మనమా ఏకత అవిచ్ఛిన్నమని అంగీకరించుచో, అపుడు ప్రపంచమునందు పనిసేయుచున్న శక్తి యొక్క సర్వరూపములందును చేతన గలదను పర్యవసానమునకు వత్తుము. ఒక చేతన లేక అతిచేతన పురుషుడు సర్వరూపములందు సమముగా నివసించకపోయినప్పటికి, ఆ రూపము లన్నింటి యందును సత్త యొక్క ఒక చేతనా శక్తి గలదు. మఱియు నా రూపముల వెలుపలి భాగములు సైతము దానిలో స్పష్టముగనో అస్పష్టముగనో పాల్గొనును.

*

మన నిద్రావస్థలో సుషుప్త చైతన్యం మాత్రమే వుంటుందనియు జాగృతావస్థలోని చైతన్యం కూడా మన పూర్ణచైతన్యంలోని ఒక లేశము మాత్రమే అన్న మన ప్రాచీన ఋషుల వాక్యము నిస్సంశయముగా సత్యమే. కాని మనం మనస్సు యొక్క పూర్ణస్వరూపమును ఇంకను దర్శించలేదు — మన జాగృత చైతన్యము దాని పైపూత మాత్రమే. మన మనస్సు వెనక అంతస్థలీయము లేక అవచైతన్యము (subliminal or subconscient) — దాని విరాడ్రూపమొకటున్నది. దాని సామర్థ్యము అనంతము — ఇంత వరకు మానవమాత్రులెవరూ కనివిని ఎరుగనంతటి అత్యద్భుతములకు నిలయము.

స్వేచ్ఛానువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి, చెలసాని నాగేశ్వరరావు (దివ్యజీవనము నుండి)

విశ్వచైతన్యము

వైయక్తిక చైతన్యము వ్యాప్తిచెంది విశ్వమును ఆక్రమించుకొని దానితో క్రీడించగలదు. దాని లోపలికి ప్రవేశించి, దాని చేష్టలను గమనించి, దానితో బేరసారాలు సలిపి, దానంత పరిమాణమును పొందగలదు. దానిని తనలోకి గ్రహించగలదు. పాతయోగములలో చెప్పినట్లు నీలో బ్రహ్మానందమును ధరించుట అనగా ఇదియే.

విశ్వచేతన అనగా విశ్వాత్మకు, విశ్వప్రకృతికి, దానిలోని సర్వభూతములకు చెందినది. మనమొక విషయమును గుర్తించాలి. ఈ విశ్వచైతన్యము యొక్క వైయక్తికత, వైశ్వాన్వికత ఒకటే. ఈ రెండు సజాతీయములు. అయితే ఆ ఏకతలోకూడా ఒక విశిష్టత ఉంటుంది. వ్యక్తి చైతన్యము ఈ విశ్వ చైతన్యములోని ఒక భాగమే అయినప్పటికి అది తన ప్రత్యేకతను విస్మరించదు. వ్యక్తియొక్క తత్వమంతా విశ్వచైతన్యంలోనుంచే వస్తుంది. కాని మధ్య ఒక గోడ ఉంటుంది. ఆ గోడను కూల్చి వేసినప్పుడు మనిషికూడా విశ్వాత్మతోటి, విశ్వప్రకృతి చేతనతోటి తాదాత్మ్యము చెంది అందులోని శక్తుల విలాసములను తిలకించగలుగుతాడు. తన ఇంద్రియములతో శీతోష్ణములను ఎటుల గమనిం

మనో, అటులనే విశ్వాంతర సంఘటనలను గమనించును, విశాల విశ్వమంతయు యిప్పుడు తన అనుభూతికి క్షేత్రము.

*

1. The spiritual consciousness is that in which we enter into the awareness of Self, the Spirit, the Divine and are able to see in all things their essential reality and the play of forces and phenomena as proceeding from that essential Reality.

2. *విశ్వచైతన్యము:* అహంకారము, మనస్సు, శరీరముల జ్ఞానమును దాటి, వాటి అవధులను ఛేదించిన పిదప కలిగే విశాల విశ్వము యొక్క అభిజ్ఞతియే విశ్వచైతన్యము. ఆ విశాల విశ్వము విశ్వాత్మతో నిండి వుంటుంది. విశ్వశక్తులు, విశ్వమానసిక శక్తులు, విశ్వ ప్రాణ శక్తులు, విశ్వ పదార్థ శక్తులు మరియు విశ్వ అధిమానసిక శక్తుల (overmind forces) ఖేలనమే ఈ విశ్వము యొక్క స్వరూపము. అయితే వీటన్నిటి జ్ఞానము ఒకేసారి కలగదు. విశ్వచేతనానుభూతి క్రమేపి కలుగుతుంది — అప్పుడు మన అహంకారము, శరీరము, మనస్సులు వెంటనే మాయమై పోవు. అవి మన జ్ఞానములో ఒక మూల మాత్రమే వుంటాయి. ఇతర మానవులుకూడా మనమే. మనలోని భాగమే. లేక మన ఛాయా విభేదములే. స్వల్ప భేదములతో ఇతరులలో ప్రతిబింబించిన వ్యక్తిరూపములే. నీవే ఆ ఘనతర విశ్వాత్మవు. అదియే నీ బృహత్స్వరూపము. ఈ అనుభూతి విచిత్రంగా వుంటుంది. వస్తువులన్నీ వేరువేరుగా కనబడతాయి. అనుభూతమవుతాయి. ప్రపంచము యొక్క స్వరూపమే మరియొక విధముగా, మామూలు మానవానుభూతి కంటె పూర్తిగా భిన్నముగా వుంటుంది. బాహ్య ప్రపంచకమును తెలుసుకొనుటకు ఇక మనస్సుతో పని లేదు. పంచేంద్రియాల అవసరము లేదు. ఎందుకంటే ఇది సూటిగా కలిగే జ్ఞానము. అయినప్పటికి పొరపాటుకు అవకాశము లేకపోలేదు. ఎందుకంటే జ్ఞానమును పొందుటకు మనస్సు యొక్క ఛాయల పాత్ర వున్నంత వరకు అది తప్పదు. అయితే ఇప్పుడు కలిగే ఈ జ్ఞానము యొక్క స్వరూపము భిన్నము. అది నూతనము. బాహ్యవస్తువుల అనుభూతి అతినూతనముగాను అతి విశాలముగాను, చాలా గాఢముగాను జరుగుతుంది. వాటిని చూచుటలోను,

తెలుసుకొనుటలోను, స్పర్శించుటలోను అదే విధమైన విశాలత్వము భాసిస్తుంది. జ్ఞానము అనంతమై ఎంత దూరమైనా పోగలదు. విశ్వ చైతన్యము కలిగినప్పుడు అహంకూడ విశ్వమువలె విశాలమై అసుర శక్తుల వేధింపులకు మరింత ఎక్కువగా అవకాశము కలుగుతుంది. ఏలన అవికూడా విశ్వచైతన్యములోని భాగములే. సత్యమును ఆవిష్క రించనీయక దానిని ఎదురించుటకు అవి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాయి. ఈ విషయములన్నిటినీ అనుభూతిపరంగా తెలుసుకోవలసి నదే. అందులకు మానసిక జ్ఞానము నిరుపయోగము. విశ్వచైతన్యములో ప్రవేశించి దానిలో సురక్షితంగా చరించేందుకు అహంకారాతీతమైన చిత్తశుద్ధి చాలా అవసరము. చైత్యపురుషుడు కూడ ఏ మాత్రము తడ బాటు లేక దైవోన్ముఖమై, దివ్య సత్యశీలియై మనిషికి ముందర భాగ ములో నిలిచి నేతృత్వమును వహించవలెను.

3. *సాధారణ చేతన:* మనిషి బాహ్య వస్తువులను పంచేంద్రియాల ద్వారా, బాహ్య మనస్సుతో, భౌద్ధికంగా మాత్రమే తెలుసుకుంటాడు. ఈ ప్రపం చమును నడిపించే శక్తులను గురించిన ఊహకూడ అతనికుండదు. వాటియొక్క బాహ్యాభివ్యక్త రూపములు, పర్యవసానములు మాత్రమే అతనికి తెలుస్తాయి. మనస్సులో కొంత అంతరంగిక జ్ఞానము భాసించ వచ్చు. ఇంకా లోతుగా చైత్యవీక్షణము, చైత్యప్రేరణ, ఆధ్యాత్మిక పరి జ్ఞానము కలుగవచ్చు. అయితే మామూలు చైతన్యములో ఉన్న మని షికి ఇవన్నియు అనుషంగికములు మాత్రమేగాని దాని స్వరూపమును ఏమాత్రము మార్చజాలవు.

*

సర్వాతీతము, సర్వగతము, వ్యక్తిగతము — ఈ మూడును సకల సృష్టినీ అంతర్భూత మొనర్చుకొని అద్దానియందర్గతమై, అద్దాని లోనికి చొచ్చుకొని ప్రవేశించిన శక్తిత్రయము. ఇదియే మొట్టమొదటి మూర్తిత్రయము. చైతన్య వికసనమున గూడ మూలభూతమైన తత్త్వ ములీ మూడే. పరమసత్యపు పూర్ణానుభూతి మనకు కలుగవలెననిన, ఈ మూడింటిలో దేనినీ నిర్లక్ష్యము చేయుటకు వీలు లేదు. వ్యక్తి చేత నలోనుండి విస్తృతతర విశ్వచేతనలోనికి మనము మెలకువను పొందు

ములు. కాని, నానావిధ రూపవిశేషములతోడను, శక్తివిశేషములతోడను గూడిన యీ విశ్వచేతనలోనుండి కూడా, దానికంటె మహత్తరమై, నిరపేక్షమైన కేవలత్వమున సుప్రతిష్టమగు నఖండ చేతనలోనికి మన మారోహింప వలసి యున్నది. అయినను, ఈ యారోహణమున, మనచే వదిలివేయ బడినట్లు గోచరించు వాటిని మనము నిజముగా విడిచి పెట్టివేయుట సంభవింపదు. వాటిని మనము చేపట్టి రూపాంతరము చెందింతుము.

ఏలయన, ఈ మూడును ఒక దానిలో నొకటి నిత్యముగ నిలుసిల్లుచుండెడి ఉన్నత స్థాయి ఒకటున్నది. ఆ స్థాయిలో నవి సామరస్య పూర్వకమగు నేకత్వమందు మహదానందమున సుసంఘటితములై యున్నవి.

స్వేచ్ఛానువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహశాస్త్రి, కమలాకర వేంకటరావు (యోగసమన్వయము)

అజ్ఞానమనగానేమి?

అజ్ఞానమనగా అవిద్య. ఖండ చైతన్యము, తన్మూలము అయిన అహంకారిక మనస్సు, జీవితము ఈ ఖండ చైతన్యము యొక్క చిహ్నాలు. విశ్వ చైతన్యము అతిమానసము (Supermind) నుండి విచ్ఛిన్నమై, అఖండ సత్యమును, మానవుని యథార్థ తత్త్వమును, దివ్యచైతన్యమును, దివ్యశక్త్యానందములను పోగొట్టుకొన్నది. తత్ఫలితమే ఈ అజ్ఞానము. తత్పర్యవసానములే పాక్షిక సత్య జ్ఞానములపై నిర్మితమైన ఈ జగత్తు, చిన్మయ విజ్ఞాన జన్యములైన సత్యాజగత్తు, దివ్య సామరస్యముల బదులు సృష్టించబడిన ఈ అంధకార జగములు. ఇవి అర్థసత్యములు, అర్థఅసత్యములు. దీనినే శంకరుడు వంటి కొంతమంది తాత్త్వికులు 'మాయ' అనే రంగు పులిమి దైవము యొక్క అత్యున్నత సృజనశక్తిగా భ్రమ పడ్డారు. కాని దాని చాటున గల ఘనతర సత్యాన్ని గ్రహించ లేదు. ఈ సృష్టిగతమైన చైతన్యమంతా పూర్ణజ్యోతినుండి విచ్ఛిన్నమైనందున అది సీమితము. వికారము చెందినది. అది దేనినైతే

చూసి సత్యమనుకుంటుందో అదికూడా పాక్షిక జ్ఞానమే. అందుకనే దానిని మనం అజ్ఞానము అని వ్యవహరిస్తాము.

అసత్యము వేరు. అది అవిద్య కాదు. అవిద్య యొక్క అధమాధిక పర్యవసానము, అంతిమ పరిణామము అయి యున్నది. అది సృష్టికార్యములో చొరబడిన ఒక అసురశక్తి వలన సృష్టింపబడి, సత్యమునుండి వేరుపడుట మాత్రమే కాక — ఆ కారణముగా పరిమిత జ్ఞానము కలిగి వుంటుంది. అది అసత్యమునకు ద్వారము. సత్యముపై కత్తి గడుతుంది. లేదా సత్యమును పట్టుకొని దానికి వక్ర భాష్యాలు చెపుతుంది. ఈ శక్తి, ఈ చీకటి అసురశక్తి, ఈ రక్కసి మాయ తన వికృత చైతన్యమునే నిజమైన జ్ఞానముగా నిలబెడుతుంది. దాని పిడివాద వక్రీకరణములను లేక సత్య వైపరీత్యములను సత్యములుగా ప్రకటిస్తుంది. ఈ వక్ర చైతన్య శక్తులనే, వ్యక్తులనే మనము అసుర శక్తులు, అసుర జీవులు అని అంటాము. అజ్ఞాన దినుసునుండి అసురులు వికార రూపములను సృష్టించి నిజరూపములుగా చలామణి జేసినప్పుడు యోగ దృష్టిలో అవి మిథ్య, మోహాము.

*

నేను అతిమానస సత్యము (Supramental truth) తప్ప మిగిలినదంతా అసత్యమని చెప్పలేదు. అతిమానసము క్రింద పూర్ణ సత్యము లేదని చేప్పేను. పరిపూర్ణ సమరసమయిన సత్యము అధిమనస్సులో (overmind) అనేక సత్యములుగా విచ్ఛిన్నమౌతుంది. అవి పరస్పర సంఘర్షితములై వాటి వాటి సఫలతలకై వేరువేరు లోకములను సృష్టించుకుంటాయి. లేదా విభిన్న సత్యములు సత్య శక్తులు కలిసి చేసిన లోకములలో తమ యజమాన్యమును నిరూపించుకుంటాయి. క్రిందికి పోతున్న కొద్దీ ఈ విచ్ఛిన్న ఖండములు మరింత విభిన్నములై అసత్యాజ్ఞానాంధకారములుగాను, చివరగా జడ పదార్థము వంటి అచేతనములుగాను తయారవుతాయి.

*

అయితే అజ్ఞానము ఈ ప్రపంచ ప్రకృతి యొక్క ఒక ముఖము మాత్రమే. అది దాని పూర్ణ లక్షణము కాదు. మూల శక్తిగాని స్రష్టగాదు. దాని ఊర్ధ్వ మూలములో తనకు తానే నియమితము జేసు

కొనిన జ్ఞానము. అధో మూలంలో (lower origin) కూడా అచేతన నుండి వినిర్గమించినప్పుడు అది ఒక అణగ ద్రొక్కబడిన చైతన్యమై యున్నది. తన స్థాయిని తిరిగి పొందుటకు, తన నిజరూపమైన జ్ఞానమును ఆవిర్భవింప జేయుటకు, అస్థిత్వము (existence) యొక్క పునాదిగా ఆవిర్భవించుటకు తిరిగి శ్రమిస్తుంది. వైశ్వ మనస్సునందు కూడ మానవ మనస్సును మించిన శ్రేణులు కలవు. ఆ శ్రేణులు విశ్వ సత్యమును అందుకోగలవు. మన మానసము ఆ శ్రేణులలోకి అధిరోహించగలదు.

స్వేచ్ఛానువాదము: వి. చంద్రశేఖరరావు

విభాగము III: చేతన యొక్క విభిన్న భూమికలు

అచేతన

భగవంతుని లీల విచిత్రమైనది. తన ప్రజ్ఞావైభవములు ఈ సృష్టిలో ఎక్కడా కానరావు. ఆయన ఈ సృష్టిని యథేచ్ఛగా నిర్వహిస్తాడు. తన శక్తి సామర్థ్యములను సృష్టిలోనికి యథాతథంగా దింపడు. వాటిని మరుగు పరచి పూర్తిగా వ్యతిరేకమైన అంధకార తామసిక రూపములను ధరిస్తాడు. అంధకారము, అచేతనము, జడత్వము, అజ్ఞానము, అసామరస్యము, విచ్ఛిత్తి దాని శాపములు, ఈ దృశ్యమాన జగత్తుకు పునాది. నేడు మనము 'అచేతన' అని వ్యవహరించునది, ఎప్పుడు తెరమరుగై పిదప విశ్వముగా ఆవిష్కారమైనటువంటి ఋగ్వేదోక్తమైన అచేతనాసాగరము — దీనినే అసత్తు అని కూడా పిలిచెదరు. మన మనస్సు యొక్కయు, జీవితము యొక్కయు ముఖ్య లక్షణము అజ్ఞానము (అవిద్య). ఈ అవిద్యకు కారణము తన్మూలమైన అచేతనయే. ఈ అజ్ఞాన మూలమునుండి పరిణామ ప్రక్రియ కొనసాగినప్పుడు కొన్ని అంధకార శక్తులు, దుష్ట దేవతలు ఘటిల్లినవి. అచేతన, అనృతము, బాధ, దుఃఖము, అజ్ఞానము, మృత్యువు, బలహీనత, దుగ్మత, విరోధము, దౌష్ట్యములతో కూడిన ఈ అరాజకత్వమును అవి పోషిస్తూ వుంటాయి. ఈ అభివ్యక్తి, ఈ సృష్టి పూర్తిగా వక్రీకృతమై,

తప్పు త్రోవనబడి, దేవుని యొక్క నిజతత్వమును ప్రదర్శించకుండు టకు ఇదే కారణము. హేతువు ఇదే. కాని పరిణామ ప్రయాణమునకు తొలి స్థలియైన ఈ అచేతన యందు సహితము దివ్యచైతన్యము నిగూఢమై, అంతర్లీనముగా వుండి తన జ్యోతి, చేతన, శక్తి, సంపూర్ణతలను సౌందర్య ప్రేమ స్వరూపములను వెలయించు కొనుటకై శ్రమించు చున్నది. అచేతన మరుగున దివ్య చైతన్యము పొంచివుండి పని చేస్తుంది. క్రమక్రమముగా పైకి వచ్చి, తన మారువేషమైన అజ్ఞానాచ్ఛాదమును తొలగించి బహిర్వ్యక్తమౌతుంది. అందుకనే ఈ ప్రపంచము దైవాన్ని అభివ్యక్త పరచుటకై ఏర్పడినది అంటారు.

*

అచేతనమనగా పరమ చైతన్యము (supreme super consciousness) యొక్క చీకటి ప్రతిబింబము. దానికి పూర్తిగా వ్యతిరేకము. పరమ చైతన్యము యొక్క ధర్మములు — నిరపేక్షత (absoluteness) ఆటోమేటిక్‌గా పనిచేయుట — దీనికి కూడ కలవు. కాని అవి గాఢమైన సమాధి స్థితిలో అంతర్లీనమై ఉంటాయి. ఆ పరమ చైతన్యము అనంత అగాధములో తనను తానే నిమజ్జించు కొన్నప్పుడు, అది అచేతనంగా తయారవుతుంది. తన స్వీయ సత్త్వములో తేజో విరాజితమై, స్వాత్మాశ్రయముగా నుండుటకు బదులు నిబిడాంధకారములో అంతర్లయము — ఋగ్వేదములో చెప్పినట్లు — "తమ ఆసీత్ తమసా గూఢం" — అంధకారము లోపల ఆవృతమైన అంధకారము. అందుకని అది అనూహ్యామైన న్యూనత. ఏ విధమైన సత్త్వమూ లేని స్థితి. తనెవరో తను ఎరిగి వుండుటకు బదులు (self-awareness), అగాధములో తనను తాను మరిచిపోయిన చేతన ఒకటి యున్నది. కాని అది జాగృతము గాదు. ఇక్కడ ఒక ఆశ్చర్యకరమైన విషయమును గుర్తించాలి. ఆ అంతర్లీనమైన చేతనలో కూడ ఒక తాదాత్మ్య జ్ఞానము భాసిస్తుంది. ఆ గాఢాంధకార అచేతన భూమికలో కూడ అస్తిత్వ సత్యము లెన్నియో నిగూఢమై ఉన్నాయి అంటే ఎంత ఆశ్చర్యము! దానికి కూడ సృజన శక్తి వున్నది. అది సక్రియమై సృష్టిని చేస్తుంది! మొదట చేతనా భూమికను ప్రదర్శించదు. శక్తి భూమికను ప్రదర్శిస్తుంది. దాని అంతర్గత జ్ఞానము అతి సమర్థవంతము. అది కార్యమును

నిర్వహించినప్పుడు ఎక్కడా పొర్లుపోదు. దానికి తిరుగు లేదు. దీనిని బట్టి మనకి ఒక విషయం స్పష్టంగా తెలియ వస్తుంది. జడ వస్తువులలో అంతర్లీనంగా Real-idea వసించి ఉంటుంది. In all material things reside a mute and involved Real-Idea, a substantial and self-effective intuition, an eyeless exact perception, an automatic intelligence working out its unexpressed and unthought conceptions, a blindly seeing sureness of sight, a dumb infallible sureness of suppressed feeling coated in insensibility, which effectuate all that has to be effected. అచేతన యొక్క ఈ అవస్థ, ఈ విధమైన ప్రవర్తనము శుద్ధ చైతన్యము యొక్క అవస్థ, ప్రవర్తనములను పోలివుండును — మూల లక్షణమైన ఆత్మజ్యోతి బదులు ఆత్మాంధకారమే ఉంటుంది. ఈ శక్తులు భౌతిక మూర్తుల యొక్క సహజ లక్షణములు. అయినప్పటికి భౌతిక పరివేషము లోపించిన రూపములో వాటి జాడ కనబడదు. అట్టి అవచేతనములో కూడా ఆ శక్తులు క్రియాశీలముగా భాసిస్తాయి.

*

అచేతననుండి వినిర్గమించిన ప్రధమావతారమే పదార్థము.....

*స్వేచ్ఛానువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకట్రామ శాస్త్రి

అవచేతన

ఈ చరాచర జగత్తుకు ప్రాతిపదిక అచేతన. దీని పేరు అచేతన అయినప్పటికీ నిజానికి అది అచేతనము కానే కాదు — అణిచి వేయబడిన చైతన్యము లేక 'అవ'-చేతన ("sub"-conscience) మాత్రమే. అది అంతర్లీన చైతన్యము. అందులో సమస్తము గర్భితమై ఉంటుంది. కాని రూపకల్పన లేదు. పైకి ప్రకటించబడదు. దాని స్థానము అచేతనకు, చేతనాత్మకమైన మనో జీవిత శరీరములకు మధ్య భాగము. ప్రాణులకు ఉండే ఇంద్రియ జ్ఞాన సామర్థ్యములన్నీ దానికీ ఉంటాయి. కాని అవి నిష్క్రియములు. అవచేతనమనగా పదార్థములోని జడత్వము, మంద స్వభావము మెల్లి మెల్లిగా పరిణామము చెందగా ఏర్పడిన చేతనా ప్రతిరూపము. దానికి గూఢ భావములు, మానసికానుభూతులు, ఇంద్రియ ప్రతిక్రియలు ఉంటయి. కాని విస్పష్టత లేక తరళములుగ ఉంటాయి. ఈ అవచేతన ఒక స్టోర్ రూమ్ లాంటిది. జాగృత స్థాయిలో సంభవించు సమస్తానుభూతులు అవచేతనలో నిమజ్జనం అయిపోయి వుంటయి. అయితే వాటికి స్పష్టమైన ఆకృతి ఉండదు. ఛాయారూపము మాత్రమే వుంటుంది. మనుమలకు మనస్సులో తటస్థించే భావములు, సంవేదనములు, జ్ఞాపకములు అదే పనిగా పునరావృతమౌతూ వుంటయి. (ఇది సర్వ సామాన్యంగా అందరికి అనుభవమౌతూనే ఉంటుంది.) ఒకొక్కప్పుడు క్రియారూపములు దాల్చి బహిర్వ్యక్తముకూడా అవుతాయి. ఇదంతా అవచేతనము యొక్క చలవే! ఏ విషయంమైనా విధీ విరామము లేకుండా మళ్ళీ మళ్ళీ పునరావృతమగుటకు ఇదే ముఖ్య కారణము. మనిషి స్వభావము మారకుండా మూర్ఖంగా ఉండుటకు, "ఆ మనిషి అంతే లెండి" — అనే నానుడికి కారణం ఇదే. "అమ్మయ్యా, వదిలి పోయినైరా బాబూ" అని అనుకొన్న విషయములు కూడా మళ్ళీ మళ్ళీ తలెత్తి మనని వేధిస్తూ వుంటయి. వాటి బీజములు, మరియు మానసిక, ప్రాణిక, దైహిక సంస్కారములు ఎక్కడికీ పోవు — అవచేతన వాటి నివాస భూమి. మృత్యువుకు, రుగ్మతకు ఆలంబనము. అది అవిద్యకు కోట, దుర్భేద్యమైన చివరి దుర్గము. మనిషిలో బలవంతంగా అణిచి పెట్టబడి పూర్తిగా

విసర్జింపబడనిదంతా అవచేతనలోకి దిగి, బీజరూపములో ఉండి, ఏ క్షణమైనా బహిర్గత మయ్యేందుకు వేచి వుంటుంది.

*

మానవునిలోని అవచేతనము అతని అంతరంగిక స్వరూపము యొక్క చివరి సరిహద్దు. అక్కడే అది అచేతనాన్ని కలుస్తుంది. ఆ అంశ దగ్గరే అచేతనం అర్ధ చైతన్యవంతంగా కావాలని పెనుగులాడుతుంది. ఉపరితల భౌతిక చైతన్యం కూడా జాగ్రతావస్థ నుంచి దిగి అచేతనం వైపు తిరోగమిస్తున్నప్పుడు మధ్యగా ఉన్న అవచేతనంలోనే విశ్రమిస్తుంది. ఇంకో దృక్పథంతో చెప్పాలంటే ఈ అధో భాగాన్ని అచేతనానికి ముందరి గదిగా చెప్పుకోవచ్చు. దాని ద్వారానే ఇందులో ఏర్పడిన రూప కల్పనలు జాగ్రతావస్థలోకి సరఫరా అవుతాయి.

*

చైతన్యపుటంచులలో నాట్యమాడే అచేతనమే అసలైన అవచేతనం. తన చలనాలను చైతన్య పదార్థంగా మార్చుకోడానికి పైకి పంపిస్తూ, గతంలోని అనుభవాల ముద్రలను అచేతనా బీజాలుగా తన అంతరాలలోకి కబళించేస్తూ, మళ్ళీ ఎడతెగకుండాను, గజిబిజిగాను వాటిని బాహ్య చైతన్యంలోకి పంపించేస్తూ ఉంటుంది. ఇంకా వాటి ఉత్పత్తి స్థానం మనకి సరిగా తెలియని వ్యర్థ, హానిదాయక పదార్థాన్ని పైపైకి ప్రయోగిస్తూంటుంది. స్వాప్నికావస్థలలోను, అన్ని రకాల యాంత్రిక పునఃశ్చరణాలుగాను, జాడతెలియరాని ప్రేరణలు, ప్రేరకాలు, ప్రచోదనలు, మనః ప్రాణ దైహిక ఆందోళనలుగాను, ఒడుదుడుకులుగాను మనలోని అస్పష్ట విభాగాల మూగ యాంత్రికావసరాలుగాను పైకి తోసేసేది కూడా అదే. మనలోని ఏ విభాగాన్ని మనం కచ్చితంగా అవచేతనమని పిలవగల్గుతున్నామో అది మన చేతనా జీవితానికి, మనస్సుకి కింది స్థాయిలో అధమస్థంగా, అస్పష్టంగా ఉంటుంది. శరీర నిర్మాణంలోని కేవల విశుద్ధ భౌతిక, ప్రాణిక ధాతువులన్నిటినీ ఆవరించి ఉంటుంది. ఇది మానసీకరణం పొందలేదు. మనస్సు పరిధిలో ఉండదు. దాని అజమాయిషీలోనూ ఉండదు. దానిలో మౌనంగా ఒక రహస్య చైతన్యం ఉన్నదనీ, అది శక్తి శీలమైనదైనా మనకి తెలియకుండా జీవకణాల్లోనూ, నరాల్లోనూ, తదితర దేహపదార్థాల్లో

అన్నిటిలోనూ ఉండి, వాటి జీవగమనాన్ని, స్వయంచాలక ప్రతిస్పందనలను సరిచూస్తుందని చెప్పవచ్చు. అంతేకాక నిమజ్జిత ఇంద్రియ మనస్సు చేసే అత్యల్ప కార్యాలు — ప్రధానంగా జంతు, వృక్ష జీవితాల్లో — దీని పరిధిలోకే వస్తాయి. పరిణామ క్రమంలో మనం ఈ ధాతువు చేసే వ్యవస్థిత కర్మల అవసరాన్ని అధిగమించేశాము. అయినప్పటికీ అది ఎక్కడో అడుగున ఉండి మన చైతన్య ప్రకృతికి క్రిందుగా కనిపించకుండా పనిచేస్తూనే ఉంది.

*

మనలో నిమజ్జితమైయున్న ఒకానొక భాగంలో తనకంటూ చైతన్యవంతమైన అనుబంధిత ఆలోచనలుగానీ, సంకల్పం, సంవేదనగానీ, క్రమబద్ధమైన ప్రతిచర్య గాని ఉండక పోయినప్పటికీ అన్ని విషయాలను అస్పష్టమైన అచ్చులుగా తనలో దాస్తూ ఉండే ఈ భాగాన్ని మన యోగంలో అవచేతన అంటున్నాము. ఈ అవచేతన తనలో దాచుకున్న విషయైక ముద్రలు, అంటిపెట్టుకొని ఉండే వాడుక చలనాలనుంచి ఉద్దీపనలు, వింత వింతగా మారిన రూపాలుగానూ, మోటుగా మళ్ళీ మళ్ళీ పునరావృతమయే విషయాలుగానూ కలల్లోనూ జాగృతావస్థలోను విజృంభింప చేస్తుంది. ఇలా ఇవి అస్తవ్యస్తంగా, అసంబద్ధంగా కలల్లో విజృంభిస్తే మెలకువలో కూడా పాత ఆలోచనల యాంత్రిక పునశ్చరణలుగా, మనః ప్రాణ శరీరాల పూర్వ అలవాట్లుగా, సంవేదనలకు, చర్యలకు, రాగ భావాలకు ఒక అస్పష్ట ఉద్దీపనగా బయిట పడవచ్చు. ఇవన్నీ మన చేతనాత్మకమైన ఆలోచనతో గాని, సంకల్పం వల్ల గానీ లేక వాటిలోనుండి గాని ఉత్పత్తి కావు. పైపెచ్చు వీటికి, వీటి ప్రత్యక్ష జ్ఞానానికి, ఎంపికకు, ఆదేశాలకు పూర్తి వ్యతిరేకంగా కూడా ఒక్కొక్కసారి ఉంటాయి. అవచైతన్యంలో ఒక మసగ మనస్సుంది. అందులో చాలా మూర్ఖపు సంస్కారాలు, భావనల ముద్రలు, వాసనలు, నిశ్చయ అభిప్రాయాలు, గతంలో ఏర్పడి అలవాటు పడ్డ ప్రతిచర్యలు నిండి ఉంటాయి. అక్కడున్న మసగ ప్రాణికంలో అలవాటుగా ఉండే కోరికలు, సంవేదనలు, నాడీ ప్రతిచర్యలు బీజ రూపంలో ఉంటాయి. అవచైతన్యంలో బాగా మసకబారిన స్థూల పదార్థం కూడా ఉంది. శరీర వ్యవహారాలను ఎక్కువగా నడిపించేది

అదే. మన శరీర రుగ్మతలకు కారణం అదే. దీర్ఘ రోగాలకు, మళ్ళీ మళ్ళీ తిరగబెట్టే వ్యాధులకు ముఖ్యంగా అవచేతనయే కారణం. దాని మొండి జ్ఞాపకం, తన మీద గట్టిముద్ర పడిన దానిని దైహిక చైతన్యం మీదకు మళ్ళీ మళ్ళీ రప్పించే దాని అలవాటు వల్లనే ఇలా జరుగుతుంది.

*

మనలోని పరిణామ గతికి అవచేతనం మూలాధారమే అయినా మన గుప్త ప్రకృతి యొక్క పూర్ణ స్వరూపం మాత్రం అది కాదు. మన వ్యక్తిత్వమునకు పూర్తిగా మూలము కాదు. అయినప్పటికీ కొన్ని చేష్టలు అవచేతనంలో నుంచి పైకి లేచి చేతనా భాగాలలో రూపు కట్టవచ్చు. మన అల్ప ప్రాణిక, దైహిక సహజాత బుద్ధులు, చలనాలు, అలవాట్లు, లక్షణాలు ఇత్యాదులన్నిటికీ ఇదే మూల కారణము.

*

అవచేతనమనగా మానవుని అవ-మానసిక (sub-mental) ప్రాతిపదిక. అక్కడ ముద్ర పడిన భావనలు (భావనా ముద్రలు), అలవాటైన చలనాలు, సహజాత బుద్ధులు ప్రోగై ఉంటాయి. ఏ చలనం అందులో తన ముద్ర వేస్తుందో దాన్ని అది నిలిపి ఉంచుతుంది. అందులో మంచి చలనాన్ని నాటగలిగితే అది దాన్నే జాగ్రత్తచేసి పైకి పంపిస్తుంది. అందువల్ల స్వభావం శాశ్వతంగా, సంపూర్ణంగా పరివర్తన చెందటానికి ముందు దానిలోని పాత చలనాలను పూర్తిగా తుడిచేసెయ్యాలి. జాగృత విభాగాలలో ఉన్న చైతన్యం వచ్చి స్థిరపడినప్పుడు అది అవచేతనలోకి వెళ్ళి దాన్నికూడా పరివర్తన చేసి తను అక్కడ కూడా దానికి ఆసరాగా ఉండి పోతుంది. ఇక అప్పుడు అవచేతన వలన ఏ రకమైన ఇబ్బంది కలిగే అవకాశముండదు. అయితే అంత కంటే ముందుగానే అవచేతన భాగాలలో సత్సంకల్పం, సరైన ప్రతిచర్య చేసే అలవాటును కలిగిస్తే దాని వలన ఎక్కువ ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చు.

*

మానవ స్వభావానికి పునాది పూర్తిగా అవచేతనం కాదు. అది అజ్ఞానానికి అడుగున ఆధారంగా మాత్రం ఉండి అధః ప్రాణికం

మీద, దైహిక చైతన్యం మీద తన ప్రభావం చూపగా అవి తిరిగి ప్రకృతి ఉన్నత భాగాల మీద ప్రభావం చూపిస్తాయి. అది ఏమిటో ఎలా పని చేస్తుందో గమనించటం మంచిదే కానీ ఈ కారణ జీవిలో కనుమరుగ్గా ఉన్నవి గానీ లేక పైకి స్పష్టంగా ఉన్నవీ అయిన ఈ విష యాలను ఎక్కువ పట్టించుకో కూడదు. అది తను కాదనీ తన నిజ రూపం పైన అజ్ఞానం ప్రయోగించిన ఒక కృత్రిమ రూపమే అనీ అను కోవాలి. నిజస్వరూపం అంటే అంతర్గత పురుషుడు. ఈ అంతర్గత జీవికి దైవాన్ని చేరుకోవటానికి, వ్యక్తం చేయటానికీ లెక్కలేనన్ని అవకాశాలున్నాయి. అదే అంతరాంతరాల్లో ఉండే ఆత్మ. అదే చైత్య పురుషుడు. అది స్వతహాగా స్వచ్ఛము, దివ్యము అయి సదా సత్యం, శివం, సుందరం వైపునే ఉంటుంది. ఈ అంతర్గత జీవి బాహ్య జీవిని తన కైవశం చేసుకొని, అంతవరకు పరవళ్ళు తొక్కుతున్న అజ్ఞాన అవచేతనానికి కాకుండా భగవంతుని ఉపకరణమయేటట్లుగా చేయాలి. సదా ఈ స్మరణలోనే ఉంటూ ప్రకృతిని ఊర్ధ్వ ముఖంగా వికసించేటట్లు చేస్తే దివ్య చైతన్యాన్ని అందుకోవచ్చు. దాన్ని క్రిందకు తెచ్చి ఆంతర, బాహిర జీవితాల్లోని, మనః ప్రాణిక శరీరాల్లోకి, అవచేతనలోకి, ఉదాత్త జీవిలోకి, ఇంకా తనలో రహస్యంగానూ, బహి రంగంగానూ ఉన్న వాటన్నిటిలోకి ప్రవేశ పెట్టవచ్చు. ఇదే ముఖ్య వ్యాపకం గావాలి. అట్లాకాక ఎప్పుడూ అవచేతన గురించే ఆలోచిస్తే దానిలో ఉండే లోటుపాట్లు, అపరిపూర్ణత వల్ల అసంతృప్తి కలిగి కృంగిపోతారు. అందువల్ల అది ఆచరణీయం కాదు. ఎల్లప్పుడూ సమ తౌల్యాన్ని అనుసరిస్తూ, అనుకూల వాతావరణానికి ఇష్టపడుతూ, ప్రతికూలతను ఒకవేళ గుర్తించినప్పటికీ దాన్ని నిరోధించి పరివర్తన చేయటానికే అనుకోవాలి. ఇంతవరకూ చెప్పిన దానిని ఆచరిస్తూ, శ్రీమాతపై విశ్వాసంతో, ఆమె మీద పూర్తి భారం వేస్తూ నడవడమే రూపాంతరీకరణమునకు సూటైన మార్గము.

ప్రాణిక స్పందనములను, వ్యసనములను వదిలించుకొని వాటిపై విజయం సాధించాల్నంటే వాటిని నిర్ద్వంద్వంగా ఒకే దెబ్బతో నరికి పారేసి వాటితో తెగతెంపులు చేసుకోవటం కంటె వేరే మార్గం లేదు.

స్వేచ్ఛానువాదం: అమరవాది ప్రభావతి; అమరవాది వెంకట్రామ శాస్త్రి

అంతస్థలీయము

మన చేతన యొక్క పూర్ణ స్వరూపము మనకు తెలియదు. ఏలన, సాధారణంగా మనిషి అనగా 'మనస్సు' అనే చెరసాలలో నిర్బంధిం పబడిన జీవి. కాని మానవుని జీవితము 'అంతస్థలీయ' శక్తులచే ప్రభావితము. అంతేకాదు, అతని నిజస్వరూపమంతా చాలావరకు అంతస్థలీయంగానే వుంటుంది. 'అంతస్థలీయ' మనగా యోగిపుంగ వులు మాత్రమే ఓలలాడే క్రీడారామము గాదు — అది చేతనా తరంగ ములు పొంగి పొరలే కడలి — మనకు కూడా చాలా సన్నిహితమే. మనస్సు అనే చెరసాల గోడలను ఛేదించినప్పుడు మనమా మహా సముద్రంలోకి ప్రవేశించగలుగుతాము. దానియొక్క స్వరూపమే ఈ క్రింది శీర్షికకు విషయము.

సంపాదకుడు

మానవుని చేతనా వ్యవస్థలో అవచేతన (subconscient) యే కాకుండా అంతస్థలీయము అనే మరియొక భూమిక ఉన్నది. అవ చేతన యొక్క స్వరూపము అయోమయంగా, అస్పష్టంగా ఉంటుంది. కాని మనలోని అంతస్థలీయము (అంతరంగిక లేక సూక్ష్మ భౌతిక, ప్రాణిక, మానసిక చైతన్య విభాగములు) అస్పష్టముగా గాని, అవకతవ కగా గాని, మసక మసకగా గాని ఉండవు. మన బాహ్య చైతన్యము నకు వాటిని గురించి తెలియదు, వాటి అభిజ్ఞతి లేదు. కాని వాటి సందేశములు మనకి అందుతూనే వుంటయి. వాటి ప్రభావము కలుగు తూనే వుంటుంది. వాటి మూలము మట్టుకు మనకు తెలియదు.

*

మన జాగృత చేతనకు జ్ఞాతము కాని తత్త్వమునంతా అంతస్థలీయము అని వ్యవహరించుట పరిపాటి. పాశ్చాత్య శాస్త్రజ్ఞులు దీనినే అవచేతన అంటారు. ఈ రెండింటికీ గల భేదము వారికి తెలి యదు. నా ఉద్దేశంలో అవచేతన అనగా మామూలు భౌతిక చేతనకు క్రింది భాగములో వున్న వస్తువు — దాని వెనుకనున్నది గాదు. అందు

కని అంతర్మానస, ప్రాణిక, భౌతికములు (అనగా చైత్యపురుషుడు) అవచేతనీయములు కావు. వాటిని అంతస్థలీయములు అనాలి.

*

యథార్థ అవచేతనము అధఃపాతాళములోని అతిహీన చైతన్యము. అచేతనకు చాలా చేరువగా వుంటుంది. అంతస్థలీయ చైతన్యము అటుల కానేకాదు. మన బాహ్య చైతన్యము కంటె వెయ్యి రెట్లు పెద్దది. ఈ రెండు చైతన్య శ్రేణులు మనకు తెలియకుండా లోపల రహస్యంగా వుండడం వలన సాధారణ దృష్టికి కలగాపులగంగా కనబడతాయి. అటులనే వ్యవహరింప బడతాయి కూడాను.

అంతస్థలీయ శక్తులు మనకు ముఖ్యము కాదని చెప్పటందుకు వీలు లేదు. ఏలన మానవ జీవితంలోని గొప్ప గొప్ప ఆదర్శములు, సంచలనములు, ప్రబోధములు మానవాభ్యుదయ వ్యూహములన్నిటికి మూలము అదే. అజ్ఞానాన్ని పారద్రోలక పోయినా దాన్ని కొంతవరకైనా నివారించే జ్ఞాన తృష్ణ, లలిత కళలు, కవిత్వము, తాత్త్విక చింతనాదులన్ని దాని ప్రేరణలే. ఈ విధమైన విశిష్టతయే లేకపోతే మనిషి పశువుతో సమానము. ఆలోచించే జంతువన్న మాట.

*

మన బాహ్య ప్రకృతి అచేతనలో నుంచి వచ్చినది. అంతస్థలీయము అటుల కాదు. అది రెండు ప్రవాహముల సంగమము. పైనుంచి అంతర్లయన (involution) మార్గగామియై క్రిందికి దిగి వచ్చిన చైతన్యము ఒకటి. అడుగునుంచి పరిణామ ప్రక్రియ (evolution) ననుసరించి పైకి వినిర్గమించుచున్న స్రవంతి రెండవది. మన బాహ్య స్వరూపము కంటె, ప్రకృతి కంటె పెద్దదైన అంతర్మానసము, అంతఃప్రాణికము, అంతర్భౌతిక లేక సూక్ష్మ భౌతిక స్వరూపములు అంతస్థలీయములోని విభాగములు. ఈ అంతఃస్సత్త్వమే (inner existence) మన బాహ్య స్వరూపము, బాహ్య సత్త్వములకు మూలము. అచేతన యొక్క అజ్ఞానపు ఛాయలు, ఉత్తలీయ చైతన్యము యొక్క సహజ ప్రవృత్తులు లేక బాహ్య విశ్వ ప్రకృతి సంఘాతములకు ప్రతిక్రియలు కూడా మన బాహ్య స్వరూపములోని భాగములే. వీటికి మట్టుకు ఈ అంతఃస్సత్త్వము మూలము కాదు. అయినప్పటికి వాటిలో పాల్గొని వాటిని

ప్రభావితం చేస్తుంది. మన బాహ్యాజీవి జ్ఞానేంద్రియముల ద్వారా మాత్రమే విశ్వముతో సంబంధమును నెరపగలడు. కాని ఈ అంతస్థలీయము అటుల గాదు. విశ్వ శక్తులను స్పర్శించి వాటిని సూటిగా ఉపయోగించుకోగలదు. మన పంచేంద్రియముల వలెనే, ఈ అంతస్థలీయములో కూడా అంతర్ దృష్టి, స్పర్శ, శ్రవణేంద్రియములు కలవు. అనగా వీటి ద్వారా మనము వస్తువుల చైతన్యమును ప్రత్యక్షముగా (ఇంద్రియముల ద్వారా కాకుండా) దర్శించగలము. బాహ్యా వస్తువుల పరిజ్ఞానమునకు అవి రూపకల్పన చేస్తాయి. అంతస్థలీయమునకు జ్ఞానేంద్రియములకు గల భేదమును మనం స్పష్టంగా గుర్తించాలి. అంతస్థలీయము బాహ్యా జ్ఞానం కోసం పంచేంద్రియముల మీద ఆధారపడ నక్కర లేదు. మన బాహ్యా మనస్సు అటుల కాదు గదా! అది మన జ్ఞానేంద్రియముల ద్వారా పొందిన సమాచారమును మనస్సునకు అందజేస్తుంది. మనస్సు దానిని నమోదు చేసుకొని అప్రత్యక్ష జ్ఞానమును మాత్రమే పొందుతుంది.

మానవుని మానసిక, ప్రాణిక, సూక్ష్మ భౌతికములు విశ్వ స్థాయిలో కూడా వ్యాపించి ఉంటాయి. మానవునికి అందు ప్రవేశము లేదు. అట్టి స్తోమత అంతస్థలీయమునకు కలదు. అది భౌతిక స్తరములకు, పదార్థ ప్రపంచమునకు సీమితమై వాటిచే బంధింపబడి వుండదు. దాని దృష్టి, ప్రజ్ఞ, సామర్థ్యము అతి విశాలములు, విశ్వగతములు. మరియు సృష్టి కార్యములో కొన్ని లోకములు అంతర్లయ (involution) కారణముగా క్రిందికి దిగి వచ్చినవి. అవచేతనము నుండి అతిచేతనము వరకు వ్యాపించియున్న ప్రదేశములో కొన్ని లోకములు ఏర్పడినవి. ఈ లోకములు అతి విశాలములు. మనిషి నిద్ర పోయినప్పుడు, చిత్తైకాగ్రత కోసము దృష్టిని లోపలికి మరల్చినప్పుడు గాని, సమాధి స్థితిలో గాని ఈ విశాల సీమలలోకే మనిషి ప్రవేశిస్తాడు.

మన జాగృత చైతన్యమునకు, అంతస్థలీయముతో తనకు గల సంబంధమును గురించి తెలియదు. ఎందుకంటే తనకు గలిగే ఆవేశములు, అంతఃస్ఫురణములు, భావములు, ఇచ్ఛలు, జ్ఞానములు, ప్రేరణలు మన బాహ్యా జ్ఞానమునకు క్రిందినుంచి గాని, వెనుకనుంచిగాని వచ్చినప్పటికి వాటి మూల స్థానము అంతస్థలీయమే. సమాధిలో ఈ అంత

స్థలీయ ద్వారములు తెరువబడతాయి. నిద్రలో కూడా అంతే. మన బాహ్యా జీవితము దట్టమైన తెరతో కప్పబడి వుంటుంది. అందుకనే అది చాలా సంకుచితము. నిద్ర పోయినప్పుడు, సమాధిలోకి వెళ్ళినప్పుడు మనం ఈ తెర వెనుకకు వెళ్ళి అంతస్థలీయంలోకి ప్రవేశించగలము.

*

మన అవచేతన ఒట్టి చీకటి లోకం. దాని వెలుగు మసక వెలుగు. దాని దృష్టికి విస్పష్టత లేదు. అంతస్థలీయము మట్టుకు అటుల గాదు. *దానికి నిక్షేపమైన మనస్సు, జీవశక్తి, స్పష్టమైన సూక్ష్మ భౌతిక పరిజ్ఞానము కలవు. జాగృత మానవునికి గల సామర్థ్యములే దానికి గూడా వున్నాయి — సూక్ష్మ దృష్టి, పరిజ్ఞానము, విశాలమైన జ్ఞాపక శక్తి, వివేచనా బుద్ధి, ఇచ్ఛా శక్తి, ఆత్మ జ్ఞానము ఇవన్నియు మానవ లక్షణములే అయినప్పటికీ అంతస్థలీయములో వాటి స్థాయి వేరు. అవి ఇంకా విశాలమై, ప్రవృద్ధమై చాలా దర్జాగా వుంటాయి. అంతస్థలీయము యొక్క సామర్థ్యము మర్త్య మానసము కంటె వెయ్యి రెట్లు పెద్దది.* తన నిజస్వరూపమును, బాహ్యా వస్తువుల నిజ స్వరూపమును గురించి క్షుణ్ణమైన జ్ఞానము దానికి గలదు. దాని క్రియాశీలత, జ్ఞాన శీలత, కర్మశీలత కూడా చాల ఘనమైనవి. మన ఉత్తలీయ మనస్సు (మామూలు మనస్సు) నకు పూర్ణత్వము లేదు. ఎందుకంటే అది శరీరము వలన, భౌతిక జీవితము, నరముల వ్యవస్థ, భౌతికావయవముల వలన నిర్బంధమై, ప్రభావితమై వాటికి లోబడి వుంటుంది. మనస్సు యొక్క బలహీనతకు కారణములు ఇప్పుడు స్పష్టముగా తెలిసినవి కదా. కాని మన అంతస్థలీయ జీవుడు అటుల గాదు. ఆతని మనస్సునకు ఇట్టి నిర్బంధములు లేవు. శారీరక మనస్సు కంటె, అవయవముల కంటె అది చాలా ఘనమైనది. అది వాటిని ఎరిగి వుంటుంది. వాటికి కారణము, మూలము చాలావరకు అదే. దానిని అవచేతన అని ఎందుకనె దమనగా బయటకు రాలేక తెర మరుగునపడి ఉండి అక్కణ్ణుంచే తన కార్యములను నెరవేరుస్తుంది కనుక, దానిని అవచేతన అనే దాని కంటే రహస్యమైన లోచేతన, ఆవర్తిత చేతన అంటే బాగుంటుంది. ఏలన

అది బాహ్య ప్రకృతిని పరిపోషిస్తూ దానిని పరివేష్టించి కూడా వుంటుంది.

అంతస్థలీయము యొక్క లోతైన విభాగములకు పైన చెప్పిన వర్ణన వర్తిస్తుంది. బాహ్యమునకు చేరువగా వున్న ఇతర పొరలలో అది అంత సమర్థవంతం కాదు. తత్కారణంగా కొంతమంది అంతరంగికంలోకి ప్రవేశించి ఈ మధ్యసీమలను (అంతస్థలీయమునకు బాహ్యమునకు నడుమగల త్రిశంకు స్వర్గం) చూసి మోసపోయి చాల తికమకలు పడతారు. ఎందుకంటే అదికూడా అజ్ఞాన భూయిష్టమే అయినప్పటికి అవచేతన కంటె మెరుగే. ఈ త్రిశంకు స్వర్గానికి అచేతనకి ఏమీ సంబంధం లేదు.

*

మానవ ప్రకృతి అధికాధికంగా (నూటికి తొంభై పాళ్ళు) అంతస్థలీయమై ఉంటుంది. ఆతని బాహ్య వ్యవహారములన్నీ అక్కణ్ణుంచే రహస్యంగా ప్రేరేపించబడతాయి.

స్వేచ్ఛానువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహశాస్త్రి

పర్యావర్తిత చైతన్యము

మానవుని పూర్ణరూపము ఆతని బాహ్య ఆకారమునకు మాత్రమే పరిమితము గాదు. అతని చైతన్యము కేవలం బాహ్య మనస్సుకే పరిమితం కాదు. అతనిలో అవచేతన, అచేతన యింకనూ అంతస్థలీయాది సామర్థ్యములు ఎన్నో నిక్షిప్తమ్మై వుంటయి. అతనిని పరివేష్టించివున్న పర్యావర్తిత చైతన్యము ఈ శీర్షికకు విషయము.

సంపాదకుడు

అంతస్థలీయ చైతన్యము, ఈ మానసిక, ప్రాణిక, సూక్ష్మ భౌతిక కోశముల కావల, తనను పరివేష్టించియున్న మరియొక చేతనా క్షేత్రమును పండించుకుంటుంది. తద్వారా బాహ్య వ్యవహారములను గ్రహిస్తుంది. అవి లోపలికి ప్రవేశించకముందరే వాటి ప్రియాప్రియత

లను గురించి విచారించి, తదనుగుణంగా మెసులుకుంటుంది. తన పరివేష్టిత చేతనా క్షేత్రమును నిరవధికంగా విస్తరింప జేసుకుంటుంది. దానిని చుట్టి ఉన్న విశ్వములోనికి అధికాధికంగా ప్రక్షేపించుకుంటుంది. అటుల వ్యాపించుకుంటూ పోగా పోగా తన అవధులను దాటి పోతుంది. తనకు, తనను చుట్టిముట్టివున్న విశ్వ సత్త్వమునకు గల దూరమును జయించి విశ్వసత్త్వముతో తాదాత్మ్యము చెంది ఏకేశ్వరునితో ఏకమైతుంది.

*

మనను పరివేష్టించియున్న, లేదా పర్యావరించియున్న రహస్య చైతన్యమొకటి యున్నది. బాహ్య ప్రపంచముతో మనకున్న సంబంధ బాంధవ్యాలకు మాధ్యమం అదే.

*

మానవుడు పాంచ భౌతిక శరీరానికే పరిమితుడు కాడు. మన బాహ్య చేతనే అట్లా పరిమితి ఉన్నట్లు అనుకుంటుంది. ఈ భావనను అధిగమించగానే అతడు మొదట తన దేహ సంబంధితమైవున్న అంతశ్చేతనను పొందుతాడు. కాని అది దేహానికి చెందినది కాదు. తరువాత దేహానికి పైనుండే స్తరాలను పొందుతాడు. పిదప దేహాన్ని చుట్టి ఉండే చైతన్యాన్ని అనుభవిస్తాడు. అది మట్టుకు అతనికి చెందినదే. వ్యక్తిగతమే. దాని ద్వారా విశ్వశక్తులతోను, ఇతర జీవులతోను సంబంధం ఏర్పడుతుంది. నేను పర్యావరణ చైతన్యమని పిలిచేది ఈ చివర దానినే.

*

ప్రతి వ్యక్తికి తనదైన చేతన అతని దేహంలో నిక్షిప్తమై వుంటుంది. అతని శరీరం ద్వారా, ఇంద్రియాలనుపయోగించే మనస్సు ద్వారా పరిసరాలను స్పర్శించి వాటి జ్ఞానమును పొందుతాడు.

అయినప్పటికీ నిరంతరం విశ్వాత్మక శక్తులు అతనికి తెలియకుండానే అతని లోనికి చొరబడుతుంటయి. ఉపరితలంలోకి ప్రవేశించే ఆలోచనలు, సంవేదనలు మొదలుగాగల వాటి ఎరుక మాత్రమే అతనికి ఉంటుంది. అవి తన సొంతమే అనుకుంటాడు. నిజానికి అవి మానసిక తరంగాలుగా, ప్రాణిక తరంగాలుగా, భావనా తరంగాలుగా, సంవేదనా తరంగాలుగా వెలుపలనుంచే వస్తాయి. అవి లోనికి ప్రవేశిం

చిన తరువాత ఒక ప్రత్యేక రూపంతో ఉపరితలానికి వస్తాయి. కాని అవి అతని లోపలికి వెంటనే ప్రవేశించవు. అతని చుట్టూవుండే పర్యావరణ చైతన్యంలోనికి (దానిని థియాసఫిష్టులు Aura — పరివేషము అంటారు) ముందు ప్రవేశిస్తాయి. ఈ పర్యావరణ చేతనను నువ్వు తెలుసుకోగలిగితే లోపలకు ప్రవేశించే ఆలోచనలు, భావావేశాలు, రోగ సూచనలు, రోగ తీవ్రతలను ముందుగానే పసిగట్టి వాటిని లోనికి రాకుంటా అరికట్టగలవు. నీలో వుండే అనవసరమైన కల్మషాలను వెలుపలకు పారవేసినా అవి సుదూరములు కావు. నీ చుట్టూ ఆవరించివున్న పర్యావరణ చైతన్యంలో దాగివుండి అక్కడ నుండి నీ లోపలకు చొరబడటానికి ప్రయత్నిస్తుంటాయి. లేదా అవి బయిట కొంత దూరానికి పోయి ఆ పొలిమేరల్లోనో బహుదూరంలోనో తిరిగి నీలోకి ప్రవేశించటానికి అవకాశం ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురు తెన్నులు చూస్తుంటాయి.

*

అవచేతన (subconscient) వేరు, పర్యావరణ చేతన వేరు. అవచేతనలో నిలవ ఉండే గాఢమైన భావనలు, జ్ఞాపకాలు. అక్కడ నుండి పైకి తేలి చేతనలోకి ప్రవేశిస్తయి. పర్యావరణ చేతనలో అటుల కాదు. అవి దానిలో నిలవ ఉండవు. కాని, సంచరించవచ్చు. అది గతి శీలమైనది. ప్రకంపనాలకు క్షేత్రం. శక్తులకు వాహికం.

పర్యావరణ క్షేత్రము వ్యక్తిగతమేగాని లోకముగాదు.

స్వేచ్ఛానువాదము: వి. సుబ్బరామ శర్మ

అతిచేతన

మానవ చేతస్సులో అచేతన మొదలుకొని అతిచేతన వరకు ఎన్నో శ్రేణులు, ఎన్నో అంతస్తులు కలవు. ఇదంతా కేవలం మెట్ట వేదాంతం గాని లేక వేదాంత పండితులు ఊసుబోక చెప్పుకుండే కబుర్లో గాదు. ఇది మనకు చెందిన వృత్తాంతము. మానవ జీవితమునకు సంబంధించిన జ్ఞానము. మానవుని నిత్య జీవితము కూడా దానిచే ప్రభావితము అని చెప్పినా అతిశయోక్తి కానేరదు. ఈ చేతనా స్తరములన్నిటికి మకుటమైన అతిచేతనను గురించి ఇందు తెలుసుకొనెదము.

సంపాదకుడు

మానవుని ప్రాంగణములో మూడు విభాగములు కలవు. ఒకటి అవమానసము (submental), మరియు మనకు అచేతనము వలె కనపడు అవచేతనము (subconscient). ఇవి మన భౌతిక ప్రాతిపదికలు. మన జీవితమునకు, శరీరమునకు ప్రధానావలంబనములు. ఇక రెండవది అంతస్థలీయము (subliminal) — అనగా అంతర్మానసము, అంతర్జీవితము, అంతర్భౌతికముల సంపుటి, లేక ఆత్మ (చైత్యము, psychic) పరిపోషకమైన అంతస్సత్త్వము. మూడవది జాగృత చైతన్యము — అంతస్థలీయము, అంతశ్చైతన్యము రహస్యముగా తెర మరుగునుండి పైగి బహిర్గతము చేయు జాగృత చైతన్యము. మానవ స్వరూపము ఇంతటితో సరి అనుకుంటావేమో. అది ఏమీ కాదు. మన సాధారణ చేతన కంటె లోపలి అఖాతములలో ఎంతయో వున్నది. అంతే కాదు. మనకు పైన కూడా ఇంకా చాలా వున్నది. అది కూడ మనమే. మన ఉపరిగత మానసము కంటె భిన్నము. కాని మన నిజ స్వరూపమునకు ఆవల కాదు. మన ఆత్మ సామ్రాజ్యమే. అసలైన అంతస్థలీయమనగా ప్రకాశవంతము, శక్తివంతము, ద్వంద్వావస్థల (జ్ఞానా జ్ఞానములు) స్థాయిలోని అంతస్సత్త్వమే. మనస్సు యొక్క పేద జ్ఞానమునకు మించినది. అయితే అదియే మన పూర్తి సత్త్వము గాని, ఉన్నత సత్త్వము గాని కాదు. మన కడపటి రహస్యము కాదు.

ఒకానొక అనుభవంలో ఈ మూడు స్థితులకు మించిన అతి చేతన తెలియ వస్తుంది. అది మరో విధమైన జ్ఞానము. పరమోచ్ఛమైన అనంత సత్త్వము. అంతటా, అన్నిటా వుండి వాటిని అధిగమించి ఉండేది. దానినే మానవాళి దైవంగాను, ఆత్మగాను, పరమాత్మగాను పరిగణిస్తారు. అతిచేతనా సీమల నుండి మనకి రాయబారాలు వస్తూనే ఉంటాయి. మన అత్యుత్తమ సత్త్వము వాటి స్ఫూర్తిని పొందుతూనే వుంటుంది. మనము ఆ పరమాత్మకు చేరువ అవుతూనే వుంటాము.

మన వ్యక్తిత్వములో ఉన్నత శ్రేణులు, నిమ్న శ్రేణులు కలవు. అనగా అతిచేతన (superconscience) మరియు అవచేతన, అచేతనలు కూడా (subconscience and inconscience) ఉన్నాయి. ఈ చేతనా భూమికలు మన జాగృత, అంతస్థలీయ స్థితులను పరివేష్టించి ఉంటయి. మనకు వాటిని గురించి తెలియదు. మనం వాటిని అందుకో లేమనిపిస్తుంది. వాటితో చుట్టరికం ఎట్లా కలుపుకోవాలో తెలియదు.

మన జ్ఞానాన్ని విస్తృత పరిచినప్పుడు ఈ ఆత్మ పరమాత్మ లను మనం కనుగొన గలుగుతాము. చివరికి అది మనలోనే ఉన్న పరమోన్నతమైన, ప్రగాఢమైన, అనంతమైన ఆత్మ స్వరూపమనియు,. సచ్చిదానందము, ఈ విశ్వ రచన చేసే చిచ్ఛక్తి అనియు తెలుసు కొనెదము.

అదే ఆధ్యాత్మిక, అతిమానస సత్యచైతన్యము, అనంతత్వము: అదే సత్య స్వరూపమైన అంతస్సత్త్వము, విశ్వంభవుడు, సృష్టికర్త. అతడే విశ్వాత్మయై — మన మానసిక, ప్రాణిక, భౌతిక ముసుగుల వెనుక దాగి వున్న విశ్వాత్మ. అవరోహణములో అచేతనలోకి దిగి వచ్చి, తన అవచేతనా జీవితాన్ని తన అతిమానసిక ఇచ్ఛా జ్ఞానా లతో నిర్దేశిస్తుంది. అచేతన నుండి పైకి ఎగసి, అంతస్సత్త్వములో నివ సిస్తూ, ఇచ్ఛా జ్ఞానాలతోనే అంతస్థలీయ జీవితాన్ని నిర్దేశిస్తుంది. ఆ అంతస్థలీయంలో నుంచి, మన ఉపరితల జీవితాన్ని బహిర్గతము జేసి, అందులో రహస్యంగా వుంటూ దాని అస్తవ్యస్త జీవితమును తన తేజస్సు, ఆధిపత్యములతో కనిపెట్టి వుంటుంది.

అంతస్థలీయాన్ని, అవచేతనను మన ఉపరితల మానసిక జీవితపు కెరటాలను పైకి త్రోసే సముద్రం తోటి పోల్చినట్లయితే, అతి

చేతన అన్నింటిని ఆవరించి, అంతటా నిండి, అన్నిటికి కారణ భూతమై, ఆ సముద్రపు కదలికలను, తరంగములను నిర్ణయిస్తూ, దానికి ఆధార భూతమై ఉన్న ఆకాశము (ether).

ఈ ఉన్నత ఆకాశము (ether) లోనే మనకి ఆత్మ యొక్క సహజమైన స్వభావికమైన జ్ఞానము చాల సూటిగా, ప్రత్యక్షంగా, కలుగుతుంది. మనస్సులో ప్రతిబింబించ నవసరము లేదు. దాని ద్వారా మనము మన సత్య, పరమాత్మల యొక్క ఉచ్చతమ స్థానమును చేరుకొనగలము. సామాన్యముగా ఈ అతిచేతన సత్త్వమును గురించి, మన సత్త్వము యొక్క తక్కిన భాగములను గురించి కంటెను మనమెక్కువ అజ్ఞులము. అయినను దాని జ్ఞానము లోనికే నిశ్చేతనమునందు తన అంతర్లయనమునుండి ఆవిర్భవించుచున్న మన సత్త్వము పరిణతిచెంద ప్రయాస పడుతున్నది.

*

అవచేతన యొక్క పాత్ర: పశుప్రాయమైన ఈ మానసిక జీవి నుంచి పరిణామ క్రమం ద్వారా, ఆధ్యాత్మిక మానవుని ఆవిర్భవింపజేయుట.

*

మన ప్రస్తుత చేతనా రేఖను అతిక్రమించి ఉన్న అతిచేతనలో మన మనస్సు యొక్క ఉన్నత భూమికలు గలవు. మరియు శుద్ధ అతి మానసిక, ఆధ్యాత్మిక సత్త్వము (supramental and pure spiritual being) యొక్క నగ్న శిఖరములు కూడా ఉన్నాయి. మానవుడు పరిణామ ప్రక్రియ ననుసరించి పైకి పోదలచినప్పుడు, మొదట తన చేతనలోని ఆ ఉన్నత శ్రేణులను తప్పకుండా జయించాలి. *అయితే ఆ శ్రేణులు మనకి క్రొత్తవి కావు. మానవ మనస్సులో అప్పుడప్పుడు మెరిసే గొప్ప గొప్ప భావములు, ముఖ్యంగా మెరుపు కాంతులతో వెల్లి వెరిసే అంతః ప్రేరణలు, అంతఃస్ఫురణలు** ఆ లోకములకు చెందినవే.*

*

---

* కవిత్వము, సంగీతము, మంత్రాదులు ఉదా: "పలికెడిది భాగవతమట, పలికించెడు వాడు రామభద్రుండట"

అనంత చైతన్యమునకు ఆత్మ నిమజ్జన శక్తి — అనగా తన అంతరాంతరములలోకి ప్రవేశించి తనను తాను తెలుసుకొనే శక్తి ఉంటుంది. అయితే ఇది మామూలు జ్ఞానము కాదు. సర్వ జ్ఞానము కూడా (All knowledge) కాదు. ఎందుకంటే మన జ్ఞానము, అంతః చైతన్యము, ఆ శుద్ధ తత్త్వములో కరిగి పోతయి. ఈ స్థితినే మనము కోటి ప్రభలతో మెరిసిపోయే అతిచేతనా ఘనము (superconscience) అంటాము. కాని మామూలుగా మనము అతిచేతన అని వ్యవహరించేది ప్రధానంగా ఉన్నత చేతన మాత్రమే — అనగా మన పరిమిత జ్ఞానమునకు అతీతమైనది.

స్వేచ్ఛానువాదం: డి. సత్యవాణి, రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

విభాగము IV: ఉపసంహారము

మన ఉపరితల వ్యక్తిత్వము

మన జీవిత కార్యకలాపాలన్నీ ఉపరిగతములే అయినప్పటికి వాటి మూలములైన అతిచేతనము, అంతస్థలీయము, అవచేతనము మార్మికములు. మానవ జీవితమును ఒక విందుతో పోల్చినట్లైతే వడ్డనలు మాత్రమే మన కళ్ళ ఎదుట జరుగుతాయి. వంటలు వార్పులు రహస్యంగా జరుగుతాయి. మనకు తెలిసిన ఈ ఉపరిగత మానవుడు, ఆతని జీవితము కేవలం వ్యవహారం కోసం ఏర్పడిన సాధనములు మాత్రమే. తన్మూలములైన చేతనా విన్యాసములను గురించి మనకు తెలియదు. ఈ జీవన సరళికంతా అసలు మూలము విశ్వప్రకృతి. అది ఒక మహాసముద్రం వలె ప్రవహిస్తూ వుంటుంది. ఒక్కొక్క మనిషి లోను చిన్న చిన్న పాయలుగా వ్యక్తీకృతమై, ఒక ప్రత్యేక రూపమును దాలుస్తుంది. ఈ సముద్రపురాసిలో నుంచి వచ్చి మనలో నర్తించే కొన్ని ప్రవర్తనా రీతులు, గుణములు, సామర్థ్యములు, పోకడల సంపుటియే మనం "నేను, నేను" అని వ్యవహరించే వ్యక్తి. మనం పుట్టక పూర్వంగాని, పుట్టిన తర్వాతగాని ఈ వ్యవస్థ మనలో ఏర్పడుతుంది.

కొంతవరకూ క్రియాశీలమై మనకు తెలుస్తూ ఉన్నప్పటికి, అధిక భాగము మన మనస్సుకు క్రిందనో, వెనకాలో ఉన్న ఈ మూడు స్తర ములలోను దాగి వుంటుంది.

ఒక విషయాన్ని మనం గమనించాలి. మనం "నేను" అను కునే ఈ పై పూత మన మనుకున్నంత శాశ్వతమైనది ఏమి కాదు. ఎందుకంటే విశ్వప్రకృతినుంచి కొన్ని తరంగములు మనుషుల ద్వారా గాని, పరిస్థితుల ద్వారా గాని, అనేకమైన ఇతర మార్గముల ద్వారా గాని మన మీదికి వస్తుంటాయి. మన వ్యక్తిత్వమును మారుస్తూ, అభివృద్ధి పరుస్తూ లేక పోషిస్తూ వుంటాయి. దీనిలో కొంత భాగము మాత్రమే మన మనస్సుకు తెలుస్తుంది. మనను ప్రభావితం చేస్తుంది. ఇదంతా తన ప్రతాపమే అని మనస్సు అనుకుంటుంది — ఎందుకంటే దాని మూలము తెలియదు కాబట్టి. కొంత భాగము మన అవచేతనము లోకి దిగి పైకి వచ్చే అవకాశం కోసం వేచి వుంటుంది. మిగిలిన దంతా, చాలా వరకు అంతస్థలీయములోకి ప్రవహిస్తుంది. బహిర్గతము కావచ్చును, కాకపోవచ్చును. మరి కొంత భాగము తిరస్కరింపబడి వెనుదిరిగి మళ్ళీ ఆ విశ్వమయ సముద్రంలో కలిసి పోతుంది — ఇక మన ప్రకృతి అంటే ఏమిటో మనం అర్థం చేసికొనెదము. అది మన లోకి ప్రవహించే ఈ శక్తుల యొక్క విన్యాసము. మనకు చేతనైనంత వరకు మనం వాటిని ఉపయోగించు కొనెదము. మనకి ఎంతో నిశ్చ యంగా, సుస్థిరంగా, కచ్చితంగా అనిపించే ఈ "నేను" నిజముగా అటులగాదు. దానికి నిశ్చలత్వమే లేదు. అది కేవలం కొన్ని శక్తుల, ప్రవాహముల విన్యాసమే. ఒకే రకమైన ప్రకంపనములు, ప్రతి రూప ములు మళ్ళీమళ్ళీ పునరావృతమగుట వలన మనకు అట్లా అనిపిస్తుంది. అందుకనే వివేకానందుడు, హోరెస్ మహాశయులు అభి ప్రాయము వేరైనప్పటకి, అవచేతనము మొండిగా ఎదిరించినప్పటికి, మానవ స్వభావం మారటం సాధ్యమే. అయితే మళ్ళీ మళ్ళీ పునరావృ తమయ్యే ఈ ప్రకృతి యొక్క మొండితనం వలన కొంత శ్రమ కలగ వచ్చునేమో గాని — అసాధ్యమేమి గాదు.

స్వేచ్ఛానువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి

చేతన యొక్క పరిణామము, మకుటము

జడ పదార్థము క్రమక్రమముగా వికాసము జెందుట వలన వృక్షజాలము, ప్రాణికోటి ఆవిర్భవించాయి అని ఆధునిక పరిణామ సిద్ధాంతపు వాదన. కాని మూలతః పరిణామము చెందునది చేతనేగాని బాహ్యరూపము కాదు. కాబట్టి పరిణామము అగ్రస్థాయిని జేరుకోవా లంటే మొదట, చేతన ఆ స్థాయిని అందుకోవాలి. చేతన ఏ స్థాయిలో వుంటే దాని బాహ్యాభివ్యక్తి కూడా అదే స్థాయిలో ఉంటుంది. అయితే ఈ పరిణామ ప్రక్రియ (evolution) యాదృచ్ఛిక సంఘటనయా లేక ఒక నిర్దిష్టమైన గమ్యము వైపు పురోగమిస్తున్నదా? అటువంటి గమ్య మేదైనా వున్నట్లయితే పరిణామము ఆ దిక్కుగా పయనించి కృతార్థత నొందుతుంది. చేతన ఏ విధంగా అభివృద్ధి చెందితే పరిణామము కూడా అదే విధంగా తన గమ్యాన్ని జేరుకొంటుంది. ఆ చేతన ఎంత శక్తివంతమై, ఎంత విస్తృతి జెంది, ఎంత ఎత్తునందుకొని, ఎంత సంపూర్ణ వికాసము చెందితే పరిణామము అంత పటిష్టంగా జరిగిం దన్న మాట. సృష్టి అచేతన నుండి మొదలై మెట్లు మెట్లుగా వికసించి, మనస్సును ఎటుల జేరెనో అని ఆలోచించినట్లైతే ఒక రహస్య చైత న్యమే ఈ అచేతన ముసుగు వెనుక దాగి వుండి, మెల్లి మెల్లిగా అజ్ఞానపు మార్గములో నడచి జ్ఞానాన్ని అందుకొన్నట్లు మనకి అనిపిస్తుంది.

ఒక వేళ అదే నిజమైనట్లయితే (జడపదార్థము, అయోమయ మైన జీవితము, మనస్సు యొక్క మసగ వెలుగుల నేపథ్యంలో) సనాతనసత్త్వము ఈ జగత్ కార్యాన్ని జ్ఞాన పూర్వకంగానే నిర్వహి స్తుంది అని అనిపిస్తుంది.

అచేతనము (inconscience) నుండి మొదలై ముందుకు పురో గమించే పరిణామము (evolution), మార్గములో ఎట్టి నిరోధమూ లేక పోతే అంత బాధామయము కానవసరము లేదు — సరళ సుందరంగానే సిద్ధించవచ్చు. బాహ్య ప్రకృతి అచేతనంగా కనబడినప్పటికి అది సుందరం. మనమా సౌందర్యాన్ని ఆస్వాదించ గల్గాలి. అయితే అంత రంగిక చైతన్యాన్ని తెలుసుకొనేందుకు బాహ్య ప్రకృతిని ఎందుకు

బలి పెట్టాలి? దీనికి కారణం అవిద్య నుండి సంక్రమించిన వైకల్యము, వికృతము. ఈ వికృతము ప్రాణజీవులతో మొదలై మనస్సు స్థాయిలో మరింత వికృతానికి దిగజారిపోయింది. అజ్ఞానంలో కూడా కొంత చైతన్యం ఉన్నది. కాని అది గాఢసుషుప్తి వలన తెరమరుగున పడిపోయింది. ఇలా జరగడానికి దైవేచ్ఛ మినహా మరో కారణం లేదు. ఏలన అచేతన అవిద్య సృష్టించే వైకల్యాలను ఎప్పుడో ఒకప్పుడు ఆవిర్భవింప జేయవలసిందే. అప్పుడే ఆ పీడను వదలించుకుండేందుకు అవకాశం గల్గుతుంది. ఒకసారి అది వదిలిపోయినప్పుడు, పదార్థ మాధ్యమం ద్వారా జరిగే దివ్య ఆవిర్భావము మరింత అద్భుతంగా ఉంటుంది. పూర్వము అజ్ఞానమున్నప్పుడు కొన్ని కష్టమైన అంశాలను వదలి పెట్టవలసి వచ్చేది. కాని యిప్పుడు ఆవిధంగా చేతులు కట్టుకోనవసరం లేదు.

"ఇంద్రియాల విలక్షనత్వం ద్వారా అందంనుంచి అనంత సౌందర్యం, ఆనందంనుంచి మహాదానందం" — అవును నిజమే. పదార్థంలో దైవావిర్భావము నెమ్మదిగానే జరిగినప్పటికి అదే సత్యమైన మార్గం. "అపశృతులు, దుర్గంధము" దివ్యాభివ్యక్తి యొక్క మూల లక్షణములు కావు — చైతన్యమునకు సృష్టికి (ప్రకృతి) మధ్య ఏర్పడిన అసాంగత్యము యొక్క పర్యవసానములు. విముక్తమై సమదృష్టిని పొందిన వానికి అవి వర్తించవు. ఏలన అవి అతని దృష్టికి పరాయి వస్తువులు. సవ్యముగా ముందుకు సాగిపోయే సాధకులను అవి ఏమాత్రమూ బాధించవు.

స్వేచ్ఛానువాదం: టి. మాధవరావు, వి. రాఘవేంద్రరావు

ఆరోగ్యమే మహాభాగ్యము

నీవు దృఢమైన శరీరమును, దృఢమైన నాడీమండలమును కలిగి యుండవలెను. నీ బాహ్యస్థితిలో సమతను బలమైన ఆధారముగా జేసికొని యుండవలెను.

"బాహ్యసత్తయందు నిర్వికార స్థితికి ఆధారము" అని మీరు దేనిని అంటున్నారు?

మంచి ఆరోగ్యము, దృఢమైన శరీరము, పసిపిల్లల మాదిరి స్వల్పవిషయాలకు సైతం చలించే దుర్బలమైన నాడీవ్యవస్థ లేకపోవడము, సరిగా భుజిస్తూ, సమంగా నిద్రిస్తూ సమస్థాయిని పెంపొందించుకొని నిశ్చలంగా, ప్రశాంతుడై ఉండేవాడు దృఢమైన ఆధారస్థానం కలిగి అనేక శక్తులను అందుకోగలుగుతాడు.

సరియైన ఆరోగ్యం లేనివారు దివ్యానందంవంటి దైవీశక్తులను అందుకుంటే, ఆ శక్తులను వారు నిలుపుకోలేరనేది ఎవరికైనా అనుభవం ద్వారా తెలిసే విషయమే. అలాంటివారు ఏడవడం, కేకలు వేయడం మొదలుపెడతారు. తాము అందుకున్న శక్తి అంతా వ్యయమయ్యే వరకూ అశాంతిని పొందుతారు. పెద్దగా నవ్వడం, ప్రలాపించడం వంటి వికారాలు చేయకపోతే ఆ శక్తి ఒత్తిడికి వారు ఉక్కిరిబిక్కిరై పోతారు. కనుక ఆ విధమైన చేష్టల ద్వారా వారు తాము సంపాదించిన శక్తులను వదిలించుకోడం జరుగుతుంది.

సంపాదించిన శక్తులను స్థిరంగా నిలుపుకోవాలంటే, ఎంతో నిశ్చలత, ప్రశాంతత అవసరము. దానికి కావలసినది మంచి ఆరోగ్యము, దృఢమైన ఆధారము.

మూలం: శ్రీమాత

తెలుగు మూలం: కె. యస్. భాస్కరరావుగారి "శ్రీమాత సంభాషణలు"

మిని గ్లాసరీ – కొన్ని పదముల పట్టిక

తెలుగు		ఆంగ్లము
అంతర్లయ(న)ము	=	Involution
అంతస్థలీయము	=	Subliminal
అచేతన	=	Inconscient
అతిచేతన	=	Superconscient
అతిమానసము	=	Supermind
అవచేతన	=	Subconscient
అవపాశవము	=	Sub-animal
అవమానసము	=	Sub-mental
అవిద్య	=	Ignorance
అస్థిత్వము	=	Existence
ఆవిర్భావము	=	Manifestation
ఉత్తలీయ	=	Surface
చేతన, చైతన్యము	=	Consciousness
చైత్య, చైత్యము	=	Psychic
జడత్వము	=	Inertia
నిరపేక్షము	=	Absolute
నిశ్చేతన	=	Nescience
పదార్థము	=	Matter
పదార్థవాదన	=	Materialism
పరిణామ ప్రక్రియ	=	Evolution
భౌతికము	=	Physical
ప్రాణికము	=	Vital
వ్యక్తిత్వ, వైయక్తిక	=	Individual
విశ్వ, వైశ్వాన్వయ	=	Cosmic, Universal
సత్తు, సత్త్వము	=	Being
సూక్ష్మ	=	Subtle
స్థూల	=	Gross

అట్టమీద బొమ్మ యొక్క సాంకేతికార్థము

(శ్రీఅరవిందుల రచనలనుండి సంకలితము)

సముద్రము తరచుగా ప్రాణిక ప్రకృతిని, కొండొకతరి ప్రచలిత చేతనా సీమలను సూచిస్తుంది.

*

సముద్రము చేతనా కక్ష్యకు సంకేతము.

*

నీలి సముద్రము సాధారణంగా ఉన్నత మనస్సులోని అఖండ ఆధ్యాత్మిక చైతన్యైక్యతకు చిహ్నము.

*

సముద్రం మీద సూర్యుడు అనగా సత్యజ్యోతి ప్రకాశితమైన చేతనా స్తరము.

*

నావ: మాతృ చైతన్యము నీలో మూర్తిమంతము కాగా ఈ చేతనా సముద్రం మీద పయనించుటకై నీవు సన్నాహమగుట.

అంకెలు, తేదీలు, జ్యోతిషము

రాబోవు ముఖ్య దినములు
9-9-99, 1-1-2000

అఖిల

అఖిల భారత పత్రిక

ఆగస్టు, సెప్టెంబరు 1999

ఉపోద్ఘాతము

"అంకెలు కేవలం అంకెలేనా లేక అంతకు మించిన మహత్తు ఏమైనా వాటిలో నిక్షిప్తమైవున్నదా?" అనే ప్రశ్నకు శ్రీమాత "అది నీ భావనను బట్టి ఉంటుంది. నీవు వాటిని గురించి పట్టించుకోకపోతే అవి నీకు సూచనలనిచ్చే ప్రసక్తే లేదు. కాదు, అవి చాలా ముఖ్యమను కుంటే అదే నిజమవుతుంది."

అనాదిగా మానవుడు అంకెలలో ఏదో ఒక మర్మం నిక్షిప్తమై వున్నదని నమ్మినాడు. తత్కారణంగా వాటికి ఒక శక్తి అబ్బినది. అంకెలు ఒక విధమైన మర్మశక్తిని పుంజుకున్నాయి. అంకెలను, తేదీలను గురించి శ్రీమాతారవిందుల ప్రవచనములను ఈ సంకలనములో మీ ముందు వుంచుతున్నాము.

మీలో కొంతమందికి బహుశా 9.9.99 నాడు ఏమౌతుందో అనే కుతూహలం వుండవచ్చు. 1.1.2000 నాడు ఒక నూతన శతాబ్దమే కాకుండా ఒక నూతన యుగారంభముకూడా కానున్నది. ఈ రెండు తేదీలు చాలా అపురూపమైనవనుటలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

మానవ జాతి భవిష్యత్తు దృష్ట్యా ఈ తేదీలు ఏమైనా సూచనలను అందించగలవా? ఈ సంచికలోని విషయముల దృష్ట్యా ఈ బంగారు భవిష్యత్తుకై మనందరము సమిష్టిగా ఆకాంక్షించినచో అది తప్పక నెరవేరగలదు.

శ్రీమాతరవిందులు నిస్సంశయంగా ఇటువంటి బంగారు భవిష్యత్తును మనముందర వుంచారు. మానవాళికి వారు ప్రతిపాదించిన దివ్యజీవనముపై మన దృష్టిని కేంద్రీకరించుటకు ఈ విలక్షణమైన తేదీలు మనకు చాలా అపురూప అవకాశములు.

అంకెలు, తేదీలు, జ్యోతిషము

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందుల ప్రవచనములు

అనుబంధం

తేదీల ప్రాముఖ్యం

శ్రీమాత ప్రవచనములు

మధుమయీ! మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని ఉంది. కాని ఇది నా ప్రశ్న కాదు. వేరొకరు అడగాలనుకున్న ప్రశ్న.

అలాగా! చూద్దాం.
ఎందుకని? ఆ ప్రశ్న అడగాలనుకొన్న వ్యక్తి ఇక్కడ లేడా? అడగడానికి భయపడుతున్నాడా? సరేలే. ఏమిటది?

23-4-56 తేదికి విశేష ప్రాముఖ్యం ఉన్నదంటున్నారు. 2,3,4,5,6 అంకెలు వరుసగా రావటం వలన ఆశ్రమానికి చాలా ముఖ్యమటగదా!

నేను ఒక తమాషా చెబుతా వినండి. ఇప్పుడున్న క్యాలండరును మార్చాలని ఒక వాదం ప్రారంభమైంది. క్యాలండరును మారుస్తే అంకెలన్నీ తారుమారవుతాయి. కేవలం మన లెక్కల మార్పిడి వలన చరిత్ర అంతా తలక్రిందులవుతుందంటావా?

ఇది ఒక సాంప్రదాయం మాత్రమే.

క్యాలండరు సంగతే తీసుకుందాం. నలుగురు ఒప్పుకొని దానిని అవలంబించినట్లయితే అది రూఢి అవుతుంది. దానినే సాంప్రదాయ రూఢి అంటారు. దాని వలన ఒక ప్రతిష్టాత్మకమైన రూపము (powerful formation) ఏర్పడుతుంది. అటుల జరుగుటకు విశేష జనాదరణ కావాలి. కొన్ని శక్తుల ద్వారా ఏర్పడిన ఈ రూపములను నేను "formations" అంటాను. అట్టి రూపములు ప్రతీకలుగా గుర్తింపబడతాయి. ఉదా: కొంతమంది మనుమలు కొన్ని భావ చిత్రాలను ఏర్పరచుకొని వాటికి "ప్రాణం" పోసుకొంటారు. అవి వాటికి ప్రతీకలుగా తయారవుతాయి. వారికి మాత్రమే వర్తిస్తాయి. వారి స్వప్నములలో అవి తారసిల్లవచ్చును. అయితే అవి వారికొక్కరికే చెందుతాయి. వారి అంతఃకరణానికి సంబంధించినవి. మానవజాతి అంతా ఉపయోగించే క్యాలండరు విషయంలో ఇటువంటి ప్రతీకల ప్రభావము ఇంకా

విస్తృతంగా ఉంటుంది. దీనికి మూలం ఆచారమే. బాల్యంనుండీ మనకి వన్నీ అలవాటైపోయినాయి. మనం జన్మించిన దేశాన్ని సమాజాన్ని ఆశ్రయించి ఈ ఆచారం ఏర్పడుతుంది. తేదీలను వేరే విధంగా గణించే సమాజాలు ఉన్నాయి. ఆ సమాజంలో జన్మించినవారికి ఆ సంఖ్యలు వేరే విధంగా ప్రతీకలౌతాయి. నీవు జన్మించిన సమాజానికి చెందిన సంఖ్యలు ప్రతీకలుగా విస్తృతంగా అంగీకరింపబడితే, ఇలా రూపిత మైన ఆచారం నీ సమాజంపై ప్రభావం చూపవచ్చు. ఎంత విస్తృతంగా అంగీకరింపబడితే అంత శక్తిమంతంగా ఇది ఉంటుంది. ఇది కేవలం సంప్రదాయం మాత్రమే. మనం ఒక తేదీనుంచి గణించినందున ఒక వరుసలో తేదీలు ఉన్నాయి.

అలా గణించడం యాదృచ్ఛికమే. ముస్లిం సంప్రదాయంవారు మరొక విధంగా గణిస్తారు. వారి ప్రవక్త జన్మించిన తేదీననుసరించి అనుకుంటాను. ఆయన జీవిత సంఘటనల ఆధారంగా కావచ్చు. అందువలన వారి వరుస భిన్నంగా ఉంటుంది. మీరు వారి వద్దకు వెళ్ళి 2,3,4,5,6 అని సంఖ్యలను వల్లిస్తే ఇదేమిటి అని విస్తుపోతారు. వారికి వాటి ప్రాముఖ్యతే లేదు.

వీటిని (సంఖ్యలను) ప్రతీకలుగానే గ్రహించాలి. సూక్ష్మ ప్రపం చాన్ని స్థూలమైన భౌతిక ప్రపంచంతో అనుసంధానించడానికి ఒక సాధనంగా వాడుకోవాలి. అంతవరకే వాటి ప్రయోజనం.

కొన్ని వేలమంది ప్రస్తుత కేలండరును ఉపయోగిస్తున్నారు. ఒకవేళ ఈ కేలండరును ముగ్గురు నలుగురే ఉపయోగించారనుకుందాం. అప్పుడు ఈ తేదీలు ప్రతీకలుగా ఉన్నాయనడంలో అర్థం లేదు. తేదీలు వస్తుతః ప్రధానం కాదు. అవి ఎంత విస్తృతంగా ఉపయోగింప బడుతున్నాయి అనే విషయం ప్రధానం. నక్షత్రాల విషయంలో, జాతక చక్రాల విషయంలోనూ ఇదే పొరపాటు చేస్తారు. అదొక పరిభాష, ఒక ఆచారం. ఈ ఆచారాన్ని ఒక ప్రత్యేక ప్రయోజనానికి వాడుకోవచ్చు. ఎంతమంది ఈ ఆచారాన్ని పాటిస్తున్నారన్న విషయంపై ఆధారపడి నందున ఇది సాపేక్షికమైందే. ఈ సాపేక్ష ప్రపంచంలో ప్రతి విషయం సాపేక్షికమే. అందుకే దీన్ని అక్షర సత్యంగా గ్రహింపరాదు. అలా గ్రహిస్తే మీ మనస్సు సంకుచితమై పోతుంది. ఆదిమజాతులవారు

అంధవిశ్వాసంతో జీవిస్తారు. ఒక వాస్తవాన్ని తప్పుడుగా సాధారణీ కరిస్తే అది అంధవిశ్వాసమౌతుంది.

ఉదాహరణకి నిచ్చెన క్రిందినుంచి దూరివెళ్ళడం — దీన్ని అపశకునంగా భావిస్తారు. నిచ్చెనపైన చివరి మెట్టుమీద నిలిచి పని చేసేవాడు దురదృష్టవశాత్తు తన చేతిలోనున్న పనిముట్టును జారవిడిచి నాడనుకోండి. అది క్రిందినుంచి దూరిపోతున్న వాడి నెత్తిమీద పడితే తలబ్రద్దలౌతుంది. ఇది సాధారణంగా సంభవించే విషయం. ఎప్పుడో అలా జరిగితే, ఆ చూచిన వ్యక్తి ఈ విషయాన్ని సాధారణీకరించి ఒక సూత్రం చెబుతాడు. "నిచ్చెన క్రిందినుంచి నడవడం అపశకునం" అని. అది అంధవిశ్వాసం. ఇలాగే ప్రతి విషయంలోను జరుగుతుంది.

ఎన్నో వాస్తవాలు ఇట్లాగే ఉంటాయి. ఒక ఔషధాన్ని వాడి నందున, పరిస్థితులు అనుకూలించి, చాలమందికి జబ్బు తగ్గితే ఆ ఔషధం ఆ రోగనివారణకు వజ్రాయుధం వంటిదని ప్రచారం కలుగు తుంది. ఒక వందమందికి ఒక మందును వాడితే దాని ప్రభావం ఏ ఇద్దరిలోనూ ఒక్కరీతిగా ఉండదు. ఒక్కోసారి మరీ పరస్పర విరుద్ధంగా ఉంటుంది. రోగం కుదరడం మందుగుణాన్నిబట్టి కాదు. అటువం టప్పుడు ఆ మందుని నమ్మటం అంధవిశ్వాసమే అవుతుంది.

నిజానికి విజ్ఞానశాస్త్రానికి అంధవిశ్వాసానికి మధ్య భేదం అతి స్వల్పమైందే. అది వ్యక్తీకరణలో తీసుకునే జాగ్రత్తనుబట్టి ఉంటుంది. విజ్ఞాన శాస్త్రవేత్తల మాదిరిగా జాగ్రత్తగా "ఇది ఇలా ఉండ వచ్చుననిపిస్తుంది... ఇలా అనుకోవచ్చు... విషయాలన్నింటినీ సమీక రించి చూస్తే మనకిలా అనిపిస్తుంది...." అంటే అంధవిశ్వాసం కాదు. కాని "ఇది అలా ఉన్నది" అన్నారనుకోండి, అంధవిశ్వాసం! అదీ తమాషా.

ఈ సంఖ్యల విషయంలో మిమ్మల్ని అడిగిన వ్యక్తికి ఇలా చెప్పండి. "3,4,5,6 లేదా 2,3,4,5,6 — వీటితో నీకు ఏదైనా ఆంతరమైన లేదా బాహిరమైన అనుభూతి ప్రత్యేకంగా కలిగితే, ఈ సంఖ్యలు ప్రత్యే కమైనవని చెప్పవచ్చు. అలా ఏమీ కలుగలేదంటే వీటిలో ప్రత్యేకత ఏమీ లేదని, అన్ని తేదీలలాగ ఇదికూడా అని తెలుసుకోవాలి".

(నిశ్శబ్దం)

పన్నెండుమంది సజ్జనులు కలిసి ప్రార్థిస్తే భగవంతుడు అనుగ్రహిస్తాడని, వేదకాలంకంటే పురాతనమైన సంప్రదాయం ఉన్నది. ఇది నిజం కావచ్చు, అంధవిశ్వాసం కావచ్చు. ఆ పన్నెండుమంది గుణగణాలను బట్టి కావచ్చు. ఇతర విషయాల మీద ఆధారపడి ఉండవచ్చు. పన్నెండుమంది ఒకసారి కలిసికొని ఉంటారు. 'పన్నెండు' సంఖ్య యాదృచ్ఛికమై ఉండవచ్చు. ఆ పన్నెండుమంది తీవ్రమైన తపనతో ప్రార్థించి ఉంటారు. భగవదావేశంపొంది ఉంటారు. ఆ కారణంగా పన్నెండుమంది ప్రార్థిస్తే భగవంతుడు దిగి వస్తాడనడం అంధవిశ్వాసమని నేననుకుంటాను. పన్నెండుమంది కలిసి ప్రార్థించాలని సూత్రీకరించిన వ్యక్తి అలా అనుకొని ఉంటాడు. అప్పటినుండి పన్నెండుగురు కలిసి ప్రార్థించడం ఆనవాయితి అయింది. కాని చాలాసార్లు పన్నెండుగురు కలిసి ప్రార్థించి భగవంతుణ్ణి పట్టుకురాలేదు మరి! ఐనా సంప్రదాయం అలా పాతుకుపోయింది. అదీ సంగతి.

ఈ సాయంత్రం మనం పన్నెండుమందికంటే ఎక్కువే ఉన్నాము. (నవ్వు) మనం కూడా ఒకసారి ప్రయత్నించి చూద్దామా!

(ధ్యానం)

అనువాదం: ఆచార్య యస్. లక్ష్మణమూర్తి

వీటిని (సంఖ్యలను) ప్రతీకలుగా గ్రహించాలి. సూక్ష్మ ప్రపంచాన్ని స్థూలమైన భౌతిక ప్రపంచంతో అనుసంధానించడానికి ఒక సాధనంగా వాడుకోవాలి. అంతవరకే వాటి ప్రయోజనం.

శ్రీమాత

అంకెల సంకేతార్థాలు

శ్రీమాత వివరణ

1. ఏకత్వము
2. సృష్టి సంకల్పము
3. సృష్ట్యారంభము
4. అభివ్యక్తి
5. శక్తి
6. సృష్టి
7. సిద్ధి
8. గుహ్య ప్రతిరూపము
9. నిశ్చలమైన సిద్ధినివ్వగల శక్తి
10. వాక్చాతుర్యము
11. పురోగమనము
12. పరిపూర్ణ సుస్థిర అభివ్యక్తి

*

1. మూలము
2. సృజన చైతన్యము గోచరమగుట
3. సచ్చిదానందము
4. ఆవిర్భావము
5. శక్తి
6. నూతన సృష్టి
7. ఉపలబ్ధి
8. ద్వివిధ రక్షణ కవచము (బహిరాంతర శత్రువులనుండి రక్షణ)
9. నూతన జన్మ
10. పరిపూర్ణత
11. పురోగమనము
12. ద్వంద్వ పరిపూర్ణత (ఆధ్యాత్మికము, భౌతికము)

14. రూపాంతరీకరణము

అనువాదం: డా॥ డి. వెంకటేశ్వరరావు

శ్రీమాత ప్రవచనములు

(ఒక పిల్లవానితో) శ్రీమాత: నీ జన్మదినమునకు ఒక మంచి ప్రశ్న తయారు చేసావా?

18 యొక్క సంకేతమేమి?

18 వ సంఖ్యా!

అది, మనము ఆ సంఖ్యను చదివే తీరునుబట్టి ఉంటుంది.

10+8 అని చదువవచ్చును; 9+9 అని చదువవచ్చు; 12+6 అని చదువవచ్చును. చదివిన ప్రతి పద్ధతికి ప్రత్యేకమైన అర్థమున్నది.

10+8 ని చూస్తే, అది ఒక చలనరహిత స్థితిని సూచిస్తుంది. ఎందుకనగా 10 నిశ్చల పూర్ణస్థితిని సూచించును. తనకు పూర్ణత్వము సిద్ధించగా అచట నిలిచిపోయిందని అర్థము. మరి 8 ద్వివిధ రక్షక కవచమువలే, ఉభయ తారకముగా అమర్చబడి యున్నందున తన పరిధి పరిమితము కాబడెను. అందుచే, 10 మరియు 8 లను జోడించి చదివినచో, ఒక తీరున పూర్ణత్వమే అయినను, కొంత ఆవరణకే సీమితము కాబడినది.

అలాగే, 9+9 గా చదివినచో, 9 సృష్టి విధానమునకు సంకేతము, సృష్టికిగాక, సృష్టి కొనసాగే పద్ధతికి సంకేతము. మరి 9+9 ఒక పద్ధతి తరువాత మరో పద్ధతి అనెడి ధోరణిలో, సృష్టి రచనా విధానము, అనంతముగా సాగుననే భావమును కలుగ జేయును. ఈ జోడింపు, దరిదాపు రెండు విరుద్ధ భావములను గోచరింప జేయును.

కాగా, 12 మరియు 6 లను ఒక జతగా చదివితే, అది ఒక గొప్ప శుభసూచక సంఖ్యా సంకేతమవుతుంది. 12 అంటే ఏమిటో నీకు తెలుసునా? భావనలోను, సృష్టిలోనూ కూడా పూర్ణత్వమును సూచించే సంఖ్య. మరి 6 నూతనసృష్టికి సంకేతము. అందుచేత దీనిని 12 మరియు 6 గా చదివితే నీకొక అద్భుతమైన సృష్టి చిత్రము గోచరిస్తుంది.

ఇంకనూ పలువిధములుగా దీనిని పరిశీలించవచ్చునుగాని అవి ఇంకా కొంచెం కష్టం. ఈ 18 వ సంఖ్యను, విడదీయక చదివితే, అది ప్రాపంచిక ఉపలబ్ధికై చేతన సాగించే అనేకపద్ధతులన్ను తెలియ జేయు సంకేతముగా నిలుస్తుంది. అనగా భౌతికతలమున, చేతన తన్ను తాను వ్యక్తపరచుకొనుటకై చేయు యత్నమునకు సంకేతము.

నీకు కొంత విషయావగాహన జరిగింది కదా.

లౌకిక పరంగా, ఇది మెజారిటీ వచ్చే వయస్సు. పద్ధెనిమిది ఏళ్ల తర్వాత పిల్లలు స్వతంత్రంగా ప్రవర్తించటం మొదలుపెడతారు. జీవితంలో మరొక స్థాయికి నాంది!

అంకెల విలువ ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా ఉంటుందా?

మనమిచ్చే విలువని బట్టి వుంటుంది.

దాన్ని గురించి పట్టించుకొనకపోతే ఏమీ లేదు. మనము ఆ సంఖ్యకిచ్చే ప్రాధాన్యతపై అంతా ఆధారపడి యుండును. సంఖ్యలు ఒక రకమైన సంభాషణా విధానము. అది మానవుడు కనుగొనిన శాస్త్ర విజ్ఞానము, కళలు మొదలైనవాని వలె ఒక భాష. ఎల్లప్పుడూ కూడ అది ఒక సాంకేతిక భాష. దీన్ని గనుక అనుసరిస్తే, భావ ప్రకటనకై ఒక సజీవ ఉపకరణం కాగలదు. ఒకరి నొకరు అర్థము చేసుకొనుటకు మాటలు కావాలి — కాని ఆ మాటలు అనేక అపార్థాలకు కూడా దారితీస్తాయి. కాగా, మౌనంగా భావవ్యక్తీకరణ చేసుకొనగలిగే స్థితికి మానవుడు చేరలేదు. ఆ స్థితి గొప్ప ఉన్నతమైన స్థితి. అంకెలకు, నీ జీవితములో సమున్నత స్థానాన్ని కల్పిస్తే, నీకు అనేక క్రొంగ్రొత్త విషయములు తెలియగలవు.

అది అంతే

అది కూడా జ్యోతిర్విద్య వంటిదే.

తన జీవితమునకు, నక్షత్రగమనమునకు గల సంబంధమును అధ్యయనము చేస్తే అనేక ఆసక్తిదాయక విషయములు తెలియగలవు కదా!

మౌలికముగా, అది ఒక జ్ఞాన సముపార్జనా విధానము —

మరేమీ కాదు! మాటలను, పద్ధతులను, భాషలను గురించిన వాస్తవ జ్ఞానము మాటలకు అతీతంగా వుంటుంది. నిశ్శబ్ద తాదాత్మ్యమునందే వాస్తవ విజ్ఞాన సముపార్జన జరుగును — అప్పుడిక పొరపాటుకు తావు లేదు.

*

(ఒక బంగరువన్నె సంపెంగ పుష్పాన్ని పట్టుకొని దీక్షగా దానిని పరికిస్తూ శ్రీమాత అన్న మాటలివి —)

ఈ పుష్పాన్ని చూచావా?
దానికి 12 దళములు గలవు. నాలుగు చొ॥ మూడు వరుసలలో అవి అమరియున్నవి.
"పరిపూర్ణ అతిమానస చేతనా సిద్ధి" అని మనం దీన్ని పిలుస్తాము.
ఈ పుష్పానికి మూడు శ్రేణులున్నట్లు నేనెన్నడూ గమనించలేదు సుమా! ప్రథమ శ్రేణి ఒకింత చిన్నది, రెండవది కొంత పెద్దది, మూడవది అంతకన్నా పెద్దది. నాలుగు చొ॥ క్రమరీతిలోనున్నవి. ఈ నాలుగు, ఈ నాలుగు, మరో నాలుగు దళములు వరుసగా నున్నవి.

ఇవన్నీ ప్రకృతిలోని సంకేతములు. తద్వారా అభివ్యక్తమయ్యే సత్యములు ఈ విధంగా వుంటయి. మొదట పరమ సత్యాన్ని సూచించే కేంద్రమొకటి, తర్వాత మూడు శ్రేణులు కలిసి మొత్తం నాలుగు. నాలుగు సృష్టికి సంకేతము. ఒకదాని మీద ఒకటిగా మూడు లోకాలు. బైట వరసలోని లేతరంగురేకలు భౌతికస్తరము లేక లోకము. తరువాత ప్రాణికస్తరము. చివరగా మానసికస్తరము. వీటన్నిటికి కేంద్రము అతిమానసస్తరము.

నువ్వు కళ్ళు తెరిస్తే ఈవిధమైన అనురూపములను ఎన్నియో గుర్తించగలవు.

అనువాదం: డా॥ డి. వెంకటేశ్వరరావు

శ్రీమాత ప్రవచనములు

శ్రీమాత: సుప్రభాతం
సాధకుడు: సుప్రభాతం మధుమయీ
శ్రీమాత: ఏమైనా చెప్పదలచావా?

(నేనొక కాగితమును శ్రీమాతకు అందించాను. దానిపై "4-5-67 గురువారము" అని వ్రాయబడి వున్నది)

ఓహో అది గురువారము. 4-5-67 తేది గురువారం.
సాధకుడు: ఔను, మాతా
శ్రీమాత: మంచిది. ఆ రోజు ఒక మంచి దినము. మంచియే జరుగును. అలాగే, ఆ రోజే కలుస్తాను. మధ్యాహ్నం 3 గంటలకు రా, అర్థమయింది కదా?
(శ్రీమాత ఒక కాగితముపైన ఇలా రాసారు: "మోనాతో 3 గంటలకు")

సమావేశాల సమచారమంతా ఈ నోటు పుస్తకంలో ఉంచుతాను.

ఇకపోతే నీవు కుశలమే కదా? ...అంటే ఏమిటో నా భావం నీకు తెలుసును. నీవు సంతోషంగా ఉన్నావా అనిగానీ, భౌతికంగా అంతా నీకు సుముఖంగావుందా అనిగానీ, అంతా నీకు సవ్యంగా జరుగుతున్నదా అనిగానీ కాదు. అదంతా నాకు విదితమే. ఆ విషయాలన్నీ నీకంటే నాకే బాగా తెలియును! ఎందుకంటే నీకు కనబడనివి నాకు కనబడతయి. నీవు ఎరుగవు. ఇవన్నీ నాకు బాగా తెలియును. అందుకే వీటిపై నాకు ఆసక్తి వుండదు. నీ బహిరాంతరంగాలలో ఏమి జరుగుతున్నదో నాకు చక్కగా తెలియును. కానీ నేను నీనుండి తెలుసుకోగోరేదేమంటే చైతన్యంలో నీవు ఏ స్థాయికి ఎదిగినావన్నది మాత్రమే. అంటే ఏ చైతన్య స్తరములోనికి ప్రవేశార్హత సంపాదించినావు అనే విషయం. ప్రస్తుతం నీ అంతరంగంలో సాధన ఏ మేరకు వచ్చింది, ఏ చైతన్యస్తరము వరకు పరిణతి చెందినావు అనే ముఖ్యమైన విషయాలు.

---

[1] 12-6-1966 నాడు జరిగిన సంభాషణ ఆధారంగా ఒక సాధకుని కథనం.

అసలు ప్రశ్న అదే! నీ యోగక్షేమాలను గురించి నేనడగటంలో ఉద్దేశం ఈ నాప్రశ్నకు నిజవాబు తెలుసుకోవడమే. నీలో నేను సదా చొప్పిస్తున్న చిచ్ఛక్తిని ఎంతవరకూ ఇముడ్చుకోగలిగావు అనేదే నాకు కావాల్సింది. అదే నాకు ముఖ్యమైన సంగతి. అంతే కాని నీవెలాగు న్నావు, నీకు ఏమైనా సౌకర్యంగావుందా — ఇలాంటివి కావు. నేనడిగేది ఇవేమీ కావు.

నీలో జరుగుతున్న చైతన్య అభ్యున్నతి ఏ స్తరమువరకూ చేరింది, సాధన నీలో ఎలా నడుస్తున్నది — ఈ సమాచారమంతా నాకు కావాలి.

నేను నీ నోట వినదలచుకొన్న ప్రధానాంశమేమిటంటే ప్రస్తుతం నీవు ఏ చైతన్యస్థాయికి చేరుకున్నావో నీకు తెలుసునా అనేది. నేను పదే పదే ఇలా ఎందుకు ప్రశ్నిస్తుంటానో నీకు ఇప్పుడు బాగా అర్థమయిందనుకుంటా — నీవేచైతన్యస్థాయిని చేరుకున్నావు, దాన్ని గురించి నీవెంతవరకు గ్రహించినావు (ఎరుక కలిగి వున్నావు) అనే విషయాలను తెలుసుకోవాలనేదే నా ప్రయత్నమంతా.

(నిశ్శబ్దం)

సాధకుడు: 4-5-67 లోని సంఖ్యలందు ఏమైనా మార్మిక రహస్యం దాగివుందా శ్రీమాతా?

శ్రీమాత: మార్మికమా, ఔను, కానీ అది సర్వసామాన్యమైన విషయమే. (కొంత వ్యంగ్యంగా) నాలుగు, ఐదు, ఆరు, ఏడు — వాటిలో అంత చెప్పుకోదగ్గ ప్రత్యేకత ఏముంది?

(నిశ్శబ్దం)

నాలుగు, ఐదు, ఆరు, ఏడు (4-5-67) — ఇది ఒక అపురూప మైన సంఖ్యల కూటమి, ఇట్లాంటిది సాధారణంగా మనకు తారస పడదు. ఇట్టి సంఖ్యల మేళవింపు భూవాతావరణంపై అసాధారణమైన శక్తిని, ఒత్తిడిని తేగలదు. ఉదాహరణకు పైలోకాలనుండి భూతలానికి ఏదో ఒక శక్తిని తీసుకురాగలదు. ఇటీవలే ఒక అపురూపమైన, చాలా విలక్షణమైన తేదీ వచ్చింది. 6-6-66 నాలుగు ఆర్లు — ఇది చాలా

అరుదుగా — వంద సంవత్సరాలలో ఒకేసారి వచ్చే తేది. ఇది సృష్టి యొక్క ఒక చతుర్భుజం — ఎందుకంటే 6 సృష్టికి సంకేతం. కొన్నేళ్ళ క్రితం 5-5-55 వచ్చింది. ఇకపోతే 7-7-77 ఎప్పుడు వస్తుందో మనకు తెలీదు — కనీసం చాలా ఏళ్ళ తరువాత వచ్చే తేదీ అది.

కానీ 6-6-66 చాలా ముఖ్యమైనది. నీకు తెలుసా. ప్రాచీన యూదుల గూఢ సంప్రదాయం ప్రకారం భగవంతుడు ఈ ప్రపంచాన్ని ఆరురోజులలో సృష్టించాడు (ఆరవరోజు సృష్టికి సంకేతం) అనీ ఏడో రోజు విశ్రాంతి చెందాడనీ — కానీ ఇది సరి కాదు — ఎందుకంటే ఏడోరోజు భగవంతుడు సృష్టి సమాప్తి తరువాత కాస్తసాగిలి ప్రశాంతంగా తన సృష్టిని ఇంకా అందంగా తీర్చిదిద్దే పద్ధతిని యోచిస్తున్నాడంతే. దీన్ని భగవంతుడు విశ్రాంతి తీసుకున్నాడని తప్పుగా అర్థం చేసుకున్నారు. కానీ అది ఆయన స్వాయంప్రకాశము. సృష్టికర్త ఎన్నడూ విశ్రమించడు. అది తప్పు. నిజానికి ఆయన తనను తనలోకి ఉపసంహరించుకొని తన అనంత ఐశ్వర్య అభివ్యక్తికై ఆయన ఎప్పుడూ ముందుకు సాగుతూనే ఉంటాడు. ఇది ఎన్నడు ముగియనిది. నిత్య నూతన అభివ్యక్తికై ఆయన ఎప్పుడూ ముందుకు సాగుతూనే ఉంటాడు. ఆయన కెప్పుడూ ఇంకా ఏదో కొంగ్రొత్తది సృష్టించాలనే తపన. అది అంతే — అలా కొనసాగుతూనే ఉంటుంది.

అంచేత నాలుగు ఆర్లు చాలా ప్రాధాన్యత సంతరించుకొన్న విశేషము. ఎందుకంటే ఆ సంఖ్య "సృష్టి చతురస్రాన్ని" సూచిస్తోంది. (శ్రీమాత బల్లపై తన వ్రేలితో చతుర్భుజాన్ని గీసింది). ఆ రోజున ఇక్కడ, అంటే, ఆశ్రమంలోనే ఒక బాలుడు జన్మించాడు. మిగతా ప్రదేశాలను గురించి నేను మాట్లాడటం లేదు, ఆరోజు ప్రపంచంలో ఎంతో మంది జన్మించి వుంటారు. కానీ ఇక్కడ, ఈ ఆశ్రమ వాతావరణంలో, అంతటి ప్రాధాన్యతగల తేదీనాడు జన్మించటం విశేషం. తన అంతరాత్మ చైతన్యంలో ఎంతో అభివృద్ధి సాధించటం వల్లనే ఇది సాధ్యమయింది. కొత్తజన్మ తీసుకోవడానికి ఈతేదీని ఆజీవియే ఎంచుకున్నాడు. అవును *ఆయనే* ఎంచుకున్నాడు. తరువాత రాబోయే రోజుల్లో తనజీవితంలో ఎట్టిసాధన చేస్తాడో, ఏమి సాధిస్తాడో, వేచి చూడాల్సిందే. ఆయనయొక్క పరిణామక్రమాన్ని ఒక కంట కనిపెట్టి

వుండి జాగ్రత్తగా పరికించాలి. అంతటి విశిష్టమైన తేదీన జన్మించిన ఆ బాలునికి ఎన్నో అవకాశాలు కలవు. భౌతికంగా కూడా చాలా సాధించగలడు. వేచిచూద్దాం.

అదే రోజున ఇంకొక ఆశ్రమవాసికి ఒక అద్భుత అనుభవం కలిగింది. సరిగ్గా సాయంకాలం *ఆరు* గంటలకి అంటే ఆ తేదీలోగల నాలుగు ఆర్లు కాక మరో (ఐదవ) ఆరుకూడా చేరింది. కాబట్టి ఈ సమయంలో జరిగిన అనుభవానికి చాలా లోతైన నిగూఢ అర్థం వుందన్న మాట. ఆయన తన అనుభవం గురించి వ్రాసిన ఉత్తరం ఎక్కడుంచానో (శ్రీమాత ఆ ఉత్తరానికై వెదుకుతుంది) తెలీదు. అందులో ఆయన ఏమి వ్రాశాడో నాకిప్పుడు జ్ఞాపకం లేదు. అయినప్పటికీ....

4-5-67 — దీని గూఢార్థం ఏమిటి? ఎరుగుదువా? అభివ్యక్తి, శక్తి, సృష్టి, సిద్ధి. నాలుగు సంఖ్య అభివ్యక్తికి, ఐదు శక్తికి, ఆరు సృష్టికి, ఏడు సిద్ధికి సంకేతాలు — అద్భుతమైన సంఖ్యా సమ్మేళనం! దీనికే నీవు ఆకాంక్షించాలి, ఆ అనుభూతినే నీవు పొందగలగాలి. నీవే చూస్తావుగా ఆ రోజెటువంటిదో. అది చాలా గొప్ప దినం — ఏదో (శక్తి) పైనుండి దిగి వస్తుంది. ఏదో.... భగవంతుని అభివ్యక్తికి సంబంధించిన ఒక నూతన శకారంభం.

ఇంకా 5-6-78 వున్నది — కాదు, అంతకంటే ముందు 7-7-77 తేదీ వున్నది. అదింకా దూరము.

సాధకుడు: లేదు శ్రీమాతా, ఇప్పట్నుంచి పదకొండు సంవత్సరాలు మాత్రమే.

శ్రీమాత: 4-5-67 తేదీకై ఇంకా వేచి వుండాలి.... ఇక 5-6-78 అంటావా.... అదికూడా చాలా ముఖ్యమైనదే.

సాధకుడు: కానీ శ్రీమాతా, చాలా ముఖ్యమైన తేదీ మరొకటున్నది — 21-2-78. దీన్ని మీరు వదిలేశారు.

శ్రీమాత: ఔను. అది నా శత జన్మదినోత్సవం... మరి 5-6-78 కూడా ఒక విశేషమే. వీటన్నిటికంటే ముఖ్యమైన దింకొకటున్నది — '8'. ఇది అభివ్యక్తి ద్వయమునకు, రక్షణద్వయమునకు సంకేతం. సరే చూద్దాం ఆ రోజు ఏమవుతుందో.

(నేను ఒక కవరులో నా సమర్పణను ఇచ్చాను. శ్రీమాత ఖాళీ కవరును తిరిగి ఇచ్చింది)

శ్రీమాత: నీ దగ్గరే వుంచుకో నాకు అక్కర్లేదు. ఏదైనా ఉత్తరం పంపడానికి వాడుకోవచ్చు. లేదా ఇంక దేనికైనా ఉపయోగించుకోవచ్చు.

సాధకుడు: కాని ఏమీ లేకుండా తీసుకోమంటారా మాతా?

శ్రీమాత: దానిలో ఏదైనా నింపాలంటావా! ఏమి కావాలి బిడ్డా? నేనేమివ్వాలి? ఆశీస్సులా?

సాధకుడు: ఏదైనా మీ చేవ్రాలు.

(ఒక కార్డును ఏరుకుంది)

శ్రీమాత: ఆ సరే, ఇది చాలా బాగుంది. ఒక ఆకు రూపంలో కత్తిరించిన కాగితమది. ఎంతో బావుంది కదా. **6-6-66** అనే తేదీని వ్రాస్తాను. అవే నా ఆశీస్సులు. ఈ తారీఖు గడచి పోయినది. అయినా పరావా లేదు. దాని భావార్థం గ్రహించి తదనుగుణంగా నడుచు కొందువు గాక. అది నీ కర్తవ్యం. ఆ అనుభూతి, అనుభవాలవల్ల సృష్టి చతురస్రాన్ని సాధించెదవు గాక. సరే — ఆదివారం రోజున నిన్ను కలుసుకొంటాను.

శుభాశీస్సులు.

*

ప్రశ్న: ఈ ఉదయం ప్రణామం తరువాత నాకు మీరు 'నిష్కపటం' **(Sincerity)** *అనబడే పుష్పాలను నాలుగింటిని ఇచ్చి దీవించారు. ఇందులో ఏదో ప్రత్యేకత ఉందనుకొంటాను. అదేమిటో తెలుసు కోవచ్చా?*

శ్రీమాత: నేను పూలను తీసుకొన్నప్పుడు చేతికి చాలా అందినై గాని నేను ప్రత్యేకంగా సంకల్పించాను. ఎందుకంటే 'నిష్కపటం' (భగవంతునికి నీ సమర్పణలో) ఎన్ని దశలను కచ్చితంగా స్థాపించ గలుగుతావో అన్ని పుష్పాలు రావాలని సంకల్పించాను. నాలుగు సంఖ్య పరిపూర్ణత్వానికి సంకేతం. అవే నాలుగు స్థితులు — మానసిక, చైత్య, ప్రాణిక, భౌతికములు.

అనువాదం: సి. కె. రామనాథచెట్టి

4-5-67 — ఒక ప్రత్యేక దినం

శ్రీమాత ప్రవచనములు

(1967 మే 4 వ తేదిన, ఆశ్రమంలో శ్రీమాత ఒక ప్రత్యేక దర్శన మిచ్చారు. ఆ రోజున ఆమె ఎంపిక చేసిన ఈ క్రింది సందేశం అక్కడున్నవారందరికి పంచబడింది.)

> *భూలోక జీవితం సాక్షాద్భగవంతుడు తన కోసమే ఎంచుకొనిన నివాసభూమి. అంధకార బంధురమైన ఈ చెరసాలను తన అత్యద్భుతమైన దివ్య ధామముగాను, మిన్నుముట్టే దేవాలయంగాను పరివర్తింప జేయుటయే తన నిరంతర సంకల్పము.*
>
> *శ్రీఅరవిందులు*

(శ్రీమాత ఇచ్చిన వివరణ)

శ్రీఅరవిందులు భగవంతునిగా పేర్కొన్నది ఒక వ్యక్తి గాదు. దానిని స్వీకరించటానికి సన్నద్ధులైన మానవులందరూ పొందవలసిన మహోన్నతస్థాయి.

మే 1967

*

ప్రశ్న: మే నెల 4 వ తేదీ గురువారంనాడు రోమన్ కాథలిక్కులు జీసస్ క్రీస్తు అద్భుతమైన రీతిలో స్వర్గారోహణ చేసిన పర్వదినంగా పండుగ చేసుకుంటారు కదా! మనం గొప్పగా పరిగణించే 4-5-67కి దీనికి ఏదైనా సంబంధముందా, లేక అది కాకాతాళీయమేనా?

శ్రీమాత: శ్రీఅరవిందుల దృక్పథంలో కాకతాళీయ సంఘటనలనేవి లేవు. జరిగేదంతా దివ్య చైతన్యావిష్కారమే. ప్రస్తుతం పనిచేస్తున్న మహాశక్తి సమైక్యత వర్ధిల్లటానికి పనిచేసే మహాసామంజస్యశక్తి — దివ్యసత్యాన్ని ప్రకటించే ప్రతీకలన్నింటిని సమ్మేళనం చేస్తోంది ఆ మహాశక్తి.

1967 మే 5

ప్రశ్న: 1967 సంవత్సరంలో అతిమానసం "సంసిద్ధ శక్తి (realising power) దశలో ప్రవేశిస్తుంది" ఇందులో 'సంసిద్ధ శక్తి' అన్న పదాలకు అసలు అర్థం ఏమిటి?

శ్రీమాత: మానవుల మనస్సులలోను, ప్రపంచ నడవడిలోను నిశ్చయంగా పనిచేయటమన్న మాట.

*

ప్రశ్న: 4-5-67 తేదీ శ్రీఅరవిందులు పేర్కొన్న అతిమానస యుగారంభాన్ని సూచిస్తుందా?

శ్రీమాత: ఈ మధ్య కొన్ని నెలలనుండి ముఖ్యంగా మన వారిలో పుట్టిన పిల్లలు చాలా ప్రత్యేకమైన స్థాయికి చెందినవారు.

1967 మే 15

*

ప్రశ్న: మే నెల 4[1] వ తేదీ ప్రాముఖ్యంగురించి ప్రజలు ఎన్నో విషయాలు చెప్పుకుంటున్నారు. కొన్నిమార్లు మీ మాటలుగాకూడా చెపుతున్నారు. అదెట్లా ఉన్నా, దాని ప్రాముఖ్యం నాకేమీ అర్థం కావటం లేదు.

శ్రీమాత: దానికి ఒక ప్రాముఖ్యం అన్నది తప్పక ఆవశ్యకమా? ఆ రోజు మొదలుగా ఒకటేదో జరుగుతుందని శ్రీఅరవిందులు ప్రకటించారు[2]. అది జరిగింది. మనకు కావలసిందల్లా అంతే.

1967 జూన్ 21

స్వేచ్ఛానువాదం: వి. సుబ్బరామశర్మ

---

[1] ఆ తేదీ అంకెలు వరుసగా వున్నాయి. 4-5-67

[2] శ్రీఅరవిందులు ఇట్లా వ్రాసారు: "1-2-34 అభివ్యక్తిసంవత్సరంగా ఎప్పటికీ పరిగణించబడుతుంది. 2-3-45 శక్తిప్రధాన సంవత్సరం — ఆ ఆవిర్భావము చాలా గంభీరంగా వుంటుంది. 4-5-67 పరిపూర్ణ సంసిద్ధి జరిగే సంవత్సరం"

(1934 ఫిబ్రవరి 2 వ తేదిన వ్రాసిన ఉత్తరం)

నక్షత్రములు మన జీవితమును శాసించునా?

శ్రీమాత ప్రవచనములు

నక్షత్రములు మానవ జీవితంపై తమ ప్రభావమును చూపిస్తాయి అనే నమ్మకము మానవాళిలో విస్తృతంగా వ్యాపించి వున్నది. ఆ విధంగా ఒక శాస్త్రం కూడా తయారైనది. ఆకాశంలోని నక్షత్ర స్థానములను బట్టి మనిషి జీవితంలో జరుగబోయే విశేషాలను ముందరే కనిపెట్టవచ్చునట.

మానవుడు మొదట నక్షత్రములు తన జీవితమును ప్రభావితము చేయగలవు అని నమ్మాడు. కాని అది అంత సింపుల్ కాదు. కొంచెం నిదానంగా ఆలోచిస్తేగాని అసలు విషయం తెలియదు. ఈ సృష్టి సర్వస్వములోను ఒక విధమైన సమైక్యత భాసిస్తుంది. దాని వివిధ విభాగములు పరస్పర సంబంధితములు. విశ్వసత్యమునకు నక్షత్రములు సంజ్ఞలు మాత్రమే. వ్యక్తికి, విశ్వమునకుగల సంబంధమును నీవు తెలుసుకొనగలిగితే నక్షత్రపటములలో మానవ జీవితానికి సంబంధించిన సంకేతములు లభించును.

జాతక చక్రములిచ్చే సూచనలు నిశ్చయములుగాని, అనివార్యములుగాని కావని అనుభవరీత్యా మనకు విదితమౌతున్నది. ఉదా: యోగమువలన ఆత్మోన్నతిని పొందినపుడు ఈ జాతక చక్రములు ఎందుకూ పనికిరావు. దీనికి కొన్ని కారణములున్నాయి. జాతక చక్రములు విశ్వజీవితమునకు, వ్యక్తి జీవితమునకుగల సంబంధమును భౌతికస్తరములో అందినంతమేరకు మాత్రమే సూచిస్తాయి. కాని చైతన్యము కేవలం భౌతిక స్తరమునకే పరిమితము కాదు గదా. అది ఊర్ధ్వ స్తరములలో కూడా భాసిస్తుంది. ఈ జాతక చక్రము కేవలం భౌతిక స్తరమునకు మాత్రమే వర్తిస్తుంది. అంతకంటే పై స్తరమునుండి మరియొక నిర్దేశము వచ్చినచో ఈ జాతక సూచనలన్నీ తుడిచి పెట్టుకుపోతాయి.

మన జాతకాల విషయాన్ని మిడిమిడి జ్ఞానము అనవచ్చును. ఎందుకంటే వైశ్వాన్వయ, వైయక్తిక స్థాయిలు పరస్పరాధీనములు. ఈ సంబంధములను స్థూలముగా అవగాహన చేసికొను ప్రయత్నము

వలన పాక్షిక జ్ఞానమే కాని సంపూర్ణ జ్ఞానము లభించదు. మన జాతక చక్రములకు ఆధారము ఈ పాక్షిక జ్ఞానమే కదా! అది ప్రత్యక్ష జ్ఞానము గాని, యథార్థ జ్ఞానము కాని కాదు. అందుకని నక్షత్రముల గతులనను సరించి గుణించిన జాతకములు కూడ అసంపూర్ణములే. కొంతమందికి వాటి మీద మోజు వుండవచ్చును గాని అట్టి విషయములన్నియు యథార్థమునకు చాలా దూరములు.

మానవులకు తెలిసిందల్లా ఈ మనస్సు, దీని ద్వారా పొందిన జ్ఞానము. కొంచెం లోతుకు పోయి చూచిన యెడల దీని అసలు స్వరూపం మనకు తెలిసిపోతుంది. ఇది బాహ్యోపకరణముల ద్వారా పొందిన సమాచారం మాత్రమే. దీనిని జ్ఞానమనే దానికంటె ఒక పరిభాష, ఒక సంకేతము — అది కూడ చాలా చిక్కులతో కూడినది — అంటే బాగుంటుంది. ఇది కేవలం మానవుల మధ్య సంభాషణ కోసం ఉపయోగపడుతుంది అంతే. అసలైన సత్యమునకు దీనికి చాలా దూరం.

మరి యథార్థ జ్ఞానమంటే ఏమిటో? ఒక వస్తువు యొక్క జ్ఞానము దానితో నీవు తాదాత్మ్యము పొందినప్పుడే కలుగుతుంది. అది మానసిక జ్ఞానం కంటె చాలా సమర్థవంతమైనది, ప్రత్యక్షమైనది. ఈ జ్ఞానమును బహిర్గత పరచుటకు క్లిష్టమైన పరికరములుగాని వ్యూహములుగాని అవసరము లేదు. ఎందుకంటే అది చేతనా శక్తికి సంబంధించినది. ఆ చేతనా శక్తి ఏమి చేయవలెనని సంకల్పించిన యెడల, దానిని అవశ్యము సూటిగా చేయగలదు. అప్పుడు విశ్వసత్యము యావత్తూ ఒక సంకేత రూపములో నీకు పరోక్షముగా గాక ప్రత్యక్షముగా జ్ఞాతమగును.

*

మానవ జీవితముపై నక్షత్రముల ప్రభావము సునిశ్చితము గాదు. దైవమునందు విశ్వాసములేని వారే జాతకములను నమ్ముకొని అనవసరంగా బాధ పడతారు.

ఐరోపాలోను, భారత దేశములోను వున్నట్టి చాలామంది జ్యోతిష శాస్త్రవేత్తలను నేనెరుగుదును. వారిలో ఏ ఒక్కరు కూడా భవిష్యత్తును గూర్చి సరిగా చెప్పలేరు. వారలా చెప్పలేక పోవుటకు

కారణములు మూడు — మొదటిది, భవిష్యత్తును గూర్చి చెప్పుటలో జ్యోతిష్కుల అసమర్థత. రెండవది — జాతకచక్ర నిర్మాణము సరిగా లేకపోవుట. గణిత శాస్త్ర పరిజ్ఞానము కలవారికే యిది సాధ్యము. వారికి కూడా జాతక చక్రమును నిర్మించుట కష్ట సాధ్యమే. మూడవది — జననకాల సమయమందు ఆయా గృహములందున్న నక్షత్రములు, జాతకునిజీవితమును శాసించుననే మూఢనమ్మకము. అది సరికాదు.

ఏనక్షత్రముల ప్రభావము ననుసరించి మీజననము జరిగినదో అవి కేవలము మీభౌతిక స్థితులను తెలుపు టేపురికార్డర్ల లాంటివి. అవేవి గూడ ఆత్మయొక్క భవిష్యత్తును శాసించలేవు. అంత కన్నా ఆవల, నక్షత్రములను, సమస్త విశ్వమును శాసించగల మహాశక్తి మరొకటి గలదు. ఆత్మ యనునది పరమోన్నత సత్తకు చెందినది. అది యోగమార్గావలంబనలో సాగినచో తారలశక్తిని గాని మరే యితర శక్తులను గాని విశ్వసించదు.

నీకేదో విపత్కర స్థితి ఏర్పడనున్నదని జ్యోతిష్కుడెవ్వరైనా అంటే అతడొక జోకర్ లాంటి వాడు. చాలామంది జోకర్లు, "నేడు నీ మెడ విరుగనున్నది" అని చెప్పినా కూడా ఏమి జరగదు.

*

ఒక గొప్ప యోగి మాత్రమే మీ భవిష్యత్తును సరిగా చెప్ప గలడు. అయినా ప్రతి విషయమును శాసించి నిర్ణయించగల పరమేచ్ఛ మరియొకటున్నది.

*

సాముద్రికమొక జనరంజకమైన విషయము. దీని యథార్థతా, సత్యములు, సాముద్రికుని సామర్థ్యముపై ఆధారపడియుండును. అంతే గాక ఇది భౌతిక జీవితమునకు మాత్రమే సంబంధించినది కనుక, ఉన్నతశక్తుల ప్రమేయముతో ఇది మారగలదు.

జ్యోతిష్కులు ఏదో చెప్పారని నీవెందుకు విశ్వసించాలి? ఆ విశ్వాసమే నీకు కష్టము కలిగించును.

శ్రీఅరవిందులు చెప్పినట్లు — మనిషి తానెట్లుండాలని తలచునో అట్లే వుండగలడు.

అనువాదం: జె. సురేంద్రాచార్యులు, రాయప్రోలు లక్ష్మీనరసింహశాస్త్రి

శ్రీఅరవిందుల ప్రవచనములు

ప్రశ్న: ఈ రోజు నాకు 'క' తన జమాఖర్చుల పుస్తకం చూపించాడు. అందులోని మొత్తం ఇలా ఉంది. 7 రూ॥ 7 అణాలు, 7 పైసలు. అది 7 వ నెలలోని 7 వ రోజు. ఈ విషయం మీకు వ్రాయాలని నిర్ణయించు కున్నాక మరొక విషయం తెలిసింది. నేను పనిచేస్తున్న ఇంటి నెంబరు కూడా 7. మరొకచోట ఇలాంటి అంకెల కలయిక చూడలేం. బహుశ ఇక్కడ ఈ వాతావరణంలో ఈ అంకెలు (బహుశా వాటి తాంత్రిక శక్తి) పరస్పరమైత్రితో ఉంటాయనుకుంటాను. అంటే ఆశ్రమంలోని ముఖ్యమైన బిల్డింగ్‌లో ఆడుకునే చిలకల్లా సయోధ్యమైన వాతావరణంలో ఆడుకుంటాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, మిగిలిన ప్రదేశాల్లోనూ వాటికి ఆవాతావరణం చాలాయాంత్రికంగా ఉండడమేకాదు. చాలా భారంగా, బిరుసుగా ఉండడంచేత వాటికి అక్కడ సంతోషం ఉండదు. అలాంటి సయోధ్యత ఉండడం కుదరదనుకుంటాను.

జవాబు: తాంత్రికమైన దృష్టితో చూస్తే నీ విశ్లేషణ నిజమే. శ్రీమాత పద్దుల్లో అంకెల సయోధ్య ఎల్లప్పుడూ ఉంటుంది.

*

శ్రీ చంపక్‌లాల్‌వ్యాఖ్య:

శ్రీమాత ఎప్పుడూ అంకెల విషయంలో చాలా అభిరుచి కలిగి ఉండేవారు. ఆమె ఎంత పనిలో ఉన్నా కొన్ని రకాల అంకెల కలయిక ఆమె దృష్టిని వెంటనే ఆకర్షించేది.

ఉదాహరణకి ఆమె 24-10-53 అన్న తేదీ వ్రాసినపుడు ఆ తేదీలో ఒకటినుంచి అయిదు వరకు అన్ని అంకెలూ ఉన్న విషయాన్ని వెంటనే గమనించి చెప్పారు.

మరోసారి 27-2-72 తేదీలో కూడా ఎడమనించి చూసినా, కుడినించి చూసినా 2,7,2,7,2 ఒకటిగానే ఉన్నాయని చెప్పారు.

అనువాదం: డి. సత్యవాణి

వేదములందు 7, 100 సంఖ్యల ప్రాముఖ్యత

శ్రీఅరవిందుల ప్రవచనములు

ఋషుల ఆధ్యాత్మికదృష్టియే వీని ఆధారము: అన్య ప్రాచీన భావనా సాంప్రదాయములందున్నట్లే వేదమందు గూడ నీ సప్తసంఖ్యకు విశేష ప్రాముఖ్యము కన్పించుచున్నది. ఉదాహరణమునకు సప్తరత్నములు, సప్తార్చులు, సప్తజ్వాలలు, సప్తదీధితులు, సప్తగోవులు. (దేవమాతయగు నదితియొక్క యవధ్య గోరూపము లేడు) సప్తకిరణములు, సప్త మాతలు, సప్తధేనువులు (ధేను శబ్దము కిరణములకు, నదులకు గూడ నభేదముగా వాడబడి యున్నది). ఈ బ్రహ్మాండమందు అస్థిత్వ తత్త్వ ముల వర్గీకరణ మూలమును బట్టియే ఋషులకీ సప్తవ్యూహము గోచ రించినదని నా మతము. ప్రాచీన దార్శనికులు తత్త్వసంఖ్యా విచారణ యందు నిమగ్నులైరి. భారతీయ దర్శనములందీ సంఖ్య యొకటితో మొదలిడి వింశతుల వఱకేర్పడి యున్నది. వేదమందు ఋషు లిహపర లోకముల నంతటిని సత్యచైతన్య స్థితిప్రవృత్తి గమనముగా నెఱిగి యుండినందున వారి యాధ్యాత్మిక మానసిక తత్త్వార్థ భావనలందు కన్పించు సప్తసంఖ్యా సూత్రమున కదియే మూలముగ పరిణమించినది. ఆధునిక పాశ్చాత్య భౌతిక హేతువాదపూరిత బుద్ధికీ ఋషుల ప్రత్యక్ష జ్ఞాన మూలమైన వర్గీకరణము, విచిత్రముగను, నిర్హేతుకముగను, వ్యర్థ ప్రగల్భముగను కన్పించినప్పటికి, నవి కేవల మూహాజనితమైన యప్రత్యక్షా ప్రామాణికాంతంములు కావు. తపస్స్వాధ్యాయనిరతులైన ఋషుల యాధ్యాత్మిక యోగదృష్టికవి దృఢమైన యాధారములతో గోచరమైనవి. వారి యాధ్యాత్మికాభ్యాస పురోగమనమంతయు దాని ననుసరించియే కొనసాగెను. ఆ విషయ మేదైనప్పటికిని కాలానుసార ముగ మనకు సుదూరమైపోయిన యా ప్రాచీన విజ్ఞానమందలి సిద్ధాం తముల యథార్థాభిప్రాయములను గ్రహించుటకీ విషయముల నవశ్యము స్పష్టముగ తెలిసికొనవలెను.

సప్తసంఖ్య పుట్టుపూర్వోత్తరములు: వేదమందీ తత్త్వసంఖ్య నానా విధములుగా కన్పడుచున్నది. సర్వమును తనలో ధరించి విశ్వప్రవృత్తి నివృత్తికంతటికి నేకైకాధారభూతముగా నున్న 'తదేకము'ను వారు

తెలిసికొనిరి. ఈ యేకత్వమందు ఋషులు దివ్య మానుషత్వములు, మర్త్యామర్త్యత్వములను రెండింటిని గుర్తించిరి. ఈ రెండంశములనే మఱొక ద్వంద్వ రూపముగ పృథివీ వ్యోమములకు, మనోదేహములకు, జననీ జనకులని వర్ణించిరి. మనోమయాన్నమయ చైతన్యములుగా సాక్షాత్కారించిన యీ రెండు సహజదివ్యశక్తులకు సంకేతములుగా పృథివీవ్యోమములను పేర్కొనునప్పుడు వానిని మాత పితలుగా గాకుండ మాతృద్వయముగా నిరూపించిన విషయముగూడ గమనించ వలెను. త్రిత్వమును రెండు విధములుగా గుర్తించిరి: ఒకటి — తదనంతర దార్శనికులు సచ్చిదానందమని పేర్కొనిన దివ్యస్థితియైన — చైతన్యానందము; ఇది దివ్యత్రితము. రెండు; వేదపురాణేతిహాసములందు ముల్లోకములు లేక త్రిభువనముల కాధారభూతములుగా పేర్కొనబడిన మనఃప్రాణదేహములను నైహిక త్రయము. కాని సర్వసామాన్యముగా తత్త్వసంఖ్య పూర్ణముగా నేడని వివరింపబడి యున్నది. పర దివ్యత్రితము, నైహికత్రయమును కలిపి, వానికనుసంధానముగ 'ఋతం బృహత్' అనబడు సత్యచైతన్యమును జోడించి యీ సప్త సంఖ్యను సాధించిరి. తరువాత నీ ఋతంబృహత్తునే విజ్ఞానమని, మహస్సని, వివరించిరి. మహస్సు, బృహత్తు పర్యాయ పదములుగా నేర్పడినవి. ఇవి గాక, వేదమందు తత్త్వమును వివిధములుగా వర్గీకరించి యైదు, ఎనిమిది, తొమ్మిది, పది, కొన్నిచోట్ల పండ్రెండుగా గూడా వివరించినట్లు కన్పించును.

సప్తసంఖ్య యొక్క ఇంద్రజాలము: ఈ తత్త్వములన్నియు నవిభేద్యములు, సర్వోపగతములు; అనగానవి యన్యోన్య సమవాయ సంబంధము గలవి. ఈ విషయమునుగూడ ఋషులు తెలిసికొని ప్రకటించి యున్నారు. ప్రకృతి ప్రవృత్తియందు సకల రూపములలో నొక్కొక్క దానియందు నివియన్నియు ప్రత్యక్షముగానో పరోక్షముగానో నిప్పటిల్లు చుండును. ఉదాహరణకు మనస్తత్త్వ మేడు భువనములందు నేడు పదములుగా సాక్షాత్కరించును. *అనగా మనోమయ చైతన్యమన్న ప్రాణ మనస్సత్యాది సప్తతలములందును సప్తవిధ మానసికములుగ ప్రవర్తించును. భౌతికబుద్ధి, ప్రాణికబుద్ధి, శుద్ధబుద్ధి, సత్యబుద్ధియని ఇట్లు సప్తవిధ తత్త్వములందు సప్తవిధములుగా వ్యాప్తిజెందు మనోమయ*

చైతన్యము యొక్క పరాకాష్ఠయైన యేడవ పదమే పరమ పరావర్త మగును. సప్తకిరణములు లేదా సప్తగోవులే యదితి; అనంత జనని; అవధ్యగోవు; పరాప్రకృతి; అనంత చైతన్యము; తదనంతర దర్శనము లందు ప్రకృతి (పురుష ప్రకృతులలో రెండవ యంశము) లేక శక్తియని పేర్కొనబడిన భావనకు వేదమందిదియే యాది మూలము. (ఇటులనే పురుష భావమునకు గూడ ప్రాచీన పశుపోషకుల యనుకార కల్పన 'వృషభము'). ఈ యదితి (సప్తగోవులు) ప్రకృతిమాత, చైతన్యస్థితి గమనశక్తిగా తన యైహిక ప్రవర్తనలను సప్తతలములందాయా రూపములు దాల్చి కొనసాగించును. ఇట్టివే సప్త చైతన్యవాహినులు, సప్తనదులు. ఇవి చైతన్య పారావారామందున్న సప్తతత్త్వార్థ సదృశ ములు; వీనినే పురాణేతిహాసములలో సప్తపదములని, సప్తతలములని, సప్తభువనములని పేర్కొనిరి. *ఈ సప్తవాహినులు మానవ చైతన్య మందు సమృద్ధిగా, నిరాటంకముగా, ప్రవహించుట వలననే మానవ చైతన్య ప్రవత్తి సంపూర్ణముగా ఫలించును. ఇదియే మానవుని సంపూర్ణ సంపన్నత: అతని శక్తి పరిణామ విలాస సంపూర్ణత. మానవుని గోవులీ సప్తనదీ జలములను త్రాగుచున్నవని వైదిక సంకేత రూపకల్పన.*

ఈ రూపకల్పనలకు యథార్థాధారములున్నందున నీ భావ నలు సమ్మతమగుచున్నవి. నేటి మన సంస్కృతిని బట్టి పురాణేతి హాసములలోను, నూతన దివ్యజ్ఞాన సరణిలోను వీనిని సప్తలోకము లుగా చిత్రించుట వలన నివి మనకు సహజముగ విదితమగుచున్నది. అటులనే ప్రాచీనార్యుల జీవిత విధానము. సామాజిక పరిసర స్థితిగతు లను బట్టి నాటి ఋషులు తదనుగుణ రూపకల్పనలతో చిత్రించి వివ రించుట వారికి సహజము, సముచితమే యగును. ఈ విధముగా సప్త నదులలో సరస్వతికిగల స్థానము తేటతెల్లమగుచున్నది. మహాస్సన బడు ఋతసత్య తలమునుండి యవతరించునదే సరస్వతీ ప్రవాహము. వేదమందీ విషయము స్పష్టముగ వివరింపబడి యున్నది.

*

నూరు సంఖ్య పుట్టుపూర్వోత్తరాలు: మిగిలిన రెండు బుక్కులు వాయుదేవుని రథము ఆనందం వైపు పయనించుచుండగా, భూలోక

సువర్లోకములు తమ రహస్య రూపములను, శక్తులను ఆతని కందజేయుటను సూచించును. ఆతనికి మొదటి పూర్ణాంకము ఏదైతే వున్నదో అన్ని అశ్వములు చేకూరాలి. "మనస్సుచే కట్టబడిన ఆ తొంభై తొమ్మిది అశ్వములు నీ రథమును లాగుగాక"[2]. నిరంతరము పునరావృతమవుతున్న ఈ సంఖ్యలకు — తొంభైతొమ్మిది, వంద, సహస్రములకు వేదములో ఏదో ఒక సాంకేతికార్థము ఉండును. కాని అదేమిటో మనం స్పష్టంగా తెలుసుకోలేము. మార్మిక సంఖ్య ఏడుని ఏడుతోనే గుణించి దానిని రెట్టింపు చేసి, ముందు, వెనుక ఒక్కొక్క టిని కలిపితే 1+49+49+1=100 అవుతుంది. ఈ సృష్టిలో ఏడు తత్త్వ ములు, దివ్యచైతన్యము యొక్క ఏడు శ్రేణులు నర్తించుచున్నవి. ఒక్కొ క్కటి బహురూప్యమై మిగతా ఆరింటిని తనలోనే ధరించును. అంటే మొత్తం నలభై తొమ్మిది — వీటి మూలము అయిన ఒకటిని కూడా కలిపితే "యాభై". ఇవీ చైతన్యము (స్తరము) యొక్క క్రియా రూప ములు. (a scale of fifty and forming the complete gamut of active consciousness) దీని ప్రతిరూపములు కూడ ఉన్నయి. ఆరోహణ, అవరోహణలు — దేవతల అవతరణ, మానవుని ఆరోహణ. ఇప్పుడు మనకి తొంభై తొమ్మిది వచ్చింది కదా! ఈ సంఖ్యయే వేరు వేరుగా సంకేతార్థములలో వేదములందు అశ్వములకు, నగరములకు, నదులకు వర్తింపబడినది. దీనికి దిగువలోకమును సూచించే ఒకటిని కలిపితే మనకి "వంద" పూర్తవుతుంది.

వాయుదేవుని సంచారము వలన బహుముఖమైన చేతనా శక్తి ప్రభవిస్తుంది: ప్రస్తుతం మనిషిలో నిక్షిప్తమైవున్న మానసిక సామర్థ్య ములు — మనస్సుచే కట్టబడిన 99 గుఱ్ఱములు — బహిర్గతమగును. తర్వాత శ్లోకములో మిగిలిన అంకము కలిపితే నూరు గుఱ్ఱములు. ఇప్పుడు మనస్సు సంపూర్ణంగా, ప్రకాశవంతంగా పనిచేస్తుంది కనుక ఈ గుఱ్ఱములు వాయువును, ఇంద్రుణ్ణి మోస్తున్నప్పటికి, అవి కేవలం 'నియత్' గాక, ఇంద్రుని మెరుపుతీగెలవంటి అశ్వములవలె 'హరి' వర్ణమును కలిగి వుండును. "ఓ వాయువా నూరు చురుకైన గుఱ్ఱము లను రథమునకు కట్టుము. వాటిని ఇంకను ఎక్కువ చేయవలెను."[3]

కాని ఎక్కువ చేయుటమెందుకు? మామూలుగా మనస్సు యొక్క వివిధ విన్యాసములను లెక్కపెట్టేందుకు నూరు సరిపోతుంది కదా. కాని వాటి విలక్షణమైన ప్రక్రియలన్నింటిని లెక్కించుటకు అది కూడా చాలదు. అందుకని ప్రతి నూటిని పదితో గుణించాలి. ఒక్కొక్క భావనా జాలమును సాదృశముగా ఎక్కువ చేయవలెను — 'పోష్యాణామ్' అనే పదమునకు అర్థము ఇదే. అందుకనే ఋషి అంటాడు. సంపూర్ణంగా నూటితోటి వచ్చి, తర్వాత నూరుపదులుగా అభివృద్ధి చెందుము. లేక, మొదట్లోనే నీ పూర్తి సామర్థ్యవంతమైన వెయ్యితో అరుదెంచుము. దాని వైవిధ్యము బహు వైభవోపేతము, సర్వమును పరిక్రమించునది[4]. మనిషి కోరుకున్న జ్ఞానశక్త్యానందములు, మానసిక, ప్రాణిక, శరీరాధిక్యతలు పూర్ణత్వముతో కూడిన మనస్సును ప్రదీప్తముకావించి సర్వశక్తిమంతము చేయును. ఇప్పుడు మనస్సు యొక్క స్థాయి పెరిగినది. అది జీవితమును సమగ్రముగా, సర్వతోముఖముగా వికసింప చేయగలదు. ఇప్పుడు మనలో దాగివుండి, మనస్సు కంటె వెయ్యిరెట్లు ఘనమైన అవచేతనము (subconscient) మనస్సుయొక్కఆజ్ఞను శిరసావహించి తనలో దాగివున్న సామర్థ్యములన్నిటిని బహిర్గతముచేసి తీరుతుంది.

*

అశ్వము లేక గుఱ్ఱము ప్రాణశక్తికి చిహ్నమైవున్నది. గోవు కాంతికి చిహ్నమై వున్నది. ఏబది, వంద, సహస్రము పూర్ణత్వమునకు చిహ్నములు.

*

సహస్రము సంపూర్ణతకు చిహ్నము.

---

1 ఋగ్వేదము IV. 48. 4,5

2 వహం తుత్వా మనోయుజో యుక్తాసో నవతిర్ నవ.

3 వాయో శతమ్ హరిణాం యువస్వా పోష్యాణాం.

4 ఉతా వా సహస్రిణో రథ ఆ యాతు పాజసా.

అనువాదం: వఝల వెంకటరామశాస్త్రి, శ్రీరామకవచం వెంకటేశ్వర శాస్త్రి (నిగూఢ వేద రహస్యము);

సంకేతములు – అతీంద్రియ జ్ఞానం

శ్రీఅరవిందుల ప్రవచనములు

మానవుడు తన తెలివికి అంతుపట్టని శక్తులతో పోరాడ లేక పోయినా భవిష్యత్తుకు సంబంధించిన జ్ఞానం కోసం అత్యాశతో అనేక రకాల బాహ్యా శక్తుల్ని చేపట్టాడు. శకునాలు, క్షుద్రశక్తులు, కలలు, జ్యోతిషం ఇవేకాక మరెన్నో గతానికి, భవిష్యత్తుకి సంబంధించిన విష యాలని సముపార్జించాడు. గతంలో, అంటే వీటిని గురించిన అను మానం మనిషిలో చొరబడనప్పుడు, ఇవి ప్రత్యేక శాస్త్రజ్ఞానాల స్థాయిని పొందాయి. ఇపుడు హేతువాదం వీటిని ధిక్కరించినా, మనిషి మనసుని ఇవి ఇంకా ఆకర్షిస్తూనే ఉన్నాయి. మూఢనమ్మకాలు, కుతూహలం, వీటిని బలపరుస్తూనే ఉన్నాయి. అయితే వీటినించి బయటపడిన సత్యం అల్పమే అయినప్పటికి వాటికింకను స్థానమున్నది.

ఒక ఉన్నతమైన చైత్య (psychic) స్థితిలో కలిగిన జ్ఞానం ఒక సత్యాన్ని చూపిస్తోంది — అది విశ్వమంతా అనేక పద్ధతులతో, పరస్పర సంబంధాలు కలిగిన సంకేతాలతో నిండి ఉండడం సత్యమని తెలియపరుస్తోంది. అయితే వాటిని చాలామటుకు దురుపయోగం చేసి నప్పటికి, శాస్త్రీయమైన పద్ధతిలో సరైన అవగాహనతో ఉపయోగించి నపుడు అవి భౌతిక జ్ఞానానికి సంబంధించిన ఎన్నో సత్యాలను చెప్ప గలవు. అయితే ఒకటి మాత్రం కనిపిస్తోంది. వాటిని అంతర్ దృష్టికి సంబంధించిన జ్ఞానంతో మాత్రమే అర్థం చేసుకోగలం, కనుక్కోగలం. నిజానికి చైత్య మనస్సు, అంతర మనస్సు మాత్రమే సహజంగా ఈ శాస్త్రజ్ఞానాన్ని రూపొందించేవి. అంతర్ జ్ఞానం వలన తప్ప సాంప్రదా యమైన లేదా యాంత్రికమైన నిబంధనలు, వాటిని విశ్లేషించటంలోని లోపాల వలన వాటి నిజ ఫలితాలు పొందలేమన్న సంగతి ఆచరణ లోనే తెలుస్తుంది. మిడిమిడి జ్ఞానంతో వాటిని ప్రయోగించినపుడు అవి అరణ్యరోదనగా పరిణమిస్తాయి.

భూత భవిష్య ద్వర్తమానాల యథార్థ జ్ఞానమును చైత్య చేతన, చైత్య సామర్థ్యములతో ప్రత్యక్షముగా పొందవచ్చును.

అనువాదం: డి. సత్యవాణి

శ్రీఅరవిందుల ప్రవచనములు

ఒక స్తరము (లోకము) నకు చెందిన వస్తువు మరియొక స్తరములో తాల్చిన రూపమును చిహ్నము అని వ్యవహరించెదము. ఉదా: జెండా ఒక జాతికి ప్రతీక. సర్వ సాధారణంగా అన్ని రూపములు చిహ్నములే. మన శరీరము మన యథార్థ స్వరూపానికి ప్రతీక. అటులనే ప్రతి యొక్క వస్తువు ఒక వున్నత సత్యమునకు ప్రతీక.

1. *సాంప్రదాయకమైన ప్రతీకలు:* వేద ఋషులు తమ పరిసరముల నుండి గ్రహించిన వస్తువులు ఉదా: ఆవు. ఇది కాంతికి చిహ్నం. ఏలన 'గో' అనే శబ్దమునకు కిరణము, ఆవు అనే రెండు అర్థాలున్నాయి. ఆవు వారికి చాలా విలువైన వస్తువు. వాళ్ల ప్రాణానికి ప్రాణమై ఎప్పుడూ దొంగిలించబడుతూ, దాచిపెట్టబడుతూ ఉండేది. ఒకసారి సృష్టించబడిన చిహ్నము సజీవమై భాసిస్తుంది. ఋషులు దానికి ప్రాణం పోసి ధృవీకరించారు. ధ్యానంలో వారికది దివ్య జ్యోతికి ప్రతీకగా దర్శనమయ్యేది. వారికి ప్రియమైన చిహ్నములలో అశ్వము చాలా ముఖ్యమైనది. ఇందులో ఆశ్చర్యమేముంది. దాని బలము, వేగము ప్రసిద్ధములే గదా.

2. *జీవతములోని చిహ్నములు:* మన నిత్య జీవితములోనివి, పరిసరములకు చెందినవి, నిత్యము అనుభూతమవుతున్న విషయములు. ఉదా: పర్వతము. కొండలను దాటుకుంటూ పోవటం, ఒక శిఖరాన్ని ఎక్కి అంతకంటె ఎత్తైన మరొక శిఖరమును ఎక్కటం యోగమార్గమునకు చక్కటి సంకేతములు. నదులను దాటుట, క్రూర మృగములతోను శత్రువులతోను పోరాడుట కూడ ఇటువంటి సంకేతములే. నేటి కాలంలో అయితే కార్లు, రైలు ప్రయాణములు ఉంటాయనుకోండి.

3. *స్వభావ సిద్ధమైన చిహ్నములు:* ఆకాశము, ఆవరణ ఈ కోవకు చెందినవి. అవి సర్వవ్యాప్తమైన సనాతన బ్రహ్మమునకు చిహ్నములు

ంనుటలో ఆశ్చర్యము లేదు. ఈ సూచనలు అన్ని దేశములలోను ఇటు లనే వుండును. అదే విధంగా సూర్య భగవానుడు ప్రపంచకమంతటా అతిమానస జ్యోతికి, దివ్య ఉద్గారానికి (divine Gnosis) ప్రతీక.

4. *మానసిక చిహ్నములు:* అంకెలు, అక్షరాలు ఈ కోవకు చెందినవి. ఒకసారి గుర్తింపు పొందిన తరువాత అవి ప్రాణం పోసుకొని వాటి ప్రభావాన్ని చూపిస్తాయి. ఉదా: జామితీలోని పటములకు చాలా అర్థాలున్నాయి. నా అనుభవములో చతురస్రం అతిమానసానికి చిహ్నం. ఇదివరకే దీనికి ఈ అర్థాన్ని ఎవరో ఆపాదించి వుంటారు. త్రిభుజానికి కూడా చాలా అర్థాలున్నాయి. ఒక రకంగా నిల్చోపెడితే అపరార్థమైన మూడు లోకాలను, మరో రకంగా అయితే పరార్థ లోకత్రయాన్ని సూచిస్తుంది. అందుకని ఈ రెండింటిని కలిపి ఒకే సంజ్ఞగా చేయవచ్చు. ప్రాచీనులు అంకెలను గురించిన విచారణలను చాల ఉత్సాహంగా జరుపుతూ వుండేవారు. అయితే వాళ్ల సిద్ధాంతాలన్నీ బౌద్ధికమైనవి మాత్రమే. అతిమానసిక సత్యములు కూడా తప్పకుండా వుంటాయి కాని వాటిని మనము కర్మ, పరిణామము అనే మానసిక చట్రాలలో బిగించాము. మనం వాటిని సంకుచిత పరిచినప్పటికి నిజానికి అవి చాలా అనంత సత్యములు. ఆ సత్యములను ఇంకా ఎన్నియో చిహ్నాల ద్వారా ప్రకటించవచ్చును. ఒకే చిహ్నము బహుభావములను కూడ ప్రకటించవచ్చును.

*

ఇటువంటి భావనాచిత్రములు ఏదో ఒక రూపములో అనాదిగా వస్తున్నాయి. క్రీస్తు పూర్వము ఐదవ శతాబ్దం నాటి పైథాగరస్ అంకెల శాస్త్రాన్ని చాల క్షుణ్ణంగా అధ్యయనం చేసి బోధించిన మహాశయుడు.

అనువాదం: వై.యస్.వి.యస్. మూర్తి

శ్రీఅరవిందుల ప్రవచనములు

విజ్ఞాన శాస్త్రం పెరిగినకొద్దీ పాతనమ్మకాలు, సాంప్రదాయిక విద్యల పట్ల గౌరవం తగ్గిపోయింది. జ్యోతిశ్శాస్త్రం, సాముద్రిక శాస్త్రం మొదలైనవన్నీ హేళనకు గురిఅయినయి. ఇది ఎంత వరకు సమంజసమన్నదే ప్రశ్న. విజ్ఞానశాస్త్రానికి పూర్వం విద్యలేమియు లేవనియా వీరి వాదన? అసలీ విజ్ఞానశాస్త్ర పరిధి ఎంత? అది కేవలం బాహ్యదృష్టిమీదనే ఆధారపడుతుంది. కాని మనకి తరతరాలుగా సంక్రమించిన ఈ గూఢవిద్యలన్నీ మన పూర్వీకులు పరిశోధించి సిద్ధాంతీకరించిన శాస్త్రములే గదా. న్యాయాన్యాయములను విచారింపకయే వాటిని కొట్టిపార వేయుట మూఢత్వమే అవుతుంది. వాటి సత్యాసత్యాల విచారణ ఈ శీర్షికకు విషయము.

సంపాదకుడు

భౌతికమైన తర్కంతోకాని, సూత్రాలతోకాని ఏకీభవించని ఏ అంశాన్నయినా 'మూఢనమ్మకం' అని పిలవడం అలవాటుగా మారింది. అంటే, ప్రాపంచికమైనబుద్ధి భౌతికవిషయాలమినహా వేటినీ గ్రహించడం లేదు. వ్యక్తిగతంగా తర్కసహాలనుకొనే భౌతికసత్యాల ఒరవడిలో లేని దేన్నయినాకూడా తిరస్కరించడం జరుగుతున్నది. యుగయుగాలుగా మానవుడు భౌతికమైన బుద్ధికి అందని బాహ్య సూత్రాలకు, స్పందనలకు అందని అజ్ఞాతశక్తుల ప్రభావాన్ని అంగీకరించడం జరిగింది. కాని విజ్ఞానశాస్త్రం తన విధానం ద్వారా బాహ్యాస్పందన పరిధిని పెంచుకొనడమేకాక, సర్వ సృష్టి కార్యకారణ సంబంధంతో వివరించబడుతుందని భావించడం జరిగింది. అందువల్లనే తన సూత్రాలకు, పద్ధతులకు అందని ప్రాచీనమైన నమ్మకాలను కొన్నింటిని నిజమని, కొన్నింటిని కొంతమాత్రమే నిజమని, మరి కొన్నింటిని పూర్తి అబద్ధాలని నిర్మొహమాటంగా తిరస్కరిస్తూ చెత్తబుట్టల్లో వేయడం జరిగింది. ఆధిభౌతికమైన అంశాలలోకూడా తర్కసహమైన స్పందన కలిగిన

ానినే అంగీకరించి, మిగిలిన వానిలో కొన్నింటిని తాంత్రికమైనవని, ...ధనాత్మకమైనవని, పూర్తిగా మూఢనమ్మకాలని పేర్కొనడం జరిగింది. ఊహాజనితమైనవయినా, సాంప్రదాయ సిద్ధమైన తర్కానికి ...ంగి సరైనవే అనుకొన్నవైన ప్రజాదరణ పొందిన నమ్మకాలకు కూడా ఇదే గతి పట్టింది. కేవలం కొన్నింటికి మాత్రమే తక్కువగా, మరింత తక్కువగా అనువర్తింపదగిన పద్ధతుల ద్వారా మాత్రమే అన్నింటిని మూఢనమ్మకాలని ధ్రువీకరించడం తొందరపాటు చర్య అని, శాసన నిబద్ధతలేని చర్య అని గుర్తించడం ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది. మూఢనమ్మకం అనే పదాన్ని అసలు వాడకూడదని, వాడినా ఎంతో జాగ్రత్తతో వాడాలని నేను మీతో అంగీకరిస్తున్నాను. మనం అనుసరిస్తున్న, లేదా అభిలషిస్తున్న మతాచారాలకు విరుద్ధంగా ఉండే నమ్మకాలను మూఢనమ్మకం అనడం తగనిది.

కొన్ని విషయాలను ఇప్పటిదాకా తిరస్కరించినా ప్రస్తుతం అంగీకరించే స్థితి కలగడం తెలుస్తున్నది. ఇటువంటివి ఇప్పటికే ఉన్నానికి తోడు ఇంకొక వంద కలుపుకోవచ్చు. ఉదాహరణకి లిపి విశ్లేషణా శాస్త్రం తర్కసహం కాదని, అది ఒక మూఢనమ్మకం అని తిరస్కరించడం, ఖండించడం జరిగింది. కాని, వ్రాత అనేది వ్యక్తి స్వభావాన్నిబట్టి, ప్రవృత్తినిబట్టి ఏర్పడుతుందని, దానిని వ్యక్తి మనః ప్రవృత్తి తెలిసికొనడానికి ఒక సూచికలా గుర్తించవచ్చునని నాకు తోస్తున్నది. ప్రతి మనిషి ఇంకొక మనిషితో భౌతికంగాను, మానసికంగాను భిన్నమైన అనేక లక్షణాలను కలిగి ఉంటాడన్నది యిప్పుడందరికీ తెలిసినదే. భౌతిక, మానసిక ప్రవృత్తుల మధ్య పోలికలు, భేదాలు పరిశీలించడం తర్కసహమే. అలాగే షీరో ప్రతిపాదించిన సాముద్రికంలో కూడా నిజం ఉంది. ప్రతి మనిషి చేతిమీద గీతలు ఇంకొక మనిషి చేతిగీతల కంటె వేరుగా ఉంటాయని అందరికీ తెలుసు. అదే విధంగా ముఖకవళికలద్వారా మానసిక ప్రవృత్తులను తెలిసికొనవచ్చును. కేవలం ఒక తార్కిక విధానపు వొరవడికి లొంగిన బుద్ధికి ఇటువంటి గీతలుకాని, జ్యోతిషాలుకాని భవితవ్యాన్ని నిర్దేశిస్తాయని నమ్మడం కష్టమవుతుంది. దానికి కారణం, ఆధునిక తర్కం భవిష్యత్తును నిర్ణయించవచ్చుననో, సూచించవచ్చుననో నమ్మకపోవడమే.

కాని శాస్త్రీయ సాంప్రదాయాలకు విరుద్ధమైన ఒక ఆధునికమైన మూఢనమ్మకంగా యిది గోచరిస్తున్నది. దానికి కారణం, చాల కొద్ది కాలం క్రితంవరకు విజ్ఞానశాస్త్రం అంతా ప్రకృతిబద్ధమైన కొన్ని సూత్రాలకు కట్టుబడి ఏర్పడిందని, దాని ప్రకారమే అన్నింటి భవిష్యత్తు చెప్పవచ్చునని నమ్మడం జరిగింది. మానవ జీవితాలలోకూడా కొన్ని కననిబంధాలుండడంచేత భవిష్యత్తుకూడా చెప్పవచ్చునని అర్థమవుతున్నది. అది జ్యోతిషపరంగా జరుగుతుందా లేక షీరో ప్రతిపాదించిన సాముద్రికపరంగా జరుగుతుందా అనేది విచారించవలసినదే. కాని మొత్తం తప్పని కొట్టిపారవేయలేము. జ్యోతిషం బాగా నిజమనుకొంటే, షీరో సాముద్రికం కూడా నిజం అనవచ్చు.

ఈ సందర్భంలో యింకొక రీతిలో తొందరపాటుతో ప్రవర్తించడం క్షేమం కాదు. ఇటువంటి అంశాలలోని దోషాలను ఏ మాత్రం పరిగణించకుండా, పరిమితులను లెక్కించకుండా ప్రతిదీ నిజమని నమ్మే వ్యతిరేక దృక్పథం కూడా ఉంది. సహజ సిద్ధమైన దోషాలను లెక్కించకుండా ఎక్కువగా నమ్మడం వల్లనే వానిపట్ల అపనమ్మకం ఏర్పడుతున్నది. నక్షత్రాలు కొంతవరకు భవిష్యత్తు సూచించినా, మొత్తం భవిష్యత్తంతా నక్షత్రాలే నిర్ణయిస్తాయని దృఢంగా చెప్పడం నాకు సబబు కాదనిపిస్తున్నది. జ్యోతిష్కులే జ్యోతిష శాస్త్ర ఫలితాలను తలక్రిందులు చేసే, అంతర్గతమైన శక్తి మానవునిలో నిబిడీకృతమైయుందని అంగీకరిస్తారు. ప్రపంచంలో వస్తువుల స్థితిగతులను ఒకటిగా చేసే శక్తుల బంధం ఒకటి ఉంది. అటువంటి వానిలో కొన్నింటిని కాని, ఒక దానిని కాని పరిహరిస్తే నమ్మదగ్గ ఆధారాలుండవు. నైసర్గిక సత్యాన్ని మొత్తంగా కాని, దాని వేర్వేరు భావాలనుకాని వెల్లడించడానికి యీ బౌద్ధిక పద్ధతుల శిలా శాసనాలెందుకూ పనికి రావు.

భౌతికమైన లేక మానసికమైన అంశాలను లేశమాత్రంగానైనా పరిశీలించి, మానవుని గూర్చి తెలిసికొనే వీలుందనే మీ అభిప్రాయంతో నేను అంగీకరిస్తాను; కాని అటువంటి విధానం కేవలం ఒక తలవెంట్రుకల భాగంతోనయినా మానవుని మొత్తం తెలిసికోవచ్చుననే విధానాలకు కూడా తోవతీయవచ్చు. మానవ ప్రకృతిలో ఉండే క్లిష్టమైన, బహుళమైన మౌళికాంశాలతో నాకున్న పరిజ్ఞానం దృష్ట్యా అటు

వంటి విధానం ప్రమాదకరమైనదని, హేతుచింతనతో కూడిన వ్యవస్థను మీరిన అవ్యక్తసత్యంలో ఎక్కువభాగాన్ని గ్రహించలేదని చెప్పవలసి వస్తుంది.

ఒకే అంశంలో వ్యవస్థితం కానిదయినా, పరస్పరంశాలతో సంబంధం లేనిదయినా మూఢనమ్మకంవంటి ఒక స్థిరవిశ్వాసం లేదని అనలేను. తమంతటతాము నిజంగాకన్పించే నమ్మకాలనే మానవబుద్ధి తక్షణం గ్రహిస్తుంది. ఇది సత్యశోధనను ఆటంకపరిచే చెడుసమ్మేళనం. కాని యీ చెడు సమ్మేళనంవల్లనే మూఢనమ్మకం వెనుకగాని, దాని సమీపంలోగాని నైసర్గికసత్యం ఉంటుందని గ్రహించడం జరుగుతుంది, మూఢనమ్మకం అనే పదాన్ని నైసర్గికసత్యాన్ని ప్రతిపాదించే సత్యాన్ని మొత్తంగాకాని, కొంతవరకుగాని అది అవ్యక్తం గనుక లేనిది అని తుడిచి వేయడానికి వాడకూడదు; అథవా వాడినా ఎంతో జాగ్రత్తగా ఉపయోగించాలి.

తాత్పర్యం: 'మూఢనమ్మకం' అని పిలవబడే ప్రతిదాని వెనుక అనంత సత్యం దాగుకొనే ఉంటుంది. అందుకే మూఢనమ్మకాలు రూఢి చేసే నమ్మకాలే కాని, వమ్ము చేసేవి కావు.

స్వేచ్ఛానువాదం: డా॥ కె. సత్యమూర్తి

> రహస్యసిద్ధాంతాల ప్రకారం అంకెలకు గూఢార్థమున్న మాట నిజమే. మానవజీవితము, ప్రపంచగమనము చక్రగతిలో భ్రమించే మాటకూడా నిజమే. అయితే ఇటువంటి విషయాలను గురించి ఎక్కువగా పట్టించుకోగూడదు.

శ్రీఅరవిందుల ప్రవచనములు

భగవంతుడున్నాడా లేడా అనే అనుమానం ప్రతి సాధకునికీ ఎప్పుడో ఒకప్పుడు ఏదో విధంగా కలుగుతుంది. ఆ సందేహపు రూపురేఖలు, దాని నివృత్తిగురించి శ్రీఅరవిందులు విపులంగా చర్చించారు.

అనుమానం పెనుభూతం: నేను అనుమానం గురించి వ్రాయాలని మొదలుపెట్టగానే నాకొక అనుమానం కలుగుతోంది. అది ఏమంటే మానవుడు తన జన్మనిష్ఠమైన అజ్ఞానానికి చెల్లించే రుసుమే అయిన ఈ అనుమానాన్ని ఎంత వ్రాసి ఏమిచేసినా నివృత్తి చేయగలమా అని. విపులంగా వ్రాయాలంటే 60 నుంచి 600 పేజీలు పట్టవచ్చు; అయితే ఆరువేల పేజీలు నమ్మిస్తూ వ్రాసినప్పటికీ సందేహం తొలగిపోతుందా? అనుమానం అనుమానం కోసమే; సంశయించటమే దాని నిరంతర వ్యాపారము; నమ్మించినకొద్దీ అనుమానిస్తూ ఉంటుంది. సత్యాన్ని కనుక్కొంటున్నామనే అపోహతోనే సందేహం మొదలవుతుంది. అంటే సందేహించటానికి అదొక మిష. ఈవిషయాన్ని నేను స్వయంగా నా మనస్సు, ఇతరుల మనస్సులను పరిశీలించి ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. దీన్ని పారద్రోలటానికి ఒకటే మార్గముంది. విచక్షణాజ్ఞానాన్ని బాగా పెంచుకుంటే సత్యాన్ని, అసత్యాన్ని చక్కగా గుర్తించి ధైర్యంగా దివ్యానుభవం కోసం అంతర్ద్వారాలు తెరవగలరు.

దైవసాక్షాత్కారం, దాని స్వరూపము: ఏదో విధంగా వ్రాయటం మొదలుపెట్టాను కాబట్టి నేనిక సందేహంతో కాకుండా దైవం ఎంత సగుణాత్మకమో, ఎంత సునిశ్చితమో నిరూపించటానికే రాస్తాను. ఇంద్రియజ్ఞానంతో ఎరుకపడే విషయాలు ఎంత ఘనంగా మూర్తిమంతమైయుంటాయో దైవం కూడా అంతే. ఇంకా చెప్పాలంటే ఈ భౌతిక ప్రపంచంలో కళ్ళతో, చెవులతో, స్పర్శతో తెలుసుకునే వాటన్నిటికంటె ఎక్కువైన ఘనత్వం, మూర్తిమత్వంకల భగవంతుని నిరూఢత్వం

మనస్సుతోకంటె అనుభూతిద్వారా మాత్రమే ఎరుగగలరు. ఆ దివ్య కాంతి నిన్ను ఆవరించినప్పుడూ, నీలో ఆ దైవం సాక్షాత్కరించి నప్పుడూ, ఆనందలహరి పరవళ్ళు తొక్కుతూ నీదరి చేరినప్పుడూ, ఆ దైవనిశ్వాసం పిల్లగాలికి తల్లడిల్లే మృదుపల్లవం మాదిరిగా నిన్ను ముందుకునెట్టుతూ ఉన్నప్పుడు, సర్వభూతములపై నీలో ప్రేమ వెల్లి విరుస్తున్నప్పుడు, నీలో దివ్యజ్ఞానవాహిని వెల్లువై పారగా అజ్ఞాన జ్యోతియొక్క ప్రకాశం అంతవరకూ అంధకారమయంగా, దుఃఖభాజ కంగా, దుర్గమంగా ఉన్నవాటన్నిటినీ తేజోవంతంచేసి ఒక్కక్షణంలో దాన్నెంతా మార్చేసినప్పుడు, అదంతా ఆ ఏకైక పరతత్వంలో ఒక భాగంగా అయినప్పుడు, ఆ పరతత్వం నీ చుట్టూ ఆవరించినప్పుడు ఆ క్షణం నుంచి ఆత్మసంస్పర్శ వల్ల, అంతర్దృష్టి వలన, తేజోవంత మైన విచక్షణా దృష్టి వలన, ప్రాణస్పందన వలన, ఇంకా దైహిక స్పందనవల్ల కూడా నీవు సర్వత్రా ఆ భగవంతుణ్ణే దర్శించుకుం టావు; నీకు సర్వం బహ్మమయంగా తోస్తుంది. అప్పుడిక సందేహ మనే మాటే ఉండదు. ఆకాశంలో సూర్యుడు, పగటి వెలుతురు, గాలి ఉన్నాయాలేవా అనే అనుమానం రానట్లే భగవంతుని కూడా లేడన లేవు. నిజానికి ఈ భౌతిక విషయాలనుకూడా నీ ఇంద్రియజ్ఞానముతో తెలుసుకుంటున్నావు కాబట్టి నమ్ముతున్నావు. లేనట్లయితే నీవంత సూటిగా చెప్పలేవు. కానీ భగవంతుని విషయంలో నీవు పొందిన ఘన మైన అనుభవంవల్ల సందేహం అసంభవం.

అయితే ఈ అనుభూతి శాశ్వతం కాదు; ప్రారంభంలో కలిగిన ఆధ్యాత్మిక అనుభవాలు అలాగే నిలిచిపోతాయని అనుకోకూడదు — కొంతమందికి అలా జరుగుతుంది కానీ వారికైనా ప్రారంభంలో ఉన్న తీవ్రత ఆ తర్వాత ఉండదు. అనుభవం కలిగినప్పుడు అది భరించటా నికి, నిలిపి ఉంచుకోటానికి శరీరానికి తగిన సామర్థ్యం, శక్తి ఉండాలి. అది వచ్చే వరకూ ఆ అనుభవం వచ్చినట్లే వచ్చి వెనక్కి తగ్గుతూ ఉంటుంది. అంతమాత్రాన దాన్ని సందేహించటం అవివేకమే కదా! గాలి వీచనంతమాత్రాన అసలు గాలే లేదని అంటున్నామా? సాయంత్రం, రాత్రి సూర్యుడు కనిపించలేదని సూర్యుణ్ణే సంశయి స్తున్నామా? సాధారణ మానవ చైతన్యానికి ఆధ్యాత్మికానుభవం

కలిగితే అది అతీతంగా అసాధారణంగా తోస్తుంది. ఈ పరిమిత, మంద చైతన్యానికి మహోద్ధృతమైన అతీతానుభవాన్ని స్పృశించటమే కష్టం. దాన్ని అది తన నిస్సార మానసిక, ప్రాణిక అనుభవాలతో జోడించి బలహీనపరుస్తుంది కూడా. అట్లాకాక ఆధ్యాత్మికానుభవం మహోద్ధృతంగా వచ్చిపడినప్పుడు అది తట్టుకోలేదు, తట్టుకొన్నా దాన్ని ఆపి నిలుపుకోలేదు. అయినప్పటికీ గూడా మనస్సు ఏర్పరచుకున్న గోడల్లో ఒక చిన్న బీట ఏర్పడుతుంది. ఆ బీట నిదానంగా పెద్దదవటం మొదలుపెట్టి క్రమక్రమంగానూ ఒక్కొక్కసారి మరింత వేగంగానూ వెడల్పయి భగవంతునికీ మనస్సుకీ మధ్య గోడ మాయమైపోయినప్పుడు ఆ అనుభవం శాశ్వతమైపోతుంది.

నవచైతన్యం కావాలి: అయితే ఇటువంటి నిశ్చయాత్మకమైన అనుభవాలు కలగాలన్నా, అవి నిలవటానికి తగినంత నవచైతన్యం సర్వదా ఉండాలన్నా మనస్సుకు తగిన శిక్షణ కల్పించాలి. లేనట్లైతే అది ఎప్పుడూ తన స్వంత భావాలను, పూర్వ నిర్ణయాలను, తెలివితక్కువ విధానాలను ప్రవేశపెట్టాలని చూస్తుంది. అంతేకాక ఏ విధంగా అనుమానం, వాదం, విచారణలనే అజ్ఞాన పరికరాల ద్వారా మనస్సుతో పాక్షిక సత్యాన్ని దర్శిస్తుందో ఆవిధంగానే భగవంతుని అస్తిత్వాన్ని నిర్ధారించాలని చూస్తుంది. బ్రహ్మజ్ఞానంకోసం ఆరాటపడుతూ తడబిడపడుతుంది. అయితే ఈ మహత్తరసిద్ధులు కలగాలంటే క్రమాభివృద్ధి పొందుతున్న చైతన్యాన్ని ప్రశాంతంగా, స్థిరంగా, ఆత్మానుభూతి కోసం విస్తృతం చేస్తేనే సాధ్యమౌతుంది. దైవం ఎందుకు ఇంతకఠినమైన పద్ధతులను దీనికి ఆధారంగా చేసిందనే చొప్పదంటుప్రశ్న నీవడగవచ్చు: ఇది ప్రకృతిపరమైన ఒక మానసికావశ్యకత మాత్రమే. పైగా ఈ దైవానుభూతులు మనస్సు కల్పించేవిగానీ ప్రాణికమైన చలనాలుకాని కాకపోగా అవి ఆత్మకు సంబంధించిన విషయాలు. *ఆలోచిస్తే తెలిసేవి కావు. ఈ వాస్తవాలను ఆలోచన ద్వారా తెలుసుకోలేరు; అంతరాత్మకు మాత్రమే అర్థమయ్యే సారభూతమైన అనుభవాలు అవి.* అయితే ఇక్కడ మనస్సు ఏమి చేయాలి అని సంశయం రావచ్చు. అది తనకిష్టం వచ్చినట్లు ఈ విషయంలో పాల్గొనవచ్చు. తనకు నచ్చిన

రీతిలో దైవభావన చేసుకోవచ్చు. దివ్య సత్యాన్ని గురించి ఊహా గానాలు, నమ్మకాలు, సింహావలోకనాలలో మునిగితేలటమేకాక పరమాత్ముని గురించి ఒక కల్పిత రూపాన్ని పదేపదే పునశ్చరణ చేసుకోవచ్చు. దీని కంతటికీ ఏదో కొంతవిలువ ఉన్నప్పటికీ అది అంత ఆత్మీయమైనది, ఘనతరమైనదీ, వివాదరహితమైనదీ కాదుగా.

మనస్సు ఎప్పటికీ తృప్తి చెందదు: నిజానికి ఆ చరమసిద్ధి పొందగల సామర్థ్యం మనస్సుకు లేదు. ఎందువల్లనంటే దానికి తను నమ్మిన దాన్ని సంశయించడం, తను ఒప్పుకున్న దానిని కాదనడం, తను పట్టుకున్న దాన్ని విడిచిపెట్టేయడం అలవాటు. అది దానిస్వేచ్ఛ, జన్మహక్కు, గొప్ప అని నీవు దాన్ని పొగడవచ్చు. ఈ విధానాలతో అది సాధారణ భౌతికవిషయాలనే అవగాహన చేసుకోలేదు. ఇక చరమ సిద్ధి ఎట్లా పొందగలదు? ఈ బలవత్తర కారణాలవల్లనే మనోభావనలు, ఆత్మ విచారణలు దైవాన్ని అవతరింప చేయలేవని అంటున్నాను. మానవచైతన్యం ఎప్పుడూ మనస్సుతో, అది కల్పించే రకరకాల కథనాలతో ఖాళీ లేకుండానే ఉంటుంది. దానికి తోడుగా ప్రాణికచలనాలు — కోరికలు, అభిమానాలు వగైరా — దీన్ని అనుసరించే ఉంటే, అక్కడిక వేరే ఆలోచన అవకాశం లేనప్పుడు సరికొత్త జ్ఞాన మార్గానికి, మౌలిక అనుభూతులకు, మహోజ్వల తరంగాల మాదిరి వచ్చిపోయే ఆత్మానుభూతికి తావెక్కడ? అయితే సదా తన చర్యలలో నిమగ్నమైయున్న మనస్సులో కూడా ఒక ఆకస్మిక దాడి జరగవచ్చు. ఆకస్మిక ఆత్మానుభూతి వెల్లువై వచ్చి దాన్ని ముంచేయవచ్చు. ఆ తర్వాత అది ప్రశ్నించుకుంటూ, ఏం జరిగిందోనని సంశయిస్తూ, తర్జనభర్జనలు మొదలు ఎడితే తగ్గిపోయి వెనక్కు మరలటం తప్ప ఆధ్యాత్మికశక్తి ఏం చేయగలదు — మనస్సు ఆరాటం తగ్గే వరకు వేచియుంటుంది.

మానసిక చైతన్యం — దివ్య చైతన్యం: ఆధ్యాత్మికానుభవాన్ని ధీమయ మనస్సుతో తూచి అంచెనా కట్టాలనుకునే వాళ్ళను నేనొక ప్రశ్నడుగుతాను. దైవం మనస్సుకంటే తక్కువా? ఎక్కువా? శోధించే

విచారణలతో వాదాలతో, తీరని సంశయాలతో, తలాతోకా లేని తర్కాలతో నమ్రతలేని మానసిక చైతన్యం దైవచైతన్యంతో సరిసమానమౌతుందా? లేక ఇంకా అధికమా? క్రియలలోను, స్థాయిలోను హీనమా? అదే గొప్పదైతే దైవాన్ని అన్వేషించాల్సిన అవసరము లేదు. సరిసమానమైతే ఆధ్యాత్మిక చైతన్యం దానికి వెక్కసమై పోతుంది. అది అల్పమైనదైతే ఏవిధంగా ఎదురు నిలిచి, నిర్ణయించి, భగవంతుని దోషిగానూ, సాక్షిగాను చేసి తన న్యాయానికి గురి చేయగలదు? అనేకరకాల పరిశోధనలకు, పరీక్షలకు ఎరచేయగలదు? ఒక పశువు తన సహజాత జ్ఞానం సామూహికపశుప్రవృత్తి, తనకి గొప్పగా కనుపిస్తాయి కాబట్టి వాటిని ప్రమాణంగా చేసి మానవులబుద్ధిని తూచి అంచెనా వేయగలదా? అసంభవం. ఎందువల్లనంటే మానవునిమనస్సు మహాశక్తివంతమైంది. అది ఎంతో విస్తృతంగా, స్థూలంగా పనిచేస్తుంటే దాన్ని పశుచైతన్యం అనుసరించ లేదు గదా. ఆవిధంగానే మానవ మస్తిష్కం కంటే అనంత విశాలత్వం, సంపూర్ణత్వం కలిగి ఎంతో శక్తిమంతంగా, తేజోమయంగా దివ్యచైతన్యం పనిచేస్తుంటే మనస్సు దాన్ని ఏ విధంగా విమర్శించగలదు? తన అస్తవ్యస్త విధానాలతో పరిమితమైన స్వల్ప జ్ఞానంతో కొలిచి భగవంతుని అంచనా వేయగలదా? ఆత్మ, మనస్సు రెండూ ఒకటి కాదు కాబట్టి భగవంతునితో శాశ్వతమైన అనుబంధం కావలనుకునే యోగులు ఆత్మచైతన్యంలోనే ప్రవేశించాలి. మనస్సును తన పరిమితులను గుర్తించి, ప్రశాంతత చెందాలని, కోరికలను పరిత్యజించాలని, తన క్రీనీడను నమ్మకుండా దివ్యకాంతికి ఉన్మీలతపొంది, సర్వసమర్పణ చేసుకోవాలని దైవము పట్టుబట్టటంలో ఆశ్చర్యమేముంది?

దివ్యజీవనంలో మనస్సు యొక్క స్థానం: ఇట్లా చెప్పడంలో ఆధ్యాత్మిక జీవితంలో మనస్సుకు స్థానం లేదని కాదు. అది ప్రధాన సాధనం మాత్రం కాదని చెప్తున్నాను. భగవంతునితో సహా అందరూ దానికే ఒదిగిమదిగి ఉండాలనుకునే అధికారి అసలు కానే కాలేదు. మనస్సు తను చేరుకుంటున్న మహాచైతన్యం నుంచి నేర్చుకోవాలేగాని తన ప్రమాణాలను దానిపై రుద్దకూడదు. ఆ వెలుగును తనలో నింపు

కోవాలి. దివ్యసత్యాన్ని గ్రహించేటట్లుగా వికాసం పొంది మానసిక విధులప్రకారం పనిచేయని *ఒక మహాశక్తికి సర్వసమర్పణ చేసుకొని తనలోని మసగవెలుగులను పూర్తిగా తేజోమయం చేసుకోవాలి; దానితో అంతవరకు చూడలేని వాటిని చూడగలుగుతుంది. వినలేని వాటిని వినగలుగుతుంది.* అదివరకు భావనాసామర్థ్యంలేనిచోట సున్నితత్వాన్ని పొందగలదు. గాభరాగా, అనిశ్చితంగా, సమాధానం లేకుండా, అసంతృప్తిగా ఉన్నచోట సంతోషం, సంతృప్తి, నిశ్చితత్వం, ప్రశాంతి పొందగలుగుతుంది.

దివ్యసత్యము, దాని పరివేషములు: ఇదే యోగార్థము, మానవులు దైవాన్వేషణ మొదలుపెట్టినప్పటినుంచి నిరవధికంగా పొందిన అనుభవాలతో ఏర్పడిన స్థితి. ఇది నిజం కాకపోతే యోగానికి అర్థమూ లేదు, అవసరమూ లేదు. ఇది యథార్థమనుకుంటే, ఈ ఉన్నత చైతన్యం ఆవశ్యకతను గుర్తిస్తే ఆధ్యాత్మిక జీవితంలో సంశయం అవసరమా కాదా అని ఆలోచించాలి. సత్యాన్వేషకులు అన్నిటినీ విశ్వసించాలని అనరు కదా! అటువంటి అసంబద్ధ, అసంగత నమ్మకాలు ఆధ్యాత్మిక మార్గానికే వ్యతిరేకం.

దివ్యసత్యము అసురశక్తులు: ఉన్నతజ్ఞానం పొందే వరకు ఆధ్యాత్మికజీవితంలో అత్యంత జాగరూకులై మనస్సు, ప్రాణిక వాంఛలు కల్పించే అసత్యప్రేరణలను గుర్తించి సత్యమార్గాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూండాలి. అసురుల కపటాలను, దైవసత్యాలను వేరుచేయగల శక్తియుక్తులే యోగాభ్యాసానికి ప్రధానమైన ఆవశ్యకతలు. దీనికోసం సంశయంతో చేసే వ్యతిరేక, వినాశకర విధానాలు ఎన్నుకోవాలా లేక సంవర్థకమైన, సహాయకర, జ్యోతిర్మయ శోధనాశక్తిని వాడుకోవాలా? మొదటివిధానం అసత్యాన్ని కపటాన్ని అంతం చేస్తుంది కాని అదే నిష్పక్షపాత కరవాలంతో సత్యాన్నికూడా పరిహారిస్తుంది. రెండవది స్వతఃసిద్ధమైన అజ్ఞానవిధులననుసరించదు కాబట్టి సత్యాన్ని, అసత్యాన్నికూడా శంకలు, సంశయాలనే ఆయుధాలతో ఒకే విధంగా ఎదుర్కోదు. తారతమ్యం లేకుండా ఒకే పద్ధతిని అన్నిటికీ

వర్తింప చేయాలని, ఆధ్యాత్మిక మార్గంగాని, యోగమార్గంగాని నిర్దేశిం చదు. అందులో చెప్పుతున్నది అంధ విశ్వాసంతో కాకుండా తనలోని ఆత్మజ్యోతికి బద్ధులై, ఆ వెలుగులో ఆత్మజ్ఞానం పొందేవరకు ఆ విశ్వాసంతోనే ఉండాలి.

*

మొక్కవోని విశ్వాసం: సాధకునికుండవలసినది ఆధ్యాత్మిక విషయా లలో విశ్వాసం అజ్ఞానపూరితంగా కాకుండా విజ్ఞానాత్మకంగా ఉండాలి. వెలుగుమీద విశ్వాసం ఉంచుకోవాలిగానీ అంధకారం మీద కాదు. అది కేవలం బాహ్యానికి కనబడే వాటిని నమ్మి అనుస రించదు కాబట్టి దాన్ని గుడ్డినమ్మకం అని విమర్శకులు అంటారు. అంటే అది పైకి కనబడే దాన్ని కాకుండా దానికి మూలమైన సత్యాన్ని ఆసరా చేసుకుంటుంది. నిదర్శనాలు, ప్రమాణాలు కుంటి ఆసరాలను నమ్మదు. దానిదొక అంతర్బుద్ధి. తనను సమర్థించుకొనే అనుభవం కొరకు వేచి యుండుటయే కాక తనే స్వయంగా త్రోవ చూపుతుంది. నాకు స్వయంవైద్యంలో నమ్మకం ఉన్నట్లైతే కొంత కాలానికి నన్ను స్వస్థపరచుకునే మార్గాన్ని నేనే కనుక్కోగలను. పరివ ర్తనలో నాకు నమ్మిక ఉన్నట్లైతే పరివర్తనా ప్రక్రియను వశపరచుకుం టాను. కానీ నేను సంశయాలతో మొదలుపెట్టి సంశయాలతో పయనం కొనసాగిస్తే ఎంత దూరం సాగగలను?

స్వేచ్ఛానువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకట్రామశాస్త్రి


జ్యోతిషము, కర్మ సిద్ధాంతము, విధివిలాసము

శ్రీఅరవిందుల ప్రవచనములు

జాతకాలంటే కొంతమందికి పిచ్చి. మరి కొంతమందికి హేళన. జీవితమంతా జాతకం ప్రకారం, విధి బలీయము అన్నట్లుగా గడిచిపోయినట్లయితే ఇక ఈ జీవితానికి అర్థమేమిటి? మనిషి తెలివితేటలకు అవకాశమే లేదా? ఇక చేయవలసినదేమున్నది? అనే ప్రశ్నలు ఎదురవుతాయి. వీటికితోడు మన శాస్త్రాలు కర్మ సిద్ధాంతమంటూ ఘోషిస్తున్నాయి. అదే నిజమైనట్లయితే, మనిషిజీవితమంతా పూర్వమే నిర్దేశింపబడిన మార్గంలో నర్తించే కీలుబొమ్మ అయినట్లయితే ఈజీవితాన్ని గడపడం అనవసరం. అది రసవంతంగాని, ఆనందదాయకం గాని కానేరదు. ఈ గడ్డుప్రశ్నలకు సమాధానములను ఈ శీర్షికలో చదవండి.

సంపాదకుడు

జ్యోతిశ్శాస్త్రము నిజమా కాదా అన్న విషయం వివాదాస్పదము. జ్యోతిష్కులు చెప్పే విషయాలు కొంతవరకు నిజమౌతాయి. దాన్నిబట్టి జీవితమంతా నక్షత్రాలచే నిర్దేశింపబడుతుంది అని చెప్పటం అతిశయోక్తి అవుతుంది. తారలు జీవితాన్ని శాసించవు. అదివరకే నిర్ణయింపబడిన జీవితాన్ని సూచిస్తాయి అంతే. అవి ఒక పరిభాష, ఒక సంకేతము మాత్రమే గాని మూలశక్తులు కావు. ఆ శక్తులకు వాహకాలు కావచ్చును. ఒక వేళ 'విధి' అనేదిగాని, 'విధునిర్ణేత' గాని వున్నట్లయితే తారలు వాటిని సూచించే సంకేతములు మాత్రమే. దైవము-పురుషాకారము, ఘటన-స్వశక్తి అనే ద్వంద్వములను గురించి జ్యోతిష్కులు చెబుతూనే వుంటారు. విధిని మానవుడు మార్చుకోగలడుట — అంతేకాదు తప్పించుకోగలడు కూడాట. మరియు తారలు జీవితాన్ని కచ్చితంగా నిశ్చయించి జెప్పవు. అటులైనా గావచ్చును ఇటులైనా గావచ్చును అనే ఘటనా ఘటనలను మాత్రమే సూచిస్తాయి.



నక్షత్రములు గాని కర్మగాని మన జీవితమును శాసించును యంత్రము మీద గిరగిరా త్రిప్పినట్లుగా "యంత్రారూఢాని మాయయా" అని నమ్మట మూఢత్వము, వ్యర్థము. అంతకంటే, భగవంతుడే నిన్ను ఎత్తుకొని మోస్తున్నాడు అని అనుకోటమే దివ్యము. అట్లు భావించుట బ్రహ్మానందముతో పరవశించి పోవుటయే!

శ్రీఅరవిందులు

ఉదా: ఒకాయనకి దీర్ఘాయువు లేకపోవచ్చు. అయినప్పటికి తన సంకల్ప బలంవలన ఆవిధి తప్పిపోయి పూర్ణాయుర్దాయం కలగవచ్చు. మరి కొంతమందికి జీవితంలో ఒకవయస్సువరకే జాతకచక్రం చెప్పినట్లుగా జరుగుతుంది. తరువాత అట్లు జరుగదు. సాధారణజీవితం నుంచి ఆధ్యాత్మికజీవితానికి మరలినప్పుడు అటుల జరుగవచ్చు. పూర్తిగా ఆధ్యాత్మికజీవితాన్ని అవలంబించినట్లైతే ఇకముందు జాతకచక్రం వర్తించనే వర్తించదు. లేక జాతకఫలితములు కొంతవరకే నిజం కావచ్చు. తప్పని సరిగా తు.చ తప్పకుండా జరగడం అనే ప్రశ్నే లేదు. దీనినిబట్టి మన జీవితాన్ని నడిపించే శక్తి తారలకంటె బలమైనది మరియొకటి వున్నదనియు, ఆధ్యాత్మికశక్తి ద్వారా తారలప్రభావము తప్పిపోవచ్చుననియు తెలుస్తున్నది. ఏలన నక్షత్రాలప్రభావము, సూచనలు నిమ్నస్తరోత్పన్న ఘటనలకు మాత్రమే పరిమితములు. కేవలం జీవిత సంఘటనలనే కాకుండా మనిషి లక్షణాలను కూడ జాతక చక్రాలు సూచిస్తాయి.

మన జీవితము కర్మబద్ధమనే వాదన ఈ దేశంలో పాతుకు పోయి వున్నది. మన జీవితానికి మనమే బాధ్యులం. మన కర్మలు మనల్ని బంధించి వేస్తాయి. కర్మఫలితాన్ని ఈ జీవితంలోగాని, వచ్చే జీవితంలోగాని అనుభవించి తీరాల్సిందే. అయితే ఈ సిద్ధాంతంలోని ఒక విశేషాన్ని మనం గుర్తించాలి. మనిషి పూర్వకర్మల ఫలితాన్ని ఈ జీవితంలో అనుభవిస్తూ కూడా భావిజీవితానికి బాట వేస్తాడు. ఇదీ భారతీయ కర్మ సిద్ధాంతము యొక్క అసలు రహస్యము. పాశ్చాత్యులు దీనిని అర్థం చేసుకోలేక హేళన చేస్తారు. సంకల్పబలం వలన పూర్వ కర్మల ఫలితమును మార్చవచ్చును పూర్తిగా తుడిచిపెట్టవచ్చు కూడాను. తప్పించుకోలేనిదల్లా ఉత్కాత కర్మ చాలా బలమైనదన్న మాట. కాని అధ్యాత్మికచైతన్యము, ఆధ్యాత్మికజీవితము అట్టి కర్మను కూడ మార్చగలదు, లేక తుడిచిపెట్ట గలదు. దీనికి మూలం దైవమే. మనము విశ్వస్థాయిలో గాని, విశ్వాతీత స్థాయిలోగాని దైవముతో సాంగత్యము నొంది దైవేచ్ఛనే ఆహ్వానించినప్పుడు అది సాధ్యమవుతుంది. పూర్వపు పరిస్థితులలో తను నిర్ణయించిన జీవన సరళిని తానే యిప్పుడు మళ్ళీ మారుస్తుంది. ఇక పూర్వపు కఠిన మార్గములలో నడవనవసరము లేదు. అంతకంటే విశాలమైన రాజమార్గం మీద

విహరించవచ్చు. దీనినిబట్టి కర్మ గాని, జ్యోతిశ్శాస్త్రం గాని మనిషిని కఠినంగా శాసించదని తెలుస్తోంది.

*

ఈ విషయంలో ఎల్లాగైనా అప్రమత్తంగా ఉండాలి. గ్రహ తారలు మనిషి స్వభావాన్ని గానీ ఘటనని గానీ నిర్ణయిస్తాయన్న మూఢనమ్మకం పనికిరాదు. అవి సూచికలు మాత్రమే — కర్మకు పరి కరములై సాంవేదిక, జ్యోతిర్లోక, నాడీశక్తులను మాత్రమే సూచిస్తాయి. అందుచేతనే ఐరోపా రహస్యవేత్తలు (mystics) మానవుని ఇంద్రియ శక్తులను, నాడీస్పందనలను తారకమండల స్తరములన్నారు. నాడీ శక్తిని, ప్రాణికశక్తిని తారకా స్రవంతులన్నారు. ఆ ప్రాణికశక్తియే సూర్యమండలపు నాలుగు మూలలనుంచి, భౌతిక విశ్వంలోంచి మనపై ప్రసారమౌతుంది. కానీ మానవుడు తన ఇంద్రియ స్పందనలకంటే, ప్రాణికభూమికలకంటే కూడా, ప్రాణికశక్తుల కంటే అతీతుడు, అధిక తర శక్తిమంతుడు. మనజాతకం మనచేతుల్లోనే వున్నది. దానిని కల్పిం చింది మనమే. కాబట్టి మనమే, దానిని మార్చగలము కూడాను.

*

లోపలిఅంతరాత్మ కర్మచేతిలో ఒక కీలుబొమ్మ అనగా తన గతకర్మల యొక్క బానిస — అని అనుకొనజాలము. సత్యమింతకంటె తక్కువ కఠోరము, ఎక్కువ నమనీయము గావలెను. గత కర్మఫలిత ముల ఒక భాగము ఈ జన్మలో రూపము దాల్చియున్నచో, అది ఆంతర పురుషని అనుమతితోనే జరిగి యుండవలెను. కారణము, తన పార్థివ అనుభవముయొక్క ఈ నూతన నిర్మాణముపై అది అధ్యక్షత వహించును. మఱియు నతడు ఒక బహిర్ముఖ నిర్బంధ ప్రక్రియకు మాత్రమే గాక, ఒక రహస్యసంకల్పమునకు, మార్గదర్శనమునకు గూడ తన అంగీకారమును దెల్పును. కాని ఆ రహస్య సంకల్పము యాంత్రి కము కాదు — ఆధ్యాత్మికము. ఆ రహస్య మార్గదర్శనము ఒక పరమ ప్రజ్ఞనుండి వచ్చును. ప్రజ్ఞ యాంత్రిక ప్రక్రియలను తాను ఉపయో గించుకొనునే దాని, వాని అధీనములో యుండదు. స్వీయాభివ్యక్తి, అనుభవములను ఉద్దేశించియే అంతరాత్మ శరీరములోనికి ప్రవేశించు చున్నది. ఇట్టి స్వాభివ్యక్తికి, ఈ జీవనానుభవమునకు ఏదేది

ఆవశ్యకమో, అటులే భవిష్యత్తును సృజించుకొనుటకు ఏదేది సాధ నమో, అది అంతరాత్మచేత రూపొందించబడును. ఈ ఆవశ్యక సామగ్రి గతజన్మల స్వయంప్రవృత్త ఫలితముగా రావచ్చును, లేక గతకర్మఫల ముల ఒక స్వతంత్ర ఎంపికగాను, ఒక జీవనసాతత్యముగాను సమ కూడవచ్చును, లేక నూతనపరిణామముగా లభించవచ్చును. ఏలన పునర్జన్మయందలి వ్యూహము నియమమును యంత్రవత్తుగా నిర్వహిం చుట గాదు. దేనిచేత ప్రకృతి చివరకు అజ్ఞానమునుండి వెలువడి, వృద్ధి గాంచగల్గునో, వైశ్వ అనుభవము ద్వారా అట్టిప్రకృతి వికాస సాధనయే కనుక ఈవికాసానికి రెండుతత్త్వము లుండవలెను — 1. ఉపకరణరూపమున కర్మ, 2. మనః ప్రాణ శరీరముల ద్వారా పని సేయుచు, ఆ కర్మ నుపయోగించుకొను లోపలి రహస్య చేతనా సంకల్ప ములు. విధి, కేవలము యాంత్రికమైనను, లేక మనచేత సృజించబడిన, మనము స్వయముగా నిర్మించుకొనిన ఒక బంధనమైనను, జీవనము యొక్క ఒక అంశము మాత్రమే. సత్తు, దాని చేతన, దాని సంకల్పము ఇంకను ఎక్కువ ముఖ్యమగు అంశములు. జీవన పరిస్థితులన్నియు కర్మయే, అవి పూర్వనిర్ధారితములు, లేక గ్రహగమనములనందు సూచి తములు — అని భారతీయ జ్యోతిష శాస్త్రము ఒక వైపున తలంచు చునే, రెండవ వైపున ఆ పరిస్థితుల మార్పునకవకాశ మిచ్చును. సత్తుయొక్క ఊర్జము మఱియు శక్తి (force) ఆ పూర్వ నిర్ధారితముల ఒక అంశమును మార్చవచ్చును. అధికాంశమును, లేక ఉత్కట ప్రారబ్ధ మును విడిచి, తక్కిన సర్వమును సైతము కొట్టివేయ వచ్చును అని చెప్పును. ఇదియే ఈ భిన్నదృక్పథముల సహేతుక వర్ణనము. కాని, భవితవ్యము (destiny) సరళము కాదు, అది జటిలము — అనే వాస్తవ మును మనమిాజాబితాకు చేర్చవలెను. ఏలన, మన భౌతిక సత్తను బంధించు భవితవ్యము ఒక అధికతర నియమము అడ్డుపడనంత వఱకు లేక అడ్డుపడనిమేరకు మాత్రమే దానిని బంధించును. క్రియ మన భౌతికభాగమునకు జెందును, అది మన సత్తుయొక్క భౌతిక పరిణామము; కాని మన ఉత్తల భౌతికము వెనుక ఒక విముక్తతర ప్రాణశక్తి, ఒక విముక్తతర మనః శక్తి గలవు, ఆ శక్తుల సామర్థ్యమున కంతులేదు. అవి మఱియొక భవితవ్యమును సృజించి, దానితో

ప్రాథమిక ప్రణాళికను మార్చగలవు. పోతే అంతరాత్మ, ఆత్మ ఆవిర్భ వించి నపుడు, అనగా మనము సచేతనముగా ఆధ్యాత్మికజీవులమై నపుడు, ఆ మార్పు మనభౌతికవిధిని తుడిచివేయగలదు, లేక ఆదర్శ రూపమున నిర్మింపగలదు.

తు. చ. తప్పకుండా జాతకం చెప్పే వాళ్ళెవరైనా వుంటారేమో నాకు తెలియదు. సాధారణంగా వాళ్లు చెప్పేవి కొన్ని అక్షరాలా నిజ మౌతాయి. కొన్ని పాక్షికంగా నిజమౌతాయి. మరికొన్ని పూర్తిగా తల్ల క్రిందులౌతాయి. అయితే దీన్ని బట్టి మనం జ్యోతిశ్శాస్త్రమే వూళక్కి అని అనలేము. అక్షరాలా నిజమైనప్పుడు దైవికమనో, అదృష్టమనో, కాకతాళీయమనో కొట్టి పారవేయనూ లేము.

స్వేచ్ఛానువాదం: కె. రామారావు, చెలసాని నాగేశ్వరరావు
(దివ్యజీవనం) నుండి.

శ్రీఅరవిందుని దృష్టిలో జ్యోతిశ్శాస్త్రం*

జ్యోతిశ్శాస్త్రం గురించి మనలో చాలమందికి ఎంతటి విశ్వాసం ఉన్నదో చాలా ఎక్కువమందికి దానిపై అపనమ్మకం ఉంది; ఇది యీనాటి స్థితి మాత్రమే కాదు, తరతరాలుగా ఉన్న, కొన సాగిస్తున్న ఒక విచిత్రస్థితి అనాలి. ఐరోపా సమాజపు వైజ్ఞానిక, తార్కిక, హేతువాదం భారతీయ మేధపై ముద్రించిన ఒకానొక తిరస్కా రభావ గ్రహణచ్ఛాయ. ఇది ఇప్పటికీ వైదొలగలేదు. తంజావూరుకు చెందిన యన్. పి. సుబ్రహ్మణ్యా అయ్యర్ "కాల ప్రకాశిక" అనే తన గ్రంథంలో జ్యోతిశ్శాస్త్రము వెలుగు నీడల్ని చక్కగా విశ్లేషించారు. మానవ జీవితపు అన్ని క్రియాకలాపాలపై జ్యోతిర్విజ్ఞానము ఆధిప త్యాన్ని అంటే గ్రహతారకల ప్రభావాన్ని యీ గ్రంథం పరిశీలిస్తుంది.

---

* పుస్తక సమీక్ష: Kalaprakasika: the standard book on the Election System by N.P. Subramania Iyer, Tanjore.

ఈ గ్రంథంలోని జ్యోతిశ్శాస్త్ర విషయాలన్నీ సామాన్యుడికి అర్థం అయే సరళ భాషలో ఉన్నాయి. అంతేకాక ఈ గ్రంథపు పీఠిక ఒక అద్భుతం. భారతీయ వేదాంత పరిభాష ప్రకారం గ్రహాలు, తారకలు మనిషి ఉని కిపై, మనసుపై ప్రసరిస్తున్న ప్రభావాన్ని ఈ పీఠిక చక్కగా వివరిం చింది. ఇది ప్రతివారు చదివి తీరవలసిన అంశం. ఇంత చక్కగా యీ అంశాన్ని మరెక్కడ, మరెవరూ వ్రాసినట్లు నాకు తెలియదు. ఆ సంగతులు అలా ఉంచి జ్యోతిశ్శాస్త్రం గురించి సమాజంలో ఉన్న దృక్పథాన్ని చూద్దాం.

జ్యోతిషం ఒక క్షుద్రవిద్య అని, మార్మికవిద్య అని భావించి విశ్వసించే వారున్నారు. అలా కాక ఇది ఒక శాస్త్రమే కాదని గట్టిగా కొట్టిపారవేసే ఆధునిక మేధావులున్నారు. వీరిలో ఎవ్వరూ హేతు దృష్టితో తమ అభిప్రాయాల్ని పుష్టివంతంగా రుజువు చేయలేరు. అయినా ఈ శాస్త్రానికి తనదైన మార్మికత ఉంది, తనదైన క్రమపద్ధతి ఉంది, కొన్ని నియమాలు, సూత్రాలు ఉన్నాయి. వీటి ద్వారా ఇది తన పరిశీలనకు వచ్చిన అంశాన్ని ధ్రువపరచగలదు లేదా కొట్టి పారవేయ గలదు. ఇతర వైజ్ఞానిక శాస్త్రాల వలెనే జ్యోతిషం కూడ ప్రయోగ వేదికపై నిగ్గుదేలగలదు.

దీనికి ఆధారం గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం అని గుర్తించాలి. అంచేత దీనిని ఏ విధంగాను ఏదో తాంత్రికవిద్య అనుకోరాదు. దీని రహస్యాలు, మర్మాలు ఏవీ దాగి లేవు.

అన్ని విజ్ఞానశాస్త్రాల వలెనే ఇది కూడా దేనినీ కూడా ఇలా ఎందుకు ఉందో అని చెప్పదుకాని కార్యకలాపాలు ఎలా ఉన్నాయో వివరిస్తుంది. మిగిలిన శాస్త్రాలు గూఢ కారణాలు ఎందుకు ఉన్నాయో చెప్పవుకాని ఎలా ఉన్నాయో చెప్పగలవు. కనుక ఇది ఒక 'సైన్సు'గా భావించబడింది. అయితే మానవ హేతువాదం ఒక దశలో జ్యోతి షాన్ని ఒక క్షుద్రవిద్యగా నిరసించిన సందర్భాలు లేకపోలేదు. ఆ దశలో ఈ అపురూప శాస్త్రాన్ని ఒక ఉన్మాదంగా భావించిన వారు న్నారు. ఎవరు ఎన్నిరకాలుగా దీనిని పాతర వేయాలని ప్రయత్నించి నప్పటికీ నవీనవిజ్ఞానం యిచ్చిన తిమ్మిరభావాలు దీనిని నాశనం చేయలేకపోయాయి. ఐరోపాలో యిది పునరుజ్జీవించింది. జ్యోతిషాన్ని

ప్రాక్టీసు చేయడం చట్టరీత్యా శిక్షార్హమని అక్కడ శాసనాలున్నప్పటికీ అది చావలేదు. భారతదేశంలో ఇది చిరంజీవిగా మనుగడ సాగిస్తోంది. భారతదేశంలో విద్యావంతులు జ్యోతిషం పట్ల తమ నమ్మకాన్ని బాహాటంగా ప్రకటించరు. అలా అని దాని పట్ల తమ విశ్వాసాన్ని వదులుకోరు. ఇదే విచిత్రం. ఐరోపా సమాజం ఇందుకు భిన్నం కానేకాదు. ఈ ద్వంద్వ ప్రవృత్తిని మార్చాలి, సవరించాలి.

జ్యోతిషాన్ని పూర్తి విజ్ఞానశాస్త్రంగా పరిగణించి దానిలోని లోటుపాట్లని సవరించాలి, దోషాల్ని ఎత్తిచూపాలి, లోపభూయిష్టమైన వాటిని పరిహరించాలి. లేదా ఇది ఒక కుహనాశాస్త్రం అని అయినా రుజువుచేసి వదలివేయాలి. అలా కాక సగం నమ్మకం మిగిలిన సగం అపనమ్మకంతో ఈ జ్యోతిషాన్ని చూడడం విడ్డూరం.

నిజానికి జ్యోతిషాన్ని ఎన్నడూ "ఎవ్వరూ వైజ్ఞానికంగా తప్పు" అని రుజువు చేయలేదు. అలా అని "యిది కుహనా సైన్సు" అని హేతుబద్ధంగా ఎవ్వరూ నిగ్గు దేల్చలేదు. కానీ ఒక దశలో దీనిని చిన్నతనపు మూఢనమ్మకంగా పరిగణించడం జరిగింది. చాలామంది జ్యోతిశ్శాస్త్రవేత్తల జోస్యాలు తప్పుకావడం, మనిషి జీవితంపై, లక్షణాలపై, ఆలోచనలపై అల్లంత దూరంలోని గ్రహతారకల ప్రభావం ఏదీ వుండదని విశ్వసించడం వలన జ్యోతిశ్శాస్త్రం తిరస్కార భావానికి గురి అయింది. అయితే ఈ వాదన సరిపోదు. నేటి వైద్యుల వలన వైద్య శాస్త్రాన్ని మనం కాదనగలమా? అలాగే కొన్ని జోస్యాలయినా నిజాలుగా అనుభవాలలోకి వచ్చాయి, వస్తున్నాయి కదా! వాటిని ఏమంటాం? అత్యద్భుత ఆరోగ్య ఫలితాల్ని చికిత్సా విజయాల్ని ప్రసాదించిన వైద్య శాస్త్రానికి కుహనా వైద్యుల వలన కొంత నష్టం కలిగినప్పటికి అది ఒక శాస్త్రం కాదా! దాన్ని కాదనగలమా? జ్యోతిర్విజ్ఞానానికి కూడా ఈ సూత్రమే వర్తిస్తుంది, వర్తింప జేసుకోవాలి. చికిత్స విఫలమవవచ్చు, అలాగే జోస్యం ఫలించక పోవచ్చు. అంత మాత్రాన వైద్యశాస్త్రాన్ని తిరస్కరించలేము. వైద్యుల వైఫల్యాన్ని వైద్య శాస్త్రానికి ఆపాదించవచ్చునా? జ్యోతిష్కుని తప్పిదాన్ని జ్యోతిశ్శాస్త్రానికి అంటకట్టవచ్చునా? మన సమాజంలో నేటి వైద్యుల వలెనే మిడిమిడి జ్ఞానపు జ్యోతిష్కులున్నారు. వారు లెక్కలు సరిగా కట్టలేరు.

గ్రహగతుల్ని కచ్చితంగా అంచనా వేయలేరు. అటువంటి వారు చెప్పే జోస్యాలు ఫలించవు. ఫలిస్తాయని ఆశించడం తప్పు. అలాగే వారి తప్పుడు అంచనాలకు జ్యోతిశ్శాస్త్రాన్ని నిందించడం తగదు. జ్యోతిషం చెప్పించుకొన్నవారు కూడా జనన సమయం, జనన ప్రదేశం గురించి స్పష్టమైన సమాచారాన్ని యివ్వరు. అటువంటప్పుడు జ్యోతిషం చెప్పే ఫలితాలు వేరుగా, వారి జీవితంలోని సంఘటనలు వేరుగా ఉండడం జ్యోతిశ్శాస్త్రం తప్పా? ఆలోచించండి. సమర్థులైన జ్యోతిష్పండితులు కూడా తప్పులెక్కలు వేసే అవకాశం లేకపోలేదు. అటువంటి వారు అనుసరిస్తున్న పద్ధతిలో తప్పు ఉందని గ్రహించాలి. ఒక శాస్త్రం పెరుగుతున్న కొలదీ, విస్తృతం అవుతున్నకొలదీ, కొన్ని లోపాలు చోటు చేసుకొనవచ్చు. వైద్యశాస్త్రంలో ఈ అంశాన్ని మనం స్పష్టంగా గమనించగలం. ఔషధాలు, వాటి ప్రయోగం, రోగనివారణలో యిటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉంది. జ్యోతిశ్శాస్త్రంలో కూడా పండితులు తప్పటడుగులు వేయవచ్చు. అటువంటప్పుడు ఫలితాలు తారుమారవుతూంటాయి. అనుభవాలలోంచి అటువంటి సూత్రాల్ని తీసివేసే దూర దృష్టిని అలవర్చుకోవాలి.

వనౌషధులు, ఖనిజాలు, లోహాలు, యితర రసాయన పదార్థాలు మనిషి శరీరంపై ఎట్లు పనిచేస్తాయి? రోగాల్ని అవి ఏ విధంగా నివారించ గలుగుతున్నాయి? ఏ పదార్థం ఓ రోగంపై పనిచేస్తుంది? మొదలైన అంశాల్ని వైద్య పరిశోధకులు పరిశీలనల ద్వారా, కొన్ని కేసుల ప్రయోగాల ద్వారా ధ్రువపరిచి "రోగం — మందు" అను ఒక సార్వత్రిక సూత్రాన్ని వైద్యశాస్త్రానికి అందిస్తారు. అలాగే భూమి మీద, యిక్కడ జీవరాశి మీద గ్రహతారల ప్రభావం గురించి అనేక కోణాలలో జ్యోతిశ్శాస్త్రం కూలంకషంగా పరిశీలించి కొన్ని సార్వత్రిక సూత్రాల్ని, కొన్ని ప్రత్యేక సూత్రాల్ని రాబడుతుంది. ఈ విశాల విశ్వంలో సజీవ, నిర్జీవ పదార్థాల మధ్య పటిష్టవంతమైన వైశ్వక సంబంధం ఉన్నప్పుడు గ్రహతారకల ప్రభావం మనిషిపై ఎందుకు ఉండదు? ఒక్కొక్క గ్రహం ఒక్కొక్కరిపై విశేష ప్రభావాన్ని ప్రసరిస్తుంది. ఏ గ్రహం ఎవరిపై ఎంత ప్రభావాన్ని ప్రసరిస్తుందో పరిశీలించి, రుజువులు చూపి సూత్రబద్ధం చేసిన శాస్త్రం జ్యోతిషం. ఇప్పుడు

చెప్పండి జ్యోతిషం శాస్త్రం అవునా? కాదా? మనిషి మనసుకీ, గ్రహ తారకల గతులకీ ఉన్న అవినాభావ ప్రభావ సంబంధాన్ని జ్యోతిష శాస్త్రం స్పష్టంగా చెప్తుంది; అది మన శరీరాన్నే కాక, భౌతికంగా మన ఉనికిని ప్రభావితం చేస్తుందని జ్యోతిర్విజ్ఞానం చెప్తుంది. ద్రవ్యరాశి, మనస్సు వేరువేరై ఒకదాని నొకటి పరస్పరం ప్రభావితం చేసుకొన నప్పుడు ఫలితార్థం అలా ఉండదు. కాని అలా జరగడం లేదు కదా.

ద్రవ్యరాశి ఫలితార్థంగా మనసు ఏర్పడుతున్నదని, దాని స్థితిగతుల్ని ద్రవ్యరాశి ప్రభావితం చేస్తున్నదని ఈనాటి తిరుగులేని భౌతిక హేతువాద జ్ఞానం చెప్తున్నది. ఇదే "తిరుగులేని సత్యం" అని భావించబడుతున్నది. అటువంటప్పుడు గ్రహాలు భూమిమీద మన స్థితిగతుల్ని ప్రభావితం చేస్తాయని అనడంలో సందేహాలు, తీవ్ర అసం తృప్తులు ఎందుకు? అంచేత ద్రవ్యరాశి, మనసు ఒకదాని నొకటి ప్రభా వితం చేసుకొని, స్థితిగతుల్ని నిర్ధారిస్తున్నాయనడం గొప్ప తార్కిక హేతువాదం అనక తప్పదు. వైశ్విక మనస్సు, ద్రవ్యరాశి, వైయక్తిక మనస్సును, ద్రవ్యరాశిని ప్రభావితం చేస్తున్నాయన్న ఈ సూత్రాన్నే గ్రహగతులకు, మన స్థితి చలనాలకు అన్వయించు కొనవచ్చునని భావించడంలో తప్పులేదు. జ్యోతిశాస్త్రం చేస్తున్నదదే.

ఈ ప్రభావాలు మన జీవిత సర్వస్వాన్ని నిర్ధారిస్తాయని ఈ క్రమంలో 'కాలం' కీలకమైనదని జ్యోతిషం నిర్ద్వంద్వంగా ప్రకటిస్తు న్నదీ అంటే 'కాలం' ఇక్కడ ప్రధాన భూమిక వహిస్తున్నదన్న మాట. మనిషి జీవితంపై, జీవిత ఘటనలపై కాలం ప్రభావం యిక్కడ కీలక ప్రశ్నగా మారుతుంది. జనన కాలంలో ఉన్న గ్రహాల స్థితిగతులు మన భవిష్యత్తు అంతటినీ, రానున్న సంఘటనల్ని ప్రభావితం చేస్తాయి. ఆ సమయంలో సూర్యాదిగ్రహాలు, నక్షత్రాలున్న స్థితిగతులు ఎంత మేరకు భవిష్యద్ఘటనల్ని ప్రభావితం చేస్తాయి? లేక నిర్ధారి స్తాయి? కాలాంతరంలో వీటి స్థితిగతులు మన ఉనికిని, బ్రతుకులోని సంఘటనల్ని ఎలా తీసుకు వెళ్తాయి? ఎలా నిర్ధారిస్తాయి? అంచేత యివే మన భవిష్య నిర్దేశనలు అని భావించవచ్చును. వీటి చలన చాలనలను బట్టి మన భవిష్యత్తును గుర్తించగలమా? ఈ ప్రశ్నలతోనే జ్యోతిశ్శాస్త్రం ముందుకు చూస్తుంది; పరిశీలిస్తుంది. గడిచిన అనుభవా

లలోంచి వర్తమాన సంఘటనల్ని బేరీజు వేసి భవిష్యత్తును వూహించటం ఈ శాస్త్రం చేసే పని. అంచేత దీనిని "కుర్రతనపు మూఢ నమ్మకం" అనడం సబబు కానే కాదు. ఈ శాస్త్రం కార్యకారణాన్ని బేరీజు వేస్తుంది. అది గణిత శాస్త్రంపై ఆధారపడినది. ఖగోళ విజ్ఞానంపై ఆధారపడినది. గ్రహగతుల ప్రభావం ఖగోళంపై ప్రసరించదు అనడానికి రుజువులు లేవు. ఎందుకంటే ఖగోళవిజ్ఞానం ప్రాయికంగా భౌతిక విజ్ఞాన శాస్త్రం. అంచేత యిది ఇచ్చే సత్యాలన్నీ ఖగోళ శాస్త్ర సంబంధమైనవే. మనో-భౌతిక క్షేత్రంలో యిదే నియమం వర్తిస్తుంది. ఖగోళ గణితాన్ని మనోక్షేత్రానికి వర్తింప జేసే సత్య సూత్రమే జ్యోతిష శాస్త్రం.

అయినా జ్యోతిష శాస్త్రం ఆ సత్యత్వాన్ని కచ్చితంగా పరిశీలించే అవకాశం ఉందా — అనేది మనముందున్న సమస్య. వ్యక్తుల అనుభావాలే దీనికి ఆధారాలవుతున్నాయి. ఇవి ఎక్కువ అసంతృప్తిని కలిగించే ప్రాతిపదికలుగా ఉన్నాయి. కాని వ్యక్తుల అనుభవాల్ని క్రోడీకరించి, గ్రంథస్థం చేసి ముద్రిస్తే జ్యోతిష శాస్త్రానికి అంతకన్న దోహదం మరొకటి ఉండబోదు. జ్యోతిష్యపు సత్యత్వాన్ని యింతకన్నా వేరేదేది పటిష్టవంతంగా ధ్రువపరచజాలదు. నాకు కలిగిన అనుభవాన్ని వెల్లడిస్తాను. ఇది జ్యోతిష విశ్వాసానికి చెందినది. ఇటువంటి అనుభవాలే చాలామందికి ఉండవచ్చు.

ఒక భారతీయ జ్యోతిష్కునితో నాకున్న పరిచయం అంత ప్రోత్సాహకరంగా లేదు. నేను కలుసుకొన్న వారిలో ఆయన అద్భుతమైన ఆలోచనల చదువరి (థాట్ రీడర్). పైకి చెప్పకుండా మనస్సులోనే నీ ప్రశ్న గురించి ఆలోచించుకొనమని ఆయన నాకు చెప్పారు. చాలా తక్కువ సమయంలో ఆయన ఒక ప్రశ్న గురించి వెల్లడించారు. మిగిలిన రెండు ప్రశ్నలను ఆయన సరిగా వెల్లడించ లేకపోయారు. ఇదంతా ఏదో గణితం వేసి తాను చెప్పినట్లు ఆయన ప్రవర్తించారు. ఇదంతా ఒక ప్రచారకాండ వలె తోచింది. ఆయన జ్యోతిష శాస్త్రాన్నే కాక ఆలోచనల్ని చదవడం ద్వారా యీ పని చేస్తున్నారని అనిపించింది. నా మనసులోని ఆశల్ని, ఆలోచనల్ని ఆయన ప్రతిబింబించారు. అది జ్యోతిష శాస్త్రం ద్వారా మాత్రం కాదని నాకు తెలుసు. ఆయన చెప్పినది సత్యానికి వందమైళ్ళ సమీపంలోనైనా లేదు.

మరి కొందరు జ్యోతిషాన్ని పొగడ్తలతో ఆకట్టుకుంటారు తప్ప శాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినవారు కారు. వచ్చిన మనిషి మాటలను బట్టి వారి అవసరాల్ని పసికట్టి జ్యోతిషం చెప్పి ఉబ్బవేసే వారేకాని జ్యోతిషం లెక్కల ప్రకారం భవిష్యత్తును చెప్పేవారు చాలా తక్కువమంది ఉన్నారు.

కాగా మరికొందరు సమర్థవంతులు ఉన్నారు. వారు మనం వూహించలేనంత కచ్చితంగా జ్యోతిషం చెప్పగలరు. వారి భవిష్య వాణిని ఏ విజ్ఞానశాస్త్ర ఉపకరణము తిరస్కరించ లేదు. అంత కచ్చి తంగా వారు చెప్పగలరు. నా స్నేహితుడి తండ్రి అటువంటి మంచి జ్యోతిషవేత్త. ఆయన తన మరణం గురించి సంవత్సరం, నెల, రోజు, గంటల నిమిషాలతో సహా స్పష్టంగా వూహించారు. అయితే నా జనన కాలం సరిగా తెలీనందున నా గురించిన జ్యోతిషం కొంచెం తారు మారయింది. కానీ కొన్ని ఫలితార్థాలు మాత్రం అసాధారణంగా నిజమైనాయి. రెండు ఉదాహరణలనిస్తాను. అవి నా ప్రజాజీవితానికి చెందినవి.

ఒకటి నేను రాజకీయ జీవితంలోకి ప్రవేశించకముందు నాటిది. అప్పటికి నా గురించి జ్యోతిషవేత్తకు పూర్తిగా తెలియదు.

భారతీయేతరులైన శక్తిమంతులతో నేను రాజకీయ పోరాటం జరుపుతానని, నా జీవితం భయగ్రస్తం అవుతుందని ఆయన జోస్యం చెప్పాడు. ఆ తర్వాత నేను వందేమాతరం కేసులో ప్రాసిక్యూట్ చేయ బడినపుడు ఆయన చెప్పిన జోస్యం రెండవది. మూడుసార్లు క్రిమినల్ ప్రాసిక్యూషన్ జరుగుతుందని, అవి తప్పిపోతాయని ఆయన చెప్పాడు. అందుకు తగిన జ్యోతిశ్శాస్త్ర శ్లోకాల్ని, గ్రహగతుల్ని వివరించే ఆధా రాల్ని చూపాడు. మరొక జ్యోతిష్కుడు అప్పటి వరకు నాలో అంకు రించని ఒక రుగ్మత గురించి జోస్యం చెప్పాడు. కాలాంతరంలో ఆ రుగ్మత అంకురించింది.

నాకు వేదాంతం, యోగ శాస్త్రం, తాత్వికత గురించి ఏ ఆలో చనా లేని సమయంలో మరొక కాలాంతకుడు "భవిష్యత్తులో నీ జీవితం వేరే మలుపు తిరుగుతుంది. నీవు ఆధ్యాత్మికత, యోగశాస్త్ర సాధన వైపుకు మరలుతావు" అని కచ్చితంగా జోస్యం చెప్పాడు.

అప్పటికి నాకలాంటి అభిప్రాయం లేదు. అలాంటి అవకాశం ఉన్న జాడలే లేవు. ఎన్నో నిజమైన జోస్యాలలో ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. జ్యోతిషంలో సత్యలేశం ఉన్నదనడానికి యిలాంటి ఎన్నో అనుభవాల్ని, ఉదాహరణల్ని యివ్వవచ్చు. జ్యోతిషం ఒక "సత్య శాస్త్రం" అనడానికి ఇంతకన్నా ఆధారమేం కావాలి?

జ్యోతిష శాస్త్రాన్ని వ్యతిరేకిస్తున్న మేధావుల్ని, సామాన్య ప్రజల్ని సమాధానపరచటం మొదటి కర్తవ్యం. ఇందుకై దీనిని ఒక శాస్త్రంగా గుర్తింప చేయగలగాలి. అందుకు తగిన అనుభవపూర్వక ఆధారాల్ని క్రోడీకరించాలి. సుబ్రహ్మణ్య అయ్యర్ తన "కాలప్రకాశిక" గ్రంథం ద్వారా చేస్తున్నదదే. అలాగే జ్యోతిశ్శాస్త్రం చేసిన భవిష్య ప్రకటనలు ఎంత మేరకు నిజాలు అయ్యాయో సర్వేలకు తెలియ జేయడం రెండవ కర్తవ్యం. అప్పుడు మాత్రమే జ్యోతిషం ఒక శాస్త్రంగా, ఒక తత్త్వంగా పరిఢవిల్లగలుగుతుంది. ఈ బాధ్యతల్ని భవిష్యత్తు వారికి వదలి వేస్తున్నాను.

ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని అందరు గుర్తించాలి. జ్యోతిషం నిజం అయినప్పుడు అంతా విధి, కర్మ అని నిస్సహాయంగా ఉండిపోరాదు. మనం ఏం చేయనక్కరలేదు, అంతా విధిలిఖితం అని అకర్మణ్యతకు గురికారాదు. మనిషి మనోబలంతో, ప్రయత్నంతో కృషి చేసి విధిలిఖితాన్ని సవరించుకొనే అవకాశాన్ని భారతీయ సిద్ధాంతం యిచ్చింది. గడిచిన కర్మల నిర్ణయశక్తి విధి అయితే ప్రస్తుత కర్మల ద్వారా, సంకల్పబలం ద్వారా దానిని రద్దు చేసుకొనే అవకాశం ఉండనే ఉంది. అచంచల సంకల్పబలం, రాజీలేని కర్మణ్యతను మించిన విజయపథం లేనే లేదు. ఆధ్యాత్మిక చైతన్యంలోకి ప్రవేశించిన వారు విధిలిఖితాన్ని చెరిపివేయగలరు. భౌతికప్రపంచ బంధాలలో ఉన్నంతకాలం మనిషి జాతకచక్రపు బందీ అయివుంటాడు. ఈ పాంచ భౌతిక బంధనాల్ని అతిక్రమించి ఆధ్యాత్మిక చైతన్య స్వేచ్ఛా ప్రపంచంలోకి ప్రవేశించిన వారికి గతకాలపు విధినిర్ణయాలు వర్తించవు.

స్వేచ్ఛానువాదం: పురాణపండ రంగనాథ (రచయిత, జర్నలిస్టు)

ఆరోగ్యంగా ఉండాలంటే

బాధలను, కష్టములను కోరితెచ్చుకొనుట క్షేమకరం కాదు. అటుల చేయరాదు. అయితే వాటిని లెక్కచేయకుండా, వాటిమూలాన్ని వాటిని వదిలేసి వినోదిస్తూ కాలయాపన చేయటంకూడా పిరికితనమే అవుతుంది. అసలు మనకు కష్టాలు ఎందుకు వస్తాయి? మనకి ఏవో పాఠాలు నేర్పేందుకే వస్తాయి. ఆ పాఠాలని మనమెంత తొందరగా నేర్చుకుంటే అంత తొందరగా ఆ కష్టాలు తీరిపోతాయి. బాధ వుపశమిస్తుంది. మనమీ రహస్యాన్ని తెలుసుకున్నప్పుడు మనకింక ఏ బాధా కలగదు. ఎందుకంటే ఆ మర్మమును తెలుసుకోవటం వలన, దాని మూలకారణం ఏమిటో తెలిసిపోతుంది. ఇక దాని కతీతంగా ఉండగలం.

మరి ఆ రహస్యమేమిటో? నీ అహంకార కారాగారము నుండి బయటపడుట; దైవంతో సమైక్యమై, ఆయనలో కరిగిపోవుట; ఆయన నుండి మనను వేరుచేయు దానిని దేనినీ సహించకుండా వుండుట. ఆ రహస్యమును పట్టుకొని, దానిని నీలో క్రియాశీలము కావించినప్పుడు ఇక బాధ యొక్క అవుసరమే వుండదు. దాని కాలము తీరిపోయినట్లే! అది యిక తొలగిపోతుంది. ఆ 'మంత్రము' యొక్క సామర్థ్యమునకు అంతులేదు. అది కేవలం నీ ఆత్మకు, నీ ఆధ్యాత్మిక చేతనకు, అంతరంగికమునకే కాక, నీ జీవితమునకు, శరీరమునకు సహితము చాలా సమర్థవంతంగా పనిచేస్తుంది.

ఆ మర్మమును నీవు పట్టుకొని ఆచరణలో పెట్టినప్పుడు ఎట్టి వ్యాధులు నీ జోలికి రావు. నీ ఆత్మ, మనస్సు, చేతనా విభాగములలోనే కాకుండా నీ శరీరకణములలో కూడా అది పనిచేయుట తిరుగులేని సత్యము.

నీ శరీరకణములు శక్తిసంపన్నమైన 'డైనమోలు'. ఈ విషయమును ఆ కణములకు అర్థమయేటట్లు బోధించినట్లయితే, వాటి ఉనికికి, సత్వమునకు మూలమైన సత్యమును వాటికి చూపించినట్లయితే, అవి కూడా ఆ అఖండమైన ఏకత్వమునే భజిస్తాయి. అపుడిక వ్యాధు

లకు మూలకారణమైన భౌతికహేతువు మాయమై పోయినప్పుడు నిన్నే విధమైన రోగములు అంటజాలవు.

కాని అందులకు నీవు పిరికితనమును, భయమును నీలో నుంచి బహిష్కరించవలెను. అనారోగ్యము కలిగినప్పుడు ఏ మాత్రము భయపడకూడదు. దానినుండి దూరంగా పారిపోనూకూడదు. ధైర్య సాహసాలతోను, నమ్మకంతోను, శాంతితోను దానిని ఎదుర్కోవాలి. వ్యాధులు అసత్యము అని ఎరిగి, దైవంపై భారము మోపి, ప్రశాంతంగా వుండి ఆయన కారుణ్యమునకు ఉన్ముఖం కావాలి. అప్పుడు ఆ భగవత్కృప నీ కణములలోకికూడా ప్రవేశించి, అక్కడ నిలుస్తుంది. నీ కణములు సత్యానందములతో పొంగిపోతూ వుంటాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహశాస్త్రి

శ్రీఅరవిందుల సంభాషణల నుండి

8 June 1926

శిష్యుడు: మానవ జీవితము నక్షత్రములచే నిర్ణయింపబడుతుంది అంటారు. ఈ మాట సంకేత పరమైనదా లేక నిజమేనా?

శ్రీఅరవిందులు: మానవ జీవితాన్ని నక్షత్రాలే శాసిస్తాయి అన్న మాట పూర్తిగా నిజము కాదు. మానవ జీవితాన్ని ప్రభవింపజేసే శక్తులు కొన్ని ఉన్నాయి. నక్షత్రాలు ఈ శక్తులకు, ముఖ్యంగా ప్రాణిక భౌతిక శక్తులకు సంకేతములు. ఈ శాస్త్రానికి మూలమైన ఆధారాలను బహుశః చాల్డియా దేశపు మర్మజ్ఞులు కనిపెట్టి వుంటారు. నేటి కాలానికి కేవలం వారి సాంప్రదాయాలు మాత్రమే మిగిలి వున్నాయి. జ్యోతిషము ఇంకను ఒక నిర్దిష్టమైన శాస్త్రము కాదు. కేవలం మనిషి తెలివితేటల మీద ఆధారపడినదీ కాదు. నక్షత్ర గతులను నిర్దేశించే శక్తులు కొన్ని కలవు. అట్టి శక్తులు మాత్రమే భవిష్య జీవితమును గురించి దీటైన జ్ఞానమును యివ్వగలవు. ఆ శక్తులను ఎరిగిన మనిషి మాత్రమే సరియైన జోస్యం చెప్పగలడు. అయితే మనిషికి బాహ్యా జీవితం కంటే అంతర్జీవితమే ముఖ్యము. దాని మీద నక్షత్రాల ప్రభావము ఏమాత్రము వుండదు.

శ్రీఅరవిందో సొసైటీకి ఇచ్చే విరాళములకు ఆదాయపు పన్ను నుండి మినహాయింపు గలదు: **under section 80 G, upto assessment year 2004-05, as per D.I.T(E) Calcutta Order No. 1060/8E/7/61-62 dated 24-03-99.**

August-September 1999 Vol. 28, no. 8&9

AKHILA - Akhila Bharat Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72
Registered with the Department of Posts, Pondicherry: No TN/PY/92
Licensed to post at the concessional rate of postage: No. L2/555-92,
at Sri Aurobindo Ashram P.O. on 2nd, 3rd and 4th of every month.

Editor: R.L.N.Sastry

Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Pondicherry - 605001.
Printed by Amiyo Ranjan Ganguli at Sri Aurobindo Ashram Press,
38 Goubert Avenue, Pondicherry - 605001.

Single copy: Rs. 12 Annual Subscription: Rs. 60 (in India)

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY, PONDICHERRY - 605002

మనస్సు - మనోమయ పురుషుడు

నిన్ను నీవు తెలుసుకో - IV



అఖిల

అఖిల భారత పత్రిక, అక్టోబరు 1999

మనస్సు — మనోమయపురుషుడు

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందుల ప్రవచనములు

అనుబంధము

ప్రాచీన గాథ

నాకెన్నో పాఠాలు నేర్పిన ఒక పురాతనమైన గాథను ఈ సాయంత్రం మీకు వినిపించబోతున్నాను.

ఒకప్పుడు "జూనూన్" అనే మహాత్ముడుండేవాడు. ఆయన గొప్పవిరాగి. మహాజ్ఞాని. ఎన్నో సంవత్సరాలు గౌరవంగా తెలివిగా జీవించాడు. దీక్షకోసం ఆయనవద్దకు అనేకమంది యువకులు వచ్చి ఆయన కుటీరంలోవుండి, ఆయనను సేవించుకొని జ్ఞానోదయంపొంది తమ వూళ్లకు తిరిగి వెళ్ళేవారు.

"యూసఫ్ హుస్సేన్" అనే చిన్నవాడు ఆయన వద్దకు వచ్చాడు. వివరాలు అడగకుండానే అతనికి అక్కడ ఆశ్రయమిచ్చారు. నాలుగు సంవత్సరాల తర్వాత మొదటిసారి అతన్ని పిలిచి "నీవు ఎందుకు వచ్చినట్లు" అని గురువు అడిగాడు. దీక్షకోసం అన్న అతని జవాబు విన్నవెంటనే అక్కడున్న నౌకరును పిలిచి, "నిన్నొక పెట్టె తయారు చేయమన్నాను, సిద్ధంగా వున్నదా" అని అడిగి, తయారుగా వున్నదని తెలుసుకొని, వెంటనే తీసుకురమ్మని చెప్పాడు ఆ మహాత్ముడు. నౌకరు ఆ పెట్టెను పదిలంగా వారి ఎదుటపెట్టాడు. దానిని యూసఫ్‌కిచ్చి "నీలానది ఒడ్డున నా స్నేహితుడు వసిస్తున్నాడు. దీనిని జాగ్రత్తగా తీసుకొనివెళ్లి ఆయనకు అందజేయి. దార్లో తడబడక శ్రద్ధగా వెళ్లి ఇచ్చిరా. వచ్చాక నీకు దీక్షనిస్తాను", అని ఇంకొకసారికూడా హెచ్చరించి పంపాడు. గురువు పాదపద్మాలకు ప్రణమిల్లి యూసఫ్ బయలుదేరాడు.

మహాత్ముని ఆశ్రమం చాలాదూరంలో వున్నది. ఆ రోజులలో కారులూ, రైళ్ళూ లేవు. యూసఫ్ కాలినడకన పగలంతా నడిచి మధ్యాహ్నం ఎండ తట్టుకోలేక ఒక చెట్టునీడన విశ్రమించాడు. పెట్టె చూస్తే చిన్నది. తాళం లేదు. దానిని అతడు చూడనేలేదు. గురువు పెట్టె తీసుకెళ్ళమంటే వెంటనే బయలుదేరాడు. అంతే.

విశ్రమించేటపుడు మనసు సంచారం మొదలుపెట్టింది. తలలో ఆలోచనలు తిరగడం మొదలు పెట్టినై. పిచ్చి ఆలోచనలు అలాంటపుడు రాకమానవు. మళ్ళీ చూపు పెట్టెమీద పడింది. "చాలా

బాగున్నదీ పెట్టె. తాళం ఎందుకు వేయలేదో. చూస్తే చిన్న పెట్టె లాగుంది. బరువులేదు. ఖాళీగానే వున్నట్లుంది. లేకపోతే ఎందుకు ఇంత తేలికగా వుంటుంది" అని దానివంకే తదేకంగా చూడడం మొదలుపెట్టాడు. పెట్టె తెరుద్దామని చెయ్యిచాచి "అయ్యో! తప్పు. నాకెందుకీ పని? గురువుగారు స్నేహితునికిచ్చి రమ్మన్నారు. అంతే. ఖాళీగావున్నా లేకపోయినా నాకెందుకు, అది నా పనికాదు. ఇతర పనులుమాని గురువు చెప్పినది చెయ్యడమే నా వంతు" అని అనుకొన్నాడు.

కొంతసేపు ఊరికే కూర్చున్నా మనసు ఉండబట్టలేదు. అందంగావున్న పెట్టె ఎదురుగా వుంది. "ఖాళీగానే వున్నట్లుంది. తెరిస్తే ఏమవుతుంది? వట్టిదేగా! తాళంవేసిన దానిని తెరిస్తే తప్పుగానీ తాళం వేయలేదు కాబట్టి పెద్దగా ఏమీ ప్రమాదం వున్నట్లు అనిపించటంలేదు. ఒకసారి తెరిచిచూచి మళ్ళీ మూసేస్తాను" అనుకున్నాడు.

యూసఫ్ ఆలోచనలు పెట్టెచుట్టూ అదే పనిగా తిరుగుతున్నాయి. వదలబుద్ధిగావడంలేదు. అసాధ్యం. "ఒకే క్షణం చూచి వెంటనే మూసేస్తాను", అని చెయ్యి చాచినవాడు మళ్ళీ ఏమనుకొన్నాడో ఆగిపోయి కాసేపు కూర్చున్నాడు. లాభంలేదు. చివరికి మనసును గట్టిచేసుకొని నెమ్మదిగా మూతతీశాడో లేదో గభాలున ఒక చిట్టెలుక బయటకు దూకి కనుమరుగైంది! అలాగ పెట్టెలో చిక్కుపడ్డ ఎలుకపిల్ల కాస్త స్వేచ్ఛరాంగానే గడియకూడా వృథా చేయకుండా తప్పించుకుపోయింది!

యూసఫ్ బిత్తరపోయి కళ్ళు వెళ్ళబెడితే ఏముంది? చుట్టూ చూస్తే ఖాళీపెట్టే, తనూ మాత్రమే వున్నారు. దుఃఖంతో గుండె గుభేలుమనడం మొదలైంది. "ఈ చిన్నఎలుకను ఆయన ఇస్తే దానిని గూడా నేను చివరికి జాగ్రత్తగా తీసుకెళ్ళి ఈయక చాలా పెద్దతప్పు చేశానే! ఏంచేయాలి?

యూసఫ్ చేసిన తప్పుకు బాధపడి చేయవలసినది ఇంకేమున్నది, అని అక్కడున్న చెట్టుకు ప్రదక్షిణం చేస్తూ రోడ్డంతా చూచినా ఏమి లాభం? వృథా. చిట్టెలుక నిజంగానే పారిపోయింది.

దిగులుతో క్రుంగిపోయి యూసఫ్ తిరిగి మహాత్మునివద్దకు వచ్చి తప్పు ఒప్పుకొన్నాడు. "అద్భుతమైన అవకాశాన్ని వదులుకున్నావు. పనికిరాని చిట్టెలుకనుకూడా చూచుకోలేక పోయావే? అందుకే గదా మనస్సు ఎప్పుడూ అదుపులో వుండాలి. వెళ్ళి మనసును అదుపులో పెట్టడం నేర్చుకో. లేకపోతే ఏ గొప్పపనీ నీవల్లగాదు"

యూసఫ్ సిగ్గుపడి ఇంటిదారి పట్టాడు. ఇంక ఒక్కటే ఆలోచన. తనను తాను నియమించుకోవడం ఎలా? అనేక సంవత్సరాల శ్రమా, తపస్సులతో స్వభావాన్ని కూడగట్టుకొని తిరిగి గురుదర్శనం పొందిన యూసఫ్‌ను మహాత్ముడు ఆనందంతో స్వీకరించాడు. అనుగ్రహించాడు.

కాలం గడచిపోయింది. ఇస్లాం ప్రవక్తలలో గొప్పస్థానాన్ని పొంది యూసఫ్ అత్యద్భుత గురువై ప్రకాశించాడు.

అనువాదం: టి. యస్. రామచంద్రరావు

మనస్సు నిరంతరం పరుగెడుతూంటుంది

మానవమనస్సు పాదరసంలాంటిది — అటూ యిటూ పరుగెడుతూంటుంది! కాని ఏదైనా ఒక పనిని సక్రమంగా నిర్వర్తించవలసి వచ్చినపుడు, ధ్యానమునంతను దానియందే లగ్నము చేయుట ఎంతో అవసరము గదా. చంచలమైన మనస్సును నియమించి ఒకే విషయంమీద కేంద్రీకరించడం నేర్చుకోవాలి.

సంపాదకుడు

మనస్సును నియమించక పోయినట్లయితే అది చాలా చంచలంగా, అస్పష్టంగా వుంటుంది. ఒకే విషయంమీద కేంద్రీకరించక పోయినట్లయితే అటూ యిటూ పరుగెడుతూంటుంది. ఏమాత్రం అదుపాజ్ఞలు లేకుండా యథేచ్ఛగా ప్రవర్తిస్తూ వుంటుంది. అటువంట

ప్పుడు ధ్యానమును ఒకే విషయంమీద కేంద్రీకరించాలంటే దానికి చాలా కష్టమవుతుంది. "ఎంత కష్టమో బాబూ నాకు చేతకాదు", అని ఆ ప్రయత్నాన్ని విరమించుకోవలసి వస్తుంది కూడా.

మనిషి మసక వెలుగులో జీవిస్తూ వుంటాడు. మెదడంతా నల్లమేఘాలు కమ్మినట్లుగా వుంటుంది. నీ ఆలోచనలకు విస్పష్టత వుండదు. నైర్మల్యము వుండదు. నీలో స్పష్టమైన జ్ఞానము లోపించి ఛాయారూపములే భాసిస్తాయి. ఏ విషయాన్ని గురించి స్పష్టమైన పరిజ్ఞానముండదు. You have impressions rather than a knowledge of things. You live in an apporoximation, and you can keep within you all sorts of contradictory ideas made up mostly of impressions, sensations, feelings, emotions — all sorts of things like that which have very little to do with thought and... which are just vague ramblings.

చెయ్యి వణుకుతూ వున్నప్పుడు పనులు చేయలేనట్లుగానే మనస్సు గంతులేస్తున్నప్పుడు దేనిని గురించి నిశితంగా విచారించలేవు. నిత్యజీవితంలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుంది. అటువంటప్పుడు నీ తలలో కీటకాలు పాకుతూవుంటే దేనినీ సాధించలేవు. మనస్సులో ఆలోచనలు సుడిగుండాలై తిరుగుతూవుంటే దృష్టి దేనిమీద నిలవదు. కాని సమస్యలను పరిష్కరించేందుకు వాటిని అన్ని కోణాలనుంచి చూసి నిశితంగా పరిశీలించినప్పుడే పరిష్కరించుటకు సాధ్యమవుతుంది.

అనువాదం: ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

మనస్సంటే నాలుగు దారుల కూడలి

మానవమనస్సు నడిబజారులాంటిది. అది ఆలోచనల రాక పోకలకు ఆలవాలము. ఈ ఆలోచనలన్నీ బాహ్యా వాతావరణమునుండి మనలోకి ప్రవేశిస్తాయి. నిజానికి 'నా ఆలోచన' అన్నది ఏదీ ఉండదు. నీవు తగిన శిక్షణపొంది నీ మనస్సుకు అతీతమైన (ఆత్మ) చైతన్యాన్నిపొందినప్పుడే నిన్ను నీవు భగవంతునికి సమర్పించుకో గలుగుతావు. — సంపాదకుడు

మీరు మీ భౌతికమనస్సును గూర్చి విచారించినట్లైతే అది నాలుగుదారుల కూడలి అన్నమాట నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే ప్రతిభావమూ అక్కడికి వస్తుంది, దాటివెళ్ళుతుంది, ముందుకు సాగుతుంది, వెనక్కు వస్తుంది. అన్ని భావాలూ అక్కడికి వస్తాయి. ఒక వైపునుంచి ప్రవేశిస్తాయి, మరోవైపునుంచి నిష్క్రమిస్తాయి. కొన్ని ఇక్కడ, కొన్ని అక్కడ — అది ఒక నడిబజారులాగ గోచరిస్తుంది — ఒక నియతిగాని పద్ధతిగాని కానరాదు. ఎందుకంటే భావాలు పరస్పరం ఢీకొట్టుకుంటూ వుంటాయి. అన్ని రకాల ప్రమాదాలూ సంభవిస్తాయి. అది తెలిసిన ప్రతివాడూ "నా మనస్సు అని, నేను దేన్ని అనాలి?" "నా మనస్సంటే ఏమిటి?" అని ప్రశ్నించుకుంటాడు.

ప్రతివాడూ తనలో మెరిసే ఆలోచనలు తనవే అని అనుకుంటాడు. కాని అది అలా కానేకాదు. తాను మాట్లాడుతూన్న మనుషులూ, చదివే పుస్తకాలు, తనకు అప్పుడున్న మనఃస్థితీ — వీటిమీదనే ఆ ఆలోచనలు ఆధారపడి ఉంటాయి. జీర్ణశక్తి సరిగా ఉన్నదీ లేనిదీ, గాలీ వెలుతురూఉన్న గదిలో ఉండటం, లేదా బయట గాలిలో హాయిగా పచార్లు చేయడం, సుందరంగా విస్తరించిన మైదానాన్ని చూస్తూ గాలీ వెలుతురూ ఉన్నచోట ఆనందాన్ని పొందడం లేదా వానజల్లులు పడి వాతావరణం చల్లబడటం — వీటన్నింటిమీదా ఆధారపడి ఉంటుంది. నీవు నీకు తెలియకుండానే, రకరకాల విషయాలను గురించి ఆలోచిస్తూంటావు. నీకు ఏమాత్రం సంబంధంలేని విషయాలతో సతమతమౌతుంటావు!

ఇవన్నీ సమైక్యమై సక్రమమై తర్కసహమైన భావనగా రూపొందాలంటే — చాలా సుదీర్ఘమైన సమగ్రమైన కృషి అవసరం.

*

శ్రీమాత ఈ సందర్భంగా ఇంకా ఇలా అన్నారు. నువ్వు ఒక అద్భుతమైన బ్రహ్మాండమైన గొప్ప భావసౌధమును తయారు చేసి యుండవచ్చును. నువ్వు దైవంతో ఏకం కావాలంటే మొదట ఈ భావసౌధాన్ని బ్రద్దలుకొట్టి పటాపంచలు చేయాలి! అటుల చేయనియెడల నీవు దైవంతో తాదాత్మ్యం చెందలేవు. ఎందుకంటే దైవానికి సమర్పించుకుండేందుకు నీ దగ్గర ఏమున్నది కనుక? ఈ కప్పలతక్కెడమేళం నీ నిజస్వరూపం కానేరదు. భగవంతునికి సమర్పించుకుండేందుకు నీ దగ్గర ఏముందని? నీవొక నిజమైన అస్థిత్వాన్ని పొందినప్పుడే గదా అది సాధ్యము.

అనువాదం: ఆచార్య యస్. లక్ష్మణమూర్తి

సందేహాలు – అపనమ్మకాలు

అనుమానం పెనుభూతం అన్నారు. ఇది మనస్సుకు ముమ్మాటికీ వర్తిస్తుంది. ప్రతి విషయాన్నిగురించి అపనమ్మకం, శంకించుట మనస్సుకు ఒక ఆట. కాని ఇది చాలా ప్రమాదకరమైన ఆట. ఎందుకంటే నీవు ఈ పద్మవ్యూహంలో యిరుక్కుంటే బైటపడలేవు! నీ ఆత్మకు చాలా దూరం అయిపోతావు.

— సంపాదకుడు

మానవ మనస్సు సంశయాలకు, వివాదాలకు ఆలవాలం. ప్రతిదాన్ని సంశయించడం, తర్జనభర్జన చేయడం, నమ్మకపోవడం దాని స్వభావం ఈ దురలవాటునుంచి మనిషి బయటపడాల్నంటే చాలా ప్రయత్నం చేయాలి. మొదట వాటిని మనస్సులోకి రానే రానివ్వకూడదు. వచ్చినా వాటి గోడు వినిపించుకోకూడదు. ఒకవేళ వినిపించుకున్నా వాటిని

ఆచరించకూడదు. ఈ సంశయాలు, అపనమ్మకాలు చేరి, మనస్సును వాటిష్టం వచ్చినట్లు ఆడిస్తుంటే పురోగతికి అంతకంటే దుస్థితి వేరే ఉండదు.

కానీ ఆ విధమైన ఊహలను రానివ్వడమే రసజ్ఞత అనీ, వాదోపవాదాలు చేసి, విశ్వాసాన్ని వ్యతిరేకించడంవల్ల తమకేదో గొప్ప ఔన్నత్యము కలుగుతోందనీ కొంతమంది భావిస్తారు. మూఢవిశ్వాసాలకు, అజ్ఞానానికి అతీతులుగా ఉన్నామనుకుంటారు. అదే పెద్దపొరపాటు. ఈ విధంగా మనస్సు ఆడించినట్లు ఆడి శంకలు, అపనమ్మకాల సుడిగుండంలో పడిపోతే నీవు తప్పుదారి పడతావు. ఒక అయోమయ, అగమ్య, అవిశ్వాస వ్యూహంలో చిక్కుకుంటావు. ఇక అందులోనుంచి బయటపడగలవనే నమ్మకంకూడా కోల్పోయే ప్రమాదముంది. నీ అంతఃసత్యాన్నుంచి ఎంతో దూరంగా, దాని కనుచూపు మేరలోకూడా లేకుండా పోతావు! ఒక్కొక్కసారి నీ ఆత్మతో సంసర్గాన్ని పొందే అవకాశంకూడా కోల్పోతావు.

సాధారణ మానవ మేధస్సును పట్టి పీడించే ఈ జాడ్యము వేర్పాటు, విబేధాలవల్ల కలుగుతుంది. ప్రతి విషయాన్ని విభజించి, ఇదా, అదా అనుకుంటూ ఒకదాన్ని ఎంచుకుంటే రెండోదాన్ని దూరం చేసుకోవాలి అనమాట!

ఇది ఒక భావ దారిద్ర్యమే అనాలి. అలాకాకుండా ప్రతివారు విజ్ఞతతో విషయ పరిగ్రహణ ఎలాచేయాలో అన్నిటినీ సమైక్యంగా ఎలా సమన్వయం చేయాలో తెలుసుకుంటే పూర్ణసిద్ధి పొందగలరు.

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకట్రామశాస్త్రి.

ఆత్మరక్షణా, ఆత్మవంచనా?

మనస్సు ఒక మాయలమారి. స్వార్థదృష్టితో తను చేసిన పనులను, ప్రవర్తనలను నిరంతరం సమర్థించుకొంటూ వుంటుంది! అందువలన సత్యాన్ని గ్రహించలేదు. అటులగాక తను చేసిన పొరపాట్లను గుర్తించి మాయలోనుంచి బైటపడినప్పుడు చిత్తశుద్ధితో ప్రవర్తిస్తుంది. — *సంపాదకుడు*

మానవమనస్సు ఎప్పుడూ తనను తాను సమర్థించుకోవాలని చూస్తూవుంటుంది. ఈ ప్రక్రియకు మనిషిలోని సమస్తమైన అంగములు, కామాత్మ, ప్రాణకోశము, మనస్సుయొక్క భౌతిక విభాగములు, సూక్ష్మ శరీరము ఇవన్నీకూడా సహాకరిస్తయి. మనము పొరపాట్లు చేసినప్పుడు, మనకు ఇష్టంలేని సన్నివేశములు జరిగినప్పుడు, మనం బాధపడడం న్యాయమే. అయితే పైన పేర్కొనిన మనలోని విభాగములన్నీ కలిసి మనని సమర్థిస్తాయి. మనిషి తన తప్పులను ఒప్పుకోడు. ప్రత్యేకశిక్షణ పొందితేతప్ప, మనస్సు తనవల్ల తప్పేమిలేదని వాదిస్తూనే వుంటుంది. బాహ్యా పరిస్థితుల ప్రాబల్యము కలిగనప్పుడు గాని ఈ దృష్టి మారదు. అప్పుడుగాని తనని తాను నిష్పక్షపాతంగా విమర్శించుకోలేడు.

మనిషిలో ఈ విధమైన వాదన నిరంతరం జరిగే వ్యవహారమే. ప్రతి చిన్నవిషయానికి, అత్యల్ప విషయములను గురించికూడ మనిషి తననుతాను సమర్థించుకోవలసిందే.

And explanations — one gives them to oneself; it is only under the pressure of circumstances that one begins to give them to others or to another, but first one makes oneself very comfortable; first thing: "It was like that, for it had to be like that, and it happened because of this, and...", and it is always the fault of circumstances or other people. And it truly requires an effort — unless, as I say, one has undergone a discipline, has acquired the habit of doing it automatically — it requires an effort to begin to understand that perhaps things are not like this, that perhaps one has not done exactly what one ought to have done or

reacted as one should. And even when one begins to see it, a much greater effort is needed to recognise it... officially.

When one begins to see that one has made a mistake, the first movement of the mind is to push it into the background and to put a cloak in front of it, the cloak of a very fine little explanation, and as long as one is not obliged to show it, one hides it, And this is what I call "lack of mental honesty"

మనుషులకు మొదట్లో తమనుతాము మోసబుచ్చుకోవటం ఒక అలవాటైపోతుంది. ఇది తెలిసి జరుగకపోవచ్చు. అయినప్పటికి ఎవరికి వారు సమర్థించుకొని పైకి అంతా సవ్యంగా ఉన్నట్టుగానే సత్యహరిశ్చంద్రుడిలా ప్రవర్తిస్తారు. అంటే ఇపుడిక ఈ మోసగింపు అదృశ్యంగా జరుగుతుందన మాట! దానిని బహిరంగపరచి "నన్ను నేను నిజంగానే మోసగించుకుంటున్నాను", అని గుర్తించి ఒప్పుకుండేందుకు చాల తీవ్రంగా ప్రయత్నించవలసి వస్తుంది.

ఈ వ్యవహారమంతా అప్రయత్నంగా నీకు తెలియకుండానే జరిగిపోతూంటుంది. నీవు మేల్కొని క్రమశిక్షణీకరణ కార్యక్రమాన్ని చేబట్టినప్పుడుగాని దొంగ దొరకడు. అప్పుడే "అవును నేనెంత దగాకోరుని? నాకు తెలియకుండా ఎంత అప్రయత్నంగా నన్ను నేను మోసగించుకొంటున్నాను?" అని నువ్వు తేలికగా కనుక్కుంటావు. అంతవరకు నీ తప్పులను నువ్వు అందమైన వేషాలతో కప్పిపుచ్చుతావు!

అనగా నీ మనస్సు ధరించే కపటవేషాలను తొలగించాల్నంటే చాలా గట్టి ప్రయత్నము, క్రమశిక్షణ ఎంతో అవుసరమన్న మాట.

అనువాదం: ఆర్. యల్. ఎన్. శాస్త్రి

మనస్సు – కార్యసాధనము

బుద్ధినుంచి జ్ఞానం పుట్టదు. జ్ఞానము ఉన్నతచేతననుంచి గానీ, ఆత్మయొక్క నిగూఢమైన లోతులనుంచిగానీ ఆవిర్భవిస్తుంది. ఆ జ్ఞానాన్ని బుద్ధి గ్రహించి భౌతికజగత్తులోకి ప్రసరింపజేస్తుంది. ఊర్ధ్వ చేతనకు భౌతిక శరీరాన్ని కల్పిస్తుంది.

మేధస్సు ఉన్నత భూమికలలోని చైతన్యమునకు, వ్యక్తమైన అధోభూమికలకు మధ్యవర్తిలాంటిది. బుద్ధి ఆ చైతన్యానికి రూపకల్పన చేస్తుంది. ప్రాణికస్తరము దానిని జీవశక్తితో నింపుతుంది. పదార్థము చివరికి వచ్చే భౌతిక ప్రాతిపదిక.

*

ఆలోచనలు మొదట్లో బీజరూపాల్లో వుంటాయి. మేధస్సు ఆ భావబీజాలను ఆలోచనలుగా మారుస్తుంది. అదే సమయములో ఆలోచ నలను సమీకరిస్తూ వ్యవస్థీకరింప జేస్తుంది కూడా. సామాన్య మనస్త త్వముకన్న అతీతమైన కొన్ని గంభీరమైన భావాలుంటయి. ఈ గొప్ప భావాలు క్రిందికి దిగిరావాలని తమను తాము నిర్దిష్టమైన రూపాలుగా వ్యక్తీకరించుకోవాలని భావిస్తూంటయి. ఈ రూపాలే ఆలోచనలు — భావబీజాలను ఆలోచనా రూపాలుగా రూప కల్పన చేస్తయి.

ఆలోచనలు తమను తాము సక్రమంగానే వ్యవస్థీకరించు కొంటాయి. మనం కూడా వాటిని క్రమబద్ధంగా ఉంచాలి. లేకుంటే అంతా గందరగోళంగా వుంటుంది. పిదప ఆ ఆలోచనలను క్రియాత్మ కంగా ఉపయోగించుకొనటం నేర్చుకోవాలి

*

బుద్ధి లేక మేధస్సు కార్యనిర్వహణమునకు కూడా ఉపకర ణమే. మొదట ఆలోచనలు ప్రణాళికలను రూపొందిస్తాయి. బుద్ధి లేక మేధస్సు వాటిని క్రియాత్మకం చేసేప్రయత్నంలో వుంటుంది. అప్పుడు కొన్ని సూక్ష్మరూపాలు ఏర్పడుతాయి. ఈ విధమైన స్వతంత్రమైన క్రియాశీలమైన రూపాలు, నేను ఇంతకు పూర్వం చెప్పినట్లుగా, వ్యక్తి లోని ఇతర భాగములైన ప్రాణిక, భౌతికస్తరములను కలుపుకొని వాటిని క్రియాత్మకంగా నడిపిస్తాయి. ఇవి సహజంగా జరిగే సంఘ

టనలే. నీవు ఒక పని చేయాలని అనుకుంటావు. వెంటనే చేయవు. కాని ఆ ఆలోచన అభివ్యక్తము కావాలని మరల మరల ప్రయత్ని స్తుంది. నీ బుద్ధిలో 'నేను ఇది చేయాలి, అది చేయాలి' అనే మాటలు వింటుంటావు. కడపటికి అన్నింటిని వదలి నీవు ఏమి చేయదలచు కున్నావో అదే చేస్తావు. అది బుద్ధియొక్క క్రియాత్మక లక్షణము. ఆ శక్తిని సంపాదించుకొనేముందు బుద్ధిని వ్యవస్థీకరిస్తూ, సమన్వయా త్మకంగా కట్టడి చేయాలి. ఆ శక్తిని సంపాదిస్తే, నీవు ప్రయోజనాత్మ కంగా పనిచేయగలవు. కాని చాలామంది ఆలోచనల రూపములను (formations) తెలుసుకోలేక, వాటి ధాటికి తట్టుకోలేక అశాంతికి గురవుతారు.

*

Then, there is another use. When one is in contact with one's reason, with the rational center of the intellect, the pure reason, it is a powerful control over all vital impulses. All that comes from the vital world can be very firmly controlled by it and used in a disciplined and organised action. But it must be at the service of something else — not work for its own satisfaction.

అనువాదం: డా॥ కె.వి. యన్. రాఘవన్

మనస్సు – జ్ఞానసాధనము గాదు

బుద్ధి (మనస్సు) ఆలోచనలకు కార్యరూపమునిస్తుంది. ఇదే దాని నిజమైన పాత్ర. ఈ వృత్తికి కట్టుబడి ఉన్నంతకాలం అది ఉపయోగకరంగా ఉంటుంది. కాని ఎప్పుడైతే అన్నీ తెలుసునని ఊహిస్తుందో, ఉన్నత భూమికలనుంచి జ్ఞానమును గ్రహించవలసిన అవసరం లేదనియు, అంతర్భూమికలద్వారా కొంత జ్ఞానమును సంత రించుకొన్నానని (అది నిజమైన జ్ఞానము కాదు. మరొక దానికి ప్రతి బింబమే) నమ్మి, ఆ జ్ఞానమును భౌతికజీవితానికి అన్వర్తింప జేయాలని చూస్తుందో, అప్పుడు అది తన యోగ్యతను వదలి రాక్షసిగా మారు

తుంది. ఇది తరచుగా సంభవమౌతూనే వుంటుంది. అప్పుడది వక్ర మార్గంలో నడుస్తుంది.

*

మీరు జరిగే విషయాలను గురించిన, మనుష్యులను గురించిన మంచిచెడులను నిర్ణయించే అధికారం బుద్ధికి వదలకూడదు. బుద్ధి జ్ఞానమునకు ఉపకరణము కాదు. జ్ఞానమును తెలుసుకొనే శక్తి బుద్ధికి లేదు. కాకపోతే (బుద్ధి) జ్ఞానముచేత ప్రభావితం కావలెను. జ్ఞానము ఆలోచనలకు అతీతమైన భూమికకు చెందినది. ఆ ఉన్నత స్థితినుంచి జ్ఞానమును స్వీకరించి దానిని వ్యక్తీకరించుటకు బుద్ధి ప్రశాంతంగా, మెదలకుండా ఉండాలి. ఎందుకంటే క్రమబద్ధము చేయుటకు కార్య నిర్వహణమునకు బుద్ధి చక్కటి ఉపకరణము. వీటిలోనే దాని అసలు విలువ ప్రయోజనములు సిద్ధిస్తాయి.

*

ఆలోచనలకు పైన స్వచ్ఛమైన (world of pure ideas) భావభూమికలుంటయి. ఆ భావాలను వ్యక్తీకరించటానికే ఆలోచనలు ఉపకరిస్తాయి. అయితే జ్ఞానము ఈ స్వచ్ఛమైన భావభూమికలకన్న ఉన్నతమైన స్థాయికి చెందినది. ఈ విషయాలన్నిటినీ గుర్తిస్తేనే జ్ఞాన సముపార్జన సాధ్యమవుతుంది. అటుల కానప్పుడు, మన అల్పమైన మనస్తత్వముతోను, అల్పమైన భౌతికభావాలతోను, ప్రతివిషయాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాము. అప్పుడు మన స్థితి, ఒక రకమైన డాంబికముతో కూడివుండి, ప్రతి విషయాన్ని చిన్నచూపుతో చూచి చెడుగా విమర్శించి నిర్ధారిస్తాము. ఈ పద్ధతి సర్వసామాన్యముగా సక్రమమైనది కాదు. మన మనస్సును నిలకడగాను, ప్రశాంతముగాను వుంచుకుని, ప్రతివిషయమును నిశితంగా పరిశీలించి మెల్లి మెల్లిగా నీలో నువ్వు అభిప్రాయాన్ని ఏర్పరచుకోవాలి. అంతేగాని వెంటనే మన నిర్ణయాన్ని ఎప్పుడూ ప్రకటించకూడదు. అలాగ, మన మనస్సులో ప్రశాంతంగా విషయాన్ని స్థిరపరచుకున్నట్లయితే, వాటిని మనము, మన మనస్సుకన్న ఉన్నతమైనస్థాయికి శ్రద్ధాసక్తులతో తీసుకు వెళ్ళగలుగుతాము. దూరమునుండిగాని, ఎత్తైన ప్రదేశమునుండి పరికిస్తున్నట్లుగా, వున్నట్లైతే, సత్యజ్యోతి నీకు క్రమంగా గోచరిస్తుంది.

కాని వెంటనే నీవు ఉద్రిక్తుడవై తొందర పడ్డట్లయితే ఏ విషయమునూ సరిగా అర్థము చేసుకొనజాలవు. ఈ విషయాన్ని మీకు అవసరమైతే వందసార్లయినా మళ్ళి మళ్ళి చెపుతాను. మీరు దీనిని అర్థం చేసుకోలేకపోతే, ఈ అజ్ఞానమునుండి, మీరు ఏనాటికీ బయట పడజాలరు.

*

మనస్సు, ఏ విషయాన్నైనా అర్థం చేసుకోవాలంటే, దానిని తులనాత్మకంగా, క్షుణ్ణంగా, పరిశీలించాలి. లేకపోతే మనస్సుకు ఏమీ అర్థంకాక కలవరం చెందుతుంది. రానురాను దేనినీ అర్థం చేసుకోలేని పరిస్థితికికూడా దిగజారుతుంది.

అనువాదం: డా॥ కె. వి. యన్. రాఘవన్,చావలి రామమూర్తి

మన ఆలోచనలు ఎక్కణ్ణుంచి వస్తాయి?

ప్రశ్న: శ్రీమాతా! మన ఆలోచనలు విశ్వమానసిక శక్తులచే ఎలా సృష్టింపబడతాయి?

విశ్వమానసిక శక్తులు మన మస్తిష్కముల్లోకి ప్రవేశిస్తాయి గనుక. ఆ శక్తులచే మనము స్నాతులమవుతూంటాము. కాని తమాషా ఆ సంగతి మనకు తెలీదు! మానవులు ఒక పేటికలో బంధింపబడి వుండరు. అనేకానేక శక్తులు, వాటి తరంగాలు, గమనాలు మనలో నిరాటంకంగా ప్రవేశిస్తూ, నిష్క్రమిస్తూ ఉంటాయి. మనలో ఒకానొక మానసిక పదార్థము ఉంటుంది. సృజనాత్మకమైన మానసిక శక్తులచే ఉపయోగించుకోబడడానికి సర్వదాసిద్ధంగా వుంటుంది. ఇవి ముక్త శక్తులు సుమా. వెలుపలినుండి ఒక ఆలోచన రావడమే ఆలస్యం, లేదా ఒక శక్తి స్పందనము మన చైతన్యంలోకి ప్రవేశించడమే ఆలస్యం. మనము దానికి వెంటనే ఒక నిర్దిష్ట రూపాన్ని ఇస్తాము. కాని నిజానికి అవన్నీ మనకు తెలియని ఉన్నత చైతన్యశ్రేణికి చెందినవి.

మరో విషయం. ఈ ప్రక్రియ అసాధారణంగా జరిగేది కాదు, సర్వసాధారణంగా జరుగుతూనే వుంటుంది. బయటినుండి వచ్చే ఈ శక్తి ప్రవాహము ఒక ప్రత్యేక ఆలోచనగా రూపుకట్టి ఒకరినుండి మరొకరిలో ప్రవేశిస్తూ వినిర్గమిస్తూవుంటే ఆ ఆలోచన పుట్టినప్పుడుండే పరిశుద్ధత, నిర్దుష్టత, స్పష్టత చాలావరకు కోల్పోయినప్పటికీ, మనం దానిని "మన" ఆలోచనే అని భ్రమిస్తూంటాము!

మనం ముఖ్యంగా గ్రహించవలసినదేమంటే "మన ఆలోచన" అంటూ ఏమి వుండదు. మనము సంపూర్ణంగా ఏకాకిగా లేము. బహిరంగ ప్రదేశంలో నిలబడినపుడు మనమీద గాలి ఏవైపునుంచైనా ఎప్పుడైనా ఎలా వీచగలదో అట్టి స్థితి మనది. విశ్వవ్యాప్తమైన అనేక శక్తులు మనలోకి వస్తూ, వెళ్తూ, పెనగులాడుతూ, పోట్లాడుతూ కాట్లాడుతూ వుండే ప్రస్తుత పరిస్థితిలో ఒక ఆలోచనను "మనది" అని ఎలా నిర్దేశించి చెప్పగలం? అలా కాకుండా మనలో చైతన్యం ముద్ద కట్టి, స్పష్టమైన ఆకాంక్షద్వారా పైకి చూస్తూ మానవ మనస్సుకు అతీతంగా ఇంకా ఇంకా పైకి వెళ్ళాలని సమర్పించుకొనే బుద్ధి మనలో వికసించినప్పుడు పైనుండి నిత్యసత్యం మధ్యలోని పొరలనన్నిటినీ దాటి వస్తుంది; జాగరూకతతో మేలుకొనియున్న మన మెదడులో చొరబడి రూపం పొందుతుంది. అప్పుడే దానిని మన స్వంత ఆలోచన అనాలి. అది విశ్వజనీన మనసుయొక్క సృష్టిగాని, వేరొక వ్యక్తిత్వపు మనసుగాని కాదు. మనం ఎంత తీక్షణంగా ఆకాంక్షిస్తే పైనున్న జ్యోతి అంత ప్రకాశంగా, దర్శనమిస్తుంది. లేకపోతే మనకి కలిగే తలంపులన్ని దారినపోయే దానయ్యలుగా, సంకేతాలుగా, "నలుగురితో నారాయణా" "గుంపులో గోవిందా" యన్నట్లు మనద్వారా అందరికీ వచ్చేవీ పోయేవీ మాత్రమే.

*

ఎవరికీ సొంత ఆలోచనలంటూ వుండవు. ఒక మహా సముద్రంలోంచి, ఎవరి అభిరుచులకనుగుణమైన భావనలను వారు గ్రహించెదరు. భావములు సామూహిక సంపద. అవి అందరికి చెందినవి. ఏ ఒక్కరి సొత్తు కాదు.

అయితే ఇందులో కొంత వైవిధ్యమున్నది. మొదటిది సర్వ సాధారణమైన స్థితి. మన మేధలు అన్నీ అందులో మునిగితేలుతూ వుంటాయి. భావములు చుట్టూ ముసురుతూ వుంటాయన్నమాట. అక్కడ అందరూ "శ్రీమాన్ ప్రతివాడు". ఆ తరువాత ఆలోచనా పరుల శ్రేణి ఇంతకంటె కాస్త మెరుగైనది. ఇంకా పై శ్రేణులు భావనా జగత్తుకు చెందినవే అయినప్పటికీ మాటలకతీతములు.

అనువాదం: సి.కె. రామనాథచెట్టి, టి.యస్. రామచంద్రరావు

ఊహలు తాల్చిన రూపములు

శ్రీమాత మనకి తెలియని కొత్త కొత్త విషయాలనెన్నిటినో చెప్పి మన నాశ్చర్యపరుస్తూంటారు. మనిషి ఒక విషయమును గురించి ఊహించినప్పుడుగాని ఆలోచించినప్పుడుగాని అది ఒక రూపమును తాలుస్తుందట. ఆ రూపము ఆ మనిషినుండి వేరై క్రియారూపమును పొందే ప్రయత్నం చేస్తూవుంటుందట. ఈ విధంగా ఒకే మనిషినుండి వెలువడిన వివిధ రూపములు, అందరు మనుషులనుండి వెలువడిన భావనారూపముల సమూహాములు, స్వతంత్ర ప్రతిపత్తిని పొంది గాలిలో తేలుతూ వుంటాయట. వీటిన్నిటిని మనిషి చూడగలిగితే చాలా గందరగోళంగా వుంటుంది. పిచ్చెక్కిపోతుంది. అయితే ప్రతి మనిషి యొక్క తత్వమును అభిరుచులనుబట్టి అతనికి సన్నిహితమైన రూపములే ఆతనిలోకి ప్రవేశించి, అతనిని ప్రేరేపిస్తాయి.

—సంపాదకుడు

తమ మానసిక చర్యలకు రూపకల్పన చేయగల శక్తి కొద్దిగానో గొప్పగానో అందరిలోనూ ఉంటుంది. ఈ విధంగా ఏర్పడిన మానసిక కల్పనలకు (mental formations) వారు సాధారణంగా తమ స్వీయప్రయోజనాలకుగానీ, సృజనాత్మక చర్యలకుగానీ, ఏదైనా కార్య

మును సాధించటానికిగానీ ఉపయోగిస్తారు. నిరంతరం మనం ఈ విధమైన రూపాలను, ఆకృతులను కల్పిస్తూనే ఉంటాము. మనకి తెలిసీ, తెలియకా వీటిని గాలిలోకి వదిలేస్తూంటాము. అలా అవి తేలుకుంటూపోయి ఒకరి దగ్గర్నుంచి మరొకరి దగ్గరకు చేరుకుంటూ తమవంటి వాటినన్నిటినీ కలుపుకుంటాయి. అలా కలిసిపోయినప్పుడు అంతా బాగానే ఉంటుంది కానీ ఒక్కొక్కసారి మాత్రం సంఘర్షణలకు దారితీస్తాయి. పోరాటాలు జరుగుతాయి. ఎందువల్లనంటే ఈ మనో కల్పనలలో క్రియారూపమును పొందాలనే ఒక చిన్న సంకల్పలేశముం టుంది. అది సిద్ధించబడాలని తాపత్రయపడుతుంది. ప్రతివారు తాము కోరినవే సిద్ధించాలనే సంకల్పంతో ఊహాకల్పనలను చేసి పంపిస్తే అవన్నీ కలిసిపోయి గందరగోళం ఏర్పడుతుంది. గాలిలో తేలుతూ పోతున్న ఈ దృశ్యాలను వీక్షించాలనే కుతూహలముంటే ఆశ్చర్య జనకంగా ఉండే అనేక విషయాలు దర్శనమిస్తాయి. అక్కడ కురుక్షేత్రా లను, కెరటాలుగా ఎగురుతూండే రూపాలను, వాటి కొట్లాటలను, గుంపులు గుంపులుగా కదులుతున్న మానసికరూపాలను తిలకించ వచ్చు. అందరి మనోకల్పిత రూపాలకు ఒకటే వైఖరి ఉంటుంది. దేనికదే భౌతిక రూపాన్ని పొందాలనుకుంటుంది. ఇవి అసంఖ్యాం కంగా ఉంటాయి కాబట్టి అన్నీ భౌతికరూపమును దాల్చాలంటే ఈ భూభాగమే సరిపోదు! ఇవన్నీ ఒకదాన్నొకటి నెట్టుకుంటూ, తోసు కుంటూ, తమతో కలవని వాటిని వెనక్కి నెట్టేస్తూ ఒక పెద్ద సైన్యంగా ముందుకు కదులుతూ కాలాన్ని, స్థలాన్నిగూడా ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడ ఆక్రమిస్తూపోతే ఈ రూపాల బలగానికి భూభాగమంతాకూడా సరిపోదు.

సాధారణంగా అందరూకూడా ఇది వారికి తెలియకుండానే చేస్తారు. ఎడతెరిపి లేకుండా ఒక విషయంలోనుంచి మరొక దాంట్లోకి దాటుకుంటూపోయి ఆశలు పెంచుకుంటారు; జరుగుతుందనుకుంటారు; అదే కోరతారు. ఒక్కొక్కసారి నిరుత్సాహం పొందుతారు, మరొకసారి ఆనందిస్తారు, నిస్పృహకి లోనౌతారు. వీటన్నిటిమీదా వారికి ఏ విధమైన నియంత్రణ ఉండదు. అయితే కొద్దిగా తెలివి తెచ్చుకొంటే ఆలోచనలు వచ్చినప్పుడు అవి ఎటువంటి రూపం దాల్చుతూ గాలి

లోకి నిరంతరాయంగా దూసుకుపోతున్నాయో గమనించవచ్చు. ఈ విధంగా ప్రాణం పోసుకోవాలని బయల్వెడలే చిన్న భావకల్పనలన్నీ మన మనోగగనంలోనే జరుగుతాయి. దాన్ని బాగా పరిశీలించగలిగితే వాటినన్నిటినీ విడమరచి, అందులో మన ఉన్నతాశయాలకు, సంకల్పాలకు అనుగుణంకాని వాటిని వెనక్కినెట్టేసి, ప్రగతికి, వృద్ధికీ సాయపడే రూపకల్పనలను మాత్రం సిద్ధించేటట్లు చేసుకోవచ్చు.

*

స్వతహాగా కొంతమందికి ఈ కల్పనాశక్తి చాలా గంభీరంగా ఉంటుంది. వారు తమ రూపకల్పనలు నిజంగా జరిగేటట్లు చేసుకోగలరు. అయితే వారికి మానసికంగానూ ప్రాణికంగానూ క్రమశిక్షణ లేకపోవడంవల్ల స్థిరంగా ఒక విషయం మీద కేంద్రీకరించలేరు. కాస్సేపు ఒకటి కావాలని, ఇంకా కాస్సేపటికి ఇంకొకటి కావాలనుకుంటూపోతే అవి అనేక రకాలుగా, ఒకదానికొకటి వ్యతిరేకంగా తయారౌతాయి. దానివల్ల కలిగే ఫలితాలుకూడా వికటించుకొని పొసగకుండా అయిపోతాయి. ఆ విషయం గుర్తించక, తాము ఇంత గందరగోళంలో, సమరసావిహీన స్థితిలో ఎలా ఉన్నామో అని ఆశ్చర్యపోతారు. తమ ఆశలు, ఆలోచనలద్వారా తామే ఈ స్థితిని కొనితెచ్చుకొన్నామని గమనించలేరు! వారికిదంతా చాలా అసంబద్ధంగా, విరుద్ధంగా కనిపిస్తుంది.

ఇటువంటి జ్ఞానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. అయితే ఆ జ్ఞానంతోపాటు దాన్ని సరిగా వినియోగించుకోటానికి కావలసిన రహస్యం తెలుసుకోవాలి. క్రమశిక్షణతో, ఆత్మనిగ్రహంతో తమలోని దివ్యసత్యానికి మూలాన్ని, దివ్యసంకల్పం యొక్క పరిపాలనా యంత్రాంగాన్ని కనుక్కోవడమే ఆ రహస్యం. మనోకల్పిత రూపాలకు శక్తినిచ్చి, వాటిని సమగ్రంగా, సామరస్యంగా సిద్ధిపొందేటట్లు చేసేది ఇదే.

అనువాదం: ఎ. వెంకట్రామశాస్త్రి, ఎ. ప్రభావతి

ఆలోచనల నియంత్రణ

ఆలోచనలను అరికట్టుటమా! అది ఎవరితరం? అధిక సంఖ్యాగులు వారి ఆలోచనలను ఏమాత్రం అదుపు చేయలేరు వాళ్ళ ఆలోచనలమీద ఏమాత్రం పెత్తనం చెలాయించలేరు సరికదా వాళ్ళే ఆలోచనలకు బానిసలవుతారు. వాళ్ళను పట్టుకొని పీడిస్తున్న ఆలోచనలను వదిలించుకోలేక, వాటితో సతమతమౌతూ వుంటారు. అవి వాళ్ళని ఆవహించి వేధిస్తూవుంటయి. ఎంత తన్నుకున్నాసరే వాటిని వాళ్ళ మనస్సులలోనించి పారద్రోలలేరు. వాళ్ళ ఆలోచనలే వాళ్ళని పరిపాలిస్తూవుంటాయి. “అదా, ఆ ఆలోచన పదేపదే నాదగ్గరకు వచ్చి నన్ను తినేస్తోందిరాబాబూ. దాన్ని ఎట్లా వదిలించుకోవాలో తెలియటం లేదు”, అంటారు. ఆతురత, చెడుతలపులు, భయాందోళనలు మొ॥ ఆలోచనలన్నీ మామూలే. ముఖ్యంగా భయపెట్టే ఆలోచనలు చాలా మొండిగా పునఃశ్చరణమౌతూ వుంటాయి. వాటిని బహిష్కరించినాకూడా రబ్బరు బాండు మాదిరి మళ్ళీ నీదగ్గరికే వస్తాయి! వీటిని ఎవరు నియమించగలరు? దానికి చాలా సంవత్సరాల శ్రమ, అభ్యాసం కావాలి. ఆలోచనల వెల్లువను పూర్తిగా ఆపలేకపోయినా ఒకమాదిరిగా నియమించటముకూడా గొప్పే. నీ తలలో ఇటులచేయుట (మదర్ తన నుదురుమీద వేలుతోరాస్తూ చెప్పేరు.), ఆలోచనలన్నిటినీ పూర్తిగా నిలిపివేయటం, ఆలోచనా తరంగములను లేశమాత్రమైనా పైకిరానివ్వకుండా నియమించగలిగితే అదిచాలా గొప్పస్థాయి — అంతా స్తంభించిపోతుంది. పుస్తకం తెరిచినప్పుడు ఖాళీపేజీ మాదిరిగా, తెల్లకాగితంవలె, చాలా ప్రత్యక్షంగా నీకు తెలుస్తుంది. ఇది నీకొక సవాలు. ఇంటికి వెళ్ళి ప్రయత్నించిచూడు.

అనువాదం: ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి.

ఆలోచనలను నియంత్రించే మానసిక శిక్షణ

(మనస్సును నియమించుట, దాని స్థాయిని పెంచుట:) నాలుగు ప్రక్రియలు, పద్ధతులు కలవు. ఇవి సాధారణంగా ఒకదాని తరువాత మరొకటి ఒక క్రమపద్ధతిలో జరుగుతున్నట్లు కనిపించినా, నిజానికి అవి ఏకకాలంలో సమాంతరంగా సంభవిస్తవి. *అవి ఏమనగా: మొదటిది మన ఆలోచనా స్రవంతిని ఒక ప్రేక్షకునివలె గమనించడం; రెండవది వాటిని జాగ్రత్తగా కనిపెట్టి వుండటం; మూడవది ఆలోచనలను మన నియంత్రణలోకి తెచ్చుకోవడం; చివరకు నాలుగవది మన ఆలోచనలపై సంపూర్ణ సార్వభౌమత్వం సంపాదించడం.* ఇలాగ, పర్యాలోకనం, మెలకువతో కనిపెట్టడం, నియంత్రణ, పూర్తిగా వశపరచుకొనుట...

ఆలోచనలను అవలోకించుట మొదటి మెట్టు. ఇది మనము అనుకునేటంత సులభం కాదు సుమీ! ఎందుకంటే ఆలోచనలను గమనించాలంటే ముందుగా వాటినుండి వేరుపడి, ఎడంగా నిలబడాలి. మామూలు స్థితిలోని మానవుడు తననూ, తన యోచనలనూ, వేర్వేరుగా తలవడు. అతడు ఆలోచిస్తున్నట్లుకూడా గమనించడు. కేవలం ఒక అలవాటు ప్రకారం ఆలోచనా ప్రక్రియ జరిగిపోతూ వుంటుందన్న మాట. తనుకూడా ఆలోచనల వరవడిలో కొట్టుకుపోతూ వుంటాడు.

ఆలోచనలను గమనించాలంటే ముందుగా కాస్త వెనక్కు తగ్గి వాటివైపు తదేక దృష్టితో వీక్షించాలి. నీవు నీ ఆలోచనల ముట్టడి నుండి పూర్తిగా విడివడాలి. వాటి దారి వాటిది. నీ దారి నీది.

(ఇక రెండవది) ఈ ఆలోచనా సరళిని కనిపెట్టి వుండటం ఎలాగో నేర్చుకోవాలి. మొదట వాటిని మనోనేత్రములతో చూడకలిగి తరువాత వాటిని ఎల్లప్పుడూ కనిపెట్టి వుండాలి. నీవొక సర్వజ్ఞుడైన న్యాయాధికారిగా వాటిని నిష్పక్షపాతంగా బేరీజు వేయగలగాలి. మంచి ఆలోచనలేవో, చెడ్డవేవో విచక్షణ చేయగలగాలి. ఏవి మనకు ఉపయుక్తమైనవో ఏవికావో తెలుసుకోవాలి. అట్లాగే ఏవి నిర్మాణాత్మకమై మనకు విజయశ్రీని తెచ్చిపెట్టకలవో, ఏవి మనలను నైరాశ్యంలో ముంచెత్తి ఓటమిపాలు చేస్తాయో స్పష్టంగా తెలుసుకోవాలి. ఇట్టి విచక్ష

ణాశక్తిని మనము అలవరచుకోవాలి. దీనికోసం ఎంతగానో సాధన చెయ్యాలి....

మానసిక క్రమశిక్షణలో ఇక మూడవది ఆలోచనలను మన అదుపాజ్ఞలలో వుంచుకోవడం. ఎప్పుడైతే మనలోని సర్వజ్ఞుడైన న్యాయమూర్తి ఎట్టి యోచనలు ఉపయోగకరమో ఏవి హానికలిగిస్తాయో, విచక్షించ కలుగుతాడో అప్పుడు మనలో ఒక భటుడు, ఉదయించి మనకు శ్రేయోదాయకమైన ఆలోచనలకు మాత్రమే ద్వారము తెరిచి హానికరమైన వాటికి తలుపులు మూసివేయగలడు.

అప్పుడే మన భటుడు ఒక ఉన్నతమైన విశాలావలోకనముతో దురాలోచనలను మనలోకి ప్రవేశించకుండా నిర్బంధించి, వీలైనంత వెనుకకు నెట్టివేయగలడు. ఆలోచనల ప్రవేశార్హతను నిర్దేశించే ప్రక్రియనే మనము 'ఆలోచనల నియంత్రణ' అంటాము.

*

భిన్నతత్త్వములతో కూడిన వాతావరణము — మంచి చెడులు, వెలుగునీడలతో కూడిన వాతావరణము — నిన్ను పరివేష్టించి వుంటుంది. ప్రతిమనిషి వీటినుంచి కొన్ని స్పందనములను ఎంచుకొనే ఒక జల్లెడ అన్నమాట. మరియు నీవు:

1. నీకు కావలసిన స్పందనలను మాత్రమే గ్రహించుటకు సమర్థుడవై వుండాలి.
2. నీకు నచ్చిన ఆలోచనలను మాత్రమే స్వీకరించాలి.
3. నీ అనుమతి లేకుండా వాటికి క్రియారూపమివ్వరాదు.

శరీరధారి యొక్క అసలు కర్తవ్యమిదియే. ప్రతి మనిషీ ఒక క్షేత్రమునకు చెందిన స్పందనములను నియంత్రించి వాటికి ఆధిపత్యము వహించవలెను. దైవకార్యమునకు అనుకూలమైన వాటిని స్వీకరించి మిగిలిన వాటిని తిరస్కరించవలెను.

అనువాదం: సి.కె.రామనాథ చెట్టి

మనశ్శాంతిని పొందడం ఎలా?

మనస్సును నిశ్శబ్దంగా వుంచుకోవడం ఎలాగైనా నేర్చుకోవాల్సిందే. దానికి ఎంతో క్రమశిక్షణ పాటించాల్సి వుంటుంది. ముందుగా ప్రశాంతంగా వుండటం నేర్చుకోవాలి. ఎట్టి శబ్దతరంగాలు లోనికి ప్రవేశిస్తున్నాయో జాగ్రత్తగా గమనిస్తూండాలి. ఈ విషయంలో శ్రద్ధ చాలా అవసరం. నీవు తిన్నగా నీ మనస్సును శాంతింపచేయాలని ప్రయత్నిస్తే అది వ్యర్థప్రయత్నమే కాగలదు. మన మెదడు తనవృత్తిని ఒక క్షణమైనా ఆపదు — అది ఎప్పుడూ గ్రామఫోనురికార్డుమల్లే మోగుతూనే వుంటుంది. పాడిన పాటనే మళ్ళీ మళ్ళీ పాడుతూ వుంటుంది! దాన్ని ఆపడానికి మీట నొక్కితేతప్ప అలా నిరంతరంగా తన క్రియను సాగిస్తూనే వుంటుంది. అలాకాకుండా నీ చైతన్యాన్ని సాధారణ స్థాయినుండి ఉన్నతస్థాయికి తీసుకుపోగలిగితే అచ్చటి ప్రకాశ కిరణాలచేత మనస్సు ప్రశాంతినిపొంది తనకదలికలు ఆగిపోయి నిశ్శబ్దత నెలకొంటుంది. ఆ ఉన్నత చైతన్యాన్ని ఒక్కసారి చేరుకోగలిగితే అందులోనుండి ఇక ఎప్పుడూ బయటకు రావాలనిపించదు. అప్పుడు బాహ్య మనస్సు సదా ప్రశాంతతను పొందగలదు.

ఈ సమస్యకు, సరియైన పరిష్కారము ఒక్కటే పైనవున్న జ్ఞానజ్యోతికై గాఢంగా ఆకాంక్షించడము మాత్రమే.

*

స్వయంగా అభివృద్ధి కోరేవారు, ఈ సాధనామార్గంలో మొదటి మెట్టుపై ఉన్నవారు వాళ్ళకి అర్థం కాని విషయము ఎదుట నిశ్శబ్దంగా వుండటం అలవరచుకొంటే ప్రగతి సాధించవచ్చును. ఉలుకూ పలుకూ లేక బయట మౌనంగా వుండడమేగాక అంతరంగంలోకూడా అదే విధంగా ఉండగలగాలి. మనసు తన అజ్ఞానాన్ని ప్రకటిస్తూ మామూలు భావనలతో గర్వించకుండా నిగ్రహించ కలగాలి. అవగాహనే తెలియని ఒక పరికరం మనకు ఏ విధంగానూ, ఉపయోగపడదు కదా! అందుకని తన సమయం వచ్చేవరకు కాచుకొని తన దౌర్బల్యాన్ని గుర్తెటిగి సరళంగా, నిదానంగా నెమ్మదిగా వికసించి వచ్చే వెలుగును స్వీకరిస్తే, ఆ శక్తిని సంపాదిస్తే, ఆ నిజమైన ప్రకాశమే సదవగాహనను

కలగజేస్తుంది. మనం నేర్చినది, చూచినదీ జీవితానుభవంలో గ్రహించి నదీ మొత్తమంతా చేర్చిన దానికన్నా చాలా మిన్నయైన ఇంకొక దినుసున్నది. ఎందుకంటే జ్ఞానజ్యోతిని అందుకోవాలంటే మనస్సు తన పరిధిని దాటి ఉన్నత శ్రేణుల్లోకి వెళ్ళకతప్పదు. అది ఒక్కటే మార్గం. ఆ మార్గంలో త్వరితగతిని సాధకుడు ప్రయాణం చేయదల చుకొంటే దైవానుగ్రహంకోసం వినమ్రతతో, నిరాడంబరంగా, భక్తి శ్రద్ధలతో, నిశ్చలంగా వేచివుండాలే తప్ప మరో ఉపాయం లేదు.

నీవు దైవంయొక్క సత్యవాణిని వినాలంటే శబ్దాడంబరము మానుకోవాలి. అప్పుడుగాని సత్యము ఆవిష్కారమైనపుడు దానిని నీవు వినలేవు.

మనస్సును నిశ్శబ్దపరచుకోవడం, ప్రశాంతతను పొందడం నేర్చుకోవాలంటే అది ఒక ప్రబల సమస్యే అయినప్పటికీ దానికోసం ఏమి చేయాలని అదే పనిగా సతమతమైతే ఒరిగే ప్రయోజనం ఏమీ వుండదు. ఆకాంక్షా సుహృద్భావములతో నీవు ఎంత నిశ్శబ్దంగావుంటే అంత స్పష్టంగా దివ్యవాణి నీకు వినబడగలదు.

నీవు ఒక గడ్డుసమస్యలో చిక్కుకొన్నప్పుడు నేను చెప్పే ఈ మార్గాన్ని ప్రయత్నించి చూడు. అంతరంగంలో ఆందోళన పడవద్దు, ఉద్రేకాలను అణచుకో. విపరీతమైన బాధతో అవిశ్రాంతంగా చిరాకు పడటం, సమస్యకు పరిష్కారం కోసం పరిపరి విధాల అటూ ఇటూ దొర్లటం — ఇవన్నీ మానుకోవాలి. కాకపోతే ఇదంతా అంతరంగ ప్రశాంతత మాత్రమే సుమా. *బాహ్యంగా సమస్యకు మార్గం కనుగొన డానికి ప్రయత్నం మానరాదు — ఆమాత్రం లోకజ్ఞానం నీకుందను కుంటా.* నీ స్వభావ స్వధర్మాల మేరకు ఆర్ద్రంగాగాని ప్రశాంతంగా గాని, తీవ్రముగా గాని విశాలభావముతో గాని దీక్షతో జ్ఞానజ్యోతికై ఆకాంక్షించు. అది దిగివచ్చే శుభతరుణానికై నిశ్చలంగా వేచివుండు.

*

మన మనస్సును నిశ్శబ్దంగా ప్రశాంతంగా వుంచుకొంటూ, హృదయాన్ని మాత్రం తీవ్రమైన ఆకాంక్షతో నింపుకోవాలి.

అనువాదం: సి. కె. రామనాథచెట్టి, టి. యస్. రామచంద్రరావు

శ్రీమాత ఉవాచ:

జ్ఞానానికి మొదటి మెట్టు

అమ్మా! జ్ఞాన సముపార్జనకు మొదటి మెట్టు ఏది? అని ప్రశ్నించగా దివ్యమాత చేసిన హితవు ఇది.

మొదటి మెట్టా?... మనిషి తన పరిమిత పరిశీలన మనోవికాసాలనుంచి గ్రహించిన విషయాల్నే విజ్ఞానం అనుకొనే భ్రమనుంచి వైదొలగడమే మొదటి మెట్టు. ఈ లౌకికజ్ఞానానికి ఏదో విలువఉందని, అదే కచ్చితమైనదని భావించే భ్రమించే తత్త్వంనుంచి మొదట బయట పడగలగాలి; పడాలి.

అయితే ఇది అంత సులభమైనపని కాదు సరికదా క్లిష్టతర క్రియ అని కూడ మనకు తెలుసు. శాస్త్రవిషయాల్ని శాస్త్రవిభాగాలలోని వివిధ శాఖల్ని అధ్యయనం చేసినప్పుడు, మనకు వాటి మధ్యగల సాపేక్షత గురించి స్పష్టమైన గుర్తింపు, అవగాహన ఏర్పడుతాయి. అలా కాక ఒక అడుగు క్రిందకు దిగి జీవన సమస్యల గురించి, వాటి పరిష్కారంగురించి ఆలోచించినట్లయితే ఈ విజ్ఞాన శాఖలు ఏదో సమాధానాన్ని ఇస్తున్నట్లు కనిపిస్తాయి. వేరువేరు పరిస్థితులలో వేరువేరు సమస్యలు ఎదురైనప్పుడు మనం ఎలా వాటిని ఎదుర్కొనాలో అవి మార్గదర్శనం చేస్తున్నట్లు తోపిస్తాయి. ఈ మొత్తం మానసిక క్రియా కలాపాన్నే 'జ్ఞానం' అని మనం భావిస్తున్నాము. కార్యకారణ సంబంధాన్ని సమన్వయపరచుకొనే మానసిక దశను 'జ్ఞానం' అని నిర్వచించవచ్చు. వయస్సుతో, అనుభవాలతో, ఆలోచనలతో ఈ శక్తి విస్తృతం అవుతుంది. ఇదే ఒక వ్యక్తియొక్క అస్తిత్వాన్ని నిర్దేశిస్తూంటుంది.

అయితే ఇది మాత్రమే పూర్తి జ్ఞానం అని అనుకోరాదు. అంతకు మించిన మానసిక పరిధి ఉంది. ఆలోచనా క్రమం ఉంది. ఉన్నత భూమికల ప్రపంచాలు ఉన్నాయి. వాటి వైపుకు విస్తరించాలి. ఆ భూమికనే వైశ్వక మేధ అంటున్నాం. నీ ప్రమేయం ఉన్నా లేకున్నా అది తనపని తాను చేసుకొనిపోతూ ఉంటుంది. నీ స్పృహ ఏమీ లేకుండానే అది నీలోనూ పనిచేస్తూంటుంది. అంచేత నువ్వు ఈ భావనల అస్తిత్వాన్ని గుర్తించడం, మననం చేయడం, సమన్వయపరచడం

అనే జ్ఞానం వైపు ఎదగాలి. అప్పుడే నీవు అనుష్ఠించిన ఆదర్శాలు, ఆలోచనలు జ్వలితాలవుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే నిన్ను నువ్వు "అంతర్బహిస్థితులలో పూర్తిగా గ్రహించడం" జ్ఞానం అనబడుతుంది. ఈ అన్వేషణలో జ్ఞానాన్ని ఆవరించిన భ్రమ, అస్థిరత, అవగాహనాలోపం అనే గోడలున్నాయి. వాటిని ఛేదించుకొని అనంతమైన సాపేక్షస్థితిని గుర్తించగలగాలి. ఆధ్యాత్మిక సంకల్ప చైతన్యంచేత, సాధనచేత మాత్రమే ఇది సాధ్యం కాగలదు. వస్తుప్రపంచం మధ్య అంతర్నిహితంగానున్న అనుబంధాన్ని ఆ భావానుబంధం మనిషి అస్తిత్వంలో నిబిడం అయి ఉన్న అంతరార్థాన్ని గుర్తించగలగాలి. అటువంటి మానసిక స్థితిని సాధించినట్లయితే ఇక ఆపైన నీ ప్రమేయం లేకుండానే నీ మనస్సు ఉన్నతాలోచనల్ని చేస్తుంది. అనంతత్వపు వైవిధ్య విన్యాసాన్ని దర్శించగలుగుతుంది. ఈ దశలోనే అంతశ్చేతన జాగృతమై కార్యకారణ సంబంధాల్ని సమన్వయపరిచే దశ ప్రాప్తిస్తుంది. దీనిలో నీ ప్రమేయం ఏమి ఉండదు. అంతా తనంతట తాను జరిగిపోతూంటుంది.

అంచేత జ్ఞానివి కావాలంటే, జ్ఞానాన్ని ఆర్జించాలంటే ఈ భౌతిక వస్తువుల ప్రమాణాన్ని గుర్తించడం మానేయాలి. అంతశ్శక్తిని ప్రదీప్తం చేసి నీలో నిబిడమైన జ్ఞానకాంతిని ప్రసరింప చేసుకొనగలిగితే "నిసర్గ జ్ఞానం, నిసర్గ సత్యం" సాక్షాత్కరిస్తాయి. భౌతిక నయానాల వెనుకనున్న అంతస్సూత్రాన్ని గుర్తించగలుగుతావు. అలౌకిక భౌతిక వస్తు ప్రపంచపు కొలతలలోనే ఉండిపోతే నీ ఆలోచన పరిమితం అయిపోతుంది. సత్యజ్ఞాన విస్తృతి తెలీదు.

నువ్వు మానవ పరిధుల్ని దాటి వెళ్లాలనుకొంటే, సాధారణ మానవస్థితిని అధిగమించాలనుకొంటే ఈ హేతు ప్రపంచంనుంచి ఆవలకు పయనించాలి. నీకు అనివార్యాలు అనిపిస్తున్న యీ వస్తువులు సులభ వర్జనీయాలు కావాలి. ఆనాడే నువ్వు ఈ వస్తుప్రపంచపు సాపేక్షతను అర్థం చేసుకోగలుగుతావు. *కనక భ్రమను వదలి పెట్టడమే జ్ఞానానికి మొదటి మెట్టు.*

స్వేచ్ఛానువాదం: పురాణపండ రంగనాథ

ఒక ప్రార్థన

మహాప్రభూ! నేనెప్పటికి నిశ్చలచిత్తుడనై, మనస్సును ఒక శ్వేతపత్రమువలె, నీవు నీ యిచ్ఛను దానిమీద అమిశ్రమంగా, నిరభ్యంతరంగా వ్రాయుటకై నిర్మలము గావించుకొని నీ మ్రోల చేతులు మోడ్చియుందును.

గతకాలపు వాసనలను స్మరించే లక్షణాన్ని అప్పుడప్పుడూ నీ భావననుండి తుడిచి వేయాలి. అప్పుడే నిరంతరమైన ఈ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని నిరోధించక, సాపేక్షికమైన ఈ ప్రపంచంలో నీ పరిపూర్ణమైన ఆవిర్భావాన్ని అనుమతించగలుగుతావు.

సాధారణంగా ఎవ్వరైనా గతానికి లంకె వేసుకుంటారు. విలువైన అనుభవాల్ని పోగొట్టుకుంటామనే సంకోచమే దానికి కారణం. అందువల్ల నిమ్న చేతనలోనే ఉండిపోయి విస్తృతమైన అనుభవాల్ని పోగొట్టుకుంటారు.

ఐనా నీ వాన్నైన నేనెందుకు బెదిరిపోవాలి? నీవు నాకోసం నిర్మించే దారిలో, సంతోషించే ఆత్మలో, ప్రకాశించే ఫాలభాగంలో నేనెందుకు సాగిపోరాదు? ఆ దారి ఏమైనా కానీ, తార్కిక బుద్ధికి సుతరమూ పట్టుబడదు.

మహాప్రభూ! పురాతన ఆలోచనా విధానములను పటాపంచలు చేయుము. గతకాలపు అనుభవాలను తొలగించుము. పృథ్వీమీద నీ కార్యప్రణాళిక నిర్దుష్టంగా సాగేందుకు అడుగడుగునా ఉత్తమంగా సాగిపోయేందుకు నీవు అనవసరమని భావిస్తే, చైతన్యంలోని ఇప్పటి సమన్వయాన్ని కూడా రద్దుచేయుము.

నవంబరు 20, 1914 — శ్రీమాత

నా నాథా!

ప్రతిదినము అన్ని సందర్భాలలోనూ, సంపూర్ణమైన చిత్తశుద్ధితో "*నీ సంకల్పమే కొనసాగనీ, నాది మాత్రం కాదు*" అని మరల మరల నేను నా హృదయంలో పలుకనీ.

5.11.41 — శ్రీమాత

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

మనస్సుకు ముందూ – వెనుకా ఏం ఉంది?

ప్రకృతి పరిణామంలో మనస్సు సర్వోత్కృష్ట భూమిక. అయితే ఇది భౌతిక పరికరాలకు కనిపించే పదార్థం కాదు. ఒక కాల్పనిక యవనిక వంటిది. ఒక ఊహాతెర వంటిది. ఒక మంచుపొర వంటిది. మనస్సును గురించి ఆర్షకాలపు వేద ఋషినుంచి నేటి ఆధునిక శాస్త్రవేత్త వరకు పరిశీలన చేస్తూనే ఉన్నారు. మహర్షి శ్రీఅరవిందులు తనదైన యోగదృష్టితో ఈ అంశాన్ని మనకు వివరించారు. ఇది శ్రీఅరవిందుల అంతర్వాణికి అక్షరరూపం.

మనస్సుకు ముందూ వెనుకా 'చైతన్యం' ఉంది. అది అవాఙ్మానసం. అది శాశ్వతమైనది. నాశనం లేనిది. అదే ప్రకృతిగా పరివర్తనం చెందుతోంది. అంచేత ఈ విశ్వసృష్టి అంతా ఏదో ఒక వైశ్వికమేధ యొక్క చిన్నకల్పన అనుకోరాదు. ఇది మానవాతీతమైన ఒక విన్యాసంగా భావించబడాలి. ఒక "చైతన్య సత్యం" తనకు తాను బహురూపాలుగా వ్యక్తం చేసుకొంటున్న లీల ఇది. ఈ సత్య చైతన్య స్ఫురణమే నిసర్గ జ్ఞానమనబడుతుంది. ఆ జ్ఞానంనుంచే రూపాలు, ఆకారాలు, ధర్మాలు, గుణాలు ఏర్పడి సృష్టి జరుగుతోంది. వాటిమధ్య సమన్వయం సాగివస్తోంది. మనస్సుకి — ద్రవ్యరాశికి మధ్య ఒక సత్తా ప్రవహిస్తూ సృష్టి నడుస్తోంది. ఇలా చూసినప్పుడు మనస్సు — ప్రాణం — శరీరం యివి విశ్వచైతన్యశక్తి ముందు చాలా ప్రాథమిక భూమికలు. ఈ మనస్సుకు ఆవల ఉన్న ఉన్నతచైతన్య భూమికకి యివి నిమ్న రూపాలు; పాక్షిక ప్రదర్శకాలు. అనగా మనస్సుకి ఆవలి తీరంలో ఉన్నదే శాశ్వతమైనది. అదే సర్వ సృష్టికారకమైనది.

*

మనస్సు — ప్రాణం — శరీరం చేసే ప్రతిపని వెనుక ఏదో ఒక 'శక్తిస్రవంతి' ఉన్నదని మనం భావిస్తూంటాం. అది ప్రపంచంలోకి జన్మించి ఉండలేదు. కాని ఉంది. తనను తాను ఈ వస్తుప్రపంచంలోకి సమన్వయం చేసుకొంటూ ఉంటుంది. అది సర్వాంతర్యామి. అలా

అని అది తనని తాను నిజస్వరూపంలో మనకు అభివ్యక్తం చేసుకోదు. రూపగుణాల్ని ధరించి గారడీలు చేస్తూంటుంది. తన ఉనికిని మాత్రం ఏమీ భంగపరచుకోదు. ఏమీ కల్మషం చేసుకోదు.

అంటే మనం నివసిస్తూన్న ఈ ప్రపంచమంతా మనం చూడ లేని ఒక సత్యం యొక్క అభివ్యక్తి అన్నమాట. ఇది కొన్ని నియమిత నిర్దిష్ట సంకల్పాన్ని అనుసరించి ఉంటుంది. అదే దివ్య సృష్టి లీల. ఈ సత్యాన్ని గుర్తిస్తే మనస్సుకు ముందూ, వెనుకా ఏం ఉన్నాయో తెలుసుకోవడం కష్టం ఏమీ కాదు.

అయితే ప్రత్యక్షప్రమాణంతో పనిచేస్తూన్నంత కాలం, బాహ్యా డంబరాలతో ఉన్నంతకాలం మనస్సుకి ముందూ వెనుక ఉన్న స్థితిని అవగతం చేసుకొనడం అంతసులభం కాదు. కాని చక్రనేమి క్రమాన్ని ప్రకృతి పరిణామాన్ని మాత్రం మనం అనుభూతికి తెచ్చుకొంటూ ఉంటాము. ఏదో ద్రవ్యశక్తి చేతనచే ప్రకాశితమై ఈ సృష్టి పరిపక్వత వైపు పూర్ణత్వంవైపు పయనిస్తూన్నదని అనిపిస్తుంది. ప్రతిచోట ఒక నియమం సాక్షాత్కరిస్తుంది. ఈ నియమం ఒక సూత్రంవలె సర్వత్రా వ్యాప్తిచెందడాన్ని వివేకంతో విశ్లేషించుకొన్నట్లయితే ఒక "జ్ఞాన స్పృహ" నుంచే యీ నియమం జన్మిస్తున్నట్లు తెలుస్తుంది. ఆ ప్రకృతి నియమం — ఆజ్ఞానం, ఆ సత్యం — ఇదే ఒక సత్యచైతన్యం అని గ్రహించాలి. జ్ఞానం నిర్దేశించిన నియమం ద్వారానే దివ్యలక్ష్యం వైపు ఈ సృష్టి తన ప్రయాణాన్ని సాగిస్తూన్నదనే స్పృహ కలుగుతూంది.

ఈ స్పృహ కలగాలంటే మనం హేతువుని అన్వేషించడం మానివేసి అంతర్ముఖులం కావాలి. అక్కడే మరో క్రియాకలాపం నిబి డమై ఉంది. అక్కడే చైతన్యం నిశ్శబ్దంగా ఉంది. బాహ్యంగా మనకి అనుభవానికొచ్చే మేధోజనిత క్రియాకలాపాలకన్నా ఎన్నో రెట్లు శక్తి వంతమైనది ఈ చైతన్యం. అది సంకల్పవికల్పాలాకన్నా అతీతమైనది. ఈ తేడా మన అనుభూతికి వచ్చినట్లయితే అంతస్సులో దివ్యకాంతి జన్మిస్తుంది. ఈ బాహ్యాప్రపంచపు అనిశ్చితి గురించి, పరహితి గురించి ఆ కాంతి మనకి తేటతెల్లం చేస్తుంది. హేతువు అనే దీపపు రెపరెపలు అంతమై చైతన్యతేజః పుంజం ఆవిష్కృతమై సత్యసాక్షాత్కారం జరుగు తుంది. మనస్సుకు ఆవల జ్ఞానం నిరీక్షిస్తూ ఉంటుంది. మేధాజన్యమైన

హేతువాదానికి ఆవలి తీరంలో అనంత కాంతిపుంజం వలె ఆత్మ జ్యోతి వెలిగిపోతూ ఉంటుంది.

*

హేతువును మాత్రమే అన్వేషించే స్వభావం గల మనస్సుకి ఆవల 'జ్ఞానసంకల్పం' ఉంది. అదే ఈ సృష్టి నిర్మాణానికి బీజ మంత్రం. అయితే ఆ సంకల్పానికి ఈ సృష్టికి మధ్య ఉంది మనస్సు. దివ్యసంకల్పం మనస్సుద్వారా సృష్టిని చేస్తోందన్న మాట. అలా కాని పక్షంలో సృష్టిని గురించిన విశ్లేషణని, విచారణని మెదడు — మనస్సు చేయలేదు. అంచేత జ్ఞానచైతన్య సంకల్పశక్తినుంచి మనస్సు పుట్టింది కనక మనస్సును కూడా పరిమితశక్తి కలదిగానే భావించాలి. ఈ క్రమంలో "దివ్య జ్ఞాన సంకల్ప చైతన్యశక్తి" మాత్రమే పరహితిని ప్రదర్శించగల విలక్షణ శక్తి గలిగి ఉందన్న మాట. అది తన విన్యాసాన్ని మనస్సులోకి ప్రవేశపడుతూంటుంది. ఈ విలసన క్రమంలో "అతిమానస స్థితి" ఒకటి ఉందని గ్రహించాలి. మనస్సు వేరు, అతి మనస్సు వేరు, దివ్యజ్ఞాన సంకల్ప చైతన్యశక్తి వేరు అని తెలుసుకో వాలి. ఇవి ఒకదాని నుంచి వేరొకటి జన్మిస్తున్నపుటికి స్వయం వ్యక్తాలుగా స్వయంశక్తిమంతాలుగా కనిపిస్తాయి. కాని అది నిజం కాదు. పరస్పరం ఆధార ఆధేయాలుగా ఉన్న ఈ స్థితిని సాధనచే గుర్తించ గలగాలి. వైశ్వకసంకల్పచేతన నుంచి అతిమనస్సు, దాని నుంచి మనస్సు ఏర్పడి ఈ సృష్టికార్యం జరుగుతోంది. అందుకే ఒకొక్కసారి మనస్సు తనున్న భూమికనుంచి కొంచెం ఉన్నత భూమికకు ఉత్థానం చెందుతూంటుంది. అది చైతన్యసీమవరకు ఉద్గమించవచ్చు. అక్కడ ఉజ్వలకాంతిసందేశాన్ని తీసుకొని భౌతిక ప్రపంచంలోకి దిగి రావచ్చు. కాని ఆభూమిక వద్దనే ఉండిపోయి దానితో కలసి జీవిస్తూ, దానిని చూస్తూ, దానినుంచే పనిచేయడం ఒక అద్భుత విజయం. ఇంత వరకు మనిషి ఆవిజయాన్ని సాధించలేక పోయాడు. ఆవిజయానికే మనస్సు ఆరాటపడాలి.

స్వేచ్ఛానువాదం: పురాణపండ రంగనాథ

మనస్సు యొక్క అసలు దోషం

మనస్సు అతిమానసము (supermind = విజ్ఞానము) యొక్క నిమ్న స్వరూపము. అత్యంత వైభవోపేతమైన అతిమానసము దిగజారి పోయి మనస్సుగా ఎలా పరిణమించింది? అఖండ వస్తువును ఖండ ఖండములుగా చీల్చివైచే ఈ అవిద్య ఎక్కణ్ణుంచి ఊడిపడింది? అతి మానసము యొక్క ఏ వైకృతము దీనికి కారణము? వైయక్తికమైన ఆత్మ ప్రతిఅంశాన్నీ తన దృష్టితో — సర్వేతరాంశాలనూ అపవాదించి చూడటంతో యిది ప్రారంభం అవుతున్నది. తన అస్తిత్వక్రీడలోని ఒక భాగమై, ఒకానొక తాత్కాలిక పరిమిత దేశకాల కార్యంలో ఆత్మ పదార్థం కేంద్రీకరించటం వలన, తనను తాను గుర్తించే ప్రక్రియవలన అది ప్రవృత్తమవుతున్నది.

ఈ దోషం, ఆత్మ పదార్థం స్వేతరమైనదంతా తానేననే అంశాన్ని విస్మరించటంతో ప్రారంభమవుతుంది. తాను ఆక్రమించి ఉన్న ఒకానొక ప్రత్యేక క్షణంలోని ఒకానొక ప్రత్యేక స్థలంలోని కార్య జాతమే కాక ఇతరమైన కార్యకలాపంకూడా, తన కార్యకలాపమే అనీ, చైతన్యంలోని అన్ని భూమికలూ తానేననీ అన్న విషయం విస్మ రించటంతో వచ్చింది. ఆ క్షణంలో ఆత్మపదార్థం ఒక పరిమిత క్షేత్రం పైన, ఒకే రూపంపైన, ఒకే వృత్తిపైన కేంద్రీకరించి మిగిలిన దాన్ని అంతా కోల్పోతుంది. ఇతరమైన తనను, దేశకాలాలలోని కాలఖండాల పరంపరతో, దేశశకలాల పరంపరతో అనుసంధించుకొని పొందవలసి ఉంటుంది. తత్కారణంగా దేశము అఖండము, కాలము అఖండము, పదార్థము అఖండము అనే సత్య భావనను కోల్పోతుంది.

పరిదృశ్యమానమయ్యే అనేకమైన అస్తిత్వ స్థావరముల మీద కేంద్రీకరించటం వలన — అనేక నిశ్చయాలుచేసే అన్ని మనస్సులు ఒకే మనస్సనీ, అనేక కార్యధోరణులకు కారణమైన బ్రతుకులు ఒకే బ్రతుకనీ, అన్ని శరీరాలు ఒకే ఒక చైతన్య శక్తిలోని వస్తువేననీ గ్రహిం చటం తన దృష్టిలోంచి తొలగిపోతుంది. నిజానికి ఈ ప్రత్యేకరూపా లన్నీ (stabilities) నిరంతరమైన పద్మాదళాకార భ్రమణమై తిరిగి తిరిగి

అంటే రూపాన్ని మారుస్తూ వుండటం వలన ఏర్పడిన ఆకారాలు తప్ప వేరేమీ లేదు.

మనస్సు బాహ్యాంగా కానవచ్చే వాటిని ప్రతి ఒక్క దాన్నీ మారనిదిగా కదలనిదిగా నిర్దిష్టరూపంలో నిరూపించుకుంటుంది. అలా చేయకపోతే అది పని చేయలేదు. అప్పుడది తాను కోరినది లభిం చినట్లు భావిస్తుంది. నిజానికి అదంతా మార్పుల పునరాచరణల నిరం తరావృత్తి. నిశ్చితమైన స్వరూపంగానీ, అవికారమైన అంశంగానీ అక్కడ ఏమీ లేదు.

అనంతమైన నిత్యత్వ భావన మాత్రమే నిశ్చయంగా నిర్దిష్ట క్రమబద్ధమైన నిలుకడ (stability) కలిగి వుంటుంది. మనస్సు మాత్రం ఎప్పుడూ అనంతనిత్యత్వ భావనను అనుకరిస్తూ — ప్రతి అంశానికీ నిశ్చయభావాన్ని కుదుర్చుకుంటుంది. ఈ సత్యాలను మనస్సు ఇంకా తెలుసుకోవలసి వున్నది.

ఈ సత్యాలు మనస్సుకు ఎప్పుడూ తెలుసు. అవి తన చైత న్యపు లోతులలో దాగివుంటవి. స్వచేతనలోని రహస్యకాంతిలో దాగి వుంటవి. కాని ఈ కాంతి తనకుతాను సృష్టించుకొన్న అజ్ఞానంవలన చీకటిగానే ఉంటుంది! విభక్తమైన మనోలోకాన్ని విభజించుకుంటూ విస్మృతిలో పడిపోవటం వలన, తన కార్యజాతంలో సృజనక్రియలో విలీనం కావటం వలన యిది జరిగింది...

ప్రాణమయసత్త* కూడా శరీరదోషం నుండి బయటపడ గలిగినా, మనోదోషంనుండి విముక్తిని కలిగించ లేదు. దీనికంటే అతీ తమైనదీ దీనిలో ప్రతిఫలించేదీ అయిన ఉన్నతమైన మనోమయసత్త ఒకటి ఉన్నది. అది జీవనంలో లీనంకాకుండా తప్పించుకోగలదు. తననే ప్రాణంగా శరీరంగా భావించి సంకల్పంలోనూ, ఆలోచనలోనూ గ్రహించిన సక్రియ శక్తి సంబంధాలను నిరూపించుకుంటుంది. మన లోని మేధావికి యిది కుదురు. యిది మనఃస్థితికి మూలమైంది. ప్రపం చాన్ని ప్రాణిక దేహభూమిక మీదనుంచి కాక మనోభూమిక మీద

---

* ప్రాణసత్తగా లేదా ప్రాణమయ పురుషుడుగా గుర్తింపబడుతుంది.

నుంచి చూస్తుంది. మనం ఎలా సక్రియ బుద్ధిని ఆత్మగా పొరబడతామో, అలాగే దీన్ని* ఒక్కోసారి అచ్చమైన చైతన్యంగా పొరబడతాము.

ఈ ఉన్నతమనస్సు అచ్చమైన తన చైతన్యానికి రూపాంతరాలైన ఇతరాత్మలను గమనించి, వాటితో సంబంధం పెట్టుకోగలదు. కేవలం నరాలకు సంబంధించిన లేదా ప్రాణికమైన స్పందనలు కాకుండా — మనస్ స్థాయిలో ఇతరాత్మలను గ్రహించగలిగి తన భావాలను ప్రసరింప జేయగలిగి వుంటుంది. ఇది మనోదశలో ఒక లోకాన్ని భావించగలుగుతుంది. మామూలు జీవితంలో వలె అప్రత్యక్షంగా కాక, తన క్రియలలోనూ సంకల్పంలోనూ ఇతర మనస్సులనూ, జీవితాలనూ ప్రత్యక్షంగా తనవిగా భావించగలదు. ఈ అచ్చమైన మనః స్థితికూడా మౌలికమైన అతిమనస్సునుండి జారటానికి కారణమైన దోషంనుండి విముక్తం కాదు. ఐనా అది ప్రత్యేకమైన ఉన్నతమైన మానసిక చేతనయే. అందువల్ల అది విచారణ చేయటం, సాక్షిగా ఉండటం, విశ్వకేంద్రంగా నిలచిపోవటం కద్దు. అది ఈ స్థితి ద్వారానే తనకంటే ఉన్నతమైన చేతననూ, సత్యాన్నీ దర్శించే ప్రయత్నం చేస్తుంది. ఇతరంశాలన్నీ తనచుట్టూ గుంపుకట్టిన స్వేతరాంశలే. ఇంకా అవిద్యాయవనిక అతిమానసికక్రియకూ, మానసికక్రియకూ నడుమ నిలచి ఉంది కనుక తాను పరిమితులనుండి విడుదల పొందదలచి నప్పుడు ప్రాణమయ మనోమయ భూమికలను వదలి ఉబికివచ్చి సత్యమైన ఏకతలో లీనం అవుతుంది. అప్పుడైనా సత్యం యొక్క ప్రతిబింబాన్ని దర్శిస్తుంది కాని సత్యాన్ని కాదు...

మనస్సు యొక్క మౌలిక దోషం ఈ ఆత్మజ్ఞానం నుండి కలిగిన పతనమే. దీనివల్ల వ్యష్ట్యాత్మ వ్యష్టిలక్షణాన్ని వేరుగా భావించటం, తనను ఏకత్వం యొక్క ఒకానొక రూపంగా కాక, తన స్వీయ లోకానికి కేంద్రంగా భావించటం జరుగుతుంది. ఆ మౌలికమైన దోషం వల్ల ప్రత్యేకమైన అజ్ఞానములూ, పరిమితూలూ అనుకోని విధంగా సంభవిస్తాయి.

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

---

* మనోమయసత్త లేదా మనోమయ పురుషుడు

మనస్సు యొక్క సృజనశీలత

మనస్సు యొక్క మూలస్వరూపము: ఎప్పుడు అవిద్య అనే ఆచ్ఛాదనము ఛేదించబడి, (ఇంతదనుక) విభక్తముగానున్న మనస్సు వశమై, నిగ్రహమై అతిమానసక్రియకు విధేయమగునో అప్పుడు మాత్రమే మనస్సు స్వయముగా వస్తువుల సత్యమును తిరిగి చేరుకొనును. అచ్చట మనము విచారశీలము, విధేయము, దివ్యవాస్తవ-భావమునకు ఉపకరణమునగు ఒక ప్రకాశమయ మనస్తత్త్వమును గనుగొందుము. ప్రపంచముయొక్క సత్యస్వరూపమేదియో, అట మనము గ్రహింతుము. అట మనము సర్వదా మనల నితరులలోను, ఇతరులనుగాను దెలిసికొందుము. అటులే ఇతరులను మనలనుగా దెలిసికొందుము. మఱియు అందరును, అన్నియును వైశ్వ మఱియు స్వయం-బహుళీకృత ఏకమాత్రునిగా గనుగొందుము. అపుడు, ఏది సమస్త పరిమితత్త్వము మఱియు భ్రమకును మూలమో, కఠోరముగా వేఱుచేయబడిన ఆ వైయక్తిక దృక్కోణమును మనము విడిచివేతుము. అట్లు విడిచివేసినను, మానసిక అజ్ఞానము దేనిని సత్యమని తలంచెనో, అది నిజానికి సత్యమే, కాని విచలితము, భ్రాంతము, మిథ్యాభావితమనగు సత్యము అను విషయమునుగూడా మనము గ్రహింతుము. ఉదాహరణకు, మనమింకను విభజనను జూతుము, వైయక్తీకరణమును జూతుము. అణురూప సృష్టిని జూతుము. కాని వానిని, మనలనుకూడా వానినిజరూపమున, మననిజరూపమున తెలిసికొందుము. మఱియు ఆ నిజరూపజ్ఞానముతో మనస్సు (సత్యమే కాని) సత్య-చేతన యొక్క ఒక అధీనక్రియ మఱియు ఉపకరణ-చర్యయని గ్రహింతుము. ఎంతదనుక మనస్సు తన స్వానుభవమునందు తననావరించియుండు ప్రభు-చేతననుండి వేఱుపడదో, వేఱువడి తనకొఱకే ఒక గృహమును నిర్మించుకొన యత్నించదో, అటులే ఎంతదనుక నది ఉపకరణభావమున వశ్యముగా సేవించునో, సేవించుచు తన లాభము నిమిత్తమే దేనిని వశము గావించుకొన యత్నించదో, అంతదనుక మనస్సు తన కార్యమును ప్రకాశమయముగా నెరవేర్చిన దగును. పరమ సత్యమునందు రూపములను వాని క్రియయొక్క ఒక బాహ్య, కేవలము ఒక

రూపమాత్రగత పరిశీమనము (delimitation) చేత విడివిడిగా నుంచుటయే ఈ కార్యము; ఈ కార్యము వెనుక మనోమయ పురుషని యొక్క నియామక విశ్వమయత సచేతనముగను, అక్షతముగను, నిలిచి యుండును. అది వస్తువుల మూలసత్యమును స్వీకరించి, దానిని ఒక పరమ మఱియు వైశ్వచక్షువు మఱియు సంకల్పముయొక్క అభ్రమశీల దర్శనము ననుసరించి పంచవలసి యుండును. ఏ వ్యక్తిభావము తన సమస్త సామర్థ్యమును సత్యతను, సమ్మోదమును తన వెనుకనుండు ఒక అవిచ్ఛేద్య విశ్వభావమునుండి సేకరించుకొనునో, సక్రియ చేతన, ఆనందము, శక్తి, ద్రవ్యముల యొక్క అట్టి ఒక వ్యక్తిభావమునది (మనస్సు) నిలిపి యుంచవలెను. అది ఏకము యొక్క బహుళత్వమును ఒక ప్రతీయమాన (పైకట్లు కన్పించు) విభజనలోనికి మార్చవలెను. అట్టి విభజనచేత వస్తుసంబంధముల నిర్దిష్టము, పరస్పర సంఘర్షితములు కాగా, ఆ వస్తువులు తిరిగి కలిసికొని, సంయుక్తము కాగల్గును. అది వియోగపూర్వక సంయోగము వలన గలుగు ఆనందమును ఒక సనాతన ఏకత మఱియు పరస్పర సమ్మిశ్రమున స్థాపించవలసి యున్నది. అది ఏకమాత్రునికి (పరమపురుషనికి) తాను ఇతర వ్యక్తులతో, కాని సదా స్వీయ ఏకతయందు, వ్యవహరించునట్టి ఒక వ్యక్తియైనట్లు ప్రవర్తించగల సామర్థ్యము నీయవలసి యున్నది. మఱియు నిదియే నిజానికి జగత్స్వరూపము. మనస్సు అభిగ్రహణాత్మక సత్య-చేతన యొక్క అంతిమ వ్యాపారము, ఇదియే జగత్సృష్టినంతను సంభవము గావించును. పోతే, దేనిని మనము అజ్ఞానమని పిలుతుమో, అది ఒక నూతన వస్తువును, కేవల అనృతమును సృజించదు. కింతు కేవలము ఉన్న సత్యమును తప్పుగా చిత్రించును. అజ్ఞానమన, తన జ్ఞానమూలమునుండి వేఱుచేయబడిన మనస్సే. ఈ మనస్సు, పరమ సత్యము తన వైశ్వ అభివ్యక్తియందు సలుపు సామరస్యపూర్ణ క్రీడను విరోధ, సంఘర్షముల ఒక భ్రాంత ఆకృతిని, ఒక మిథ్యాకఠోరతను కట్టబెట్టును.

*

మనఃస్వరూప సమీక్ష: ఇట్లు తన దివ్యమూలమునందు మనఃస్వరూప మేదియో, సత్య-చేతనతో తనకుగల సంబంధ మెట్టిదో,

గాధ్యాయమున మనము చూచియున్నాము. మనస్సనునది మన మానవసత్తయొక్క అంగములగు మూడు నిమ్నతత్త్వములలో సర్వో త్కృష్టమైనది. అది దివ్యచేతనయొక్క ఒక క్రియావిశేషము, అథవా దాని సంపూర్ణ సృజనాత్మక క్రియయొక్క అంతిమ ఘట్టము. ఈ మనస్సె విశ్వ పురుషుడు తనయొక్క విభిన్నరూపములు మఱియు శక్తుల పర స్పర సంబంధములను విడివిడిగా పట్టియుంచగల్గును. ఈ మనస్సె (విలుకొలుకు) పై పై విభేదములను సృజించును. కాగా ఈ విభేదములు సత్య-చేతననుండి పడిపోయిన వైయక్తిక అంతరాత్మ దృష్టికి మౌలిక భేదములుగా గన్పించును. మఱియు ఈ ఆదిమ వికృతిని గల్పించిన ఈ మనస్సు తక్కిన ఫలిత వికృతులన్నింటికిని తల్లి యగును. పోతే ఈ ఫలిత వికృతులు అవిద్యాగతుడైన జీవుని జీవనమునకు అనురూప ములగు ప్రతికూల ద్వంద్వములు మఱియు విరోధముల రూపమున మనలో ముద్రపడును. కాని ఎంతవఱకు మనస్సు అతిమనస్సు నుండి విలుపడదో, అంతవఱకది వికృతులు మఱియు అనృతములకుగాక, విశ్వ సత్యముయొక్క వివిధ క్రియాకలాపమునకే ఆశ్రయముగా నుండును.

మనస్సు సృష్టికర్త: ఇట్లు మనస్సు ఒక సృజనాత్మక వైశ్వచర్యగా గోచరించును. కాని, ఇది మన మనస్తత్త్వమును గుఱించి మనకు సాధారణముగానుండు భావము కాదు: ఏలన, ప్రాయః మనము దీనిని ముఖ్యముగా ఒక గ్రహణాత్మక (perceptive) అవయవముగా, ద్రవ్య మునందు పనిసేయు శక్తిచేత అంతకుముందే సృజించబడిన వస్తువులను గ్రహించునట్టి అవయవముగా, జూతుము. పోతే, ఇది ఒక అప్రధాన విషయమున మాత్రమే ఉత్పత్తి జనకమని మనమంగీకరింతుము. ద్రవ్యమునందు శక్తిచేత పూర్వమే రూపొందించబడిన రూపముల నుండి నూతన సంయుక్త రూపములను సృజించునట్టి ద్వితీయ సామ ర్థ్యము మాత్రమే దీనికిగల దనుకొందుము.

అతిమనస్సే ముఖ్య సృష్టికర్త: కాని మనస్సు ఒక స్వతంత్ర మఱియు మౌలిక దినుసు ఏమాత్రము గాదు, కింతు అది సత్య-చేతన లేక

అతిమనస్సు యొక్క ఒక అంతిమక్రియ మాత్రమేయని మనము చూచి యున్నాము. కనుక ఎక్కడ మనస్సు ఉండునో, అక్కడ అతిమనస్సు ఉండవలెను. అతిమనస్సు లేక సత్య-చేతనయే విశ్వసత్త యొక్క యథార్థ సృజనాత్మక చర్యయగును. తన అంధకారిత చేతనయందు మనస్సు తన మూలమునుండి వేఱువడినపుడు సైతము దాని క్రియా కలాపమునందు అతిమనస్సు యొక్క విశాలతర వృత్తి సదా పనిసేయు చుండును. ఆ వృత్తి తమ సముచిత సంబంధమును నిలుపుకొొన ఆ క్రియాకలాపములను బలాత్కరించును. తమ లోపల తాము ధరించి యున్న అనివార్య ఫలితములను తమనుండి ఫలింపజేయును. అనురూప బీజమునుండి అనురూప వృక్షమును బుట్టించును. ఇట్లు ఆ విశాలతర వృత్తి భౌతికశక్తి వంటి అజ్ఞము, జడము, అంధకారితమునగు ఒక వస్తువుయొక్క క్రియలను సైతము నిర్బంధించి, అవి నియమము, వ్యవస్థ మఱియు సముచిత సంబంధములతో గూడిన ఒక ప్రపంచ రూపమున ఫలించునట్లు చేయును. పోతే, ఈ నిర్బంధమే లేనిచో, గ్రుడ్డిగా వచ్చిపడుచుండు యాదృచ్ఛ (chance) మఱియు అవ్యస్థలతో గూడిన ప్రపంచమే మన ముందుండును. స్పష్టముగనే, ఈ వ్యవస్థ మఱియు ఋత (సత్య) సంబంధము సాపేక్షము మాత్రమే కాగలవు. అవి పరమవ్యవస్థ మఱియు పరమ ఋతము గాజాలవు. మనస్సు తన చేతనయందు అతిమనస్సునుండి వేఱువడి యుండనిచో...

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు (దివ్యజీవనంనుండి)

ఒకొొక్కసారి తగినంత కారణం లేకుండాకూడా వ్యాధి ముదిరి మరణానికి దారితీస్తుంది. దానికి రోగి మనస్సే కారణం! అది శరీరానికి కల్గిన రుగ్మతను గురించి రకరకాలుగా ఊహించుకుంటూ దానినింకా విపరీతం చేస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వి. ఆర్. శాస్త్రి

మనస్సును సత్యద్రష్టగా మలచుట ఎలా?

సాధనలో మొదటి మెట్టు: మానవత్వంనుండి దివ్యత్వానికి, వైరుధ్యాలతో కూడిన భిన్నత్వంనుండి ఏకత్వానికి, పరిణామశీలమైన ప్రకృతి నుండి నిత్యసత్యమైన శాశ్వతత్వానికి చేసే ప్రస్థానం మానవుని ఆత్మకు ఒక పునర్జన్మ లేక నూతన జన్మ. ఈ పునరుజ్జీవనం విధిగా రెండు స్థాయిలలో ఉంటుంది. మొదటిది — ఆత్మను, దాని ఉపకరణాలైన దేహేంద్రియ మనో బుద్ధులను నిర్మలంగా చేసికొనటం. రెండవది — ఆత్మజ్ఞానోదయం, ఆత్మానుసంధానం. ఈ రెండు స్థితులకు నిజానికి నిర్దిష్టమైన హద్దు లేదు. నైర్మల్యం, ఆత్మజ్ఞానం ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధం కలిగి ఉండి, ఏకకాలంలోనే సిద్ధిస్తూ ఉంటవి. ఆత్మ ఉన్నత స్థితులకు చేరేకొద్దీ జ్ఞానప్రకాశం దీప్తిమంతమౌతూ ఉంటుంది. చిత్తశుద్ధినీ, మనోనైర్మల్యాన్ని ఎంతగా పొందితే, అంతగా ఉన్నత స్థాయిని ఆత్మ అందుకుంటూ ఉంటుంది. అలాగే ఆత్మ ఉన్నతినిపొందే కొద్దీ దేహేంద్రియ మనోబుద్ధులు పవిత్రతను పొందుతూ ఉంటవి. ఇవి ఎప్పుడూ అనులోమ నిష్పత్తిలోనే ఉంటవి. ఆత్మోన్నతి కనుగుణంగా దాని ఉపకరణాలైన దేహేంద్రియ మనో బుద్ధులు నైర్మల్యాన్ని సంతరించుకొని సమర్థవంతమైన ఉపకరణాలుగా రూపొందుతవి.

అయితే ఈ సాధన ఒకప్పుడు జ్ఞానదీప్తిలేని శుష్క వ్యవహారంగా మాత్రమే ఉండవచ్చును. మరొకప్పుడు వెలుగుతో కూడిన ప్రగతిగానూ భాసించవచ్చును. ఈ వెలుగు క్షణమాత్రమే అనుభవం కావచ్చును. లేక గంటలు, దినాలు, వారాలు అవిచ్ఛిన్నంగా వెల్లివిరియవచ్చును. ఈ వెలుగు ఒకప్పుడు తటిల్లత వలె మెరిసి అదృశ్యమౌతూ ఉంటుంది. మరొకప్పుడు స్థిరంగా దేదీప్యమానమైన ప్రకాశంగానూ ఉంటుంది. ఆత్మ క్రమంగా ఇటువంటి స్థితులన్నిటినీ అధిగమించి, సంపూర్ణము, సమగ్రమైన శాశ్వతత్వం దిశగా ఎదిగి, పునరుజ్జీవనాన్ని, నూతన జన్మనూ పొంది, సచ్చిదానందస్థితిలో నిశ్చలంగా వర్ధిల్లుతుంది.

సంశుద్ధి: సాధనలో ముఖ్యమైన అంశము మాలిన్యాల్ని తొలగించుకొనటం. దేహేంద్రియ మనోబుద్ధులను నిర్మలంగా ఉంచుకొనటం. ముఖ్యంగా, జ్ఞాన మార్గావలంబనకు వివేకం అనగా నిర్మలమైన బుద్ధి అత్యవసరం. సత్పదార్థాన్ని తెలిసికోటానికి ఇది ఎంతో ముఖ్యం. దేహము, ఇంద్రియములు, మనస్సు (దీనినే హృదయం అందాము) నిర్మలంగా లేనిదే బుద్ధి సక్రమంగా పనిచేయదు. మలినమైన హృదయం, సంయమనం లేని ఇంద్రియ వ్యాపారం, శౌచరహితమైన జీవనవిధానం బుద్ధిని కలవరపరచి వివేకభ్రష్టతకు కారణములౌతవి. అపవిత్రమైన జీవితం ఇంద్రియజ్ఞానాన్ని వక్రీకరించి, కుతర్కానికి దారి తీసి, సక్రమమైన నిర్ణయాలను చేయటానికి కావలసిన బుద్ధికుశలతను లోపింపచేసి, అజ్ఞానాంధకారానికి మూలమౌతుంది. మాలిన్యం తొలగించబడని భౌతికక్షేత్రం బౌద్ధిక వ్యాపారానికి అడ్డుగా నిలుస్తుంది. సమగ్రమైన, సర్వాంగీణమైన పవిత్రత, నైర్మల్యం అత్యవసరం. దైహికమైన, ఇంద్రియ సంబంధమైన, మానసికమైన, బౌద్ధికమైన సంశుద్ధి ఇవన్నీ పరస్పరాశ్రితములు. ఈ నాలుగు అంగాలలో ఒకదాని పవిత్రత, మరియొక అంగముయొక్క పవిత్రతకు సహాయపడుతుంది. ఉదాహరణకు, హృదయాన్ని (భావోద్వేగాలను) నియమిస్తే, బుద్ధి తీక్షణత సిద్ధిస్తుంది. అలాగే అమలినమైన అవగాహన (బుద్ధి) హృదయ దౌర్బల్యాలను అదుపు చేస్తుంది. మానవుని వివిధాంగాలు (దేహము, ఇంద్రియాలు, హృదయము, బుద్ధి) వేరు వేరు పద్ధతులలో శుభ్రపరచబడినప్పటికీ, మాలిన్యరహితమైన వివేచనా జ్ఞానం (బుద్ధి) అత్యంత సమర్థవంతమైన శక్తిగా పరిణతినొంది, కల్లోలితమైన హృదయాన్ని ప్రశాంత స్థితికి తెచ్చి, వెలుగును ప్రసాదిస్తుంది. వివేకమే మానవజీవితాన్ని సక్రమమైన మార్గంలో నడిపించి మానవుని మహితాత్మునిగా చేస్తుంది. భగవద్గీత ఇదే చెప్పింది: జ్ఞానమే పవిత్రాతి పవిత్రం. జ్ఞానమనే ప్రకాశం సమస్తమైన పవిత్రతలకు మూలం. అజ్ఞానమనే అంధకారం అన్ని తడబాటులకు, అవకరాలకు మూలం. ఒక ఉదాహరణ తీసికొందాము — ప్రేమ మానవుని హృదయాన్ని పవిత్రం చేస్తుంది. మన భావోద్వేగాలను అన్నింటినీ భగవంతునియందు ప్రేమగా రూపొందిస్తే, హృదయం పునీతమై, కృతార్థమౌతుంది. అయితే, జ్ఞానాగ్నిచేత సంస్కృ

తమైతేనే భగవద్భక్తి పరిపక్వమవుతుంది. భగవద్భక్తి జ్ఞానదీప్తము కానప్పుడు, మూఢవిశ్వాసంగా, సంకుచితమైనదిగా మారి అజ్ఞానంతో మతమౌఢ్యానికి, మూర్ఖత్వానికి దారితీయవచ్చును. జ్ఞానహీనమైన మూఢభక్తి, ఎంత నిష్కల్మషమైనదిగా ఉన్నప్పటికీ, మన హృదయ పరిపూర్ణతకు అడ్డుగా నిల్చి, భగవంతునికి ఒక పరిధి కల్పించి, సత్య మైన, నిరవధికమైన, అనంతమైన పరమాత్మ భావనకు విముఖంగా చేస్తుంది. అదే విధంగా, మానవులందరి ప్రేమ, మానవసేవాతత్పరత కూడా, సంపూర్ణజ్ఞానము లేనప్పుడు, ప్రమాదభరితమైన భావోద్వేగా లకూ, అతిశయానికీ దారితీస్తుంది. కనుక, కర్మ, భక్తి, జ్ఞానము అనే మూడు మార్గాలున్నూ వివేకముచేత సుసంపన్నము కావలెను.

బుద్ధి యొక్క మాలిన్యానికి ప్రథమ కారణము: బుద్ధిలోని మాలిన్యా నికి మూలకారణం, మన ఆలోచనా సరళిని కలుషితపరచే కాంక్షలు లేక కామనలు. కామనలు మన సంకల్పాలలో ఉన్న మాలిన్యం. మానవుని అహం (నేను అనే భావన) ప్రాణమయకోశంమీద, మనోమయకోశంమీద, అధికారం చేస్తూ ఉంటుంది. ప్రాణిక, ఉద్వేగా త్మక కామ్యాలు జ్ఞానసముపార్జనా సంకల్పానికి అడ్డువస్తే, ఆలోచనా ప్రక్రియ వాటికి బానిస అవుతుంది; తగని గమ్యాల వెంటపడుతుంది; అవగాహన కుంటుపడుతుంది; వివేక భ్రష్టత కలుగుతుంది. అవగా హన, కోరికలకు, భావోద్వేగాలకు అతీతంగా ఉండాలి. దానికి వాంఛ లనుండి సంపూర్ణమైన రక్షణ కలగాలంటే, ఇంద్రియనిగ్రహము, మనో నైర్మల్యము సాధించాలి.

మాలిన్యానికి రెండవ కారణము: బుద్ధిలోని మాలిన్యానికి రెండవ కారణము, ఇంద్రియాలు కల్పించే భ్రమ. ఇంద్రియలాలసమైన మనస్సు సక్రమమైన ఆలోచనాసరళిలో కల్పించే విఘ్నాలు. ఇంద్రియజ్ఞానము నిజమైన జ్ఞానము కానేరదు. దాని స్వరూపము నిరంతరం మార్పు చెందుతూ ఉంటుంది. అది ఎప్పటికి సమగ్రమైనది కాదు. కనుక దానిని ఎప్పుడూ యథాతథంగా నమ్మటానికి వీలులేదు. దానిని ఎల్ల ప్పుడూ విశ్లేషిస్తూ, దిద్దుకుంటూ ఉండాలి. *ఇంద్రియ గోచరమైన*

సమాచారానికి మూలమైన ప్రకృతి శక్తులను పరిశీలించటముతోనే విజ్ఞానశాస్త్రం ప్రారంభమయింది; భ్రమపూరితమైన ఇంద్రియజ్ఞానానికి అందని మూలసూత్రాలను పరిశీలించటముతో దర్శనశాస్త్రాలు ప్రారంభమైనవి; అసమగ్రమైన ఇంద్రియజ్ఞానాన్ని తిరస్కరిస్తూ, దృశ్యమాన జగత్తు యావత్తూ ఆ సత్పదార్థముయొక్క లీలావిశేషంగా భావించటంతోనే ఆధ్యాత్మిక అన్వేషణ ప్రారంభం అవుతుంది.

ఇంద్రియాధిష్ఠితమైన మనస్సును, నిరంతరం సంకల్ప వికల్పాలనే అలలతో కల్లోలితంగా ఉండే దానిని, నిశ్చలంగా చేసి, ఆలోచనా ప్రక్రియను వివేకవంతమైన బుద్ధికి అప్పగించటమే ఆధ్యాత్మిక సాధనలోని మొదటి సోపానం.

మాలిన్యానికి మూడవ కారణం: బుద్ధిలోని మాలిన్యానికి మూడవ కారణం బుద్ధిలోనే ఉత్పన్నమౌతుంది. అంతా ఒక్కసారే తెలుసుకోవాలన్న ఆత్రుత సదవగాహనకు అడ్డుపడుతుంది. అంతే కాకుండా, పక్షపాతం, వ్యామోహము, సరియైన అవగాహనను కుంటుపరుస్తవి. పక్షపాత ధోరణితో కొన్ని భావనలనే స్వీకరించి తద్విరుద్ధ భావనలను ఉపేక్షించటముకూడా జరుగుతుంది. మూర్ఖమైన పట్టుదలతో ఒక భావననే చింతిస్తూ, ఇతర భావనలలో ఉన్న సత్యాన్ని గ్రహించకుండా తిరస్కరించే తత్వం, సత్యాన్వేషణలో కొన్ని అంశాలకే ప్రాధాన్యతనిస్తూ, మిగిలిన అంశాలను అంగీకరించటానికి వెనుకాడే స్వభావం, తనకు ఇష్టమైన సిద్ధాంతాలను మాత్రమే పట్టుకొని, ఇతరమైన సిద్ధాంతాలను తిరస్కరించటం, తన అనుభవానికి రాని సత్యాలను పరిశీలించకుండా వదలివేయటం మొదలైనవి అవగాహనాలోపానికి కారణాలవుతూ ఉంటవి. సమదృష్టి, సామరస్య భావన ఇటువంటి లోపానికి తగిన ఔషధం. ఆలోచనాసరళిని రాగద్వేషాలకు అతీతంగా సాగించాలి.

పైన చెప్పిన మూడువిధాలైన దోషాలను పరిహరించి, నిర్వికారమైన బుద్ధితో సత్యాన్వేషణను సాగించాలి. పరిశుద్ధమైన అవగాహన, వ్యామోహాలకు అతీతం. ఏ ఒక్క సిద్ధాంతానికి అనవసరమైన ప్రాధాన్యతను ఇవ్వకుండా, నిష్పక్షపాతంగా అన్ని భావాలను, అన్ని కోణాల

నుంచీ పరిశీలిస్తుంది. అటుల కానియెడల సత్యాన్వేషణలో సమ తౌల్యం లోపించి, సంపూర్ణ జ్ఞానం లభించదు.

ఇంకొక ఆవశ్యకత: పైన చెప్పిన విధంగా నిర్మలంగా తీర్చబడిన బుద్ధి, చక్కగా ఎటుపడితే అటు మలచటానికి అనుగుణంగానున్న సమగ్రతాపూర్ణమైన, లోపరహితమైన ఉపకరణంగా, తత్త్వవిచారానికి ఉపయోగపడుతుంది; హీన ప్రకృతినుండి ఉద్భవించే విఘ్నాలకు వక్రీకరణకు అతీతంగా ఉంటూ, బుద్ధిచేత తెలుసుకోగలిగినంత వరకు ఆత్మయొక్క సత్యతత్త్వాన్ని సృష్టిరహస్యాల్ని తెలుసుకోగలుగు తుంది. సత్యమైన జ్ఞానం బుద్ధినైశిత్యంచేతగాని మేధాశక్తిచేతగాని లభించేది కాదు. అది మనోబుద్ధ్యహంకృతులకు అతీతమైన ఆత్మానుభ వము. దానికి మరియొక విధమైన సాధన అవసరం. మన మేధాశక్తి, సత్యమైన జ్ఞానానుభూతికి, ఆటంకం కాగూడదంటే, చురుకైన మేధ కలిగిన బుద్ధిజీవికి రుచించనటువంటి, ఆతని ప్రకృతికి విరుద్ధమైనట్టి మనోనిశ్చలత, ఆలోచనారహితమైన ఉదాసీనత అలవరచుకోవాలి. ఇది రెండువిధాలుగా ఉంటుంది.

రెండు విధాలైన మనో నిర్లిప్తత: మనం మొదట బౌద్ధికమైన ఆలోచన చాలదనీ, అదే అత్యున్నత భావనాస్థాయి కాదనీ తెలుసు కొన్నాము. అది తర్కనిరపేక్షమైన సహజస్ఫురణమునుండి. (intuition) అతీతమానసిక కౌశలమునుండీ ఉద్భవిస్తుంది. క్రిందిస్థాయిలోని తార్కి కబుద్ధికి మనము లోబడి ఉన్నంత వరకూ, మనకు అతీతమానసము యొక్క సహజవాణి వినబడదు. ఒకవేళ కొద్దిగా వినబడినా, పూర్తిగా వికృతిచెంది ప్రయోజనకారి కాజాలదు. అతీతజ్ఞాన స్ఫురణము కలగా లంటే, మనము ఏ విధంగా, ఇంద్రియ జ్ఞానముమీద ఆధారపడి, సంకల్ప వికల్పాలతోను, భావోద్వేగాలతోను కూడిన మనస్సును, వివే చనాత్మకమైన బుద్ధినుండి విడదీశామో, అదే విధంగా సహజ స్ఫురణ మునుండి తార్కికబుద్ధిని విడదీయాలి. ఇది సులభసాధ్యమైన సంగతి కాదు. ఎందువల్లనంటే ఆ అంతఃస్ఫురణము సాధారణంగా తర్కసిద్ధ మైన ఆలోచనారూపంలోను లేక భావోద్వేగ రూపంలోనే మారువేషం

ధరించి మనకి సాక్షాత్కరిస్తుంది. అందుచేత దానిని మనము గుర్తించ టము కష్టసాధ్యము. దీనికి విరుగుడు ఏమిటంటే, ముందుగా మనం మన బుద్ధికి అంతఃస్ఫురణాన్ని గుర్తించే విధంగా శిక్షణ ఇవ్వాలి. మనం తార్కికంగా ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత, ఆ నిర్ణయాన్ని ప్రక్కన పెట్టి, అతీతజ్ఞాన స్ఫురణ కొరకు నిశ్శబ్దంగా ఎదురు చూడాలి. ఈ విధంగా మనం తార్కికమైన బుద్ధితో చేసే నిర్ణయాలను అతిమాన సికమైన అంతఃస్ఫురణతో, దివ్యజ్ఞానంతో మలచుకొనవచ్చును. ఆదర్శం గానయితే ప్రతి నిర్ణయము దివ్యస్ఫురణముగానే ఉండాలి. అది సర్వత్రా సాధ్యపడకపోయినా, చాలావరకు అలా ఉండేటట్లు చూడవచ్చును. మన మనోబుద్ధులకు పైన విలసిల్లే ఆ దివ్యతేజస్సునుండి వచ్చే ఆదేశా ల ప్రకారం మన జీవిత విధానాన్ని నడుపుకోవాలి.

ఆత్మజ్ఞానం సిద్ధించాలంటే మనస్సు పూర్తిగా నిస్తరంగం (ఆలోచనలను, తర్కవితర్కాలను పూర్తిగా త్యజించటం) కావాలి. మనోబుద్ధులు పూర్తి నిశ్శబ్ద, నిశ్చల స్థితిని చెందినప్పుడే ఆత్మ ప్రకా శిస్తుంది. ఆలోచనలన్నింటినీ ఆపివేయటం అనేది పాశ్చాత్య విద్వాం సులకు అర్థమయ్యే విషయం కాదు. భగవద్గీతకూడా ఈ ఆలోచనా రాహిత్యత యొక్క శక్తిని చెప్పింది.

మనస్సు ఆలోచించకుండా ఉండే ఉదాసీనతను దాని బల హీనతగా భావించరాదు. అదే దానిశక్తి. మనస్సును స్వాధీనం చేసు కొన్నవాడే మనీషి. మనస్సుయొక్క నిశ్శబ్ద, నిశ్చల స్థితి ఒక అద్భుత మైన ఆధ్యాత్మికస్థితి. దానినుండే జ్ఞానభాస్కరుడు ఉదయిస్తాడు. మనస్సు పూర్తిగా నిశ్చలమై, అలల కదలికలేని స్వచ్ఛమైన నౌసారం వలె, సంపూర్ణమైన శాంతస్థితిలో ఉన్నప్పుడే ఆత్మసాక్షాత్కారం లభి స్తుంది. అట్టి నిశ్చల నిశ్శబ్దస్థితినుండే సమస్తజాలము ఉత్పన్నమౌ తుంది. సంపూర్ణమైన నిశ్శబ్దంలోనే 'నీరవం' అనుభూతమౌతుంది. ఇదే అపరోక్షానుభూతి, పరమశాంతి, ఉపనిషత్తులు చెప్పిన "తత్" శబ్దం యొక్క అర్థం, నిశ్శబ్దం, శాంతి — పరిపూర్ణ శాంతి అని మనకు తెలుస్తుంది.

అనువాదం: ఎ. యస్.ఆర్.కృష్ణమూర్తి

మనస్సుయొక్క సామర్థ్యమును పెంచుట ఎలా?

మానసికజ్ఞానము (అజ్ఞానము) వేరు. యోగజ్ఞానము వేరు. మొదటిది పరిమిత జ్ఞానము మానుషేంద్రియములచే సీమితము. యోగనేత్రము తెరుచుకున్నప్పుడు జ్ఞానం కలుగుతుంది. అది దివ్యం, అనంతము. దాని ఎత్తు వేరు, అంతస్తు వేరు. అది మనస్సుయొక్క కొలమానానికి అందదు. అయితే ఉన్నత సీమలనుండి దిగివచ్చిన జ్ఞానము మానవ మనస్సులో కలుషితముగాక మానదు. మనస్సు ఎంత నిర్దోషంగా, ఎంత నిస్తరంగంగావుంటే ఆ జ్ఞానంకూడా అంత ప్రమాణంగా మనస్సులో ప్రతిబింబిస్తుంది. మానవప్రకృతి యోగములో ఎంత ప్రక్షాళణ మౌతే, ఈ జ్ఞానంకూడా అంత దివ్యంగా గ్రాహ్యమౌతుంది. ఈ వివిధ ప్రక్రియలను గురించి మనం తెలుసుకొనెదము.

— సంపాదకుడు

మనోవ్యక్తిత్వాన్ని, అహంకారాన్ని, బుద్ధిలోని కాముకత్వాన్ని, ఉద్రేక సంచలనాత్మకతలను పూర్తిగా అణచివేసి, అనంత మౌనంలో ఆత్మను, ఆత్మోద్రిక్తతను, దివ్యత్వాన్ని మెలగడానికి అవకాశంయిచ్చి ఋజుమార్గంద్వారా బుద్ధిని ఆధిభౌతిక తేజస్సుగాను, శక్తిగాను, ఆనందంగాను భాసమానం చేయాలి. నిజంగా యిది ఒక ఉన్నతమైన, శక్తివంతమైన మార్గం. ఉద్రిక్తతకు లోబడిన బుద్ధికన్న, నిశ్చలనీరవత్వాన్ని కలిగిన బుద్ధి నిర్మలమై, ఆత్మతత్వాన్ని ప్రతిబింబిస్తూ, ఆత్మగా పర్యవసిస్తూ, దేహము ప్రకృతిగాగల యీ దేవాలయంలో అభిషిక్త దైవత్వాన్ని తెరతీసి చూపడానికి ఎంతో తోడ్పడుతుంది. అది దోష రహితంగా, అనంతత్వానికి ప్రతీకగా ఉంటుంది. ఈ విధమైన వికాసమే వ్యక్తిలోని అధిదార్శనికత పెంపొందడానికి, నిరాటంకంగా సంఘర్షణా రహితంగా అవతరించిన ఊహాలకు, భావాలకు, అన్వేషణలకు పరమ నిశ్చలత్వాన్ని, మౌనాన్ని (అనగా క్రియారాహిత్యాన్ని) ఆలోచనలకు, ఉద్రేకాలకు ఆటంకాలకు దూరంగా ఉంచుకొనడం ఎంతో లాభదాయకమైనది. మన బుద్ధిలో నిశ్చలత్వాన్ని కేవలం శక్తి

ఆదేశం మేరకుగాని, దివ్యప్రయోజనాలు సాధించడంకోసంగాని ఉపసం హరించుకోనాలి. ఆ పరిస్థితులలో ఆలోచన, వ్యక్తిత్వభావం అనే వాటి రూపురేఖలను మార్చడం ఎంతో సుగమమవుతుంది. అలా అని కేవలం దీనివల్లనే సమున్నతజ్యోతి బుద్ధి అట్టడుగుతెరలలో ఆవిష్కరించి, సత్యభావాన్ని స్పందింపచేస్తుందని కాదు. మౌనంద్వారా ఆత్మలోని ఆంతరంగిక స్పందనలు అధిదార్శనికతతోను, ఆలోచనలతోను తీవ్రమ యినప్పటికి, గతించిన శక్తులు కొన్ని అంతరంగంలోని, బాహిరమైన శక్తి బాహుళ్యంద్వారాగాని బలహీనమైన బుద్ధిలో చోటుచేసుకొని, దానిని ప్రశ్నిస్తూ, ఆటంకపరుస్తూ, సత్యమార్గంవైపు జరిపే ఆలోచన లను తమోమయంగా మార్చడంగాని, ప్రయత్నాలను కుంటుపరచడం కాని చేస్తాయి. కాబట్టి యీ విధానంలో బుద్ధిలోని బలహీనతలను తొలగించడం కాని, దాని స్వభావాన్ని మార్చడంకాని తప్పక చేయాలి. ఇవి రెండూ ఒకేసారి జరగాలి. సమున్నత సత్యం ఏమాత్రం అంగీకరిం చలేని, కేవలం క్షుద్రప్రకృతికే సుసాధ్యమైన ప్రమాదాలను తొలగిం చడం, విలువలు తగ్గించడం, పదార్థాన్ని నాశనం చేయడం అనే వాటిని తొలగించాలి. అధిబౌద్ధిక స్థితినుండి ఒక ఉనికిని పొందినా, బుద్ధి అజ్ఞానంతో కప్పబడడం వలన దానిని మార్చాలి.

*

మనిషి ఎంత అజ్ఞానంలో మునిగి వున్నప్పటికి, అతనిలో కొన్ని భాగములు జ్యోతిర్ముఖమై వుంటయి. మనం ఆ దీపాలని పట్టు కొని, ఆ వెలుగులో దివ్యచైతన్యాన్ని పైనుంచి ఆవాహన చేసి, చైత్య పురుషుణ్ణి అంతఃపురంనుంచి బైటకు రప్పించాలి. బాహ్యామనస్సులో జ్ఞానదీపాన్ని వెలిగించి, ప్రాణమయ పురుషుణ్ణి భగభగా జ్వలింపజేసే తపోగ్నిని రగుల్కొలపాలి.

కేంద్రీయసత్తు సమరస్యం: మానవుడు ఒకే వస్తువుచేత గాక, అనేక వస్తువులతో చేయబడ్డాడు. ఇక ఆతనిలోని ప్రతిభాగానికి ఒక ప్రత్యేక వ్యక్తిత్వముంది. ఈ సత్యమింకా జనులకు తగినంతగా అవగతం కాలేదు మనోవైజ్ఞానికులు దానినించుక గుర్తింప నారం భించారుగాని, ద్వివిధ లేక బహువిధ వ్యక్తిత్వం వెల్లడయ్యే ఒక

సందర్భం ఎదురైనప్పుడే వారు దాన్ని గట్టిగా గమనించుతున్నారు. అయితే సర్వమానవులు వస్తుతః అట్టివారే. ఈ విషయమున మనకీ యోగలక్ష్యముండాలి. ఒక బలమైన కేంద్రీయ సత్తును (అది ఇప్పటికే లేని పక్షంలో) మనం పెంపొందించుకుని, దాని ఆధిపత్యమున తక్కిన భాగాలనన్నింటిని సమరసపరుచుకోవాలి — మార్చవలసిన వాటిని మార్చుతూ పోతే ఈ కేంద్రీయ సత్తు చైత్యమే అయినట్లయితే, ఎట్టి కష్టమూ ఉండదు. అలా కాక, "మనోమయః పురుషః ప్రాణశరీరనేతా" లోని మనోమయసత్తే అది అయితే, అపుడు సామరస్య సాధన కష్ట తరం — ఇపుడు సైతం కష్టం లేకుండా ఉండాలంటే, మనోమయ పురుషుడు సదా భగవంతుని సంకల్పం, శక్తులతో సంపర్కమందుండి, వాటి సహాయం పొందడం నేర్చుకోవాలి.

*

సాక్షిపురుషుడు — చైత్యపురుషుడు: ప్రకృతిక్రియలు ఒక కలగూర గంపగా ఉండగా, సామాన్య మనస్సు తనను అహంకారంగా మాత్రమే ఎరింగి, అవే తాననుకుని, "నేను దీన్ని చేస్తున్నాను, దాన్ని సంవేదిం చుతున్నాను, ఆలోచించుతున్నాను, సంతోషంగా ఉన్నాను, దుఃఖంగా ఉన్నాను...." అని తలపోస్తుంది. యథార్థ ఆత్మజ్ఞానం తొలుదొలుత గలుగనారంభించినపుడు, నీలోని ప్రకృతినుండి, దాని క్రియలనుండి నీవు వేరు — అనే స్పృహ నీకు కలుగుతుంది. నీ సత్తులో అనేక భాగాలు, అనేక వ్యక్తిత్వాలు ఉన్నాయని, ప్రతిదీ తన నిమిత్తమే, తన మార్గంలోనే పనిచేస్తుందని అపుడు నీవు చూస్తావు. నీవు సంవేదిం చిన (feel) పురుషులిద్దరు వీరు: ఒకడు నిన్ను శ్రీమాతవైపుకు ఆకర్షించే చైత్యపురుషుడు, రెండవవాడు ప్రాయః ప్రాణమయుడైన బాహ్య పురుషుడు — ఇతడు నిన్ను నిమ్నప్రకృతి యొక్క ఖేలనం దిశగా బైటికి, క్రిందికి లాగుతాడు. నీమనస్సు వెనుక పరిశీలనాత్మకు డైన సాక్షిపురుషుడు గూడా ఉన్నాడు: ఇతడు అసక్తుడై, ప్రకృతి ఖేలనానికి దూరంగా నిలబడి, దానిని పరిశీలించుతూ, దాని క్రియలకు అనుమతినివ్వాలో, లేదో నిర్ణయించుకోగలుగుతాడు. ఈ సాక్షిపురుషుడు సదా చైత్యపురుషుని వైపునకు జేరి, అతని క్రియను అనుమతించి, దానికి ఆధారంగా నుండాలి. అదే సమయాన నిమ్నప్రకృతియొక్క

అధోముఖ బహిర్ముఖ క్రియను నిరాకరించి, దానిని చైత్యపురుషునికి అధీనం గావించి, అతని ప్రభావంచేత మార్చాలి.

*

ఈ జగత్తు అంధకారమయం, అజ్ఞాన పరిపాలనలో వున్నంత కాలం సృష్టికర్త దీనిని ఇట్లాగే కొనసాగిస్తాడు. అటుల చేయనిచో గీతలో చెప్పినట్లు "ఉత్సేదయుర్ ఇమే లోకాః" ప్రళయం వస్తుంది. మరి ఈ అంధకారబంధురంలోంచి బయటపడేందుకు కొన్ని నియమా లుంటాయి గదా. *సాధకుని మనస్సు పరమసత్యాన్ని గౌరవించాలి. అతని ఇచ్ఛ దైవేచ్ఛతో సహకరించాలి. ఈ పరివర్తనము మరీ మెల్లిగా నడుస్తోందని దేవుణ్ణి నిందించకూడదు. ఆయన ప్రకృతిని వెలుగు వైపుకు నడిపిస్తున్నాడు అని మానవుడు గుర్తించి దేవునితో పూర్తిగా సహకరించినప్పుడు ఈ ప్రయాణం శీఘ్రంగా జరిగి పోవచ్చును.* కాని సాధకుడుకూడ దానికితగిన శ్రమను, కాలాన్ని కేవలం మానవ ప్రమాణాలయిన అంధత్వం, బలహీనతావంటి వానితో కొలవగూడదు.

ఈ సహకారమునకు ముఖ్యంగా కావలసినది నమ్మకం నిజాయితీ ప్రపత్తి. అయితే మనస్సు యొక్క తార్కిక బుద్ధి అడుగడు గునా అడ్డుపడకూడదు. తనకు తెలిసిన విషయాలను గురించిగాని, తెలియని వాటిని (దైవానికి సంబంధించిన విషయములను) గురించి గాని తార్కిక బుద్ధితో పరిశీలించకుండా నోరుమూసుకొని వుంటే, దివ్యజ్ఞానమును గ్రహించటం, దివ్యానుభూతులను పొందటం సుగమ మవుతుంది. *నీలోని మనోమయ ప్రాణమయ విభాగములు ఏమాత్రం సంకోచించకుండా దేవుని హస్తములలోనికి సమర్పించుకున్నట్లయితే ఆయనశక్తి నీలోకి ప్రవేశించి నీకు ఫలితములను కలుగచేస్తుంది.* ఈప్రక్రియలో ఏవిధమైన అవరోధములైనా ఎదురైనప్పుడు ఈకార్యము మరికొంతకాలం పట్టవచ్చును. అటువంటప్పుడు దివ్యశక్తి అంతరంగం లోనికి ప్రవేశించి మనిషి స్వభావమును మార్చుటకు అంతర్గతంగా పనిచేస్తుంది.

తాత్పర్యం: "తమసోమా జ్యోతిర్గమయ" అనే ఉపనిషద్వాక్యాన్ని ఆచరణలో చూపడమే ఈ వ్యాసం ప్రాముఖ్యత.

అనువాదం: డా॥ కె. సత్యమూర్తి, ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి, చెలసాని నాగేశ్వరరావు (యోగం పై లేఖల నుండి)

లక్ష్యము సాధన

ఆలోచన, ఆదర్శాలు మనసుకు చెందినవే కావడం వల్ల అవి అర్థసత్యాలే. ఎందుకంటే మనసు చాలామట్టుకు ఒక భావాన్ని మనో దృశ్యంగా మలచుకోవడంతోటే తృప్తిచెందుతూ ఉంటుంది. నిజజీవితంపై అట్టి ఆదర్శం ఏ ప్రభావాన్ని చూపకపోవచ్చు. ఒకవేళ కొంత మార్పు కనిపించినా అది అంతరంగానికి చెందినదికాదు. అందువల్ల యోగసాధనచేసే వారి లక్ష్యము పరమసత్యాన్ని అనుభూతం గావించుకోవడమే కాని మనసులో దృశ్యమానమగు రూపాన్ని దర్శించుకోవడం కాదు. యోగి ఈ జన్మలోనో లేక జన్మాంతరంలోనైనా తన లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం సాధన చేస్తూనే ఉంటాడు. ఈ కారణంచేత, జగన్మాత నిర్దేశాలకు ఆత్మసమర్పణభావంతో తలవంచి, అట్టి పవిత్రపథంలో తన జీవనయానం సాగిస్తాడు. తన జీవితాన్ని అలా మలచుకోవడమే సాధన ఔతుంది.

నిర్గుణతత్త్వాన్ని సాధించగోరేవారు ఈ సంసారంనుండి విముఖులై, మరే ఇతర గొప్పశక్తిని ఆశ్రయించక తమ స్వయంకృషితోనే సాధన ప్రారంభిస్తారు. వారు వారి స్వంత ప్రతిభ, శక్తి, శ్రద్ధలపై ఆధారపడి పరిమిత ఫలితాలే పొందుతారు. అలాగాక *జగన్మాతకు ఆత్మసమర్పణ చేసుకొన్నవారికి నిర్గుణతత్త్వంతోపాటు సత్యంయొక్క అన్ని అంశాలు అనుభూతమౌతాయి.*

ఎవరూ ప్రారంభంనుండే సర్వసమర్పణ భావంతో అంకింతం కాలేరు. దశలవారీగా, క్రమేపి తమను తాము సమర్పణ చేసుకొంటూ లక్ష్యంవైపు ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్తారు. అటువంటప్పుడు ఎవరైనా తమలోకి చూచుకోవడం సంభవిస్తే సమర్పణభావం కనబడకపోవచ్చును. కాని, అంతమాత్రంచేత మొదట్లోనే సర్వసమర్పణ సిద్ధాంతాన్ని తృణీకరించ పనిలేదు. *సమర్పణను ఒక స్థాయినుంచి మరొకస్థాయికి, ఒక క్షేత్రంనుంచి మరొక క్షేత్రానికి వర్తింపజేసికొంటూ క్రమానుగత పరిణామంతో లక్ష్యం చేరుకోవడమే సాధన.*

అనువాదం: 'సులేఖ'

మనస్సు ఆరోగ్యము

కొంతమంది మనుషులుంటారు. వారి శరీరాలకు లేశమాత్రం బాధ కలిగినాకూడా తట్టుకోలేరు. తల్లక్రిందులైపోతారు. మరికొంత మంది ఎంత అనారోగ్యంతోవున్నా సరే — హాయిగా, నవ్వుతూ ఉంటారు. కానీ ఒకవేళ మానసికంగా దెబ్బతిన్నప్పటికి పూర్ణారోగ్యంగా ఉండేవారు చాలా అరుదుగా కనిపిస్తారు. ఎందుకంటే శరీరారోగ్యం చాలావరకు మానసిక పరిస్థితినిబట్టే ఉంటుంది కదా. భౌతిక శరీరానికి మనస్సు యజమాని అని చెప్పవచ్చు. ఈ శరీరం మనస్సు పట్ల వినయవిధేయతలతో ప్రవర్తించే ఒక మంచిసేవకుడని నేనంటాను. అయితే చాలామంది మనస్సును సరిగా ఉపయోగించుకోవడం చాత కాక దాన్ని దుర్వినియోగంకూడా చేస్తారు. ఎంత చెడ్డగా చేయగలిగితే అంత చెడ్డగా ఉపయోగించుకుంటారు. మనస్సుకు *చాలా గొప్ప కల్పనా శక్తి* (power of formation) *ఉంటుంది. అది శరీరంమీద సూటిగా పనిచేయగలదు.* సాధారణంగా ఆరోగ్యం పాడుచేసుకోటానికే ఈ శక్తిని అందరూ వాడుకుంటారు! ఎక్కడ ఏమాత్రం పొరపాటు జరిగినా వెంటనే మనస్సు అనేకరకాలైన ఊహారచనలు చేసి, అనేక ఆపదలను ఊహించుకుంటూంటుంది. ఇదా? అదా? ఇది అయితే ఏం జరుగుతుందో? ఎలా పరిణమిస్తుందో ఏమోనంటూ పరిపరివిధాల ఆలోచిస్తుంది. దానినరికట్టి, వినాశకరమైన చర్యలను కొనసాగనీయక, ఆ శక్తితో మంచి సౌకర్యమైన ఊహారచనలు చేయగలిగితే చాలా బాగుంటుంది. ఉదాహరణకు శరీరానికి ఆత్మస్థైర్యం కలుగచేయాలి — ఈ బాగుండకపోవటం శాశ్వతం కాదు; అది తాత్కాలికమైన వేదన తప్ప మరేంకాదు — అంటూ శరీరానికి నచ్చచెప్పాలి. స్థైన అవగాహన, గ్రహణశీలత ఏర్పడితే శరీరానికి కల్గిన రుగ్మత, వచ్చింది వచ్చినట్లే మాయమైపోతుంది. ఎవరిని వారు నిమిషాల్లో బాగుచేసుకోగలరు. ఇది నేర్చుకుంటే చాలా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వి. ఆర్. శాస్త్రి

సమాచార పత్రము

25 ఏప్రిల్ 1954 నాడు శ్రీమాత ఈ క్రింది ప్రకటన చేశారు.

ప్రకటన

శ్రీఅరవిందులు నాటి రాజకీయాలకు స్వస్తి చెప్పారు. అయిన ప్పటికి శ్రీఅరవిందులు ప్రపంచ వ్యవహారములను గమనిస్తూనే ఉన్నారు. సమకాలీన రాజకీయాలు చాలా నీచమైనవి, హేయమైనవి, కేవలం మోసము, అన్యాయము, అధికార దుర్వినియోగము, మరియు హింసాకాండలతో కూడియున్నవి; టక్కరితనము, ఒకటి చెప్పి మరొ కటి చేయడం, దురాశా దుర్బుద్ధులతో గాని మనిషి రాజకీయాలలో నెగ్గలేడు. అందుకని శ్రీఅరవిందులు ఈ విధమైన రాజకీయాలనుంచి దూరంగా ఉన్నారు. ఆశ్రమంలోని సభ్యులను కూడా రాజకీయాలలో ఏమాత్రమూ కల్పించుకోగూడదని ఆదేశించారు.

చిత్తశుద్ధి, సత్యచింతన, నిస్వార్థత కార్యనిర్వహణమునందు సమర్పణా భావము, సచ్ఛీలత, నిష్కాపట్యము యోగానికి అనివార్య ములు. ఈ ప్రాథమిక నియమాలను కూడా పాటించలేనివారు శ్రీఅర విందుల శిష్యులగుటకు అనర్హులు. అట్టివారికి ఆశ్రమంలో స్థానం లేదు. ఇటువంటి దుష్టబుద్ధులు ఆశ్రమాన్ని గురించి అడిగే కొంటె ప్రశ్నలను, చేసే ఫిర్యాదులను నేను పట్టించుకోను.

శ్రీఅరవిందులు తన మాతృభూమిని అపారంగా ప్రేమించారు. భారతదేశం ఒక గొప్ప దేశంగా భాసించి ప్రపంచంలో తను మాత్రమే నిర్వహించగలిగే ఘనమైన పాత్ర వహించాలని వారి నిరంతర ఆకాంక్ష. ఈ దేశం స్వార్థపరత్వముతోను అంధకారముతోను నీచస్థాయికి దిగి పోవుట వారు సహించలేరు. అందుకని వారి ఆశయముల కనుగుణంగా ఈనాడు మనం సత్యము, రూపాంతరీకరణముల ద్వారా మానవజాతి మనుగడను సాధించేందుకై పతాకమును ఎగురవేయుచుంటిమి. అజ్ఞా నము, మూర్ఖత్వము, ఈర్ష్య, దుర్బుద్ధులతో ఈ దేశాన్ని క్రిందికి లాగి మట్టిపాలు చేసేవారిని మనం లెక్కచేయబోము. మనము ఆకాశంలో

ఎత్తుగా ఎగురవేసే పతాకాన్ని ఆత్మస్ఫూర్తి ఉన్న వారందరు చూసి దాని చుట్టూ జేరెదరు గాక!

15 ఆగష్టు 99 నాడు ఆశ్రమంలో శ్రీఅరవిందుల 127 వ జన్మదినోత్సవము జరుపబడినది. ప్రాతఃకాలము 6-00 నుండి 6-30 వరకు సమాధివద్ద ధ్యానము, 14, 15 తారీఖులలో భక్తులకు శ్రీఅరవిందుల మందిర దర్శనము జరిగినవి. సాయంత్రము కవాతు ప్రదర్శన, బేండు వాయిద్యము, ధ్యానములతో కార్యక్రమం ముగిసింది. శ్రీఅరవిందుల చిత్రముతో కూడిన సందేశమును ఆనాడు పంచిపెట్టిరి. ఆ సందేశము:

A strong son of lightning came down to the earth with
fire-feet of swiftness, splendid;
Light was born in a womb and thunder's force filled
a human frame.
The calm speed of heaven, the sweet greatness, pure
passion, winged power had descended;
All the gods in a mortal body dwelt, bore a single name.

శ్రీఅరవిందో సొసైటీ వార్షికోత్సవములు బీచ్ ఆఫీసులో 11, 12, 13 ఆగష్టు తేదీలలో జరిగినవి. శ్రీయుతులు గోపాలభట్టాచార్జీగారు, మహేశ్వరి, అంబాప్రేమి షా, ఆనందరెడ్డి, శ్రద్ధాలు, నడకర్ణి, మనోజ్‌దాస్, విజయగార్లు సాధన, కర్మలు, భారతదేశం గురించి ప్రసంగించిరి. మరియు నాదముద్వారా రోగచికిత్స, శ్రీమాత నయనములు, నూతన యుగము, రూపాంతరీకరణము మొదలైన విషయములపై కూడా ఇతరులు ప్రసంగించిరి.
సావిత్రి అధ్యయనసత్ర 17 నుండి 25 ఆగష్టు తేదీలలో డా॥ నడకర్ణి గారిచే నిర్వహించబడెను.
శ్రీఅరవింద సొసైటీ వార్షిక సాధారణ సమావేశము కలకత్తాలో 28 అక్టోబరున జరుగుతుంది. సభ్యులకు జారీచేసిన నోటీసును 3 వ అట్టలో చూడండి.

శ్రీఅరవింద సొసైటీ స్త్రీల విభాగము 21 మొదలు 23 నవంబరు వరకు "దైవము కొఱకే జీవించుట" అనే అంశముపై ఒక గోష్ఠిని నిర్వహించె దరు. 17 20 నవంబరు తేదీలు శ్రీమాత శరీరమును చాలించిన దర్శన దినములు, 24 నవంబరు సిద్ధి దినము పాటింపబడును.

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వార్షికోత్సవములు 17, 18 అక్టోబరు తేదీలలో మధురలో జరుపబడును.

ఆదాయపు పన్ను మినహాయింపు: ఆదాయపు పన్ను చట్టము, 35 (1) (iii) section క్రింద, Assesment year 2002-03 వరకు, విరాళాలు యిచ్చేవారికి 100% మినహాయింపు కలదు. 80 G క్రింద 2004-05 వరకు కూడా మినహాయింపు కలదు.

శ్రీ ప్రదీప్‌నారంగుగారు పానాజీ, గోవాను 15 మే 99 న దర్శించిరి. 23-28 జూలై తేదీలలో ఢిల్లీ, పంజాబు, హరియానా, చండీఘర్‌లలో సభ్యులను కలసికొని చర్చలు జరిపిరి. శ్రీమాత పాదరక్షలు పాటియాలాలోని "ఆరోమిరా" అనే పాఠశాలలో భక్తిపూర్వకంగా ఆవిష్కరించిరి.

శ్రీగోపాలభట్టాచార్జీ జర్మనీ, యు.కె, యు.ఎస్.ఎ లలో 11th జూన్ - 4th ఆగష్టులలో పర్యటించిరి.

కేంద్రముల, శాఖల వార్తలు

ఆంధ్రపదేశ్‌లో విజయనగరం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, శ్రీఅరవిందపురం (అడ్డాడ) గోదావరి ఖని, తిరుపతిలలో బాలారవిందాలు (Children's corners) ప్రారంభించిరి. పిల్లల సెలవు రోజులలలోను, స్కూలు రోజులలో క్లాసుల తరువాత బాలల కార్యక్రమములు, వారిలో నిక్షిప్తమైనయున్న ప్రజ్ఞలను వికసింప చేయుట వీటి ప్రధానోద్దేశ్యము.

డేరాడూన్ (ఉత్తర్ ప్రదేశ్) లో స్త్రీల విభాగము వారు "Challenges before women in the Third Millenium in the light of Indian Culture and Heritage" అనే విషయముపై 10, 11 జూలై తేదీలలో ఒక సభను నిర్వహించిరి.

నవసారి గుజరాతులో 29 జూలై 99 న సంస్కృత సంవత్సరమును (1999) గురించిన సమావేశమును జరిపిరి.



పువ్వులు:
దేవుని చిరునవ్వులు

అఖిల

అఖిల భారత పత్రిక, నవంబరు 1999

ఒక సవరణ: 9 వ పుటలో



పై పువ్వుకు శ్రీమాత ఇచ్చిన సంకేతార్థము మరియు ఇతర వివరములు 9 వ పుటలో తప్పుగా ముద్రించబడినవి. ఒప్పైన వివరములు ఈ దిగువన ఇవ్వబడినవి. గమనించ ప్రార్థన.

ఆశీర్వాదములు

స్వచ్ఛము, అసంఖ్యాకము, అనంతము

Common name: Pincushions   Botanical name: *Scabiosa atropurpurea*

పువ్వులు:
దేవుని చిరునవ్వులు

విరులు:
సౌందర్యపు సిరులు ప్రేమ ఝురులు
సమర్పణాభావ లాహరులు

ప్రసూనాలు:
ప్రకృతి సమర్పించే ప్రేమ వికసిత
సౌందర్య నిధానాలు

నీవు యింకో మెట్టు పైకెక్కి తనంత తానుగా గులాబి పువ్వు చేసే అద్భుతమైన లీలను యిచ్ఛాపూర్వకంగా చేయ్. అప్పుడా సౌందర్య సమారాధాన మరింత అద్భుతమవుతుంది.

శ్రీమాత

*

అతిమానస శిఖరానికి చేరుటకై ఆకాంక్షతో కలలుగనే మానవుడా, వీక్షించుము విరిబాలను దీక్షతోడ వాంఛ లేక ఆమె చేయు అర్ప ణంబు కాంక్షతోడ సేయగలవు నీవెప్పుడు.

ఫ్రీడ్‌రిచ్ ఫాన్ స్కిల్లర్

ఓ దేవ!

చిత్రముగ ఈ సుమములందు
ఏదో మంత్రశక్తిని సమకూర్చినావు నీవు,
అందువలననే ఆ సుమబాల లెపుడు
కీర్తించుచుంద్రు నీ ఏకాంత సన్నిధిని గూర్చి
పుష్పహాసుడవగు నీదు హాసములను
ఎపుడు గొనివచ్చి మాకు అర్పింత్రు విభుడ

శ్రీమాత



ఆనందపు దరహాసము దాగియుండు సర్వంబున
తరుసారము ప్రవహించును జీవాయువైన వాయువుగా
చిత్రవర్ణ వైభవములు వర్ణములై భాసించును పుష్పములై వికసించును.

శ్రీఅరవిందులు

పువ్వుల గూర్చి శ్రీమాత

∴

పుష్పహాసునికి పుష్పాంజలి

శుద్ధ చైత్యపురుష చైతన్యం పుష్పానికి జన్మతః సిద్ధించింది. అందువల్ల మీరు నాకు సమర్పించినపుడు ఆ పుష్పాల స్థితి మీ పరిస్థితిని సూచిస్తుంది. కొందరు అప్పుడే వికసించిన పుష్పాన్ని నాకు సమర్పించటంలో కృతకృత్యులు కాలేరు. వారు పసివాడని పుష్పాన్ని తీసుకున్నా వారి చేతుల్లో అది నలిగి తునిగి పోతుంది. కొందరు ఎప్పుడూ వికసిత పుష్పాలనే తెచ్చి అందిస్తారు. వారి చేతుల్లో వాడిన పూలైనా క్రొత్త శక్తిని పుంజుకుంటాయి! నా ఆకాంక్ష గాఢమైనదైతే నీవర్పించిన పుష్పాలు పసివాడకుండా వుంటాయి. నీవు కుశాగ్ర బుద్ధివయితే నేను పువ్వుల ద్వారా అందించే సందేశాన్ని గ్రహింపగలుగుతావు. పువ్వుల్ని అందించే టప్పుడు మీకు నేను చైతన్య స్థితుల్ని ప్రసాదిస్తున్నాను. పుష్పాలు ఎప్పుడూ నా భావ వాహికలు. అవి మీ మీద ప్రభావం చూపుతాయా లేదా అనేది మీ యొక్క స్వీకృత శక్తి మీద ఆధారపడి వుంది.

మూలం: శ్రీమాత


భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

పూవులూ ఆశీస్సులూ

"ఇలా చూడండి! ఇక్కడ పూలూ, ఆశీస్సులూ వున్నాయి. ఇక్కడ ప్రేమమయుని దరహాసాలున్నాయి. ఆ ప్రేమమయుని ప్రేమను పొందడానికి ఎట్టి అర్హతలూ, ఆంక్షలూ లేవు. నిరంతరంగా సాగే ఆ ప్రేమప్రవాహం అపార కరుణతో అందరినీ పునీతం చేస్తుంది. అది తానిచ్చిన అద్భుతమైన కానుకల్ని తిరిగి తీసుకోదు."

ఊర్ధ్వంగా చాచిన బాహువులతో ముఖంలో వెలిగే ఆనంద తన్మయ ముద్రతో శ్రీమాత తన ప్రేమ హిమపాతాన్ని నిరంతరం జగతిపై కురిపిస్తున్నది.

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి



ఎరుపరంగుతో పెద్ద బంతివంటి పూవు—

అతిమానసావిర్భావము

భూమిపై అతిమానసావతరణము ఇక ఒట్టి వాగ్దానమే కాదు. నిజమైన వార్త. కల కాదు యథార్థము

Common name: Blood Lily Botanical name: *Haemanthus multiflows*



భూమిపై అతిమానసపు అజరామరత్వము
ఇది సిద్ధింపవలసి యున్నది.
సాధారణ నామము: సదా స్థాయి శాస్త్రీయ నామము: *Helichrysum bracteatum*

సౌందర్యమంటే

భావ ప్రపంచంలో సత్యానికి విలువివ్వక పోవటమెంత ఘోర తప్పి దమో అనేక రూపాలతో నిండియున్న ఈ ప్రపంచంలో సౌందర్యానికి విలువివ్వక పోవటం, అంత తప్పిదం

పరమేశ్వరుడికి ప్రకృతి సమర్పించే ఆరాధనా విశేషమే సౌందర్యం. ఆకారాన్ని స్వీకరించిన భగవంతుని యొక్క పరిభాషే సౌందర్యం. అవగాహన ద్వారా, అభివ్యక్తి ద్వారా బహిరంగంలోకి అనువదింపబడని దివ్యాత్మ చైతన్యం అసంపూర్ణమే అవుతుంది.

భగవంతుని మిగతా వ్యక్తస్వరూపాల్లాగా నిజమైన సౌంద ర్యాన్ని దర్శనం చేయటం గానీ, అవగాహన చేసుకోవటం గానీ చాలా కష్టసాధ్యమైన విషయం. ఇలాంటి దర్శనానికీ, ఆనందానుభూతిని పొందడానికీ ఎంత వ్యక్తిత్వం కావాలో అంత నిష్పాక్షికతా, నిరహం కారమూ కావాలి. పవిత్ర సౌందర్యం విశ్వజనీనమైనది. కనుక దానిని దర్శించడానికీ, అవగాహన చేసుకోడానికీ విశ్వజనీన దృష్టి కావాలి.

ఓ సౌందర్య దేవతా, నీవు లేకుండా ప్రేమ పరిపూర్ణం కాదు. నీవు ప్రేమ అలంకరించుకునే అమూల్యాభరణానివి. నీవు ప్రేమ యొక్క దివ్య దరహాసాలన్నిటిలో పరమ సుందరమైన దానివి.

నీ గురించి తమకన్నీ తెలుసుననుకునే అహంకారులు భావిం చినట్లు నీవు ఏదో ఒక సజీవ స్వరూపానికి మాత్రమే పరిమితం కావు. నిన్ను ప్రతి రూపంలోనూ మేల్కొల్పటం, ప్రకాశింప జేయటం తప్పక సాధ్యమే. అయితే నీ అంతర్ రహస్యాన్ని దర్శించిన వాడు మాత్రమే అది చేయగలుగుతాడు.

ఓ సౌందర్యాధి దేవతా, నీ తత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకునే అవగాహనా శక్తిని నీవే ప్రసాదించు. ఆ శక్తిని నేనెప్పుడూ పోగొట్టుకోకుండా ప్రేమాధిదేవత యొక్క పరిపూర్ణ మాధుర్యాను భూతిగా నిన్ను నాలో నిలుపుకుంటాను.

*

దివ్యాత్మ భౌతిక కక్ష్యలో సౌందర్యం ద్వారా, మానసిక కక్ష్యలో విజ్ఞానం ద్వారా, ప్రాణిక కక్ష్యలో శక్తి ద్వారా, చైత్యపురుష కక్ష్యలో ప్రేమ ద్వారా తనను తాను వ్యక్తం చేసుకుంటాడు.

మనలో ఔన్నత్యం పెరిగే కొద్దీ మనలో పై నాలుగు అంశాలు కలసిపోయి ఏక చైతన్యంగా రూపొంది, ప్రేమమయమై, ఉజ్వలమై, శక్తి వంతమై, సౌందర్యవంతమై, సర్వాన్ని తనలో ఐక్యం చేసుకుని సర్వ వ్యాపకమవటం దర్శిస్తాము.

*

భౌతిక ప్రపంచంలో దివ్యాత్మను అన్నిటికంటే ఉత్కృష్టంగా సౌందర్యం వ్యక్తం చేస్తుంది. భౌతిక ప్రపంచం రూపాలకు సంబంధిం చినదయితే, సౌందర్యం పరిపూర్ణతకు చెందినది. సౌందర్యం నిత్యుణ్ణి వ్యాఖ్యానిస్తుంది. వివరిస్తుంది; అభివ్యక్తం చేస్తుంది. సర్వవ్యక్త ప్రకృ తిని రూపాల పరిపూర్ణత ద్వారా, మనోహరమైన కూర్పు ద్వారా, ఉదాత్త పథం వైపు నడిపించే ఆదర్శభావన ద్వారా, నిత్యుడైన పరమే శ్వరుడితో అనుసంధానం చేయుటయే సౌందర్యం నిర్వహించే పాత్ర

*

ఈ యోగం ఆచరించడానికి ప్రతివ్యక్తికీ కనీసం కొంతైనా సౌందర్య దృష్టి వుండాలి. అలా వుండకపోతే అతడు బౌతిక ప్రపంచంలోని అతి ముఖ్యమైన అంశాల్లో ఒక దానిని విస్మరిస్తున్నాడు.

సౌందర్యమంటే ఇదే, ఈ ఆత్మాభిమాన భావాన్ని నేనెంతో సున్నితంగా గమనిస్తూ వుంటాను. అది నన్ను ఎంతగానో కదలించి ఎప్పుడూ ఒక గొప్ప గౌరవభావాన్ని నాలో స్పందింప జేస్తుంది.

అవును, ఆ ఆత్మసౌందర్యం, ఈ ఆత్మాభిమానం, ఏకత్వాన్ని దర్శించగలిగిన, పూర్ణయోగానుభూతి, ముఖంలో వ్యక్తమవుతాయి! ఆత్మ బౌతికంగా వ్యక్తమయితే దానికి ఆత్మగౌరవమూ, సౌందర్యమూ, పూజనీయ స్థితిలో కలిగే దర్పమూ కలుగుతాయి. అప్పుడు ప్రత్యేకంగా చెప్పుకోదగిన సౌందర్యాంశామేదీ లేని వస్తువులు కూడా ఒక శాశ్వత సౌందర్య భావన సంతరించుకుంటుంది.

*

ప్రకృతి ప్రసాదించే ఆనందమే అందం

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

పుష్పాలు సౌందర్యావిష్కరణ చేస్తాయి

దైవము భౌతిక కక్ష్యలో తనను తాను సౌందర్యం ద్వారా అభివ్యక్తం జేసికొనును.

పద్మపుష్కర్ష (Iris) పువ్వులు:

* **"సౌందర్యాతిశయం"** ను సూచిస్తాయి.

"పరిపూర్ణతతో మనసుదోచే మధుర సౌందర్యం"

ఉదయప్రభ: పెద్ద మేజంటా రంగు పువ్వులు.

* **"అందం ప్రసాదించే ఆనందం"** ను సూచిస్తాయి.

"ప్రకృతి ప్రసాదించే ఆనందమే అందం"

జపనీస్ ఫ్లవరింగ్ ఛెర్రీ: లేతపింకురంగుల పువ్వులు. వసంత ఋతువులో చెట్టును కప్పివేస్తాయి.

* **"సౌందర్య దరహాసం"** ను సూచిస్తాయి.

"ప్రకృతి తన సౌందర్యానికి ఆనందపడుతుంది"

ఎడెలెవైస్: నక్షత్రాలవంటి తెల్ల పూలగుత్తులు.

* **"ఆత్మ సౌందర్యం"** ను అభివ్యక్త పరుస్తయి.

"స్వచ్ఛమైన ధవళ వర్ణం, మాధుర్యం, స్వచ్ఛత"
— ఏదో దివ్యలోకం నుంచి దిగొచ్చినట్లు కన్పిస్తావు!

Camella japanica: పొదలమీద పూసే పంచరంగుల పువ్వులు.

* **"అచల సౌందర్యం"** ను అభివ్యక్త పరుస్తయి.

"అవినాశమైన అపూర్వ సౌందర్యంలో కూర్పు చేయబడ్డావు"

Flowers Paeonia (Peony): పొదలమీద విరివిగా పూసే పంచరంగుల పువ్వులు.

* **"కళాసౌందర్యం"** ను సూచిస్తయి.

"తన సౌందర్యాన్ని చాటుతూ తనను ధ్యానం చేసే అవకాశం కల్గిస్తుంది."

హవాయి మందార: పెద్ద సాల్మన్ పింకురంగు, పింకు కేంద్రంగల పువ్వులు.

*** "అతిమానస ప్రేమయొక్క సౌందర్యం"** ను సూచిస్తయి

"తన ఉన్నత కక్ష్యలో జీవించడానికి మనల్ని ఆహ్వానిస్తుంది"

సాల్మన్ రంగు 'Confidence' గులాబీల సందేశము

*** "విభుని సేవకొరకు తనదు సౌందర్యము నర్పించును"**

"అనితర సౌందర్య గరిమ తనను చేరి ఆశ్రయింప
సేవాభావము వీడదు విభుని దాస్యమెపుడు విడదు"

Narcissus పువ్వులు: క్రీం రంగు రేకలు, బూరాలాంటి నారింజ రంగు కప్పు ఆకారము

*** "అతిమానస సిద్ధిని కాంక్షించే సౌందర్యం"**

"చాలదు సౌందర్య గరిమ రావలె దివ్యత్వ మహిమ"

Cottleya (ఆర్కిడ్) పువ్వుల సంకేతార్థము:

*** "దివ్యసాంగత్యంలో భవ్యసౌందర్యం"**

"భౌతిక ప్రపంచంలో దివ్యవైభవం వ్యక్తమైతే సర్వం అత్యద్భుత విలాసమవుతుంది"

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

---

* శ్రీమాత సెలవిచ్చిన సంకేతార్థములు, వ్యాఖ్యలు కొటేషనుల లలో ఉన్నవి.

నిత్యజీవితంలో సౌందర్యం

సర్వవస్తుజాలం మాటున ఒక దివ్యసౌందర్యమూ ఒక మాధురీ మయమైన పరిపూర్ణతా దాగివున్నది. మనం దానితో పరిచయమేర్పరచుకోవాలి. దానినే వ్యక్తం చేయాలి.

*

ప్రతి విషయంలోనూ, అన్ని తావుల్లోనూ, ప్రతి (మానవతా) సంబంధంలోనూ సర్వాన్ని తనలో ఐక్యం చేసుకునే లయాత్మక గమనంలోని సత్యాన్ని అభివ్యక్తం చేయాలి. ప్రతి విన్యాసమూ, సౌందర్యం యొక్క మాధుర్యం యొక్క అభివ్యక్తి కావాలి. నైపుణ్యం కళ కాలేదు. కౌశలం కూడా కళ కాలేదు. మానవ అస్తిత్వంలోని వివిధ విన్యాసాల్లోని సజీవ మాధుర్యాన్నీ, సౌందర్యాన్నీ వ్యక్తం చేయటమే కళ. మన లోకంలోని సౌందర్య మాధుర్యాల అభివ్యక్తి భగవదానుభూతిలో ఒక భాగమవుతుంది. బహుశః ఇది అత్యుత్తమమైన భాగం అవుతుంది కూడా.

*

సౌందర్యమే నీ నిత్యాదర్శమగు గాక.

ఆత్మ సౌందర్యము
అనుభావ సౌందర్యము
భావసౌందర్యము
క్రియా సౌందర్యము
కర్మాచరణ సౌందర్యము

నీ చేతులలో రూపుదిద్దుకొనేదేదీ శుద్ధమైన దివ్యమాధురీ సౌందర్యానికి అభివ్యక్తి కాకుండా వుండరాదు.
భగవానుని అభయం నీకెప్పుడూ వుంటుంది.

*

బాలునికి విద్యాభ్యాస కాలంలో అర్థం చేసుకునే సామర్థ్యం పెరిగే కొద్దీ కళాత్మకమైన అభిరుచికి, సంస్కరించబడిన శక్తినీ, నిర్దుష్టత్వాన్నీ జోడించడం నేర్పాలి. ప్రకృతిలోగానీ, మానవ ప్రకృతిలోగానీ వున్న సౌందర్యవంతమైన, ఉన్నతమైన, ఆరోగ్యవంతమైన ఉదాత్త అంశాన్ని

ప్రేమించటం అభ్యాసం చేయించాలి. ఈ విధంగా సౌందర్యారాధనను అభ్యాసం చేయిస్తే అది అతన్ని అధోగతిపాలు కాకుండా కాపాడుతుంది.

*

సౌందర్యాన్ని తిరస్కరించటమంటే తన కార్యాన్ని సఫలం చేసుకోడానికి అసురుడు ప్రయోగించే అతి ఘోరాయుధమన్న మాట. అదే భారతదేశ వినాశానానికి కారణమైంది. *భగవంతుడు చైత్యపురుష కక్ష్యలో ప్రేమగానూ, మానసిక కక్ష్యలో విజ్ఞానంగానూ, ప్రాణిక కక్ష్యలో శక్తిగానూ, భౌతిక కక్ష్యలో సౌందర్యంగానూ వ్యక్తమవుతాడు.*

నీవు సౌందర్యాన్ని నిరాకరిస్తున్నావంటే భౌతిక పదార్థంలో భగవంతుడు వ్యక్తమవుతాడన్న విషయాన్ని తృణీకరించి అసురుడికి ఒప్పజెప్పుతున్నావన్న మాట.

*

నిష్కళంక సౌందర్యదృష్టి అమోఘమైన పవిత్రీకరణ (సంశుద్ధి) వల్ల మాత్రమే సిద్ధిస్తుంది.

*

ఇప్పటి మానవ శరీర యథాతథ స్వరూప వైఖరిని, ఆదర్శ సౌందర్యంతో పోలిస్తే, చాలా తక్కువమంది మాత్రమే ఆ పరీక్షలో నెగ్గుతారన్న విషయం స్పష్టమవుతుంది. దగ్గర దగ్గర ప్రతివారి శరీరంలోనూ సమస్సమ విభాగత్వం లోపించటం వల్ల ఏదో అసమానత్వమూ, అపరిపూర్ణతా గోచరిస్తుంది. దీనిని చూడడానికి అలవాటుపడ్డాము గనుక గమనించ లేకపోతున్నాము. ఉత్తమ సౌందర్య ప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుంది.

పరిపూర్ణ సౌందర్యంగల శరీరంతో పోల్చడానికి ఏ శరీరమూ పనికిరాదు. ఈ అసమానత్వానికి సహస్ర కారణాలున్నా దానిని నివారించే ఔషదం మటుకు ఒక్కటే. మానవుడి సత్తలోనికి (సౌందర్య) ప్రేరణమూ, నిజమైన సౌందర్య భావననూ ప్రవేశపెట్టాలి. అప్పుడు అపురూప సౌందర్యం మానవ శరీర జీవకణాలను ప్రభావితం చేసి, శరీరానికి సౌందర్యాన్ని వ్యక్తంచేసే సామర్థ్యాన్నిస్తుంది. ఈ విషయం ఇప్పటికీ మన ఎఱుకకు రాలేదు.

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

ప్రేమ అనగా ఏమి?

భక్తుడు భగవంతునితో తాదాత్మ్యము చెందినపుడు పొందే పరవశమే ప్రేమయొక్క మూలస్వరూపము. ఐక్యమైనప్పుడు పొందే ఆనందాను భూతియే దాని పరమావధి. ఈ ప్రేమ సృష్టియందెల్లెడలా వివిధ స్థాయిలలో లౌకికప్రేమకు, దివ్యప్రేమకు మధ్య శ్రేణులలో వ్యాపించి వుంటుంది.

ప్రథమముగా స్వచ్ఛమైన ప్రారంభదశనుండి, ప్రేమలో రెండు రకముల ప్రక్రియలుంటాయి. ఈ రెండు ఐక్యత కోసం తపించే పరస్పర సంబంధముగల స్థితులు. ఒక ప్రక్క అత్యున్నతమైన ఆకర్షణశక్తి. రెండవప్రక్క పూర్తిగా స్వార్థత్యాగాన్ని కోరే నిరోధించలేని ఆవశ్యకత. ప్రతి వ్యక్తిగత చైతన్యము దాని ప్రారంభదశనుండి విడిపోయినపుడు ప్రేమ తప్ప ఏ యితర కదలిక ఈ అగాధమునకు వారిధి కట్టజాలదు.

ఈ విధంగా విశ్వములోకి పంపించబడిన అంశము అచేతనా మయమై పోయింది. దానిని తిరిగి పునర్వ్యవస్థీకరించేందుకే ఒక మహా శక్తిని-దివ్యప్రేమను పంపించి సృష్టిలో నిక్షేపించటం జరిగింది.

అప్పుడు అది అక్కడి అచేతనాంధకారములను చూసింది. అగాధమైన ఆ నిశ యొక్క అంతరంగములో స్థాపితమైంది. తత్ఫలి తంగా పరిణామ కార్యక్రమము ప్రారంభమైంది. అచేతనము మెల్లి మెల్లిగా జాగృతమై, జడపదార్థముతో మొదలై తన ప్రస్థానమును కొన సాగించింది. మనం ప్రకృతిలో చూస్తున్న సమస్త కార్యకలాపములకు మూలకారణము ఆ ప్రేమయే. ప్రకృతిలో కలిగే సంచలనములన్నీ దాని విన్యాసములే. వృక్షజాతిలో మనకిది చాల స్పష్టంగా కనపడు తుంది. గాలికోసం వెలుతురుకోసం చోటుకోసం చెట్లు చేసే అన్వేషణ, పెరిగి విస్తరించుటకై అవి పడే తపన కూడా ప్రేమయొక్క స్వరూప ములే. పుష్పములు వికసించి వాటి సౌందర్య సౌరభములను వెద జల్లుటకూడా ప్రేమయొక్క వితరణమే. జంతువులలో దాని రూపం మనకి చాలా స్పష్టంగా కనపడుతుంది. ఆకలి దప్పికలు, వస్తువుల సేక రణ, సంతానాభిలాష మొదలగు కోరికలు కూడా ప్రేమయొక్క అభి వ్యక్తియే. ఉన్నతశ్రేణి ప్రాణులలో, యిది స్త్రీ జాతిలో, తమ సంతతికై

స్వార్థత్యాగముతో కూడిన అభిమానముగా కనిపిస్తుంది. యిలా క్రమముగా, మానవజాతి వరకూ వస్తే యీ ప్రేమ విజయవంతమై మానసిక చైతన్యముగా మార్పు చెంది, అత్యున్నత స్థానాన్ని పొందుతుంది. యిక్కడ దీని స్థితి, యిచ్ఛాపూర్వకమైనది, స్మృత్యానుసారంగాను ఉంటుంది....

దివ్యత్వమునకు సంబందించిన ప్రేమ, తక్కిన విధములైన ప్రేమకలవారికి అయోమయంగా వుంటుంది. ఎందువల్లనంటే, అట్టి ప్రేమ, అల్పత్వముతోనూ, స్వాభిమానముతోనూ, అజ్ఞానాంధకారముతోనూ కూడుకుని వుంటుంది. అది నిరంతరము, అధికారము కోసము, ఆధిపత్యము కోసము బేరములాడుతూ, పెనుగులాడుతూ వుంటుంది. ఉన్నతమైన వ్యక్తులలో కూడా, ప్రేమరూపము అపార్థాలతోనూ, క్రోధప్రవృత్తితోనూ, సరిగా అర్థము చేసుకోలేని పరిస్థితిలోనూ మిళితమై వుంటుంది.

యింతేకాక, ప్రతివ్యక్తి తాను దేనియందు గాఢమైన ప్రేమాభిమానములు కలిగి వుంటాడో దాని ప్రతిబింబంగా పరిణమిస్తాడు. అందుచేత నీవు 'దివ్యత్వము' ను పొందవలెనన్నచో దేవునినే ప్రేమించుము. దివ్యత్వములో పరస్పరాధారమైన ప్రేమానుభూతి పెరిగి, అనిర్వచనీయమైన ఆనందమును పొందిన వారే తక్కిన విధములైన ప్రేమానురక్తులు, ఎంతటి సారవిహీనమైన అల్పమైన స్థితిలో వున్నారో తెలుసుకోగలుగుతారు. అయితే యీ స్థితిని సాధించాలంటే తీవ్రమైన క్రమశిక్షణ కావలసి వుంటుంది. ఎంతటి కఠినమైన పరిస్థితినైనా భరించడానికి సిద్ధపడవలసి వుంటుంది. అప్పుడే, మనము అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందే స్థితికి జేరుకోగలుగుతాము.

ఈ భూమిపైన, అటువంటి అద్భుతమైన స్థితిని సాధించుటయే మన ఆశయము యీ స్థితియే ప్రపంచమును పూర్తిగా మార్చివేసే శక్తి గలిగి, దివ్యస్థితికి సమీపముగా నివసించదగ్గ ప్రదేశముగా మార్చుతుంది. అప్పుడే మనకు మన శరీరములో, స్వచ్ఛమైన, సత్యమైన ప్రేమ అవతరిస్తుంది. దీనిని మన శరీరములో ఎప్పుడూ, మర్మముగా, మారురూపములో వుంచవలసిన ఆవశ్యకత లేదు.

*

ఈ జగత్తులో, నిశ్చయముగా, ఒకే ఒక్క విశ్వమయమైన, శాశ్వతమైన, 'ప్రేమ' వున్నది.

అనువాదం: చావలి రామమూర్తి

పువ్వులు ప్రేమను అభివ్యక్తపరుస్తాయి

పువ్వులు సౌందర్య సౌరభాలను వెదజల్లుట
ద్వారా దివ్యప్రేమను అందజేస్తున్నాయి.

దానిమ్మ పూలు: సిందూరపు రంగు ముద్దపువ్వుల గుత్తులు "దివ్యప్రేమను" సూచిస్తాయి — "ఎడారిలోనైనా వికసించగల పువ్వం"[1] తెల్లటి ముద్దపూలు "అవ్యక్తమైన దివ్యప్రేమను" సూచిస్తాయి — "పవిత్రమైన ఆత్మలకే భగవంతుడు అద్భుతమైన దివ్యప్రేమ భాగ్యాన్ని ప్రసాదిస్తాడు"

గులాబి పూలు: సాధారణం "భగవంతుని మీద ప్రేమ" ను సూచిస్తాయి. "వృక్షప్రపంచం దైవానికి సమర్పించుటకై మూటకట్టిన సౌందర్య రాసులు"

Coral plant: లవంగాకారంలో ఉండే ఎర్రటి పూలగుత్తులు. "దివ్య ప్రేమ కోసం భౌతికం సలిపే ఆకాంక్ష"
"బహుముఖము, ప్రగాఢము — తృప్తిపరచుట కష్టము"


కాశీరత్నం పూలు: "దివ్యప్రేమకై భౌతిక ఉన్మీలనం" అంటూ ఘోషిస్తాయి. "ఆనందం పొందటానికి రాజమార్గం".

Mexican fire *పూలు:* "దివ్యప్రేమకై ప్రాణిక శక్తి ఉన్మీలనం" "అహంకారాధీనం నుంచి మెల్లి మెల్లిగా దైవాధీనం కావటం"

అనువాదం: డి. సత్యవాణి

---

[1] కొటేషన్సు: పువ్వులకు శ్రీమాత యిచ్చిన సంకేతార్థాలు, ఆమె వ్యాఖ్యలు



ఈ గులాబి పుష్పముల రెంటినీ ఆగష్టు 15, 1940 నాడు శ్రీమాత, శ్రీఅరవిందులకు సమర్పించారు

(శ్రీచంపకలాల్ గారి పత్రావళి నుండి)

దివ్యత్వమును ఆశించే ప్రేమ

ఒక గులాబి పుష్పించినపుడు, అందాన్ని వెదజల్లే ఆనందం కోసం, సహజముగా, స్వచ్ఛందముగా వికసిస్తుంది. గులాబి వికసించడంలో తనకు ఏ లాభాన్నీ ఆశించక, మధురమైన సువాసనలతో, జీవనములో వున్న సంతోషాన్ని వ్యక్తీకరిస్తుంది. రూపాన్ని దాల్చి జీవించడానికి మాత్రమే అది స్వచ్ఛందంగా యీ పనిని చేస్తుంది. మానవుడి విషయం వేరు. ఎవరో కొద్దిమంది మహానుభావులు తప్ప, ప్రతి మానవుడు, తన మనస్సు పనిచేసే స్థితి వచ్చినప్పటినుంచి, తన రూపము, తెలివితేటల ద్వారా ఏదో ఒక లాభము పొందాలని తపన పడుతుంటాడు. వాటివల్ల తనకేదో ప్రయోజనం కలగాలి. యితరుల పొగడ్తనైనా పొందాలి. లేదా ఏదైనా హీనమైన లబ్ధినైనా పొందాలి. దీన్నిబట్టి చూస్తే, చైత్యదృష్ట్యా (from the psychic point of view) గులాబిపువ్వు మనుషులకన్న గొప్పది.

అందుచేత మనము గూడా జీవితములో ఒక మెట్టుకైనా పైకి ఆరోహించగలిగితే గులాబి స్వచ్ఛందముగా ఎలాగ వికసిస్తుందో, అలాగ మనము కూడా యింకా ఎక్కువ ఉన్నత స్థితిని సాధించగలుగుతాము. స్వచ్ఛందమైన సౌందర్య వికాసంలో ప్రయోజనాన్ని ఆశించకుండ జీవించడంలోవున్న ఆనందాన్ని పొందడానికి గులాబితో సమానమైన ప్రవృత్తిని మనము సాధించవచ్చు. యీ విషయాన్ని ఎక్కువగా మనము చిన్నపిల్లలలో చూస్తాము. దురదృష్టవశాత్తూ, తల్లిదండ్రుల ప్రభావమువల్ల, పరిసరాల ప్రభావంవల్ల, వారుకూడా చిన్నతనములోనే లాభనష్టాలను లెక్క కట్టటం నేర్చుకుంటారు.

ఈ విధముగా మనకున్న దానిని, మన స్వప్రయోజనం కోసం మాత్రమే ఉపయోగించడం ప్రపంచములో అతివికృతమైన విషయాలలో ఒకటి. యిట్టి స్వార్థము ప్రపంచమంతా వ్యాపించి వుండడం వల్ల, మానవునిలో యిది స్పష్టంగా కనిపిస్తుంది. ఒక్కసారి యీ లాభనష్టాల గురించి అంచనా వేయడం అలవాటయితే దానిని ఏ శక్తీ దైవత్వము వైపు మరల్చజాలదు.

ప్రశ్న: *పుష్పాలు ప్రేమిస్తాయా?*

ఈ వికసించడమే వాటి ప్రేమ స్వరూపము. సూర్యకాంతిలో గులాబి వికసించినప్పుడు, అది తన అందాన్ని చూపించడానికే ఆ పని చేస్తున్నట్లుంటుంది. పూలు వాటి పనిని గురించి ఆలోచించవు. అయితే యీ విషయం మనకు సులభముగా అర్థముకాదు. దీనికి విరుద్ధంగా మానవుడు మాత్రం తను ఏ పని చేస్తున్నా, తన శక్తిని గురించి ఆలోచిస్తూ వుంటాడు. తనొక్కడే యీ పనిని చేయగలిగినట్లు భావిస్తాడు. జంతువులు ఆలోచించవు. వాటి ప్రేమ యిటువంటిది కాదు. పుష్పములలో మాత్రం యిది చాల సరళమైన, స్వచ్ఛందమైన, స్వార్థరహితమైన ప్రవృత్తి. విశ్వజనీనమైన చైతన్యము, ప్రేరణ, ఏదో ఒక మహనీయమైన శక్తి వీటిలో ప్రసరిస్తూ వుంటుంది. ఈ శక్తి పుష్పముల వికాసములోనే గోచరిస్తూ వుంటుంది.

*

ప్రశ్న: *నీవు ఎందుకు సామాన్యముగా ఎర్రగులాబిలను పురుషులకు, మృదువైన రంగుకల గులాబిలను స్త్రీలకు, రకరకముల్లైన రంగుల గులాబిలను బాలబాలికలకు యిస్తావు?*

ఎర్రగులాబిలు శక్తికి ప్రతీకలు. మృదువైనవి మాధుర్యానికి, ఆకర్షణకు ప్రతీకలు.

*

ప్రశ్న: *నీవు నాకు, ఒక ఎర్రగులాబిని, ఒక మృదువైన గులాబిని యిస్తే, నేనేమని భావించాలి?*

మానవుడు తన భావావేశములన్నిటినీ దైవము కొరకు ప్రేమగా మార్చుకుంటాడు. అప్పుడు దైవము మాటలకతీతమైన ప్రేమతో బదులిస్తుంది.


అనువాదం: చావలి రామమూర్తి

వివిధ రకాల గులాబీల సంకేతార్థాలు

సామాన్యంగా అన్ని రకాల గులాబీలు	...	భగవంతుని మీద ప్రేమ
ఎర్రగులాబీలు	...	మానవునిలోని వాంఛ దివ్య ప్రేమగా మార్పు చెందుట
పసుపురంగు గులాబీలు	...	దైవంమీద మానసిక ప్రేమ
పింకు ఛాయగల పసుపురంగు — క్రీంకలర్ గులాబీలు	...	చైత్యపురుష ప్రభావితమైన మానసిక ప్రేమ
నారింజరంగు గులాబీలు	...	దైవం కోసం ప్రజ్వలించే ప్రేమ
ఊదారంగు గులాబీలు	...	దేవుని ప్రేమించడంలో నమ్రత
రెండురంగుల గులాబీలు	...	దేవుని ప్రేమించడంలో ప్రకృతి యొక్క సమతౌల్యం
అచ్చతెలుపు గులాబి ఒంటరి పువ్వు	...	దైవం మీద సమగ్రమైన ప్రేమ
అధిక పరిమళంతో ఉండే దేశవాళీ పింకుగులాబీలు	...	సమర్పణ
నారింజరంగు అలదిన పసుపు గులాబీలు	...	మానసిక సమర్పణ
వేళ్ళాడే చిన్న తెల్ల గులాబీ గుత్తులు	...	శుద్ధ ఆధ్యాత్మిక సమర్పణ
పింకు గులాబీలు	...	ప్రేమపూర్వకమైన సమర్పణ

చిన్న లేతగులాబీలు (ఓల్డ్ చైనా రోజెస్)	...	సవివరమైన సమర్పణ
లేత నారింజరంగు గులాబీ గుత్తులు	...	దైవంతో అతిమానస అనుబంధం
చిన్న ఆకుపచ్చ గులాబీలు	...	దైవానుబంధంలో పిరికితనం
నిటారుగా ఉన్న ఒంటి రేకు లేదా ముద్దగులాబీ గుత్తులు అన్నిరంగులవి	...	దైవంతో ప్రగాఢమైన సంబంధం
పింకుమచ్చలు గల చిన్న తెల్లగులాబీలు	...	దైవం పైన అనురాగం
సువాసన గులాబీలు — ఒంటి పువ్వుల గుత్తులు	...	ప్రకృతిలో చైత్యపురుష విజృంభణ
చైనాగులాబీలు	...	దైవంపట్ల ఉండే సున్నితత్వం
చిన్న ఎరుపు కలసిన తెల్లటి గులాబీలు	...	దైవంపట్ల చైత్య ప్రేమ (psychic love)
సాల్‌మన్ రంగు గులాబీలు	...	సౌందర్యము భగవత్సేవకై అంకితం

అనువాదం: డి. సత్యవాణి



దివ్యప్రేమ

పురాతన చాల్డియన్ గాథ

అనేక సంవత్సరాల క్రిందట ఒకనాటి ఎడారి, ఇప్పటి అరేబియాలో ఒక దివ్యపురుషుడు ఈ పృథ్వీని అనంత దివ్యప్రేమ వైపు మేల్కొలపడానికి (ఈ పృథ్వీపై) జన్మించాడు. మనం అనుకున్నట్టుగానే ఆతడు మనుషులచేత తరమబడి అపార్థం చేసుకోబడి, అనుమానింపబడి వేటాడబడ్డాడు. గాయపడ్డ శరీరంతో ఉన్న అతడు ఒంటరిగా, ప్రశాంతంగా మరణించాలని కోరుకున్నాడు. వారిచే తరమబడుతూ పరుగిడసాగాడు. హఠాత్తుగా విశాలమైన ఆ బీడులో ఒక దానిమ్మపొద కనిపించింది. ఆ మహాత్ముడు ఆ దానిమ్మ కొమ్మల క్రింద ప్రశాంతంగా ప్రాణత్యాగం చేయాలని అక్కడ చేరాడు. అంతే! ఒక్కసారిగా ఆ పొద వ్యాపించి అద్భుతంగా పెరిగి, పెద్దదై, గాఢమై, వత్తుగా, బ్రహ్మాండంగా పెరిగింది. ఎంతగా అంటే ఆ ద్రోహులకు ఆ పక్కనించే వెళ్తున్నపుడు కూడా అతడక్కడే ఉన్నాడన్న అనుమానం రాలేదు. వారు సాగిపోయారు.

ఆతని పవిత్ర రక్తం చుక్కలు చుక్కలుగా ఈ భూమ్మీద పడుతూ... భూమిని సారంవంతం చేయగా ఆ పొద అద్భుత సౌందర్యంతో కూడిన పుష్పాలతో, అద్భుతమైన రేకులతో, అసంఖ్యాక రక్తపు చుక్కలతో ఆచ్ఛాదించబడింది.

ఈ పుష్పాలే దివ్యప్రేమను అభివ్యక్తిస్తూ.... మనకోసం ఆ ప్రేమను నింపుకుని ఉంటాయి.

అనువాదం: డి. సత్యవాణి

నిత్యజీవితంలో ప్రేమయొక్క స్థానము

ప్రశ్న: దైవముపై ప్రేమ కోసము, తక్కిన విధములైన ప్రేమలను త్యజిం చాలి అంటారు. కాని దృఢమైన పట్టుగలిగి, వీడుటకు దుస్సాధ్యమైనది, వదిలిపెట్టనిది అయిన యీ యితర ప్రేమలన్నిటిని తిరస్కరించడానికి మంచి మార్గమేది? (నవ్వు)

ఓహో! వాటినుండి ఛేదించుకు రావడానికా!

అట్లు ఛేదించుకు రావడానికి, దాని వెనుక ఏముందో చూడడానికి, చూసిన స్వరూపము వద్ద ఆగిపోకుండా వుండడానికి, బాహ్యాస్వరూపమును చూసి సంతృప్తి చెందకుండా వుండటానికి, ఈ ప్రేమను అంతర్గతముగా ఏ సూత్రము వుందో చూడడానికి, నీలో కలిగిన భావానికి మూలాధారము తెలుసుకునే వరకు సంతృప్తి చెందకుండా ఉండటానికి, ప్రయత్నించాలి. అప్పుడు ఆ బాహ్యాస్వరూపము సమసిపోగా నీవు దివ్యప్రేమ యొక్క స్పర్శను పొందుతావు.

యిదే ఉత్కృష్టమైన మార్గము.

మనతోవున్న ఒక దానిని వదిలిపెట్టి, యింకొక దానిని పొందుట చాలా కష్టమైనది. యించుమించు అసాధ్యము. ఏలనన, మానవస్వభావము పరిమితిగలది. పరస్పర విరుద్ధమైన భావములతో కూడినది. హీనకరమైన ప్రేమను వదిలి పెట్టడానికి విముఖముగా వుంటుంది. మానవులకుండే సామాన్యమైన ప్రేమ, ఎంత గట్టి ప్రయత్నము చేసినప్పటికి, రాతివలె స్తబ్ధముగా వుండి, పూర్తిగా ప్రేమ భావమునే తిరస్కరించు పరిస్థితిని కల్పించును. మరల పూర్తి చేతనావస్థను పొందుటకు, ప్రేమను స్వీకరించి, వ్యక్తీకరించుటకు, కొన్ని సంవత్సరములుగాని, శతాబ్దములుగాని పట్టవచ్చును.

అందుచేత ప్రేమ ఏ రూపములో గోచరించినప్పటికి, దాని బాహ్యాస్వరూపమును ఛేదించుటకు ప్రయత్నించాలి. అంతర్గతమైన అస్థిత్వముగల దివ్య సత్యమును కనుగొనుటకు ప్రయత్నించాలి.

సహజముగా, యీ పని చిక్కులతోను, కష్టములతోను కూడినది. కాని ఫలవంతమైనది. సూక్ష్మంగా చెప్పాలంటే, తప్పుడు ప్రేమకు

భయపడి అసలు ప్రేమనే వర్జించకూడదు. తప్పుడుగానైనా ప్రేమించి క్రమముగా సవ్యముగా ప్రేమించడం నేర్చుకోవాలి.

ఉదాహరణకు, ఏ యిద్దరి మధ్య ప్రేమ స్వరూపమైనా, పిల్లల యెడ తల్లిదండ్రులకు గలది, పిల్లలకు తల్లిదండ్రులపై గలది, సోదరుల మధ్య గలది, స్నేహితుల, ప్రేమికుల మధ్య కలది, — యీ ప్రతి ఒక్క ప్రేమస్వరూపము అజ్ఞానము, స్వార్థము మరియు యితర సాధారణ లోటుపాట్లతో పంకిలమైనది.

కనుక, శ్రీఅరవిందులు చెప్పినట్లు, పూర్తిగా ప్రేమస్వరూప మును త్యజించకూడదు. అట్లు చేస్తే హృదయం మోడువారి, నిష్ప్రయోజ నకారిగా అవుతుంది. ఉన్నతమైన ప్రేమ తత్త్వమును సాధించుటకు ప్రయత్నము కొనసాగించాలి. భక్తితోను, స్వార్థరహిత లక్షణముల తోను, ప్రేమతత్త్వమును సాధించుటకు ప్రయత్నించాలి. ప్రేమస్వరూప ముతో కాక, పూర్తిగా స్వాధికారము కలగి, బంధములతో కూడినట్టి వికృతస్వరూపము కలిగిన ప్రేమతోనే పోరాడవలెను.

నిజమైన ప్రేమను యిచ్చుటలోనే ఆనందం వుంది. ఫలాపేక్ష వుండకూడదు. అంతేకాని, స్వంత మనోభావన, అసూయ మరియు యితర నీచభావముల కదలికలతో కూడినట్టిది కాని; యితరులమీద అధికారమును, మన హక్కులను, యిష్టాయిష్టములను, చపలత్వమును, కోరికలను, బలవంతముగా రుద్దినట్టిది కాని; ఏమీ యీయకుండా, అంతా పుచ్చుకోడానికే సిద్ధమైనట్టియు యితరుల ప్రతిస్పందన గుర్తిం చకుండా తన ప్రేమస్వరూపముతోనే తృప్తి చెందినట్టిది కాని, తన స్వంత అభీష్టములను, కోరికలను మాత్రమే తీర్చుకొను అనుభవము కోసం ఉన్న ప్రేమను త్యజించాలి.

యిట్లు నీవు మానసిక పరివర్తన పొందగలిగితే, మహత్తర మైన ముందంజ వేసినట్లే. అప్పుడు నీవు క్రమముగా అసలైన భావ నను పొందుతావు. ఆనాడు, నీవు ప్రేమస్వరూపము ఏ ఒక్కరి సొత్తు కాదని, అది సార్వజనీనమైన భావమని, అది నీలోనుండి యించు మించు స్పష్టముగా వ్యక్తీకరించబడుతుంది. అదే దివ్యత్వమని నీవు అప్పుడు తెలుసుకుంటావు.

ప్రప్రధమంగా, ప్రతి ఒక్కరూ, స్వార్ధమును వదిలిపెట్టవలెను. ఇది యోగము నభ్యసించువారికి, సామాన్య జీవనము సాగించే వారికి కూడా వర్తిస్తుంది. ప్రేమస్వరూపము తెలుసుకోవాలనుకున్న ప్రతి ఒక్కరూ, తమని తాము స్వార్థము కొరకు ప్రేమించుట కాక, తను ప్రేమించవలసిన విషయమునందు, ప్రతిఫలాపేక్ష లేకుండా, అనురక్తి కలిగి ఉండాలి. తనను తాను అధిగమించాలంటే, అర్ధరహితమైన జీవనాన్ని గడపకుండా వుండాలంటే, ఈ క్రమశిక్షణ ప్రాధమికావసరము.

'యోగము' లో ఇంకొక విషయమున్నది. పరిమితియైన, మానవస్వాభావికమైన ప్రేమను ఛేదించుకునే ఆత్మశక్తి కావాలి. దీని సహాయముతో అంతర్గతమైన దైవకృప లభిస్తుంది. అప్పుడు ఫలితము తప్పకుండా కనిపిస్తుంది. హృదయాన్ని మోడువార్చుటకన్న యిది నయం. యిది కొంత కష్టమైనా, అన్నివిధాలా మంచిది. యిలా చేస్తే, మన స్వాభిమానముతో యితరులను బాధపెట్టకుండా, వారిని వారి నడవడికను వదిలిపెట్టి మనను మనము మార్చుకొనుటకు గట్టి ప్రయత్నము చేయవలెను. యితరుల మీద తన యిష్టములను రుద్దకూడదు. యిలా చేస్తే సామాన్య జీవనములో కూడా, ఉన్నతమైన, పరిపూర్ణమైన స్థితిని జేరడానికి సాధ్యమవుతుంది.

*

ప్రేమించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు వుంది. నిజమైన ప్రేమ దాని స్వయం సిద్ధమైన ఆనందాన్నిస్తుంది. కాని, విచారకరమైన విషయమేమంటే, మానవులు, స్వార్ధ, అహంకారపూరితులు. ప్రేమించినపుడు, తిరిగి ప్రేమించబడాలని కాంక్షిస్తారు. కాని యిది ఆధ్యాత్మిక సత్యానికి విరుద్ధము. ఈ కాంక్షవలన ఆవేశము, బాధ కలుగుతాయి..

*

ప్రేమించువారే, ప్రేమను గుర్తించగలుగుతారు. నిజాయితీగల ప్రేమను స్వతహాగా అభ్యసించలేనివారీ ప్రేమను ఎక్కడా గుర్తించలేరు. ఎంత స్వార్థరహిత దివ్యప్రేమ అయినప్పటికీ, దానిని వారు గుర్తించలేరు.

*

స్వార్థ త్యాగము లేకుండా ప్రేమలేదు. కాని మానవప్రేమలో, నిస్వార్థం అరుదుగా వుంటుంది. అది స్వార్థంతోను, హక్కులను కోరడంతోను, నిండివుంటుంది.

*

నీవు ఏకాంతముగా వున్నప్పుడు, ప్రేమ యొక్క ఆవశ్యకతను గుర్తి స్తావు. ఏమీ కోరకుండా, ప్రేమించడం నేర్చుకో ప్రేమించడంలో వున్న ఆనందం కోసం నేర్చుకో (అది యీ ప్రపంచంలో ఎంతో అద్భుతమైనది) అప్పుడు నీవు ఏకాకిగా వున్నట్లు భావించవు.

*

ఒక్కసారి నీవు దైవప్రేమను కనుగొన్నప్పుడు, అసత్య వేషములలో యున్న యితర రకములైన ప్రేమలన్నీ, వాటి అవలక్షణమును కోల్పోయి, పవిత్రమవుతాయి. అప్పుడు, అన్ని విషయములలోనూ, వస్తువులలోనూ, దైవమునే మనము ప్రేమించుదుము.


*

సారాంశమేమనగా, ఆదినుండి ప్రేమ యనునది ఒక స్వచ్ఛమైన జ్వాల వంటిది. అది అన్ని అడ్డంకులను అధిగమిస్తుంది. అది ఎవరికి వారే అనుభవముగా పొందగలరు. నీ వ్యక్తిత్వములో ఎటువంటి కష్టము వున్నప్పటికీ, తప్పులు, అజ్ఞానము, అశక్తత, చెడు సంకల్పముల బరువును, ఒక్క క్షణములో యీ పవిత్రమైన, అసలైన, ఉన్నతమైన ప్రేమ, తన శక్తివంతమైన జ్వాలలో హరించును. ఒక్క క్షణములో గతమంతయు అదృశ్యమగును. నీవు ప్రేమసారమును స్పృశించినపుడు, ఒక్క క్షణములో నీ పూర్తి బరువు హరించబడును.

*

నిజానికి, జీవితమంతా ప్రేమమయమని, మనము ప్రేమతో జీవించగలిగి నప్పుడు తెలుసుకుంటాము.

అనువాదము: చావలి రామమూర్తి



ఆకాంక్ష
అసంఖ్యాకము, పట్టుదల, విసుగులేని పునరుక్తి
పారిజాతం

ఆకాంక్ష[1] అంటే ఏమిటి?

భగవత్సాన్నిధ్యానికి చేరుకోవాలన్న తపన, ఆకాంక్ష అది నీ స్వభావ గతంగా ఉంటే, అదొక మహా శక్తిమంతమైన వేగంతో బైటకువికి వస్తుంది.

*

అన్నిటికంటె మించి అంతటినీ అతిశయించిన ఆకాంక్ష, ఒక మహాగ్ని అంతరగ్ని అది మహోత్కరా రూపంగా బహిర్గమిస్తుంది. దేనికోసం? ఒక వెలుగు కోసం. అదొక రకమైన ఎలా చెప్పాలి? ప్రకాశవంత మైన ఉత్సాహశక్తి. అది నిన్ను ప్రబలంగా ఆక్రమిస్తుంది. దాని స్వభావమేమంటే భగవంతునిలో లయించటం, లీనం కావటం, ఆ ప్రభువునకు ఆత్మసమర్పణ చేసుకోవలన్న తపన. అది అణుచుకో రానంత ఉద్విగ్న మనస్కతా రూపంలో ఉంటుంది.

*

ఇంకా ఆ అభీప్సలో మరొక అంశాన్ని చేర్చుకోవచ్చు. అది పరమే శ్వరానుగ్రహం మీద నీకుండవలసిన శ్రద్ధ. శ్రద్ధ అంటే ఈశ్వర ప్రతి స్పందనపై నీకున్న విశ్వాసం. అది నీలోని అవిశ్రాంతి నుపశమింప చేసే అమృతౌషధం.

*

ప్రశ్న: అభీప్సకు — కాంక్ష ఒత్తిడికి నడుమనున్న భేదమేమిటి?

సమాధానం: ఈ రెంటినీ అనుభవిస్తే నీకే తెలుస్తుంది. అభీప్సలో ఒక నిస్వార్థ అగ్నిజ్వాల వెలుగుతుంది. కోరికలో అది ఉండదు. ఇది ప్రతి దానినీ తన వైపుకే త్రిప్పుకొనే స్వభావం కలది. అభీప్సలో అది ఉండదు. తన్ను మాలిన కోరిక అంటూ ఎక్కడా ఉండదు. మనస్తత్వ దృష్ట్యా చూస్తే అభీప్సలో తనను తాను సమర్పించుకొనే స్వభావ ముంటుంది. కోరిక అలా కాదు. అవతలి వ్యక్తిపై ఒత్తిడి కల్పిస్తుంది. తన వైపునకే సర్వాన్నీ ఆకర్షిస్తుంది. దాని కోసం ప్రయత్నిస్తుంది. అభీప్స తనను తాను త్యాగం చేసుకొంటుంది. ఇది ఆలోచనా రూపం

---

[1] Aspiration, ఆకాంక్ష, అభీప్స

లోనే ఉండనక్కర్లేదు. కదలికలో — ప్రాణశక్తి చలనంలో స్పందనలో — ఉంటుంది.

అభీప్స తలనుండి వచ్చేది కాదు.

అది ఆలోచనలనుండి రూపొందినా, హృదయ గుహనుండి అగ్నిజ్వాలలాగ ఊర్ధ్వముఖ ప్రసారం పొందుతుంది.

అనువాదం: ఆచార్య తుమ్మలపూడి కోటేశ్వరరావు

వృక్షములు వెలుతురు కోసం అన్వేషిస్తాయి

ఒక మహారణ్యంలో వృక్షసముదాయం దట్టంగా ఉంటుంది కదా! ఆ చెట్లలో ప్రతిదీ సూర్యరశ్మి వైపునకు అర్రులు చాచటం చూచి ఉంటారు. అంటే, ఆ చెట్టు ఎన్నో మెలికలు వంకర్లు తిరుగుతూ అవకాశం కోసం అన్వేషిస్తూ ఒక్క సూర్యకిరణం కోసం అన్వేషిస్తూ, ఎంత తపన — ఆరాటం పడుతున్నదో? ఆ వృక్షజాలం — భౌతిక భూమికలో అది ఆకాంక్ష యొక్క అభివ్యక్తి — ఒక స్పందన — కదలిక — వెలుగు వైపునకు చేసే ప్రయాణం. మానవజాతి కంటె ఆ తపన వృక్షజాతిలో ఎక్కువ. వాటి జీవితధ్యేయమొక్కటే — వెలుగును ఆరాధించటం. వెలుగు భగవంతునికి భౌతిక ప్రతీక. కనుక భౌమ వాతావరణంలో సూర్యుడు పరాచేతనకు ప్రతీక. మొక్క తనకున్న పరిమితిలో గ్రుడ్డిగా ఆ సంవేదనను పొందుతున్నది. ఆ తపనలో ఒక గాథ ఉన్నది.

*

చెట్లను, పూలను చూడు. ఎప్పుడు ప్రొద్దుక్రుంకిందో అప్పుడు అన్నీ మౌనంలోకి జారిపోతాయి. నిద్రపోతాయి. నిశ్చలంగా కొంచెంసేపు కూర్చుని ప్రకృతిలో ద్రవించిపోయి, తాదాత్మ్యం పొందు. భూబంధం నుండి గాలిలోకి తేలిపోయినట్లుంటుంది. చెట్లు-వేళ్ళుగా భూమిలోకి అల్లుకొనిపోయి పైకి కొమ్మలుగా సాగుతూ ఆకాశాన్ని చుంబిస్తాయి. అదే సంవేదన, ఉత్కంఠత. ఆ తపనకు ప్రయోజనమేమిటి?


ఒక వెలుగురేఖ కోసం ఒక ఆనందబిందువు కోసం. ఆ వెలుగు ప్రొద్దుక్రుంకి పోతుంది. తిరిగి మొక్కలు నిద్రలోకి ముడుచుకొని పోతాయి. ఇదంతా అందని దాని కొసనందుకొనే ప్రయత్నమే. ఆ సంవేదనలో తపనలో ఎంత నిర్మలత్వమున్నది! అది నీవనుభవించ గలిగితే నీ అంతస్తత్త్వం కూడా నీ చైతన్యం కూడా. ఒక ప్రార్థనగా పైకెగసి పోతుంది. ఆ ప్రార్థనకు ఫలితమేమిటి? ఒక ప్రశాంతి. ఒక ప్రకాశం. ఒక ప్రేమపూర్ణ దశ. అవి భౌతిక జీవితంలో శూన్యం. ఎప్పుడైతే నీవు ఈ సువిశాల — యథార్థ పవిత్ర దివ్యప్రేమ స్పర్శను చూచావో — క్షణకాలమైనా చాలు — నీకే తెలుస్తుంది. ఆ సంవేదన ఎంత దివ్యమైన వస్తువును మలిచి నీ చేతికందించిందో?

*

వృక్ష లతాప్రపంచావగాహనమున్న వారికి స్పష్టంగా తెలుస్తుంది వాటిలో చైతన్యమున్నదని. ఉదాహరణకు మొక్కకు సూర్యరశ్మి అవసరం. అదే వాటికి ప్రాణాధారం. సూర్యుడు క్రియాశక్తిరూపుడు కనుక వాటి పెరుగుదలకు ఆధారమౌతున్నాడు. కనుక నీవా మొక్కను చీకటిచోటున నాటితే, అది పైపైకి — ఇంకా పైకి ప్రాకిపోతుంది మెడరిక్కించుకొంటూ. ఈ ప్రయత్నమంతా దేనికి? సూర్యకాంతి కోసం కాకపోతే. మానవస్పర్శ సోకని అకలుషిత అరణ్యాల్లోని వృక్షాల్లో నిటారుగా ఆకాశంలోకి ఇంకా ఇంకా ఎత్తుగా పెరిగి చొచ్చుకొని పోతాయి, ఒక రవికిరణం కోసం. ఇదెంత అద్భుతమూ, అందమూనైన విషయం. మీ ఇంట్లో నాల్గుగోడల నడుమ వెలుగు చొరని చోట ఒక పూలకుండీ పెట్టి, ఆ కుండీలోని తీగమొక్క ఇంత ఎత్తు (చేతులతో సంజ్ఞ చేసి) కలదనుకో అది పొడవుగా సాగుతుంది. ఆ సాగారటం దేనికోసమంటే రవికిరణస్పర్శ కోసమే. కాబట్టి లతా వృక్ష సముదాయంలో ఒక చేతనాశక్తి ఉన్నది. ఒక జీవనేచ్ఛ బ్రతకాలన్న కోరిక అదిదివరకే అభివ్యక్తమైనది. ఈరితిగా కన్పిస్తుంది.

*

మొక్కల్లో కన్పించే పెరుగుదల అంతా సూర్యునికోసం పడే తపన. విశాల వాతావరణంలోకి పోవాలనే తీవ్ర సంకల్పం.



దివ్యప్రేమ కోసం దైహిక ఆకాంక్ష

బహుముఖము, ప్రగాఢము, సంతృప్తి పరచుట కష్టము

సాధారణ నామము: పగడపు చెట్టు శాస్త్రీయ నామము: *Russelia equisetiformios*

అదొక రకమైన పోటీ. ఉదాహరణకు: ఎవరైనా అడవిలోకి — లేదా వివిధ లతా వృక్ష సమూహామున్న ఉద్యానవనం లోనికైనా సరే — పోతే అతడు గుర్తించగలుగుతాడు. ఆ చెట్ల మధ్య ఒక స్పర్థ ఉన్నదని అవన్నీ ఒకదాని నొకటి అతిక్రమిస్తూ ఎండపొడ చూడా లన్న తపనలో విశాలాకాశంలోకి పోవాలన్న ఇచ్ఛాబలంతో అలా పెరుగుతున్నాయని తెలియటమేకాక ఆలోచిస్తే ఇదెంత వింతగా — విస్మయావహంగా కన్పిస్తుంది!

అనువాదం: ఆచార్య తుమ్మలపూడి కోటేశ్వరరావు

నిత్యజీవితంలో భౌతిక భూమికలోని ఆకాంక్ష

దివ్యప్రేమ కోసం భౌతిక భూమికలోని ఆకాంక్షగా ఈ పుష్పాన్ని పేర్కొంటున్నాను. భౌతికం అంటే భౌమిక చేతన. బహిర్ముఖమైన సామాన్య చైతన్యం. దైవ్యసంపదలకు బదులు, సౌకర్యాలు, మంచి ఆరోగ్యము, మంచి బట్టలు, సుఖసంబంధాలు ఆకాంక్షించే అధిక మానవుల సామాన్య చైతన్యమని నా భావం. దివ్యప్రేమ కోసం భౌతిక భూమికలోని ఆకాంక్ష అంటే భౌతికస్థితిలో దైవం తనను ఎంతగా ప్రేమిస్తున్నదనే అంశం అనుభవించటంకన్న మరేమీ కోరుకోవద్దు. తాను పొందే దైనందిన సంతృప్తులన్నీ అసమగ్రములని తెలుసుకొంటుంది. భౌతికం దైవప్రేమను కోరేట్లయితే దాన్ని ఒక్క దాన్నే కోరుకోవాలిగాని మరేవిధమైన సర్దుబాటు పనికిరాదు, రాజీపడ కూడదు. "దైవప్రేమ కావాలి కాని దానితోపాటు అనుబంధాలను, అవసరాలను, సుఖానుభవాలను వదిలివేయను" అని అనరాదు.

వ్యక్తిలోని ఏవిభాగం లోనైనా ఆకాంక్ష అభివ్యక్తమయ్యే ప్రకా శించే మూలస్థానం చైత్యకేంద్రమే (psychic centre). భౌతికంలో ఆకాంక్ష అంటే నా ఉద్దేశ్యం లౌకిక సంపదకోసం, సుఖాలకోసం, అర్రులుచాచే చైతన్యమే. తనంత తాను నీ ప్రకృతిలోని ఉన్నత భూమిక ఒత్తిడి కారణం కాకుండానే దివ్యప్రేమను మాత్రమే కోరు

కోవటం. ఉన్నత భూమికల తోడ్పాటుతో నీవు దానికి వెలుగును కనిపింప జేయాలి. ఈ కార్యం నిరంతరం జరుగుతూ వుండాలి. లేక పోతే భౌతికం సహజగతిలో ప్రకృతి అనేక యుగాలలో పయనించేంత వరకు పరివర్తనకు అనుకూలమైన స్థితికి చేరుకోదు. ప్రకృతి సాగించే ఈ పయనములన్నీ భౌతికమును సంతుష్టిపరచ లేవనియు, వాటికి మూలమైన దైవమును అన్వేషించుటకు సాధనములే అనియు నేర్పు టకు ఏర్పడిన పాఠములే. యోగమార్గంలో ఈ పరిణామక్రమాన్ని వేగిరపరస్తూ భౌతిక చేతన సత్యాన్ని దర్శించేందుకు, గుర్తించేందుకు ఆకాంక్షించేందుకు నిశ్చయింప జేస్తాము. కాని సత్యాన్ని ఎలా దర్శింప జేయటం? ఒక విధంగా చెప్పాలంటే చీకటి గదిలోకి వెలుగును తెచ్చినట్లే. నీ భౌతిక చేతనలోని చీకటిని సంస్కరించి నీలోని చైతన్య శకలాలు ఆకాంక్షతో వెలిగించాలి. దీని కోసం నిమ్నదశలోని సామా న్యాంశల కోసం ఆకలిగొనడం ఎంత వ్యర్థమో గ్రహించేంతవరకు, తనంతతాను సత్యంవైపు మరలేదాకా ఈ కార్యం కొనసాగాలి. అలా మరలినప్పుడు నీ మొత్తం జీవితం పరివర్తన పొందుతుంది. ఆ అనుభ వాన్ని నిర్దుష్టంగా గుర్తించవచ్చు.

నేను పసిదానిగా ఉన్నప్పుడు మా అమ్మ దగ్గర ఆహారాన్ని గురించి, అలాంటి చిన్న చిన్న విషయాలను గురించి ఇబ్బందులను చెప్పుకోగా ఆమె నాతో నీ పని నీవు చూచుకో చదువులలో శ్రద్ధ వహించు. అల్పవిషయాలను పట్టించుకోవద్దనేది. నేను సుఖాలను పొందటానికే పుట్టానన్న అలస భావం కలిగినప్పుడల్లా నీవు పుట్టింది అత్యున్నతమైన ఆదర్శాన్ని సాక్షాత్కారించుకోవటానికి అని నాకు చెప్పి నా ఊహాలను తొలగించేది. ఆమె అన్నమాట సత్యమే. అయితే ఆమె భావించిన 'అత్యున్నతమైన ఆదర్శం' మన ప్రమాణాల దృష్ట్యా అల్పమైందే

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

కూరగాయలు, పండ్లు – వాటి సందేశములు

శ్రీమాత చెప్పిన అంతరార్థములు

పేరు		సందేశములు (అంతరార్థములు)
కాకరకాయ	..	మాధుర్యము
వంకాయ	...	ప్రాణికస్థితిలోని అభీతి
పుచ్చకాయ	...	సమృద్ధి
ములగకాయ	...	పారిశుద్ధ్య వ్యవస్థ
మిరపకాయ	...	దండన
అవిసె	..	సిద్ధి ప్రారంభము
నిమ్మకాయ	..	సౌశీల్యము
కొబ్బరికాయ	...	బాహుళ్యము
నల్లద్రాక్ష		బ్రహ్మచర్యము
జామ	...	స్థిరత
మారేడు	...	భక్తిభావన
నేరేడుపండు		కౌశలము
తామర్త	..	సంయోజిత సమష్టి కృషి
జపాను చెర్రీ	...	సౌందర్య స్మితము
సింగపూరు చెర్రీ	..	మృదు మధురము
ధనియాలు		సుస్మితము
వేప	.	ఆధ్యాత్మిక వాతావరణము
వెర్రివేప	..	ప్రాణిక విశిష్టత
గోరింట	..	దివ్యతాభిముఖ శక్తి
నిమ్మగడ్డి	...	సహకారము
పసుపు		శాంతి
సీమబాదం	..	ప్రకృతి స్మేరము
ఏలకులు	..	ఏమి చెప్పవలెనో తెలిసికొనుట
పోక	...	స్థిరప్రాణికత
సోంపు (శత పుష్ప)	...	రక్తములోని కాంతి

నువ్వులు	..	ఒడంబడిక
టేకు	..	ప్రకృతిలోని సహజ సంతసము
యూకలిప్టస్ (నీలగిరి)	...	అహంకారపు పరిత్యాగము
పత్తి (పసుపుపచ్చ లేక ఎరుపు రంగు పువ్వు, ఎర్ర బొడ్డు)	...	భౌతిక సమృద్ధి
బూరుగ	...	అత్యంత భౌతిక ప్రాణిక దశలోని సాఫల్యము
ద్రాక్ష	...	దివ్యనాదము
మామిడి (పూవు)	...	సిద్ధి పొందుటకై ప్రకృతి ఆశయము
మామిడి పండు	..	దివ్యజ్ఞానము
పొగడ పూవు	...	ఓర్పు
పొగడకాయ	...	విజయము

అనువాదము: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

పుష్పములు – పరమాత్మకు భౌతిక ప్రకృతి సమర్పణము

పుష్ప సౌరభం భౌతిక ప్రకృతి పరమాత్మకు చేసే సమర్పణ. అది సుసూక్ష్మ ఆంతరిక సమర్పణము

*

చైత్యాత్మ (psychic) మొక్కలో పూవుగా ప్రకటమైనప్పుడు అది నిశ్శబ్ద ప్రార్థనగా ఉంటుంది. అది ఆ మొక్కలో పరమాత్మోన్ముఖంగాగల ప్రాణోత్సాహం.

*

తమ చైత్యాత్మలో ఎవరికి సంపర్కం కలుగుతుందో వారు సమస్తమైన సృష్టి వెనుకగల వ్యష్టాత్మను ఎఱిగి తద్వారా పూలతో సంబంధం ఏర్పర చుకో గలుగుతారు.. ఆ పూలలోని ఆత్మవేదనను గుర్తించగలుగుతారు.

*

జపాన్‌లో శ్రీమాత ధ్యానము ఏప్రియల్ 1, 1917

నా మౌన ఆకాంక్షలో నిండిన ఆత్మకు నీవు అద్భుతమైన విశాల మైదానాల సౌందర్యాన్ని, ఉత్సవమగ్న వృక్షాలను, ఏకాంత మార్గాలను వికసింప జేసావు. అవి ఆకాశాన్నే కొలిచేట్లు ఉన్నాయి.

మరొకసారి నేను ప్రతిచోటా చెర్రీవృక్షాలను చూస్తున్నాను. ఆ పూలమీద నీవు యింద్రజాల శక్తిని ప్రవేశపెట్టావు. అవి నీ సంపూర్ణ సాక్షాత్కారాన్ని చాటుతున్నట్లుగా ఉన్నవి. ఇంకా అవి దివ్య దరహాసాన్ని వ్యక్తం చేస్తున్నవి.

నా శరీరం విశ్రాంతిని తీసుకొంటున్నది. నా ఆత్మ వెలుగులో వికసిస్తూవున్నది. నీవు ఈ పుష్పభరిత వృక్షాలలో ఏ ఆకర్షణను నింపావో?

ఓ జపాను దేశమా! ఇది నీ ఉత్సవాలంకారము, సౌజన్య ప్రకటన, స్వచ్ఛమైన సమర్పణ, నీ విశ్వసనీయతాభివ్యక్తి. ఆకాశాన్ని నీలో ప్రతిఫలింప జేయగల నీ కథన విధానము.

వైభవోపేతమైన దేశం యిది. పైను వృక్షాలతో నిండిన ఎత్తైన పర్వతాలు ఒరిగిపోతున్నట్లు ఉన్న సంపన్నమైన వాలు లోయలు. ఈ లేత ఎరుపురంగు గులాబీలు రేపు రానున్న భవితవ్యానికి వాగ్దానములా ఏమి?

*

జపాన్‌లో శ్రీమాత ధ్యానము ఏప్రియల్ 17, 1917

గాఢమైన ధ్యానంలో ఉన్నాను. నన్ను నేను వికసిత చెర్రీ పుష్పంగా గుర్తించుకొన్నాను. చెర్రీపూలు నిండివున్న ఆ వృక్షం ద్వారా నేను మరింత లోలోతుల్లోని చైతన్యంలోకి దిగినాను. నేను ఒక నీలవర్ణపు ప్రవాహశక్తిని అనుసరించిపోగా నేనే చెర్రీవృక్షాన్నయినాను. అనేక పుష్పాలు వికసించి బరువెక్కిన, అసంఖ్యాక శాఖలతో ఆకాశం వైపు చేతులు చాచినాను. అప్పుడు నాకు ఒక స్పష్టమైన వాక్యం విన వచ్చింది. "నీవు చెర్రీవృక్షాల ఆత్మలతో తాదాత్మ్యము పొంది వున్నావు.

అందువల్ల ఈ దివ్యలోకాల కోసం చేసే పుష్పాల ప్రార్థన పరమాత్మయే చేస్తున్న సంగతి నీవు గ్రహించితివి!

ఈ అంశం వ్రాయగానే అది చెదిరిపోయింది. ఇప్పుడు నా రక్తనాళాలలో చెర్రీవృక్షాల రక్తం ప్రవహిస్తూ నాకు సాటిలేని శాంతినీ, శక్తినీ కలిగిస్తున్నది. మానవ శరీరానికీ వృక్షశరీరానికీ మధ్య అంతర్యం ఏముంది? వీటిని జీవింపజేసే చైతన్యం ఒకటే.

ఇప్పుడు చెర్రీ వృక్షం నా చెవిలో గుసగుసలాడింది. 'చెర్రీ పూలలోనే ఈ వసంతంలోని దోషాలకు చికిత్స* ఉంది'

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

నిత్యజీవితంలో పూర్ణాహుతి

జీవితం పరమాత్మకు సమర్పణగా ఒక పుష్పంలాగా వికసించాలి.

*

నిశ్శబ్దత ఎంత రమణీయంగా ఉంటుందో మనం పూల దగ్గర్నుంచి నేర్చుకోవాలి. ప్రతిఫలం కోరని ఆత్మసమర్పణ అంటే ఏమిటో కూడా అప్పుడు మనం తెలుసుకోగలుగుతాం.

*

మొదట మామూలుగా ఈ సమర్పణాభావంతో ఆరంభించు. "నేను పరమాత్మ సేవకుణ్ణి. నా జీవితం పరిపూర్ణంగా అతనికే అర్పితము నా ప్రయత్నాలన్నీ దివ్యజీవన సాఫల్యం కోసమే" అని చెప్పాలి. కాని ఇది తొలి అడుగు మాత్రమే. ఇంతటితో సరిపోదు. జీవితాన్ని పూర్తిగా పరమాత్మకు అర్పణ చేయవలెనన్న నిర్ణయం చేసుకున్న తరువాత,

---

*11-2-1936 న శ్రీమాత యిచ్చిన వివరణ: వసంతకాలంలో వచ్చే జబ్బులు పొంగులు రక్తదోషాలు మొదలైనవి. వీటిని జపానులో చెర్రీపూలతో చేసిన టీ ఇచ్చి తగ్గిస్తారు. ఈ అనుభవం నాకు కలిగిందెప్పుడో గుర్తు లేదు.

అనుక్షణంలో జీవనంలోని ప్రతి సూక్ష్మతరాంశంలోనూ నీవు ఆ నిశ్చ యాన్ని మనః పూర్వకంగా నెరవేర్చాలి. అడుగడుగునా నీవు పరమా త్మకు చెందినట్లు భావించాలి. నీవు ఏమి ఆలోచించినా, ఏమి చేసినా దివ్యచైతన్యమే నీ ద్వారా పనిచేస్తున్నదన్న నిరంతరమైన అనుభ వాన్ని పొందాలి.

నువ్వు చేసే ప్రతి చేష్టలోను నీ సమర్పణను అమలుపరుస్తూ వుండాలి. నిత్యమూ దివ్యచైతన్య సన్నిధిలో జీవించాలి. ఈ సాన్ని ధ్యమే నిన్ను కదిలించేది నీవల్ల అన్ని కార్యాలను సాధించేది అన్న భావంతో జీవించు. మానసిక క్రియలే కాక సాధారణమైన ఆలోచన లను, అనుభవాలను అతిసామాన్యమైన భోజనం చేయుటవంటి క్రియ లను కూడా సమర్పించు. నీవు భుజిస్తున్నప్పుడు పరమాత్మ నీద్వారా భుజిస్తున్నట్లు అనుభావాన్ని పొందు. ఈ రకంగా జీవనంలోని అన్ని కదలికలనూ ఏకాకార జీవనంలోనికి తెచ్చుకోగలిగినప్పుడు, నీలో అనేకత బదులు ఏకత నిలుస్తుంది. నీ ప్రకృతిలోని అన్ని భాగాలూ పరమాత్మకే అర్పితమవుతవి. అందువల్ల నీలోని ఒక విభాగం పరమా త్మకు అర్పితమై మిగతా భాగాలు సామాన్య పద్ధతిలో మిగిలిపోయి లౌకికాంశాలతో నిమగ్నమై ఉండే స్థితి కలుగదు. నీ జీవితం అంతా స్వీకృతమై క్రమక్రమంగా సమన్వితమైన పరిణామం ఎరుకలోనికి వస్తుంది.

సమన్విత జీవితంలోని ప్రతి చిన్న అంశం కూడా సమన్విత మైన యోగంలో పరివర్తన పొందవలసి వుంటుంది. ఈ సందర్భంలో ఏ అంశమూ అముఖ్యం కాదు. ఏదీ ఉపేక్షింపదగింది కాదు. నేను ధ్యానం చేసేప్పుడు, తత్త్వగ్రంథాలు చదివేటప్పుడు, ఆ సంభాషణలు విన్నప్పుడు ఆ దివ్యకాంతిని ఆహ్వానిస్తూ నా హృదయాన్ని తెరచి వుంచుతాను. కాని నేను బయట నడిచేటప్పుడు మిత్రులను కలసి నప్పుడు నేను ఆ విషయం మొత్తం మరచిపోవచ్చుననే వీలు లేదు. ఈ విధమైన స్థితిలో ఉండటమంటే పరివర్తన కలుగని, నిజమైన దివ్య సంయోగం పొందని దశలో ఉండిపోవటమే. ఏవో కొన్ని ఉన్నత జీవి తపు మెరపులు కలిగితే అదే గొప్ప. ధ్యానవేళల్లో కొన్ని అనుభూ

తులు, సాక్షాత్కారాలు కలుగవచ్చుగాని నీ శరీరమూ, బాహ్యజీవితమూ మారకుండా అలాగే ఉండిపోతాయి.

*

నీ ఆత్మసమర్పణా క్రమంలో నీ వ్యక్తిత్వమంతా (మొదట్లో తీర్మానించుకున్న భాగము) చుట్టూ చేరటం మొదలు పెడుతుంది. నీ ప్రకృతిలోని అన్ని వికార లక్షణాలూ సమశ్రుతిలోకి రావలసి ఉంటుంది. వాటిల్లో ఒక్కోదాన్నీ గ్రహించి కేంద్రీయ పురుషునితో ఏకీభావం పొందవలసి ఉన్నది. సహజోద్గమ స్థితిలో నిన్ను నీవు సమర్పించుకోవచ్చు. ప్రబలమైన ఏకీభావం లేకుండా యిది సాధ్యం కాదు. ఈ ఏకీభావం ఎంత ఎక్కువగా కలిగితే అంతగా నీ ఆత్మ సమర్పణ అనుభవంలోకి వస్తుంది.

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

పూలను ప్రేమించటం ఆత్మ సంపర్కానికి సహకారం

చైత్యాత్మ (psychic) యొక్క ప్రాథమిక స్థాయిని స్పందనమూ నేను మొక్కల జీవితంలో గమనించాను. నిజానికి మొగ్గలు వికసించటమనేది, చైత్యాత్మయొక్క ప్రథమాభివ్యక్తి. చైత్యాత్మ మనిషిలో వ్యష్టితను పొందింది కాని అంతకుముందే అది ఉన్నది. కాని ఇది మనిషిలో ఉన్నంత వ్యష్టిగా కాకుండా తరళమై ప్రవాహదశలో ఉంటుంది. మొక్కలలో ఇది ఒక శక్తిగా ఒక చైతన్యంగా ప్రకటమవుతుంది. వ్యష్టిగా మాత్రం కాదు. ఉదాహరణకు ఒక గులాబీని తీసుకోండి. రూపంలోను, రంగులోను, పరిమళంలోనూ అది ఒక పరిపూర్ణ వస్తువు. అనాహత చైతన్యాన్ని యిచ్చేదిగా, ఆకాంక్షకలదిగా ప్రకటమవుతుంది. సూర్యుని తొలి స్పర్శలోనే దాని ఆకాంక్షలో ఉదాత్తమైన ఆత్మసమర్పణము వ్యక్తం చేస్తుంది.

*

పూలపైన గల ప్రేమ అంతరాత్మను గుర్తించేందుకు దానితో ఏకీభావం పొందేందుకు విలువైన సహాయం చేస్తుంది.

ప్రశ్న దీన్ని గురించి విపులంగా చెప్పండి?

మొక్కల ప్రపంచంలో పూలు చైత్యాత్మ చేతనకు అభివ్యక్తులు కావటంవలన పూలమీద ప్రేమ అంటే ఎవరైనా ఆ ప్రేరణ వల్ల అటువైపు ఆకర్షితులైనట్లూ, క్రమంగా తమలోని చైత్యాత్మ వైపు మరలటం జరుగుతుంది.

నీవు పూలలోని చైత్యాత్మ స్పందనను గ్రహించగలిగినప్పుడు అది నీలోని చైత్యాత్మతో సంపర్కాన్ని కలిగిస్తుంది. పూలలోని సౌందర్యం కూడా అంతరాత్మ వైపు మనుష్యులను మేల్కొలపటానికి ప్రకృతి ఏర్పరచుకున్న మార్గం కావచ్చును.

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

పూలపైనా మొక్కల పైనా అనురాగం

పూలకు గ్రహణశక్తి వుంది. వాటిని ప్రేమిస్తే అవి సంతోషపడతాయి!

*

ప్రశ్న మొన్న నేను మీకోసం పూలసజ్జను అలంకరిస్తున్నాను. 'ఓహో! నీవు శ్రీమాత చెంతను చేరుతున్నావ' ని ఒక పూవుతో అన్నాను. ఆ పూవు నిజంగా నవ్వింది. ఈ సంగతి నిన్నా, ఈ రోజూ కూడా జరిగింది.

శ్రీమాత: నిజంగా అది చాలా విశేషమే అది గులాబియా?

సాధకుడు: ఒక మందారపువ్వు నాకు ఈ అనుభవాన్ని యిచ్చింది.

శ్రీమాత: అది నిజంగా చైతన్యంగల పూవు. దీనికి తార్కాణాలు నా దగ్గర ఎన్నో వున్నాయి.

*

ప్రశ్న: మధుమయి మాతా! ఒక మొక్క భౌతికంగా కాకుండా ఉన్నత దశల్లో పెరుగుతుందా?

శ్రీమాత: మొక్కల్లో ఎంతో ప్రాణికశక్తి ఉన్నది. ఈ ప్రాణికశక్తికి చాలా క్రియాసమర్థత ఉన్నది. ఈ మొక్కల జాతులలో విశేష చైతన్యం ఉన్నది. ఇప్పటికే మొక్కలలో సక్రియమైన చేతనే పనిచేస్తున్నది. మొక్కలలోని ఈ శక్తి అంతర్గతంగానే చైత్యాత్మ ప్రభావానికి ప్రతి స్పందించే స్థితి యింకా ప్రాథమిక దశలోనే ఉన్నది. కొన్ని పూలలో మాత్రం చైత్యాత్మ గురించిన వాటి ఆకాంక్ష వ్యక్తమవుతున్నది. అది సహజంగా వాటిల్లోంచి ఉబికి వస్తుంది.

ఒక మొక్కను గురించి నీవు మామూలు శ్రద్ధ వహించటమే కాక, నీవు ప్రేమించితే ప్రత్యేకమైన అనురాగాన్ని ప్రకటించితే, దానికి సన్నిహితంగా ఉన్నట్లు భావించగలిగితే ఆ మొక్క ఆ విషయాన్ని గ్రహిస్తుంది. అది వికసించినప్పుడు ఎక్కువ సంతోషం, సమశ్రుతీ వ్యక్తమవుతవి. ఇదంతా ఒక మొక్కలోని ప్రతిస్పందన మాత్రమే. దానిలో ఒక సాన్నిధ్యం, ఒకింత చైతన్యం ఉన్నది. నిజంగా మొక్క ప్రాణికజీవి.

ప్రశ్న పూలలో సౌందర్య దృష్టి ఉన్నదా?

శ్రీమాత: జడపదార్థంలోకి ప్రాణికాంశం ప్రవేశించగానే సౌందర్య భావన కలుగుతుంది. అది మనం అనుకునేట్లుగా ఆ పూల వ్యష్టి చైతన్య పరిమితులలోనికి రాకపోవచ్చును. అది ఆ మొక్కల పూల విశిష్ట జాతికి సంబందించిన అంశం. ఆ జాతి ఆ భావాన్ని సాక్షాత్కా రించుకునే ప్రయత్నం చేస్తుంది.

*

టోక్యోలో ఉన్నప్పుడు నాకొక ఉద్యానవనం ఉండేది. నేనే అక్కడ కూరగాయలను పెంచేదాన్ని కూరగాయలు చాల ఉండేవి. నేను ప్రతి ఉదయం నడచేందుకు వెళ్లేదాన్ని వాటికి నీళ్లు పోసి విశ్రమించిన తరు వాత, నేను తినటానికి కూరగాయలను ఎంచుకునేందుకు వాటి చుట్టూ తిరిగేదాన్ని నిజంగా ఊహించండి. ఏం జరిగేదో కొన్ని మొక్కలేమో వద్దు వద్దు వద్దు అనేవి. మరి కొన్ని చాలా దూరంనించే నన్ను చూడగానే నన్ను తీసుకో నన్ను తీసుకో నన్ను తీసుకో అని

పిలిచేవి. నేను తీసుకొమ్మని కోరిన వాటినే గ్రహించి మిగతావాటిని ముట్టేదాన్ని కాదు. దాన్ని ఒక విశిష్టాంశంగా తలచేదాన్ని నా మొక్కలను నేను ప్రేమించి, పట్టించుకునేదాన్ని నీళ్లు పోసేటప్పుడు, కలుపు తీసేప్పుడు నా చైతన్యాన్ని వాటిలో ప్రవేశపెట్టేదాన్ని వాటికి ప్రత్యేక సామర్థ్యం ఉన్నదని తలచేదాన్ని

ఫ్రాన్సులో కూడా ఇదే జరిగింది. ఫ్రాన్సు దక్షిణ సీమలో నాకొక ఉద్యానవనం ఉండేది. అక్కడ చిక్కుళ్లు, ముల్లంగి, కారట్లు పెంచేదాన్ని అక్కడ కూడా కొన్ని సంతోషంగా ఉండి వాటిని తినమని కోరేవి. మరికొన్ని మమ్మల్ని ముట్టుకోవద్దు అనేవి (నవ్వు)

ప్రశ్న: మధుమయి మాతా! అలా ఎందుకన్నవి?

శ్రీమాత: వాటిల్లో ఏం జరుగుతున్నదో తెలుసుకొనే ప్రయోగాలు చేశాను. కాని అన్ని సందర్భాలలోనూ ఫలితం వేరు వేరు. ఒక్కో సమయంలో అవి తినటానికి యోగ్యం కానివి. పచ్చిగానో చేదుగానో ఉండేవి. కొన్ని రుచిలేనివి, కొన్ని పరిపక్వం కానివి. కొంతకాలం తరువాత తినవలసినవి మాగ లేదు. ఒకటి రెండు రోజుల తరువాత అవి నాతో నన్ను తీసుకో నన్ను తీసుకో అనేవి.

*

మొక్కలను ఒక గదిలో బంధిస్తే అవి బాధపడతాయి.

*

మొక్కలకు సజీవ వ్యక్తులకులాగానే శ్రద్ధ, సౌకుమార్యం, ప్రేమ కావాలి. అవి సజీవాలు. సుఖ దుఃఖాలను పొందుతాయి.

*

ప్రశ్న మొక్కలను పూలను శ్రద్ధగా చూచేందుకు కావలసిన చైతన్యాన్ని మనలో పెంపొందించేందుకు మనం ఏం చేయాలి?

శ్రీమాత: మొదట నీవు నిశ్శబ్దంగా ఉండటం నేర్చుకో అప్పుడు నీ చైతన్యంలో ఏమి జరుగుతుందో గమనించు.

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

శ్రీమాత పుష్పాలకు సంకేతార్థాన్ని ఎలా ఇస్తారు?

ప్రశ్న: మాతా! మీకు పుష్పాలు ఇచ్చినప్పుడు వాటి అంతరార్థాన్ని ఎట్లా కనిపెడతారు?

శ్రీమాత: పుష్పాలకా? దానికొకటే మార్గము. పువ్వుతో మాట్లాడాలి! అంటే దాన్ని అంతరంగికంలో స్పర్శించి దాని తత్త్వాన్ని గ్రహించాలి. ఈ విధంగా దాని సందేశాన్ని ఎవ్వరైనా తెలుసుకోవచ్చు.

ప్రశ్న: ప్రతి పూవుకీ ఒక ప్రత్యేకార్థం ఉంటుందంటారు, నిజమేనా?

శ్రీమాత: అది మనం మనస్సుతో అర్థం చేసుకున్నట్లుగా కాదు. ఒక పుష్పానికి కచ్చితమైన అర్థాన్ని ఆపాదించేటప్పుడు మన మనస్సును దాని మీదికి ప్రక్షేపిస్తాము. ఆ ప్రక్షేపణ స్పర్శతో అది ప్రతిస్పందించ వచ్చు, సమాధానమీయవచ్చు, ఆ అర్థాన్ని అంగీకరించవచ్చు. అయితే దానికి మానసిక చైతన్యంలాంటిదేమీ లేదు. వృక్షరాశిలో కొద్దిగా చైత్యస్థాయి మొదలవుతుంది కానీ మానసిక చైతన్యం ఏర్పడదు. జంతు వుల పద్ధతి వేరు. అక్కడ మానసిక జీవనం ప్రారంభం కావటంవల్ల వాటికి విషయ పరిగ్రహణ ఉంది. కానీ పూలలో మాత్రం అది చాలా పసిస్థాయిలో ఉంటుంది... అది ఒక అనుభూతీ కాదు, భావనా కాదు; అది కొంత, ఇది కొంత. ఒక స్వతః సిద్ధ చలనము. ఒక ప్రత్యేక స్పందన. అందువల్ల దాని సంస్పర్శతో దాని అనుభూతి పొందితే మనస్సులో ఒక భావన ఏర్పడి స్థిరరూపం పొందుతుంది. ఆ విధంగానే నేను పూలకు, మొక్కలకు భావార్థాన్ని ఇచ్చాను. వాటి స్పందనలతో ఒక రకంగా ఏకత్వాన్ని పొంది, అదే దేన్ని తెలియచేస్తోందో ఆ గుణాన్ని మెల్ల మెల్లగా గ్రహించి సుమారుగా అంచనా వేస్తాను. (అది ఒక్కొక్కసారి టక్కున తెలుస్తుంది; ఒక్కొక్కసారి కొంచెం వ్యవధి పడుతుంది) ఆ స్పందనలన్నీ కలిసి (అవి ప్రాణిక-ఉద్వేగాత్మకమైనవి) ఆలోచన కంపనాలతో చేరినప్పుడు తగినంత సామరస్యం ఉన్నవారికి ఆ మొక్క దేన్ని సూచిస్తుందో అది సూటిగా తెలుస్తుంది.

కొన్ని దేశాలలో (ప్రత్యేకించి మన దేశంలో) కొన్ని వృక్ష జాతులను పూజకు, అర్చనకు ఆరాధనకు ఉపయోగిస్తారు. కొన్ని రెమ్మలను ప్రత్యేక సందర్భాలలో ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ విధంగా

ఇచ్చిపుచ్చుకోవడం ఆ మొక్క స్వభావగుణాన్ననుసరించి జరగటం నేను గమనించాను. ఎలాగంటే సాంప్రదాయక సందర్భాలలో ఏ విశిష్ట తతో దాన్ని వాడతారో అది నాకు తెలియకుండా స్వతఃసిద్ధంగానే నేను అదే అర్థాన్ని ఆ పుష్పానికి ఇవ్వటం జరిగింది. అంటే ఆ స్పందన ఆ పుష్పంలో ఉన్నట్లే కదా! అది పూజా పునస్కారలలో వాడుతూండటంవల్ల వచ్చిందా? లేక ఎంతో దూరాన్నించి, లోతు ల్లోంచి చైత్య జీవన ప్రారంభ దశనుంచి కల్గిందా? చెప్పటం కష్టం.

*

సాధారణంగా కుసుమాల భావార్థాన్ని నాకు స్ఫురింప చేసేది వాటి సౌరభాలే. ఈ విధంగా వాటిని తెలుసుకోవడం చాలా ఉత్సుకత కలిగిస్తుంది. ప్రకృతిలోని సత్యానికిది అనుగుణంగా ఉంటుంది.

ఒకసారి ఒకరు వచ్చి నాకేమీ చెప్పకుండా చేతిలో ఒక తులసిదళం ఉంచారు. దానిని నేను వాసన చూసి "ఆహా, ఇది భక్తి" అన్నాను. అది పూర్తిగా ఒక భక్తి ప్రకంపనమే. ఆ తర్వాత ఆ మొక్క పరిపూర్ణంగా శ్రీకృష్ణునికి అంకితమైందనీ, అది భక్తికి ప్రతీక అనీ నాకు తెలిసింది.

ఇంకొకసారి కొన్ని పెద్ద పూలు తెచ్చి ఎవరో నాకిచ్చారు. అవి నిజానికి పూలంటానికి వీల్లేకుండా జొన్నపొత్తుల్లాగ పొడవుగా ఉన్నాయి. ఆ సువాసనలు (ఆధ్యాత్మిక పరిమళం) వెదజల్లే కాడలు చూసి 'తపో పవిత్రత' అని చెప్పాను. పూర్తిగా దాని పరిమళాన్ని బట్టే చెప్పాను. పరమశివుడు తపస్సు చేసేటప్పుడు ఆయనకు ప్రీతిపాత్రమైన పుష్పమని నాకు తర్వాత తెలిసింది. ఇది తపోనిష్ఠలోనున్న శివుని సంకేతము.

ఈ జ్ఞానము యుగయుగాల నాటిది. దాన్ని వారు జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చారు. ఇది ఒక దృఢమైన సత్యము. ఇది మనస్సుతోగానీ, ఆలోచనతోగానీ, అనుభూతితో కానీ సంబంధం ఏ మాత్రంలేని ఒక ప్రకంపనము.

పరమశివుడని నేను చెప్పిన ఈ పుష్పం ఈ పుష్పపరిమళం సర్పాలను అపరిమితంగా ఆకర్షిస్తుంది. అవి ఎక్కడ్నుంచి వచ్చి ఈ మొగలి పొదల్లో నివాసమేర్పరుచుకుంటాయి. ఇంకోటేమిటంటే పరి

ణామక్రియ యొక్క శక్తి అయిన సర్పము పరమశివునికి అత్యంత ప్రీతి పాత్రమైనది. అది పరిణామ క్రియకే కాకుండా పరివర్తనకి కూడా చిహ్నం కాబట్టి వాటిని ఆయన ఆభరణాలుగా వంటిమీద ధరిస్తాడు. ఈ మొగలి పొదలు సాధారణంగా నదీతీరాలలో ఉంటాయి. ఇవంటే పాములకు ఇష్టం కాబట్టి ఇవి ఉన్నచోట పాములు తప్పకుండా ఉంటాయి.

ఇంకొక మనోజ్ఞమైన విషయం ఏమిటంటే ఇవి ఇలా ఉండాలని మనమనుకోనే లేదు. ఇవి ప్రకృతి యొక్క చైతన్యాత్మక ప్రకంపనములు. ఈ పరిమళము, రంగు ఆకారము కూడా ఒక సత్యమైన చలనానికి స్వతస్సిద్ధ వ్యక్తీకరణ మాత్రమే.

అనువాదం: ఎ.వి.ఆర్. శాస్త్రి, ఎ. ప్రభావతి

పుష్పాలు – శక్తి ప్రసార సాధనాలు

పుష్పాలకు గ్రహణశక్తి చాల ఎక్కువ! నేను ప్రత్యేకార్థాన్ని (significance) ఇచ్చిన పూలన్నీ నేను వాటిలో నిక్షిప్తం చేసిన శక్తిని చక్కగా గ్రహించి తిరిగి యథాతథంగా ప్రసారం చేయగలవు. కాని మానవులు ఆ శక్తిని అంతగా గ్రహించలేరు. దానికి కారణం వారి గ్రహణశక్తి పూలకంటే తక్కువగా ఉండటమే! పైపెచ్చు వారిలో చైతన్యము, గ్రహణశీలత లోపించుటవలన వాటిలో నిక్షిప్తమైన శక్తిని వృథా చేస్తారు. అయినప్పటికీ ఆ పుష్పం యొక్క అద్భుత గ్రహణశీలత వల్ల ఆ శక్తి అక్కడే ఉంటుంది.

నాకు ఈ విషయం చాలాకాలం నుంచి తెలుసు. సుమారు ౫౦ సంవత్సరాల క్రితం ఆల్జీరియా దేశంలో 'ట్లెంసెన్' అనే చోట ఒక గొప్ప గుప్తజ్ఞానవేత్త ఉండేవారు. (వారి దగ్గర 2 సంవత్సరాలు నేను గుహ్యావిద్య నభ్యసించాను.) వారి సతీమణి అద్భుతమైన యోగద్రష్ట. అంతేకాక ఆమె శక్తులను ప్రసారం చేయడంలో దిట్ట. నేను పారిస్ నగరంనుంచి వారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూండేదాన్ని ఒక

సారి ఆమె నాకు కవరులో పెట్టి దానిమ్మ పూరేకలు, "దివ్యప్రేమ" నాకు పంపించారు. అప్పటికి నేనా పూలకి భావార్థం ఈయలేదు. ఆ పూరేకులు నాకు తమ శక్తినీ, రక్షణనూ అందిస్తాయని ఆమె తెలిపారు.

ఆ రోజుల్లో నేను ఒక గడియారాన్ని నా గొలుసులో వేసి మెడలో ధరించేదాన్ని అప్పట్లో చేతిగడియారాలు చాలా అరుదు. దానితోపాటుగా ఒక చిన్న భూతద్దాన్ని కూడా నాతో ఉంచుకునే దాన్ని. ఆ 18 వ శతాబ్దపు భూతద్దంలో బంగారపు చట్రంలో బిగించిన రెండు లెన్సులు (భూతద్దాలు) ఉండేవి. మామూలుగా చదవటానికి అటువంటివి ఉపయోగించేవారు. ఈ దానిమ్మ పూరేకులను ఆ రెండు అద్దాల మధ్యనపెట్టి ఎప్పుడూ నాతోనే ఉంచుకునే దాన్ని. నాకు ఆమెమీద ఉన్న నమ్మకం వల్ల, ఆమె శక్తిని విశ్వసించి ఈ విధంగా ఆ పూరేకులను నాతో ఉంచుకునేదాన్ని దానివల్ల ఒక రకమైన శక్తి, ఉత్సాహం, నిబ్బరం, ఆర్ద్రత పొందుతున్నట్లు భావించేదాన్ని దాన్ని గురించి ఆలోచించకపోయినా ఆ అనుభూతి నాకుండేది.

ఇలా ఉండగా ఒకనాడు హఠాత్తుగా నా శక్తి తగ్గినట్లు, ఊతము తప్పిపోయినట్లు, చాల లోటు కలిగింది. నాకు చాలా ఆశ్చర్యం కలిగి "ఏమైంది? నాకేమైంది" అని పరిపరి విధాలుగా ఆలోచించటం మొదలు పెట్టాను. కానీ నా శక్తిహీనతకు కారణం కనిపించలేదు. ఆ రోజు సాయంత్రం గొలుసు గడియారం తీసిచూసు కున్నప్పుడు భూతద్దంలోని ఒక అద్దం ఊడిపోయి దానిమ్మ పూరే కులు ఒక్కటైనా మిగలకుండా అన్నీ పోయాయి. అప్పుడు నాకు తెలి సింది: ఆ రేకులలో ఎంత గణనీయమైన శక్తి నిక్షిప్తమైనదోనని. నాకు కారణం తెలియక పోయినా జరిగిన లోటు వెంటనే తెలిసింది. అప్పటినుంచే పూలలో శక్తిని నిక్షిప్తం చేయవచ్చని ఉపయోగించ వచ్చని నాకు తెలిసింది. వాటి గ్రహణశక్తి అపారము.

ప్రశ్న పూలలో నిక్షిప్తం చేసిన శక్తి సదా నిలిచి ఉంటుందా? అవి వాడి పోయినా కూడా?

శ్రీమాత: వాడిపోయినట్లైతే పనిచేయవు. ఎందువల్లనంటే వాడిన తర్వాత కుళ్ళిపోతాయి. అప్పుడు అందులో శక్తి నశిస్తుంది. వాటిని భూమిలో వేస్తే దానికి శక్తి నివ్వగలదేమో! కుళ్ళిపోతే ఎరువుగా

ఉపయోగపడతాయి. కానీ ఎండిన పూలలో మాత్రం శక్తి చాలా కాలం దాకా నిలిచి ఉంటుంది.

అనువాదం: ఎ.వి.ర్. శాస్త్రి, ఎ. ప్రభావతి

పూవువలె ఉండాలి

శిష్యుడు: మధుమయి మాతా! అభివాదము
శ్రీమాత: అతనికి ఒక పుష్పాన్నిచ్చి... ఇదేమిటో తెలుసా?
శిష్యుడు: 'కళాత్మక సౌందర్యము' కదా తల్లీ!
శ్రీమాత: ఇదెంత సుకుమారంగా, స్వచ్ఛంగా ఉన్నదో కదా!
శిష్యుడు: అమ్మా! మీరు నాకిదిచ్చారంటే నేను కళాత్మక సౌందర్యాన్ని పెంపొందించుకుంటాననా? లేక ఈ పుష్పం నాలో ఉండే లక్షణానికి సరిపోతుందనియా?
శ్రీమాత: నేను పూలు ఇచ్చినప్పుడు అది నీ జీవి అంతరాంతరాల్లో నుంచి పైకుబికే ఆకాంక్షకు సమాధానంగా ఉంటుంది. అది నీకవసరమైనదైనా అయి వుంటుంది. లేక నీ ఆకాంక్షను తీరుస్తుంది. అది మనిషినిబట్టి ఉంటుంది. అది నీలోని ఒక లోటును భర్తీ చేయవచ్చు లేదా అది నీవు పురోగమించటానికి ప్రేరణ కలిగించవచ్చు. ఇంకా నీలో ప్రశాంతత నెలకొల్పడానికై నీ ఆంతర సామరస్యాన్ని నీవు గమనించడంలో సాయమైనా చేయవచ్చు. తెలిసింది కదా!

పూవువలె ఉండు, ఒక పూవుమాదిరి ఉండుటకు ప్రయత్నించు. వికాసంగా, నిష్కపటంగా, సమభావంతో ఉదార బుద్ధితో దయాశీలిగా ఉండాలి. బోధపడిందా?
శిష్యుడు: తల్లీ! సరిగా అవగతం కాలేదు.
శ్రీమాత: ఒక పుష్పం తన చుట్టూ ఉన్నవాటికి ఉన్మీలన పొంది వాటన్నిటినుంచి గ్రహిస్తుంది — ప్రకృతి, వెలుగు, సూర్యకాంతి, గాలి

---

[1] ఒక శిష్యునికి శ్రీమాత జరిపిన సంభాషణను అతని జ్ఞాపకాలనుంచి రాసినది.

ఇత్యాదులకి. అంతేకాక స్వతసిద్ధంగా అది తన ప్రభావాన్ని వాటి పైకి వెదజల్లుతుంది. అందాన్ని, ఆనందాన్ని గుబాళింప చేస్తుంది. దానికి అరమరికలు లేవు. తన అందాన్ని దాచుకోకుండా తనలో నుంచి యథేచ్ఛగా ప్రవహింప చేస్తుంది. దాని లోతుల్లో ఉన్నదాన్ని కూడా వెలికి తెచ్చి నలుగురికీ కనబడేటట్లు చేస్తుంది. దానికి సమభావం ఉంది. పక్షపాతవైఖరి లేదు. ఏమాత్రం భేదబుద్ధి లేదు కాబట్టి ప్రతి వారూ దాని అందాన్ని, పరిమళాన్ని ఆస్వాదించివచ్చు. ఆనందించ వచ్చు. అందరికీ అది సమానమే. ఎక్కడా భేదభావం లేదు.

ఔదార్యం: ఏ రకమైన నియమ నిబంధనలూ లేకుండా, మాయా మర్మాలు లేకుండా ప్రకృతిమాత స్వీయపరిమాళాన్ని, మర్మసౌంద ర్యాన్ని పంచిపెట్టేస్తుంది. మన ఆనందం కోసం తనను తాను సమర్పించుకుంటుంది. అంతే కాకుండా తన అందాన్ని అభివ్యక్తం చేయటానికి తనలో దాచుకున్న సృష్టిరహస్యాలను వ్యక్తం చేయడా నికి తన జీవితమే త్యాగం చేస్తుంది.

కరుణ: ఎంతో ఆర్ద్రతతో సుమధురంగా, ప్రేమ పూర్వకంగా మనదరి చేరుతుంది. అది దగ్గర ఉంటే మనం ఆనందంతో ఉప్పొంగిపోతాము. అది ఎప్పుడూ ఉల్లాసంగా, ఆనందభరితంగా ఉంటుంది.

తన గుణగణాలను పుష్పగుణాలతో మారకం చేసుకోగలిగిన వారు ఆనందభరితులౌతారు. వాటి సున్నితమైన లక్షణాలను నీలో కూడా పెంపొందించుకునేందుకు ప్రయత్నించు.

పుష్పాలు సంకేతాలై నిలిచిన దివ్యలక్షణాలను నీవు అలవర చుకుంటావనే నీకు వాటినిస్తాను. తమలో ఉన్నదాన్నంతా స్వచ్ఛంగా, మిశ్రమం లేకుండా సూటిగా చైత్య కక్ష్యలో ప్రవేశపెట్టగలవు. అతి సూక్ష్మమైన గాఢశక్తి ప్రభావాలు వాటికున్నాయి. అర్థమైందా? ఇదంతా విని నీవు కూడా సుమబాలగా ఉండాలనుకుంటున్నావు కదూ! ఆ లక్షణాలను అలవరచుకోవాలనుకుంటున్నావా? భూమాత పరిణామ క్రమంలో ప్రతి పూవు ఒక విధానానికి, ఒక ఉత్పత్తికి, ఒక ఆకాంక్షను, ఒక ప్రగతికి సంకేతంగా తయారు చేసింది.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వేంకట్రామ శాస్త్రి

ప్రశ్నోత్తరములు

ప్రశ్న: సువాసనభరితమైన పూలు వాసనలేని పూలకంటే తీవ్రమైన చైత్య ప్రార్థనని సూచిస్తాయా?

శ్రీమాత: అత్యంత ఉదారతతో సంపూర్ణంగా సమర్పించుకోవడమే వాటి స్వభావము.

ప్రశ్న. అదే విధమైన తేడా వృక్షాలకు, మొక్కలకూ కూడా ఉన్నదా?

శ్రీమాత: లేదు. అది జంతువుల మధ్య తేడా వంటిదే. కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి ఉండవూ? వృక్షాలలో కూడా అదే వరస. మిగతావి కూడా — ఖనిజాలు, జంతువులూ మానవులు మొదలైనవన్నీ కూడా అంతే. దేని నైజాన్ని అది ప్రకటించుకుంటుంది. ఈ నైజాలు అసంఖ్యాకం.

ప్రశ్న: జననీ! కొన్ని పుష్పాలకు ధనకాంక్ష (greed for money), మోహము (passion) గర్వము (vanity), ప్రేలాపన (chatter), మొదలైన పేర్లు ఉన్నాయి కదా! ఇవన్నీ చైత్య లక్షణానికి ఏవిధంగా చిహ్నం కాగలవు?

శ్రీమాత: ఇవి తమ దుష్టప్రకంపనాలను పరివర్తనకై సమర్పించు కుంటాయి.

ప్రశ్న: పూష్పాలను సమర్పించేటప్పుడు ఏ వైఖరితో ఉండాలి? వాటి ప్రాముఖ్యత మనకి తెలియకపోయినా పర్వాలేదా?.

శ్రీమాత: అది పూలు ఇస్తున్న వారిపైనా, వారి చైతన్యస్థాయిపైనా ఆధారపడి ఉంటుంది. వారి చైతన్యస్థితిననుసరించి వారు చేసిన దానికి ప్రాముఖ్యం ఉండవచ్చు, ఉండక పోవచ్చు.

ప్రశ్న మన పుష్పసమర్పణ మన చైతన్యస్థితిపై ఆధారపడి ఉన్నట్లైతే అది పూవుల విశిష్టార్థాన్ని తెలుసుకోడానికి తోడ్పడుతుందా? మొదట్లో అది పూర్తి మానసికమే అయినా కూడా?

శ్రీమాత:అవును, నిశ్చయంగా

ప్రశ్న ఒక రంగును ప్రతిబింబించడానికి గానీ. ఒకే రంగులో పూయ డానికిగానీ పుష్పంలో ఉండేదేమిటి?

శ్రీమాత: అది అణువుల సమ్మేళనమని శాస్త్రజ్ఞులంటారు. నేను మాత్రం అది వాటి ఆకాంక్ష అంటాను.
ప్రశ్న: సమాధినలంకరించిన పుష్పాల ద్వారా శ్రీఅరవిందులేమైనా ప్రత్యేక సందేశాన్ని (వాటి ప్రత్యేకార్థం కాకుండా) అందిస్తారా?
శ్రీమాత: నేను ఆ విధంగా అనుకోవటం లేదు. అది ఇచ్చే వారినిబట్టి ఉండవచ్చు. పుష్పాలను సమర్పించే వారు వాటి ద్వారా ఏదైనా శ్రీఅరవిందులవారికి తెలియచేయాలనుకుంటే అది వారు గ్రహించ వచ్చు. అలా వారు ఆ ప్రార్థనను స్వీకరించి దానికి సమాధానం కూడా ఇస్తారు. తగినంత సున్నిత హృదయమున్న వారు దాన్ని గ్రహించగలరు.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వేంకట్రామశాస్త్రి

పుష్పములు – ఆరోగ్యము


ప్రశ్న: తీవ్రవేదన అనుభవిస్తున్నప్పుడు బాధనుపశమింప చేసేందుకు ఏం చేయాలి?
శ్రీమాత: ఒక అందమైన పుష్పాన్ని తిలకించు!
ప్రశ్న: కానీ ఇంకా తీవ్రబాధను అనుభవించే వారికి సుందర పుష్పము కూడా విసుగ్గానే ఉంటుందని నా ఉద్దేశం.
జవాబు: బాధననుభవించే ప్రాణికి భాగానికి పూర్తిగా బానిసై పోయార నటానికి అది గుర్తు. నీవా అధః ప్రవృత్తులనుంచి తప్పుకొని ఒక్క అడుగు వెనక్కి మరలటం నేర్చుకోవాలి.

*

ఇది 'దైహికంలోని ఆకాంక్ష'[1] మా ప్రేమ, ఆశీస్సులు నీకు సర్వదా ఉంటాయి. వైద్యుని మాటలు విని కలత చెందకు. రుగ్మతలెన్నడూ ప్రమాదించవు, మనం వాటిని కోరుకుంటే తప్ప. నీవు బాగున్నావనే కబురు వినటానికి ఎదురు చూస్తూంటాను.

*

[1] *Flame of the woods (Ixora coccines "Bandhuca")*



ఆరోగ్యము

దాన్ని గురించే చింతిస్తూండక దైవానికి వదిలి పెట్టడము.

సాధారణ నామము: మునిగంగరావి శాస్త్రీయ నామము: Thespesia populnea

ఇదిగో "నూతన జన్మ"[2] నిజానికి నవచైతన్యాన్ని పొందటానికి రుగ్మత కంటే వేరే మంచి అవకాశం లేదు. రుగ్మతను ఒక అవకాశంగా తీసుకొని నీ అంతరాంతరాల్లోకి చొచ్చుకొనిపోయి తెలివిచెంది నవ చైతన్యంతో అవతరించవచ్చు.

దానికి మా సహాయము, దీవనను, ప్రేమ ఎల్లప్పుడూ నీతోనే ఉంటాయి

*

ఆరోగ్యానికి సంబంధించిన పుష్పాలు — వాటి సంకేతార్థాలు

మునిగంగరావి: (*Thespesia populnea*) దీని పూలు ముదురు పసుపు రంగులో కప్పు ఆకారంలో ఉండి జాలువారుతున్న రేకులు ఉంటాయి. క్రమేపి పసుపురంగు ముదురు ఎరుపుగా మారుతుంది.
ఆరోగ్యము: రోగము సంగతి ఎత్తకుండా అంతా దైవానికే వదిలి పెట్టడం.
Ixora thwaitesii: సువాసనలు గుబాళించే తెల్లని పూవు (చిన్న చెట్టు)
కణాలలో శాంతము: శరీర పురోగతికి అత్యంతావశ్యకమైన స్థితి.
పన్నీరు చెట్టు: చిన్న పళ్ళాలను పోలిన తెల్లని పరిమళభరితమైన పుష్పాలు (వృక్షాలు)
నరాలలో శాంతి: మంచి ఆరోగ్యానికి అనివార్యము
పొన్న చెట్టు: తెల్లటి సువాసనా భరితమైన చక్రాలవంటి పూలు
దైహిక శాంతి:
భగవంతుడు సంకల్పించిన దాన్ని కోరే మంచి స్థితి
సీతమ్మవారి అక్షతలు: పొదలలో పూసే తెల్లని పూవ్వము.
కణాలలో పరిశుద్ధత:
కోరికలను జయిస్తేనే ఇది లభిస్తుంది. మంచి ఆరోగ్యం కావాలనుకుంటే ఉండవలసిన నిబంధన.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వేంకట్రామశాస్త్రి

---

[2] *మరువం*

శ్రీఅరవిందుని కవితాసౌరభాలు

'సావిత్రి' మహాకావ్యంనుండి

శూన్యగర్తమందు సృష్టియవతరణము సాధ్యమేని,
ఉపాధి రహిత శక్తియందు పదార్థ సృష్టి సాధ్యమేని,
తరువులోన అవచేతన ప్రసరణంబు సాధ్యమేని,
హరితలలిత ప్రమోదంబు పర్ణంబుల సాధ్యమేని,
సుందర దరహాసరోచి విరుల విరియ సాధ్యమేని,
ప్రతి కణమున ప్రతి నరమున నూత్న స్పర్శ సాధ్యమేని,
ధూసర మస్తిష్కంబును జ్ఞానమాక్రమించ,
కూటస్థుండైన ఆత్మ మాంసముల దేహాల నుండి తొంగిచూడ,
అతిమానుష తేజమొకటి ఉరకలతో దిగిరాదా?
గుప్త ప్రజ్ఞలెన్నో సుప్త చేతనలో మేల్కొనవా?

*

అమ్మ ఎపుడు వెలుగుచుండు అందరి జీవాత్మలందు,
ఆమెయుండు వారిలోన, ఆమెలోన వారుందురు...
తరులందున విరులందున అవచేతన ప్రాణమామె,
ఆమనిలో వినిపించెడు మధుమయ సంగీతమామె,
ఆవనిలో వికసించెడు సుమముల మాధుర్యమామె,
గులాబీల వన్నెలలో వైభవమ్ముగా నిలచెడి
ప్రేమపుష్ప హృదయోజ్వల అరుణారుణ రాగమామె,
స్వప్నలోక సరసి ధవళకాంతుల అరవిందమామె,
అవచేతనమ్మ ప్రాణముగా మన సున కెగబ్రాకునామె,
విశ్వ హృదయమందు రగులు భావమామె ప్రేమయామె,
హృద్దేశమునందు మసలు పరమేశ్వరియనగ నామె,
ఈశునితో ఐక్యమందు ఆత్మ చేయు గమనమామె.

*

ఉషస్సులోన మేల్కాంచు కొమ్మల మాటున దాగును,
పలుకునతడు ఆహ్వానము సుమబాలకు తరుకాంతకు,
శ్రేష్టమైన స్థాణువులో జడత్వమును పారద్రోలు.

*

ఆతని దరహాస హేల హరిత కాంతియై మెరయును,
సౌందర్యానుభవములన్ని సుమశోభలుగా మిగులును,
నీల సాగర వేదనాదము, పరుగులిడునది పదము సవ్వడి
స్వామి యధరము నుండి సాగెడి వేణుగానములే!
జగతియంతయు ఈశ్వరుని బహిరంగ వైభవమే!

*

తన్మయత్వ దరహాసము దాగియున్నదెల్లడులను,
జీవాయువుని ప్రాణముగా స్పందించుచుండు నెల్లప్పుడున్,
భూజములో సారముగా ప్రవహించును ఎల్లవేళల,
ఆకులలో పూవులలో ఆ వైభవమే వికసించును.

*

ధరలో వికసించు విరులు నవ్వును తగు ఋతువులలో,
ధరలో వికసించు విరులు నవ్వు మరణశయ్యలపై.

*

'FORM' అనే సానెట్‌నుండి

తన అనంత వైభవముల తేలియాడు ఏకాత్ముడు
గులాబిపూవు రూపుదాల్చి, గులాబిపూవు రంగుదాల్చి
ప్రపంచాబ్జపు రేకులకు నవవికసనము గూర్చున్.

*

శ్రీవారి ఉత్తరములనుండి:

పుష్పములు క్షణభంగురములే ఐనప్పటికి, అవి సంకేతపరిచే విషయములు శాశ్వతములు

*

సాధకుని ధ్యానంలో పుష్పములు కనబడుట చేతనావికాసమును సూచిస్తుంది. అది చైత్యవికాసమైనా కావచ్చు; చైత్యీకరణమైన (psychichised) ప్రాణికము, మానసికము, భౌతిక చేతనకు సంబంధించనదైనా కావచ్చును.

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

ఇద్దరు పాపలు – ఒక తామరపువ్వు



ఒకానొక ఎత్తైన కొండశిఖరముమీద ఒక చిన్న పాతబడిన దేవాలయము ఉండేది. అందలి దైవవిగ్రహాము చూచుటకు చాలా అందంగా ఉండేది. ఒక వృద్ధపూజారి అక్కడ పూజా కైంకర్యాలు చూస్తూండేవాడు.

ఆ కొండదిగువనున్న గ్రామాన్నుంచి తరచూ ఉష, లలిత అనే ఇద్దరు పాపలు ఆ దివ్యసుందర విగ్రహాన్ని తిలకించటానికి ఆ దేవాలయానికి వచ్చి వృద్ధ పూజారితో కబుర్లు చెప్పుతూ, ఆయన దైవ విగ్రహాన్ని రంగు రంగుల పూలతో అలంకరించటం చూస్తూండేవారు.

అలా తరచూ ఉషోదయమే ఆటలాడుతూ, పాడుతూ, గెంతులు వేస్తూ, పైకి వచ్చే ఆ పిల్లలిద్దర్నీ చూసి ఆ కొండదారిలోనున్న జంతు,

వృక్షజాలము రకరకాలుగా స్పందించేవి. వారివల్ల నిద్రాభంగమైన పావు రపు పిల్ల "ఈ జనపథాల వాళ్ళు ఎంతటి సద్దు చేస్తూంటారురా బాబు!" అని విసుక్కోనేది. కుచ్చు తోకను వూపుకొంటూ గంతులు వేసే ఉడుత "వీళ్ళా నాకు దాగుడుమూతలాట చూపించేది!" అని అహంకరించేది. "వీళ్ళు వేసుకున్న రంగుల బట్టలు నా ఉదరపు చర్మపురంగుకు పోలిరావు. వీళ్ళా నాకు వారి షోకులు ప్రదర్శించేది!" అని మరో పక్షి వెక్కిరించేది.

కాని గాలికి ఉయ్యాలలూగుతూండే రంగురంగుల పువ్వులు మందస్వరముతో "పాపాయిలూ! మేము విరగబూసాము. మమ్మలను కోసుకువెళ్ళండి. మేము స్వామికి అలంకారాలమవుతాము" అని బ్రతిమ లాడేవి. ఆ పిల్లలు సంతోషంగా పువ్వులను కోసి తీసుకొనివెళ్ళి పూజారికిచ్చేవారు. వార్ధక్యంవల్ల దృష్టి సరిగాలేకపోయినా సరే ఆయన పువ్వులను తడిమిచూచి వాటిని సరిగ్గా గుర్తుపట్టేవాడు. ఆ పువ్వులను దైవవిగ్రహానికి అలంకరిస్తూ "ఓహో మల్లెలా! భగవంతుడు మీకు పరిశుద్ధతను ఇస్తాడు" అనో "గులాబీలా! భగవంతుడు మీకు ప్రేమను, శాంతిని కలుగ చేస్తాడు" అని అంటూండేవాడు.

ఒక రోజు ఉష "మరి తామరను అర్పిస్తే?" అని ప్రశ్నిం చింది. "తామరా! అది పువ్వులకు రాణి. అది దివ్యచైతన్యానికి చిహ్నము. దాన్ని భక్తితో అర్పిస్తే మనము దైవానికి దగ్గరవుతాము" అని పూజారి జవాబిచ్చాడు.

అది విన్న ఉషకు ఉత్సాహం కలిగింది. "నీకు తామర ఎక్కడ దొరకుతుంది?" అని ప్రశ్నించింది లలిత. మొదట సంకోచిం చినా తరువాత ఉష "మనము వచ్చే దారిలో కొండకు ఆవలప్రక్క కొలనులో నేనొక తామర మొగ్గను చూచాను. అది రేపటికి విరబూ స్తుంది. రేపు ఉదయమే నేను దానిని తీసుకొని వస్తాను" అని జవాబిచ్చింది.

"ఆ కొలను మా నాయనది" అని గొణిగింది లలిత.

"అయితే ఏమి? అక్కడకు ఎవ్వరూ పోవుట లేదు. ఆ పువ్వు పుష్పించి అక్కడే వాడి రాలిపోతుంది. నేను మొదట చూచాను. అందు వల్ల నాకు ఆ పువ్వును కోసుకునే హక్కు ఉంది" అన్నది ఉష

"అది మా నాయన కొలనులో పుష్పించింది కనుక నేను మాత్రమే కోయవచ్చును" అంది లలిత. అలా ఆ సాయంకాలం ఆ స్నేహితులు చిరునవ్వులు లేకుండా ఇళ్ళకు వెళ్ళిపోయారు.

మర్నాడు తెల్లవారే ముందర ఉష ఆ కొలనును సమీపించింది. తామర చక్కగా విచ్చుకొంది. ఆ తామరను చూచి సంతోషపడిన ఉష వెంటనే లలిత గుర్తువచ్చి మనస్సు చివుక్కుమంది. "అయ్యో! లలిత" అనుకొంది. ఇంతలో ఆమె కంటే ముందర లలిత ఆ కొలనులోకి దిగి తామరను తీసుకొని గుడి వైపు బయలుదేరింది. "సుప్పనాతి" అని స్నేహితురాలిని మనస్సులో నిందించుకుంటూ ఆమెను రహస్యంగా అనుసరించింది ఉష

ఇద్దరూ ఒకరివెనుక ఒకరు గుడికి చేరారు. "ఎవరది? అని అడిగాడు" కన్నులు సరిగా కనబడని పూజారి. "నేను" అంటూ ఆ పువ్వును పూజారికందించింది లలిత. "ఓహో తామరా! చాలా సంతోషం ఉష కదూ? నీ పేరు. మీ ఇద్దరిలో ఎవరెవరో నాకు ఎప్పుడూ గందరగోళమే. నీ పేరుమీద స్వామికి సమర్పిస్తాను" అన్నాడు పూజారి. లలిత సమాధానమివ్వలేదు. ఇదంతా వెనుకనించి వింటున్న ఉష దుఖాఃన్ని ఆపుకోలేకపోతోంది.

"ఉషేనా?" అని రెట్టించాడు పూజారి

"అవును ఆ పుష్పాన్ని ఉష పేరు మీద స్వామికి సమర్పించండి" అంది లలిత.

"కాదు కాదు పంతులుగారు. ఆ పువ్వు తీసుకువచ్చింది లలిత అన్నది" ఉష వెనుకనుంచి.

"కానీ మొదట పువ్వును చూచింది నువ్వు కదా!" అన్నది లలిత.

"ఆ పువ్వును కోసి తీసుకువచ్చింది నీవు కదా" అన్నది ఉష

ఇలా 'నీది' 'నీది' అంటూ వాదించుకుంటున్న ఆ పిల్లలతో "ఏం పర్వాలేదు. మీ ఇద్దరి పేర్లతో నేను పుష్పాన్ని స్వామికి సమర్పిస్తాను. దైవము మీ ఇద్దరిమీద కృపావర్షము కురిపిస్తాడు. మీ ఇద్దరూ ఆ దైవానికి దగ్గరవుతారు. మీరు ఉత్తములవుతారు" అన్నాడు ఆ వృద్ధ పూజారి.

ఇళ్ళకు తిరిగి వెళ్ళేటప్పుడు ఉష, లలిత ఒకరినొకరు చిరు నవ్వులతో చూచుకున్నారు. అప్పుడే వాళ్ళు మానవోత్తములైన భావం వారికి కలిగింది. వారి ఆటపాటలకు మళ్ళీ నిద్ర లేచిన పావురము ముందు నిద్రాభంగమైనందుకు విసుక్కున్నా, మందహాసంతో ఇలా గొణుక్కుంది: "పోనీలే ఈ బంగారు చిట్టితల్లులతో సరిపెట్టు కుందాం!" అని.

శ్రీమనోజ్ దాస్ గారిచే రచింపబడి, నేషనల్ బుక్ ట్రస్ట్‌చే ప్రచురించ బడిన 'లైట్ అండ్ డిలైట్' నుండి వారి అనుమతితో ప్రచురింపబడినది.


సమాచార పత్రం

శ్రీఅరవిందుల 127 వ జన్మదినోత్సవ సందర్భంగా:
అగర్తలాలో (త్రిపుర) గవర్నరు సిద్దేశ్వర ప్రసాద్ పూర్ణయోగసాధన ఆవశ్యకతను గూర్చి, చెన్నై (తమిళనాడు) లో డా॥ కె. వెంకట సుబ్రమణ్యన్, శ్రీ శంకర్‌నారాయణ్‌గార్లు 'శ్రీఅరవిందులు — జీవితము' అను విషయములపైన ప్రసంగించిరి. మహారాష్ట్రలోని **అమరావతి**, ఆంధ్ర ప్రదేశ్‌లోని **హనుమకొండలలో** 'బాలారవిందాలు' ప్రారంభించబడి నవి. శ్రీఅరవిందుల 15-8-47 సందేశ కరపత్రాలను గుజరాతులోని జామ్‌నగర్‌లోని వివిధ సంస్థలు, కార్యాలయములందు పంచిపెట్టినారు. కర్ణాటకలోని ముందార్గిలో శ్రీఅరవిందులు, ఆశ్రమములపై విడియో ప్రదర్శన, పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేసినారు. గయ, రాంచి, డాల్టన్ గంజి, భాగల్‌పూర్, పుర్ణియా, అరేరియా, డాల్మియనగర్, డెహ్రిఆసోన్ లలో కూడా వివిధ కార్యక్రమాలు జరిగినవి.
కర్ణాటకాలోని గుల్బర్గాలో శ్రీఅరవిందుల పవిత్ర అవశేషముల ప్రతిష్ఠా పన ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ఒక సావనీర్ విడుదల చేసిరి. "శ్రీఅరవిందో రిసెర్చి సెంటర్" ను గుల్బర్గా విశ్వవిద్యాలయ వైస్‌చాన్స లర్ ప్రారంభించిరి.
ఆగష్టు 99 లో కర్నూలు, చిత్తూరు, షాన్‌జహాన్‌పూర్, నౌడాలలో శ్రీఅరవింద కేంద్రాలు ప్రారంభించబడినవి.



నీవు ప్రసాదించు శాంతి ఓ ప్రభూ!
నా హృదిలో పదిలపరచుకొను వరదానము

అఖిల భారత పత్రిక, డిసెంబరు 1999



నీవు ప్రసాదించు శాంతి ఓ ప్రభూ!
నా హృదిలో పదిలపరచుకొను వరదానము
క్రూర కాలపు ఘోషనిపాతముల మధ్య....
నీ నిశ్చలత, ఓ ప్రభూ!
నీ హర్ష హస్తాలపై ధరించింది

శ్రీఅరవిందులు

మన మనస్సులోని అలజడి మరియు మన దేహపు కార్యవాహికలు అతి తొందరలో శోషించడం ప్రకృతి మన కొసగే సంకేతం — స్థిరత మన అసలైన పునాది అని, ఉద్రేకము అంతరాత్మ యొక్క వ్యాధి అని; నీరసము పుట్టించే నిష్ఫలమైన కేవలస్థిరత ఇచ్చే సూచన ఏమిటంటే ప్రకృతి యొక్క కర్మలీలకు అదియే స్థిర పునాది కావాలని మననుండి ఆశిస్తున్నది అని, భగవంతుడు సదా లీలామయుడయ్యును ఎట్టి అలజడి కిని లోనుగాడు.

శ్రీఅరవిందులు

*

మన (మానవ స్వభావం) అయోమయ స్థితిపైనా, ఎడ తెగని ఒత్తిడిపైనా ఆధారపడి నడుస్తుంటుంది. దీనికి సరిగ్గా వ్యతిరేకంగా దివ్యప్రకృతి సర్వస్వతంత్రంగా ఏవిధమైన బంధాలకు లోనుకాకుండా ప్రవర్తిస్తూ వుంటుంది. అగాధమైన స్థిరత నుండి నిశ్చల ప్రశాంతి అనే పాతాళంలోకి· గెంతి మనము అట్టి ప్రశాంతిగా మూర్తీభవించాలి. అంతరాత్మపై నిమ్నప్రకృతి యొక్క ఉడుము పట్టును సడలించుకోవాలంటే మనం నిశ్చలాం బుధిలో మునిగి దివ్యత్వాన్ని పొందడమే శరణ్యము.

శ్రీఅరవిందులు

*

దివ్యపాలనా సంకల్పంలోని నిశ్చల ప్రశాంతి, దివ్యత్వం లోని అవిభాజ్య విశ్వతత్త్వము చూచే స్థిరదృష్టి, అన్నిం టిలో లేవు.

శ్రీమాత

అనువాదం: కె. సత్యమూర్తి, సి. కె. రామనాథ చెట్టి

విషయసూచిక

శ్రీఅరవిందుల ప్రవచనములు

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందుల ప్రవచనములు:

శాంతి అంటే...

'శాంతి', 'స్థిరత', 'అచంచలత', 'నిశ్చల నీరవత', అనే పదాలకు అర్థంలో సూక్ష్మమైన తేడాలున్నాయి, కానీ వీనిని ఇదమిత్థంగా నిర్వచించలేము. ఈ పదాలలో ప్రతి పదం ఒక భావచ్ఛాయను ప్రతిపాదిస్తుండడమే దీనికి కారణం.

ఆందోళనారాహిత్య స్థితినే 'అచంచలత' అనవచ్చును.

ఎంత గొప్ప ఆందోళనకైనా సరే చలించని స్థితిని 'స్థిరత' అనవచ్చు. 'అచంచలత' కన్న 'స్థిరత' తక్కువ నిషేధార్థం కలది.

'శాంతి' 'స్థిరత' కన్నా సునిశ్చితమైనది. ఈ స్థితిలో దృఢచిత్తం సమన్వయపరచి విముక్తికి దారితీస్తుంది.

'నిశ్చల నీరవతా స్థితిలో' ఏ ప్రాణిక, మానసిక, బాహిర మైన అనుభూతులు ప్రభావితం చేయలేవు — దానిలో చొరలేవు.

*

'స్థిరత' ఇంకా గంభీర స్థితిని పొంది నిషేధార్థాన్ని పూర్తిగా వీడి తరంగరహిత, నిశ్చలమైన, ఆనంద సముద్రముగా పరివర్తనచెంది 'శాంతి' గా రూపొందును.

*

అభద్రతా భావానికి ఏమాత్రం అవకాశం ఇవ్వని, ఆందోళానా రాహిత్యము అచంచలతగా పర్యవసించే స్థితే 'శాంతి'.

*

శాంతిలో నిశ్చల భావానికి తోడు విముక్తిని, సంపూర్ణ తృప్తిని ప్రతిపాదించే భావాల సమన్వయం ఉంది.

*

నిశ్చలతనుండే శాంతి జాలువారును. శాంతి భావం పెరుగుతున్న కొలదీ నైష్పత్తికంగా నిశ్చల నీరవత్వ భావన కూడా పెరుగుతుంది.

*

శాంతి ముక్తికి ఒక గుర్తు; సంకేతం.

*

శాంతి అనబడేది ఆనందరహితమైనదీ కాదు; తీవ్రస్థితీ కాదు. శాంతిలో కలిగే ఆనందం అనబడే భావం ఎడద లోతుల్లో దాగియున్న అనుభావ అనుభూతి పరంపరల పర్యవసానమేగాని, బహిర్గతమైన, వినోదపరిచే, సముల్లాసపరిచే వస్తువులవల్ల లేదా కారణాల వల్లా కలిగే నవ్వువంటిది కాదు.

*

శాంతివల్ల నిరంతర కార్యమగ్న స్థితిలో కూడా ఆత్మ సదానంద స్థితిలోనే ఉంటుంది; శాంతి దివ్య విశ్రాంతిని ప్రసాదించగలదు. అదే శాంతి అధోముఖంగా ప్రయాణం చేసి, నిష్క్రియాత్మకు త్రోవ తీస్తే దానినే 'తమస్సు' అందురు.

*

మనస్సులో అంతర్మథనం జరిగినప్పుడు దానిలో దాగివున్న అనుభూతుల పరంపర దానికదే యాంత్రికంగా బహిర్గతమవుతుంది. ఒక స్థితిలో యీ రకమైన అంతర్మథనం, శాంతి అనేది తమ, శమముల చీకటి వెలుగుల వంటిది. మన సాధనకు ఉన్నత ప్రకృతి ఆధారమైతే శాంతి నెలకొనును. అట్లే నిమ్న ప్రకృతి ఆధారమైతే అధోచేతన వైపు అంటే తమస్సు వైపుకు దారితీయును.

అనువాదం: డా॥ కె. సత్యమూర్తి

∴

ప్రశాంతత యొక్క ప్రాముఖ్యత

యోగసిద్ధికి ముఖ్యమైన పునాది శాంతియే.

*

సాధనలో మనస్సుకు స్థిర ప్రశాంతను పొందటమే ప్రథమ సోపానము. లేనిచో మనకు అశాశ్వతమైన అనుభవాలే మిగులును. శాంతముగల మనస్సులోనే మనము సత్యచేతనను నిర్మించగలము.

*

ఏకాగ్రత ద్వారా పొందగలిగిన ప్రశాంతతయే అన్నిటికంటే ప్రధానమైన అనుభవము. ఈ ప్రశాంతత, మానసిక, ప్రాణిక, భౌతిక చైతన్యాలలో అభివృద్ధి చెంది నిలకడగా నిలవాలి. ఈ ప్రశాంతతయే సాధనకు సుస్థిరమైన పునాది.

*

అన్ని పరిస్థితులలో యోగస్థితికి మొదట పునాది, వ్యక్తిలోని అన్ని భాగములలో సమత, ప్రశాంతత, నెలకొనడమే. జ్ఞానములతో కూడిన ప్రకాశముగాని, అనేక విధములైన స్ఫూర్తి, బలమును కలిగించు శక్తిగాని, జీవితములో ప్రేమ, సంతోషం కలిగించే ఆనందముగాని, ప్రకృతిసిద్ధంగా, క్రమంగా, కలుగవచ్చు. కాని ప్రశాంతత లేకుండా ఏ యితర పరిస్థితి నిలకడగా వుండదు.

*

సాధకుడు పై మూడు మార్గాలలో దేనిలో నిష్ణాతుడో తద్వారా దైవత్వమునకు దారి కనుగొంటాడు. కాని ప్రశాంతత అందరికీ ఆవశ్యకము. ప్రశాంతత, స్వచ్ఛత లేకుండా దైవత్వమును అందుకోలేము.

*

రెండు ముఖ్యమైన విషయాలు సాధనకు పునాదులు — చైత్య పురుషని మేల్కొలుపుట, ఉన్నతమైన ఆత్మావగాహన. చైత్య పురుషని మేల్కొలుపుటకు శ్రీమాతపై ఏకాగ్రత, ఆత్మార్పణ, ఋజువైన మార్గము. ఆత్మావగాహనకు మానసిక ప్రశాంతి, నిశ్శబ్దము మొదటి నియమము. తరువాత విముక్తి, స్వేచ్ఛ, విశాలత,

అనుభూతిలోకి వస్తాయి. నిశ్శబ్దతతో కూడిన నిశ్చలపు స్మృతిలో, దేనివల్లా లాగబడకుండా జీవించుట, ప్రతిచోట అందరిలో కలిగి, దైవత్వముతో ఐక్యము చెందుట జరుగుతుంది. అంటే మొదట 'సర్వాట్టు' తదుపరి 'సామ్రాట్టు' కావాలి.

*

మనస్సు నిశ్చలంగా వున్నపుడే ప్రశాంతి కలుగును. మరియు ఆ ప్రశాంతిలో అన్ని దివ్యానుభూతులు వచ్చి చేరుతాయి. మనస్సు కానప్పుడు, దానికన్న ఉన్నతమైన ఆత్మ అక్కడ వుంటుంది.

*

జీవాత్మలకు ఆధారభూతంగా వున్నట్టి ఆత్మయే పరమాత్మ. పరిణామంలో క్రమంగా వృద్ధిచెందువాడే చైత్యపురుషుడు (అంతరాత్మ). భగవంతునిలోని జీవాత్మలు పరిణామానికి గురికావు. మనలో చైత్యపురుషుడు మన మనస్సు, ప్రాణము, భౌతికముల వెనుక దాగియున్నాడు. ఈ రెంటికి మధ్యనున్న తెరను తొలగించడమే 'ముక్తి' యనబడును. ఆ తెర తొలగాలంటే సమగ్రమైన విశాలమైన ప్రశాంతతను పొందగలగాలి.

*

ప్రశాంతి పొందినపుడే మనలోని ప్రాణిక భాగమును పరిశుభ్రము చేయుట సులభమగును. ఇంకేమీ చేయకుండా, శుభ్రము చేయుచూ పోతే, నీవు చాలా నెమ్మదిగా పురోగతిని సాధిస్తావు. ప్రాణిక భాగము మళ్ళీ మళ్ళీ మలినమవుతూ వుంటుంది. ఒక వందసార్లు దానిని పరిశుభ్రం చేయవలసి వుంటుంది. ప్రశాంతత దానంతట అదే శుభ్రమైనది. అందుచేత దానిని సాధిస్తే నీ పరమావధిని సాధించినట్లే. అడుసు తొక్కడం, కాళ్ళు కడగటం తెలివైన పని కాదు.

*

ఈ ప్రశాంతి బాహ్యా బంధాలనుండి మనకు విముక్తి కలుగచేస్తుంది. భగవద్గీతలో పరమాత్ముడు చెప్పిన 'ఆత్మరతి' సిద్ధిస్తుంది. ఐతే, ఇతరులతో సంబంధాలు వున్నంతవరకు ఈ ప్రశాంతిని నిలకడగా వుంచడం కష్టమే. మన చైతన్యానికి బాహ్యా

విషయాలతో సదా వ్యవహరించడం బాగా అలవాటు. అందుచేత మళ్ళీ పాత స్థితి వైపు పరుగెత్తే అవకాశముంది. అందుచేత మనము దానిని స్థిరముగా ఉంచుటలో అతి జాగ్రత్తగా వుండాలి. ఒకసారి స్థిరపడితే దాని సంగతి అదే చూసుకుంటుంది. బాహ్య సంబంధాలను ఉపరితలంలో వుంచి, ఉన్నతమైన శాంతస్థితిని చైతన్యానికి కలుగ జేస్తుంది.

*

అవును, ఈ అంతర్మనస్సు సరియైనదే. శాంతము, నిశ్శబ్దములలో నివసించుట మొదటి ఆవశ్యకత. విశాలత్వము గురించి ఎందుకు చెప్పానంటే, శాంతి, నిశ్శబ్దముల యొక్క విశాలత, అంతర, బాహ్యములకు మేలు కలయిక కలిగించు పునాది. దీనినే యోగులు వ్యక్తిగతమైన మరియు విశ్వవ్యాప్తమైన ఆత్మస్వరూప ముగా గుర్తిస్తారు.

*

విశాలత, ప్రశాంతత యోగస్థితికి పునాది. దీనివల్ల అంతర్గతమైన అభివృద్ధి, అనుభవము ప్రాప్తిస్తాయి. విశాలమైన ప్రశాంతతను భౌతిక చైతన్యంలో నెలకొలిపినపుడు, (శరీరములో అన్ని కణ ములలోనూ పూర్తిగా నిండివున్నపుడు) పూర్తి రూపాంతరము నకు ఆధారమవుతుంది. నిజానికి విశాలత, ప్రశాంతత లేనిదే రూపాంతరము సాధ్యము కాదు.

అనువాదం: చావలి రామమూర్తి, సి. కె. రామనాథ చెట్టి

∴

మనలో అంతర్గత శాంతిని నెలకొల్పేదెలా?

ప్రశ్న: శాంతి, స్వచ్ఛత, తేజము మొదలైనవి ఏ స్థాయినించి వెలువడుతాయి?

శ్రీఅరవిందులు: ఉన్నతమైన ఏ స్థాయినించైనా సరే, చైత్యస్థాయి నుండి కూడా, శాంతి, స్వచ్ఛత రావచ్చును.

ప్రశ్న: వివిధములయిన కార్యక్షేత్రాలలో పాల్గొంటూ కూడా ప్రశాంతముగా వుండుట ఎట్లు సాధించగలము.

శ్రీఅరవిందులు: మానసిక, ప్రాణిక, భౌతిక క్రియలకు అతీతముగా, ప్రత్యేకమైన, ప్రశాంతమైన చైతన్యమును కలిగియుండడం ద్వారా యిది సాధ్యము.

*

ఈ శాంతి, సౌలభ్యము, మనలో చాలా లోతుగా ఎందుకు అవగతం అవుతున్నదంటే చైత్యపురుషుడు మానసిక, ప్రాణిక, చైతన్యములకంటే చాలా లోతుగా వున్నందువల్ల. ఏకాగ్రచిత్తముతో ధ్యానము చేయడం వల్ల చైత్యపురుషుని ఉనికిని తెలుసుకోగలుగుతాము. మన ప్రశాంత ఆనంద స్థితిని ఇంకా గాఢంగా చేయాలంటే మన భౌతిక చైతన్యంలోకి చైత్యపురుషుని ఆహ్వానించాలి. దీనిని క్రమబద్ధమైన ఏకాగ్రతతో, ధ్యానంతో, ఉన్నత చైతన్యాన్ని చేరుకోవాలనే ప్రగాఢ ఆకాంక్షతో దీన్ని సుళువుగా సాధించవచ్చును. అంతేకాదు, దీనిని కర్మమార్గం ద్వారా కూడా చేరు మార్గమున్నది. మన పనిని శ్రద్ధాభక్తులతో చేయడం ద్వారా, దైవకార్యమును, స్వంత విషయములనుకుని నిర్వర్తించుట ద్వారా, శ్రీమాతను మన హృదయంలో ప్రాణప్రతిష్ఠ చేయడం ద్వారా సాధించవచ్చు. కాని ఇది పరిపూర్ణముగా నిర్వర్తించుట సులువుగాదు.

*

శాంతి, సంతోషము ఎల్లపుడూ శాశ్వతముగా వుండగలవు. కాని యిది ఎల్లపుడూ మానసికముగా దైవత్వముతో సాన్నిహిత్యం ఏర్పరచుకొనుట, దైవత్వముతో స్థిర నివాసము వలన మాత్రమే సాధ్యము. ఇది సహజముగా బాహ్య, మనః, ప్రాణచైతన్యములకు సులువుగా ప్రాప్తించదు. అంతరాత్మకు అనగా చైత్యపురుషునికి మాత్రమే ప్రాప్తిస్తుంది.

కాబట్టి, ఎవరైతే యోగమును శాంతి, ఆనంద మార్గములో నడిపించుకుంటారో వారు తప్పక ఆత్మలో నివసించడానికి సిద్ధమై వుండాలి. బాహ్యమైన మానసిక, భావోద్వేగ ప్రకృతిలో వుండకూడదు.

*

బాహ్య విషయముల ఆకర్షణలకు లోనుగాకుండా వుండుట, యోగము యొక్క మొదటి సూత్రము. ఈ నిస్సంగత్వములోని శక్తికి స్వేచ్ఛనిచ్చి, శాంతివైపు, నిజమైన చైతన్యములోనికి తీసుకు వెళుతుంది. (అన్ని వస్తువులలో దైవత్వమును చూడగలిగినప్పుడే, ఆ వస్తువులు యోగానికి విలువను చేకూర్చుతాయి. ఆ వస్తువులు, వాటి కోసంగాని, కోరికలను తీర్చుకోవడానికిగాని కాకుండా, వాటిలోని దైవత్వం కోసం, దైవకార్యమునకు మార్గమువలె, స్వయంవ్యక్తం కావాలి.)

*

శాంతి — నాలుగు భాగములు

సమతా శాంతి: సుఖం హాస్యమితి శాంతి చతుష్టయమ్।

అంతర్లీనమైన శాంతికి ఆధారం సమత — అనగా అన్నిరకము లైన బాహ్యవిషయముల యొక్క దాడులను, రూపములను, శాంతమైన, సమానమైన మనస్సుతో స్వీకరించడము.

అవి సంతోషకరమైనవైనా, కాకపోయినా; అదృష్టమైనా, దురదృష్టమైనా; సుఖమైనా, దుఃఖమైనా, గౌరవమైనా, అవమాన మైనా; పొగడ్తయైనా, నిందయైనా; స్నేహమైనా, శత్రుత్వమైనా;

పాపి యడల, పుణ్యాత్ముని యడల లేదా భౌతికంగా శీతోష్ణ స్థితులు. వీటిలో సమత్వమును చూడగలుగుట. సమతను సాధించి నప్పుడే శాంతి నిర్దుష్టంగా వుండును.

*

'సమత', 'శాంతి' అనబడే స్థితులు ఇంకా సులభంగా మనలో స్థాపితం కావాలంటే, వాటిని ఊర్ధ్వచైతన్య స్థాయిల నుండి మన లోకి దిగి వచ్చేలా చేసుకోవాలి. అప్పుడు అవి మనలోకి ప్రవే శించినట్లు, మన వ్యక్తిగత చైతన్యాన్ని ఆక్రమించినట్లు తోచును. ఇక మన వ్యష్టి చైతన్యం సువిశాలమైన సమిష్టి చైతన్యపు నిశ్శబ్ధతలోకి విలీనం కావడమే తరువాయి.

*

పైనుంచి శాంతిని నీ శిరస్సు పైన దిగినట్లు నీవు భావము పొందుట మొదటి అడుగు. నీవు దానిలో అనుభవపూర్వకమైన సంబంధమును కలిగించుకోవాలి. అది నీలో అవరోహణ ద్వారా ప్రవేశించి, నీ మానసిక, ప్రాణిక, భౌతిక చైతన్యములలో నిండి, నిన్ను ఆవరించి, నీవు అందులో జీవించునట్లు చేస్తుంది.

*

సాధనకు అసలైన పునాది ఏదో తెలుసుకున్నాము. జ్ఞానము, బలము, ఆనందము కలుగుటకు యీ ప్రశాంతత, ఆత్మార్పణ తగిన పరిస్థితిని కల్పించును. దానిని పూర్తిగా రానిమ్ము.

మనము పనిలో నిమగ్నమైనప్పుడు, అది మనలో వుండదు. అది అసలైన మనస్సుకే పరిమితమై నిశ్చలముగా, నిశ్శబ్దముగా వుంటుంది. నూతన చైతన్యము పూర్తిగా మనలను ఆవహించినపుడు అది మన పూర్తి స్వభావాన్ని, ప్రకృతిని, ప్రాణిక, భౌతిక చైతన్యాలను పూర్తిగా ఆవరిస్తుంది. అప్పుడు మనలోని ఈ లోపము అదృశ్యమగును.

నీ మనస్సులోని యీ ప్రశాంత స్థితి, శాంతమును, విశాలతను పూర్తిగా పొందాలి. నీలోని ప్రతీ చోట దాని అనుభూతిని పొందాలి. అప్పుడే నీవు చేసే క్రియలకు ప్రశాంతత ఆధారమవుతుంది. నీ చైతన్యం విశాలమైనప్పుడు, నీకు పైనుండి

కూడా ఎక్కువ ఫలితము సిద్ధించును. ఈ శక్తి క్రిందికి వచ్చి నీకు బలమును, ప్రకాశమును, శాంతిని, నీ తత్త్వములో కలిగిస్తుంది.

అనువాదం: చావలి రామమూర్తి, సి. కె. రామనాథ చెట్టి

∴

శాంతి అవరోహణము

స్వర్గ వీధులలో నుంచి దిగివచ్చిన నిశ్శ్వాసం,
సంభృతమైన ఒక సాన్నిధ్యం, మేల్కొన్న మార్గదర్శక జ్యోతి,
ఉపకరణాలను క్రమ్ముకొంది నైశ్చల్యం;
ఒక్కో వేళ చంద్రకాంత శిలాస్మారక నిర్మితి వలె సంబద్ధం,
శిలా ప్రశాంతి, శరీరం పాద పీఠమై
అనంత శాంతి ఆకృతికి సహాయకమై.

('సావిత్రి' నుంచి)

*

ఉన్నత ఆధ్యాత్మిక చేతనలోని శాంతి, శక్తి, తేజస్సు, ఆనందము అన్నీ తెరమరుగుననే ఉన్నవి. వీటి అవరోహణకు ఊర్ధ్వముఖంగా నివృతమై ఉండటం అవసరం. ఒక విస్తృతమైన కేంద్రీకృతకమైన ఆనుకూల్యం, మనస్సు ఉపశమించిన స్థితీ ఈ అవరోహణకు ఉత్తమ సందర్భాలు.

*

నీవు దానిని క్రిందకు లాగవలెనని నా ఉద్దేశ్యము కాదు. ఈ ఊర్ధ్వగతిలో పరిపూర్ణమైన ఆకాంక్షలో అది ప్రవేశించటానికి తోడ్పడాలి.

*

పైనుండి ఒత్తిడిని అనుభవించటం ఆవశ్యకం కాదు. ఎవరైనా తనలో ఏమైనా సంభవించేప్పుడు శక్తి ప్రవహిస్తున్నప్పుడు, శరీరంలో

ఆవిష్కరించుతున్నప్పుడు శక్తి యొక్క ఒత్తిడిని అనుభవానికి రావచ్చు. ఆవిష్కరించుకునేది శాంతియో నీరవతయో ఐనప్పుడు ఒత్తిడి కలుగదు.

*

శాంతి, శక్తి, తేజస్సు, ఆనందము ఈ నాల్గింటి అవరోహణం ప్రకృతిని రూపాంతరీకరిస్తుంది.

*

ఆధ్యాత్మిక చైతన్యం శాంతి, శక్తి, తేజస్సు, ఆనందం అనే నాల్గింటివల్ల రూపుకడుతుంది. అవే ప్రధానమైన అనుభవాలు. ఇవి కాకపోతే మరేవి?

*

శాంతి తాను దిగివచ్చేందుకు మిగతా మూడింటి కోసం ఎదురు చూస్తుందని నేను భావించను. ఎక్కువ సందర్భాలలో అది తనంత తానే మొదట దిగివచ్చి మిగిలిన వాటితో 'కదలిరండి, నేను మీ కోసం చోటు సిద్ధపరచివుంచాను' అని అంటుంది.

*

ఔను, అవరోహణం జరిగినప్పుడు అవి తప్పకుండా దృఢ భూమిక మీదకు దిగి రావాలి. అందుకే శాంతి మొదట దిగి రావటం అవసరం, అంతేకాదు, అది దృఢమైనదిగా ఘనమైనదిగా ఉండాలి. ఏమైనా దాన్ని నిలుపుకోవటం ప్రథమ కర్తవ్యం. తరువాత అధికాధికంగా అది యిక్కడకు దిగివచ్చి స్థిరనివాసం ఏర్పరచుకొంటుంది. ఒకసారి శాంతి, బలమూ నిలచిపోతే ఏది దిగివచ్చినా, ఏ పరిమాణంలోనైనా — అది ఆనందమైనా జ్ఞానమైనా భరించవచ్చు.

*

మనస్సు నీరవంగా నిలచినప్పుడు, తరచుగా పరివ్యాప్తమైన శాంతి సంపూర్ణంగా దిగివస్తుంది. ఆవ్యాప్త శాంత స్థితిలో మనస్సునకు పైన ఉన్న నీరవమైన ఆత్మ సర్వతోవ్యాప్తమై సాక్షాత్కరిస్తుంది.

*

నిశ్చయంగా చెప్పడం కుదరదు కాని సాధారణ రీతిలోనే ఒకింత శాంతి, శక్తి, తేజస్సు అతిమానస స్థాయి నుండి దిగివస్తుంది. ఫలితంగా వాని కదలికల వల్ల మనస్సు ఉపరితలాన దాని, ఉన్నత భూమికలలోకి విశ్వచేతన నివృతమవుతుంది. చాలా మంది విశ్వ చేతన వైపు మొదట విచ్చుకుంటారు. ఉచ్ఛతర శాంతి తేజస్సుల ఆధారం లేకుండా ఇది అసంయోజిత అనుభవాల సమూహాన్ని మాత్రమే తీసుకు రాగలదు.

*

ఈ అవరోహణ తొలుత శిరస్సులోనికి, తరువాత కంఠంలోనికి తరువాత వక్షస్సులోనికి దిగిరావటం మామూలు. ప్రాణికశక్తులు అడ్డురావటం వలన నాభిక్రిందికి ప్రవేశించటానికి పెద్ద అవరోధం ఉంటుంది. ఈ అడ్డుగోడను దాటితే, యింకా క్రిందకు దిగటానికి ఎక్కువ కాలం పట్టదు. ఇంత కాలం పడుతుందనే నియమమేమీ లేదు. కొందరిలో యిది వరదవెల్లువ వలె క్రిందికి సాగుతుంది. మరికొందరిలో ఈ అవరోహణం క్రమబద్ధంగ సువ్యక్తంగా ఎక్కువ అవుతూ వుంటుంది.

*

శాంతిని హృదయంలోకీ, నాభిలోకీ అవరోహింప జేయాలి. అందువల్ల ఒక విధమైన స్థిరత్వం ఏర్పడుతుంది. ఈ స్థిరత అప్రతిహతం కాదు. ఆకాంక్ష వలన, అచంచల సంకల్పం వలన, నీవు దివ్యత్వాన్ని ఆహ్వానించగా నీ ప్రకృతిలోని భాగాలలో దాని అభిముఖం కాని వాటిని తిరస్కరించటం వలన యిది సాధ్యం. వేరే మార్గం లేదు.

*

శాంతి (నీలోకి) అవరోహించటం — సామాన్యంగా ఒక చల్లని స్పర్శ వలె అది స్ఫురిస్తుంది. ఎప్పుడూ అశాంతి అనే జ్వరం ఉండటం వలన మానవుని ప్రాణికస్థితి దీన్ని అత్యంత శీతలంగా భావిస్తుంది.

*

సాంద్ర శీత ఘనమైన శాంతి నీ శరీరంపై ఒత్తిడి తెచ్చి దాన్ని కదలలేకుండా చేస్తున్నదనే వివరణ — మన యోగం ప్రతిపాదించే ఉచ్చతర చైతన్య అవరోహణాన్ని సూచిస్తున్నది. మొదటగా, గాఢమైన, తీవ్రమైన సాంద్రమైన శాంతి అనే ద్రవ్యం సామాన్యంగా దాని శక్తుల అవరోహణ — ఎక్కువమంది అనుభవంలోకి వచ్చే అంశం యిది. మొదట అది ధ్యానవేళల్లో వచ్చి నిలుస్తుంది. లేదా స్తబ్ధత, కదలనేరమి లేకుండా ఈ శాంతి కొంత ఎక్కువ సమయం ఉండి తొలగిపోతుంది. కాని సాధన నియతంగా సాగిపోతే అది తరచుగా వస్తూ ఎక్కువ సమయం నిలుస్తూ చివరకు చిరమైన గాఢమైన శాంతిగా అంతర స్థిరతగా నిలచి పోతుంది. ఈ రాకడ చైతన్యపు సహజ లక్షణమై నూతన చైతన్యానికీ, శాంతికీ పునాదియై బంధవిముక్తి కలిగిస్తుంది.

చైతన్య స్థితిని గూర్చిన నీ భావన కేవలం మానసిక కల్పన. అది పరిహరింపదగింది. చైతన్యస్థితిలో శాంతి ఉంటుంది కాని అది దాని ప్రధాన లక్షణం కాదు. అది ఆత్మ లక్షణం. చైతన్యస్థితి వ్యక్తిలోని దివ్య లక్షణం. దాని ప్రధానశక్తి ప్రతి అంశాన్నీ దివ్యాభిముఖంగా మలచటం అది పవిత్రీకరించే జ్వాలనూ, ఆకాంక్షనూ, భక్తినీ స్పష్టంగా ప్రతీతమయ్యే సత్య తేజస్సునూ, అనుభవాన్నీ, సంకల్పాన్నీ, మొత్తం ప్రకృతిని మెట్లుమెట్లుగా రూపాంతరీకరించగల కర్మనూ తీసుకునివస్తుంది. హృదయంలోనూ, ప్రాణిక భాగాల్లోనూ, జీవిలోనూ సమస్థితీ, శాంతీ, నీరవతలు అవసరమే. ఇవి చైత్యదశను చేర్చేవి. ప్రాణిక భాగంలోని అశాంతి, తీవ్రవాంఛలు, ఉద్వేగమూ — అహంకార ముఖము లేదా ప్రపంచముఖమైనప్పుడు అది ఆత్మను కానరాకుండా జేసే యవనికలో ప్రధాన భాగం. దీన్నించి దూరంగా పోవటానికి చైత్త్య సరస్సులోనికి దూకాలి. అందువల్ల మానసిక కల్పనలకు దూరంగా ఉంటూ కేవలం దైవం యెడల ఆకాంక్షానుభవం, భక్తి, ఆత్మ సమర్పణలతో నిలిచి వుండటం అవసరం.

అనువాదం: ఆచార్య కోవెల ప్రసన్నాచార్య

అది అలాగే ఉంటుంది. ఈ శాంతి అవరోహణం, ఆ శాంతినీ విస్తృతినీ మారకుండా నిలిపి, నీ చైతన్యంతో తాదాత్మ్యం పొందే ద్రవ్యమై, నీలో ఐక్యమయ్యేదాకా కొనసాగాలి.

*

(మేధోభాగాలలో శాంతిని స్పష్టంగా అనుభవించటం) గురించి యిలా అనుకుంటున్నాను. దిగివచ్చే ఈ శాంతి — భౌతికంగా ఘనముగా 'దేహకణాలలో శాంతి' గా అనుభావ్యంగా అవుతున్నదనీ, అయిందనీ భావించాలి. ప్రతీ అంశం 'ద్రవ్యమే' అది శాంతియైనా, చైతన్యమైనా ఆనందమయినా. అయితే ద్రవ్యం యొక్క తత్త్వంలో భిన్న భిన్న స్తరాలు ఉంటవి.

*

వ్యక్తిలో సంపూర్ణంగా శాంతి నెలకొన్న తరువాత ఈ అంశాలు (అధః ప్రాణిక దశలోని ప్రతిక్రియలు) ఏవీ దాన్ని చలింపజేయలేవు. అవి ఉపరితలం మీద బుద్బుదాలవలె కాన రావచ్చును. అప్పుడు ఒక సూచనవలె అటు చూచినా, ఉపేక్ష వహించినా రెండు సందర్భాలలోనూ అవి ఏమాత్రం ప్రభావం చూపలేవు. వికలం చేయలేవు.

ఈ విషయం వివరించటం కష్టం. ఒక విధంగా యిది పర్వతం మీద రాళ్ళు విసరినట్లు. పర్వతం జాగృతమై ఉంటే రాళ్ళు తగిలిన సంగతి కొంచెం తెలియవచ్చు. అయితే ఈ అంశం ఎంతో తేలికదే. ఉపరితలానికే చెందిన, ఏమాత్రం ప్రభావం చూడలేని విషయం. చివరకు ప్రతిక్రియ కూడా అంతర్ధానమవుతుంది.

*

ఒక వేళ శాంతి, నీరవత పరిపూర్ణంగా నెలకొల్పబడితే, ఉపరితలాన ఎన్ని కదలికలు వచ్చినా, చెదరగొట్టటం కానీ, తొలగించడం కానీ, చేయలేవు. అది విశ్వంలోని స్పందనలను భరించ గలుగుతూనే స్వస్థితిలో ఉండగలదు.

*

ఉపరితలాన ఎంత అల్లకల్లోలం ఉన్నా అంతర్వ్యక్తిలో స్థాపిత మైన శాంతిని అనుభవించడం సాధారణమైన అంశమే. తన సమగ్ర వ్యక్తిత్వంలో విశృంఖలమైన సమత్వాన్ని సాధించే ముందు — యోగి సామాన్యంగా ఈ స్థితిలో ఉంటాడు.

*

పరమసత్యం మనస్సునూ ఆత్మనూ తాకినప్పుడు ప్రాథమికమైన ఆత్మానుభవ లక్షణం — విస్తృతమైన తేజోవంతమైన సత్తతోడి ఎరుక కలిగి, పృథు సముద్ర తరంగమైన శాంతి తాకిడిని పొందటమే. ఇంతకన్నా కోరదగిన ప్రారంభిక ఆధారదశ ఏమీ ఉండదు. అది ఒక శిలావేదిక. దాని మీద మిగిలినదంతా నిర్మించాలి. అంటే అది నిశ్చయంగా ఒక సాన్నిధ్యాన్ని కాదు — నిజంగా సాన్నిధ్యమే. దాని లక్షణాన్ని శంకించి, అంగీకరిం పక తిరస్కరించటం, అనుభవాన్ని బలహీన పరచటం గొప్ప అపరాధమవుతుంది.

దీన్ని నిర్వచించే పనిలేదు. దీన్ని ఒక మూర్తరూపంగా మలిచే ప్రయత్నమూ కాకూడదు. ఈ సాన్నిధ్యం దాని స్థితిలో అనంతమైంది. నిశ్చలమైన అంగీకృతి ఉంటే అనివార్యంగా అది తన శక్తిచేత స్వయంగా, తనలోనుంచి ఆంశికంగానైనా ఆవిర్భూ తమవుతుంది.

*

ఈశ్వరుని లేదా ఆత్మలోని శాంతిలో సంపర్కము కలిగినప్పుడు, శ్రీమాత శక్తి లేదా ఉన్నత భూమికల శక్తిలో సంచారము కలిగినప్పుడు — ఉచ్ఛతర స్థితుల ద్వారము నివృతమైనప్పుడు కొన్ని సాధారణములైన అనుభవాలు సాధనలో కలుగుతవి. ఆ అనుభవాలేమిటో అతనికి సహజంగానే తెలియరావు. కాని అతని వర్ణన కచ్చితంగా ఉంటుంది. "ఎంతసుందరంగా శమితమై స్థిరంగా ఉన్నది! వీటిలో ఒక చిన్నతరంగం కూడా లేదన్నట్లు. సాన్నిధ్యాన్ని నా జీవనంలో ప్రవేశించినట్లుగా భావిస్తున్నాను. అయితే అది ధ్యానములో పరమ నిశ్శబ్దము, శమితము అవుతు న్నది" ఈశ్వరుని నీరవ శాంతస్థితి లేదా తన విశిష్టమైన శాంత

నీరవస్థితిలోని దైవము యొక్క మేలైన వర్ణన దీనికన్న వేరే ఉండదు.

*

ఆధ్యాత్మిక శాంతి మానసిక శాంతి కన్నా అనంతమైందీ, వేరైంది. దాని ఫలితాలు వేరే. స్పష్టమైన ఆలోచన, కొంత నిగ్రహము, సమతుల్యము, సాత్త్వక దశ — వీటికి మించినవీ ఫలితాలు. అది సమగ్రంగా వ్యక్తమై వ్యవస్థలో దీర్ఘకాలం నిలచి ఉండాలి. లేదా తాను దానిలో వ్యాపించి వున్నట్లు భావించి శిరస్సు మీద అన్నివైపులా చొచ్చుకుపోతూ, శరీరంలోని ప్రత్యంశంలోనూ చివరకు కణాలలోనూ వ్యాపించగలిగినప్పుడు గొప్ప ఫలితాలు సమకూరుతాయి. ఉపరితలం మీద సంఘర్షణ, అల్లకల్లోలం ఉన్నా — అవి చలితమైన గాఢ పరివ్యాప్త ఘన శాంతస్థితిని అది కలిగివుంటుంది. నేను నా యవ్వనంలో నీవు వర్ణించిన సాత్త్వక వర్గానికి చెందిన వాడినే. కాని పైనుంచి శాంతి దిగివచ్చినంతనే నేను పరిపూర్ణంగా భిన్నవ్యక్తినైనాను. సత్త్వగుణం — నిర్గుణంగా మారిపోయింది. వ్యతిరేక ముఖమైన నిర్గుణం అనుకూల ముఖమైన త్రైగుణ్యాతీతముగా మారిపోయింది.

*

రెండు సాధ్య దశలు ఉన్నాయి. ఒకటి ఆనందమూ, రెండవది సమస్థితి తోడి మహాశమము — దీనిలో సౌఖ్యమూ, దుఃఖమూ ఉండవు. రెండవ స్థితి కలిగితే అనంతరం అనంతమైన చిర దీర్ఘమైన ఆనందం ప్రాప్తమగుట సాధ్యమే.

*

సఫలమైన సాధనకు ఆధారమైన అంశాలు నీవు అనుభవించే శమిత స్థితీ నీరవతలు, వాటివల్ల నీవు పొందే సంతోషమున్నూ. ఒకసారి అది పొందిన తరువాత సాధన సుస్థిరమైన స్థితిలో నెలకొన్నట్లు నిశ్చయించుకోవచ్చు. ఈ శమిత స్థితి నెలకొనిన అనంతరం, నీవనుకొన్నట్లు లోపల దాగివున్నదంతా బయటకు వెలువడటం నిజమే. ఈ శమిత స్థితి తెచ్చే సుఖం బాహిర వస్తువు

లేవైనా సరే అవి తెచ్చే సౌఖ్యంకన్నా చాలా అసాధారణమైంది. ఈ రెంటికీ పోలికే లేదు.

*

మనస్సు యొక్క ఉదాసీన వైఖరి మంచిదే. కానీ ఆ ఉదాసీనత సత్యానికీ దివ్యశక్తి స్పర్శకూ మాత్రమే వర్తించేట్లు శ్రద్ధ వహించు. నీవు అధః ప్రకృతి సలహాలకూ ప్రభావాలకూ మెతకగా ఉంటే నీవు సాధనలో పురోగమించలేవు. నీవు వ్యతిరేక శక్తుల ప్రాబల్యానికి లొంగిపోగలవు. అందువల్ల సత్యమైన యోగమార్గం నుంచి దూరం కాగలవు.

*

ఎప్పుడైతే శాంతి గాఢంగా పరివ్యాప్తమై ఉంటుందో అది సామాన్యంగా వ్యక్తికి అంతర్గతంగా ఉంటుంది. బాహిరమైన విభాగాలు సాధారణంగా ఒక స్తరానికి చెందిన శాంతిని మాత్రమే పొందగలవు. అంతర్వ్యక్తిలోని గాఢశాంతి పెల్లుబికినప్పుడే అవి దాన్ని పొందుతాయి.

*

అవును, నిశ్చయంగా. శాంతి అతర్వ్యక్తిలోనే ఆరంభమవుతుంది. అది ఆధ్యాత్మికమూ, చైత్త్య సంబంధమూ. కాని అది సక్రియమై ఉన్నప్పుడు బహిర్వ్యక్తిని ముంచెత్తుతుంది. అంటే అంతస్సులోని శాంతిప్రవాహంవల్ల సామాన్యమైన అశాంత మనస్సు, ప్రాణికము, భౌతికము పూర్తిగా ముంచెత్తబడుతాయి. లేదా ప్రగతి పొందిన దశలో — స్వతస్సిద్ధంగా, మౌలికంగా అంతర నీరవతను, శాంతిని కలిగి వుండటం వలన భావనలూ, శక్త్తాలూ, ఉద్రేకాలూ, సంవేదనలూ పాక్షికంగా కానీ పూర్ణంగా కానీ పరివర్తితములవుతాయి.

*

నిజమే. శాంతి బాహ్యచైతన్యం లోనికి కూడా నిశ్చితంగా ప్రవేశించి వుండవచ్చు. దాని నిర్దిష్ట కార్యమూ అదే. మన శరీరం లోపరహితంగా శాంతినీ స్థిరతనూ భరించగలదు. ఆ శక్తి యొక్క సంపూర్ణ క్రీడను అనుభవించగలగటం మిక్కిలి కష్టమైన పనే. మొదట దానిలో శాంతి నెలకొల్పబడితే ఏ సమస్యా ఉండదు.

*

ఉదాసీన వైఖరితో కలిసిన తామసిక శాంతి వలన ఎట్టి ప్రయోజనము చేకూరదు. మన లోపలి అలజడిని పూర్తిగా ఉపరితలంపైకి లేదా మన చైతన్యం నుండి బయటకు త్రోసివేయగలిగిన శక్తి ఒక ఘన ప్రశాంతికి మాత్రమే కలదు.

*

నిజంగా అవి ఉచ్ఛతర చైతన్య స్తరాల క్రియా సందోహమైతే — అవే ఆవరించితే అహంతో పలుచబడుతుంది. సాధకుడు విశ్వవ్యాప్తమైన మానసిక, ప్రాణిక, భౌతికసత్తల యొక్క ద్వారానికి ఉచ్ఛతర చైతన్యానికన్నా మించి ప్రతిస్పందన ప్రకటించితే అతడు విముక్తుడు కాలేడు. ఒక్కోసారి అహం కూడా వృద్ధి పొందుతుంది. చైత్యము మేల్కొని ఉంటే ఈ ప్రమాదమూ ఉండదు. తాను అహం స్థానంలో ఆత్మాభివ్యక్తిని సంపాదించుకుంటాడు.

*

నీవు విస్మృతినీ, శమిత స్థితినీ నిలిపి శ్రీమాత మీద ప్రేమను కలిగివుంటే అంతా కుశలమే. అప్పుడు నీ యోగానికి అది రెండింతల పునాది అవుతుంది. తన శాంతిలో స్వేచ్ఛలో శమిత దశలో ఉపరిభూమికల మీద నుండి, ఉన్నత చైతన్యం దిగివస్తుంది. చైత్యపు నివృతి సర్వప్రయత్నాన్నీ, అప్రయత్న సిద్ధమైన కదలికనూ నిజమైన లక్ష్యం వైపుగా త్రిప్పి ఉంచుతుంది.

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

∴

అంతర్ పురుష వియోగము

అంతరాత్మ ఒక పర్యాయము తన వేర్పాటుని పరిపూర్ణముగా నిర్ధారించినచో స్తబ్ధత సాగరమంత లోతైనప్పటికినీ దాని వేర్పాటునుండి తప్పించలేవు. యోగమును సుస్థిరమైన ఆధారముగా చేయాలంటే ఈ వేర్పాటును సమగ్రముగా స్థాపించుటయే సాధకుడు చేయదగిన ప్రథమ కర్తవ్యము. సర్వసాధారణముగా ఎప్పుడు శాంతి అంతరాంతరములలో బాగుగా స్థిరపడునో అప్పుడు ఈ వేర్పాటు స్థిరము, శాశ్వతము కూడ అగును.

*

ఎప్పుడు శాంతి, మానసిక మౌనము ఉండునో, అప్పుడు ప్రాణిక మనస్సు ఆ స్థానమును ఆక్రమించచూచును లేదా యాంత్రికమైన మనస్సు నిస్సారమును, అలవాటును అయిన ఆలోచనలతో ఆ స్థానమును ఆక్రమించుటకు ప్రయత్నించును. ఈ విధముగా త్రోసికొనివచ్చు బాహ్యావిషయములను తిరస్కరించుటలో సాధకుడు కడు జాగూరూకతతో ఉండవలయును. ఇందువలన ధ్యానావస్థలో కనీసము మానసిక, ప్రాణికముల యొక్క శాంతి, నిశ్చలత సంపూర్తిగా ఉండును. స్థిరము, దృఢము అయిన సంకల్పముండినచో దీనిని ఉత్తమముగా ఆచరింపగలవు. ఈ అంగీకారమే హృదయస్థిత పురుషని అంగీకారము. ఎవని మనస్సు శాంతియుతము, మౌనాంకితము అగునో వాడు ప్రకృతి కార్యము నుండి వేరుపడిన నిశ్శబ్దమైన పురుషుడని తెలియగలడు.

నిశ్చలము, దృఢము, ఆత్మస్థితము, నిశ్చలబుద్ధి (ధీరత, స్థిరత) బాహ్యాప్రకృతి నుండి అంతర్ పురుష వేర్పాటు సహాయకారియే కాక అపరిత్యాజ్యము కూడ. జీవి ఆలోచనా భ్రమణమునకు లేదా జీవాధార ఆలోచనల సంక్షోభమునకు బానిస అయినంత వరకు ప్రశాంతముగ నుండుట కాని, ఆత్మ స్థిరత్వముతో నుండుట గాని, జరుగదు. తాను విరక్తి చెందుట, దాని యందుండలేకపోవుట, తన నుండి వేరుపడిన అనుభూతి అత్యావశ్యకము.

అనువాదం: నండూరి వేంకట సత్య రామారావు

శాంతియే సర్వము కాదు

విస్తృతము, మహత్తైన శాంతియుత అనుభూతియే 'ఆత్మ' లేక 'బ్రహ్మ' మని చెప్పబడును. ఆత్మ లేక నిశ్శబ్ద బ్రహ్మమును అనుభవంలోనికి తెచ్చుకొనుటయు, ఆ బ్రహ్మములో నివసించుటయు పలుయోగముల సమగ్రాశయము. మన యోగమున బ్రహ్మ సాయుజ్యము మొదటి దశ మాత్రమే. మన చైతన్యమును దివ్య చైతన్యమంత గొప్పగా వృద్ధిచెందుటను రూపాంతరమనెదరు.

*

శాంతి ఆవశ్యకమగు ఆధారమే కాని అది ఒక్కటే చాలదు. అది స్థిరము, శాశ్వతము అయినచో అంతారాత్మకు విమోచనము కలిగించి, బాహ్యావర్తనమునకు ప్రశాంత నిశ్చలసాక్షియై వుండును. అది సన్యాసి యొక్క విమోచనము వంటిది. కొన్ని అవస్థలలో వ్యక్తి పూర్వ స్వభావమును ప్రాకృతిక స్మృతులలోనికి త్రోసి బాహ్యాస్థితికి కూడ విమోచనము కలిగించును. కాని అది విమోచనమే కాని రూపాంతరము (పరివర్తనము) మాత్రము కానేరదు.

*

ఏకత్వంలో, నిర్వ్యక్తికతతో గూడిన గుణాల క్రీడనుంచి ముక్తమైన ఒక సత్త ఇక్కడ తప్పకుండా వుంది. మనస్సు, శరీరం ద్వారా, మన సర్వసంబంధాల కుంజిక (key) ను, వీటి యదార్థ రహస్యాన్ని కనుగొనడానికి అనాది కాలం నుంచి ప్రయత్నిస్తున్న ప్రకృతిగతమైన సంఘర్షణల నుంచీ, విక్షోభాల నుంచీ, ఈ నిర్వ్యక్తిక సత్త మనను పైకి తీసుకుపోతుంది. మానవజాతి యొక్క అత్యున్నత అనుభవం ఏమంటే, పరతత్త్వం, మన మానసిక, ప్రాణిక సత్త కంటే సదా ఉచ్ఛతరమైన సత్తను చేరే, ఆ సత్తతో తనను తాను నిర్వ్యక్తికం, ఏకత్వపూర్ణం, శాంతం, ఆత్మ సమాహితం (self-gathered), మనః ప్రాణాల కంటె ఉన్నతం చేసుకొనే స్వయం స్థితం (self-existent), కనుకనే సుస్థిర శాంతి,

ఆంతరిక స్వాతంత్ర్యం పొందవచ్చు. కనుక, ఇది జ్ఞానయోగానికి మొదటి లక్ష్యం. ఒక అర్థంలో అయితే, దానికి విశిష్ట, ప్రధాన లక్ష్యం గూడ. కానీ, మనం నొక్కి చెబుతూ వచ్చినట్లు, మొదటి లక్ష్యమైనప్పటికీ, ఇదే సర్వం కాదు. మొదటిదైనా సమగ్ర లక్ష్యం కాదు. సంబంధాల నుంచి విముఖులమై, సంబంధాతీతంలోకి ఎలా చేరాలో, వ్యక్తిత్వాన్ని, బహుత్వాన్ని త్యజించి, నిర్వ్యక్తి కత్వం, నిర్విశేష ఏకత్వం లోకి ఎలా ప్రవేశించాలో, జ్ఞానం కేవలం ఇది మాత్రమే చెపితే, దాన్ని మనం పూర్ణజ్ఞానం అన కాలం. విశ్వసత్త దేన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తున్నదో, దాన్ని, సంబంధాల సమస్త క్రీడయొక్క, బహుత్వానికి సంబంధించిన సమస్త వైవిధ్యం యొక్క, వ్యక్తిత్వాల సంపూర్ణ సంఘర్షణ, పారస్పరిక క్రియ (interaction) యొక్క ఆ కుంజికను, ఆ రహస్యాన్ని మనకు ఇవ్వాల్సి ఉంటుంది. జ్ఞానం, మనకు ఒక భావనను అందిస్తే దాన్ని అనుభవం ద్వారా ఋజువు చేయక పోతే, అప్పుడు కూడా అది అసంపూర్ణమనే చెప్పబడుతుంది. మనం కుంజికను, రహస్యాన్ని పొందాలని తలుస్తున్నాం. దాని వల్ల అది అభివ్యక్తమయ్యే ప్రపంచాన్ని ఆ సత్యం ద్వారా నియంత్రితం చేయగలుగుతాం. ప్రపంచం యొక్క కేంద్రాభిముఖ, కేంద్ర విముఖ ప్రయత్నం (converging and diverging effort) తో దాన్ని ఉద్దేశానికి సంబంధించిన సామరస్య పూర్ణ చారితార్థ్యా నికి చేరగలుగుతాము. ప్రపంచ హృదయం కేవల శక్తినే మాత్రం కాక, చారితార్థ్యాన్ని కూడా అన్వేషిస్తున్నది. పూర్ణమైన, కార్య సమర్థమైన ఆత్మజ్ఞానం, దానికి ఈ శక్తినీ, చారితార్థ్యాన్ని ఇవ్వాల్సి వుంది. శాంతిమాత్రం, ఆత్మచారితర్థ్యానికి, సనాతన మైన ఒక ఆధారం. సీమారహితమైన ఒక నియమ విధానం, సహజమైన ఒక వాతావరణం మాత్రం అవుతుంది.

*

శాంతి ఆవశ్యకముగా మనదే. కాని శూన్యమైన లేక ధ్వంసమైన ప్రకృతి, సంహరించబడి ఛిన్నాభిన్నమైన శక్తులు, కలతచే నిర్వీ

ర్యమైనది శాంతి కానే కాదు. ఏలనన మనము వానిని అగ్ని జ్వాలలాంటి శక్తిచేత అశక్తము కావించితిమి. నిర్మలత్వము మన ఆశయమే. కాని నిర్వాణమైన చల్లబడిన, కఠినమైన తమస్సు కాదు. పరిపూర్ణత్వము, మన నుండి ఆవశ్యకముగా అధికార పూర్వకముగా అడుగ తగినదే కాని ఎప్పుడూ తనంతట తానుగా వ్యాపించు అనంతమును, సంకుచితమైన హద్దులచేత నిరంకుశముగా అడ్డగించుటచేత ఏర్పడు సంపూర్ణత్వమును కాదు. పరాప్రకృతి లోనికి పరివర్తనమగుటయే మన ఆశయము.

అనువాదం: నండూరి వేంకట సత్య రామారావు, జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రి ('యోగ సమన్వయం' నుంచి)

∴

తురీయ జ్ఞానం ఏది: శాంతియా? ప్రహర్షమా?

అజ్ఞానం నుంచి అంతరాత్మ విముక్తికి మొదటి పునాది శాంతి, ప్రశాంతత, వికాసం, శాశ్వతమూ, అనంతమూ అయిన బ్రహ్మ యొక్క అచంచల స్వరూపం. అయితే సాధనా పూర్వకమైన శక్తి ఉన్నత భూమిక నధిష్ఠించిన ఆధ్యాత్మిక విభూతి — ఇవి యీ విముక్త శాంత స్థితికి పరిపూర్ణ అనుభవంలోకి, శాశ్వత సౌందర్య దర్శనంలోకి, నిర్వికల్ప నిరంజన దైవకృపలోకి తీసుకువెళతాయి. ఈ ఆనందం మార్మికమైన దైవవిభూతిలో సహజంగా ఉంది. ఇది విశ్వాత్మక ఆహ్లాద రూపమున విజ్ఞాన మయ చేతనయందు అంతర్నిహితంగా ఉంది. విజ్ఞానమయ పరిణామముతోబాటు పెరుగును.

కాని ప్రహర్షము క్రింది స్థాయిలో క్షణికమైన ఒక భావానుభూతిగా పేర్కొనబడింది. శాంతి అలాకాక తురీయ జ్ఞాన బోధగా భావించబడింది. అదే పరమపురుషుని అతిశ్రేష్ఠానుభూతి.

ఇది ఆధ్యాత్మిక భావపరిధిలో సత్యం కావచ్చును. కాని తొలి పారవశ్య స్పర్శ ఏదైతే ఉన్నదో అది ఆధ్యాత్మిక భావానికి సింహద్వారం అని భావించక తప్పదు. అయితే ఈ అనుభూతినే తురీయ ఆధ్యాత్మిక ఆనందంగా కొన్ని సందర్భాలలో స్వీకరించడం జరుగుతుంది. ఆ సమయంలో ఒక ఉత్కర్షము, ఉల్లాసము, ఉత్తేజన, ఒక హృదయోద్వేగం, ఒక ఆంతరిక స్పర్శానందం స్ఫురణకు వచ్చి ఏదో దివ్యానందం శరీరంలో పయనిస్తున్న అనుభూతి కలగవచ్చు. కాని అదే శాశ్వతానందానికి పునాది కాకూడదు, సరి కదా ఆధ్యాత్మిక దివ్యానంద వేళ ఉన్నత భూమికలకు అధిరోహించే వేళ ఉద్వేగాలకు, ఆవేశకావేశాలకు, ఒడుదుడుకులకు తావు లేదు. ఉండదు. దానికి బదులుగా అనంతమైన ఒక సనాతన ప్రహర్షపు భాగస్వామ్యం స్ఫురణకు వస్తుంది. అది సనాతనమైన పునాది నుంచి ఉద్గమించే భావ ధార; అది శాంతి, ప్రహర్షములొకటిగా కలసిపోయిన శాశ్వత శాంతిధార. అతిమానసం మాత్రమే అన్ని వైరుధ్యాలను సమన్వయం చేసి, అన్ని విభేదాలను అధిగమింపజేసి, విశాల ప్రశాంతిని, మేలైన ప్రమోదాన్ని (delight) కలిగించి చరాచర సృష్టి మధ్య ఏకతను సాధించగలదు. ఇదే ఆత్మసాక్షాత్కారానికి తొలి మెట్టు. ఈ ప్రశాంతత, ప్రహర్షం ఏకరీతిని పొంది, తీవ్రతను సంతరించుకొని శాశ్వతానందంలోకి పర్యవసిస్తాయి. అదే అనంతమైనది. దైవచింతనలో ఏదో ఒక స్థాయిలో ఎంతో కొంత మోతాదులో సర్వదా ఈ ఆధారభూత ఆధ్యాత్మిక జీవానంద ముండును. ప్రాకృతిక చలనాలను, ప్రాణ-శరీరముల సర్వక్రియా ప్రతి క్రియలను గూడా దానిచేత పరివ్యాప్తమగును. ఎవ్వరూ ఈ "ఆనంద నియమావళి" నుంచి తప్పించుకోన లేరు. విజ్ఞానమయ పరివర్తనము రాక పూర్వము సైతము మనిషి ఇటువంటి దివ్య సుందర ప్రమోదానుభూతుల్ని పొందుతుంటాడు.

అనువాదం: పురాణపండ రంగనాథ

∴

దివ్యజ్ఞానమయ శాంతి

సమస్త ఆధ్యాత్మిక జీవనమునందు అంతర జీవనమే ప్రథమ ప్రాధాన్యంగల వస్తువు. ఆధ్యాత్మిక మానవుడు సదా లోపల నివసించును. మఱియు మార్పుచెందని నిరాకరించు అజ్ఞానమయ ప్రపంచమున ఆతడు ఒక అర్థమున దాని నుండి వేరుగా నుండి, అజ్ఞానము యొక్క అంధకార శక్తుల బలాత్ప్రవేశము, ప్రభావముల నుండి తన అంతరజీవనమును రక్షించుకొనవలసియుండును. అతడు ప్రపంచము లోపల ఉన్నపుడు సైతము, దానికి బయట ఉండును, అతడు దానిపై పనిచేయుచో, తన అంతర ఆధ్యాత్మిక సత్త యొక్క దుర్గము నుండి పనిచేయును — అచ్చట అంతర తమ పవిత్ర గర్భాలయమున అతడు పరమసత్తతో ఏకముగా నుండును, లేక అచ్చట అంతరాత్మ పరమాత్మ లొక్కరే కలసి యుందురు. కాగా, విజ్ఞానమయ జీవనము, దేనియందు అంతర బాహ్యజీవనములకు, ఆత్మ ప్రపంచములకు నడుమ నుండు నిరోధము పరిష్కరించబడి, అతిక్రమించబడునో, అట్టి ఒక అంతర జీవనమగును. విజ్ఞానమయ పురుషుడు నిశ్చయముగా ఒక అంతరతమ సత్తను గల్గియుండును. మఱియు ఈ సత్త యందతడు తానొక్కడే భగవంతునితో నుండును. బ్రహ్మముతో ఏకముగా నుండును, అనంతము యొక్క లోతుల లోనికి స్వయం నిమగ్నుడై, దాని ఉచ్ఛతలతోను, నిగూఢమగు దాని ప్రకాశమయ అగాధములతోనూ సంసర్గము (communion) నందుండును; ప్రపంచములోని విషయములు గాని, తన స్వీయ కర్మ గాని, తన చుట్టు నున్నదంతయు గాని — ఏదియు ఈ లోతులను కల్లోలపరచ లేక అతిక్రమించ లేక ఈ శిఖరముల నుండి అతనిని క్రిందికి లాగ సమర్థము గాదు. ఇది ఆధ్యాత్మిక జీవనము యొక్క అతీతతా పార్శ్వము మఱియునది ఆత్మ స్వతంత్రతకు ఆవశ్యకము: ఏలన అట్లు అతీతముగా గూడ నుండనిచో, ప్రకృతియందు ప్రపంచముతో తాదాత్మ్యము ఒక విముక్త తాదాత్మ్యము గాక, ఒక బంధనాత్మక పరిమితియే

యగును. కాని అదే సమయమున తదంతర సంసర్గము, ఏకత యొక్క ఫలితముగా హృదయము భగవంతుని యందు ఏ ప్రేమను, భగవంతుని యందలి ఏ ఆనందమును అభివ్యక్తము చేయునో, ఆ ప్రేమానందములు సమస్త జగత్తును ఆలింగనము చేసికొని తమనుతాము విస్తరింప జేసికొనును. తన లోలోపల లభించు భగవంతుని శాంతి విశ్వము యొక్క విజ్ఞానమయ అనుభవమునందు సమత ధరించు ఒక విశ్వమయ స్థిరత (calm) లోనికి విస్తృతమగును: ఈ స్థిరత నిష్క్రియము మాత్రమే కాక, సక్రియమునై యుండును. అది తనను కలిసికొను దానినంతను శాసించునట్టి ఏకతయందలి స్వేచ్ఛయగును, అది తన లోనికి ప్రవేశించు దానినంతను ప్రశాంత పరచును, అతిమానస పురుషుడు నివసించునట్టి ప్రపంచముతో అతని సంబంధములపై అది తన శాంతి నియమమును విధించును. అతని అంతర ఏకత, అంతర సంసర్గము తన సర్వకర్మములందును తనతో నుండును మఱియు ఇతరులతో తన సంబంధములలోనికి ప్రవేశించును — ఈ ఇతరులు అతనికి ఇతరులుగా నుండరు కింతు ఏకమాత్ర సత్త యందు, తన స్వీయ వైశ్వ సత్తయందు తన యొక్కయే ఆత్మ లుగా నుందురు. ఇదిగో, ఆత్మయందు తన ఈ స్థితి మఱియు స్వేచ్ఛయే, ఆధ్యాత్మిక ఆత్మగా నుండుచునే సర్వజీవనమును తన లోనికి స్వీకరించుటకును, స్వయముగా అజ్ఞానము లోనికి ప్రవేశించకయే అజ్ఞానమయ ప్రపంచమును ఆలింగనము సైతము జేసికొనుటకును అతనికి సామర్థ్యము నిచ్చును.

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('దివ్యజీవనం' నుండి)

∴

శాంతి, అభ్యుదయముల కోసం

యుగాలుగా మానవ హృదయ గహ్వరాల్లో
విషణ్ణ మైన తొడుగేసుకున్న ద్వేషం తిష్ఠవేసుకుంది
అది భగవత్కార్యాన్నే వికృతం చేయకోరుతోంది
ఈ లోకం పోకడపై, ఒక రహస్య వైరం
హఠాత్తుగా దాడిచేసి, త్రికరణాల్నే శాసిస్తోంది
అది అన్ని సృష్టికార్యాలకు మచ్చుతెస్తోంది
అది అంతమైతేనే ఈ నేలపై శాంతి.
కనపడే శత్రువే లేడు. కాని
ఆ కనపడని శత్రువే,
మనల్ని చుట్టుముట్టి
మనవి కాని భావాల్తో మనల్ని అధిగమించి
మన మనస్సుల్లో తప్పుల్ని బలవంతంగా చేయిస్తోంది
మన బ్రతుకులన్నీ సందేహాలవలలో బందీలు
మానవ జీవితాలపై దండెత్తే
విరోధి శక్తి అత్యంత పురాతనమైంది
అది మానవునికి శాశ్వత ఋజుమార్గాన్ని స్ఫురించనీయదు
శాశ్వత జ్యోతిపై శక్తి వంతమైన ముసుగు
శాశ్వత నిర్ణయాల్ని ఎదిరించేశక్తి
అమోఘమైన సందేశాల్ని దారి మళ్ళిస్తోంది
విశ్వ కార్యక్రమాన్నే వక్రీభవిస్తోంది
మానవ హృదయాల్ని చెడ్డవైపు మొగ్గిస్తోంది
జ్ఞాన నేత్రాన్ని మూసేస్తోంది.
అదే, ఇక్కడి మన బాధలకి మూలం.
దానివల్లే నేలపై కష్టాలూ, కడగండ్లూ
దీన్ని అందరూ జయించి తీరాలి
మానవ అంతరంగంలోని ఈ అదృశ్య శత్రువుని
మానవులు జయించాలి. లేదా దురదృష్టమే
ఇది తప్పని అంతర్యుద్ధం.

అనువాదం: ఎమ్. సి. కనకయ్య

శాంతి: సాంప్రదాయ ఆధ్యాత్మికతల లక్ష్యం – భావి సిద్ధికి ఆధారం

కొద్దికాలం క్రితం వరకూ మానవుని ఆధ్యాత్మికతా ఆకాంక్ష మందకొడియైన నిశ్శబ్ద ప్రశాంతత (భౌతిక వస్తువులపై నిరాదర ణతో, ప్రాపంచిక జీవనానికి దూరంగా) పై మాత్రమే కేంద్రీ కృతమై ఉండేది. ఎటువంటి కృషి అవసరము లేకుండా, వేదనా, వత్తిడి, ఘర్షణా ఉండనటువంటి ఈ ఆధ్యాత్మిక పరమార్థంగా భావించబడుతూ ఉండేది. దీనిని దైవకృపా కటాక్షాల పరాకాష్ఠగా తలచేవారు. వేదనాభరితమైన వత్తిడులు, రక్తపుపోటులతో (B.P) నిండిన ఈ వర్తమాన కాలంలో కూడా ఈ పరమశాంతికై మాన వులు ఆశిస్తారు! అర్థిస్తారు! తాపత్రయపడతారు!

ఆధ్యాత్మిక గమ్యమేదైనా ఈ పరిపూర్ణ అచంచల పరమ ప్రశాంతతా పునాదిపైనే సాధన ఆధారపడినది. కానీ మన సాధన (ఒక్క వ్యక్తిగత, స్వీయముక్తియే లక్ష్యము అయితే తప్ప) ఇక్కడితో ఆగిపోరాదు. దైవకృపకు ఇంకొక పార్శ్వముంది. ఎటు వంటి నిరోధకాలనైనా, అతిక్రమించగల పురోగమన పార్శ్వమిది. ఇది మానవాళిని నూతన శిఖరాలకు లేవనెత్తుతుంది. నవ్య ప్రపంచ సింహద్వారాలను తెరుస్తుంది. దీని ప్రభావము సాధన చేసిన కొద్దిమందికే పరిమితము కాక, మిగతా మానవాళి స్థితిని కూడా మెరుగుపరుస్తుంది.

ఇది భవిష్య సిద్ధులకు దారితీస్తుంది. భవిష్యదర్శనములో గాంచిన అవకాశ, సావకాశములను (మానవాళికి ఆ నూతన శక్తి గూర్చిన ఎరుకవున్నా లేకపోయినా) ఊర్ధ్వమైన, సామరస్యతతో నిండిన పరిపూర్ణ జీవితంలోకి లేవనెత్తబడతారు. వ్యక్తిగత రూపాంతరీకరణము సాధించలేక పోయినా, ఒక విధమైన సామూహిక పురోగతి జరుగుట వలన ప్రస్తుత అరాజకత్వము,

సంఘర్షణ సమసిపోయి, దాని స్థానంలో సంఘటిత సామరస్యత కలిగిన నూతన వ్యవస్థ ఏర్పడుతుంది.

ఇదే కాక ఇతర మంచి ఫలితాలు కూడా కలుగుతాయి. మనస్సు జోక్యం చేసుకొని కలిగించిన వైపరీత్యం, అరాజకత్వాలు; దుఃఖం, వేదన, నైతిక దారిద్ర్యం వలన కలిగిన వెగటు, భయాలను పూర్తిగా రూపుమాపుతుంది. ఇవన్నీ తప్పక నశించాలి. ఇదే మానవుణ్ణి పశువుల (సరళత్వం, సహజత్వములలో) ను మించిన అధోగతికి పాలుచేస్తున్నాయి. అందువలననే అహంకార బానిసైన, మనస్సు వలన మనిషికి కలిగే ఘోరవేదన పశువులలో కూడ చూడము.

మనము ఆధ్యాత్మిక వెలుగు, సామరస్యతలలోకి ఎదగాలి. లేదా సరళమైన, స్వచ్ఛమైన, జంతుస్థితికి తిరోగమించాలి.

*

అవును. గడించిన చైతన్యాన్ని వదులుకొని జంతుస్థితికి తిరోగ మించే అవకాశము మనిషికి లేదు.

అందువలన అతడికి ఒకే ఒక మార్గముంది. ఏ స్థితిలో వేదనను సమర్పణ స్థానభ్రంశం చేస్తుందో, తేజోవంతమైన ముగింపు కచ్చితమో అక్కడకి చేరాలి. అదే చైతన్య పరివర్తన. అందువలన అన్ని అధ్యాత్మిక వాదాలు వ్యక్తిత్వాన్ని విసర్జించి, ఊర్ధ్వశక్తిపై ఆధారపడటము అత్యంతావశ్యకమని నొక్కి చెప్పు తాయి. ఇదే ఆరంభం. ఇది లేకుండా శాంతి అసాధ్యము.

అయినా సరే, మనిషి పురోగమించడానికి, జ్ఞానాన్ని గడించడానికి, పరిణామము చెంద వీలైన చైతన్యము అతనికి ప్రసాదించబడినది. చలనమెరుగని శిలాప్రాయమైన శాంతికంటే ఊర్ధ్వస్థితి ఉంది. పురోగమన సంకల్పాన్ని నిలుపుకోటానికి, వేదనారహితముగా ప్రయత్నము కొనసాగించడానికి దీనిపై పూర్తి విశ్వాసముంచాలి. కార్యాచరణమును నిరసించి, నిశ్చల నిశ్శబ్దాన్ని, ప్రశాంతతను (ప్రాపంచిక జీవనము కొనసాగిస్తూన్నంత వరకూ, శాంతి సాధ్యము కాదని, జీవన చిక్కుముడులలో నుంచి బయట

పడలేరని వీరి భావము) ప్రభోదించే ఇతర మార్గాల కంటే ఇది ఎంతో మెరుగైన పద్ధతి.

తరువాతి మెట్టు సమస్యలను ఆ పరమేశ్వరుని పై పూర్తిగా విశ్వాసముంచి ఎదుర్కొనటం. అప్పుడు కార్యాచరణని మానకుండా, ఊర్ధ్వ శాంతిస్థితి నుంచి (శక్తివంతమైన, పురోగామి యైన) అన్ని కార్యములను నెరవేర్చవచ్చు.

అనువాదం: గోదావరి

∴

మౌనం – ప్రశాంతత ఎలా సాధ్యం?

వ్యక్తి వికాసపథంలో ఉన్న వానిని వేధించే కీలక ప్రశ్న ఒకటుంది. అదే 'మౌనం' గా ఎలా వుండగలం? అనేది. తనకు తెలియని అంశం గురించి ఏమీ పట్టించుకోకుండా మౌనంగా ఉండడం ఎంతవరకు సబబు? ఏమీ అడగకుండా నిశ్శబ్దాన్ని వ్రతంగా పూనడం హేతుబద్ధమా? అలాగే అంతర్గతంగా కూడ ఎటువంటి శబ్దం గురించి ఆలోచన చేయకపోవడం సాధ్యమా? అది అజ్ఞానం కాదా? మనసుని పరిమితం చేసేసుకోవడం కాదా? ఏదో ఒకప్పుడు, క్షణమాత్రం వచ్చి, సత్యప్రకాశం మౌన కుహరంపై ప్రసరించే వరకు నిరీక్షించడం బలహీనత కాదా?

అయితే యిక్కడ ఒక ముఖ్యాంశాన్ని గుర్తుంచుకోవాలి. అప్పటి వరకు తెలుసుకున్న దాన్ని గురించి, పరిశీలించినదాన్ని గురించి, చూసినదాన్ని గురించి, అనుభవించినదాన్ని గురించి, అనుభూతికి తెచ్చుకొన్నదాన్ని గురించి కాక, మరేదో, అనుభూతికి అతీతమైన దాని గురించి మౌనం మాట్లాడుతుంది. మౌనం యొక్క లక్ష్యం అదే. ఆ అతీతం గురించిన స్పర్శ కలిగే వరకు మౌనభాష్యం అర్థం తెలియదు. పరమార్థం అనుభూతికి రాదు. భాషకు అందని అతీతం — మౌనం అని అనిపించదు. మౌనస్థితి

యొక్క పరాకాష్ఠ; ఆ అనంత అతీత జాగరణ. అది చాలా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా జరుగుతుంది. ఆ స్థితిలో మనస్సు 'వినయవంతం' అవుతుంది., నిశ్శబ్దం అయిపోతుంది. ఆ దశలో మనసు అర్థం చేసుకొనే ప్రయత్నం ఏదీ చేయదు సరి కదా, న్యాయనిర్ణయం చేసి తీర్పు చెప్పాలనే తొందరపాటుకు గురి కాదు. ఆ స్థితిలోని మౌనం అటువంటిది.

శబ్దాల రణగొణ ధ్వనులు, తలకి ఆవరించి ఉన్న ఆలోచనలు ఎంతో తొందర చేస్తుంటాయి. అంటే అవి అంతర్గతమైన సత్యావిష్కారం జరగకుండా హోరుపెట్టేస్తాయి; నిరోధిస్తాయి.

ఒక సమస్య ఎదురైనప్పుడు మనిషి ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉండాలనుకొంటే, పరిష్కారానికి అనుకూలమైన అన్ని మార్గాల, అవకాశాల వైపు పరుగులు తీయక, సత్సంకల్పంతో మౌనాన్ని పాటించగలిగితే పరిష్కారం చాలా తొందరగా లభిస్తుంది. మౌనంగా ఉండడం వలన మనిషి దాన్ని పొందగలుగుతాడు.

కష్టాలు కలిగినప్పుడు ఈ పద్ధతిని అనుసరించడం మంచిది. ప్రయత్నించండి.

కష్టం వచ్చింది కదా అని గందరగోళం పడవద్దు. బయటపడు ఆలోచనల అన్ని మార్గాల గురించి, అవకాశాల గురించి వూరకనే తలబద్దలు కొట్టుకోవద్దు, చింతించవద్దు, అటువంటి పరుగులు తీయవద్దు. ఇది బాహ్య ప్రపంచంలో పరుగు కాదు. మనిషి తన మనస్సులో అనేక రకాల పరుగులు తీస్తాడు. అది కూడదు. ఎటువంటి వైకల్పికాలకు తావివ్వక మానసికంగా మౌనవ్రతులు కావాలి. స్వభావాన్ని బట్టి ఈ మౌనస్థితిని సాధించాలి. క్రమశిక్షణ, శాంతి, తీవ్రత, తృప్తి — వీటిలో ఏదో ఒక స్థితిని సాధించాలి. లేదా అన్ని స్థితుల్ని సమీకరించుకొని మన లోకంలో మౌనాన్ని సాధించగలిగితే కష్టాన్నుంచి బయటపడే కాంతి మార్గం కనిపిస్తుంది. అంతవరకు సహనం వహించి, నిరీక్షించాలి.

*

"ప్రశాంతంగా ఉండటం అంటే ఏమిటి?" — అని నన్ను అడుగుతుంటారు. అందుకు నా సమాధానం ఇది:

"ప్రశాంతంగా ఉండు" — అనే మాటను ఏదో ఒక సందర్భంలో వర్తించే మార్గదర్శనంగా భావించరాదు. చాలా విషయాలపట్ల మనిషి ప్రశాంతంగా, నిర్లిప్తంగా ఉండే స్థితికి అది సంకేతం. ఇది వ్యక్తిని బట్టి ఆధారపడి ఉంటుంది. అయితే అన్నింటికన్న ముఖ్యమైనదీ, ప్రధమంగా సాధించవలసిందీ 'మానసిక ప్రశాంతత' అని గ్రహించాలి. ఈనాడు చాలామందిలో ఈ మానసిక ప్రశాంతత లోపిస్తున్నది. ఈ రోజుల్లో చాలమంది అనేక రకాల భావావేశాలతో, ఆందోళనలతో, ఉద్వేగ, ఉద్రేకాలతో సతమతమవుతున్నారు. అటువంటి వారు మనసుని నిగ్రహించుకొంటే ప్రశాంతత లభిస్తుంది. అనవసరమైన ఊహాలలో, అపోహాలలో మనసుని కలవరపరచుకొనడాన్ని నిరోధించుకోవాలి.

మరి అయితే "ప్రశాంతంగా ఉండడానికి ఏం చేయాలి?" అని ప్రశ్నిస్తుంటారు. ఇందుకు సమాధానం పైన చెప్పినదే అయినా కొంత వివరణ యిస్తాను:

ప్రశాంతత కావాలని ముందుగా బలమైన సంకల్పం చేసుకోవాలి. అందుకై ఆరాటపడాలి, ప్రయత్నించాలి. అందుకు ఎన్నో మార్గాలు, పద్ధతులు ఉన్నాయి. వాటిని ఎందరో ఆచరించి ఎలా ఫలితాల్ని పొందినారో చెప్పారు, సూచించారు. పద్ధతులు కఠినతరమైనవి, సుదీర్ఘమైనవి, కష్టమైనవి. అందుకే చాలమంది లక్ష్యాన్ని చేరకుండానే మధ్యలోనే నిరాశ చెందుతారు. ఎంత ఎక్కువగా శ్రమ చేస్తారో అంత ఎక్కువ ఆలోచనలు చేస్తారు. వారే చికాకులకు గురవుతారు.

అయితే వ్యక్తిని బట్టి ఈ మార్గం మారుతూ ఉంటుంది. వేరు వేరు మనుష్యులకు వేరు వేరు మార్గాలున్నాయి. కాని అందరు ఉపాసించవలసిన మొదటి మార్గం మాత్రం ఒకటుంది. ప్రశాంతత అవసరాన్ని ప్రతి వారు గుర్తించగలగాలి. జీవన మార్గంలో అలసిపోయినా, అధిక శ్రమకు గురి అయినా ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉన్నత మనోస్థితికి చేరటానికి ఈ ప్రశాంతత

అవసరం అని గుర్తించగలగాలి. మానసిక నిర్లిప్తత యొక్క ఆవశ్యకతని గుర్తించడం ఈ మార్గానుసరణానికి మొదటి మెట్టు. అప్పుడు మనిషి అన్నిరకాల మార్గాల్ని పరిశీలించవచ్చు. ఫలితాన్ని అంచనా వేసుకొని, తనకు ఏ మార్గం అనుకూలమైనదో ఎంపిక చేసికొని నిశ్చయాత్మకంగా అనుసరించవచ్చు.

ఇక మనిషి వేరొక 'ప్రశాంతత' ఉన్నదనే ఆలోచనకు వస్తాడు. అది తనకు చాల అవసరం అని తెలుసుకొంటాడు. అదే 'కోరికల రాహిత్య స్థితి' అని గ్రహించాలి. ఆ స్థితి రాకుండా మౌనం యొక్క అసలు ఫలితాన్ని మనిషి పొందలేడు. అంతవరకు అతడు మౌనం తనకు ఏమీ ఉపకారం చేయలేదని భావిస్తుంటాడు. ఈ మార్గంలో ముందుకు వెళ్ళవలెననే భావనతో డీలాపడి పోతుంటాడు. అంటే మౌన, ప్రశాంత సాధనలో సాధకుడికి అవసరమైన మార్గదర్శనం వాత్సల్యంతో, అర్థవంతంగా లభించని పక్షంలో అతడు యోగభ్రష్టుడైపోతాడు. ఈ దశలోనే పరిస్థితి సున్నితంగా, క్లిష్టంగా మారుతుంది. చైతన్యస్థితి నుంచి జడస్థితిలోకి దిగజార్చడానికి పైశాచిక శక్తులు మౌనస్థితి సమీపం లోనే పొంచి ఉంటాయి. జడత్వం ప్రగతికి, ఆత్మోన్నతికి గొడ్డలి పెట్టు. ఈ జడత్వాన్ని, ఈ నిద్రాస్థితిని మౌనస్థితిగా భావించడం తగదు. తస్మాత్ జాగ్రత్త!

ప్రశాంతత అనేది ఒక నిర్మాణాత్మక స్థితి. ఈ స్థితిలో ప్రయోజనాత్మక శాంతి లభిస్తుంది. ఇది సంఘర్షణకు తావివ్వదు. చైతన్యవంతమైన శాంతి ఎంతో శక్తిగలది. ఇది సర్వవ్యాపిగా ఉండి మనోచాంచల్యాన్ని నియంత్రించి ప్రశాంతినిస్తుంది. అన్ని సంగతులను క్రమపరుస్తుంది. గతిబద్ధం చేస్తుంది.

ఈ స్థితి గురించి నేను మాట్లాడుతున్నాను. ప్రశాంతంగా ఉండు అంటే పోయి నిద్రపో, జడుడవైపో, మందంగా ఉండిపో, ఏ పని చేయకు అని నా అభిప్రాయం ఎంతమాత్రం కాదు.

నిజమైన ఆహ్లాదం, ప్రశాంతత అంటే అది గొప్ప ఓజస్సు గలది. ఎంతో బలం గలది. ఆలోచించండి. లోకంలో సమస్యలు వచ్చినప్పుడు దృఢంగా, శక్తివంతంగా, స్థిరంగా ఉండే

వారందరూ ఎప్పుడూ ప్రశాంతంగానే వుంటారు, కనిపిస్తారు. బలహీనులు మాత్రమే ఆందోళన చెందుతుంటారు. గ్రహించండి.

అనువాదం: పురాణపండ రంగనాథ

∴

శాంతిని ఆహ్వానించు

ప్రశ్న: మన మనస్సులో సుస్థిరమైన ప్రశాంతతను, నిశ్చల నీరవతను ఏర్పరచుకొనేదెలా?

శ్రీమాత: అసలు నీవా స్థితిని వాంఛించాలి!

తరువాత ప్రయత్నము చేయాలి. పట్టువదలకుండా ప్రయత్నిస్తూనే ఉండాలి. ఇది చాలా మంచి పద్ధతి. ఇంకా అనేక పద్ధతులున్నాయి. సుఖాశీనుడవై, ప్రశాంతంగా అనేకములైన ఇతర విషయాల గురించి ఆలోచించకుండా నీలో నువ్వు "ప్రశాంతత, శాంతి, శాంతి" అని జపించటము మొదలుపెట్టు. ప్రశాంతతను, స్థిరతను ఊహించుకో. శాంతిని ఆకాంక్షించు. శాంతిని హృదయపూర్వకంగా పిలువు. ఏదైనా అలజడి నిన్ను తాకితే ఇలా నెమ్మదిగా "శాంతి, శాంతి, శాంతి" అని జపించు. ఇతర ఆలోచనలపైకి దృష్టి మరల్చకు. ఆ ఆలోచనలను వినకు. ఆ విధంగా ఇతరమైనవేవీ పట్టించుకోకు. ఉదాహరణకి నిన్నెవ్వరైన ఇబ్బంది పెడుతున్నారనుకో! నువ్వేం చేస్తావు? వాడిని వదిలించుకుందా మనుకుంటావు. వాడి మాటలు పట్టించుకోవు. అటెటో చూస్తావు. అలాగే ఇక్కడ కూడా చేయాలి. ఇతర ఆలోచనలు వచ్చినపుడు వాటిని పట్టించుకోకూడదు, వినకూడదు. వాటి ఉనికిని కూడా మనము గుర్తించకూడదు. ఒక మూర్ఖుడా అనిపించేలా "శాంతి, శాంతి, శాంతి" అంటూ జపము చెయ్యాలి.

ఇలా మొదట కొన్ని నిమిషాలు చేయి. ఆ తరువాత నీ పనులు చేసుకో. కొంత సమయం తరువాత మరలా ప్రయత్నం చేయి. ప్రతి ఉదయమూ నిద్రలేచినపుడూ, సాయంత్రము నిదురించే ముందు కూడా చేయి. భోజనము చేసే ముందు కూడా చేయి. ఇది ఆహారము సరిగా జీర్ణించి వంటబట్టడానికి ఎంత సహకరి స్తుందో నీవు వూహించలేవు. భోజనము చేసే ముందు కొన్ని నిమిషాలు ప్రశాంతంగా కూర్చొని "శాంతి, శాంతి, శాంతి" అని జపించు. అంతా ప్రశాంతమవుతుంది. శబ్దాలన్నీ దూరమవుతున్న భావన కలుగుతుంది. ఇలా ఈ సాధన కొనసాగించాలి. కొంత కాలము తరువాత ఈ సాధన పనిగట్టుకొని కూర్చొని చేయ నక్కరలేదు. నీవేమి చేస్తున్నా, నీవేమి మాట్లాడుతున్నా అంతా "శాంతి, శాంతి, శాంతి" మయం. కలతలు మనలోకి ప్రవేశించ లేవు. కొంతకాలము తరువాత అంతా పూర్ణశాంతిమయం.

మొదట చిన్నగా, సరళంగా (2 లేదా 3 నిమిషాలు) మొదలు పెట్టాలి. క్లిష్టమైన దానికి ప్రయత్నం చేయాలి. ప్రయత్నం చేయటమంటే ప్రశాంతత కొంత పోగొట్టుకొన్నట్లే. ఎందుకంటే ప్రశాంతంగా ప్రయత్నము చేయడము చాల కష్టము. ఈ విషయాలలో చాలా సరళంగా ఉండాలి. ఆప్తమిత్రుణ్ణి పిలిచి నట్లుగా శాంతిని పిలిచినప్పుడు అది వస్తుంది. ప్రశాంతతను, శాంతిని నీ స్నేహితులుగా చేసుకొని రారమ్మని ఆహ్వానించు.

ప్రశ్న: అమ్మా నన్ను శాంతమూర్తిగా చేయి.

శ్రీమాత: ప్రతీసారీ నీలో అలజడి రేగినప్పుడు నన్ను తలచు కొని, నీ లోపలే "శాంతి, శాంతి, శాంతి నా ప్రియనేస్తమా!" అని జపించు. ఇలా పట్టువదలక చేయి. ఫలితము నీకు సంతోష దాయకమవుతుంది.

అనువాదం: గోదావరి

∴

దివ్యౌషధము

వ్యాధుల విషయమై నేను సూచించే ఏకైక సూత్రం. "పై నుండి శాంతిని పిలవడమే" ఏదో విధంగా (ధ్యానం చేయుట లేదా శ్రీఅరవిందుల పుస్తకాలు చదువుట) మనస్సును శరీరానికి ఆవల ఉంచండి. అప్పుడు కృప పనిజేస్తుంది. కృపయే స్వస్థత చేకూర్చేది. మందులు శరీరానికి విశ్వాసము మాత్రమే కలుగ చేయగలవు, అంతమాత్రమే.

*

ఎటువంటి వ్యాధి నుంచైనా సరే! విముక్తి పొందే నిశ్చయ మార్గము ... ప్రశాంతతో కేంద్రీకరణము (ఏకాగ్రత) చేసి, దైవశక్తిని దాని పని చేయనివ్వటము. అలా దృఢ సంకల్పముతో, మొక్కవోని విశ్వాసముతో, సకాలంలో, తగినంత సమయము చేస్తే; దీని ధాటికి ఏ వ్యాధైనా సరే పలాయనము చిత్తగించ వలసిందే.

*

(ఉదర సంబంధమైన రోగగ్రస్తునితో)

దీనికంతా కారణము అలజడి, ఆందోళన. ఏమిటి సంగతి? జీర్ణకోశములోకి శాంతిని (దివ్యశాంతిని) అవరోహింపజేసుకో! అంతా సరిపోతుంది.

*

అంతర్గతంగా వున్న శాంతిని బట్టి, దానిని నీ శరీరకణాలలో కూరి నింపివేయి. ఆ శాంతితో చేకూరుతుంది ఆరోగ్యము.

*

నీ శరీరములో అధికమైన శాంతిని, నిశ్చలత్వాన్ని స్థిరపరచుకో. అది నీకు రోగాల నెదుర్కొనే శక్తిని ఇస్తుంది.

*

శాంతి, నిశ్చలత్వము ఉత్తమ ఔషధాలు. మన శరీర కణాలలోకి శాంతిని తీసుకు రాగలిగినప్పుడు, మనకు స్వస్థత చేకూరుతుంది.

అనువాదం: గోదావరి



నీ అస్తిత్వములోని అత్యంత లోతుల్లో, నీ హృదయాంతరాళంలో భగవంతుడెప్పుడూ వుంటాడు ప్రజ్వలంగా, ప్రశాంతంగా, ప్రేమతో, విజ్ఞానంతో నిండి. ఆయన అస్తిత్వం అక్కడ ఎందుకుందంటే నీవు అతనితో సమాగమమై నీ చైతన్యాన్ని దివ్య చైతన్యంగా రూపాంతరీకరణం చెందడానికి.

మనమిద్దరమూ కలసి బాహ్యప్రపంచపు కల్లోలాలను నిశ్శబ్ద పరుద్దాం. అప్పుడు సంపూర్ణ ప్రశాంత నిశ్శబ్ద వాతావరణంలో నీలోనున్న నిశ్శీమ గరిమతో ఐక్యత నొందగలవు.

అది జరిగిననాడు నీ యొక్క ఉనికికి కొత్త అర్థం వస్తుంది, నీ జీవితమొక తేజోవంతమైన వినూత్న జీవితం కాగలదు.

శ్రీమాత

అంతరంగపు లోతులలోని శాంతి

మనలోని అంతరంగపు లోతులలో ఒక 'శాంతి' ఉంది. అది మన శరీరంతో సహా వ్యక్తి చైతన్యము అంతటికి ఒక ప్రశాంతతను తీసుకువస్తుంది. అయితే అది మనం సహకరించి చేయూతనిచ్చినపుడే సిద్ధిస్తుంది.

ఆ శాంతిని నీవు ఆశ్రయించినపుడే నీవు ఆశించిన ప్రశాంతత, ఒక అచంచలతను నీవు పొందగలుగుతావు.

*

మన వ్యక్తిత్వపు లోతులలో మన ధ్యానపు నిశ్శబ్దంలో — ఒక ప్రకాశవంతమైన శక్తి మన చైతన్యాన్ని ఆవరించి విస్తృతమైన కాంతిప్రదమైన 'శాంతి' ప్రవహిస్తోంది. అది మనలోని అల్పమైన ప్రతిక్రియల నధిగమించి మనలను దైవంతో కలుపుతుంది వ్యక్తి ఉనికి యొక్క ముఖ్య లక్ష్యమే ఆ సంయోగం.

*

నీవు నీ అంతరంగపు లోతులనుండి శాంతి కొరకు గాఢంగా ఆకాంక్షించినపుడు శాంతి నీవద్దకు వచ్చిచేరుతుంది.

*

నీటి లోతుల్లో ఉన్న నిశ్చలత్వంలాంటి నిశ్చలత్వంలోనూ నిశ్శబ్దంలోనూ మాత్రమే నిజమైన సేవ సంభవించగలదు.

*

ప్రశాంతమైన నిశ్చలత్వంతో ఉన్నపుడు మాత్రమే ఎవ్వరైనా తెలుసుకోగలరు, పనిచేయగలరు. ఉద్రేకంతో కంగారుతో చేసిన పనులు సవ్యంగా ఉండక హింసాత్మకంగా, దారితప్పి, అవివేకంతో నిండివుంటాయి. మన వ్యక్తిత్వం దైవం యొక్క ఉనికికి మొదటి నిదర్శనం మనలోని చెదరని 'శాంతి'

*

శాంతి, నిశ్శబ్దాలలో మాత్రమే పరమాత్మ సాన్నిధ్యాన్ని నిరంతరం అనుభవించగలం.

*

శాంతి మనలో అపారంగా నిండి ఉండాలి; గాఢంగానూ, నిశ్చలంగానూ ఉండాలి. ప్రశాంతత చెదరక స్థిరంగా ఉండాలి. దైవం పైన అచంచలమైన విశ్వాసం నిరంతరం పెరుగుతూ ఉండాలి.

*

అంతరంగపు లోతులనుంచి గాఢమూ, పరిపూర్ణమూ అయిన కృతజ్ఞత నిరంతరం నీలో నెలకొంటే.... అదే నీలో శాంతిని, సౌఖ్యాన్నీ నింపే చక్కటి రాజమార్గం.

*

నీ హృదయంలో శాంతి నెలకొంటే తప్ప నీవు మరెక్కడా శాంతిని కనుగొనలేవు.

అనువాదం: డి. సత్యవాణి.

∴

దృఢ శాంతికి ఒక దృష్టాంతం

మనుమలే కాదు, జంతువులు చివరకు పంచభూతాలు కూడా శాంతి యొక్క ప్రభావానికి తలవంచక తప్పదు. ఒక చిన్న దృష్టాంతం ఇవ్వగలను. ఆ నాటి అర్ధరాత్రి వచ్చిన ఆ పెను తుఫాను మీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. అపుడు విపరీతమైన వర్షం, పెద్ద చప్పుళ్ళతో విస్తృతంగా అంతా చుట్టుముట్టింది. నేను శ్రీఅరవిందుల గదిలోని కిటికీలను మూసివేయడానికని వెళ్ళాను. నేను ఆ గది తలుపు తీసి చూశాను. శ్రీఅరవిందులు నిశ్శబ్దంగా వ్రాతబల్ల వద్ద కూర్చుని నిశ్చింతగా, హాయిగా, ఏమీ జరగనట్లు వ్రాసుకుంటున్నారు! అపుడు ఆ గదిలో ఎంతటి దృఢమైన, చెక్కు చెదరని శాంతి ఉందంటే... అది చూసిన ఎవ్వరూ బయట అంత తుఫాను విజృంభించిందని కలలో కూడా అనుకోరు. అన్ని కిటికీలు తెరిచే ఉన్నాయి. కాని లోపల ఒక్కచుక్క నీరు లేదు.

అనువాదం: డి.సత్యవాణి.

అంతరంగంలో నిశ్చలంగా వుండటం నేర్చుకో

యోగికి అంతరంగిక జీవితం చాల ముఖ్యం. దాని వలన అంతరంగిక నైశ్చల్యం కలుగుతుంది. బాహ్య జీవితపు ఒడిదుడుకులు ఆతని శాంతిని భంగపరచ లేవు. ఈ అంతరంగిక ప్రశాంతత ఎటుల సాధించ వలేనో శ్రీమాత మనకు బోధించెదరు.

— సంపాదకుడు

చాలామంది మనుషులకు ఆంతరంగికంగా జీవించుట అనగా ఏమిటో ఎరుగరు. పై పొరలలోనే జీవిస్తూ బాహ్యాస్పర్శలకు లోనై కలవరపడుతూ వుంటారు. నీవు అంతరంగికంగా కాకుండా నీ శరీరానికి బాహిరంగా జీవిస్తూ వుంటావు. అదే విధంగా జీవించే మరియొక మనిషిని కలుసుకున్నప్పుడు ఘర్షణ మొదల వుతుంది. ఇటువంటి పరిస్థితి ఎందుకని రావాలి? ఒక అడుగు లోపలికి వేసి వెనక్కి తగ్గివుండుట నేర్చుకోలేదు గనుక. నీకు శాంతం కావాలంటే, ప్రాణం చల్లగా వుండాలంటే ఒక్కటే మంత్రం. నీ అంతరంగంలోకి అడుగు వేయాలి. అంతరంగం లోకి ప్రవేశించు. లోలోనికి ప్రవేశించినట్లయితే నిన్నెవరూ ఏమి చేయలేరు. బాహ్యాప్రపంచాన్ని కదిలించే బాహ్యాశక్తులకు స్పందించ కూడదు. ఆ ఒరవడికి లొంగిపోరాదు. నీకు సమయం లేక తొందరగా పనిచేయవలసినా కూడా నువ్వు ఒక అడుగు వెనక్కి వేసి పని చేస్తే ఆ కార్యము సత్వరంగా అవటమే కాకుండా తొందరగా అవుతుంది కూడాను!

నీ మీద ఎవరికైనా కోపం వచ్చినా సరే నీవు ఆతని ఆగ్రహకంపనములలో చిక్కుకోకుండా ఒక అడుగు వెనక్కి వేయాలి. ఇద్దరి చేతులు కలిపినప్పుడే చప్పట్లు మోగుతాయి.

నువ్వు కదలకుండా వున్నట్లయితే అతని కోపం అప్పటికప్పుడే చల్లారిపోతుంది.

అనుక్షణం ప్రశాంతిని పరిరక్షించుకో. ఓరిమిని కోల్పోవడానికి పురిగొల్పే శక్తులను ఎదిరించు. వెనక్కి తగ్గకుండా ఒకసారి కూడా పెదవి విప్పవద్దు, ఏదీ నిర్ణయించవద్దు, ఏ కార్యంలోకి దిగవద్దు. మామూలు ప్రపంచానికి సంబంధించినదంతా అశాశ్వతం కాబట్టి అందులో వ్యథకు గురికావలసిన దానికి తగినదేదీ అందులో లేదు. ఏదైతే శాశ్వతమో, నిత్యమో, అమరమో, అక్షయమో, అనంతమో, దాన్నే మనం సాధించతగిందీ, సొంతం చేసుకోతగిందీనూ. అదే దివ్యజ్యోతి, దివ్యప్రేమ, దివ్యజీవనం. అదే పరమోత్కృష్టమైన శాంతి, పరిపూర్ణమైన ఆనందం మరియు ఈ భూతలం పై సార్వభౌమత్వం. అప్పుడే మన జన్మకు మకుటాయమానమైన సంపూర్ణత్వం స్వయం వ్యక్తం కాగలదు. నీ ఇంద్రియాలకు సాపేక్షమైన ఏ విషయం గోచరమైనా కాస్త నిదానించి, ఆచి తూచి తర్కించడం నేర్చుకోవాలి. అప్పుడే ఏమి సంభవించినా వెనుతిరిగి ఆలోచించ కలుగుతావు, ప్రశాంత మనస్కుడవై దైవశక్తిని ఆవాహన చేసి (సరియైన సమాధాన పరిష్కారాల కోసం) వేచివుండగలవు. అప్పుడు నీవు ఎలా ప్రవర్తించాలో, ఏమి చేయాలో స్పష్టంగా గోచరిస్తుంది. అత్యంత ప్రశాంత స్థితిలో వుంటే తప్ప పరిష్కార మార్గము దొరకదని బాగా జ్ఞాపకం ఉంచుకో. అటువంటి అంతరంగ శాంతి కోసం సాధన చేయి. కనీసం ఒక చిన్న ప్రయత్నంతో ఆరంభించు. అలా అలా సాధన చేస్తూ నీ జీవిత తత్త్వంలో జీర్ణించుకొనే వరకూ నీ ప్రయత్నాలను మానవద్దు.

*

ఈ చరాచర జగత్తు అంత శాంతిలో, నిశ్శబ్ధతలో, ప్రశాంత వాతావరణంలోనే నిర్మింపబడినది. ఏదైనా ఎప్పుడైనా వాస్తవంలో నిర్మింపబడాలంటే అది ప్రశాంత నిశ్శబ్ధ వాతావరణంలోనే సాధ్యం. రాత్రింబవళ్ళూ ఏదో చేయాలనీ, ఏమో సాధించాలనీ నిరంతరం పరుగులిడుతూ ఆందోళన చెందితే తప్ప ఈ ప్రపం

చంలో ఏదీ సాధించలేమని అనుకోవడం శుద్ధ పొరపాటు, శుద్ధ అజ్ఞానానికి సాక్ష్యం.

ఒక్కసారి సుడులు తిరిగే ఈ శక్తులబారి నుండి బయట పడి ప్రశాంత లోకాల్లోకి వెళ్ళగలిగితే అదంతా ఎంతో గొప్ప భ్రమ మాత్రమేనని విశదమవుతుంది. ఈ సమస్త మానవాళి అంతా కూడా ఒక అంధజీవుల మహాసముద్రమా అన్నట్లుగా కనిపిస్తుంది. అందులో ఎవడు ఏమి చేస్తున్నాడో ఎందుకు చేస్తు న్నాడో తెలియని అగమ్యగోచర స్థితి. ఉన్మాదంలో ఒకడి కొకడు ఢీ కొట్టుకుంటూ పడుతూ లేస్తూ సంచరిస్తూంటారు. ఇటువంటి గంద్రగోళ స్థితిని 'జీవితం' అనీ, 'కార్యక్రమం' అనీ పిలుస్తూంటారు! అదంతా ఒక బూటకపు సంక్షోభమే తప్ప సత్కార్యమూ కాదు, సరియైన ధ్యేయంకల బ్రతుకు అంతకంటే కాదు.

నేను ప్రస్తావిస్తున్న నిశ్శబ్ధం బాహ్యమైనది కాదు. — అంతరంగ ప్రశాంతి. ఎవరైతే తాము చేసే కార్యాలతో తాదా త్మ్యత పొందకుండా ఉండగలరో, ఆ కార్యాల గంద్రగోళం సృష్టించే అంధత్వబధిరత్వాలకు గురికాకుండా తమదే అయిన ఒక గతిని కలిగి వుంటారో అటువంటి వారికి మాత్రమే నిజ మైన అంతరంగ ప్రశాంతి వుండగలదు. నీ యొక్క కార్యము నుండి వైదొలగి అనిత్యమైన ఐహిక హితార్థాలకు అతీతంగా వుండే ఆ శాశ్వత కాలాతీత బ్రాహ్మీస్థితిలో ప్రవేశించు. అప్పుడు మాత్రమే నిజమైన 'దివ్య' కర్మ ఏదో తెలుసుకోగలవు.

*

కనీసం రోజుకు రెండుసార్లు కొద్ది నిమిషాలైనా నిశ్శబ్ధ స్థితిలో ఉండడాన్ని నేర్చుకొంటే ఎంతో మేలుకలుగును. కానీ అది సత్యమైన నిశ్శబ్ధమై ఉండాలి. ఊరికే మాట్లాడటం మానివేసి మూగనోము పట్టటంవల్ల ఏ విధమైన ప్రయోజనం ఉండదు. కావలసినదంతా అంతరంగ ప్రశాంతియే.

అనువాదం: సి. కె. రామనాథ చెట్టి

క్రియాశీల మార్గ నిర్దేశం

ప్రశ్న: మధుమయియా శ్రీమాతా, జపమువల్ల ఉపయోగమేమిటి?. ధ్యానంలో కూర్చున్నప్పుడు, కేవలం "నిశ్శబ్ధత" "ప్రశాంతి" లాంటి పదాలను చిలకపలుకుల్లా పునరుక్తి చేసినంత మాత్రాన అంతరంగంలో అవి నెలకొంటాయా?

శ్రీమాత: కేవలం పదాల పునరుక్తితో మనకు ఒరిగే లాభమేమీ వుండదు.

సాంప్రదాయ సిద్ధమైన జపాలను మన పూర్వులు నిర్దేశించడంలో ఉద్దేశ్యమేమిటంటే అట్టి జపాలచేత మన నిమ్న బుద్ధిని మన స్వాధీనంలోకి తెచ్చుకొని ఉన్నత శక్తులు, దేవతల కోసం బంధాన్ని స్థాపించుకోవడం. ఇటువంటి జపాలను గురువు గారి దీక్షతో స్వీకరించాలి. ఎందుకంటే ఒక్క గురువు మాత్రమే, అట్టి జపంలో మంత్రశక్తిని నిక్షిప్తము చేయగలడు. అట్టి జపాలను అకుంఠిత దీక్షతో రోజుకు ఐదు, ఆరు గంటలు యోగసాధన చేయదల్చిన వారికి మాత్రమే ఉపయోగపడుతుంది.

నీవు చెబుతున్న లక్షణాలు గల జపము వల్ల గొప్పగా చెప్పుకోదగ్గ ఫలితమేమీ వుండదు. కాగా అట్టి జపము తామసిక మందబుద్ధిని పుట్టించగలదు. తామసిక ప్రవృత్తిని మానసిక (అంతరంగ) ప్రశాంతిగా పొరబాటు పడకూడదు.

*

మనస్సును నిశ్శబ్దంగా వుంచుకోవడం ఎలాగైనా నేర్చుకోవాల్సిందే. దానికి ఎంతో క్రమశిక్షణ పాటించాల్సి వుంటుంది. ముందుగా ప్రశాంతంగా వుండటం నేర్చుకోవాలి. ఎట్టి శబ్ధతరంగాలు లోనికి ప్రవేశిస్తున్నాయో జాగ్రత్తగా గమనిస్తూండాలి. ఈ విషయంలో శ్రద్ధ చాల అవసరం. నీవు తిన్నగా నీ మనస్సును శాంతింప చేయాలని ప్రయత్నిస్తే అది వృథా ప్రయత్నమే కాగలదు. మన మెదడు తన వృత్తిని ఒక్క క్షణమైనా ఆపదు — అది ఎప్పుడూ గ్రామఫోను రికార్డుమల్లే మ్రోగుతూనే వుంటుంది. పాడిన పాటనే మళ్ళీ మళ్ళీ పాడుతూ వుంటుంది! దాన్ని ఆపడా

నికి మీట నొక్కితే తప్ప అలా నిరంతరంగా తన క్రియను సాగిస్తూనే వుంటుంది. అలా కాకుండా నీ చైతన్యాన్ని సాధారణ స్థాయి నుండి ఉన్నతస్థాయికి తీసుకు పోగలిగితే అచ్చటి ప్రకాశ కిరణాల చేత మనస్సు ప్రశాంతిని పొంది తన కదలికలు ఆగి పోయి నిశ్శబ్ధత నెలకొంటుంది. ఆ ఉన్నత చైతన్యాన్ని ఒక్కసారి చేరుకోగలిగితే అందులో నుండి ఇక ఎప్పుడూ బయటకి రావాల నిపించదు. అప్పుడు బాహ్య మనస్సు సదా ప్రశాంతతను పొంద గలదు.

ఈ సమస్యకు సరియైన పరిష్కారము ఒక్కటే. పైన ఉన్న జ్ఞానజ్యోతికై గాఢంగా ఆకాంక్షించడము మాత్రమే.

*

నీవేదో చదువుతున్నప్పుడు హఠాత్తుగా ఏదో ఒక ఆలోచన నీలో మెదలుతుంది కానీ అదేమిటో అర్థం కాదు. అది నీకు సాధ్యం కానిది, తెలుసుకుందామని ఎంత ప్రయత్నించినా అర్థం కాక నీ తల ఇటుకలాగ బిగుసుకు పోతుంది. ఇంకా ఇంకా ప్రయత్నిస్తే ఇంకా ఎక్కువగా బిగుసుకొనిపోయి తలనొప్పి వస్తుంది. అలాం టప్పుడు నీవు చేయవలసినదంతా ఒక్కటే; పదజాలాని కోసం పెనుగులాడొద్దు, కేవలం ఇలాగ ఉండు (అభినయం: సాగిలపడి, చలనం లేకుండా). ఉపశమించి, ఊరికే విస్తరించు, విస్తరించు, బిగుసుకొని కూర్చోవద్దు. ముఖ్యంగా దాన్ని అర్థం చేసుకోవడా నికి ససేమిరా ప్రయత్నం చేయవద్దు. దాన్ని నీ బుర్రలోకి అలా అలా మెల్లిగా ప్రవేశించనీయి, ప్రశాంతంగా నిలకడగా ఉండు, ఆ తలనొప్పి కాస్తా దానికదే మాయమవుతుంది. ఇక దేని గురించీ యోచించక కొన్నాళ్ళపాటు వేచివుండు, తదుపరి నీ అంతరం గాన్ని తరచి చూడు: "ఓహో ఎంత స్పష్టంగా విశదంగా వుంది, ఇంతవరకూ బొత్తిగా అర్థము కానిది ఇప్పుడు చక్కగా అర్థమ యింది" అని నీవే తెలుసుకోగలుగుతావు. అంత సులభమన్న మాట. ఏదైనా పుస్తకాన్ని చదువుతున్నప్పుడు అది నీకు అవగా హన కాకపోవచ్చు, అందులోని కొన్ని వాక్యాలు నీకు అర్థం కాకపోవచ్చు, ఎందుకు బుర్రకెక్క లేదోనని విస్తుపోవచ్చు,

అలాంటప్పుడు ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు పదే పదే చదివి నిశ్శబ్దతను పాటించు. ఒక పక్షం రోజుల తరువాత అదే గ్రంథభాగాన్ని తిరిగి చదువు — ఆశ్చర్యం! ఈసారి ఎంతో స్పష్టంగా అర్థమవుతుంది. తలలో అంతా వ్యవస్థీకరించబడింది. మనకు ఇంతకు ముందు సులభంగా అర్థంకాని వాటిని అర్థం చేసుకొనే శక్తి మన మెదుడులోని కణాల్లో తయారయ్యింది, క్రమేపీ అన్ని శక్తులూ చేరుతాయి, ప్రతి విషయమూ అర్థమౌతుంది.

అనువాదం: సి.కె. రామనాథ చెట్టి

∴

పరిపూర్ణ మనశ్శాంతి

"నేను జ్ఞానిని కాను, ఎందుకంటే పరమాత్ముడు తన కార్యమునకై నాకు ఆయన ఇచ్చిన జ్ఞానమే తప్ప, 'నాది' అంటూ ఏ జ్ఞానమూ లేదు. మరి నేను దర్శించిన సత్యం హేతుబద్ధమా లేక నా బుద్ధిహీనతయా అని నేనెలా తెలుసుకోగలను? కానీ సత్యమేమిటంటే అది ఈ రెండున్నూ కావు. నేను చూచినది యధార్థ సత్యము (హేతుబద్ధము లేక నా తెలివితక్కువతనము రెండూ కావు)".

శ్రీఅరవిందులు
("ఆలోచనలూ, సూక్తులు")

శ్రీమాత వ్యాఖ్యానము: "నేను జ్ఞానిని కాను....." జ్ఞానమార్గాన్ని అవలంబించే యోగసాధకుడు జ్ఞాని అనబడును. అంటే కేవలము జ్ఞానమార్గం ద్వారానే సిద్ధిని పొందదలచిన వాడు, మేధావి అయినప్పటికీ మేధస్సును అధిగమించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందుకోవడానికి సతతము సాధన చేయువాడు. మరి శ్రీఅరవిందులు

తానొక జ్ఞానిని కాననీ, జ్ఞానాన్వేషణ చేయటం లేదనీ సెలవి చ్చారు. తాను తనను పరమాత్మకు ఆత్మ సమర్పణ చేసుకున్నా ననీ, దైవానుగ్రహం చేత ప్రతిక్షణమూ సృష్టిలో తెలుసుకో వలసిన ప్రతియొక్క విషయమూ తెలుసుకోగలిగి తన సాధనలో ముందంజ వేస్తూ వున్నానని తెలిపారు.

అదొక సమ్మోద స్థితి; పరిపూర్ణ అంతరంగశాంత స్థితి. జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఇక శ్రమపడవలసిన పని లేదు. తెలుసుకున్నవాటిని కంఠస్థం చేయనవసరం లేదు; జ్ఞానంపై అంకుశం పెట్టడానికి మెదడులో వేలాది విషయాలతో, యోచ నతో గలభా పడవలసిన అవసరమంత కంటే లేదు. సాధనలో ఒక సమస్య ఎదురైనపుడు సరియైన సమయంలో సరియైన పరి ష్కారము ఆయాచితంగా తనకు గోచరమౌతూనే వుంటుంది. మనస్సు నిశ్శబ్దం పొందింది, మెదడు నిశ్చలంగా వుంది, ప్రతి ఒక విషయమూ ప్రస్ఫుటంగా, స్పష్టంగా కనిపిస్తూవుంది, సరైన క్షణంలో దైవానుగ్రహంతో తనలో వెలుగు కిరణం తన చైతన్యం లోకి ప్రత్యక్షమై తెలుసుకోవలసినదంతా గ్రాహ్యమౌతుంది. వీటిని జ్ఞానపకముంచుకోవలసిన అవసరమే తనకు లేదు, వచ్చిన జ్ఞానాన్ని దాచుకోవలసిన అవసరం అంతకంటే లేదు. ఏ రోజు ఏ తరుణంలో ఆ జ్ఞానంతో తనకు అవసరమవుతుందో అది తిరిగీ గోచరం కాగలదు. ప్రతి క్షణమూ తన మనస్సు (వ్రాయబడని) ఖాళీ కాగితంగా వుండటంచే దానిపై ఎప్పుడు ఏమి అవసరమో అది దైవకృపచే ఆయాచితంగా వ్రాయబడుతుంది. కావలసినదంతా ఆ స్థితి నిజమవడానికి కావలసిన పరిపూర్ణ అంతరంగ ప్రశాంతిని అవలంబించడము మాత్రమే. దైవకృపచే వచ్చే జ్ఞానాన్ని స్వీకరించడానికి సరియైన స్థితి అదే.

ఏయే విషయాలను తెలుసుకోవాలో అవన్నీ తెలియబడ తాయి, దర్శించతగ్గ దాన్నంతా దర్శిస్తాము. ఈ జ్ఞానమంతా సరా సరి పరమాత్మ పరమపురుషుని నుంచే వస్తాయి కాబట్టి అదే పరమసత్యము, పరమసత్త, అంతే కానీ హేతువుకు అజ్ఞానానికి ఇందులో తావు లేదు. ఏది పరమసత్యమో అదే సత్యము అంతే.

దానిని హేతుబద్ధం చేయడానికి గాని మన అజ్ఞాన స్థితికిలోను చేయడానికి కానీ మనము అత్యంత పాతాళ స్థితికి దిగజారవలసిందే.

నిశ్శబ్ధత, అత్యంత వినయము, అనహంకారము, సర్వదా పైనుంచి వచ్చే సత్యతరంగాలను స్వీకరించే స్థితిని అలవరచుకోవాలి. పైమెరుగులకు ఆకర్షింపబడరాదు. మనకు అన్నీ తెలుసుననే అహంకారం వీడి వినయ విధేయతలతో శ్రద్ధాభక్తులతో దైవోపకరణమైన నాడు మనకు తెలియవలసినదంతా దానికదే మనలో ప్రవేశించి జ్ఞానిని చేస్తుంది.

మొట్టమొదటగా కావలసింది స్వయం విస్మరిత స్థితి, పూర్తి అనహంకార స్థితి, సంపూర్ణ సమర్పణ చేసుకోగల శక్తి.

అట్టి స్థితిలో మన దేహము పరమ పురుషునితో ఇలా చెబుతుంది: "నీవు నన్ను ఏలాగ తయారుకమ్మంటే అలాగే అవుతాను. నీవు నన్ను ఏమి తెలుసుకోమని ఆజ్ఞాపిస్తావో దానినే తెలుసుకుంటాను, నీవే కార్యము విధిస్తావో దాన్నే చేస్తాను — అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ, కరిష్యేవచనం తేవ...".

*

భగవంతుడు మనల్ని ఏ కార్యానికై సృష్టించాడో తెలుసుకొని అట్టి జన్మ ఆయన యొక్క దివ్యకర్మకు ఉపకరణము అయిన నాడే మన జీవితంలో సుఖం, శాంతి, సంతోషం, ఆనందం అన్నీ వెల్లివిరుస్తాయి. మానవ జీవితంలోని సకల కష్టాలకు, దుఃఖాలకు, అశాంతికి ఏకైక కారణమేమంటే భగవంతుని కంటే మనకే బాగా తెలుసునని, దైవం మనం కోరిందల్లా ఇస్తూ వుండాలని అనుకోవడమే. చాలామంది మానవులు ఇతరులు తమ అభిప్రాయాలకు అనుగుణంగా వుండాలనుకోవడం చేతనే అసంతోషానికి, బాధలకు గురి అవుతున్నారు.

అనువాదం: సి.కె.రామనాథ చెట్టి

∴

దైవాన్ని మసకపరచేదేది?

(శ్రీమాత ప్రార్థన, ధ్యానము — డిసెంబరు 5, 1992)

శాంతి, నిశ్శబ్దాలలో శాశ్వతత్వం ప్రత్యక్షమౌతుంది;
ఏ గొడవకూ నువ్వు చలించకు, శాశ్వతత్వం రాగలదు;
సర్వసమానత్వం ఖచ్చితంగా పాటించు, శాశ్వతత్వం వచ్చి తీరుతుంది.
ఔను, నిన్ను పొందడం కోసం మేం తీవ్రంగా శ్రమించపన్లేదు,
తీవ్ర శ్రమ నీ ముందు ఓ ముసుగు
నిన్ను దర్శిద్దామని మేం కోరుకోపన్లేదు
ఆ కోరికే మానసిక కలవరపాటు
అదే నీ ఉనికిని అస్పష్టం చేస్తుంది
నువ్వే
సంపూర్ణ శాంతి, ప్రసన్నత్వం, సమానత్వమూ.
నువ్వే అన్నీ .... అన్నీ నువ్వే.
ఈ నిర్దుష్ట ప్రశాంత వాతావరణంలోని
అతి చిన్న కంపనం, నీ ఆవిర్భావానికి అడ్డంకి
నెమ్మదితనం నువ్వే
జిజ్ఞాసా నువ్వే
ప్రశాంతత్వం నువ్వే
నిస్సందేహంగా
అక్కడ నువ్వే
అంతా ఒక
పవిత్ర శాంతి, నిశ్శబ్దాలే
ధ్యానాలన్నింటికన్నా అవి మెరుగే.

అనువాదం: ఎం.సి. కనకయ్య.

∴

భూతలంపై శాంతి కోసం శ్రీమాత ప్రార్థన


("కగమారు" నౌకపై — మార్చి 10, 1914)

రాత్రి నిశ్శబ్దంలో నీ శాంతి జీవుల్ని పరిపాలించింది,
నా గుండెలని మౌనాన్ని ఏలేదీ నీ శాంతే
నీ నిశ్శబ్దం, నా మౌనం ఏకమైతే
ఇక ఏదీ ఆపలేని నీ బలమైన ప్రశాంతే
అప్పుడు నే తలుచుకుంటా
మా మార్గాన్ని రక్షించే, దాటించే ఆ నావికుల్ని
అప్పుడు కృతజ్ఞతతో
వాళ్ళ మనస్సుల్లో
నీ శాంతి ఉబికి, నిండాలనే — నా వాంఛ
నే తలచుకుంటా
నిత్య జాగరూకులూ, దృఢమనస్కులూ
వాళ్ళ కష్టాలకీ, బాధలకీ ఓదార్పు
వాళ్లు మేల్కొన్నప్పుడే
నీ చిరుశాంతి వాళ్ళ గుండెల్లో నిండాలని
వాళ్ళ అజ్ఞానం పారద్రోలే ఆ జ్యోతి
వాళ్ళలో జాగృతం కావాలనే — నా వాంఛ
దృశ్యమూ, అదృశ్యమూ అయిన ఈ
విశాల సాగర వాసులకీ
నీ శాంతి వ్యాపించాలనే — నా వాంఛ
నే తలుచుకుంటా
మనకు అంతులేని ప్రేమను అందించి
మనకంటే సుదూరంగా వెనుకపడిన వాళ్ళను గురించి
వాళ్ళకోసం నీ నిత్య శాంతిని
అఖండంగా వాళ్ళుండాలనే — నా వాంఛ
నే తలుచుకుంటా
పిల్లల్లా వర్తిస్తూ బాధపడే వాళ్ళనీ
పనికిరాని వాంఛలకోసం

అజ్ఞానం, అహంకారాల్తో
ఎంతో అలమటించేవాళ్ళని
నీ శాంతిజ్యోతి వెలుతురు సంపూర్ణంగా
వాళ్ళపై ప్రసరించాలనే — నా వాంఛ
నే తలుచుకుంటా
మనం ఎరిగిన, ఎరగని
రూపం పొందుతున్న రూపం మారిన
రూపం పొందని — ప్రాణుల్ని
నే ఊహించుకోలేని వాటికోసం
నాకు జ్ఞప్తిలో ఉన్నవీ
నేను మరచిపోయినవీ
వీటన్నింటి కోసం
తీవ్ర ధ్యానంతో
మూగ ఆరాధనతో
నీ శాంతిని
నే వేడుకొంటా.

అనువాదం: ఎం. సి. కనకయ్య.

∴



శ్రీఅరవిందపురంలో శ్రీఅరవిందో సెంటర్ ప్రారంభోత్సవ సందర్భంగా జ్యోతిని వెలిగిస్తున్న శ్రీమతి ఎమ్. వసంతాదేవి. శ్రీ బి. వెంకట్రామయ్యా, సిహెచ్. నాగేశ్వరరావు, శ్రీ వై.వి రావు, శ్రీ. జె. విశ్వనాధన్‌గార్లను కూడా ఈ చిత్రములో చూడవచ్చును.

వార్తలు

శ్రీఅరవిందపురం: **15-10-99** న క్రిష్ణా జిల్లాలోని శ్రీఅరవింద పురంలో ''శ్రీఅరవిందో సొసైటీ సెంటరును' శ్రీ వెంకట్రామయ్యగారు ప్రారంభించినారు. శ్రీ చెలసాని నాగేశ్వర రావు, శ్రీ ఎమ్. జనార్ధన రావు, శ్రీ కె. వి. రావు, శ్రీ వై. వి రావు గార్లు ఈ సందర్భముగా ప్రసంగించినారు.

పూర్ణ విద్యావిధానము పై రెండవ రాష్ట్ర వర్క్‌షాపు **1999** అక్టోబర్ **15**, **16** తారీఖులలో శ్రీమాతారవింద దివ్యజీవన కేంద్రం, శ్రీఅరవిందపురంలో నిర్వహింపబడినది. **102** మంది ఉపాధ్యాయులు ఈ వర్క్‌షాపులో పాల్గొనిరి.